
శ్రీబ్రహ్మముగారి చరిత్ర ప్రప్రథమ రచన 1895

## కాలజ్ఞాన సహిత

# శ్రీశ్రీశ్రీ వీరబ్రహ్మేంద్రస్వాములవారి



# సంపూర్ణ చరిత్ర


గ్రంథకర్త

## జివంగుల నాగభూషణదాసు



పబ్లిషర్సు

జివంగుల నాగభూషణదాసు సన్స్

శ్రీ వీరబ్రహ్మేంద్రాశ్రమము

సత్తెనపల్లి 522403 గుంటూరు జిల్లా



కాపీరైటు రిజిష్టర్డు


వెల: 30.00


సర్వహక్కులు ప్రకాశకులవి
కాపీరైటు రిజిష్టర్డు

మూల్యం 30.00 రు
ముద్రణ:
కస్తూరి ఆఫ్‌సెట్ ప్రెస్,
విజయవాడ-12

ప్రతులకు
జవంగుల నాగభూషణదాసు సన్స్
శ్రీ వీరబ్రహ్మేంద్రాశ్రమము
సత్తెనపల్లి-522403. ఆంధ్రప్రదేశ్.

ఓం

# శ్రీ మహాగణాధిపతయేనమః



# విఘ్నేశ్వరస్తుతిః

సుముఖశ్చైక దంతశ్చకపిలో గజకర్ణికః
లంబోదరశ్చవికటః విఘ్నరాజో వినాయకః
ధూమకేతుః గణాధ్యక్షః ఫాలచంద్రో గజాననః
వక్రతుండః శూర్పకర్ణః హేరంబః స్కందపూర్వజః

ఓమ్

—॥ శ్రీమద్విరాడ్విశ్వకర్మ స్తోత్ర శ్లోకములు ॥—

విశ్వకర్మ దిశాంపతిస్సర పశూన్ పాతు సోఽస్మాన్
పాతు తస్మైనమః (యజుర్వేద కాం. 5 ప్ర ౭)

విశ్వకర్మ పరబ్రహ్మ విశ్వగోచర సాధనా
విశ్వసృజన సంహారా, సర్వకర్తా పరాత్పరా

లోకా లోకాత్మ నిర్లోకా, లోకాంతర నిజప్రభు
సర్వనిర్మిత పురాణా, విశ్వకర్మ జగద్గురు

తద్వంశ సంభవా తపసి, తత్త్వ వేద మహోన్నతి
నిరహంకార నిర్మోహి, నిర్మలాత్మ నిజాశ్రయః
సర్వకర్మ జగత్కర్తా, విశ్వకర్మ జగద్గురు

శిఖా యజ్ఞోపవీతాలయం, భూతి రుద్రాక్షధారిణం
త్వష్ట శిల్ప సమర్థారి, విశ్వకర్మ కుశానవన్.

అరిషడ్వర్గ విధ్వంసి, జితేంద్రియ సుహృజ్జనా
పూజ్యమాన నిరోగతా. విశ్వకర్మ కులోనవ శ్రీ.

గురుర్బ్రహ్మ, గురో వక్త్ర గురు ధాత్ర బృహస్పతి
గురుకుక్షి గురుత్వష్ట్రా, ఇమే పంచ వర్ణకః.

విశ్వ విశ్వయోన్నతి, విశాల వివేక రూప విజ్ఞానసృష్టిమయ
కారణ విశ్వకర్మ, అనాదిమూర్తి పరదేవతా పంచవక్త్ర
పాలనం। హితాసృజనకర్తా నమో నమస్తే

నిర్విషన్నయ నిరామయాయ, నియత, నిర్గుణ నానాహిత
సర్వేశాయ సదాశివాయ నిగమ సంఖ్యాత్మమానాయతే
పూర్వముద్ధ మహాంత రాదివగురుం, అస్మత్కృత దాయక
సర్వం సిద్ధ పర ప్రయత్న మభయం, సోయం నమోవర్తకతం

(సనారి విశ్వేశ్వర సంవాదము)


శ్రీ శ్రీ మద్విరాడ్విశ్వకర్మనే నమః

శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాముల వారి

# స్తోత్రపంచరత్నములు

శ్రీకరు జన్మయు వాద్యుడు
నాకాధిప వినుత వీరనారాయణుఁడు జ
స్తోక విలాసుండని మది
ప్రాకటముగ నెంతు మొదలు పరమజ్ఞప్తిన్.

కాయము గన్నవాడు పరకాయ నికాయము గన్నతేడు, తా
కాయము దాల్చినాడు, మన కాయమునందు వసించువాడు మీ
కాయము చేరనీడు, తనకాయము ఖాయము చేయువాని వా
లాయము నమ్మి వీరగురు రాయని సంస్మరణంబు జేసెదన్.

జేజే కోటులు మ్రొక్కు వేల్పు, భవదుశ్చింతా వికల్పున్ మనః
పూజాసిద్ధగురున్ పురశ్చరిత ఫలంబు నిచ్చు దేవున్ మనో
రాజీవాసన ఖండ రాసి నరిషడ్వర్గా పహారాశి, నా
జేజేనాయన వీరబ్రహ్మగురు సుశ్రీపాదముల్ గొల్చెదన్.

పరముడు, భక్తవత్సలుడు, పాపవిదూరుడు, శిష్టపాలితుం
డురుతర యోగ సంయుతుడు, యోగప్రణీత, మృదానిలా
ఘ్నరితుడు, దిక్కు కారుడు, సుసాధ్యుడు విశ్వ తపః ప్రభావభా
వరహితు వీరబ్రహ్మగురు పద్మని సంస్మరణంబు చేసెదన్

సకల చరాచరాత్మకుడు, సర్వవిదూరుడు, సాధుశీలుడున్
సకల వికల్ప, దార్త జనసంఘుపు బ్రోపు భవంబు బాప్పు, పా
పకముల మాపు మానులకు దాపు మహాత్మ్యము రేపునాపు
ధరమున వీరబ్రహ్మగురు దివ్యక సంస్మరణంబు చేసెదన్.

—గ్రంథకర్త—

జివెంగుల నాగభూషణదాసు.


ఓం హ్రాం క్లీం శ్రీం శివాయ
బ్రహ్మణేనమః ద్వాదశాక్షరి




శ్రీశ్రీశ్రీ రాజేశ్వరి మహాదేవి



కీ॥శే॥ శ్రీశ్రీనివాసస్వాముల వారు
బ్రహ్మంగారి పీఠాధిపతి-1955



శ్రీ శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వాములవారు.
ధర్మపత్ని చంద్రావతమ్మగారు.



శ్రీ వీరభోగవసంత వేంకటేశ్వర స్వాములవారు

బ్రహ్మంగారి వంశజులు, పీఠాధిపతి.



శ్రీ శాస్త్రులుగారితో రచయిత కుటుంబము

ఓమ్

శ్రీమద్విరాడ్విశ్వకర్మణే నమః
శ్రీగురు అల్లాటపల్లె వీరభద్రస్వామినే నమః
శ్రీ మద్వేంకటేశ్వర సద్గురు స్వామినే నమః
శ్రీ మద్గురు శ్రీనివాస సద్గురు స్వామినే నమః

సాంఖ్య, తారక, అమనస్క కాలజ్ఞానంబుల బోధించు
" కాలజ్ఞానసహిత "

# శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి
# సంపూర్ణ చరిత్ర

ఇయ్యది
శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి మఠాధ్యక్షులును
కీ॥శే॥ శ్రీమద్వెంకటేశ్వర స్వాముల వారి పుత్ర రత్నంబును
సచ్చిదానంద స్వరూపులగు
కీ॥శే॥ శ్రీ శ్రీ శ్రీ శ్రీనివాస స్వాముల వారు
పుత్రరత్నంబును సచ్చిదానంద స్వరూపులగు
శ్రీశ్రీశ్రీ శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వర స్వాముల వారు
పులహరి పిరోజి గురుసార్వభౌముల వారి
వంశ శిష్య తిలకంబగు
శ్రీ గురు జింకా పిచ్చమాంబ
శ్రీమద్విరియాల వెంకట్రంగార్యుల
ప్రియ శిష్యుండగు చౌజెర్ల గోత్రోద్భవ కొండయ్య రత్నమాంబా
ప్రియసుతుడును, గంధర్వకుల జుండును నగు

## జివంగుల నాగభూషణ దాసుచే

రచింప బడి ప్రచురింపబడియె.


కాపీరైట్ రిజిష్టర్డు

# గ్రంథకర్త పరిచయము

## "కాలజ్ఞాన సహిత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారి సంపూర్ణ చరిత్ర"

అను ఈ పవిత్ర గ్రంథమును శ్రీ జవంగుల నాగభూషణదాసు గారు వ్యయప్రయాసల కోర్చి రచన చేసి 1952వ సం|| [illegible]ము వెలువరించినారు నాటినుండి నేటి వరకు, శ్రీ వారి చరిత్ర ప్రతిసంవత్సరము నిరాటంకముగా పునర్ముద్రితమౌతూనే వుంది దీనికి కారణం ఈ గ్రంథరచనయందు శ్రీ నాగభూషణ దాసు గారి ప్రత్యేక శైలి, పౌరాణిక విషయాలు రచన చేయడంలో వారికున్న సునిశిత దృష్టి, విశేషించి చారిత్రక వాస్తవాల సమగ్ర పరిశీలనతో పాఠక జనరంజకంగా ఈ గ్రంథము మలచబడి, ప్రచురింపబడుటయే అని నిస్సందేహంగా చెప్పవచ్చు. శ్రీ నాగభూషణ దాసు గారు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి చరిత్ర రచనకుద్యమించుటకుగల కొన్ని ముఖ్యాంశాలతో బాటు శ్రీ దాసుగారి జీవిత విశేషాలను కూడా పాఠక మహాశయులకు తెలియజేయుట సముచితమని, అది ఈ గ్రంథ ప్రకాశకులుగా మా బాధ్యత అని భావించి, వాటిని ఈ క్రింద పొందు పరచుచున్నాము.

శ్రీ జవంగుల నాగభూషణదాసు గారు తన చిన్ననాటినుండి భూత, భవిష్యత్, వర్తమాన కాల విశేషాలను మరియు దైవ రహస్యాలను తెలుసుకొనవలెననే కుతూహలము గలవారు. మరియు ఒకపని సాధింప తలపెట్టిన, అది సాధించు వరకు విశ్రమించని స్థిరసంకల్పులు. గుంటూరు జిల్లా, సత్తెనపల్లి గ్రామము (ఆంధ్రప్రదేశ్) వారి జన్మస్థలము. శ్రీ దాసుగారు యుక్తవయసున సత్తెనపల్లిలో నిరంతర దైవతత్త్వాన్వేషకురాలైన శ్రీ గురు జింకా పిచ్చమాంబ గారి వద్ద గురుకారుణ్యమంది, ఆ మహిత జ్ఞానబోధకులైన శ్రీ మిరియాల వెంకటరంగాచార్యులకు ప్రియశిష్యులై, వారి ద్వారా శ్రీ వీరబ్రహ్మంగారి గురించి విపులంగా తెలుసుకొని శ్రీ వారి మఠానికి (కందిమల్లయపల్లె) వెళ్ళి రావాలని నిశ్చయించుకున్నారు పిమ్మట తన గురుదేవులైన శ్రీ రంగాచార్యులతో కలసి, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠాన్ని సందర్శించి, శ్రీ వారి మహిమలు విన్న శ్రీ నాగభూషణ దాసు గారు ఆశ్చర్యానందానుభూతి పొందారు ఆ అనుభూతిలో



రచయిత

# జివంగుల నాగభూషణ దాసు

నే తీయన మనస్సులో మెదిలింది ఒక కృతి నిశ్చయం, అదే "శ్రీ వీరబ్రహ్మేం
ద్ర స్వాముల వారి మహిమలు" రచన చేసి ప్రచురించాలని అయితే స్వామి వారి
మహిమలు పరిపూర్ణంగా తెలుసుకొని గ్రంథస్థం చేయడం ఉచితమని భా
వించిన శ్రీ దాసుగారు, శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామివారు సంచరించిన, కొన్ని
ముఖ్యప్రదేశములైన, పాపాఘ్ని మఠము, కందిమల్లయపల్లె, బనగానపల్లె,
ముడుమాల, వనిపెంట, అల్లాడుపల్లె, శ్రీశైలం, మహానంది, మొదలగు ప్రాం
తాలను, "ఎడ్లబండిపై" ప్రయాణిస్తూ దర్శించి అక్కడి పెద్దలను కలసి
విషయాలను సేకరించి, ఆ తదుపరి గ్రంథ రచనకు పూనుకొన్నారు ఫలితం
గా "శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దివ్యమహిమలు" అను 5 సంపుటాల భక్త జన ప్రియమైన
పవిత్ర గ్రంథం మైంది ఈ సంపుటాల్లో మొదటి సంపుటము 1927వ
సం॥ ముద్రించబడి పండిత, పామరుల ప్రశంసలందుకుంది 1932వ సం॥
శ్రీ స్వాముల వారి మహాభక్తులైన శ్రీ సచ్చిదానంద స్వరూపులును 'కా
లజ్ఞానా ద్వైత రహస్యోపదేశకులను కీ॥శే॥ శ్రీ వెంకటేశ్వరస్వాముల వారు
పూర్వావశంబున పత్రినపల్లి గ్రామమునకు దెంచినపుడు, వారికి శ్రీ దాసుగా
రు తమ రచనలు చూపించగా, వారెంతో సంతోషించి, శ్రీ జేజినాయనగా
రు వ్రాసిన కొన్ని తాళపత్ర గ్రంథములను శ్రీ దాసుగారికిచ్చి కాలజ్ఞాన సహి
తముగా గ్రంథ రచన చేయమని ఆశీర్వదించారు శ్రీ నాగభూషణదాసుగారు
తాళపత్ర గ్రంథాలలోని, కాలజ్ఞానం అందులోని వేదరహస్యములు క్షుణ్ణం
గా అవగాహన చేసుకొని, తాను రచన చేసిన 5 సంపుటాలకు కాలజ్ఞానం
మరియు, అందు నిక్షిప్తీకరించిన ఆత్మసాక్షాత్కార సూక్ష్మ తత్వ విచారణాది మౌ
లిక ధర్మాలను జోడించి "కాలజ్ఞాన సహిత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి
సంపూర్ణ చరిత్ర" అనే ఈ భక్త జన ముక్తిప్రదాయక గ్రంథాన్ని ప్రజలకందించా
రు. అంతేగాక శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దివ్య బోధనలను, కర్మయో
గ తత్వాన్ని ఆజన్మాంతము భక్తి శ్రద్ధలతో అనుష్ఠించి సార్థక జన్ము
లయ్యారు కావున భక్త మహాశయులెల్లరు శ్రీ వీరబ్రహ్మేంద్రుని దివ్య పావన
చరిత్రను త్రికరణ శుద్ధిగా పఠించి శ్రీ స్వామి వారి తత్వ బోధలను నిష్ఠాగ
రిష్ఠులై ఆచరించి ఆత్మసాక్షాత్కార యోగమును, మరియు జన్మరాహిత్య
మును పొంది, మానవ జన్మ కారణమును సఫలీకృతం చేసుకొని పర
మేశ్వరైక్యం పొందగలరని ఆశిస్తున్నాము.

ఇట్లు
ప్రకాశకులు

**జివంగుల నాగభూషణదాసు సన్స్**

# శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామివారి వంశవృక్షము

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి (భార్య) గోవిందమాంబ

1. సిద్ధలింగయాచార్యులు 2. గోవిందయాచార్యస్వామి 3 పోతులూరయాచార్యస్వామి

4. శివరామమూర్తయాచార్యస్వామి 5. ఓంకారయాచార్యస్వామి.

(కుమార్తె) వీరనారాయణమ్మ (భర్త) తిరుమలాచార్యస్వామి

పెద గోవింద స్వాముల వారు

గోవిందయాచార్యస్వామి

పోతులూరయాచార్యస్వామి

శ్రీ వెంకటేశ్వర స్వాముల వారు ఆన 1932-9-10వ తేది సరియగు అంగీరస నామ సంవత్సర భాద్రపద శు|| శనివారము పగలు గం 12 బ్రహ్మైక్యమందిరి

శ్రీనివాస స్వాములవారు ఆన 29-7-1969 సరియగు సౌమ్యనామ సం||ర ఆషాఢ బ|| మంగళవారము సాయంత్రము 4-30 గం||లకు బ్రహ్మైక సిద్ధిపొందిరి.

వెంకటాద్రాచార్యస్వామి

1 వీరయాచార్యస్వామి 2 నారయాచార్యస్వామి

3 వెంకటేశ్వరస్వామి 4 గోవిందస్వాములవారు

శ్రీ వెంకటేశ్వర స్వాముల వారు

శ్రీశ్రీనివాస స్వాములవారు

శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వాములవారు

# శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ఆజ్ఞ

(ఎల్లవారును తప్పక చదువ ప్రార్థితులు)

కాయమనెడి గృహంబున జ్ఞానంబను దీపంబుచే నజ్ఞానంబను అంధకారంబును బోద్రోలని మానవారులు పరిశుద్ధులైనవయో మహాశయులారా! ఎల్లరు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాముల వారి యాజ్ఞను శిరసావహించి స్వామి యాజ్ఞానుసారము ప్రవర్తించి సద్గతి జెందెదరు గాక యని యీ దాసుని ప్రార్థన శ్రీ స్వామి యాజ్ఞ యేమనగా.—

గీ॥ మాఘ కార్తీక వైశాఖ మాసములను
మూల మొదలు శ్రావణ మంత్యమునను శుక్ర
వారమున నట్టులె సోమవారమందు
భక్తిపూజించు వానికి ముక్తినిత్తు

ఈ కాలజ్ఞానమును సాకల్యము గాను జూచి చదివిన వారల్
శ్రీకంఠుని కరుణయుగల లోకైక మహైశ్వర్య పదవి నొందుట నిజమౌ
చదివిన వారికిన్ సకల సౌఖ్యము సంపద లష్టసిద్ధులున్
కుదురుగ నుండు భోగముల గోరికలన్నియు సిద్ధినొందు నా
పదునొక మారు నన్వయము భావయుతంబుగ భక్తి పూజలో
వదలక జేసికొన్న గుణవంతున కిచ్చిన శిక్ష్యమంతేయున్.

భక్తులారా! మరియొక యాజ్ఞ వినుడు.

గీ॥ చదివి పట్టాభిషేకంబు జరుపు వారి
పుణ్యమెమని చెప్పుదు పూర్ణమైన
భుక్తి ముక్తియు జ్ఞాన సంపూర్ణయాశము
గలిగి నాయందు నైక్యంబు గలుగు వినుడు

ఇట్లు స్వాముల వారు సెలవిచ్చియున్నారు కాన భక్తులైన యెల్లవారును " మాఘ కార్తీక వైశాఖ మాసములందు నా కాలజ్ఞానంబును మాసాంతము వరకు పురాణంబు రీతిగా చదువుచు చెప్పుచుండు వారికిని వినువారికిని తప్పక సాయుజ్య పదవి చిక్కునని స్వాముల వారి ఆజ్ఞ కాన నెల్లరును ఆజ్ఞకు బద్ధులైయుండి పరమసౌఖ్యంబును భవింతురుగాక యని యీ దాసుని విజ్ఞాపన.

ఇట్లు, గ్రంథకర్త.

# పీఠిక

పాఠక మహాశయులారా! స్వాములారా! కాలజ్ఞానంబులోగల 10, 11 అశ్వానంబులలోని కొన్ని విషయంబులను మాత్రమే నవీనముగ వేయుట మైనది "ప్రపంచంబంతయు బహుప్రళయంబులతోనుండు లయకాలము లగ్నంబులనుబెట్టుకొని ప్రపంచముపైకి పరుగిడుచువచ్చుచున్నది. కాలమాన పరిస్థితులు క్షణక్షణంబునకు మారుచుండును. శ్లో॥ ఆనందనందనంమధ్యే శ్రీమత్త్రైవల్యం శ్రీముఖం విళంగిలః ఫిలః ఫిలః వీరధర్మాత కేశవం॥ ముందు మార్గశిర అష్టమిలోపల "యుగసంధి" బుట్టు నిజమన్నారు ఇందుకు దప్పితె హీనజాతివా నింటనే బుట్టెదనన్నారు." అని స్వాములవా రిది వరకే ఒక తత్త్వములో వ్రాసియున్నారు. శ్లో॥ మాస మాశ్వజ మేకంతు మాసాంతే కార్తీకంతథా॥ అమాయాం చంద్రోదయంచవీరకాలమేమహాత్॥ ఇంకొకచోట శ్లో॥ మాస కార్తీక మేకంతు, సర్వమాసాత్మే మయం అమావాస్యా చంద్రమేకింతు అది వీరకాలమే మయం॥ అని యున్నది. నా మహిమలు నేను వచ్చెదిది, "కార్తీకంబని" మహాత్ములు నా మహిమ కొఱకై నెదురుజూచుచుందురు ఆ యుగసంధియే యిప్పుడుచిత్రభానునామ సంవత్సర మార్గశిర తులాలగాయతు వచ్చే మార్గశిరమాసము వరకు సంధి దిన బులని పెద్దలయినవారలునిశ్చయించిరి ఈ సంధికాలములో అన్యోన్య మగు కలహంబులును, విషజ్వరమాదిగాగల విపరీత వ్యాధులతోను, యుద్ధ ముల వలనను ప్రతివారి మనంబును సందిగ్ధంబుగానుండి ప్రజాక్షయంబై భూభారము కొంత తగ్గును స్వభానునామ సంవత్సర ఆషాఢమాసంబులో చంద్రుడు, సూర్యుడు గురుడు, కర్కాటక రాశికి చేరుటవలన కలిధర్మం బులుతగ్గి కృతయుగ ధర్మంబులు నడచును శ్లో॥ పార్థివో పార్థివో భూపా వ్యయో భూపా క్షయం పునః పంచవర్షేచ వీరభూపా భవిష్యతి॥ పార్థివనామ సంవత్సరంబులో శ్రీ వీరభోగ వసంతరాయలవారి దర్శనము ప్రపంచ మందరికిని గల్గును. అందరును యామహాపురుషుని ధ్యానించెదరు. విరోధినామ సంవత్సరములో బ్రహ్మాండమంతట సత్యంబును వ్యాపింప జేసి శ్రీశైలముజేరి ఈశ్వరుని దర్శించి "చంద్రగుప్త మహారాజునకు శాప విమోచనంబును జేసి పాతాళగంగను పావనినిగా జేసి అప్పుడు కాగల కార్యంబు లన్నియు నొక్క కన్ను రెప్పపాటులో నయ్యేని, సత్యము,

శ్లో॥ శుభే శుభే ధనుర్మాసే తృతీయాం శుక్ల పక్షే సోమ శ్రవణ మధ్యాహ్నే వీరభూపాలకో పతిః॥ ఖరనామ సంవత్సరములో వీరభోగవసంతరాయల వారికి పట్టాభిషేకము శ్రీకృష్ణభగవానుడు ద్వాపరాంతమున ప్రజోత్పత్తి నామ సం॥ ఆశ్వీయుజ బ॥ ౧౦ లు నిర్యాణంబైన నాటి దినమే కలి యుగం ప్రకాశంబైనది. శ్రీకృష్ణ నిర్యాణం మొదలుకొని కలియుగము, ౪౭౭౭ యేండ్లకు కలిరూపము నాశనముగానున్నది అనంతరము వికారి నామసంవత్సరము, వికారిని మూడేసి విష్ణు నామంబులచేత హెచ్చించి అనంతరం ఆరుమూళ్ళ పదునెనిమిది యగుమీదట శ్రీవీరభోగ వసంతావ తారుని ఉద్భవానంద మనియును. అచ్చేరి గుర్రాలు తుంగభద్ర నీళ్ళు తాగిన మూడుసంవత్సరములకు శ్రీవీరభోగవసంతావతారుని పట్టాభిషేకం అని తెలుపుచున్నది. (అనగా కలి ౫౦౫ ౨ సరియగు ఖరనామసంవత్సరంబని పెద్దలయినవారలు నిశ్చయించిరి) శ్లో॥ నంద మాశ్వీజంచ మాశ్వీజమాసేన దశమ్యాం శుక్ల పక్షే భానువాసరే వీరభూపాలకో పతిః॥ నందననామ సంవత్సరమునకు దేశమంతయు ఆనందదాయకంబై సుభిక్షముగానుండును అనంతరం శ్లో॥ మామేక మేకం మహామేక మేకో, మామేకమే సర్వదా మేకమేనా, మామేక మేకం మహామేరుమధ్యే మా మేకమే సర్వధామయః (సంవత్సర వారీగా వేయుటకు కొన్ని చిక్కులు గలుగుటచే వేయలేదు. ముంపుడు) భగవంతుడు మహాకాల నిర్ణయంబుజేసి ఆ తెచ్చిన వివరంబేమనగా సదభిప్రాయాన వినప్రార్థింతుడను 1) ప్రహ్లాదమైన పని కాగలదు. వారికొరకై నేను రావలసిన వచ్చియున్నది. 2) పరశురామావ తారం పల్కేపల్కులు విని భయముచేత నుండేరి ఇప్పుడు వీరిద్దరెవరో గ్రహింపుడు. 3) మహాప్రకాశమైన కాలానకు ఉత్పాతంబయిన ధ్వనులు గలిగేని దాని వెంటనే అత్యంత వేడిమిగ్రమైన వాటిచే దుష్టదేహాలు భూమి మీద పడి భస్మ బయేవి సుజననికాయంబులు నిర్జీవంబులుగా నుండేవి ఆ పిమ్మట భక్తదేహాలు, నిత్యపురుషులు నిలిచేని, "ప్రపంచ పఠనం" అయ్యేని. 4) ముందు మార్గశిర అష్టమి లోపున ఉద్భవ మవుతూవున్నాము శుద్ధ సువర్ణంబైన మాసేవజేసుకొనియుండేరు. 5) మురహరుండనైన ముక్కంటిపైన నామహిమలు మజ్జనంబునకును తెలియదు కార్తీక శు ౧౨ నాటికే బ్రజానష్టం బయ్యేని శ్రీమన్నారాయణుండనైన

వసాంతరంబులలో నెత్తురు వర్షం కురిసేని. తక్కువ నాణ్యము చల్లని మేకపోతు వృషణంబులకు చన్నులుబుట్టి పాలు పితికేని, ఏనుగు గుఱ్రాలు అవయంబులతో నెత్తురుగురిసేని, అంపవర్షము గురిసేని, కొన్నిస్థలంబు లలో వగ్నిగురిసేని, సకలజాతిదొరలు నిష్టపడెదరు. నాశక్తి ధైర్య సాహా సంబులు నిల్చేను, నిశ్చయము. ఆయుధాలు హద్దుమీరేని, ఇదే శాంభవి అంగారకి మూలములు హరించేని పూర్ణాహుతి, నా పేరు సూర్యనంది. అయ్యదియే గురుసాక్షాత్కారము. వాయువేగ మనోవేగంబుల వడచేని అగ్ని ఆరేని, దివ్యప్రకాశాలు లేకపోయేని ఘోరయుద్ధములు సంప్రా ప్తంబయ్యేని, చచ్చినవారికి యేడ్చేవారు లేకపోయేని, ఒకరి క్షేమానికి ఒకరు చేరకపోయినా నా యింటి ప్రాకారాన ఆరెదొండచెట్టు బుట్టేని. ఆ సమయమున జనులు మొరలు ఆలకించే దొరలు లేకపోయేని ౩౬౮ వ్యాధులు యెగసేని, వైద్యము పారకపోయేని, ఒకేసారి పదునెనిమిది పట్నాలు కొల్లబోయేని అప్పుడు ఏడుపుట్ల నల్లలు రాలేని గాజుపూసలు గడగడ వణకేని. లక్ష్మిదేవి దుఃఖించేని ముత్తయిదువులు ప్రియంబుగా నుండపోయేని. ఒక్కమగవానికి పదుగురు స్త్రీలు వెంబడించేరు, అప్పుడు మానవులకు వింతవింతల గుణంబులు బుట్టేని, నిరూపాంశమున ఒక వింత బుట్టేని, అప్పుడు జనులకు కాలజ్ఞాన మహత్తు తెలిసేని ఎఱ్ఱసీమ ఏనుంగురూపంబుగానంబడేని, పర్వతానవున్నవరుసవేదికందిమల్లాయపల్లెకు చేరేని, అప్పుడు కందిమల్లాయపల్లె పన్నెండామడపట్నంబయ్యేని నవగ్రహ ముల నడకలు మారేని, బాపల పంచాంగములు పనికిమాలినవై పోయేని, మయసిద్ధాంతంబైన సాంద్రసింధు వేదంబే నిలచేని, నా స్తికవాదులు నానా దిక్కుల బయలుదేరేని, వారి నాశనంబునకే తెలిసేది కాన్పించని కరువులు వచ్చేని, వీరబ్రహ్మేంద్రస్వామి వీరభోగవసంతావతారుడై వస్తాడని జను లందరు దృష్టాంతముగా పాడుకొనుచుండేని. వడగండ్ల వానలు విశేష ముగా కురిసెని ఇకను భూలోకమున జరుగు హేతువులెవ్వియనగా మూడు తోకలుగల చుక్కలు తూర్పున ఉదయించెని, అప్పుడనేక గ్రామంబులు కాలిపోయేని ప్రపంచంబున నాకీర్తి విస్తారంబయ్యేని, మసిపాత మాణి కమ్మేని, ఆనందలోగా పోకకు పుట్టెడు విశ్యమమ్మేని, అప్పుడు దేశాల వ్యస్థపడును. మహిషమర్దన నామసంవత్సరం లగాయతు నంద గోవింద నామ సంవత్సరములోగా జలము హరించును.

వీరభోగవసంతరాయలుగా రానున్న వీరబ్రహ్మేంద్రస్వాములవారు వ్రాసిన

# భూతల స్వారాజ్య కాలజ్ఞాన పత్రిక

భక్తులారా! కలియుగము 5000 మీదట ధూర్జటి పర్యాయ నామ సంవత్సర ద్విగుణాకాలాంతర విచిత్రమాస సమాన భాసుర భానువారా నిధిశప్రకాశ ప్రళయ నక్షత్ర దక్షిణకాలానకు పక్షద్వయానకు దుష్టశిక్షణశిష్ట పరిపాలనంబు కొరకై ఈ భూలోకంబున "శంబలగ్రామంబున" దేవమయుండైన విష్ణుయ శుండను దేవబ్రహ్మణునకు పుత్రుండనై బుట్టి దేవతాబృందములు నిరీక్షింప వీరభోగవసంతావతారుండనై దేవదత్త ఘోటకారూఢుం డనై దుష్టజనంబుల మదీయమండలాగ్రంబున ఖండీభూతులం జేయుచు ధాత్రీమండలంబున తేజరిల్లుచుండుదును అంతా నరుల దేవమయుండైన విష్ణుమూర్తి ధ్యానపూజనాది విధానాసక్తులై నారాయణ పారాయణులై వర్ధిల్లెదరు అంత కల్క్యవతారంబున నిఖిలధన్యులయ్యెదరు. అంత కృతయుగధర్మంబు నడుపుచుందు ఎప్పుడనిన "చంద్రభాస్కరశుక గురుపు' లేక రాశిగతులైన పిమ్మట కృతయుగంబై తోచు రానున్న వర్తమాన కాలంబులు భవజన్మంబులు మొదలు "పంచదశాధికోత్తర శదసహస్రాయం బులై" పట్టాభిషేకంబునచుందు అంతట సఖిలదుర్జన రాజ ధ్వసంబు గావించి పిదప ధర్మంబు నిల్పి 108 వత్సరంబుల నాల్గు పాదంబుల కృతయుగ ధర్మంబు నడిపి పిదప నాయవతారంబును చాలించి మదీయస్థానంబైన వైకుంఠంబును జేరెద కృతయుగ ధర్మంబు పెట్టివసిన,

శ్లో॥ ధృతిక్షమాస్తేయం శౌచమింద్రియనిగ్రహం. ధీర్విద్యాసత్యమక్రోధో దశకం ధర్మలక్షణం దశలక్షణాసధర్మస్యాయువిద్యాం సమధీయ్యతే తదీయానువర్తతే తెయాంతి పరమాక గతిః॥

# (కాలజ్ఞానము ప్రథమాశ్వాసము)

శ్లో॥ కలౌ     పిని సంప్రాప్తే ధర్మభ్రష్టో భవిష్యతి।యాతే
త్వబ్ద సహ     ాణాం పంచకాః పాపినో జనాః।చండాలం
ప్రజః     । బ్రహ్మద్వేషో బలం।బుద్ధి భ్రంశో ద్విజానాం
విదాకర్మాది సంక్షయః॥

శ్లో॥ ప్రభవ పార్థివ మధ్యేషు బహుప్రళయ నిశ్చయమ్.
అనంతరో ఆనంద మధ్యే ।రక్తపాతో రణరంగ భూమే
భీ భత్సౌ ప్రపంచ స్థితిః॥

కం॥ నందన వత్సరమున నింపొందుగ కార్తీకమందు పున్నమ నాడున్
వింధ్యాద్రి సేతువులకున్ నందున నొక వీరుడేలు చాటుక సిద్ధా॥

శ్లో॥ శాస్త్రశ్చ పార్థివాశ్చ శిష్టాచార వినాశనం సూర్యాది
గ్రహాగాళానాం గతి వైషమ్య సంభవః! గంగా మాహాత్మ్య
హానిశ్చ శూద్రాపనయ నాదికం।కుండగోళకనంతానం మద్య
మాంస పరిగ్రహం।శివ కేశవ నిందాచ శద్ధా దీనాం విపర్యయః॥

శ్లో ఆచార్య గురు ధిక్కారహః।పురోహిత వివర్జనం పరనిం
దాపరస్వత్వం పరదారా పరిగ్రహం స్త్రీణాం పునర్వివాహశ్చ
శూద్రా సన్యాస లక్షణం।దేవతా మహీ మాలో పౌవేదాధ్య
యన లక్షణం వృద్ధదాం మంత్రతం త్రాణాం మతవాద మురా
గ్రహః సముద్ర మానం విప్రాణాం,కలిదోషా ద్భవిష్యతి॥

శ్లో॥ కలౌ త్వబ్ద సహస్రాణి యా వత్సంచగతానిచ। ధర్మో
నష్టః కర్మో నష్టః జాతో యాద్వర్ణ సంకరః।

శ్లో॥ బహూన్య దృష్ట పూర్వాణి శిల్పానపి విధాని చ,
చ తుర్థ శాద్రీ దుర్భిక్షం మహామారసముద్భవం।

శ్లో॥ అసత్యం వక్ష పాతంచ।నిర్మలాత్మంచ పంచకః
జ్ఞానద్రోహ శ్రుతిద్రోహం। యా తే బ్రహ్మంచ పాతకః॥

నీళ్ళలో స్త్రీలు యాలలు పాడేను. ఆస్త్రీలకన్నులలో రక్తం కారేను. తండ్రియనిగాని, అన్నయనిగాని, తమ్ముడని గాని జూడక స్త్రీలు విరహావేదనచే వావివరుసలు లేకనడిచేరు. అర్ధరాత్రివేళ సూర్యుడు గానంబడును, అప్పుడు ఆకాశంబు యెర్రనయ్యేని, ఇంద్రకీలాద్రి పర్వతంబున తొమ్మిదిమూరల స్త్రీ ఉద్భవించి పాపపునరులనుబట్టి తలలుకోసెను. తొమ్మిది మూరలు గల ఆజానుబాహులువచ్చి శత్రువులను వరుసగా ఖండించేను. పల్నాటిసీమలో భద్రమహంకాళిపుట్టి పల్లెలు పట్నాలు పాడుచేయును, వింతవింతలుగల్గేను. విపరీత జనులందరు విలయంబయ్యేదరు. రాజాధిరాజులు వారిలో వారు కలహంబులు బెంచుకొని రణరంగమందున రాలేరు! ఊరూర నొక శక్తివచ్చి మాపటింతలు మేకపో తరచినట్లు అరచేను. అందున కొందరు నశించేరు. తిరుపతి కొండమీద నుంచి ధూమకేతువువలె నొకశక్తివచ్చి మిట్టమధ్యాహ్నము ఆకాశమునుంచి దుమికి పాతాళగంగకు స్నానంబునకై వెళ్లును అప్పుడు మార్గములోని జనులందరు అదరి బెదరి బహుగా చచ్చేరు. అప్పుడు ఉత్తరం ఉరిమి దక్షిణం మెరసి ఎండ వెన్నెల సమంబగును. బెంగుళూరులో బహు వింతమైన చోద్యంబు గల్గును. ఇందుకు గురుతు యేమన జ్యేష్ఠశుద్ధవిదియల నాడురుములతో పిడుగులు పడును వాటి వెంబడి నాలుగు నిలువుల ఆజానుబాహులు వత్తురు. వారి అడుగులు మన అడుగులతో ఏడు అడుగు లుండును. అప్పుడు మానవులంత తల్లుల ముఖము పిల్లలు, పిల్లల ముఖము తల్లులు చూడకుండా ఉత్తరముఖంగా పోదురు.



# వేమనయోగి

గీ॥ యోగులందెన్న వేమన యోగి; యోగి శిష్యులందెన్న పరిపూర్ణ సిద్ధమూర్తి
గురువులందున శివగురుడు గురుడు మతములనిట వేదాంత మతమె మతము

రగడ॥ వేదాతీతుడు వేమనసుమ్మీ। వేమన నుడువులు వేదము
సుమ్మీ। వేదశాస్త్రములు వాదములుసుమ్మీ। వాదుల నోళ్ళకు
వదరుటె సుమ్మీ। విడువక చదివిన విందురు సుమ్మీ। విన్న
వారికె వేడుక సుమ్మీ। కన్నవారు మరి యెన్నరు సుమ్మీ
చెప్పిన నెవ్వరు చేయరు సుమ్మీ। చేసిన వారలె సిద్ధులుసుమ్మీ।
సిద్ధుల మాట ప్రసిద్ధము సుమ్మీ। జాగ్రత్త జాగ్రత జాగ్రత సుమ్మీ।
వేదాతీతుడు వేమనసుమ్మీ।

# మహాత్మాగాంధీజీ

శ్రీ యదా,యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారతః ॥
అభ్యుత్థాన మధర్మస్య తదాఽత్మానం సృజామ్యహం ॥



—కాలజ్ఞాన గోవింద వాక్యములు—

ఉత్తర దేశమున వైశ్యకులము నందు, ఉత్తమ గంధాకుడు
బుట్టెనిమా, హత్తుగ నన్ని దేశముల వారంత సత్తుగ పూజలు
జేతురు మా, ॥ హరిగోవింద గోవిందా ॥

లోకమంత నేకంబుగా జేసి ఏకు పట్టెడు వాడు
వచ్చీనిమా ॥ ప్రాకటంబు గాను లోకంబులో తాను ఏకై
నిలచి జనుల నేలెంచూను మా ॥ హరిగోవింద గోవిందా ॥
ప్రహ్లాదమైన పని కాగలదు అందు కొరకై నేను రావలసిన
పని ఉన్నది (కాలజ్ఞానము.)

# విషయ సూచిక

## ప్రథమ ప్రకరణము


1 కృతి సమర్పణము 34

2 శ్రీ వైకుంఠవాసుండైన శ్రీమన్నారాయణుని వద్దకు భూలోకంబు పాపభూయిష్టంబై యున్నదని భూదేవి మొర పెట్టుకొనుట 3

3 భూదేవి తనదుఃఖంబునకు కారణము లివి యని విష్ణువుతో జెప్పుట 4

4 శ్రీ మహా విష్ణు చతుర్వ్యూహాలను మనంబున దలంచుట 44

5 పాపభూయిష్టంబైన కలియుగంబున మానవరూపులుగ నుద్భవించుటకు పంచ బ్రహ్మలాలోచించుట 45

6 యనమదల వీర భోజయాచార్యుల ధర్మపత్ని "వీరపాపమాంబ" పుత్రసంతానంబునకై పరమేశ్వరు నారాధించుట 48

7 విరాడ్విశ్వకర్మ ప్రభు వీరపాపమాంబకు ప్రత్యక్షంబగుట 50

8 కొందరు స్త్రీలు పాపాఘ్ని మఠమునగల సమాధిచుట్టూ పుత్ర సంతానంబునకై వరపడుట 55

9 పరమేశ్వరుండు సాధురూపంబున వీరభోజయాచార్యుని కడకరుదెంచుట 56

10 బ్రహ్మాండ పురవా॥ పరిపూర్ణయాచార్యులు" ధర్మపత్ని ప్రకృతాంబయు "పుత్ర సంతానంబునకై కాశీపురి కేగుట (అంతర్వ్యాఖ్యార్థము) 58

11 కాశీవిశ్వనాథుండు ప్రకృతాంబస్వప్నమున నేనే నీకు పుత్రుండనై బుట్టెదనని జెప్పుట, పరిపూర్ణాచార్య ప్రకృతాంబ ఇరువురు శివజీవైక్య సిద్ధిని బొందుట, జన్మించిన బాలుని అత్రి మునీంద్రుండు పెంచుట 60

12 యనమదల వీరభోజయాచార్యులును, ఆయన ధర్మపత్నియు పుత్రసంతానము పడయ పుణ్యక్షేత్రములకరుగుట 66

13 అత్రిమునీంద్రుడు పెంచుచున్న వీరంబొట్లయ్యను వీరభోజయాచార్యులకు పెంచుకొనుమని యొసంగుట 37

14 వీరంబొట్లయాచార్య స్వామి బాల్యము 72

15 సర్వక్షేత్రముల దిలకించి వచ్చెదనని వీరంబొట్లయ్య తల్లితో జెప్పుట 73

16. వీరంబొట్లయ్య తల్లికి విరక్తిమార్గము బోధించుట 74

17 వీరంభొట్లయ్య తల్లికి పిండోత్పత్తి క్రమమును బోధించుట 76

18.వీరంభొట్లయ్య జీవుని "చతుర్దశ"లక్షణములనిని తల్లికి బోధించుట 81
19 వీరంభొట్లయ్య సాంఖ్యసూత్రమును వీరపాపమాంబకు బోధించుట 83
20 వీరంభొట్లయ్య తల్లికి తారకోపదేశము జేయుట 85
21 వీరంభొట్లయ్య తల్లికి అమనస్కమును బోధించి పిదప విశ్వరూప సందర్శనము జూపించుట, తల్లి కుమారుని స్తోత్రము జేయుట 87
22 దేవ బ్రాహ్మణులైన విశ్వబ్రాహ్మణులకు కలియుగమున పూజ్యత యెందుకు లేనిదియు, వారికి పాంచాననము వారను నామం బెట్లు వచ్చినదియు బ్రాహ్మణులెప్పటినుండి పూజింపబడుచుండినది తల్లికి తెల్పుట 92

—ద్వితీయ ప్రకరణము—

23 వీరంభొట్లయ్య దేశాటనము జేయుట దివ్యక్షేత్రముల దిలకించుట 100.
24 యానంద భైరవ యోగి అరణ్యమున వేటకై నేగుట 100
25 మృతి నొందిన గోవును జూచి యానంద భైరవయోగి దుఃఖించుట 103
26 వీరప్పయాచార్యులు యానంద భైరవ యోగికి గోహత్యా పాప పరిహారమునకై మహాత్మదీయ వంశమందు జన్మింపుమని శాపంబొసంగుట 106
27 వీరప్పయాచార్యులు సర్వక్షేత్రములు సేవించి బనగాన పల్లెకు జేరి గరిమ రెడ్డి అచ్చమ్మగారింట కాలజ్ఞానమును వ్రాయుట 110
28 అచ్చమ్మగారు వీరప్పగారి మహాత్త్మెరుగుటకై కాలజ్ఞానమును వ్రాయుచున్న గుహ కడ కరుదెంచుట 116
29 వీరప్పయ్యస్వాములవారు అచ్చమ్మగారిని యాగంటి క్షేత్రమునకు దోడ్కొనిపోయి, బ్రహ్మోపదేశము జేయుట 118
30 వీరప్పయ్యగారు అచ్చమ్మగారికి కాలజ్ఞానమును బోధించుట 119
31 కాలజ్ఞాన పాతరపైని మొలచిన చింత చెట్టు మహాత్త్యము 127

—తృతీయ ప్రకరణము—

32.వీరప్పయ్యగారి యొద్దకు అన్నాజయ్యగారు వచ్చుట 128
33 వీరప్పయ్యగారు అన్నాజయ్యగారికి కాలజ్ఞానమును బోధించుట 130
34 గరిమ రెడ్డి అచ్చమ్మగారికుమారుడైన బ్రహ్మానంద రెడ్డి కున్న అంధత్వమును శ్రీస్వాముల వారు బోగొట్టుట 141
35 అంధత్వము బోయిన బ్రహ్మానందరెడ్డి బనగానపల్లెలో స్వాముల వారి మహిమంబులు జెప్పుట

36 బనగానపల్లె నవాబు శ్రీస్వాములవారి మహిమంబుల నెరుంగుటకై అందుకు
గాను తానేర్పరచిన మాంసభక్ష్యాదుల పుష్పంబులుగా మార్చుట 147
37 బనగానపల్లె నవాబు శ్రీ స్వాములవారిచే కాలజ్ఞానము వినుట 149

—చతుర్థ ప్రకరణము—

38 శ్రీ వీరప్పయ్యగారు వీరబ్రహ్మేంద్రావతారుడై కందిమల్లయపల్లె
జేరుట. పోలేరమ్మతో బ్రహ్మంగారు నిప్పును తెప్పించుట 152
39 శ్రీ గోవిందమ్మగారిని పెదకామెర్ల యను గ్రామంబున బ్రహ్మంగారు
వివాహంబాడ నరుదెంచుట 158
40 మృత్యుండైన రెడ్డిని స్వాములవారి మహిమంబుచే బ్రతికించుట 163
41 సజీవుండైన తుంటరిని మృత్యుండైనాడని స్వాములవారు జెప్పగా
మృతుండై యుండుట తిరిగి స్వాములవారే బ్రతికించుట 167
42 పెదకామెర్ల గ్రామవాసులకు కాలజ్ఞానమును బోధించుట 171
43 శ్రీ స్వాములవారు గోవిందమాంబ స్వప్నంబున సోదెలసాని రూపం
బున సోదెలు చెప్పి పోవుట (అంతర్థాపర్థములు) 182
44 గోవిందమ్మగారు తన తల్లికి సన్యాస రూపంబున వచ్చిన శ్రీ బ్రహ్మం
గారు భగవత్ స్వరూపుండని జెప్పి తల్లిదండ్రులను యిష్టపరచుట 189
45 స్వాములవారి యొద్దనున్న "తైదసంకటి ముద్దను" పంచభక్ష్య పరమా
న్నంబుగా మార్చి శివకోటయ్యగారికి తన మహాత్మ్యము జూపుట 193
46 శ్రీస్వాములవారును గోవిందమ్మగారును మహాక్షేత్రంబులకేగుట 195
47 శ్రీస్వాములవారికి పుత్ర పుత్రికాసంతానంబు గల్గుట వారికి
వివాహాదులు జేయుట 196
48 శ్రీ సిద్ధయ్యగారి జననమ్ము సిద్ధయ్య బ్రహ్మంగారి వద్దకు వచ్చుట 199

పంచమ ప్రకరణము

49 గోవింద పోతులూరయాచార్యులిరువురును సిద్ధయ్యగారిని దూషించు
ట స్వాములవారు కుమారులకు నీతి గరపుట 204
50 మడుమాలలో సిద్ధయ్యగారు గాన్పించనందున తల్లిదండ్రులు దుఃఖిం
చుట కందిమల్లయ్యపల్లెలో బ్రహ్మంగారి వద్దనున్నాడని దెలిసి వీర్
సాహెబ్ వచ్చుట 207
51 సిద్ధయ్యగారు గృహంబునకు రానని వీరుసాహెబ్ తో జెప్పుట 211
52 సిద్ధయ్యగారు తండ్రికి విరక్తి మార్గమును బోధించుట సిద్ధయ్యగారిని
స్వాములవారికి నొప్పగించి వీరుసాహెబు గృహంబునకేగుట 214
53 శ్రీ స్వాములవారు సిద్ధయ్యను గురుసేవకు తగవని జెప్పుట 218

54 శ్రీ స్వాములవారు సిద్దయ్యగారికి బ్రహ్మోపదేశంబు జేయుట 222
55 సిద్దయ్య నిజశిష్యుని లక్షణంబులు, నిజగురులక్షణంబులు నడుగుట 224
56 శ్రీ స్వాములవారు సిద్దయ్యకు జన్మపావనమును గురించి బోధించుట 226
57 శ్రీ స్వాములవారు సిద్దయ్యకు తారకోపదేశంబు జేసి పంచముద్ర
లను జూచెడి విధంబును దెల్పుట 228
58 శ్రీ స్వాములవారు శిష్యజన సమేతుండై ఉత్తరాది గ్రామంబులలో
సంచారంబు జేయుటకై బయలుదేరుట 230
59 బాహ్య లక్ష్యము, మధ్యలక్ష్యము, అంతర్లక్ష్యము 232
60 హైదరాబాదు నవాబు స్వాములవారిని బిలవనంపుట, నవాబు తెచ్చిన
మంచినీటిచే స్వాములవారి పీఠముకడ దీపంబును వెలుంగునట్లు
చేయుట నవాబునకు స్వాములవారు కాలజ్ఞానమును బోధించుట. 235

—షష్ఠమ ప్రకరణము—

61 శ్రీ స్వాములవారు హైదరాబాదునుండి బయలుదేరి దక్షిణాదిసం
చారము జేయ బయలుదేరుట 243
62 స్వాములవారరు దెంచుచున్న మార్గమధ్యమందు తన మహిమచే
లుకలుక లాడుచుండిన పురుగులతో నిండియున్న నొక శునకంబు
ను నుండునట్లు చేయుట 244
63 పతివ్రతయైన నొక బ్రాహ్మణస్త్రీ కుష్ఠువ్యాధిగ్రస్తుడైన భర్తను తన
తొడపై బరుండ బెట్టుకొని దుఃఖించుట, బ్రాహ్మణుని కున్న కుష్ఠు
వ్యాధిని స్వాములవారు తన మహిమచే బోగొట్టుట 249
64 శ్రీ స్వాములవారు కందిమల్లయపల్లె జేరుట మరణించిన వారికి
జన్మమున్నదా? లేదా? యని సిద్దయ్య ప్రశ్నించుట 258
65 శ్రీ సిద్దయ్యగారికి కడప నవాబునకును అద్వైత ప్రసంగంబు జరుగుట
సిద్దయ్య జేయు సలాము నకు నొక బలమైన రాతిగుండు బద్దలగుట. 263

—సప్తమ ప్రకరణము—

66 శ్రీ స్వాములవారు సిద్దయ్యగారికి సాంఖ్యయోగంబును బోధించుట 270
67 శ్రీ స్వాములవారు షట్చక్రంబులయందుండెడి యదిదేవతలను దెల్పు
చుండ గోడచాటున నుండిన మాదిగ కక్కయ్యగారు వినుచుండుట
నవచక్ర, షట్చక్ర భేదంబును దెల్పుట 276
68 షట్చక్రములయందుండెడి దేవతలను జూచు తలంపున
మాదిగ కక్కయ్యగారు తన భార్య గర్భచ్ఛేదనంబును జేసి చూడ
అందు దేవతలు గాన్పించనందున దుఃఖించుట. 284

69 శ్రీ స్వాములవారు సిద్ధయ్య గారికి చెప్పుచున్న మాటలన్నింటికిని
కక్కయ్య గారు వ్యతిరేకాభిప్రాయముగా మాట్లాడుట 286
70 శ్రీ స్వాముల వారును, సిద్ధయ్య గారును, కక్కయ్య గారును ముగ్గురును
కలసి కక్కయ్య గారి గృహంబున కేగుట. 290

—అష్టమ ప్రకరణము—

71 శ్రీ స్వాములవారు నంద్యాల కేగవలెనని బయలు దేరుట, ఒక విశ్వ
బ్రాహ్మణుని దాహంబు నడుగగా తాను కరుగు చున్న లోహ
ము ను దాహంబు నియ్యగా సునాయాసంబుగా త్రాగుట 293
72 నంద్యాల విశ్వబ్రాహ్మణులు స్వాముల వారిని అగౌరవించుట 297
73 శ్రీ స్వాముల వారు నంద్యాల వారు వడ్డించిన పుట్టెడు బియ్యపు
అన్నమును సిద్ధయ్య గారిచే తినిపించుట 300
74 శ్రీ స్వాముల వారు పాంచాననము వారికి తత్త్వోపదేశము జేయుట 304
75 నంద్యాల పాంచాననము వారికి విశ్వకర్మ సృష్టిని దెల్పుట 304
76 పంచకృత్యంబులతో సృష్టి ఎట్లు గలిగినది బోధించుట 307

—నవమ ప్రకరణము—

71 శ్రీ స్వాముల వారు నంద్యాల నుండి బయలుదేరి అహోబిలంబు
జేరుట అహోబిలంబు నుండి బయలు దేరి వచ్చు చున్న మార్గ
మధ్యమందున్న నాక బ్రహ్మారాక్షసి పీచ మడంచుట 315
78 శ్రీ స్వాముల వారు కడప గ్రామంబు జే ుట కడప నవాబు
స్వాముల వారిని తన మహాలునకు దాగొడ్డాని పోవుట. 322
79 శ్రీస్వాముల వారిని నవాబు తనవద్దనున్న చూడి గుఱ్ఱంబునకు ఏ
శిశువు జన్మించునని ప్రశ్నించుట 328
80 శ్రీస్వాముల వారు కడప నవాబునకు కాలజ్ఞానోపదేశంబు చేయుట 332
81 శ్రీస్వాముల వారు అల్లాడుపల్లె జేరి మరలా బయలుదేరి వచ్చు మార్గ
ములో తొమ్మండుగురు దొంగలు స్వాముల వారిపై దాడిగా బడుట 338
82 తొమ్మండుగురు దొంగలు గర్వాపహరణము, దొంగల తలలెప్పు
డును పైకెత్తకుండా భూమినే చూచు చుందురు గాకయని శపించుట 341

—దశమ ప్రకరణము—

83 శ్రీ స్వాముల వారు పుష్పగిరి అగ్రహారము జేరుట బండలు గూర్చుండి

నడివీధిన వెళ్ళగూడదని అగ్రహారీకులు ఆటంక పరచుట 343
అగ్రహారీకులతో వర్ణవిషయం వివాదంబు జరుగుట 346
శ్రీ స్వాముల వారు చాతుర్వర్ణములు లేవని ఖండించుట 349
శ్రీ స్వాముల వారు నన్ని వర్ణముల వారికిన్నీ వేదాధ్యయమునకు
అధికారము కలదని దృష్టాంతముచే నిరూపించుట 351
శ్రీ స్వాముల వారి మహిమచే పుష్పగిరి అగ్రహార మంతయు
తగుల బడు చుండి నటుల బ్రాహ్మణులందరికి గాన్పించుట. 362
పుష్పగిరి అగ్రహారీకులకు కాలజ్ఞానము బోధించుట 366
శ్రీ స్వాముల వారు కంది మల్లయ పల్లెకు ప్రయాణమై వచ్చుట
"దృక్సాత్మ" నిర్ణయమును సిద్దయ్యకు బోధించుట 371
శ్రీ స్వాముల వారు భాగవతోత్తమ ధర్మంబులను సిద్దయ్యకు బోధించుట 373
పాంచాననము వారికి కాలజ్ఞానము బోధించుట 374
శ్రీ స్వాముల వారి మఠంబునకు పదుగురు దొంగలు కన్నంబువేయు
ట నా దొంగలకు నేత్రంబులు గాన్పించ కుండుట. 378

## — ఏకాదశ ప్రకరణము —

శ్రీ స్వాముల వారు గోవిందయాచార్యునకు సంసారారణ్యస్వరూపం
బిటిదని బోధించుట 383
శ్రీ స్వాముల వారు గోవిందయాచార్యునకు హంస స్వరూపంబును
(అనగా స్వర పరీక్షను) బోధించుట 387
శ్రీ స్వాముల వారు సర్వోదయ ఫలమున్నూ, మాస ఫలమున్నూ,
వార ఫల మున్నూ సంవత్సరాది ఫలమున్నూ బోధించుట 389
సిద్దయ్య గారికి మరణ సూచిక లక్షణంబులను దెల్పుట. 392
శ్రీ స్వాముల వారు ఛాయా పురుష లక్షణంబులను గోవిందయా
చార్యులకు బోధించుట, సంకల్పాది పఠన క్రమంబును బోధించుట 393
శ్రీ స్వాముల వారు తానవతరించిన ననంతావతార మహిమంబు
లను సిద్దయ్య గారికి బోధించుట. 395
శ్రీ స్వాముల వారికి తెలియకుండగనే గోవిందమ్మ గారు పోలేరమ్మ
కు పొంగలి చేయ ప్రయత్నించుట 399
కర్నూలు నవాబు నకు కాలజ్ఞానంబును బోధించుట 404

100. శ్రీ స్వాములవారు తన జ్యేష్ఠ కుమారుడైనగోవిందయాచార్యునకు తన మారుగా పట్టాభిషేకంబు చేయుట 408
101. శ్రీ స్వాములవారు నిష్ఠాగరిష్ఠ తత్వంబు నందుండుట,గోవిందయాచార్యస్వాములవారికి ఈశ్వరమ్మగారి మహిమంబును దెల్పుట 416
102 శ్రీ స్వాములవారు సమాధిన ప్రవేశించబోవుచు భక్తాదులకు కాలజ్ఞానంబును బోధించుట 419
103. శ్రీ సిద్దయ్య బనగానపల్లెకు పూలకై వెళ్ళుచుండగా, శ్రీస్వాములవారు మౌనిరూపంబునను, వృద్ధ బ్రాహ్మణుని రూపంబున గానంబడుట, సిద్దయ్య అరణ్యంబున దుఃఖించుట 428

## —ద్వాదశ ప్రకరణము—

104. శ్రీ సిద్దయ్య కందిమల్లయ్య పల్లెకు జేరుట 436
105 శ్రీ సిద్దయ్య సమాధినిజూచి ఘోరముగా దుఃఖించుట 440
106. శ్రీ స్వాములవారు సమాధి నుండి బయటికి వచ్చుట, శ్రీ సిద్దయ్య స్వాములవారిని స్తోత్రంబు జేయుట 446
107. శ్రీ స్వాములవారు ఎరుక యిట్టిదని తెల్పి దాని ప్రభావంబును బోధించి, పిమ్మట పరిపూర్ణంబును బోధించుట 449
108. శ్రీ స్వాములవారు దివ్యదృష్టిని సిద్దయ్య కిచ్చుట 452
109. శ్రీ స్వాములవారు సిద్దయ్యను వివాహము చేసుకొనుమని జెప్పుట, పాదుకలు వగైరా నాలుగు వస్తువులను నొసంగుట 455


## —త్రయోదశ ప్రకరణము—

110. శ్రీగోవిందమ్మ 'పనిపెంట విశ్వబ్రాహ్మణులు వల్లగాడుగాను,మునిమడుగు విశ్వబ్రాహ్మణులు మునష్టంబుగాను' అనిశపించుట 461
111. పోతులూరయాచార్యులు సమాధిని బిగులగొట్టుట 462
112. పోతులూరయాచార్యులు మలమీది పల్లెకు తపమునకై పోవుట, తన పోషణకై యున్న పోలేరమ్మను ఒకవేపచెట్టుయందు ఐక్యంగమ్మని పోతులూరయాచార్యులు జెప్పుట 477
113 సిద్దయ్యమహిమచేసర్వద్రష్టుండైమృతినొందినతిమ్మారెడ్డితిర్గిబ్రతుకుట
114 బ్రాహ్మణుడైనగోవిందయ్యకుసిద్దయ్యబ్రహ్మోపదేశంబుజేయుట 478
115. ముడుమాల గ్రామకరణముతో మాట్లాడుచు అరణ్యమున పులిని "దశా" అని అదలించుట. 479

# కృతిసమర్పణము

## కాలజ్ఞానసహిత

# శ్రీవీరబ్రహ్మేంద్రస్వాములవారి




## సంపూర్ణ చరిత్ర

ఉ. శ్రీధనబ్రహ్మరుద్రమరశేఖరవంద్యుడు, వంద్యభక్తసం
ఘాదరుడాదరాయుతుడు జ్ఞానప్రసాదుడు సాధుమూర్తిలో
సాధన నిచ్చుదాత, యిహచెప్పదనం బిరిగించునాతడా
రాధితశిష్య, వీరగురురాయుని సంస్మరణంబు జేసెదన్.

అని యిష్టదేవుడగు శ్రీ మద్విరాడ్విశ్వ బ్రహ్మ స్వరూపుండగు శ్రీజగద్గురువిరాట్పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారిని సంస్మరించి, శ్రీ యీశ్వరీమహాదేవికి సాష్టాంగ దండప్రణామంబు లాచరించి, పంచమూర్తులను ప్రస్తుతించి, గణపతిని ప్రార్థించి, సరస్వతిని స్తుతించి, శ్రీమద్వేదాంతసార సచ్చిదానంద స్వరూపులగు బ్రహ్మశ్రీ వేంకటేశ్వరస్వాములవారిని సంస్మరించి, శ్రీమదఖండాచలస్వరూపు

లగు బ్రహ్మశ్రీ శ్రీనివాససద్గురుస్వాములవారి పాదపద్మంబు లకు బ్రణుతిజేసి, శ్రీమత్పంబహారిపిర్దేశికేంద్రస్వాములవారిని సేవించి, సాంఖ్య తారకోపదేశికులగు శ్రీ అచల స్వరూపు లగు శ్రీ మద్గురు జింకా పిచ్చమాంబ పాదపద్మంబుల నతి భక్తితో నర్చించి, అమనస్వభావం బిట్టిదనితెల్పి, అస్మదీయ సంశయంబులను చక్కజేసిన యాజ్ఞాన తిమిరార్కుండగు శ్రీ మద్మిరియాల వేంకట్రంగ దేశికేంద్రుల వినుతిజేసి సకల పాపధ్వంసంబును, యీప్సితార్థ ఫలప్రదంబును, సకల జనా మోదంబును నగు, "కాలజ్ఞానసహిత" శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి సంపూర్ణ చరితంబును, మోక్షాసక్తుండనై, వచన గ్రంథంబుగా రచించి సప్తావరణంబు లనియెడు సప్త ప్రాకారంబులును, చతుర్వేదంబులనియెడు నాలుదొ బురుజు లను, షట్చక్రంబులనియెడు నాలువీధులను, చతురవస్తలని యెడు నాలుగు ద్వారంబులును, చతుర్వింశతితత్వంబు లని యెడు యిరువది నలుగురు జమానులును, ప్రజ్ఞానంబను దఫే దారును, మనంబనియెడు మంత్రితో, కాయాపురంబను కంది మల్లయపల్లెలో, మధ్యభాగంబునంగల సహస్రారంబనుమరం బున ప్రణవ సింహాసనారూఢుండై, ప్రభాకర హిమాంశు వహ్నులను నేత్రత్రయమును ధరించి నిజభక్తి వరదుండై భూసురార్చిత పాదయుగళుండై సకల దేశవాసులైన భక్తు లరుదెంచి అచ్చటగల కోనేరులందు స్నానంబాచరించి తన సన్నిధి కరుదెంచిన వారలకు దర్శనం బొసంగుచు ముక్తి పాత్రులుగా జేయుచున్న శ్రీ జగద్గురు విరాట్పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారిపదసరసీరుహంబులకునీసచ్చారి త్రంబును కానుకగా సమర్పించుకొనుచున్నాడను. ఇట్లు,

గ్రంథకర్త.

ఓమ్

స్వయంభూ

శ్రీ గురు అల్లాటపల్లె వీరభద్ర స్వామినే నమః

"శ్రీ గోవిందమాంబ సమేత"

శ్రీ జగద్గురు విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామినే నమః

బ్రహ్మశ్రీ వెంకటేశ్వర సద్గురు స్వామినే నమః

బ్రహ్మశ్రీ శ్రీనివాస సద్గురు స్వామినే నమః

కాలజ్ఞాన సహిత

# శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి

# సంపూర్ణ చరిత్ర

ఓమ్ విశ్వకర్మా దిశాంపతిస్సనః

పశూన్పాతు సోఽస్మాన్ పాతు తస్మై నమః

యజు.కాం 5 ప్ర.అ 6

శ్లో॥ న భూమి న జలం చైవ న తేజో నచ వాయువః

నచ బ్రహ్మా నచ విష్ణు నచ నక్షత్ర తారకః

సర్వశూన్య నిరాలంబం స్వయంభూ విశ్వకర్మణః

తా॥ భూమి జలము అగ్ని-వాయు-ఆకాశము, బ్రహ్మ-విష్ణు మహేశ్వర-ఇంద్ర-సూర్య నక్షత్రంబులు లేని వేళ యందు విశ్వకర్మ "స్వయంభూ" రూపమైయుండెను అట్టున్న విరాడ్విశ్వకర్మ ప్రథమ మహాయుగంబున సద్యోజాత వామదేవ, అఘోర,-తత్పురుష-ఈశాన యను పంచముఖంబులతో అవతరించెను

శ్లో॥ మనుం పూర్వముఖంచైవా, మయానాం దక్షిణం ముఖం
త్వష్టా పశ్చముఖంచైవా, ఏవ జన్మ క్రమక్రమాత్॥

తా॥ 1) ఈ విరాడిశ్వకర్మ సద్యోజాతముఖముఅనే తూర్పు ముఖమందు మను విశ్వకర్మయందు ఈశ్వరుండుద్భవించెను. 2) వామదేవముఖమనే దక్షిణముఖమందు మయ విశ్వ బ్రహ్మయను విష్ణుమూర్తి యుద్భవించెను 3) అఘోర ముఖమనే పశ్చిమ ముఖమందు త్వష్ట విశ్వబ్రాహ్మయను బ్రహ్మదేవుం డుద్భవించెను. 4) తత్పురుష ముఖమనే ఉత్తరముఖమందు శిల్పి బ్రహ్మయను ఇంద్రుడుద్భవించెను 5) ఈశాన్య ముఖ మనే ఊర్ధ్వముఖమందు విశ్వజ్ఞ బ్రహ్మ యను సూర్యభగవాను డుద్భవించెను. ఋగ్, యజు, సామ, అధర్వణ, ప్రణవ వేదంబు లను పంచ వేదంబులతో నీ పంచ బ్రహ్మలుద్భవించి సృష్టి, స్థితి, లయ, తిరోధాన, అనుగ్రహంబులను పంచకృత్యములకు కర్తలై మనుబ్రహ్మ యను ఈశ్వరుండు కైలాసంబునను, మయబ్రహ్మ యను విష్ణుమూర్తి వైకుంఠంబునను, త్వష్ట బ్రహ్మయను బ్రహ్మ దేవుండు సత్యలోకంబునను, శిల్పిబ్రహ్మయనుదేవేంద్రుండు ఇంద్రలోకంబునను, విశ్వజ్ఞబ్రహ్మయనుసూర్యభగవానుండు సూర్యలోకంబునను నుండి పదునాలుగుభువనంబులను బాలిం చుచుండిరి. (ప్రపంచ సృష్టి నంతయు నంద్యాల పాంచా ననము వారి [illegible] రణమునందు చూడుడు)

# ప్రథమ ప్రకరణము

## — కథా ప్రారంభము —

(శ్రీ మన్మయబ్రహ్మాయగు వైకుంఠవాసుండైన శ్రీమన్నారాయణుని వద్దకు భూలోకంబు పాపభూయిష్ఠంబై యున్నదని భూదేవి వచ్చి మొఱ బెట్టుకొనుట)

శ్రీ మన్మహా వైకుంఠంబున హాటక నవరత్న ఖచిత గోపుర ప్రాకారానేకకుడ్యంబులును, వజ్రంబులచే సమర్చిన కవాట నివహంబులును, వైఢూర్య మాణిక్య మరకతమౌక్తికంబులచేత నిర్మింపబడిన యనేక మంటపంబులును చిత్రాతి చిత్రములైన గృహంబులును, అతిరమ్యంబగు ప్రాసాద నివహంబులును, ఎచ్చటగన్న నచ్చట బచ్చలతోరణంబులును, లెక్కకు మిక్కుటంబైన బంగారుతేరులును పర్వతాకారంబులయి వెలయు గజంబులును, పవన వేగంబుసంజను తురంగంబులును గలిగి యతిశృంగారంబై శతవీధులతో నొప్పుచు విమలంబయిన గానంబుతో నృత్య వివిధ వాద్యంబులు ఘోషింప సుందరులైన మందయానలు గ్రందుకొని వెలుంగ శంఖ చక్ర గదాధరులయిన చతుర్భుజు లందందు విహరింప నొప్పియున్న యా దివ్య వైకుంఠ మధ్యంబున రవిప్రభా భాసమానంబై మహామహిమలచే నొప్పుచున్న సహస్ర శీర్షుండయిన శేషునిపై నీలిమేఘ శ్యాముండును, శత పత్ర నేత్రుండును, ఆజానుబాహుండును, శంఖ చక్ర గదాధరుండును, తప్తకాంచన యుతుండును, వజ్ర వైడూర్య నీల గోమేధిక పుష్యరాగ మరకత మాణిక్య ఖచిత దివ్యభూషణాలంకృతుండును, రాకా సుధాకరాననుండును, హేమాంబర

ధరుండును, సుకుమార శరీరుండును, కరుణాకటాక్ష వీక్ష ణుండైన శ్రీమన్నారాయణుండు వామపాదంబును ముడిచి కొని, దక్షిణ పాదంబును నేల జూచుకొని రెండు హస్తంబు లాఫణిపై నూదికొని, శ్రీ సతి యురంబు నలంకరింప గరుడ కామినులు తెల్లనిగొడుగులుపట్టి చామరంబులు వీవ, తుంబుర నారదులు గానంబు చేయ, శంఖ చక్ర గదాధరులై శ్వేతాం బర శ్వేత పుష్పమాలికా లంకృతులు అందందు గుంపులై తన్ను బరివేష్టించి గొలువ, కపిల కణ్వ గార్గేయ భారద్వాజ వశిష్ట శుకశౌనక సనక సనందన సనత్కుమారాదిమౌనీంద్ర బృందంబులు నామకీర్తనంబు సేయ, గరుడ గంధర్వ సిద్ధ సాధ్య విద్యాధరాపాలు స్తోత్రంబులు చేయుచున్న తరి భూదేవి పాపభారంబునుమోయంజాలక ఘోరుననేడ్చుచు జేర వచ్చి మయబ్రహ్మమైన శ్రీమన్నారాయణునకు సాష్టాంగ దండ ప్రణామంబు లాచరించి ముకుళిత కరకమలయై, "ఓ లక్ష్మీవల్లభా! పురాణపురుషా! భక్తజనావనా! ఆశ్రిత భక్త వత్సలా! అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకా! అది మధ్యాంతరహితా! అవాఙ్మానస గోచరా! అండజ వాహనా!" యని అనేక విధంబుల బ్రార్థించుచున్నతరి మయ బ్రహ్మ మైన యమ్మహావిష్ణువు 'దేవి! నీవిట్లు దుఃఖించుచు నారకకు రాగతంబే' మని యడుగ నంత భూదేవి 'స్వామీ కృష్ణావ తారానంతరంబు ద్వాపరయుగంబు సమాప్తంబయ్యె. అప్పటి రాజ్యప్రపాలకులగు పంచ పాండవుల పరిపాలనా నంతరం బున కిరీటి పౌత్రుండగు పరీక్షిన్మహారాజు భరతఖండంబు నకు ప్రభువై పాలించుచుండెను అంత కలి ప్రేరణచే ధర్మ



శ్రీ మహా విష్ణువుతో భూదేవి మొరపెట్టుకొనుట

దేవత గోరూపంబున నొంటిపాదంబుననిలుపంబడి దుఃఖించు చున్న సమయంబున కలిపురుషుండు శూద్ర రూపంబున నా గోవును దన్నుచుండెను పరీక్షితుండది గాంచి కలి ధర్మం బని మది నెంచి ధర్మదేవత దుఃఖంబును బాపి చతుష్పా దంబుల నిలిపెను. తదాది నతని పుత్రుండు జనమేజయుం డును, పిమ్మట వారివారి సంతతి వారును ధర్మమార్గంబున రాజ్యంబును బాలించిరి. అప్పటికి కలియుగము షుమారు 300సంవత్సరంబులుగడిచెను. పిమ్మట విక్రమార్కుండును అటుపిమ్మట శాలివాహనుండును ధర్మంబును తప్పక భరత ఖండమును బాలించుచుండిరి. అప్పటికి శాలివాహనశకవర్షం బులు 1258 గడచెను. ఆనెగోందియను రాయల సింహాసన మునకు హరిహరరాయలు ప్రభువై ధర్మంబున 7 వత్సరం బులు పాలింపుచు, విజయనగరంబు పట్నంబుగా నిర్మించు కొని యదియేరాజస్థానముగాజేసికొని 15వత్సరంబులుపాలిం చెను అంతట తనతమ్ముడైన బుక్కరాయలు పట్టంబు గట్టు కొని రెండు వత్సరముల యారు నెలలు పాలించెను.

ఆ మీదట రెండవ హరిహర రాయలు పట్టంబు గట్టు కొని 23 వత్సరములు పాలించెను. ఆమీదట విజయ బుక్క రాయలు పట్టంబు గట్టుకొని 16 వత్సరంబులు పాలించెను. ఆ మీదట గండరాయలు పట్టంబు గట్టుకొని 6 నెలలు పాలించెను. ఆ మీదట వీరరాయలు పట్టంబు గట్టుకొని

8 వత్సరముల 4 నెలలుపాలించెను. ఆమీదట మల్లికార్జున రాయలు పట్టంబు గట్టుకొని 6 వత్సరంబుల 10 నెలలు పాలించెను. ఆ మీదట రామచంద్రరాయలు పట్టంబు గట్టుకొని 2 వత్సరములు పాలించెను. పిమ్మట క్షత్రియులు స్వతంత్రముగా బరిపాలనకు వచ్చిరి. సాళువ సింగరాయలు 13 వత్సరంబులుపాలించెను. అంతటనరసర్రాయలు రెండవ కుమారుడు నరసింహ్వారాయలు 4వత్సరంబులు పాలించెను. పిదపఅచ్యుతరాయలు 22 వత్సరములు పాలించెను. పిదప అచ్యుత రాయల కొమరుని చంపించి తిమ్మరాజు 8 వత్సరములు పాలించెను. పిమ్మట సదాశివరాయలను ముందరబెట్టుకొని రామరాజు 22 వత్సరములు పాలించెను. ఈ రామరాజుతో విజయనగర సామ్రాజ్య మలతమయ్యెను. పిమ్మట పెనుకొండయ్యె పట్టంబు గట్టుకొని 11 వత్సరంబులు పాలించెను. పిమ్మట తిరుమల రాయని మనుమడైన శ్రీరంగ రాయలు పట్టంబు గట్టుకొని 14 వత్సరంబులు పాలించెను. పిమ్మట వెంకటపతి రాయలుపట్టంబు గట్టుకొని 28 వత్సరంబుల 8 నెలల 15 దినములు పాలించెను. పిమ్మటదేవరాయలను పేరిట రామరాజు 14 వత్సరాలుపాలించెను. వీరందరు

లను పేరిట రామరాజు 14 వత్సరాలు సాలించెను. వీరందరు

ధర్మంబు దప్పక ప్రజల నందరను బిడ్డలవలె పోషించుచు ధర్మముగా పాలించిరి.

—భూదేవి తన దుఃఖ కారణంబు లివియని విష్ణువుతోఁ జెప్పుట—

పిమ్మట వారి యనంతరము మానవులు కడుంగడు దురాచారులై కల్లు, నల్లమందు, గంజాయివగైరా మత్తుపదార్థంబుల నభ్యసించి కడుంగడు మత్తులై క్రూరవర్తనచే దుల దూగుచున్న వారలు. ప్రపంచమం దెందు వెదకినా 'జ్ఞానం' బనుమాట శూన్యంబై, అజ్ఞానంబునే ఆధారంబుగా జేసికొని యున్నవారలు. తపోనిష్ఠాగరిష్ఠులైన తాపసులందఱు వారి వారి మహిమంబులను దాచుకొని, జగన్నాటక సూత్రధారుండవైన యోపరమేశ్వరా! మా కష్టంబులను వారింప నీవు దక్క మఱియెవరును లేరని సదా నిన్నే ధ్యానించుచు మహమ్మదీయ పరిపాలనంబున నేమిక బ్రతుకజాలము, మమ్ముల నుద్ధరింప రావేయని మొరలిడసాగిరి. ప్రపంచం బంతయును పాపభూయిష్ఠంబై నీ నామం బన విషతుల్యం బయ్యెను. శీల విద్యలు నిష్ప్రయోజనంబులై ధనవంతుడే కన్యాదానార్హుండయ్యె. ప్రియవచనంబులెల్ల నప్రియవచనంబులయ్యె. ఆత్మ జ్ఞానము నలక్ష్యము చేసి ధనార్జనమునే బుద్ధి బలముగా గైకొనిరి యాగాదుల నుపేక్షించి యాగ ద్రవ్యంబెల్లను స్వగ్రహ నిర్వాహణములకై వినియోగించు చుండిరి. ఆగృహంబులను అతిథుల కుపయోగింపక స్వభోగమునకే వినియోగించుచుండిరి. ఆ గృహంబులను అతిథుల కుపయోగింపక స్వభోగమునకే వినుయోగించుచుండిరి స్త్రీలు బాల్యముననే సంతానవంతు లగుచుండిరి. విప్రులు వేదవిక్రయులైరి. ఇంకనుఅనేకంబులైన లేకున్న యది దౌష్ట్యంబు లదికంబులెపినఁ పెదయను ధామ్యంబును బాటింపరైరి.రత

యోక్షీరాబ్ధిశయనా ! సర్వేశ్వరా! సప్తకుల పర్వతంబులను, సప్తసముద్రంబులను మోయుచుండిన భారంబు కన్నను ధర్మంబు దప్పి నడచెడు దుర్మార్గులను మోయుట నాకు కడుంగడు భారముగా నున్న'దని భూదేవి ఘోరున నేడ్వగా, నంత శ్రీమన్నారాయణుండు భూదేవి చెప్పినవన్నియు విని, 'దేవీ! ఊఱడిల్లుము నీ భారంబుపోవు సదుపాయంబు నే నాలోచించుచున్నాడను. స్థిరమతి గలదానవై కూర్చుండు' మని చెప్పి అమ్మహావిష్ణువు మనంబున చతుర్బ్రహ్మలను నిట్లు దలచెను.

* శ్రీ మహావిష్ణువు శంకర, బ్రహ్మ, యింద్ర, సూర్యులగు చతుర్బ్రహ్మలను మనంబున దలంచుట *

శ్రీ మన్మహాదేవాదిదేవ, మను విశ్వకర్మ స్వరూప, సచ్చిదానంద సర్వేశ్వర, సకలజగదుపాదానభూత,విరాడ్రూపాధిష్టిత సదసద్విలక్షణ ప్రపంచ బాహ్యాభ్యంతర పరిపూర్ణ నిత్యనిరతిశయానంద కందళితుండను వీరమాహేశ్వరాచార్య శుంభనిశుంభాది ద్వారపాలకులచేతను సానగసనాతన అహభువన ప్రత్నస సువర్ణస విశ్వజ్ఞ ఉపయజ్ఞ జయసేవరుచిదత్త సురాజ స్వప్రకాశ నందనసునందన కాశలసువ్రత జయదేవ వితష సౌజ్ఞక సనత్కుమార దేవల గిరిధర్మ వసుధర్మ బ్రహ్మదీక్ష ప్రబోధక సుశీలాదిగా గల పంచవింశయుక్త శతసంఖ్యాది ఋషులచేతను, సాలంకాయన జంబుకేశ్వర యమ వరుణ వాయవ్య కుబేర ఈశానాదిగాగల అష్టదిక్పాలుర చేతను సకల సురాసురకిన్నెరకింపురుష గరుడ గంధ

ర్వాది దేవగణములచేతను, నందీశ్వరభృంగీశ్వరచండీశ్వర వీరభద్రేశ్వరాదిగాగల సేవితగణంబులచేతను ప్రణవపంచాక్షరీమహామంత్ర తోరణంబునితను, ప్రణవనాద మంగళాపూరితంబు చేతను, బ్రహ్మగిరి విష్ణుగిరి రుద్రగిరుల మధ్య సర్వోపనిషత్సారభూత బ్రహ్మాత్మైకత్వదర్శన రూపోంకార సింహాసనుండును, సత్యజ్ఞానానంద స్వరూపుండును, దేవ దేవుడునగు శ్రీమహాదేవుండు శ్రీకైలాసంబున ఉమాసహితంబుగా పరివేష్టించియున్న మనుబ్రహ్మయైన శ్రీసదాశివుని సృష్టికర్తయు భారతీప్రాణవల్లభుండును త్వష్టబ్రహ్మయైన బ్రహ్మదేవునిన్ని, శిల్పబ్రహ్మయైన దేవేంద్రునిన్ని, విశ్వజ్ఞబ్రహ్మయైనసూర్యభగవానునిన్ని శ్రీమహావిష్ణువుతన మనంబున దలంచినంతనే శంకర, బ్రహ్మ,యింద్ర, సూర్యులుపలుపురును విష్ణు సదనంబున కరుదెంచి ఆశీనులైరి. అంతనమ్మహావిష్ణువు చతుర్బ్రహ్మలని జూచి యిట్లనియె.

పాపభూయిష్ఠంబైన కలియుగంబున మానవరూపులుగా
నుద్భవించుటకు పంచబ్రహ్మ లాలోచించుట.

ఓయీ శంకరా! బ్రహ్మ,ఇంద్ర, సూర్యులారా!" ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే" అను న్యాయంబున మనము ప్రతి యుగంబునందు నవతరించి దుష్టనిగ్రహ శిష్టపాలనం బొనరించుట మినకుకర్తవ్యమైయున్నది. కృత యుగ త్రేతాయుగ ద్వాపర యుగంబులు చనిన పిమ్మట అష్కంధోయుగ ప్రథమ పాదమున కలియుగము నాల్గవ



యువనాశ్వుడు తన కష్టములను బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో చెప్పి విలపించుట. అంతట వారు
తాము రాబోవు జన్మలను, చేయు కార్యములను గురించి చెప్పి నూరడింపజేయుట.

కానిపాదము జరుగుచున్న యది. ఇయ్యది పంచమహాపాతక యుగంబు గాన మనము దేవరూపంబులం దాల్చక నర రూపంబులు ధరించి మనలో ముగ్గురుమూడు నామంబులచేత ప్రపంచంబున నుద్భవించవలెను, ఆయవతారంబు లెవ్వియన జెప్పెద వినుండు. "ఓయీ శంకరా! నీవు కలియుగంబున 'ఆనంద భైరవయోగి' యను నామంబుని కాశీపురంబున విజయసింగు అనునొక క్షత్రియుని యింట బుట్టి రాజనీతి ధర్మంబు దప్పక జనకునివలె రాజయోగివై రాజ్యంబు బాలింపుచుండుము ఓయీ బ్రహ్మ! కలియుగంబున దక్షిణ దేశంబున విశ్వాత్మకుండను విశ్వబ్రాహ్మణుండు గలడు. ఆయన భార్యయైన 'మాయామేయ' యను సాధ్వీలలామ గర్భంబున నీవు జన్మించి 'బహ్మానందుడు, అన్నాజయ్య' యను నామద్వయంబు ధరించి, సన్యాసి వేషంబున దివ్య స్థలంబులలో దిరుగుచు కేవల బ్రహ్మజ్ఞానివై మెలంగు చుండుము, నేను కలియుగంబున శ్రీమద్విరాడిశ్వకర్మ కులోద్భవుండును, బ్రహ్మాండ పురవాసియైన 'పరిపూర్ణా చార్య'లను విశ్వబ్రాహ్మణునకు ధర్మపత్నియైన 'ప్రకృ తాంబ' గర్భంబున నుద్భవించి 'వీరం బొట్లయ్య, వీర ప్పయ్య, వీరబ్రహ్మ' యను నామ త్రయంబులచే స్థానత్ర యంబులలోనుండి అజ్ఞానాంధకార కూపంబున జిక్కి పరి తపించుచున్న వారలకు బ్రహ్మజ్ఞానోపదేశ మిచ్చి పావను లుగాజేయుచు హరిహరపురంబున కరుదెంచి అచ్చట నొక నిర్జన స్థలంబున సూర్యప్రాప్తి బరుండైన ఆనందాశ్రమం

ఖున నుండెదను. ఓయీ ఇంద్ర–సూర్యులారా! మేము ముగ్గురము కలియుగంబున అవతరించెదము. మహేంద్రా! నీవు యజ్ఞ యాగాది క్రతువులందొచ్చెడి హవిస్సుల గైకొను చుండుము. ఓయీ సూర్యుడా! నేను సర్వకాల సర్వావస్థల యందును నీయందే లీనంబయి యుందును. కాన యిక మీ మీ నిలయంబుల కరిగి మీ కర్తవ్యములాలోచించుకొనుడు. ప్రతి యుగంబునను మేము ముగ్వురమే అవతరించి దుష్ట శిక్షణ శిష్టపాలనంబు చేయుచుంటిమి. అట్లే యిప్పుడును కలియుగంబున ముగ్వురమే అవతరించి ఆనందాశ్రమంబు నుండి పతితులను పావనులుగా జేసెదము. ఇక మీ నివాసం బుల కరుగుడని వారల నలుపురను నివాసంబులకనిపి, భూదే విని జూచి, 'దేవీ, నీ వేమియు చింతింపకుము. మేము త్వరలో ప్రపంచమునం దుద్భవించి, కలిభారం బాపెదము. నీకుండు చింతలన్నియు వీడి నీ సదనంబునకరుగు "మని జెప్పగా అంత నద్దేవి నమస్కారంబు జేసి 'స్వామీ! మీరు త్వరగా అవతరించకున్న నిక నీభూభారంబును మోయజాల' నని యనేకవిధములుగా నమ్మహావిష్ణువుని స్తోత్రంబు చేసి భూదేవి తన స్వస్థానంబు జేరెను.

నందికొండ పాపఘ్ని మరాధ్యక్షుడైన యనమల వీరభోజ నాచార్యుల ధర్మపత్ని వీరపాపమాంబ పుత్రసంతానంబుకై పరమేశ్వరు నారాధించుట.

దేహమును రణభూమిలో విషయములనెడి పదాతు

సేనాధిపతులను, మదమత్సరంబులనియెడిగజంబును, కోరిక లనియెడి తురంగంబులను, మానాభిమానము లనియెడి రథంబులను, ఇచ్ఛయనెడి సారథిని, జీవత్వం బనియెడి రాజును. జ్ఞానం బనియెడి బాణంబును సంధించి ఖండ తుండములుగా జేసి, పాశంబులనియెడు నాడులను విడిచి ఆశయనెడి గృహములు దహింపజేసి, కామమనెడి స్త్రీని విడచి, నిష్కామమనెడి స్త్రీని బొంది, శాంత యనెడి మార్గము ననుసరించి, ఏకాంతమనెడి 'పాపాఘ్న' మఠంబును తావుగా జేసికొని పరబ్రహ్మమే తానై దేహాలకొనయై పరిశుద్ధులకు నివాస యోగ్యంబును, నెల్లరకును ప్రాజ్యంబుననగు 'నందికొండ' యను పుణ్యనగరంబున పెంపులనిరసించువాడును,నిత్యసత్య నిర్వికార నిరహంకార పరవస్తువగు పరబ్రహ్మయ శ్రీమద్విరాడీస్వరబ్రహ్మ మహాప్రభువును, బరిశుద్ధ హృదయముతో త్రికాలముల యందును విస్మృతి జెందక ధ్యానము చేయువాడుననగు విరాడ్విశ్వకర్మ పవిత్ర వంశంబునందు నయమదలవీరభోజయాచార్యస్వామియనెడు నొక మహాత్ముండు గలడు. ఆ మహామహుండు పరమతపోనిధి భక్తజన మనోభీష్టప్రదాయి ఆయన 'అహింసా పరమోధర్మః' అను న్యాయంబున పరులకు హింసచేయనివాడును, 'ఆత్మవత్సర్వ భూతాని' అను వాక్యము చొప్పున సమస్త ప్రాణులను తన ప్రాణంబుగా నెంచువాడును, 'మాతృవ త్పరదారాంశ్చ' అను ప్రమాణచందంబున పర స్త్రీలను తల్లివలె భావించువాండును, 'పరద్రవ్యాణి లోష్టవత్' అను వచనానుసార

ముగా యితరుల ద్రవ్యంబును చిల్ల పెంకువలెదలంచువాడును నగు సుగుణంబులకు ఖనియగు యీయన పాపాఘ్ని మహా పతివ్రతయు సర్వజనులను తన బిడ్డలవలె జూచునట్టియు "వీరపాపమాంబ" యను పరమసాధ్వీలలామను బరిణయం బాడెను. ఈమెకు బుత్రసంతానంబు లేమిచే త్రికాలముల యందును సకల భువనాధారుండగుశ్రీమద్విరాడ్విశ్వకర్మను నీవే నాకు బుత్రుండవై జన్మింపుమని ఎల్ల వేళలను ఏకదీక్షతో పూజించుచుండెను.

— శ్రీ విరాడ్విశ్వకర్మ ప్రభువు సాధురూపంబున వీరపాపమాంబకు ప్రత్యక్షంబగుట —

ఇట్లుండ నొక దినంబున వీరభోజయాచార్య స్వామి లేని సమయంబున మహాత్ముండగు నొక దివ్యపురుషుండు సాధురూపంబున వీరభోజయాచార్యు నింటి కరుదెంచి శ్రీ వీరపాపమాంబచే అర్ఘ్య పాద్యాది పూజనంబు లొంది అమ్మహాసాధ్వీలలామనుజూచి "యోపుణ్యవతీ! నీవు కేవలం పరమ పావనిగను పరమపతివ్రతగనుండియు 'అపుత్రస్య గతిర్నాస్తి' యనియు, 'అపుత్రస్యగృహం శూన్యం' బనియు శ్రుతులు పలుకుచుండగా మీకుసంతానంబులేకుండుట గొప్ప కొఱతగా కన్పట్టుచున్నది. యేల నన శరీరంబులు బుద్బుద సమంబులు. మీయనంతరం బీ మఠంబునకు అధ్యక్షులు లేకుండుట కొఱతగదా"యని చెప్పుచు కొంచె మాలోచించి నట్లు ఆయమ్మకు గనుపరచి తలయూచి "అమ్మా! అయి నను సర్వేశ్వరుని నిర్హేతుకజాయమాన కరుణాకటాక్షంబుచే

కొలది దినంబులలో మీకు దైవాంశ సంభూతుండగు బాలుం డొక మునిపుంగవుని వలన లభించును. అబ్బాలకుండు పర మేశ్వరావతారుడేగాని సామాన్యబాలకుండుగా"దనిమాయా సాధుమూర్తి చెప్పగా, అంత పాపమాంబ సంతోషంబునకు మేరలేక "తండ్రీ ! అప్పరమ పావనుండైన బాలుండెట్లు మాకు లభించును ? అమ్మునిపుంగవుని దర్శనంబుకై మే మెందులకేగెదమో నాపై దయయుంచి యీ రహస్యంబును దేటతెల్లంబుగా దెలియునటుల దెల్పు'మని వేడగా, నా మాయా సాధుమూర్తి 'తల్లీ ! మీరు కొలది దినంబులలో సర్వతీర్థ యాత్రాభిలాషులై బయలుదేరెడి యోగం బున్నది. సర్వ తీర్థయాత్రలు సేవించుకొని తిరిగి మీరుయింటికి వచ్చు చున్న మార్గమధ్యంబున సరస్వతీ నదీతీరంబున గల యొక మునిపుంగవుండు మీ సత్వగుణాది విశేషంబులు గాంచి ఆయనచే బెంచబడుచున్న ప్రత్యక్ష భగవత్స్వరూపుండగు నబ్బాలు నొసంగును. ఆ బాలునివిషయంబులన్నియు యీ మునీంద్రుడే తెల్పుగాన త్వరలో తీర్థయాత్రాన్వేషణమునకై బయలుదేరుడు. నా మాట సత్యము, సత్యము, సత్యమ'ని ముమ్మారు చెప్పి యీ కపట వేషధారియైన సాధుమూర్తి అదృశ్యుండయెను.

అంతలో వీరభోజయాచార్యస్వామి గృహంబులోని కరుదెంచినవెంటనే వీరపాపమాంబసంతోషస్వాంతయై తన పతిపాదంబులకు నమస్కారంబుచేసి భర్తకు నొక పీఠంబు



వీరభోజయాచార్యులు వీరపాపమాంబ సంతానము కొరకై శివపార్వతుల నారాధించుట.

వైచి ఆయన కూర్చుండిన వెంటనే భర్తపాదంబులకడ ఆ యమ్మ చేరి "నాథా! ఇంతకు ముందే యెవరో ఒక మహాత్ముండు మనగృహంబునకరుదెంచి మత్పూజనంబుల నంది కృపాంతరంగిత హృదయుండై నన్నుద్దేశించి 'అమ్మా! నీ పూర్వపుణ్య సుకృతవశంబున నీకుకొంతకాలంబునకు దైవస్వరూపుండును, బ్రహ్మజ్ఞానియునగునుపుత్రుండొక మునీంద్రుని వలన లభించును. గాన మీరు వెంటనే సర్వతీర్థ యాత్రలు సేవించుటకై త్వరలో బయలుదేరి వెళ్ళ'దని చెప్పి, 'శీఘ్రమేవ సుపుత్రప్రాప్తిరస్తు' అని దీవించి అంతర్ధానుండయ్యెను కావున నమ్మహా పురుషుడానతిచ్చినటుల మనము తీర్థయాత్రాన్వేషణకై బయలుదేరుద"మని గడ్డంబు పట్టుకొని బ్రతిమిలాడగా, అంత నాస్వామి "దేవీ! నీ వెంత వెర్రిదానవు ? అన్యులు పల్కిన పలుకు లెల్లను కల్లగాక సత్యంబు లగునా ! ఒకవేళ మన కబ్బాలుండు లభించెనేని మన మిరువురము పాపవిముక్తులమై మోక్ష సామ్రాజ్య మనుభవింతుమా ! దారేషణ, ధనేషణ, పుత్రేషణ యీ మూడాశలు మొదలంట వదలివేయ వలయునని వేదంబులు ఘోషింపుచుండగా, బిడ్డ బిడ్డ యను మమత నీ కేల? యోబేలా? నీకు పుత్రుండు లభించుననుమాట ముమ్మాటికి కల్ల"యని ఖండితంబుగాజెప్పినంత నద్దేవి"స్వామీ! అమ్మహాత్ముని యాశీర్వచనం ప్రకారముమనకుపుత్రుండు తప్పక లభించును. నా మనవి విను"మని వేడుకొనగా, నంతట వీరభోజయాచార్యులు "కాంతా ! ఋధి వరకు నాతో బనువడి

యుండియు నావలెనాముష్మిక ఫలంబునందిచ్చనిడక,తుచ్ఛం బను గర్హితంబునునగు నీ యైహిక ఫలము నుద్దేశించుట వెంగిలితనమును సూచించుచున్నది కాదా! కాన నీవిక మీద నిట్టిదురాపేక్షల దొరంగి పరమేశ్వరోపాసనయం దిచ్ఛగల దానవై యుండు"మని చెప్పగా, ఆ యమ్మ దుఃఖంబున నాథుని పాదంబులొత్తుచు "స్వామీ! తమ పాదదాసినైన నా ప్రార్థన మాలింపుము. మనకావార్ధక్యమువచ్చినది నేను నా మనంబున నవ్విరాట్పురుషునే నాకు బుత్రుండవై పుట్టి మమ్ముద్ధరింపు మని అన్ని వేళల బ్రార్థించుచుంటిని. అప్ప రమేశ్వరున కిప్పటికి మనపై పరిపూర్ణ కృపాకటాక్షంబుగల్గి యొక సాధురూపంబున నరుదెంచిచెప్పెనని నామనంబునకు గట్టిగా దోచుచున్నది ప్రాణపతీ! తమ రన్యథాతలంపకుడు. ఆ సాధుమూర్తి యరుదెంచినదిమొదలు నా యెడమ నేత్రం బదురుచున్నది. నాశరీరంబంతయు బెండువలెనున్నది. నా కెంతయో సంతోషంబుగా నున్నది నాప్రార్థన యాలింపు" మని యెన్నో విధంబుల బ్రతిమిలాడగా అంత నా స్వామి మనంబున నిట్లని తలంచెను. 'స్త్రీలు పట్టిన పట్టు వదలరు. ఎట్లయినను సర్వతీర్థంబులను సేవించుటయుకూడా శ్రేయోదాయకంబే'యని తన మనంబున దలంచి "కాంతా! నీ ఈప్సితప్రకారమే శుభదినంబున బయలుదేరి సర్వ తీర్థ యాత్రలను సేవించుకొని అందుండుమహాత్ముల దర్శింత" మని చెప్పగా నామహాభాగేయి యమిత సంతోషస్వాంతయై, శుభదినం బెప్పుడు తటస్థించునాయని యెదురు చూచుచు, నవ్విధాద్విశ్వకర్మ ప్రభువును ప్రార్థించుచుండెను.

* కొందరు స్త్రీలు పాపాఘ్ని మరంబునంగల సమాధి చుట్టు
పుత్ర సంతానమునకై వరబడుట ం

మరుసటిదినంబున పుత్రసంతానరహితులగు కొందరు స్త్రీలు పాపాఘ్ని మరంబున కరుదెంచి అమ్మఠంబునం గల సమాధిచుట్టును వరపడి కొంతసేపటికి లేచి యాస్త్రీ లిట్లేక దీక్షతో ప్రార్థించిరి. 'స్వామి! అచలస్వరూపా! శ్రీ విరాడ్వి శ్వకర్మస్వరూపా! సచ్చిదానందస్వరూపా! పుత్ర సంతాన రహితుల మగు మాకు తమ మహాత్మ్యంబుచే సంతానంబు గలుగునేని మేము దంపతీసమేతముగావచ్చి మాశరీరంబుల పైనిగల భూషణంబులను నిలువుదోపుగా నిచ్చి మాకు గలిగిన బిడ్డలను తమ దాసులగునట్లు చేసెద'మని వారు వారు పలుకుచుండిన యప్పలుకులు ఆ సమాధికడనున్న వీరభోజ యాచార్య స్వాములవారు విని తన మనంబునకు వింతగా దోచి 'ఆహా! జనులుబిడ్డలకొరకు ఎంత శ్రమపడుచున్నా రలు! పరికింప వైహిక ఫలమే ప్రపంచలబున గొప్పగా గాన్పించుచున్నది. కనుకనే కాబోలు! నా పత్ని సహితము పుత్రసంతానాభిలాషియై నాతోనంతవితర్కించె. క్షణభంగురంబును తుచ్ఛంబును నగు మూత్రపురీషాన్విత కళేబరం బనిత్యమనితలంచి యీయేహ్యంబగు పుత్ర సంతానంబునకు కాంక్షించిరి. ఇట్టి దురాశ నా ధర్మపత్నిని బాయుటెట్లు ? ఓ దైవమా! మోహాంధకార మనెడుగుహాలో జిక్కియుండిన నా సతి యే తీరున నీ పదాంభోరుహముల జెందును? పుత్ర సంతానాభిలాషియైన నా భార్యకు నీపై సంగర్తవ్యము కృప

చేసి కడతేర్పు'మని పెక్కు విధంబుల పరమేశ్వరుని గొనియాడి, ఔరౌరా! ఇదియేమియబ్బురము. పుత్రుడను వెంగలి వ్యాసంగమేగదా ? ఇట్టి సంతాన ప్రాప్తివలన నా భార్య యేమిఫలము నందబోవుచున్నది? బిడ్డ పుట్టుట పెరుగుట గిట్టుట దుఃఖజనకంబేగాని సంతసంబు నీయదుకదా!అజ్ఞానులపేక్షించి అనిత్యపదార్థమునుసుజ్ఞానులుమెత్తురా ? నిప్పును ఎవరైనను ప్రీతితో దాచుదురా? సూకరంబుతో సహవసించు గోవత్సంబును హేయంబగును. బూతిని గంధంబులోబోయు పగిది కేవల పామరులనుజూచి వైరాగ్యంబును వదలి "వడ్డి కాశపడి మొదలును బోగొట్టుకొనిన బేలయుం"బోలె పుత్ర వాంచనే నేకాగ్రంబున నున్న మనంబునకు చలనంబు కలిగిన'దనికొంతసేపు తన మనంబునవితర్కించుకొని గృహంబులోని కరిగి స్నాన సంధ్యాద్యనుష్ఠానంబులు దీర్చుకొని మనంబును ఏకాగ్రంబున జేర్చి పరుండెను.

పరమేశ్వరుండు సాధురూపంబున వీరభోజయాచార్యస్వామి కడ కరుదెంచుట.

శ్రీ వీరభోజయాచార్య స్వాములవారు తెల్లవారగనే లేచి నిత్యనైమిత్తికాదికృత్యంబులందీర్చుకొని మఠంబునం గల సమాధిని పూజించుటకై ఏగగా, నచ్చట యాజానుబాహుండునువికసిత పద్మపత్రనేత్రుండును, సుందరాకారుండును కాషాయాంబరధారియునైనయొక సాధుమూర్తిసమాధి వద్దకూర్చొనియుండెను. ఆసాధుపుంగవునిజూడగనే వీరభోజ

యాచార్య స్వామికి ఒక విధంబుగా మనంబు మారి యా సాధువునకు నమస్కారము చేసి యా సాధు సమీపంబున గూర్చుండెను. అంత నా సాధుమూర్తి "అయ్యా! ఇంతను నీకు సర్వతీర్థ యాత్రాభిలాష గలుగలేదా ? దుస్తరంబగు కార్యంబు సాధ్యంబగు, సాధ్యంబయ్యెడి కార్యంబు దుస్తరంబగును. కాన నీ మనంబునం దన్యథా దలంచక త్వరలో ప్రయాణంబు గావింపుము. ఈతీర్థ యాత్రాన్వేషణలో మీకు నొక విలువకట్టలేని మాణిక్యంబులభింపనున్నది, లభించును. మదీయ వచనానుసారంబుగా మీ జన్మంబులు సార్థకంబు లగును. ఇక నాలసింపకుడు. నీ ధర్మపత్నియైన మహాపతి వ్రతా శిరోరత్నంబగు 'వీరపాపమాంబ' భక్తి ఎంతయో కొనియాడ తగినది. ఆయమ్మ ఈప్సితంబు త్వరలో సిద్ధించును గాన బయలుదేరుడు. నా మాట సత్యము, సత్య"మని చెప్పి యంతర్ధానుండయ్యెను. అంత వీరభోజయాచార్య స్వామికి ఆశ్చర్యంబుగాదోచి "యా సర్వేశ్వరుండే సాధు రూపంబున నరుదెంచి నాకుహితబోధ చేసివెళ్ళెను పర మేశ్వరా ! నేనెంత పాపిని? తమ మహాత్మ్యంబు దెలియక సామాన్యమానవుండనిదలంచితినే స్వామీ! వృథా ప్రపంగ మైన నా నోటితో మాట్లాడక నీవు చెప్పుచున్న విషయంబు లన్నియు వినుచువెఱ్ఱివానివలెనీవైపుజూచుచు నూరకుంటినే నేనెంత దురదృష్టుండను ? చేతికి దొరికిన పెన్నిధానమును కాలితో దన్నికొనిపిదప ప్రలాపించు వెఱ్ఱివానివిధంబైతినే ! సచ్చిదానంద స్వరూపా! సర్వేశా!"యని యనేక విధంబుల మనంబున వితర్కించుకొనిదుఃఖించి కొంతవడికి దుఃఖంబు

నాపి ధైర్యం బవలంబించి నా భార్యకును ప్రత్యక్షంబైన సాధు భగవాను డీయనయే గావచ్చును. పుత్ర సంతానంబు కొరకు ప్రలాపించుచున్న నా భార్యకు దుఃఖోపశమనంబు జేసిన సకల సద్గుణ ధర్మ్యం డీ మహాభాగేయుండే గాని వేరెవరును గారని తలంచి 'కాగల కార్యంబులు గాకపోవు, కరుణామయుండగు నాభగవానునిదివ్యానుగ్రహమెట్లుండునో యట్లే జరుగు'నని గృహములోని కేగి భార్యయైన వీరపాప మాంబతో జరిగిన విషయంబులన్నియు జెప్పి శుభదినంబున సర్వతీర్థ యాత్రాన్వేషణకై దంపతు లిరువురును బయలు దేరిరి.

—*బ్రహ్మాండపుర వాసుడైన "పరిపూర్ణయాచార్యులు" ఈయనధర్మపత్ని యైన "ప్రకృతాంబ"యు పుత్రసంతానంబు వడయ కాశీపురి కేగుట—*

—*అంతర్బాహ్యార్థములు*—


ఈ లోకంబున సకల జీవకోటుల కునికిపట్టయి, స్థావర జంగమాదులకు నాటుపట్టయి యున్న బ్రహ్మాండపురం బను మహాపట్టణంబున శ్రీమద్విరాడ్విశ్వకర్మ వంశ పయఃపారావార రాకాసుధాకరుండును, పంది వేదాంత క్లినుండును, ప్రణవ పంచాక్షర భావుండును, పరిశుద్ధుండును, ప్రకృతి ద్వయ దోషరహితుండును, పరమార్థయిక్య భావుండును, పరమ గురుండు నైన బరిపూర్ణాచార్య స్వాములనెడు విశ్వబ్రాహ్మణుండు గలడు. ఆ మహాత్ము డతని కర్థాంగిగ పంచ గుణాత్మికయైన 'ప్రకృతాంబ'యనెడు పరమపావనినిసంకల్ప మాత్రంబున పరిణయంబాడి జలజపత్రంబునకు జలం బంటు

నట్లును, జిహ్వకు ఘృతఱుఖంటునట్లును ప్రణవ స్వరూపుండై ప్రపంచంబున మాయామేయ విలఱుఖుండై యుండెను. అట్లుండ కొంతకాలంబునకు ప్రకృతాంబ మహాదేవికి 'సృష్టి' యనెడు సంతానంబుపై యిచ్ఛగలిగి, ప్రకృతాంబ మనంబున నిట్లాలోచించుకొనెను. కాశీపుర పట్టణంబుజేరి అందుండు సాక్షాత్ శ్రీమద్విరాడ్విశ్వకర్మ స్వరూపుండైన 'విశ్వనాథుని' పూజించిన సంతానంబు కలుగుననిఆయమ్మతలంచి యొక దినంబున భర్తయైన పరిపూర్ణాచార్య స్వామికి నమస్కరించి 'నాథా! నాకు పుత్రసంతానంబుపై ప్రేమ జనించుచున్నది. మన మిరువురము కాశీవిశ్వనాథుని సేవించిన యమ్మూర్తి దివ్యానుగ్రహంబుచేనైన సంతానంబు గలుగునని తోచుచున్నది. కాన నాయందు పరిపూర్ణానుగ్రహముంచి కాశీపురి కేగుద'మనివేడగా అంత పరిపూర్ణాచార్యస్వామియు నట్లే యేగుదమని చెప్పి యొక శుభదినంబున దంపతు లిరువురును బయలుదేరి యచ్చటచ్చట గల పుణ్యక్షేత్రంబులను దిలకించుచు యెట్టకేలకు కాశికాపట్టణంబు జేరిరి. మరునాటి యుదయంబున నిరువురును లేచి నిత్యనైమిత్తికాది కృత్యంబుల దీర్చుకొని గంగయందు స్నానం బాచరించి శ్రీ విశ్వనాథుని కడకరిగి పూజించిరి. ప్రకృతాంబ మనంబున నిట్లని ప్రార్థించెను. 'శ్రీమద్విరాడ్విశ్వకర్మరూపా సచ్చిదానంద మూర్తీ! సర్వేశ్వరా, త్రినేత్రకా భస్మధారణా పాప విభంజనా, భక్తజన హృదయ, సరోపరవిహారణ రాజహంసమా! నా ప్రార్థనా మాలింపుము. స్వామీ! మేము నిన్ను సర్వదా సేవించి పుత్ర సంతానంబువడయు తలంపున తమ దరిజేరి

నాము. తండ్రీ! నీవే నాదు గర్భంబున జన్మించి నిఖిల ప్రపంచంబు నుద్ధరించుము. నిన్ననేక విధంబున నుతి యొనర్చుచున్నదానను.' ఇట్లే ప్రతిదినంబును విశ్వేశ్వరాలయంబున కరుగుచు పూజించుచు ప్రార్థించుచుండిరి.

....కాశీవిశ్వనాధుడు ప్రకృతాంబకు స్వప్నంబున గాన్పించి నేనే నీకు
పుత్రుండనై జన్మించుచునని చెప్పుట, పరిపూర్ణాచార్య ప్రకృతాగట
ఇరువురును శివజీవైక్య సిద్ధిని బొందుట, జన్మించిన బాలుని
అత్రి మునీంద్రుడు పెంచుట ....

ఈ ప్రపంచోద్ధారణకై భగవానుడయిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి జన్మించుటకు ముందుగా తూర్పు దిగ్భాగంబున నొక గొప్ప నక్షత్రంబు పుట్టెను. ఆ నక్షత్రమును చూచి ప్రపంచంబున నెవ్వియో యుత్పాతంబులు పుట్టనున్నవని జనులు భీతిజెండిరిగాని భక్తులైన వారెల్లరు ప్రపంచోద్ధరణకై యొక మహాపురుషం డుద్భవించుసని రేయింబవళ్ళు పరమేశ్వరు నారాధించుచుండిరి. ఇట్లుండ నొక నాటి రాత్రి పరమేశ్వరుడు ప్రకృతాంబ స్వప్నంబున గాన్పించి 'ఓ పుణ్యవతీ! నేను నీ గర్భంబున జన్మించెదను. గాని నీకు నవమాసాంతంబున నేను భూపతనంబు కాగానే నీ భర్త ప్రపంచంబునువీడు'నని చెప్పినటుల స్వప్నంబాయెను. అంత నాయమ్మ వెంటనే మేల్కాంచి స్వప్న విషయం బంతయు భర్తయైన పరిపూర్ణాచార్యస్వామికి జెప్పగా అంత నామహానీయుండు చిరునవ్వుతో 'ఓసీ! వెఱ్ఱిదానా! నేను ఎన్నటికిని



కాశీ విశ్వనాథుండు [illegible]

చచ్చువాడనుగాను, పుట్టువాడనుగాను, నేనుపిపీలికాదిబ్రహ్మ పర్యంతంబును, తృణము మొదలు మేరువు వరకును నిండి నిబిడీకృతుండనై సూదిమోపసందు లేకయున్న అచలస్వరూపుండును. సర్వకాలసర్వావస్థలయందును అంతట నేనై యుండువాడనేగాని పరబ్రహ్మనైన నేనుగిట్టువాడనుగాను. నీవా! ప్రకృతి సంబంధమైన పుత్రవాంఛకు లోబడి పరితపించుచుంటివి. నేనా! ప్రకృతిపైన నీకు విలక్షణుండను. ఎవ్వడైతే విలక్షణస్వరూపుండో వాడే నీ గర్భంబున బుట్టినున్న నే నున్నట్లేగదా! పిచ్చిదానా! బాగుగా నాలోచించుకొనుము. ఇయ్యది పరమార్థము. ఇవ్విషయంబు నందరు గ్రహింపజాలరు. నన్నెఱింగినవారలే గ్రహింతురు. కాని ఏమెరుంగని తెల్లు లెరుంగజాలరు. ఇక నీయీప్సితంబు నెరవేరినదిగదా!' యని నాయమ్మ మనంబును స్థిరబఱచి సంతోషస్వాంతంబున స్వామిని సేవించుచు ఆ కాశీపురియందే యుండిరి. ఇట్లుండ నొకనాటి రాత్రి ప్రకృతాంబ భోజనానంతర మొకగదియందు పరుండియుండగా నాగదియంతయు నాకస్మికంబుగా పట్టపగలాయన్నట్లు వెల్తురాయెను. అంత నామెకు నాశ్చర్యంబు దోచి 'ఇది యేమి వింత ! ఇచ్చట వెల్తురొసంగు దీపము లెవ్వియులేవే! కటిక చీకటిగానున్న నీగదియందింత వెల్తురెచటనుండి వచ్చిన' దని అట్లే కన్నులు తెరచుకొని ఆలోచనచేసికొనుచు పరుండియుండగా నావెలుగంతయు తగ్గి తగ్గి ఒక బండి చక్రమంతగా గాన్పించెను. తిరిగి ఇంకా తగ్గెను కొంత సేపటికి పౌర్ణమినాటి చందురునంతటి దాయెను. అంత నాయమ్మ కేదియో మైకముగా

నుండెను. ఆ వెలుగు తగ్గి తగ్గి ఆయమ్మ పైకివచ్చి ఆమె యందే లీనంబాయెను. అంత నామె కేమియు తెలియక నిద్రించెను. తెల్లవారి యుదయంబుననే మేల్కాంచి భర్త యైన పరిపూర్ణాచార్య స్వామికి చిరునగవుతో నీ విషయంబం తయు జెప్పెను. అంత నమ్మహాదేవి గర్భవతి మాయెను. గాని తన కేమియు నారుమాసంబుల వరకు గర్భవతినై తినని యామెకు తెలియకుండెను. ఆ యమ్మకు నవమాసములు పూర్తియగు వరకును కాశీపురియందే ఉండి నవమమాసాంత రమున తమ స్వగ్రామంబైన బ్రహ్మాండపురము చేరవలెనని ఇరువురును నటనుండి బయలుదేరి వచ్చుచుండగా నద్దేవికి ప్రసూతి చిహ్నంబు లేర్పడి సరస్వతీ నదీతీరంబునకు వచ్చు నరికి పరిపూర్ణ రాకాశశాంకుని ధిక్కరించెడి మోము గల వాడును, ఆజాను బాహుండును, అపర శివావతారుడైనఅవ్వి రాడ్విశ్వబ్రహ్మ జన్మించెను. ప్రకృతాంబ ప్రసవించిన మరు క్షణంబుననే పరిపూర్ణాచార్య స్వాములవారి ప్రకృతిని వదలి శివజీవైక్య సమాధి నిష్ఠాగరిష్ఠత్వంబుననుండి ప్రపంచంబును వీడిరి. అంత నాదేవి స్వప్నంబున గాన్పించిన యప్పరమేశ్వ రుండు చెప్పినటులనే భర్తసమాధి నిష్ఠనుండెగదా! ఈమహా భాగేయుండు లేని ఈ జన్మంబేటికి? నేనును అమ్మహాత్ముని వలెనే ప్రపంచంబును వీడుదునని తలంచి సాహసించియు లేక లేక గల్గిన పుత్రుండు నిరాదరణుండై పోవునని తలంచి పుత్రుని ముందర బెట్టుకొని మాయమేయియైన ప్రకృతాంబ దుఃఖాంబుధిని మునింగియుండగా అంతలో అత్రినామాంకిత

మునీంద్రుడు స్నానం బాచరించుటకై సరస్వతీ నదీతీరంబు నకు రాగా, ప్రకృతాంబ దుఃఖం బామునీంద్రునకు వినంబడ అయమ్మకడ కరుదెంచి, 'అమ్మా! నీ విట్లు దుఃఖించుటకు కారణం బెయ్యది? ఈ మహాభాగేయుండిట్లు సమాధినిష్ఠను బొందుటకు కారణం బెయ్యది తెల్పుము

నీ కుద్భవించిన యీ శిశువును జూడ నేదియోఅవతార మూర్తివలె గన్పట్టుచున్నవాడు యీ బిడ్డడు జగదుద్ధరణకై అవతరించిన అవతారమూర్తివలె నున్నాడుగాని లేకున్న ఈ బిడ్డని కీ రూపురేఖావమోవిలాసంబులెందుకుండు? ఇబ్బాలుని ముఖంబున షోడశకళ లుట్టిఁడుచున్నవి. యీ మహనీయుం డుద్భవించుటకే కాబోలు తూర్పుదిశన మితిమీరిన యొక గొప్ప నక్షత్రం బుదయించినది. పామరులందరు ప్రపంచ మునకు యేమికీడు మూడనున్నదో? లేకున్న ఇంత విపరీత మైన గొప్పనక్షత్రం బెందుల కుద్భవించునని భీతావహులై యుండిరి. భళిరే! నీ పసిపాపం దిలకించినప్పటి నుండియు నామనంబున నేదియో అమిత సంతోష ముప్పొంగుచున్నది. నా కుడినేత్రంబదురుచున్నది నాశరీరమంతయు బెందువలె నైన'దని యిట్లెన్నియో విషయంబులను అత్రిమునీంద్రుడు మనంబున దలంచుచు ప్రకృతాంబతో మాట్లాడకయబ్బాలుని ముఖంబును జూచుచు జేతులు జోడించుకొనిఅట్లే కూర్చుని యుండగా ప్రకృతాంబదుఃఖమునకు మేరగానక పొంగిపొంగి ఏడ్చుచు 'తండ్రీ! నా చరిత్ర యంతయుజెప్పెద వినుమ'ని పుత్రుని తనహస్తంబుల నుంచుకొనియిట్లుచెప్పెను. "మేము

విశ్వకర్మవంశజులమైన దేవబ్రాహ్మణులము. మానివాసంబు బ్రహ్మాండపుర ఎ వీనితండ్రియైన ఈమహాసీయునినామంబు పరిపూర్ణాచార్యులు. దీనుఠా-ళైగ నా నామంబు ప్రకృతాంబ యందురు. పుత్ర సంతానంబులేక కాశికా పట్టణంబుకేగి శ్రీ మద్విరాడ్విశ్వ బ్రహ్మస్వయాపుడగు విశ్వనాథు నారాధించగా నిబ్బాలుడు గలిగెను ఏతం దుద్భవించిన మరుక్షణంబుననే వీని తండ్రియైన ఈ మహాభాగేయుం డీ ప్రపంచ వాంఛను విడిచి శివజీవైక్య సిద్ధిని బొందె భర్తలేని నేనును నా భర్తవలె శివజీవైక్య సంధానంబున నుండి యీప్రపంచంబున వీడ దలంచితినిగాని, లేక లేక గల్గిన ఈ బాలుని నొంటరిగా విడచుటకు మనంబొప్పక పరితపించు చుంటిని. ఇబ్బాలుని పాటి పరమశివునివలె నడిదెంచితిరి. ఇబ్బాలుని రక్షించు భారము మీయదే'యని తనచేతులలోనున్న బాలుని అత్రిమునీంద్రుని చేతులలో బెట్టి 'తండ్రీ! ఇబ్బాలుని పోషించు భారము నీయదే'యని చెప్పి, అచటనున్న తన భర్తకడనే పద్మాసనంబు వేసికొని మనో మారుతంబుల రెంటిని నేకంబుచేసి షడాధారంబులను తిన్నగా భేదించుకొని సహస్రారంబున జేర్చి శివజీవైక్యసంధానంబు నొందె. అంత నా మునీంద్రుండు నగ్గటనే దంపతుల నిద్దరను ఏకసమాధియందుంచి సమాధిచేయించెను అత్రిమునీంద్రుం డబ్బాలుని యెత్తుకొని తన ఆశ్రమంబునకు జేర్చి క్షీరాదులచే బెంచుచుండెను. అబ్బాలునకు "వీరంభొట్లయ్య" యనినామకరణంబును జేసెను

(పాఠక మహాశయులారా! ఇబ్బాలుం డెవడని దలంచెదరో? ప్రపంచంబునగల పామరులను పావనులుగా జేయ నవతరించిన శ్రీ మద్విరాట్పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామియే సుమా!)

—నందికొండ పాపాగ్ని మరాద్యశుండైన యనమదల వీరభోజయాచార్యులును, ఆయన ధర్మపత్నియును పుత్రసంతానంబు వడయ పుణ్యక్షేత్రంబుల కరుగుట—

శ్రీ వీరభోజయాచార్య స్వాములవారు కపట వేషధారియైన యా సాధుపుంగవుని యాజ్ఞప్రకారమే శుభదినంబున సర్వక్షేత్రాన్వేషణకై భార్యా సమేతముగా నందికొండ నుండి బయలుదేరి సర్వకాలసర్వావస్థలయందును సదాసర్వేశ్వరుండే మాకు పుత్రుండుగ పుట్టవలెనని యనేక విధంబులుగా నప్పరమేశ్వరుని ధ్యానించుచు కాశి, గయ, ప్రయాగలాదిగా గల పుణ్య క్షేత్రంబులన్నియు దిరుగుచు నా యా క్షేత్రంబులంగల సాధుమూర్తులను సేవించుచు, పుణ్యనదుల స్నానంబు లాచరించుచు, నా యా క్షేత్రంబు లందుండెడి సాధుమూర్తులను దర్శించుచు సరస్వతీ నదీ తీరంబునకు జేరిరి. అటనున్న యాశ్రమంబున అత్రి యనెడు ఋషిపుంగవుడు శిష్యులతో నుండెను ఆయత్రినామాంకిత మునీంద్రుడు కూర్చుండుమని యాజ్ఞాపించి "అయ్యా మీ నివాసం బెద్ది ? మీ నామం బెయ్యది ? మీ కులం బెయ్యది ? ఇచటికి రాగతంబేమి? మీరే సంకల్పంబున నిట్లు తిరుగు చున్నార"

లని యడుగగా నంత వారిట్లనిరి. "స్వామి ! మేము దక్షిణ దేశవాసులము. మేము విశ్వబ్రాహ్మణులము. నేను నంది కొండ పాపాగ్ని మఠాధ్యక్షుడను నాపేరు యనమదల వీర భోజయాచార్యులందురు. తండ్రీ ! మేము పుత్రసంతానంబు లేనివారమగుటచే మేమూ పాపాగ్నిమఠంబును వదలి పుణ్య క్షేత్రంబులలో దిరుగుచు, సాధుమూర్తులైన తమవంటి సత్పు రుషుల సేవించుకొనుచు దేశ దేశంబులన్నియు దిరిగి సూర్యాస్తమానం బగుటచే తమ యాశ్రమంబున నీ రాత్రి యుండి ఉదయంబున లేచి మరియొక క్షేత్రంబున కేగు వారము గాన నీ రాత్రి కిటనుండ యాజ్ఞనీయు"దని వేడు కొనగా, నాయత్రిమునీంద్రుండు నట్లె యుండుడని యాజ్ఞ నియ్యగా నా యాశ్రమంబున నుండిరి.

— అత్రినామాంకిత మునీంద్రుని పేరెంచబడుచున్న శ్రీమన్నారాయణాంశ సంభూతుండైన వీరంభొట్లయ్యను వీరభోజయాచార్యులకు బెంచుకొనమని యొసంగుట, అబ్బాయిని మహాత్ములు కొన్ని చెప్పుట —

అంత నారాత్రి దంపతులిరువురును భోజనానంతరము నా యత్రి మునీంద్రుని కడ కరుదెంచి నమస్కారంబుసేయ "శీఘ్రమేవ సుపుత్రప్రాప్తిరస్తు" అని వారిరువురును దీవించి కూర్చుండుడనియాజ్ఞనొసంగినంత వారిరువురను గూర్చుండి 'స్వామీ! తెల్లవారుదయముననే మేమేగుదము. సెలవొసం గు'డని వేడ నా యత్రి మునీంద్రుడు 'బిడ్డలారా! మీ రిరువు రునుసుజ్ఞానవంతులవలెగాన్పించుచున్నవారలు.నాయాశ్రమం బున నింకను కొన్నిదినంబులుండుడు. మీకుకొంలది దినంబుల



అత్రి మహర్షి పెంచుచున్న వీరంభొట్లయ్యను
వీరభోజయ్య భార్యలకు పెంచుకొనమని
యొసంగుట

లోనే 'సుపుత్రప్రాప్తి' గలుగనున్నది. నేను జెప్పునంతవరకు; నా యాశ్రమంబుననే యుండు'డని చెప్పగా నా దంపత లిరువురును నా యత్రికి సపర్యలుచేయుచు ఆయనచే ననేక యోగరహస్యంబులు గ్రహించుచు నట్లే కొన్ని దినంబు లుండిరి. వీరిరువురును ఆత్మజ్ఞానం బెరింగిన వారలగుటచేనా మునీంద్రుని బోధలన్నిటి నతి సులువుగా గ్రహించుచుండిరి. వారిరువురి బుద్ధిబలమునకు నామునీంద్రుడు సంతసించియొక దినంబున 'బిడ్డలారా! మీ రిచట కరుదెంచి యారుమాసంబు లైనది. ఇక మీ గృహంబున కేగవచ్చు'నని చెప్పగా నంత వారిరువురును ప్రయాణులై బయలుదేరి యత్రికడ కరుదెంచి 'స్వామీ! సెలవా?' యని వేడుకొనగా నామ్ముత్రిముని, కొంచె మిట నిలువుండుడని చెప్పి యాశ్రమంబులోనికేగి తనచే బెంచబడుచున్న భగవత్స్వరూపుండైన బాలుని యెత్తుకొని ముద్దాడి వారిరువురి చేతులలో బెట్టెను అబ్బాలుని జూడగనే యా దంపతుల సంతోషంబునకు మేరదప్పి పేదకు పెన్నిధి లభించినట్లుండిరి. అంత నా వీరపాపమాంబ యబ్బాలుని ముద్దాడి కన్నుల కద్దుకొని సంతోష సాగరంబున మునుం గుచు 'స్వామీ! తాము తాపసులై యుండ యిబ్బాలకుండెట్లు మీకు లభించినా'డని యడిగినంత నా యత్రి మునీంద్రుడు 'తల్లీ! స్నానం బాచరించు కొనుటకై సరస్వతీ నదీతీరంబున కేగ, నచ్చట యిబ్బాలు నెత్తుకొని యమితముగా దుఃఖిం చుచు దిక్కులు పరికించుచు నొక స్త్రీనిలువంబడియుండెను ఆమె యెందులకై ఒంటరిగా నటనున్నచో అట్లు దుఃఖించు

టకు గారణంబేమో అరయుటకై ఆమెకడకు నే బోవగా, నా యమ్మ నన్ను జూచి 'తండ్రీ! నేనీ బిడ్డను పోషించు కొను నుపాయంబు దోచక యిట్లు దుఃఖించుచున్నదానను. నాకు పరమేశ్వరునివలె ప్రసన్నమైతిరి. నేనును, నా భర్తయు పుత్రుల లేమిచే కాశీక్షేత్రంబునకేగి అట కొన్ని దినములుండిన పిదప నాకు గర్భచిహ్నము లేర్పడినవి. అంత మేమిరువురము స్వగ్రామమున కేగుటకై యీ మార్గమున వచ్చుచుండగా నీ బాలుండిట జన్మించెను ఈతండు జన్మించిన మరుక్షణంబుననే వీని తండ్రియైన నా భర్త శివజీవైక్యసిద్ధిని బొందె పతివియోగ దుఃఖమునకుసహించలేక నేను నట్లేచేయసాహసించితినిగాని లేక లేక గల్గిన యీ పసిబిడ్డను చేజేతుల నెట్లు చంపుదునా యని దుఃఖించుచు, ఈ బిడ్డను పోషించెడి వార లెవ్వరాయని దిక్కులు పరికించుచుండ కేవలపరమశివమూర్తివలె నరుదెంచితిరి బ్రహ్మాండపురంబు మా నివాసగ్రామము. వీరి తండ్రి పేరు పరిపూర్ణాచార్యులు, నా పేరు ప్రకృతాంబ మేము విశ్వబ్రాహ్మణులము. ఇబ్బాలుని రక్షించు భారంబు నీదేయని చెప్పుచు తన చేతులలో నున్న బాలుని నా చేతులలోబెట్టి తన భర్త ప్రక్కన గూర్చుండి భర్తవలె నామెయు శివజీవైక్య సిద్ధిని బొందెను అంత నా యిరువుర నొకే సమాధియందుంచి సమాధి జేయించితిని ఇబ్బాలునిటకుదెచ్చి యారుమాసములైనది కాని ఈ మహాభాగేయుని విషయంబుమీతో జెప్పకయె మీరిటకు వచ్చుటకు ముందు ఆరు మాసంబుల నుండి

యిప్పటి వరకును గోక్షీరంబుచే బెంచుచుంటిని, యీతండు జగదుద్ధరణార్థమై అవతరించిన జగదేకవీరుండుగాని సామాన్య మానవుండని తలంపకుడు ఈయన ముఖంబున భగవత్కళ లుట్టిపడుచున్నవి. ఈ మహాభాగేయుని శరీరంబుపై ఈగ కాని, దోమకానీ, చీమకాని వాలదు. ఎండలో నిలువంబెట్టిన బాలునికి ప్రతి ఛాయ (నీడ) యుండదు. ఒకదినం బున ఎండలోనిబ్బాలుని గూర్చుండబెట్టగా నాగసర్పం బొక్కటి వచ్చి యిబ్బాలునకు నెండ తగులకుండా తన పడగనువిప్పి పట్టెను. ఈ చిన్నతనంబుననే యిట్టి మహత్తు లనేకంబులు చూపెట్టెను ఇకముందు ఎట్టి మహామహిమంబులచే విరాజి ల్లునో మీరతేయాలోచించుకొనుడు. ఇమ్మహాత్ముని వల్లనే మీ వంశంబును, సర్వప్రపంచమును పవిత్రము కాగలదు. మీరు కడుజాగరూకులై యిబ్బాలుని దూషణాది బాషణంబు లెప్పటికిని బలుకక బహు భయభక్తులచే బెంచుకొను"డని చెప్పగానంత వీరభోజయాచార్యులును, వీరపాపమాంబయు వీరిరువురును అత్రిమునీంద్రునకు నమస్కారంబు చేసి, అబ్బాలు నెత్తుకొని సెలవుగైకొని యటనుండి బయలు దేరి తమ నివాస గ్రామంబైన నందికొండకుజేరి పాపాగ్నిమఠం బున గల తమ గృహంబున ప్రవేశించి యమ్మరంబునం గల తమ భక్తాదులచేతను మిత్రబాంధవాదులచేతను గౌరవపూజ నంబులంది తామింటివద్దనుండి బయలుదేరి తిరిగి గృహమున కరుదెంచు వఱకును జరిగినవిషయాదులున్ను తీర్థయాత్రాదు లలో తాము వీక్షించిన మహామహిమాదులున్నూ తమచే

పెంచబడుచున్న బాలుండైన వీరంభొట్లయ్యవమకు లభించిన విషయంబులు భక్త జనమిత్ర బాంధవాదులకు బోధించగ సంతోషవారధి మునింగి యుండపు సుఖులై యుండిరి.

—॰ వీరంభొట్లయాచార్యస్వామి బాల్యము ॰—

శ్రీ వీరపాపమాంబకు సంతానంబు లేమిచే పేదవానికి లభించిన పెన్నిధి చందంబున ప్రేమచే నతి గారాబంబున భార్యాభర్త లిరువురు నతని బెంచుచుండిరి. అబ్బాలుండును దినదిన ప్రవర్ధమాన రాకా శశాంకుని భంగి పెద్దవాడగు చుండెను. ఇబ్బాలుఁడు సిసు తనంబు నుండియు పెద్దవారు నేర్పినట్లుగా పద్మాసనంబువేసి కనిపూర్చుండు ను ఎప్పుడును మౌనముగా నుండును. వీరంభొట్లయాచార్యస్వామికి సప్త వార్షికంబులు రాగానే పాఠశాలకనిపి సర్వవిద్యలునేర్పించిరి. పాఠశాల యందుండు బాలు రందరకన్నను పన్ని విద్యల యందును మిగుల జ్ఞానవంతుడాయెను. వీరంభొట్లయ్య పదు నాలుగు విద్యలయందు ఉత్తీర్ణుండాయెను.

అంతలో పెంపుడు తండ్రియైన యనమదల వీరభోజ యాచార్యులు జీవ బ్రహ్మైక్యసిద్ధిఁజెందిరి. అంత నా వీరపాప మాంబ భర్తృవియోగింబుచే గల్గిన దుఃఖంబునకు మేరగానక తానును ఈ లోకంబు విడిపోవవలెనని తలంచెను. కాని వీరం భొట్లయ్య యందుండెడి ప్రేమచే తాను దలంచిన కృత్యం బును వీడెను. అట్లే దుఃఖింపుచు భర్తకు పరలోక క్రియ లొనరించి, వీరంభొట్లయ్య యందు గల ప్రేమచే కాల

మంతయు పుత్రుని జూచుకొనుచు గడుపుచుండెను. ఆవీరం భొట్లయ్య అన్ని విద్యలయందు నుత్తీర్ణుండగుటచే విజ్ఞానవంతుడై వైరాగ్యంబున మనంబున గలిగిన దుఃఖంబునకుం గారణంబు సంసారంబని మదినెంచి దానిని వదలి ఆవరణ విక్షేపకారణంబులైన మాయావిద్యలను చిత్తంబునకు నంటనీక మౌనీంద్రుల వ్యాపారంబులబొంది సర్వ క్షేత్రంబులను సేవించవలెనను వైరాగ్యంబు గలిగి తల్లికడ కేగి ఇట్లు లనియె—

సర్వక్షేత్రంబులను దిలకించి వచ్చెదనని వీరంభొట్లయ్య తల్లితో జెప్పుట

"తల్లీ! దేశాటనము చేయుచు సర్వ పుణ్యక్షేత్రంబుల సేవించవలెననుసంకల్పంబు నామనంబునువ్విళ్ళూరుచున్నది. గాన సెలవొసంగి దీవించి పంపు"మనగా తల్లియైన వీరపాపమాంబ దుఃఖమునకు మేరలేక "బిడ్డా! వీరంభొట్లయ్యా! నీ తండ్రి దివికేగినను నిన్నుచూచి కాలంబు గడుపుచుంటినే! తండ్రీ నిన్ను బాసి క్షణమైనా నుండగలనా? నీవు లేని ఈ మరంబు నా కేల? ఈ సంపదలన్నియు నాకేల? బిడ్డా! తల్లిదండ్రులను గడతేర్చినపిమ్మట గదా నీయిూప్సితాను సారంబుగా నడుచుట. లోకంబున నేమియు నెరుంగని మూఢులు సైతము తల్లిదండ్రులు గురువు దైవంబని యెఱిగి పూజింతురే? అన్నియు నెరింగిన పుణ్యపురుషుండవైన నీవు తల్లినైన నన్ను వదలి పోవ న్యాయమా? నీకు వివాహంబు చేసిన నీ కయిన వంశాంకురంబు గలుగునని యెంతయో యాశతో నుంటినే! అయ్యో! తండ్రీ! నా యాశలన్నియు

వడుగంత ద్రొక్కి నన్నిట్లు ఏకాకినిచేసి నన్ను వీడి యేగ న్యాయమా ? లోకంబున నిట్లు పెంపుడు తెచ్చుకొనిన వార లెందరుండిరి? వారందరిట్లు తల్లి నివిడనాడి యేగుచుండిరా ? ఇట్టి న్యాయమెందైన గలదా? కుమారా ! నీమనంబున నీవే యాలోచించుకొనుము. ఇంత కొలది దినములలో నిన్నే మఠాధిపతిగా జేసి నీవుసింహాసనాసీనుండవై యుండుట నా కన్నులారా జూచి సంతోషింత మను నూహతో నుంటినే ! నా యూహలన్నియు నష్టేటుకలిపి నన్నుసన్యాసినిగా జేసిపో దలచితివే? బిడ్డా ! మఠంబుకడ కరుదెంచు భక్తాదుల మనో సంశయంబులన్నియుదీర్చి మర్యాదలు బొందు వా రెవరుం డిరి? ఇంక నీ మఠంబునకు ధర్మకర్తగా నిలచు వారెవరుం డిరి ? 'తానొకటి తలంచిన దైవమొకటి దలంచు' నను నార్యోక్తిగా నే తలంచిన తలంపు లన్నియు దగ్ధంబు జేసి తివే ? కుమారా! నిన్ను వెంటబెట్టుకొని శిష్య సంచారంబు లకై యేగి వారలచే గౌరవంబులందుద మను నా కోర్కె ఖూడిదయందుబోయు పన్నీరుచందమాయెనే? కన్నతండ్రీ! కనులెత్తియైనను చూడవేమిరా"యని అనేకవిధంబుల బ్రతిమ లాడుచు కన్నులవెంట నీరు గార నేడ్చుచున్న తల్లినిజూచి వీరంభొట్లయ్య నవ్వుచు నిట్టులనియె—

* వీరంభొట్లయ్య తల్లికి విరక్తి మార్గమును బోధించుట *

"తల్లీ! ఏమియు నెఱుంగని యజ్ఞానివలెసత్యంబెరిగిన సద్గుణ శాలివైన నీవే యిట్లుప్రాపంచిక భ్రాంతిని విడజాలక యిట్లు కుంగుచుండుటన్యాయమా? జననీ, ఈ అజ్ఞానంబును

పాలించుము. తనకును ఈ జన్మమందును బూర్వమందును పరమందును విచారించగా కర్మబంధము వలన కల్గిన తల్లి దండ్రులు, పుత్రులు, పుత్రికలు, భార్యలు, భర్తలు నెందరో గలరుగదా! వారందరును నీటిపైని గల్గినబుద్బుదము వంటి వారనియును, దేహములు నిత్యమైవేయనియును నెరుంగవలెను. ఇవి మాయచేబుట్టినను అజ్ఞానులైనమనుజులు శరీరము నిత్య మనియు, నీసంసారమే శాశ్వతమనియు మాయచేత కట్టుబడి శరీర సంబంధమైన దారాపుత్రాదులు చూచుచుండగనే మర ణించినను, అహంకార మమకారములచేత తమ సంబంధు లైన పుత్ర పుత్రికాదులు మరణించినను, బుద్ధియందునెక్కు వైన అరిషడ్వర్గంబుల ననేక విధంబులుగా విస్తరింప జేసి కొని, కామముచేత తమకు యే గతి గలుగునోయని తెలియ లేక స్త్రీలనే వలలోబడి పశులవలె లేవలేక, యీషణత్రయము లను సముద్రంబులో మునిగి, ఆలుబిడ్డలందు మమకారంబు ఎక్కువై, వారికొరకై యనేక కష్టంబులు బొంది, తుదకు వారివలన లేశమాత్రంబైన సుఖంబును బడయనేరక, కాలం బంతయు నీ రీతిగడిపి శరీరము పడిపోవుకాలమందు యము నిచే ననేక బాధలొంది, నరక కూపంబున కొన్నినాళ్ళుండి పాపాత్ములై పుట్టుచు జచ్చుచు ననేకబాధలు పొందుచున్నా రలు. తల్లీ! సకల సద్గుణ కల్పవల్లీ! నేను బోధించుచున్న యీ వాక్యంబులను త్రికరణశుద్ధిగా వినుచుండుము. ఈ శరీ రమును నమ్మబోకుము. శరీరంబులు శాశ్వతంబులు గావు. ఈ యేహ్యంబైన శరీరంబులోనున్న పరమాత్మనెరుంగుము,

ఈ శరీరము మాంసము నెత్తురు ప్రేగులు చర్మము మల మూత్రములు కలదై వుండును. ఈ శరీరంబును ప్రత్యేకం బుగా జూచినప్పుడు అసహ్యము గల్గును. వీని కన్నింటికిని స్థానంబైన దేహం బిట్టిదని తెలియజాలక కుటిలులై ఈ సంసారమందు మునిగిపోవుచున్నవారలు. నీవన నెవ్వరో నేనన నెవ్వరో బాగుగా నీ మనంబుననే యోచించి చూచిన నీకే బోధపడు"నని వీరంభొట్లయ్య తల్లియైన వీరపాపమాం బకు దెల్పగా నామెయు విజ్ఞాని యగుటచే మారాడుటకు నోరాడక కుమారునిజూచి "నాయనా! యిట్టి యేహ్యంబైన యీ శరీరంబు యీ ప్రపంచమందు బుట్టుటకు మూలమైన 'పిండోత్పత్తిని' మీతండ్రి నాకిదివరలో ననేక విధంబులుగా జెప్పి యున్నారుగాని నీవును అది యే విధంబుగా నున్నదో నాకు దెలియునట్లు తేటతెల్లముగా బోధింపు"మని వేడిన తల్లితో కుమారుండిట్లనియె—

0 తల్లికి కుమారుండు "పిండోత్పత్తి" క్రమంబును బోధించుట 0

"తల్లీ! నే జెప్పబోవు ఈ పిండోత్పత్తి క్రమంబును క్కగా వినుము. శ్రుతిః॥ అన్నాద్మేవోజాయతే, మేదా న్మాంసః మాంసాద్రక్తః రక్తాద్రేతః రేతసో మోహః" శ్రుతి॥ శుక్ల శోణితాదావర్ధతేగర్భః స్త్రీరేతోతిరిక్తాత్ స్త్రీయో భవతి, పురుషరేతోరిక్తాత్పురుషోభవతి, ఉభయోర్బీజతుల్యా న్నపుంసకోవతి, వ్యాకులిత మనసాః ఖంజా, కుబ్జా వామ నాదిరూపా భవతి, ఏకరాత్రేణస్ఖలితం భవతి, పంచరాత్రేణ



బుద్బుదం భవతి, మాసేన శిరః మాసద్వయేన కర పాదా దాయః, షష్ఠిఅస్థియస్కంధయశ్చత్వాంషి, సప్తమే మాసే జీవో౽భవతి, నవమాష్టమయోర్జన్మాంతర స్మృతిర్భవతి. యది యోన్యాం, ప్రముచ్యేతతం ప్రమధ్యే మహేశ్వరం, యది యోన్యాం ప్రముచ్యేత యోగ్యం, సాంఖ్యం, సమాశ్రయే. నానా యోని సహస్రాణిజాతాని వివిధానిచ, భుక్తాశ్చ వివిధా హారంపీతాశ్చ వివిధాస్తనాః। ఏకందుఃఖం సమావిష్టం వైష్ణవీ మాయాఅవిశతి భూమౌ వతతి.

తా॥ మనుజుండు భుజించిన యన్నము మూడుభాగం బులుగా నుండును. కనబడు భాగము స్థూలమనియు, దాని మధ్యయందుండు జిహ్వకు తెలియురసము సూక్ష్మమనియును దాని యందుండు సత్తువు అణు వనియును చెప్పబడును. భుజించు అన్నము, ఉదకము, నెయ్యి మొదలగు పదార్థ ములు కలిసి శరీరమునకు మదమును, ప్రాణమునకు చేష్టా సమర్థతయు, మనసునకుదార్ఢ్యమునుగలుగజేయును. వీనిలో మద మతిశయించినపుడు పురుషునకు శుక్లమును, స్త్రీకిశోణి తమును వృద్ధియై భార్యా భర్తలకు ఋతుకాలమందు సంగ మము గలిగినపుడు శుక్ల మధికమగునపుడు పురుషుండును, శోణిత మధికమైనపుడు స్త్రీయును, రెండు సమమైనపుడు నపుంసకుడును కలుగును. ఒకసారి రతిచేవి కామము తీరక వెంటనే రతిచేసినయెడల శుక్లశోణితములయొక్క యెక్కువ తక్కువ లనుసరించి ఒకస్త్రీ ఒక పురుషుడుగాని, లేక ఇద్దరు స్త్రీలుగాని, ఇద్దరు పురుషులుగాని కలుగుదురు. ఇవియునుం

గాక యోనికమలమునందు కొందరికి పొరలుండిపడిన శుక్లం ఆ పొరలయందు విభజింపబడి పైనచెప్పిన విధమున కవల పిల్లలు పుట్టుదురు యోనికమలమందు పొరలుండుట చేతనే పందులు,కుక్కలు,పిల్లులు మొదలయినజంతువులకు రెండేసి మూడేసి, నాలుగేసి పిల్లలు పుట్టును. ఇదియునుంగాక స్త్రీ స్నానంబుచేసినదిమొదలు పదియారు దినములు ఋతుకాల మని చెప్పంబడును అందులో మొదటి మూడు, నాలుగు దినంబులు సంగమంబునకు నిషేధములు. నాల్గవ దినమందు రతిసల్పిన పిచ్చివాండ్రును, అపరిశుద్ధులును, శాస్త్రవిశ్వాసం లేనివారును పుట్టుదురు. అయిదవ దినము మొదలు తక్కిన పండ్రెండు దినములలో రతికి పదకొండు, పదమూడు దినం బులు నిషేధంబులు. బేసిదినములయందు పురుషుండుపుట్టును పగలు పిండోత్పత్తియైన యెడల దరిద్రుడు. అర్ధాయువుగల వాడు, పెద్దలను దూషించువాడుపుట్టును. ఋతుకాలమందు రతిచేయు దినములలో మంచిపదార్థములను భుజించి దేవతా గురుపూజలు చేసి పుత్రకామేష్టి యందు జెప్పబడిన ప్రకా రము కొన్ని క్రియలను జేసి రతిచేసినయెడల యోగ్యమైన సంతానము కలుగును. ఒకనాటి రాత్రి శుక్లముపడును. ఇది శోణితముతో గలిసి ఐదు దినంబులు నీటిపై బుగ్గవలె నుండును పదిదినంబులకు కోడిగ్రుడ్డువలెనుండును. నెలకు గట్టిపిండమై శిరస్సు ఏర్పడును. రెండునెలలకు కాళ్ళుచేతు లును, మూడు నెలలకు కడుపును, నాలుగు నెలలకు నిరు పార్శ్వంబులును, ఐదు నెలలకు పాదములు వ్రేళ్ళను

ఏర్పడును. ఆరవ నెలయందు ముక్కు, చెవులు, కన్నులు మొదలయిన రంధ్రములు గల అవయవములు కలుగును. ఈవిధముగ నేర్పడిన దేహమందు ఏడవ నెలయందు జీవుడు ప్రవేశించును. అప్పుడు ఊర్ధ్వముఖమై యుండును. నాభి మొదలుకొని బ్రహ్మరంధ్రము వరకు వెనుక భాగమందు చిన్న రంధ్రములుగల యొకనాడియుండును. అప్పుడు తల్లి యొక్క జఠరాగ్ని బాధ లేకుండునట్లు సూతియను పేరుగల యొక తొడుగు పిండమును జుట్టి యుండును. ఎనిమిదవ తొమ్మిదవ నెలలయందు పూర్వజ్ఞానము గలిగి, భూమిమీద పుట్టేవరకు మలమూత్రస్థానమైన గర్భమందునిలిచి, తనలో తానిట్లని దుఃఖించును 'అయ్యో, నేను జన్మాంతరముల యందు కొంచెమైన పుణ్యంబు చేయకపోతిని ప్రపంచాను భవము దెలిసి యుండియు నన్ను ఎవడు ఏమనును అనెడి గర్వంబుతో సత్కర్మలుచేయకపోతిని. ఒకానొకప్పుడు పరు లను వంచించుటకై కామ్యకర్మలనుజేసితిని. నిష్కామ కర్మ లను జెవినిబెట్టక మనసునందు విచారింపక పెద్దలు చెప్పి నప్పుడు నా యిష్టము వచ్చినట్లు నేను చేయుదును అనివార లను నిందించుచు సద్గతిని విచారింపకపోతిని. అజ్ఞానముచేత స్వస్త్రీ (అనగాభార్య)యందు నిషిద్ధ దినంబులనాలోచింపక, పగలు అనియైన విచారింపక రతిసుఖంబులుబొందితిని. పర స్త్రీలను మోహించి అన్యాయముగా వారిని జెరచితిని. చిన్న తనపు బుద్ధివలన అనేక పాపంబులు చేసితిని. గురువులను, పెద్దలను, తల్లిదండ్రులను దూషించి నీవు అను ఏక వచన

ప్రయోగంబు చేసితిని. శరీరము పడిపోవునది యని తెలిసి సప్పటికిని కూటసాక్ష్యములచేత ధనము నార్జించితిని. ఆ ధనము భార్యా బిడ్డల కొసంగి మరల వారు ఇవ్వనందున దుఃఖించితిని. ఇట్లు పూర్వజ్ఞానంబుచే గర్భంబున నున్న శిశువు దుఃఖించుచు దిక్కు యెవరని విచారించుచు గర్భము నుండి పుట్టిన తర్వాత నైనను జ్ఞానము దెచ్చుకొని సద్గురువు యొక్క పాదపద్మము లాశ్రయించి సాంఖ్య, యోగ, భక్తి మార్గములచేత పరమాత్మ ధ్యానము చేయగలను. ఈ మల మూత్ర దుర్గంధ యుతమైన నరకకూపము నుండి విడిచిన పిమ్మట బాహ్యమందు అంతరమందు సగుణ నిర్గుణ పూజలు చేయుదును. ఇంకను పరమాత్మను మరువననియు ఈమూత్ర ద్వారము నుండి ఎప్పుడు విడువబడుదుననియు విచారించు చుండగా, అంత విష్ణుమాయ గప్పి పిండము అధోముఖమై తల్లికి బాధ గలిగించుచు భూమిమీద, తల్లియొక్క అపాన వాయు ప్రసారముచేతను పిండమందుండు ప్రాణాది వాయు ప్రసారము చేతను పడును. అప్పుడు అక్కడ నుండువారు మగశిశువా? ఆడశిశువా? అని విచారింతురు. మగశిశువేనా? మంచిది అని కొందరును, ఆడశిశువా? అదీ మంచిదేయని మరికొందరు నిట్లనుకొనుచు కలిసీళ్ళు చల్లుదురు. అప్పుడు పూర్వవృత్తాంతంబు మరచి 'కావురు'మని యేడ్చును.

వీరంభొట్లయ్య జీవుని చతుర్దశ లక్షణంబు లిట్టివని తల్లికి బోధించుట

ఆ శిశువున కెంతమాత్రమున జ్ఞానములేక, మంచము


మీద బడి మలమూత్రములలో నుండి కదలలేక, ఈగలను, దోమలను తోలుకొనలేక విశేషముగా దుఃఖించును. అప్పుడు గర్భము నందుండు దోషములన్నింటిని దాటి యింత వరకు వచ్చినప్పటికి కిసరులు, పోరులు, సంధులు మొదలయిన రోగంబులను, ముట్టు దోషంబులను అనుభవించుచు వాటికి తల్లిదండ్రులు ప్రతిక్రియలు సేయునప్పుడు ఔషధ పానము చేయలేక దుఃఖించుచు, ప్రతి నెలయందు బాలగ్రహముచేత బాధనొందుచు, పరమాత్మాను గ్రహము చేత నాలుగైదు వత్సరములు గడచి అక్షరాభ్యాసము చేయబడి ఉపాధ్యాయులు చెప్పినట్లు చదువలేక దెబ్బలుపడుచు, ఈ విధంబున పదునెనిమిది వత్సరముల వరకు వృద్ధిపొందుచుండగా, తల్లిదండ్రులు ఒక చిన్నదానిని తెచ్చి వివాహము చేయుదురు. ఆ భార్యయందు యుక్తాయుక్తసమయములు తెలియక రతి చేసి సంతానంబుగని, వారికి సంరక్షణ చేయలేక, రాజులు మొదలగువారి సేవలు చేయుచు నేను సంపాదించి యిందరి పిల్లలను సంరక్షణచేసి పెండ్లి మొదలగు శుభకార్యంబులు చేయుచున్నానని గర్వించి తన కన్న బలహీనులబాధింపుచు ద్రవ్య సంపాదనమే ముఖ్యమని మిక్కిలి యాశతో ద్రవ్యమును దెచ్చి ఎప్పుడును పరమాత్మను దలంపక కాలమును గడుపుచుండగా కొన్ని దినములకు వృద్ధత్వంబువచ్చి చెవులు కన్నులు, పాదములు, చేతులు మొదలగు నవయవములు వానివాని వ్యాపారములనుజేయజాలక యున్నప్పుడుమొదటు భార్యను బిలిచితనను లేవనెత్తుమని అడుగగా వారందరును

అక్కడ నుండుము, అక్కడనేయుండుమని యనగా, నే
వీరి ననేకవిధంబుల సంరక్షణము చేసితిని. నన్ను సుఖముగ
సంరక్షణ చేయువా రెవ్వరు? అని ప్రయోజనము లేని వాక్య
ములను పలుకుచుండగా, యమదూతలు వచ్చి గట్టిగా ప్రాణ
ములను బంధించి ముండ్లు, రాళ్ళు మొదలగుకఠినంపు త్రోవ
లందు నడిపించుచు పోవు సమయంబున భయపడి "నేను
ఎంత మోసపోతిని" అని దుఃఖమును బొందుచు, యమలో
కంబున కేగిన పిమ్మట యమదండన మను నరకంబున బడ
వైచి యిట్టిది యని చెప్పుటకు నలవిగానిబాధనుఅనుభవింప
జేయుచుండగా విశేషముగా నా జీవుండు దుఃఖపడును.
కనుక తల్లీ! యిట్టి పాంచ భౌతికంబైన యీ శరీరంబుపై
నాశవదలి, సదా సచ్చిదానంద స్వరూపుడగు సర్వేశ్వరుని,
సర్వకాల సర్వావస్థల యందును ధ్యానించుచుండు మని
బోధించుచున్న కుమారునిజూచి "కుమారా! నీవు బోధించిన
'పిండోత్పత్తి' క్రమంబును మానవు డనుభవించెడి "చతు
ర్దశ" లక్షణములును నాకు చక్కగాబోధపడినవి. ఈ
శరీరం బెట్లు గలైనో బోధింపు" మన కుమారుం డిట్లులని
యెను—

వీరంబొట్లయ్య తల్లికి "సాంఖ్యంబును" బోధించుట

తల్లీ! ఈ శరీరంబు ఏయే తత్వంబులచే నుత్పత్తి
యగుచున్నదో తెల్పెద స్థిరచిత్తవై వినుము.

ఓం, హ్రీం, క్లీం, శ్రీం, శివాయ బ్రహ్మణే నమః




శ్లో॥ ఓంకారే దేపివదనం వాయకార భుజద్వయం
వికారం దేహమధ్యంచ నమకార భుజ ద్వయం॥

శ్లో॥ అవ్యక్తోమమతోహంకారః ఆత్మానాకాశ సంభూతః।
ఆకాశాద్వాయుః వాయురోరగ్నిః, అగ్నేర్ ఆపః
ఆపః పృధివిః

ఇట్లు పంచభూతములుగల్గెను. పృథివి, జలము,అగ్ని, వాయువు, ఆకాశంబు లను నీ పంచ భూతములచే శరీరం బాయెను. ఈ పంచభూతంబులు వేరు వేరుగా విభజించబడు టయే పంచీకరణం బనబడును. అది యెట్లన—

1) మనోబుద్ధి చిత్తాహంకారము లనెడు అంతఃకరణ చతుష్టయము నాకాశభూతంబుచే గల్గెను. 2) సమానవ్యాన ఉదాన అపాన ప్రాణంబులనెడు పంచ ప్రాణంబులు వాయు భూతంబులచే గల్గెను. 3) శ్రోత్రము, త్వక్కు, చక్షువు, జిహ్వ, ఘ్రాణంబులనెడు జ్ఞానేంద్రియములు అగ్నిభూతంబు

లచే గల్గెను. 4) శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము అనియెడు ప చతన్మాత్రలుజలభూతంబులచేగల్గెను 5) వాక్కు, పాణి, పాదము, గుదము, గుహ్యంబు లనెడ కర్మేంద్రియంబులు పృధ్వీభూతంబుచే గల్గెను. ఈపంచభూత పంచతన్మాత్రలు పంచీకృతంబులైన సకలేంద్రియంబులు. తదీయ వికారంబులు, సత్వరజోతమంబులనెడు త్రిగుణంబు లును, స్థూల సూక్ష్మ కారణ శరీరంబులును, కామక్రోధ లోభమోహ మదమాత్సర్యంబు లనెడు అరిషడ్వర్గంబులును వీటి యన్నింటితోనుండెడు'జీవుం'డను కానని విశేషావరణం బును త్యజించి తనకు తానై తరచి విచారించి మున్ను జెప్ప బడిన భూతాది వికారముల మీద తాను శేషించి యచలుడై యుండుటే సాంఖ్యమనంబడును.అనగాపంచవింశతియుతుం డైన జీవుండు ఆ జీవుని యెరుంగుటే ఆత్మయనంబడును.ఆ యాత్మవలన పరమాత్మనుగనుంగొనిన పరబ్రహ్మంబొక్కడే నిలుచునని తల్లికి నీ సాంఖ్యసూత్రం బెరిగించగా నంతతల్లి యైన వీరపాపమాంబ సంతోష స్వాంతయై 'బిడ్డా! ఆ పర బ్రహ్మంబును కనుగొను నుపాయంబును'దెల్పు'మనగానంత వీరంభొట్లయ్య 'తల్లీ! ఇంక నా పరబ్రహ్మంబును నెరుంగు సాధనంబులను దెల్పెద. సావధానచిత్తవై విను'మని ఇట్లని తెలెను. (సిద్దయ్యగారికి బోధించిన సాంఖ్యంబునుచూడుడు)

### వీరభొట్లయ్య తల్లికి తారకోపదేశంబు చేయుట

తల్లీ! నీవా పరబ్రహ్మంబు నెరుంగుటకు అతి సుళు వైన యోగమార్గంబుజూపించెద స్థిరచిత్తవై వినుము. జననీ!

నీవు పద్మాసనంబున స్థిరచిత్తంబున గూర్చుండి పవనంబ
కన్నను బహురెట్లు వేగంబుగా పరుంగిడెడు "మనంబును
పరుగిడినీయక నేనిపుడు చూపించుచున్నానావిద్యుల్లేఖయంద
మనంబును లయంబుచేసిన చిన్మయరూపుడై శ్రీగురుమూ
కానంబడును. అదియే "అణువు". ఆ యణువునందే కో
సూర్యప్రకాశంబులు పుట్టినవి. దీనియందే సర్వలోకంబున
బుట్టి దీనియందే లయించును. ఆ ప్రకారమేశుద్ధస్ఫటిక ప
పూర్ణపరమ పదము పిమ్మట అజ్ఞానంబను నువ్వులను శ్రీగుర
నామోచ్చరణంబను కల్వంబున వైచి మర్దించి జ్ఞానంబన
యెడినూనెదీసి కనుగ్రుడ్డు అనే ప్రమిదయందా నూనె పో
జీవభ్రాంతియనెడి వత్తిజెసి నిర్వికారంబను నగ్నిచే వత్తి
వెలిగించి యాకోటిసూర్యప్రకాశంబైన నిర్వికారములోజే
అచలంబను నానంద వారధినిమునింగి తరించుమని బోధిం
చగా నంత నాపీరపాపమూంబకుండెడి ఆనందమునకు మేర
లేక ఈతండు నాకు బుత్రుండని మురియుచుంటినేగానినిజ
ముగా నిప్పుడు విచారింపగా నా పరమేశ్వరుండే యిటు
మానవ రూపుండై అవతరించినట్లుతోచుచున్నది. ఈయనను
నాకొసంగి పెంచుకొనుమని చెప్పినప్పుడే ఇతండు 'భగవ
త్స్వరూపుండని' నా యత్రిమునీంద్రుడు చెప్పియే ఇచ్చెను.
పుత్రమోహంబునమరచి సామాన్య మానవుండని తలంచితినే
గాని కేవల పరబ్రహ్మవతారుండని తలంచకనిట్లు ప్రాపంచిక
భ్రాంతిలో మునిగి కాలంబంతయు వ్యర్థంబు జేసికొంటినే
యని కొంతసేపుమనంనందబులంచి కుమారుని తనతొడపై

గూర్చుండబెట్టుకొని చెక్కిళ్లుముద్దాడి ముంగుః దువ్వుచు తనలో తానానందించుచు పరవశమై కుమారునిగడ్డంబు పట్టుకొని, కుమారా ! నీవు మా పూర్వ పుణ్య వశంబునపుత్రుండవుగా నుండిన నిన్ను నేనేమని కొనియాడగలను. నీవెవండవైనది నిన్ను ఆరు మాసంబులు పెంచిన అత్రిమునీంద్రుడే చెప్పెనుగాని మా దురదృష్టవశంబున పుత్ర భ్రాంతిలోబడి నిన్ను కనుంగొనలేక యిట్లు కాలమంతయు వ్యర్థంబు చేసినదానను. కావున తండ్రీ! ఇక నాకున్న కొలదిసందేహమును గూడతీర్చుము బిడ్డా ! నీవు సాంఖ్యతారకంబులు బోధించుట చేత భ్రాంతికి మూలమైన నా సకల సంకల్పంబులు దహించెను. ఇది వరకు మీతండ్రిచే విని కనియుంటిని గాని ఇట్లు "సూక్ష్మంబులో మోక్షంబును" జూపి యుండలేదు. ఇప్పుడు నీ బోధచే "త్రుప్పుపట్టిన కత్తికి తిరిగి పదును బెట్టినయట్లు" చేసితివి. ఇంక పరిపూర్ణంబును బోధించి ఐక్యసంధానంబు దెల్పుమని వేడుకొనగా నంత తల్లితొడపై గూర్చుండియున్న వీరంభొట్లయ్య తనతల్లితో నిట్లనియెను. (సిద్ధయ్యగారికి బోధించిన తారకయోగంబును చూడుడు )

వీరంభొట్లయ్య తల్లికి అమనస్కంబును బోధించిన పిదప విశ్వరూప సందర్శనంబు జూపుట తల్లి కుమారుని స్తోత్రంబు చేయుట

తల్లీ ! వినుము. నీ కా పరిపూర్ణబోధచేసెద. నీ నేత్రకవాటంబును బంధించి లక్ష్యంబున నెక్కించి తరువాత దీపముఖంగి కదులుచుండెడి మనంబునుకదలనివ్వక నీలో నీవు చూచి సర్వావస్థల యందును బంచేంద్రియములకు గోచరం



వీరభొట్లయ్య తల్లికి
తాంబూలదానము చేయుట

బగు సర్వంబును సచ్చిదానంద స్వరూపం బని యెరింగి బాహ్యాంతర ప్రపంచము మిథ్యగా జూచుచు 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అను నార్యోక్తి ననుసరించి సర్వంబును బ్రహ్మ మయంబని యెరుంగుము. తన స్వస్వరూపంబైన బ్రహ్మం బును నెరింగినవారలే ముక్తులగుదురు. నీవు ఐక్యసంధానం బెరింగి తరింపు మనసంత వీరపాపమాంబ సంతోషాయత్త చిత్తయై "తండ్రీ! మాయనెరుంగ నే నెంతదానను. నా యజ్ఞానంబున నిన్ను కొమరుండవను భ్రాంతిచే భావించి నీ నిజతత్వం బెరుంగక కేవల మూఢత్వంబుననుండి యింత కాలంబు ప్రవర్తించితిని నిన్ను మాకొసంగిన అత్రి మునీం ద్రుడే నీవు కేవల 'స్వయంభూ' వని యెన్నో విధంబుల దెల్పినవిషయంబులన్నియు మరచితిని. నీవువిశ్వరూపకుండ వైన సాక్షాత్ శ్రీ విరాడ్విశ్వకర్మ మహాప్రభుండవే గాని సామాన్య మానవుండవుగావు. సర్వాత్మవైన నీ వింక నీ మాయ నాయందు ప్రజ్వరిల్లం జేయక నన్ను నీ భక్తురాలి నిగా కటాక్షించిరక్షింపుమని వినుతిజేయుచున్న తల్లిని జూచి వీరంభొట్లయాచార్యస్వామి తల్లీ! నీవొక్క నిమిషంబు నీ నేత్రద్వయంబును మూసికొనుమని చెప్ప ఆ యమ్మ అట్లే నేత్రంబులను మూసి తెరచువరకా వీరంభొట్లు విశ్వరూపం బునుం దాల్చి, వేయి మస్తకంబులును, వేయి నేత్రంబులును వేయి కరంబులును, వేయి పాదంబులతో బ్రహ్మాండ భాండ మంతయు తానెయై పాదంబులు పాతాళలోకంబై, మస్తక

స్థలంబు సత్యలోకంబై, దేహమధ్యంబు మర్త్యలోకంబై, నేత్రంబులు సూర్యచంద్రులై – వీనులుదిక్కులై – నాసికా ద్వారంబులు సత్యలోకద్వారంబులై –జిహ్వ వరుణదేవుండై యుదరంబు సప్తసంద్రంబులై – నాడులు మహానదులై – రోమంబులు మహావృక్షంబులై – యెముకలు కొండలై — శిరోజంబులు మేఘంబులై, ప్రాణంబులు వాయుదేవుండై, బాహువులు యింద్రాదిదేవతలై, గుహ్యంబుబ్రహ్మదేవుండై శుక్లంబు ధర్మమార్గంబులై, వీపు ధర్మస్థలంబై, వాగింద్రియం బగ్నిదేవుండై, కోరలు యమధర్మరాజై, యివ్విధంబున నెక్కటికి తానైయై యన్యంబేమియును గానరాక సర్వ సంపూర్ణుడై నిండి తన యెదుటగానిపించుచుండిన విశ్వరూపకుండైన పుత్రునిగాంచి వెరగుపడి యున్మీలిత నేత్రయై కనులను మూసికొని తండ్రీ! సర్వరూపకా ! సర్వభువనంబులు నీయందేయుండె. నీకన్న వేఱునేనేమియుంగాన. సర్వంబు నీవయైయున్న నిన్ను నేమని వర్ణించుదానను. ఇట్టి విశ్వశరీరుండవై నెగడొందు నిన్ను మానవులు సమదృష్టి నెఱుంగజాలక మాయలోజిక్కి నీవు నేనను భేదంబున వర్తింతురు. అన్నియు నీ మాయగాని వేరుగాదు. తండ్రీ ఇక నీ విశ్వరూపంబునుచాలించి సౌమ్యరూపంబునప్రసన్నుండవై రక్షింపుమా జగదీశా యని యనేక విధంబుల వినుతించుచున్న తల్లిని కరుణించి వీరంభొట్లయాచార్యస్వామి విశ్వరూపంబునుంబాసి యెప్పటి విధంబున నుండి తల్లి కనులను తన అమృత హస్తంబుచే దుడిచి–చిఱునగవుతో, ''ఏమమ్మా ! తల్లీ ! యెందులకై యిట్లు విభ్రాంతిని జెందితి వనిన, నమ్మ

హాదేవి కుమారుని కౌగిలించుకొని నాయనా, నీదివ్యస్వరూప సందర్శనంబుచే నా జన్మంబు పావనంబయ్యె. నీ కృపారసంబున నే నెరింగిన విజ్ఞానంబును నాదగుఅజ్ఞానంబునశించి బ్రహ్మానందంబును జెందితిని. ఇక నిన్ను నేమని వినుతించు దానను? కుమారా! నీ సంపూర్ణ కటాక్షంబున నన్ను జనన మరణ ప్రవాహము నుండి తొలగించితివని వినయ విధేయురాలై కొమరుని నిట్లనిస్తోత్రంబు చేసెను. బిడ్డా! నీవు చూడ మానవుండవేగాని నిజముగా నిప్పుడుజూడ నిరాకార నిరంజనుండవు. అవాఙ్మానస గోచరుండవు. ప్రకృతిద్వయ దోషరహితుండవు. కేవలాత్మ స్వరూపుండవు. సచ్చిదానంద రహితుండవు. సర్వసాక్షివి నిత్యానందమయుండవు. తండ్రీ! సంసారంబునంజిక్కుమూఢులకు నీ పాదపద్మప్రణుతిదక్క వేరొం డుపాయంబు గలదే? దేవదేవా! అర్థాయన మగు చిత్తమును నివర్తించుకొని జ్ఞానసంపదను బడయగోరు వారలకు నీవు గమ్యస్థానమవు పరమేశ్వరావతారా! సర్వ కర్మలకు నీవేకర్తవు సర్వకర్మలనునియమించువాడవు కర్మలకు సాక్షివి. కర్మలకనురూపఫలమును గలిగించువాడవు తండ్రీ! నీవీ జగమున కర్తయగువానికి గర్తవు. భరించువానికిభర్తవు హననమొనరించువానికిహంతవు. అప్రమేయా! సర్వమును మీరియున్న నీవుసత్యరూపుండవని అనేక శ్రుతులచే గీర్తింపబడుచున్నావు తండ్రీ! పరమ పదమగు నీ మహత్వమును తెలిసికొన నాశేషాహినైనెనం దరంబుగాదు. భగవత్స్వరూపా ప్రాపంచ భ్రాంతిని దవిలియున్న మహాపాపినైన నేనానిన్ను

వర్ణించుటకు, వినుతించుటకు, కీర్తించుటకు, సేవించుటకు? అని సంస్తుతించి వినయ విధేయతలతో చేతులు జోడించుకొని యున్న తల్లిని జూచి దేవీ! నీ కుండు కొరతలన్నియు దీరెంగదా! తల్లీ! నీవు పరమ సాధ్వీలలామ వగుటచేతనే హరిహరాదుల కగోచరంబయిన నానిజస్వరూపంబును చూడగల్గితివి. నీవు కేవల పరమ పావనివి. బ్రహ్మానందదాయనివి ఇక నీ ప్రపంచభ్రాంతిని వీడి ఈపాపాఘ్ని మఠంబున తపం బాచరించుచు కడతేరుము. ఇక నేనేగుటకై సెలవొసంగు మని వీరంభొట్లయాచార్యస్వామి తల్లినడుగగా అంత తల్లి కుమారునికౌగిలించుకొని, తండ్రీ! నీకు నేను సెలవొసంగునంతటి దాననా? బ్రహ్మాండనాయకుండవైన నీకిదేఆశీర్వాదము. ఇక నీయిచ్చవచ్చిన క్షేత్రాదులనుదిలకించుచుఅజ్ఞానులైనమూఢులకు నీ మహత్తత్వంబును బోధించిసుజ్ఞానులుగాజేసి తరింపజేయుచుండుము. నాయనా! నాకొక సంశయము బాధించుచున్నది. అయ్యది యెద్దియనిన దేవబ్రాహ్మణులమైన మన వర్ణంబు కలియుగంబున నపూజ్యం బెందులకై నదియు, బ్రాహ్మణులెప్పటినుండి బ్రాహ్మణశబ్దమువహించి పూజింపబడుచున్నదియు దెల్పుమనిన అంత కుమారుండిట్లనియె.

—• దేవబ్రాహ్మణులైన విశ్వబ్రాహ్మణాలకు కలియుగంబున పూజనీయతం బెందులకు లేదనియు, వారికిపంచాననం వారను నామంబెందులకు వచ్చిన దనియును, బ్రాహ్మణు లెప్పటినుండి పూజింపబడుచుండిరో తెల్పుమని స్వాములవారిని అడుగుట •—

స్వామీ! పంచబ్రహ్మల వంశమం దుద్భవించి దేవ

బ్రాహ్మణులైన విశ్వబ్రాహ్మణుల కీ కలియుగాది నుండియ అయిదువేల వత్సరములనుండి— భూషణలేక తిరస్కారంబు గలిగియుండుట కేమికారణంబు? అదీగాక ఈ విశ్వబ్రాహ్మణులు "పాంచాననం" వారని నామాంకితులగుటకు కారణం బేదో తెల్పుమని వేడిన స్వాములవా రిట్లనిరి—

సీ॥ పాంచాననో ద్భూత, పావకజ్వాలలు
భూనభోంతర మెల్ల భూరికొనగ

"పాంచాననుడు" అనగా పంచభూతములసృజియించి నటువంటివాడు శ్రీవిరాడ్విశ్వకర్మ—ఆ పంచభూతంబు లేవనగా 1) జ్ఞాన మనోబుద్ధి చిత్తాహంకారము లనెడు ఆకాశ పంచకమున్నూ, 2) సమానవ్యానఉదానప్రాణ అపానంబు లనెడు వాయుపంచకమున్నూ, 3) శ్రోత్రత్వక్కు చక్షూ జిహ్వ ఘ్రాణంబు లనియెడు అగ్ని పంచకమున్నూ, 4) శబ్ద స్పర్శ రూప రసగంధంబు లనియెడి జలపంచకంబున్నూ, 5) వాక్కు పాణి పాదము గుదము గుహ్యంబు లనియెడి పృథ్వీపంచకమున్నూ, పృథ్వి అప్పు తేజో వాయురాకాశం బులనెడు అయిదు బూతంబులు ఇరువది అయిదు తత్త్వంబులాయెను. ఇందువలన నీ విశ్వకర్మ పంచముఖోద్భవులు పంచబ్రహ్మలగుట వలన నీ విశ్వబ్రాహ్మణులకు "పాంచాననము" వారని చెప్పనాయెను. కాన శ్రీవిరాడ్విశ్వ కర్మకు పంచానను డనెడు నామంబు చెల్లును.

ఇక బ్రాహ్మణులెప్పటినుండిపూజనీయులై యుండిరో తెల్పెద వినుడు—

ద్వాపర యుగాంతర్యమున కలియుగ ప్రవేశమున జహుకాలమునకు శ్లో॥ వ్యాసో లుబ్ధక సంభూతో వశిష్ఠో ఊర్వశీ శుతః॥ అను శ్రుత్యాను సారంబుగా లుబ్ధక సంభూతుండైన వ్యాసుడు జన్మించి మయవిశ్వబ్రహ్మవంశసంభవులైన యొక మహనీయునివద్దచేరిఆమహానుభావునకుద్వాదశ వత్సరంబులు శుశ్రూష జేయుచు వేదశాస్త్ర పురాణము లన్నియు, శ్రుతి స్మృతి యితిహాసంబు లన్నియు చక్కగా గ్రహించి యా మహానుభావుని కరుణవలన మంత్రోపదేశంబును బొంది తాను పరిపూర్ణభావమునుజెంది తదుపరి తాను అకృత్య మార్గము చేయదలంచి పంచవేదంబులను చతుర్వేదంబు లనియును, పంచమూర్తులను త్రిమూర్తులనియును తానా మహనీయుని వద్ద గ్రహించిన యితిహాసంబులన్నియును మారు పాటుచేసి తన 'విప్ర' శబ్దమును యుక్తి యుక్తంబుగా సంధీ సంధుల ఇమిడ్చి 'బ్రహ్మజ్ఞానాంతు బ్రాహ్మణ' అని యుండుటచేత తాను బ్రహ్మజ్ఞానంబును బొందితపస్సు చేయుచుండెను. వ్యాసులగురువైన మహానుభావుండుతపస్సు చేయుచున్న వ్యాసులను జూచి బిడ్డా ! నీ విట్లు అతి ఘోరముగా నన్ను గూర్చి తపస్సు చేయుటకేమికారణమో తెల్పుమని యడుగగా నా వ్యాసుండు సంతోష భరితుండై నాకు నొక వరం బిమ్మని యడుగ నా మహనీయుండట్లే ఇచ్చితి

దీసికొని తాను తపస్సు చాలించి తాను జేసిన వ్యాస ప్రోక్త మును తాను జేసిన మారుపోట్లును, ఇతిహాసంబులన్నియు నాకు పూజితము జరుగునటుల వరమిమ్మని కోరెను. వ్యాసుండు విప్రశబ్దమును ఇమిడ్చిన శ్రుతి స్మృతి యితి హాసంబు లన్నియుజూచి ఆ మహనీయుండాశ్చర్యముజెంది తలయూపి సరే ! కానిమ్మని వరమును వాగ్దత్తముగా నిచ్చె దను. ఎట్లనిన 'శ్లో॥ వ్యాసప్రోక్తం మయాదత్తం విప్రౌ సర్వత్ర పూజితః॥ కలౌ పంచ సహస్రాణి జాయతే వర్ణ సంకరః' అనియున్న పరమామ్నాయము రీతిగా తాను జేసి కొనిన వ్యాసప్రోక్తమును నా వ్యాసునకే దత్తము ఇచ్చెను. ఈ దత్తమును ఎట్లా యిచ్చెననగా 'విప్రౌసర్వత్ర పూజితః' సర్వజనులచేత విప్రులు పూజింపబడెదరనెను అదియెంత వరకనిన 'కలౌ పంచసహస్రాణి' కలియుగ ప్రవేశము మొదలుకొని అయిదువేలసంవత్సరములు పూజితము జరుగు ననెను తదుపరి 'జాయతే వర్ణసంకరః' పిమ్మట వర్ణసంకర మగును కలియుగము అయిదువేల వత్సరంబులు వ్యాస పదంబుచేతనే యీ దశ విప్రులనే ద్విజులందురు. వేదపాఠ కులై ప్రవర్తించుచుండిరి. ఇందుకై యొక యుపమానంబు జెప్పెదవినుడు. ఒక కోయవాడు యాత్రమార్గము వెళ్ళు చుండగా నాతండు దాహంబుగొని కొంత దూరంబు పోయి దాహంబునకు నోర్వజాలక యచ్చటనున్నవనాంతరమునకు వెళ్ళి యా చల్లదనంబుకై ఒక వృక్షంబు నీడ పరుండియుం డగా నచ్చటనున్న కపిసేవలో సుగుణముగల్గినయొక్క కపి

చూచి యీతండు దాహంబు గొన్నాడని భావించుకొని యా మానవునకు తన సౌంజ్ఞచేత నుదకంబునుచూపెను. అంతట నా మనుజుండా కూపంబునకువెళ్ళి స్నానంబుచేసిదాహంబు దీర్చుకొని అచట నాలోచించుకొనియుదకంబుచూపిన కపిని వధించి దానిపొట్టచించి, తిత్తిగా జేసికొని యాతిత్తిలో నుద కంబును నింపుకపోయె. అక్కటా! 'కపటికి జేసినట్టి యుప కారము చేటగు నెల్ల భంగున్' తద్వతుగనే మయ విశ్వ బ్రహ్మ వంశజుడైన మహానీయునివద్ద ఆ వ్యాసులు చేరి ఆయనకు ద్వాదశ వత్సరములు శుశ్రూషచేసి సకల శాస్త్ర ములు గ్రహించి యా మహనీయునిచే కారణంబును దీసికొని యా వర బలముచేత కలియుగము అయిదువేల వత్సర ములు దశవిప్రులే కలియుగ పంచసహస్రములున్నా ప్రపం చంబున పూజ్యులై వర్తించుచుండిరి. ఎందుచేతననగా నా కలియుగ పురుషుడు మనుచక్రవర్తియై క్షత్రియ ధర్మము లేనందు వలన క॥ దిన దినమును ధర్మంబులు, నవయము ధర నడిగిపోవు నాశ్చర్యముగా విను వర్ణ చతుష్టయములో, నెనయగ ధనవంతుడైన నేలుధరిత్రిన్॥ అను న్యాయంబున కలిపురుషుని మహాత్మ్యము వలన నీ కలియుగంబున నెంత దుష్కృత్యంబులు జరుగనున్నవో అదే ప్రకారముగా పంచ బ్రహల వంశోద్భవులైన విశ్వబ్రాహ్మణుల మూర్తినంత ములు తగ్గి సంకల్పశుద్ధి ఉండి—లేనట్టుగా ప్రచ్ఛన్న వేష ధారులై యుండిరి. మరియు—

శ్లో॥ కృతయుగే మనశ్శుద్ధిః। త్రేతాయాం దృష్టిరూపకం।
ద్వాపరే మంత్ర సామర్ధ్యం। కలియుగే కరసాధనః॥

అను న్యాయంబుగా వెనుక గతించిన యిరువది యెనిమిది మహాయుగంబులన్నియు శ్రీ విరాడ్విశ్వకర్మ వల్లనున్నూ, పంచబ్రహ్మలవల్లనున్నూ, చతుర్ధశ మనువుల వల్లనున్నూ, ప్రపంచము సృష్టిలయ పోషకత్వములనున్నూ, కొన్ని యుగంబులలో సంకల్పబుద్ధిచేతనున్నూ, కొన్ని యుగంబులలో మనశ్శుద్ధి చేతనున్నూ, కొన్ని యుగంబులలో దృష్టి చేతనున్నూ, కొన్ని యుగంబులలో మంత్ర సామర్థ్యముచేతనున్నూ సృష్టిలయ పోషణ కర్తృత్వములు కమ్మని యంతే అయెను. "కలియుగే కరసాధన" అను న్యాయంబుగా కలియుగము అయిదువేల పన్నెండు వత్సరంబులు"కరసాధన" చేతులతో జేయువలసి వచ్చెను.

శ్లో॥ మనూనాం లోహకర్మాణి, మయానాం దారుకర్మభిః
త్వష్టా కారుక కర్మాణి, శిలాకారంతు శిల్పిభిః
విశ్వజ్ఞ స్వర్ణకర్మాణి పంచబ్రాహ్మమయం జగత్॥

అను న్యాయంబుగా కలియుగ ప్రవేశము మొదలుకొనిపంచ సహస్ర ద్వాదశవత్సర పర్యంతంబు మనుసంతతివారుఇనుప పనియును, మయసంతతివారు దారుపనియును, త్వష్టసంతతి వారు తామ్రాది పాత్రలను, శిల్పసంతతివారు శిలావిగ్రహ



వీరంభొట్లయ్య తల్లికి విశ్వరూపము చూపుట

పనియందును, విశ్వజ్ఞసంతతివారలుస్వర్ణాలంకారం మొదలు కొని మాంగల్యములును నివి యన్నియు యీ కాలానురీతి గానే చేతులతో చేయడ మవుతున్నది. కాన అమ్మా! పంచాంగ పౌరోహిత్యాలు తిర్గి దేవబ్రాహ్మణులైన విశ్వబ్రాహ్మణులే చేసేటి కాలంబు వచ్చును. (దేవబ్రాహ్మణ మహాత్మ్యము.)

గీ. సానగాదులు బహుకష్ట సాధనముల
కాలమును గడుపు దినము యుగంబుగాను
బ్రహ్మత్వ హీనంబునై నీచబ్రాహ్మలగుచు
దీనవృత్తిని బడు కష్టదినములాయె.

నేను శ్రీ వీరభోగ వసంతావరుండనై వచ్చుసరికి

క. అటుపై పాంచాననులును
పటుతర పూర్వప్రకార బ్రహ్మజ్ఞానం
జెటిలంబునోప దెల్పెదు
రటుమీదట ధర్మపథము నంతయు నడచు

తల్లీ! ఇక నాకు సెలవొసంగుమని వేడి ఆయమ్మచే దీవనలొంది పాపాఘ్ని మఠంబునుండి బయలుదేరెను.

# ద్వితీయ ప్రకరణము


—• వీరంభొట్లయ్య దేశాటనము చేయుచు దివ్యక్షేత్రంబుల దిలకించుట •—

శ్రీమన్నారాయణుండైన వీరంభొట్లయ్యతల్లిచే సెలవు గైకొని, తన శరీరంబుపైనున్న భూషణాదులన్నియు దీసివేసి విభూధి మేనినిండా పూసుకొని, రుద్రాక్షమాలలు మెడ నిండా వేసికొని, కాషాయాంబరములు ధరించి, దండకమండలాదులు చేబూని, జపమాల నొక గేల నూని పశ్చిమాభి ముఖుండై బయలుదేరి మహానంది, ఓంకారము, శ్రీశైలమాదిగాగల పుణ్యక్షేత్రంబుల సేవించుకొని అచ్చటచ్చటగల భక్తాదులకు సుజ్ఞానంబును బోధించుచు, నంతట దక్షిణాభి ముఖుండై మధుర, ద్వారపతి, శ్రీరంగము, చీయాళి, చిదంబరం, రామేశ్వరము మొదలు గాగల పుణ్యక్షేత్రంబుల కేగి యచ్చటచ్చట నద్వైతంబును బోధించుచు, సాధువులైన సజ్జనులతో సాంగత్యము జేయుచు సర్వకాల సర్వావస్థల యందును బ్రహ్మోపాసనాపరుండై యుండెను. తిరిగి ఉత్తరాభి ముఖుండై వచ్చుచు "హరిహరముఖంబు" జేరి యట నొక నిర్జనస్థలంబును జూచుకొని దీక్ష వహించి సూర్యోపాసనాపరుండై సదా బ్రహ్మానందంబున నుండెను.

— ఈశ్వరాంశ సంభూతుడైన యానంద భైరవయోగి అరణ్యంబునకు వేటకై ఏగుట —

శ్రీ శంకరాంశ సంభూతుండైన యానంద భైరవ యోగి తన నివాసగ్రామంబైన కాశీపట్నంబునుండి వేటకై సఖులతో బయలుదేరి, మహారణ్యంబుల కరుదెంచిఅందుండు

వృక్షలతాదులను తిలకించుచు నా [illegible] దుండుడు కోకిల స్వరంబుల విని యానదించుచు నా లతాదులకు బట్టి యుండెడి పూదేనెలను ద్రావుచు తన వెంటనరుదెంచినతోడి సఖులతో పందెంబులు పెట్టి యేదియో యొక దానిని గురి చూచి విల్లంబుచే గొట్టి ప్రతి పందెంబును గెలుచుచు నా సఖుల మనంబులకు కష్టంబు లేకుండునటుల నానందంబును గూర్చుచు, నమ్మహారణ్యంబునం దుండెడి సెలయేళ్ళ కడ దుష్టమృగంబు లేవియైన నుండునేమోయని పదిలంబుగా దిల కించుచు దుష్టమృగ బృందంబునకై యందందు గుంటలు త్రవ్వి మాటులు పెట్టుచు నందుండెడి కోనేరులో సఖులతో గూడి జలక్రిడలుసలుపుచు,నాదినంబంతయు నమ్మహారణ్యం బున నిట్లే ప్రొద్దుపుచ్చుచు నా రాత్రి యొక మహా వటవృక్ష ముకడ నిద్రించిరి. మరునాడుదయంబుననే బయలుదేరి తాను మాటొడ్డిన మాటులు కడకుబోయి అందేమైన క్రూరమృగం బులు చిక్కుపడెనేమోయని తిలకించుచు నందందు హఠా త్తుగా తటస్థించుచున్న శరభశార్దూలభల్లూకాది దుష్ట మృగం బుల సంహరించుచు నమ్మహారణ్యంబంతయు దిరిగి తిరిగి వేసారి యొక కొలనుకడ నున్న వట వృక్షంబు నీడను విశ్ర మించిరి. అంత నమ్మహారణ్యంబున నొక గోవు కడుపార కసవును మేసి అచ్చటనున్న కొలనిలో నీరు త్రాగుచున్న సమయంబున నా గోవును జంపుటకై యొక చిరుతపులి పొంచి యుండెను. ఆ పులిని తోడి వారెవ్వరును తిలకించక యట్లే వారు వారు సంభాషించుకొనుచుండిరిగాని ధ్యానంధ



ఆనంద భైరవ యోగి ఆవుపై దుముకుచున్న పులిని బాణముతో కొట్టబోయి ఆవును కొట్టుట.



పులి పారిపోయెను. ఆవు చనిపోవుట. ఆనంద భైరవ యోగి దుఃఖించుట. మిత్రులూరడించుట.

భైరవయోగి మాత్ర మాపులి అలికిడి గ్రహించి పులియెచ్చట దాగియున్న దాయనియదే యాలోచనలోనుండెను. అంతలో నా గోవు నీరంబులను కడుపార ద్రావి దాని త్రోవనదిపోవు చుండగా పొదనుండి యా చిరుతపులి బయటకు వచ్చుట యానందభైరవయోగి చూచి యగ్గోవును బ్రతికింపవలెనని మనంబునందెంచి సఖులతో జెప్పకయే యొక బాణమును సంధించి పులిపై విడువగా అయ్యది గురితప్పి గోవునకుతగిలి వెంటనే గోవు అంబాయని అరచుచు ప్రాణంబును వదలెను. పొంచియున్న పులి పారిపొయెను.

మృతిచెందిన గోవును చూచి యానందభైరవయోగి దుఃఖించుట—తన
తోడి సఖులను గృహంబున కనిపి తాను గోహత్యా
పాప పరిహారమునకై క్షేత్రాదుల కరుగుట

అంతా తోడి సఖులు ఆనంద భైరవయోగిని జూచి "సఖుడా! ఇదియేమి? ఏ దుష్టమృగంబును చెండాడితివి? అది యెందున్నదో తెల్పు"మని యడుగగా నానందభైరవ యోగి నిర్విణ్ణుడై నోట మాట రాక అట్టే నేలపై కూలం బడెను. అవుడు తోడి సఖులు యిదియేమి? ఆశ్చర్యంబుగా నున్నదే? నిర్విణ్ణుడై కూలంబడుటకు కారణంబేమై యుండునో యని తహతహలాడుచు నా కొలనిలోని నీటిని దెచ్చి ముఖంబుపై చల్లి శైత్యోపచారంబులు చేయగా కొంత సేపటికి స్పృహ వచ్చి, 'అబ్బా! నేనెంత ద్రోహము చేసితిని?' అని సఖులను వెంటబెట్టుకొని మృతిచెందిన యాగోవు

వద్దకు నేగి ఆ గోవుపద్ద గూర్చుండి, ఆ గోవు మరణంబున
కమితముగా దుఃఖించుచు సఖులతోనిట్లనియెను-"సఖులారా!
చూచితిరా యీ యావును? మన మావృక్షంబు నీడ విశ్రాం
తికై కూర్చుండియున్న సమయంబున నీ గోవును జంపు
టకై యొక పులి పొంచియుండెను. నే నీ గోసంరక్షణంబుకై
బాణంబు నాపులిపై విడువగా గురితప్పి ఈగోవునకు తగిలి
మృతి జెందెను. ఆ పులి పారిపోయెను. అయ్యో! కిరాతకు
లొనరించెడి గోవధను నా జేతులార జేసి మహాపాతకంబును
మూట గట్టుకొంటినే! పరమేశ్వరా! దీనబంధూ! ఆర్తత్రాణ
పరాయణా! తానొకటి తలంచిన దైవంబొకటి చేయునను
నార్యోక్తి నిక్కంబయ్యెనే. సర్వేశ్వరా! గోవధచే గల్గెడి
మహాపాతకంబునకు పరిహారం బొనరించెద. పరమేశ్వరావ
తారు లెందరుండిరో గదా! సర్వసాక్షి! సచ్చిదానందసహితా!
సత్యావతారా! సకల భువనైకపాలా! సద్గుణశీలా! సన్మౌని
పాలా!" యని పరిపరివిధంబుల భగవంతుని బ్రార్థించుచు తా
నేమి చేయుటకును దోచక పిచ్చివానివలె మనోవికారుండై
అమితంబుగా దుఃఖించుచుండి, నంత తోడిసఖులు, 'సఖుడా
నీకీ సమయంబున గల్గిన మనోవికారంబు బోద్రోలి చిత్త
శాంతిని గలుగజేయ నెవ్వరి తరముగాదు. నీ ప్రారబ్ధ వశం
బున నిట్లు జరిగినదేకాని నిన్నటినుండియు మన మెన్నియో
దుష్టమృగంబులను సంహరించితిమే! ఇట్టిపాపకృత్యంబు
తటస్థింపదయ్యెను. మా వద్దకూర్చుండియు మాతో జెప్పకయే
యీ పని చేసితివి. నీ వీ మహాపాతకంబు ఒడి గట్టుకొనుట

తయే మాతో మాట మాత్రమైన చెప్పకయే యున్నొనరించి తివి కాన జరగవలసిన యోగం బిట్లుండి జరిగినదిగాని నీవు స్వయముగా గోవును సంహరించవలెనను దురుద్దేశంబుతో చేయలేదుగదా! ఈ పాపంబు నీకేమియు నంటదు. ఇక నింటికేగుదము రమ్ము. గతజల సేతుబంధమునకై వగచిన ప్రయోజనంబు లేదు. ఇక జరుగనున్న కార్యంబునకై ప్రయత్నించుమని యెన్నియో నీతులుదెల్పినను కేవల భూత ప్రేమగలిగిన యా యానందభైరవయోగి మనంబు మాత్ర మా గోవుపైననే యుండెను. 'సఖులారా ! నాతో మీరేల యిట్లరణ్యంబున కష్టంబుచెందుచుండెదరు. ఇక మీ గృహం బులకేగుడు. నా తల్లి దండ్రులతో నీజరిగిన చరిత్రయంతయు దెలుపుడు. నే నీ గోహత్యా పాపపరిహారంబునకై దివ్యక్షే త్రంబులం దిలకించి ఈ మహాపాతకంబును పోగొట్టుకొని, తిరిగిగృహంబునకువచ్చెదను గాన నికనాలస్యంబునుచేయక గృహంబున కేగుడు. నేనిదే దేశాటనకై ఎగుచున్నాడ'నని బయలుదేరి యనేక పుణ్యక్షేత్రంబులు సేవించుకొనుచు తపో నిష్ఠాగరిష్ఠులైన సంయమీంద్రుల సేవించుచువారు బోధించెడి సుబోధన శ్రవణానందంబుగా వినుచు, తిరిగితిరిగి హరిహర పురంబు జేరెను. అచటనున్న క్షేత్రంబును సేవించుకుని తిరిగి ఇంకొక క్షేత్రమునకు బోవనుద్దేశించి,అటనుండి బయ లుదేరి యా గ్రామమునకు వెలుపలనొక నిర్జన ప్రదేశంబున తపోనిష్ఠ వహించి సూర్యోపాసనాపరుండై యున్న శ్రీమన్నా రాయణాంశ సంభూతుండగు పిరంభొట్లయ్యగారి వదకు శ్రీ

శంకరానంద సంభూతుండైన యానందభైరవయోగివచ్చి, ఆ తపోనిష్ఠ యందున్న నా మహాభాగేయుని వీక్షించి, యీ మహామహునింజూడ కేవల పరమాత్ముండని తోచుచున్నది. లేకున్న నే నిదివర కెందరినిదర్శించినను నామనంబిట్లుమహ దానందంబున నుండదయ్యె. నా గోహత్యా పాపెపరిహారం బొనరింప నీయనకే దక్క మరి యెవరికిని సాధ్యంబు గాదని మనంబున దిట్టపరచుకొని ఆయన ప్రక్కన ముకుళితకరకను లుండై కూర్చుండి యుండెను. (పాఠక మహాశయులారా! వీరిరువురును ఎవరని తలంచెదరో! [?] శ్రీమన్నారాయణుండే వీరంభొట్లయ్య, శ్రీ శంకరుడే యానందభైరవయోగి యని గ్రహింపుడు.)

౦ వీరబోయాచార్యులు ఆనందభైరవయోగికి గోహత్యా పాపపరిహారంబు నకై తన దివ్యమంత్రోపదేసముచేసి మహమ్మదీయ వంశమందు జనింపుమని శాపం బొసంగుట ౦

వీరప్పయా చార్యులుగారు నిష్ఠనుండి మేల్కాంచి ముకుళిత కరకములుండై తన ప్రక్కన కూర్చొనియున్న యానందభైరవయోగిని జూచి 'నాయనా! నీ వెవండవు? నీవిట దీవనదనుండవై యుండుటకు కారణంబేమి?' యని యడుగగా నంత నానందభైరవయోగి "స్వామి!నేను కాశ్మీర దేశంబు పాలించెడు నొక క్షత్రియు సంయమీసుతుండను. తండ్రీ! నా కాపాదించిన ఘోరపాపపు వార్తను నేనేమని వక్కాణించువాడ? నా వార్త వినుటకా కర్ణకఠోరముగా నుండును. చెప్పుటకా నోరాడకున్నది. స్వయంకృతాపరాధ ముగా చేజేతుల జేసికొనివాడను. తండ్రీ! ఎట్టి ఘోరకార్యం

బైనను తమతోఁజెప్పక నేను జేయునదేమున్నది ? స్వామీ ! నేనును నా సఖులును వేటకై యరణ్యంబున కేగగా నటనొక గోవు కడుపార కసవును మేసి కొలనియందు నీరంబును ద్రావి తిరిగి దాని స్వస్థానంబున కేగుచుండగా నొకపులి ఆ గోవుపై బడబోవగా, నంత నేజూచి యొక బాణంబును సంధించి, యా పులిపై విడువ గురితప్పి నాబాణంబు గోవునకు తగిలిమరణించెను అంత నా గోవుమరణంబునకువగచి ఈ పాప పరిహారంబు నెవ్వరు చేసెదరాయని యనేకక్షేత్రంబులు తిరిగి యనేక ఋష్యాశ్రమంబుల కడకేగివారిని సేవించుచు నీ హరిహరపురంబునకు రాగా, నిటనున్న తమరు కేవల భగవత్స్వరూపులనినామదికిదోచి, నన్ను కడతేర్చెడు కరుణాభరణుండవని నా మనంబున దిట్టపరచుకొని తమ పాదంబులకడ కూర్చుండియున్నవాడ”నని వినయవిధేయతతో బలుకగా నంత వీరప్పయాచార్యులు తన దివ్యజ్ఞానంబున జూడగా నీతండు శంకరుడని యెఱింగి, ‘అయ్యా! నీవు ఈ మాయాసంబంధమైన శరీరంబును దాల్చుటచేత నీ విషయంబు నీకు దెలియకున్నది. నీవెవరని దలంచుచున్నాడవో ఇట్లువినుము. నీవు “రజతగిరి” వాసుండవైన ‘శ్రీ శంకరుండవు’. నేను వైకుంఠవాసుండనైన ‘శ్రీ మహావిష్ణుండను’ సరస్వతీ నాథుండయిన ‘బ్రహ్మ’ ~న్నాజయ్య బ్రహ్మానందులను నామంబుతో నీ లోకంబున సన్యాసి వేషంబుననున్నవాడు. మనముమువ్వురము ఈలోకంబున అజ్ఞానులను సుజ్ఞానులనుగా జేయు తలంపుననే యిట్లు మానవరూపులముగానవతరించితిమి. అయినను నీ వెంత శంకరాంశసంభూ

తుండవై యిట్లవతరించినను నీవుస్వయంకృతాపరాధంబునం జేసిన గోహత్యా పాతకంబు మాత్రము నీకు తప్పదు. ఈ లోకంబున కొలది దినంబులలో "వీరబ్రహ్మం"బను నామంబుచే కందిమల్లాయపల్లెకు బోబోవుచున్నాడను. నీవు మహమ్మదీయ వంశమునంబుట్టి నాకుశిష్యుండవై యుండి లోకంబున సుజ్ఞానంబును బారవోసి 'సిద్ధుండ'వని ప్రసిద్ధిచెందుమని వాక్రుచ్చెను. 'అప్పటికి నీ వొనరించిన గోహత్యా మహాపాతకంబు నశించుననని చెప్పగా, నంతయానందభైరవ యోగి చేతులు జోడించుకొని 'శ్రీ మదఖిలాండ కోటి బ్రహ్మాండనాయకా ! పురాణపురుషా ! పరమపావనా! భక్తజన హృదయసరోవర విహార రాజహంసమా ! వైకుంఠ ధామా!' యని స్తోత్రించి 'తండ్రీ ! తమ యిచ్చవచ్చినట్లు కానిం'డని వేడుకొనగా నాగోహత్యా మహాపాప పరిహారంబునకై వీరప్పయ్యగారు 'బిడ్డా! నీకు నొక దివ్య మహామంత్రోపదేశంబు జేసెద. అమ్మహామంత్రంబును చండాలాంత మెవరైననుగాని, మడిమైలయనునవి లేకనేస్మరించు చుండిన దర్శనంబొసంగెదను నీవు మహమ్మదీయ వంశము నేంబుట్టువరకును సదాయీమంత్రంబును స్మరించుచుండుము భక్తాదు లెవరికైనను నీ మహామంత్రంబును బోధింపుము. అయ్యా ! ఆనందభైరవయోగి!ముందుగా ఆచమ్యాదులైన మంత్రంబులతో ధ్యానించి, పిదపద్వాదశినిస్మరించిన ధన్యులయ్యెదరు. మహామంత్రము— ఆచమ్య— పూర్వోక్త ఏవంగుణ విశేషణ విశిష్టాయాం, శ్రీమదాది— శ్రీమతః—

గోత్రస్య...నామధేయస్య ... మమధర్మపత్నీ సమేతస్య సహకుటుంబానాం క్షేమ, స్థయిర్య, విజయ అభయ ఆయురారోగ్య, ఐశ్వర్యాభి వృద్ధ్యర్థం, శ్రీ వీరబ్రహ్మ దేవతా ముద్దిశ్య, శ్రీవీరబ్రహ్మ దేవతా ప్రీత్యర్థం, శ్రీవీరబ్రహ్మేశ్వర దేవతా మంత్ర జపంకరిష్యే! (మంత్రము) అస్య శ్రీ వీరబ్రహ్మస్తోత్ర మహామంత్రస్య సిద్ధ యోగీశ్వర ఋషిః పంక్తిచ్ఛందః పరంజ్యోతి స్వరూపిణి పరమాత్మా దేవతా ఓం అం బీజం ఓం హ్రీం శక్తిః ఓం క్రోం కీలకం మమ ధర్మార్థయిశ్వర్య కామ్యమోక్ష పంచవిధ పురుషార్థ ఫలసిద్ధ్యర్థేజపే వినియోగః కరన్యాసమ్‌కుర్యాత్. ఓం అంగుష్ఠాభ్యాన్నమః ఐంతర్జనీ భ్యాన్నమః సౌంఅనామికాభ్యాన్నమః హ్రీం కనిష్టకాభ్యాన్నమః— శ్రీం కరతలకర పృష్ఠాభ్యాన్నమః—ఏవం హృదయాది న్యాసః ఓం హృదయాయనమః ఐం శిరసేస్వాహా— క్లీం శిఖాయైవౌషట్—సౌం కవచాయహుం— హ్రీం నేత్రత్రయాయ వౌషట్— శ్రీం అస్త్రాయ ఫట్— భూర్భువస్సువ రోమితి దిగ్బంధః— ధ్యానమ్॥ మౌనీంద్ర సురబృంద వందిత పదం మందాకినీ ధారిణం, ఆనందం మృగధారిణం విషధరం సద్భిస్సదా సేవితం, లీలా మానుష విగ్రహం పశుపతిం భోగీంద్ర భూషోజ్వలం, వీర బ్రహ్మ సదాశివం హృదిభజే వేదాంత వేద్యం పరం॥ (కాలజ్ఞానము ప్రథమాశ్వాసము) నాయనా! ఆనంద భైరవయోగి! ద్వాదశీ మహామంత్రంబును బోధించెద వినుము. ఓం హ్రీం

క్లీం శ్రీం శివాయబ్రహ్మణేనమః అనెడి ద్వాదశాక్షరీ మహా మంత్ర పారాయణంబుచే సర్వ పాపౌఘంబు లడంగు. కుటుంబ వృద్ధియగును. కేవల పరమపద వాసులగుదురు. ఎట్లనిన మనోమారుతంబుల రెంటిని నేకముచేసి దశ విధ నాదంబులాలించి సద్ధర్ములుగా నుండువారు పరబ్రహ్మంబును గనుగొనగలరు. ఈ మంత్రంబును నీవు సదా జపించుచు భక్తులకు బోధించుచుండుమని చెప్పగానంత నానందభైరవ యోగి "స్వామీ! నీమహిమంబులు వర్ణింప నే నెంతవాడను? జలచర భూచర జంతుసహిత పరిపూర్ణంబయిన "బ్రహ్మం" అను నామంబున అవతరించినఅనంతావతారుండవని ప్రార్థింపగా నంత వీరప్పయాచార్యులుగారు ఆనందభైరవయోగిని దీవించి "బిడ్డా! ఇంక నీస్వగ్రామంబయినికాశీపురికేగు"మని చెప్పగా నా యానందభైరవ యోగి నమస్కారంబు చేసి యనుజ్ఞగైకొని హరిహర పురంబునుండి బయలుదేరి పండరి పురంబు సింహాచలంబాదిగా గల పుణ్య క్షేత్రంబులను సేవించుకొనుచు కాశీపట్నంబునంగల తన స్వగృహంబునకు జేరెను.

• వీరప్పయాచార్యులు సర్వక్షేత్రంబులు సేవించి, బనగానపల్లెచేరి గరిమరెడ్డి అచ్చమ్మగారింట గోపాలకుండై కాలజ్ఞానంబును వ్రాయుట •

శ్రీ వీరప్పయ్యగారు హరిహరపురము నుండి బయలు దేరి హంపి, విరూపాక్షం, అహోబిలం, మహానంది, ఓం కారం బాదిగా గల పుణ్యక్షేత్రంబులు సేవించుకొని బనగాన

పల్లెచేరి ఆ గ్రామమంతయు దిరిగి గరిమరెడ్డి అచ్చమ్మగా ఇంటికిజేరెను. సాయం సమయమగుటచే నారాత్రియంతయు నామె యింటి ముందరనున్న గుట్టపై పరుండియుండెను.

ఆయనను పలకరించిన వారెవరును లేరయిరి. తెల్ల వారగనే అచ్చమ్మగారు బైటకు వచ్చి గుమ్మము ముందర పిచ్చివానివలె కూర్చొనియున్న వీరప్పయాచారిగారినిచూచి, వీని యాకారమా పిచ్చివానివలె నున్నది. ఈయన ముఖంబు జూచిన మహా తేజోవంతముగా నున్నది. ఈతం డెవరైన నేమి? అనివీరప్పయాచార్యులవద్దకునేగినిలుచుండి నాయనా! నీ యూరెద్ది? నీ నామంబెయ్యది? తల్లిదండ్రులెవరు? ఇచట నుండుటకు కారణంబేమని అచ్చమ్మగారడుగగా నంత వీర ప్పయ్యగారు తల్లీ! నా యూరిపేరు బ్రహ్మాండపురం. నా నామము వీరప్పయాచార్యులు. నా తల్లిదండ్రులెవరో నాకు దెలియదు. నాకు ఒక చోటని నియమములేదు. నే నెప్పటి కిని ఒంటరిగానే యుందును. నీ దర్శనార్థినై వచ్చితినిగాని యీ సర్వంబు నేనై యున్నానని చెప్పగా, నామెయు సుజ్ఞా నియైనను అంత దూరదృష్టి ఆలోచనపోక, నాయనా! నీ వెందులకై నాకడ కరుదెంచితి వనగా, నా వీరప్పయాచారి గారు అమ్మా! నా చిన్నతనంబునుండియు నాలమందలను గాయుచు వాటి క్షీరంబులనే ఆహారంబుగా గైకొనుచు, నా గోవులకు పచ్చేడి జబ్బులను నయము చేయుచు నుండెడి. వాడను. ఇప్పుడు నీ యింట నాలమందలనేకంబు లున్నవని తెలిసి యిటకరుదెంచితిని. నాచే గోవులను గాయించుకొని

నిచ్చయుండెనేని మీరు నాకు పట్టెడు భోజనము మాత్రమ మూటగట్టి యిచ్చుచుండుడు. నాకెక్కుడు గోక్షీరంబులకై యిచ్చగలవాడను గాన నీ యింటను మాత్రము అన్నంబు భోజనము చేయనని చెప్పగా నీయన నోటినుండి వెలువడు చున్న విషయంబు లన్నియు కేవల షట్చాస్త్ర పారంగతుడై నను మాట్లాడజాలని వని అచ్చమ్మగారికి తోచి ఆమె యిట్టు లనియెను. "నాయనా! నీవు భీకరారణ్యంబులలోని కేగక నీ గ్రామము ప్రక్కన నున్న 'రవ్వలకొండ' పైని యావులను మేపుకొనుచు నీ గ్రామంబునకు మధ్యనున్న జున్నేటి యందు నీరంబులను ద్రావుకొనుచు సాయం సమయంబునకు నా గోవుల నిల్లు చేర్చుచుండుము. బిడ్డా! నీకు పదునారు వత్సరంబులైన లేకున్నవి. నీవు పసిడిచేష్టలచే పోకిరి పిల్లల సహవాసంబు చేయక బుద్ధిగానున్న నా యింట నీకేమియు కొరతలేదని చెప్పగా నంత వీరప్పయాచార్యులు "తల్లీ భీక రారణ్యంబున నేమియు భయముండదు. తొల్లి గోపాల కృష్ణుండు గోవులను గాయుచు పదునాల్గు వేల గోపికా లోలుండై యుండి భూ భారంబెట్లు తీర్చెనో అట్లే నేనును నీ యింటనుండి నీ ఆలమందలను గాయుచు గోపాలకుండనై యుండి పదునాలుగువేల విధములైన గోపికలతో క్రీడించుచు యీ కలికాల మనుజుల కుండు అజ్ఞానంబను అంధత్వంబును బాపి సుజ్ఞానం బను వెలుంగు జూపి పతితులను పావనుల నుగా చేయువాడ"నని చెప్పగా అచ్చమ్మగా రీ పిచ్చివాని మాటల కేమని తలంచి యాయనను తన గృహంబులోనికి

గొంపోయి పరుండుటకై వసతిచూపించి క్షీరంబులను గైకొని వచ్చి త్రాగుమని జెప్పి తన అంతఃపురంబులోని కేగి భోజ నంబునుజేసి పరుండి యిట్లనిఆలోచింపదొడంగెను. మొదట నీవెవరని అడిగితే బాలుండిచ్చిన జవాబును చూడ కేవలం భగవత్స్వరూపుండని తోచుచున్నది. తిరిగి శ్రీకృష్ణునకును తనకును భేదము లేనట్లుగాఁబల్కుచున్నాడు. ఈయనముఖార విందము చూచినప్పటినుండియు నామనం బెందులకో మారి పోయినది. ఇది యంతయును జూడగా నొక చిత్రముగా గాన్పించుచున్నదని యాలోచింపుచు నిదురించెను. తెల్లవార గనే క్షీరంబులను త్రాగుమని అచ్చమ్మగారు వీరప్ప యాచా రికి గారికితెచ్చియిచ్చిరాగిసంకటిముద్దనుమూటకట్టినాయనా! యిదిగో అన్నపు మూట. ఈ గోవుల నెట్లు కాపాడెదవో యని యా యాలమందల నాయన స్వాధీనము చేసెను. అంత నాత డా గోవులను తోలుకొనిపోయియొకచోటగుంపు లుగా చేసి యా గోవుల చుట్టును నొక గీత గీసి తానొక తాడిచెట్టుకడ కేగగా నాచెట్టు సొంతముగా వడెనోయనునట్లు క్రిందికి వంగెను. అంత నా మహాభాగేయు డా తాడిచెట్టు లోని మువ్వను గోసికొని గులజారి ముండ్లను తీసికొని, రవ్వలకొండి యందొక గుహచూచుకొని, లోని కేగి యట గూర్చుండి యా తాటియాకులపైనిగులజారి ముండ్లతో కాల జ్ఞానంబును వ్రాయుచుండెను ప్రతి దినమును నిట్లె వ్రాయు చుండెను. తాను స్థితినుటకై కట్టెడు అన్నపు మూటను నిత్య మును ఒక పాతరయందు వైచుచుండెను. వీరప్ప యాచారి

వ్రాయు కాలజ్ఞానంబు లన్నియు అచ్చమ్మగారి యింటి ప్రక్కనయున్న పాడు పాతరలోవైచి ఎవ్వరు చూడకుండ బండ మూయుచుండెను ఆయన కాయుచున్న యాలమంద లోని గోవులన్నియు దినదినప్రవర్ధ మానముగా బెరుగు చుండెను. తోటి బాలురు గుట్టలన్నియు త్రిప్పికొని బహు శ్రద్ధతో గాయుచున్న గోవులన్నియు నెప్పటియట్లే బక్క చిక్కియుండెను. ఒకానొక దినంబున నా గ్రామస్థులాదారినే వచ్చుచుండగా గుంపుగానున్న గోవులను జూచి యెవ్వరును లేకుండా గుంపుగానుండుటకు కారణంబేమైయుండునోయని వారంద రాలోచించుకొని ఈ గోవులను గాయు వారెవ్వ రచ్చట లేనందున,నివియన్నియు తప్పించుకొని యిటువచ్చి యుండవచ్చునని యా గోవులకడ కరుదెంచి వారందరును తోలగా నా గోవులన్నియు నెమరువేయుచు నట్లె గుంపుగా నుండెను. వారెన్ని ప్రయత్నంబులు జేసినను ఒక్కటైనను కాలు గదల్చకుండా అట్లె నిలువంబడియుండె. అంత వారికి విసుగుతోచి ఆ వీరప్పయాచార్యస్వాములవారు ఆవుల చుట్టు గీసిన గీత మీదుగా దాటి ఆవలకు వెళ్ళేసరికి వారి నేత్రం బులు కాన్పించక అంధులైరి. అంత వారి కేమియు దోచక మెల్లగా వారెట్లు గీత మీదుగా వచ్చిరో, అట్లె గీతమీదుగా వెనుకకు వచ్చువరకే వారినేత్రంబులు యధావిధిగాగాన్పించు చుండెను. కాని గోవులు మాత్రము కదలక అట్లె గుంపుగా నుండెను. అంత నా గోవులెవ్వరివని వారు విచారించగా అచ్చమ్మ గారివని తెలిసి, యామె వద్ద కేగి యీ జరిగిన



వీరప్పయ్య గోపాలకుండై గోవులను గుహయందుంచి కాలజ్ఞానము
వ్రాయుట అచ్చమ్మగారు గుహకు వచ్చి గమనించుట

వృత్తాంతమంతయు వారు చెప్పగా నంత నామె కేమియు తోచక నాయనలారా! ఇక మీ రేగుడని చెప్పి, వీరుచెప్పిన సన్నియు యదార్థమో? కాదో? ఏమియు తోచకున్నది. ఇది యంతయు నాలోచింపనేల? నేనే స్వయముగా నాయనకుకన బడకుండ నేగి కనుగొనియెదనని తలంచెను.

• అచ్చమ్మగారు వీరయప్పగారి మహత్తు నెరుంగుటకై గుహకడ కరుగుట వీరప్పయ్యగారి మహత్తెరిగి అచ్చమ్మగారు స్తోత్రంబు చేయుట •

మరు దినంబున ఎప్పటివలెనే వీరప్పయాచారిగారు గోవులను దోలుకొని వెళ్ళినపిమ్మట అచ్చమ్మ గారాయనకు గనపడకుండ దాగి దాగి యాయన వెంటనే వెళ్ళుచుండెను. ఆయన ఎప్పటి యట్లె గోవులను గుంపుచేసి, యా గోవుల చుట్టు గీతగీసి, తాటిచెట్టు వద్దకేగి తాటి ముువ్వను గోసిగొని యా గుహలోనికేగి, ఎప్పటియట్లు కాలజ్ఞానంబులను వ్రాయు చుండెను. అంత వెంట దాగి వచ్చుచున్న అచ్చమ్మగారు తాటిచెట్లు వంగుటయు, స్వాములవారు గీసినగీతలోనే గోవు లుండుటయు జూచి ఆశ్చర్యమొంది, యా గుహలోని కేగి చూడగా, గుహయంతయు పట్టపగలుగా నుండెను. అందు శ్రీ వైకుంఠవాసుండైన శ్రీమన్నారాయణునివలె దేదీప్య మానుండై కాలజ్ఞానంబులను వ్రాయుచు గూర్చొని యున్న వీరప్పయాచార్యుల వారిని అచ్చమ్మగారు చూచి తన్మ యత్వంబుజెంది, అట్లెఆయననుజూచుచు నిలువంబడియుండి కొంతసేపటికి జ్ఞాతదెచ్చుకొని, మెల్ల మెల్లగాతిరిగి గృహంబు జేరెను. కాని యామె మనంబంతయు నా వీరప్పయ్యగారి

యందే లక్ష్యంబు నిల్పి యాయన రాకకై యెదురుచూచుచు పిచ్చివానివలె నటునిటు తిరుగుచుండెను. అంతసాయంసమ యంబున తాను వ్రాయుచున్న కాలజ్ఞానంబు నాగుహయందే యెప్పటియట్లు దాచి, గోవులను దోలుకొని ఎప్పటి యట్లే గృహంబునకురాగా అచ్చమగారంతట వచ్చుచున్న వీరప్ప యాచార్య స్వాములవారి పాదంబులపైబడి తండ్రీ! నీవు నిజముగా వైకుంఠవాసుడవే! నీ వీ రీతి పిచ్చివానివలె నా ఇంటి యందుండి గోవులను కాయుటన్యాయమా ? అయ్యో! తండ్రీ ! నిన్ను నింతవరకు నిర్లక్ష్యముగా జూచినందులకు క్షమించి, నన్ను నీబిడ్డరీతిని జూచి కాపాడు భారంబునీయది గాన స్వామీ ! విరాడ్విశ్వరూపా ! అనంతావతారా ! ఆప ద్బాంధవా! అనాధరక్షకా! యని యనేకవిధంబుల స్తోత్రంబు చేసి 'స్వామీ! నీవు జగన్నాటక సూత్రధారుండవైన సర్వే శ్వరుండవు గాని సామాన్య మానవుండగా' వని తిరిగి స్తోత్రంబుచేసి నిలువంబడగా నంత స్వాములవారు 'తల్లీ! యిదేమి వింత? నా వంటి పిచ్చివాని పాదంబులపై బడిన నేమి ప్రయోజనము ? నీవా బహు ధనికురాలవు. మాబోటి దిక్కులేనివారల ననేకులను పోషించుచుంటివే ! అమ్మా ! నీ కన్న నే నెక్కువవాడనా? నీవంటి ధార్మికు లీ ప్రపంచం బున నుండుటచేతనే మాబోటి వారలు జీవింప గలిగి'రని చెప్పగా నంత అచ్చమ్మగారికి శ్రీ పరమేశ్వరుండే నా గృహంబునకు నీ రూపంబున నరుదెంచినాడను మహదా నంధమునకు మేరలేక చేతులు ముకుళించుకొని 'స్వామీ!

కలికాలపు మూఢులకుండు సజ్ఞానంబును బాపు కమల దళా క్షుండవని, యెరుంగక కేవల మజ్ఞానినై చేసిన నా తప్పులను సైరించి నాకు బ్రహ్మోపదేశమిచ్చి నన్ను పావనురాలనుగా చేయుమని ప్రార్థించగా అంత స్వాములవారు అచ్చమ్మగారి మనంబు నిర్మలమైనదని యెరిఁగి తల్లీ! అటులైన రేపు ఉద యమే యాగంటి క్షేత్రంబున కేగుదము. అచ్చట నీకుండు సంశయంబు లన్నియు దీర్చెద ననెను

వీరప్పయ్య స్వాములవారు అచ్చమ్మగారిని యాగంటి క్షేత్రంబునకు దోడ్కొనిపోయి బ్రహ్మోపదేశంబు చేయుట.

శ్రీ స్వాములవారు అచ్చమ్మగారిని దోడ్కొని తెల్ల వారుజాముననే బయలు దేరుదమని మనంబున దలంచి ఆ రాత్రి పరుండెను. అంత తెల్లవారగనే స్వాముల వారిని అచ్చమ్మగారు అర్ఘ్యపాద్యాది విధుల బూజించి స్వాముల వారిని వెంటబెట్టుకొని యాగంటి క్షేత్రంబున కేగి అచ్చట నున్న యాగంటీశ్వరుని సేవించుకొని ప్రక్కనున్న కొండపై నిబిపురునెక్కి యటనిర్మలస్థలంబుసగూర్చుండిరి. అచ్చమ్మ గారు స్వాములవారి పాదంబులకు నమస్కరించి తండ్రీ! ఈ పిపీలికాది బ్రహ్మపర్యంతమును ముల్లుగ్రుచ్చు నందు లేకుండా యుండిన యీ పరబ్రహ్మము స్త్రీరూపియా? లేక పురుష రూపుడా? యని వినయతతో ప్రశ్నించెను. అంత వీరప్పయ్య స్వాములవారు తల్లీ! వినుము. శ్లో॥ పురుష రూపం భవేద్దేవీ స్త్రీరూపం భవేత్ శివః॥ అథవా నిష్కళం ధ్యాయే త్సచ్చిదానంద విగ్రహం॥ అనగా చిదా నందుడైన

పరమాత్మ సూత్రమనే రూప భేదము గాని సర్వాంతర్యామి యైన భగవంతుడొక్కడే గాని రెండవది లేకుండానిండియు న్నదని చెప్పగా నామె సంతోషించి స్వామి! నన్ను మీ దాసురాలిగా జేసికొని నాకు బ్రహ్మోపదేశమిమ్మని యడు గడా నంత స్వాములవారు తల్లీ! కోరిన కోర్కె మహా దానందం బొసంగునది కావున నీవు నిర్మల మానసంబున వినుము 'ఓం హ్రీం క్లీం శ్రీం శివాయ బ్రహ్మణేనమః' అని ఆమెకు బీజ సంపుటియైన నమ్మహామంత్రం బొసంగి బిడ్డా! నీవు నిత్యమును నీ మంత్రంబును జపించుచున్న సద్గ తికి త్రోవను జూపును. ఇక ముందీ అద్వైత బోధ చేసెద నని చెప్పగా నంత అచ్చమ్మగారు తండ్రీ! తామేదో వ్రాయు చుంటిరే అద్దానిని బోధింపుడని వేడగా అమ్మా! నేను వ్రాయునది 'భవిష్యద్గ్రంథము'. అందుండు రహస్యంబు లన్నియు దేవరహస్యంబులు. సాధారణ మానవులకుచక్కగా బోధపడవు కేవల బ్రహ్మజ్ఞాను లందఱి కా 'భవిష్యత్తు' బ్రహ్మానందంగా నుండును. నీవు బ్రహ్మజ్ఞా నామృతమును గ్రోలుటకు తగినదాన వగుటచే నీకా భవిష్యత్తును దెల్పెద వినుము.

వీరప్పయ్య స్వాములవారు అచ్చమ్మగారికి కాలజ్ఞానంబు బోధించుట

తల్లీ! అచ్చమాంబా! వినుము. 4808 సంవత్సరంబులు ఈకలియుగంబులో జరిగిపోయిన పిమ్మట ధర్మదేవతభూలోక మందు పుణ్యస్థలంబులలో దిరుగుచుండును. పాపంబుల్లు

నానాటికి హెచ్చి ఎందునలేని కలహంబులుపుట్టును. అధిక ఆహారము, అధిక నిద్రగలిగి నిలిచిన తావుననిల్వక సమస్త మైన నరమృగాదులు సంచరించును. శాంత గుణముగల్గిన వారలు కోపవంతులయ్యెదరు. నీచులు అధికులగుదురు. అధికులు ఎందుకు కొరగాకుందురు. విప్రులు తమతమ ధర్మంబులు విడచి మనిషి కొక్కొక్క మతమై నీచులనాశ్రయించి షట్కర్మరహితులై చెడిపోదురు. రాజులుతమ రాజధర్మంబులను విడచి చోద్యవంతులై నీచ కార్యంబుల జొచ్చి దేశాల పాలగుదురు. తమ తమ కులంబులు వదలి అధర్మముచేత దుష్కర్ములై పోదురు. శూద్రు లసత్యవాదులై నీచ సాంగత్యముచేత దరిద్రులై చెడిపోదురు. ప్రతిజాతియు సంకరంబై పరస్పర వైరంబులు హెచ్చి మతకలహంబువలన కొట్టుకొని మరణింతురు! దుష్కర్మలవలన బహువిధంబులైన కష్టంబులొంది చెడిపోదురు. పైర్లు కొంచెముగా ఫలించును గోవులు కొంచెముగా పాలుపిండును. తండ్రీకొడుకులు తమలోతాము వలహించేరు. దేవబ్రాహ్మణులను గురువులు దూషించేరు. వావివర్తనలు దప్పినడిచేరు ఒకరి సొమ్ము నొకరపహరించేరు. చోర, రోగ, ఉపద్రవములు హెచ్చేను. అగ్ని భయంబులు అధికమయ్యేను. అడవిమృగంబులు గ్రామాదులలో చేరేను. ఏనుగునకు పందిపుట్టును. పందికికోతిపుట్టును పాపంబులు హెచ్చేను. వేశ్యల వశీకరణమువల్లను అంజనంబుల వల్లను ప్రజలు దురాశచేతను, భ్రమలచేతను ద్రవ్యంబులుకొల్లగొట్టి దరిద్రులై చెడిపోయేరు. ఇంద్రజాల వేదంబు


లను చండాలురు ఆభ్యసించేరు. చోళమండలము నష్ట మయ్యేను. శిలలు కండలు గ్రక్కేను. ఆకండలను తినుటకై గ్రద్దలు వచ్చి చచ్చేను. ఆ చచ్చినవాటిని బట్టుకొని ప్రజలు గంతులు వేసేరు. కొరువుల నోటగరచుకొని తిరిగేరు బెండ్లు మునిగేను గుండ్లుతేలేను. కొండలు మండేను. భూతగ్రహ చేష్టము అధికమయ్యేను. కడుపులో మంటలుపుట్టి చచ్చేరు. నోటియందు బొబ్బలుపుట్టి నెత్తురు గ్రక్కుచు గుండెలుపగిలి నడినెత్తి పగిలి చచ్చేరు. పశుమృగాదుల గుంపులుగా గూడి చచ్చేను. పట్నాలన్నియు నొకరేపాలించేరు. ఇతరదేశీయులు వచ్చి భరతఖండ మంతయు నొకరేపాలించేను. వారు పాల నమునకై వచ్చిన పిమ్మట మానవులే గాక చీమలుతో సహా చదువు నేర్చుకొనేను నవనాగరికత హెచ్చును. విద్యా జ్ఞానంబు బలిసి వర్ణంబులన్నియు నొక్కటియ్యేను. అన్ని యుగంబులలోని పాలనకన్న సీపాలనము సర్వజనానుకూల ముగా ఉండేను ఎద్దులు లేకుండనే బండ్లు తోలేరు. మంచి నీటిచేత దీపంబులు వెలిగించేరు. పులి, మేక ఒక రేవున నీరు త్రాగేను. ఊరూరను జనులు అన్యోన్య కలహంబులు బెట్టు కొని కొట్టుక చచ్చేరు వెంపలి మొక్కలకు నిచ్చెనలు వేసి ఎక్కెడివారు బుట్టెదరు తక్కువజాతివారు ఆచార వంతు లైన బ్రాహ్మణులను, దేవ బ్రాహ్మణులను నింద చేసేరు. దేవ నిర్మాణ దేవతా ప్రతిష్ఠ దేవపూజలు చేయువారలు దరి ద్రులై యుండేరు. విజయనగరము కొన్నినాళ్ళు పూజనీయ మైయుండి, కొన్ని దినంబులకు చెడిపోయేను. కాశీ పటణము

పలుబడి దినంబులు పొడుబడి యుండెను కురుక్షేత్రమందు జనులు గుంపుగా కూడుకొని నరకులాడేరు. కొండవీడును విష్ణుభక్తులేలేరు. గోదావరీ నదియందు వుదకము పన్నెండు దినములు సమసిపోయెను ఆవల యుప్పొంగేను. కాళహస్తీశ్వరుని సముఖ మందుండే ద్వారపాలకులు ఒక్క ముహూర్తములో గ్రుద్దులాడేరు వేంకటేశ్వరుని కుడి భుజము అదరేను. మంగళగిరిలో మాయావాదులనే వైష్ణవులు కలహముచేత రెండు తెగలై యుద్ధమునకు గదిసేరు. కుక్కలు గుఱ్ఱాలను చంపేను. పగలు చుక్కలుకాన్పించేను. అందున కొన్ని గ్రామాదులలో జనులు నష్టమయ్యేరు. చుక్కలు రాలేను. కార్తీక బహుళ ద్వాదశి రోజున ఉత్తర భాగమున నాల్గు ముఖముల చుక్కలు బుట్టి, యిరవై అయిదు వారములు ప్రకాశించేను కర్ణాటక దేశములో లక్ష్మి చలించేను. నిక్షేపమైన ద్రవ్యములు మహమ్మదీయులు కొంతకాల మపహరింపగా, ఆ మీదట వెలమరెడ్డి రాజులు కొంచెములో కొంచె మపహరించేను. మళయాళములో మందపాలుడు మనుజులతో మాటలాడేను తిరుపతులకు పోవు మార్గాలు కట్టుబడేను. భూమినెత్తురుచేత తడిసేను. ఎముకలు కొండల పొడవున పడేను. భూతప్రేత పిశాచాది గ్రహంబులు కోలాహలంబుగా నాడేను. అహోయని ప్రజలు అరచేరు. కాకులు వికార స్వరములచే అరచేను. నక్కలు ఝాము ఝామునకు తప్పక నానాటికి హెచ్చుగా అరచేను. అందున కొందరు నష్టమయ్యేరు. కొండవీటి కుత్తరాన రాతి గరుడ స్తంభము

ఊడిపడేను. అందున కొందరు జనులు నష్టమయ్యేరు. కలియుగము 5000 సంవత్సరముల మీదట కాశీలో గంగ కానరాకుండేను కంచి కామాక్షమ్మ గిరగిర చక్రాకారముగా జాముతిరిగేను ఖిళంకామాక్షమ్మ నెత్తురు గ్రక్కేను వేప చెట్టున అమృతం కారేను మాచర్లలోని రాజులందరు నొక మదవతిచే హతులై పోయేరు ఆ మీదట మాచర్ల చెన్నకేశవ స్వామి మహిమలన్నియు తగ్గిపోయేను. కారెంపూడిలో కల హములు పెంచుకొని అందునరాజులు హతమయ్యేరు గాలి వానలచేత శ్రీశైలమునకు దక్షిణమున గుండ్లు దొర్లేను. నెత్తురువాన కురిసేను. బండలు పగిలి ఆకాశమున గ్రద్దల వలెను, కాకుల వలెను ఆడేను జాతి గుండ్లలో చీము, నెత్తురువచ్చేను. మష్టు ఆరని బిడ్డలు మాట్లాడేరు. ఆకాశము బున పొగమంటలు పుట్టును. ఆరు మతములువొకటయ్యేను. ఆహాయనే ధ్వనులచే బిక్కేరు ఆకాశ మందు అర్ధరాత్ర మందు ఘణా ఘణాం అని పదిగంటల రవంబులు బుట్టును. శంఖారావంబులు వినంబడేను ఒకరి సొత్తు మరొక రపహ రించేరు. ఒకరి ఆలు మరికరి పాలయ్యేను. పుణ్యావాదులు నా ప్రభావంబును తిప్పుకొనేరు పుణ్యస్త్రీలు,పుణ్యపురుషులు బ్రతికేరు. పుణ్యస్థలంబులుచెడేను. దేవస్థానంబులు పాపా త్ములచేత నష్టమయ్యేను. నిక్షేపాలు బయలుపడేను. వెంకటా చలములో మహమ్మదీయులను చండాలురును పూజచేసెను. వేంకటేశ్వరుని సొమ్ము దోచేరు ఈ దివ్యస్థలంబున నారు గురు దుష్టులు బుట్టుదురు తిరువళ్ళూరి వీరరాఘవస్వామికి

ారుమేనలు జేసేరు. అప్పుడు కుంభద్రోణములుగా చెమటలు
బట్టేను. కృష్ణా గోదావరీల మధ్య ఆవులు గుంపులు గుంపు
లుగాగూడి బహుగా చచ్చేను. ఒకరి నొకరు పట్టుకొని అడ
వుల పాలయ్యేరు. శీతోష్ణ జ్వరాలచే జనులు నశించేరు.
కృష్ణానది మధ్యన బంగారు తేరు కనిపించేను. ఆతేరుచూచిన
వారికి కన్నులు కనబడకుండేను. అశ్వపతి సంస్థానము
మంటపం బయ్యేను. కర్నాటక దేశము మహమ్మదీయ
ాంతలచేత దేవాలయంబులు, శిలావిగ్రహంబులు విఘ్నమై
పోయేను. శిలాధారణమైన తేరు లాకస్మికముగావిరిగిపడేను.
దేవబ్రాహ్మణులు ఆచారశూన్యులై పోయేరు. వారికితినుటకు
తిండిలేక మాడుచుండేరు. శ్రీశైలభ్రమరాంబ సముఖమున
రెండుతలల బంగారుముసలి కనిపించేను. తిరిగిభ్రమరాంబలో
ఐక్యమయ్యేను. చక్రాంకిత సంభవుడైనపరమహంసఉదయ
గిరి శిఖరాగ్రమందు అమావాస్యనాడు ఎక్కినప్రజలు చంద్ర
గ్రహణమని భ్రమసేరు. శివ వైష్ణవ దేవళంబులలో
రక్తంబు బుట్టును, ఆకాశంబునుండి రెండుబంగారు హంసలు
వచ్చి పురములయందు, వనములయందు, నదులయందును
సంతరించేను. పాపాత్ములయిన ప్రజలు చూచి పట్టెదమని
పోయి కన్నులుగానక గిరగిర తిరిగి లక్షోపలక్షలుగ చచ్చేరు.
తూర్పునుండి పడమర వరకు ఆకాశంబున యోజన ప్రమా
ణము వెడల్పుగా చెంగావి చీరెకట్టినట్లు కనబడేను. కొండల
యందు ఘణాం ఘణాం మను శబ్దము వినబడేను. నానాటికి

వింతలు హెచ్చెను. ఇంకను దేవరహస్యంబులు లనేకంః బున్నవి. తల్లీ। ఈ వింతలన్నియు నేను వీరభోగవసంతరా యుండనై కలియుగంబునవచ్చువరకు జరుగునుండును. ఇక ననేకంబులు జరుగును. ఇవి యన్నియు పిమ్మట సావధానం బుగా దెల్పెద. నాకు భక్తులైనవారికి మోక్షంబుకరతలామల కముగా నుండును నన్ను భక్తితో నమ్మినాకాలజ్ఞానంబును బూడించిన వారికిని, పురాణంబు జెప్పుకొనుచు వినువారికిని, చదువువారికిని అష్టయిశ్వర్యంబులు సమకూరును. గానసీవు సదా నన్ను ధ్యానించుచుండుము. నీకు బ్రహ్మత్వంబు సిద్ధిం చునని శ్రీ వీరప్పయాచార్యుల స్వాములవారు చెప్పగా, నా యచ్చమ్మగారికుండెడి మహదానందమునకుమేరలేకస్వామీ। ఇక గృహంబునకేగుదము రమ్మనిస్వాములవారిని దోడ్కొని బనగాపల్లి జేరిరి. వీరిరువు రాకొండపై ముచ్చట లాడుట చేతనే ఆకొండ ఇప్పటికిని "ముచ్చట్లు" అనిపిలవబడుచున్నది అంత వీరప్పయాచారిగారు వ్రాయుచుండిన కాలజ్ఞానంబు లన్నియు నాయచ్చమ్మగారి యింట నున్న నొక పాతర యందుంచెను కొన్నిదినంబులు గడచిన పిమ్మటకాలజ్ఞానపు పాతరపైని నొక చింతచెట్టు మొలిచెలు. స్వాముల వారికి అచ్చమ్మగారు ఒక మఠంబును గట్టించెను. ఆ లోమఠంబు నందే ఇరువురునుండి తపంబు చేయుచు నుండిరి. అచ్చమ్మ గారు సంసారంబును వేడి వైరాగ్యమానసియై ఆ స్వాముల వారిని సేవించుచు నాయనకడ నుండెను.



కాలచ్చిన పాపరపై మొలచిన లంచము

## కాలజ్ఞాన పాతరపైని మొలిచిన 'చింతచెట్టు' మహాత్మ్యము

శ్రీస్వాములవారువ్రాసిన పదునాల్గువేల కాలజ్ఞానంబులను దాచిన పాతరపైని నొక చింతచెటు మొలిచెను.అప్పటి చెట్టు ఇప్పటికిని కలదు. ఆ చెట్టునకు రెండు పంగలు గల్గి షుమారు ఏబదిమూరలు యెత్తును. ఒక చిన్నగది వెడల్పును గలదై యున్నది ఆ చెట్టు మొదలుచూడగా షుమారు చుట్టు వలయము ఒక గజమున్నది. షుమారు 700 సంవత్సరముల నుండియు నిప్పటివరకు చూచుటకు పొన్నచెట్టుగన్పాకొంచె ముండును ఆ చెట్టునకు కాయలన్నియు లోస కాటుకపట్టి యుండును. తినుటకు నుపయోగింపరు ఏదియైన నుత్పాతంబు పుట్టుటకు ముందుగనే యాచెట్టునకు పూచిన పూతంతయు నొక రాత్రే ఝల్లున రాలియుండును. కలరా వగైరా జాడ్యంబులు సంభవించుటకు ముందుగనే యా చెట్టుకున్న రెండు కొమ్మల మధ్యనుండి (అనగా పంగలో నుండి) రక్తము మాదిరికారును. అది గడ్డకట్టి కుంకుమ మాదిరిగా నుండును ఈ దృష్టాంతము లిప్పటికి జరుగుచునేయున్నవి. ఆ చెట్టు ఎప్పటిదని బనగానపల్లెలోగల వృద్ధుల ననేకులను విచారించగా మా చిన్నతనంబు నుండియు నట్లే యున్నది. మా పూర్వులుకూడా యిట్లే చెప్పుచుండిరని వారు చెప్పిరి. ఆ చెట్టున కిప్పటి వరకును నిత్య నైవేద్య దీపారాధనలు జరుగుచున్నవి.

# తృతీయ ప్రకరణము

## ౦—వీరప్పయాచార్య స్వాములవారి వద్దకు త్వష్ట బ్రహ్మవంశ సంభూతుండగు అన్నాజయ్యగారు వచ్చుట—౦

శ్రీస్వాములవారు అచ్చమ్మగారు కట్టించిన లోమరంబున నుండి, జ్ఞానశూన్యులకు బ్రహ్మజ్ఞానోపదేశముచేయుచు ననేకుల సంశయంబులను దీర్చుచు భక్తులనుగా జేసికొనుచుండెను. ఒకానొక దినంబున అచ్చమ్మగారు పాదసేవ చేయుచు స్వామీ! నాకు నొక్కండే కుమారుడు. ఆయనకు నేత్రంబులు గాన్పించవు. చూచుటకా మన కందరకును మంచి నేత్రంబులుగానే యున్నట్లుండును. గతియేమి? అని యడుగగా నంత స్వాములవారు అమ్మా! నాకా విషయంబును నీవు చెప్పం బనిలేదు. నాకా విషయంబు దెలియును. నీ వాయనను యెల్లుండి ఉదయమే నే ననుష్ఠానంబు చేసికొనెడి సమయంబున నాకడకు తోడ్కొనిరమ్ము సంశయింపకుము. వాని కీ లోకంబు చూచెడి యోగంబున్నదనిచెప్పి తాననుష్ఠానంబున గూర్చుండెను.ఆ సమయంబునబ్రహ్మాంశ సంభూతుండైన అన్నాజయ్యగారు దేశ దేశంబు లన్నియు తిరిగి సకల క్షేత్రంబులు సేవించుకొని శ్రీశైలంబున కేగి యచట కొన్ని దినంబులుండి యందుగల గుహలయందు తపంబు చేయుచున్న యోగీంద్రుల దర్శనంబు చేసుకొని, వారికి శుశ్రూషలు చేయుచు వారివద్ద కొన్ని దినంబులున్న

పైవారి యాజ్ఞగైకొని యట నుండి బయలుదేరి మహా నందీశ్వరుని సేవించుకొను తలంపున వచ్చుచు, బనగానపల్లెకు చేరెను. ఆ గ్రామమంతయు తిరిగి గరిమరెడ్డిఅచ్చమ్మగారు శ్రీ వీరప్పయాచార్య స్వాములవారికై కట్టించిన లోమఠంబు కదకరుదెంచి యా మఠంబులోని కేగిచూడగా కాలజ్ఞానంబు వ్రాయుచున్న శ్రీస్వాములవారు కన్పడ నేనెందరినో చూచితినిగాని యిట్టి తేజోవంతుడైన మహనీయుడు గాన్పించ దయ్యె. శ్రీవిరాడ్విశ్వ కర్మయగు శ్రీమన్నారాయణుండు గాకున్న నా మహాభాగేయుని ముఖంబు జూచినంతనే నా మనంబతయు నాయనయందేలగ్నమైనది? ఎద్దియో శుభంబు గానున్నది. లేనిచో నాదక్షిణనేత్రంబెందులకదరుచుండును? ఈయనయే నాకుతోడునీడయని వీరప్పయాచార్య స్వాములవారి ప్రక్కకు జేరి అట కూర్చుండెను. అంత స్వాములవారు నన్నాబయ్యగారినిజూచి 'నాయనా ! నీ వెవరవు ? నీ నామంబెయ్యది? నాకదకు రాతగంబే'మని యడుగగా నంత నన్నాబయ్యగారు ముకుళిత కరకమలుండై స్వామీ ! నేనొక విశ్వబ్రాహ్మణ బాలకుండను. నా నామంబు అన్నాబయ్య బ్రహ్మానందు లనియెదరు. తండ్రీ ! నేను కేవల విరాగినై సర్వ పుణ్యక్షేత్రంబులు సేవించుకొని మహానందీశ్వరుని సేవించుకొనెద మనెడి తలంపున నిటుగా వచ్చుచున్న తరి నిచట తమ దివ్య దర్శనంబయ్యెను. స్వామీ ! మిమ్ములను జూడ కేవల పరమేశ్వరుండని తోచుచున్నది. తండ్రీ ! తమరు వ్రాయుచున్న గ్రంథము లేమిటి యని యడుగగా

నంత స్వాములవారు బిడ్డా! దీనిని కాలజ్ఞానంబందురు దీని యందున్న వన్నియు దేవ రహస్యంబులని చెప్పగా నంత నన్నాజయ్యగారు స్వామి! తమరు వ్రాయుచున్న పవిత్ర గ్రంథంబున గల రహస్యంబు లన్నియు బోధించి నన్ను పావనునిగా జేయుడని ప్రార్థించగా నంత స్వాములవారు తన దివ్యజ్ఞానంబున జూడగా నీయన బ్రహ్మాంశ సంభూతుం డని తెలిసికొని నాయనా! యిందుండు విషయంబులన్నియు "భవిష్యత్తు" అనగా ముందు జరుగబడెడు విషయంబులు కాన నీవు కోరినట్లుగానే వినిపించెదను. సావధానచిత్తుండవై వినుము.

వీరప్పయ్య స్వాములవారు అన్నాజయ్యగారికి "కాలజ్ఞానంబు"ను బోధించుట — కాలజ్ఞానము (ద్వితీయాశ్వాసము) మహామంత్రోపదేశంబు చేయుట

నాయనా! అన్నాజయ్యా! నీవు స్థిరచిత్తుండవై వినుము ఇయ్యది దేవరహస్య పరతత్వంబైన మహాతత్త్వ కాలజ్ఞానము. ఈ కాలజ్ఞానంబును భక్తితో నెవరయిన వ్రాసినను, జదివినను, వినినను, భక్తితో పూజించినను వారికి మోక్షంబు సామీప్యంబున నుండును. ఈ కలియుగంబున మందీ మహ ద్బలంబు గలిగినటువంటి రాజులు వంశక్షయులై పోయేరు. మత కలహంబులు విస్తారంబుగా జరిగేను. గ్రామాదులలో చోరులెక్కువై ధన ధాన్యంబులను దోచుకొని పొయ్యేరు. వారిని విచారించునదియే లేకుండేను ఊరూర ఒక శక్తి పుట్టేను. విశ్వమంతా తల్లడిల్లి పోయేను. మాపటివేళ మేక

పోతులుకూసేను. అందునకొందరు చచ్చేరు. తిరుపతికొండ మూలన ధూమకేతువనే నక్షత్రం పుట్టేను. ఆ నక్షత్రమును జూచి మిట్టమధ్యాహ్నపు వేళ అనేకమైన కిలాఖిలాలు గల్గి అందున కొందరు చచ్చేరు. దక్షిణం మెరిసేను. ఉత్తరం మెరిసేను. పిడుగులు పడి నదులు యింకిపోయేను. అగ్నిహోత్రుడు వెడలి వెన్నెలవతుఅయ్యేను. అమావాస్యనాడు చంద్రుడు పొడసేను. అందున కొందరు నష్టమయ్యేరు. బెంగుళూరి అయ్యవారు ఉద్భవించినదేమీకు నిదానం.ఉత్తర దిక్కున శుద్ధపాడ్యమినాటికి ఉరుములు, మెరుపులు, పిడుగులు పడేను. ఆవెంటనే మాయాజంగాలు వచ్చేరు. అడుగునకు ఏడడుగులుగా నడిచేరు. మానవులు తల్లుల ముఖము పిల్లలు, బిడ్డల ముఖమును తల్లులు చూడకుండా పొలముల బట్టుక తిరిగేరు. ఇంకనుకాయకసురులుకడుపునిండక రేగటి మృత్తికను రేయింబవళ్ళు తిందురు. అందునను కొందరు చత్తురు. నడిజాముస రాత్రిన గ్రామాదులలో కేకలు వినంబడేను. శీలవంతులు నీళ్ళపాలయిపోదురు. ఆచారవంతులు అనాచారులయిపోదురు. వర్ణాధిక్యము గలవారు అమంగళమైపోయేరు. వారికిముందు ఇంకను గండాలు గలవు. నారాకకు ముందు భూమి మీద నున్న దుష్టులు దూరమయి పోయేరు. లింగయ్య యనే మహనీయుడు నిజరూపు జూపేను. ఉల్లంబులన్నియు తల్లడిల్లేను. శ్రీశైలతీర్థం నష్టమందును. శ్రీశైలనాథుండు హఠాత్కారము మనుజులలో మాట్లాడేను. నందికొండకు ఉత్తరాన ఒక బిలముతో నూట యిరవయి

లక్షల గుఱ్ఱములున్నూ, వికృతము లయిన మనుష్యులు ఉత్పత్తి యయ్యేదరు. పంచ విధంబులయిన వాద్యంబులు, మా బిరుదులు, నాగుబడిగలు, పన్నెండు గుడార్లు యివి యునుగాక పదిడిపట్టు గుడార్లున్నూ ఉత్పత్తి యగును. మార్కాపురమువద్ద బంగారు ఎద్దులను తీసేరు. అయిదేండ్ల నాగయ్య అయిదు వేదాలు చదివేను. కుమారస్వామి తలు పులు ఏడు దినంబులు మూసియుండేను. సప్తర్షి వంశజులైన మనువు నభిప్రాయంబు మంచిదని దుర్మార్గనడతలకు ఆశ పడేను. జగములో సన్మార్గప్రవర్తనము చూచుటకు ద్విజులు అయిష్టులైయుందురు. దేవబ్రాహ్మణులకును, ద్విజులకును, ఆరని వైరంబు గలిగి, మతవాదులై ద్విజులు తలలువంచేరు. ధరణిలో లింగాపురమందు ఒక శక్తి పుట్టేను. శ్రీశైల పర్వతమున మల్లికార్జునుని గుడిలోవున్న దేవుళ్ళకల్లామూర్తి వంతాలువచ్చేను. పిదప నూరూరా నాట్యమాడేను. దోషకా రులకు చింతపుట్టేను. శ్రీశైలనాథుడు సాక్షాత్కారముగా వీరభోగవసంతరాయుడువస్తాడని చెప్పేను. అప్పుడు రక్త వర్షం కురిసేను. కంచి కామాక్షమ్మ వుగ్రంచేత దక్షిణ దేశ ప్రజలను, శిశువులను నష్టపరచేను. దేశదేశంబులు ప్రజలకు దేవతాపంపుల వివరము :— కర్ణాటక దేశంబునకు కాళిపంపు, తురక దేశంబునకు దుర్గిపంపు, అరవ రాజ్యంబునకు అర్క సోమునిపంపు, కర్ణాటకదేశంబునకు వీరభద్రునిపంపు, సందు సందు దేశంబులకు భైరవునిపంపు, మహానంది దేశంబునకు నాగేంద్రునిపంపు, కందనూరి రాజ్యానికియతిపంపు ఆమీ,

దట అష్టదిక్కులకు, యేడు యేండ్ల బాలలు మొదలుగాను పల్లెకు గాలిపోసి నడినెత్తి ప్రక్కలై, గండమాలలు, రాచ పుండ్లు, ఆటుపోట్లు, బొబ్బలుపుట్టి నోటియందును, ముఖ మందును పుండ్లు పుట్టి చచ్చేరు. ఏచిత్ర వ్యాధులుబుట్టి కూర్చున్నవారుకూర్చుండినట్లుగా, నడచుచుండినవారునడచు చుండగనే మ్రగ్గేరు. ఆకాశమున నాలుగు దిక్కుల హోమ ప్రకాశముగా చుక్కలు పొడిచేను. ఆ చుక్కలు జూచి అమ్మరో ప్రాణాలు లేవని అదిరిపడి చచ్చేరు. ఆకాశంబున ధ్వనిపుట్టి అందునకొందరునష్టమయ్యేరు. నక్కలు ఝాము ఝామునకు తప్పక కూసేను. అందున కొందరు నష్టమ య్యేరు. రాత్రింబవళ్ళు గ్రద్దలు గుంపులుగూడి 'గాగా' అని అఱచేను. అందును కొందరు నష్టమయ్యేరు. జలములో నున్న చేపలు మొదలగు జంతువులు తాము చత్తుమని పలు కుతూ బయటకు వచ్చేను పర్వతానకు ఒక మొసలి వచ్చి ఎనిమిది దినములుండి భ్రమరాంబ గుడిలోదూరి మేకపోతు వలె కూసి మాయమైపోయేను. అందువలన కొందరు నష్ట మయ్యేరు. శ్రీశైలశిఖరాన నిప్పులు రాలేను, ధ్వనిబుట్టేను. "తేజమే తేజస్సు"యని ఒక శక్తివచ్చి బెబ్బులివలె అరచేను నానావిధములైన వాక్యాలు పర్వతముమీద బుట్టేను. మహా దేవుని కంట మిణుగురులు రాలేను. పార్వతీదేవి కంట నీరు కారేను కటకటాయని నందీశ్వరుడు అంకెలువేసేను. ధణ ధణాంయని కాలుదువ్వేను సూర్యమండలమందు వాక్కు వాక్కుయని శబ్దము వినబడేను. ఆకాశమందు ధర్మదేవత

అర్భటించేను. విషవాయువు కొట్టినప్పుడు పార్వతీశుని కన్నులవెంట నిప్పులురాలేను. బసవేశ్వరుని కన్నులవెంట నీరు కారేను. మహాదేవుని జడలు యెగసి యెగసి ఆడేను. త్రిశూలాయుధము వలన అమరులు కదలేరు. పర్వతంమీద వున్న ఉక్కు స్థంభముపైని వున్న ప్రతిమ మాటలాడేను. భ్రమరాంబ ముందర బసవేశ్వరుని తోక విదళించుకొనేను దుగ్గిళ్ళరాయుడు యేలూరిలో ఏనుగుచేత చచ్చేను. తిరుపతి కొండమీద మహమ్మదీయులు ఆడిపాడేరు. కపిధ్వజము కదలేను. ఘుమ్మనే శబ్దము కలిగేను గురుడధ్వజము నానా దిక్కుల యెగసియెగసి ఆడేను. వినాయకుడు ఊరూర వేద మంత్రంబులు చదివేను. ఆ మీదట ఆకాశమున ఆ—ఆ—ఆ అనేశబ్దం వినబడేరు. అందువలన కొందరు నష్టమయ్యేరు. ఆకాశమును జూచి ఆవులు, గొఱ్ఱెలు అరచేను. భూదేవి భో భో యని యఱచేను. స్త్రీలు జోలలు పాడేరు. ఆ స్త్రీల కన్నులవెంట రక్తము కారేను ఊరూర బెబ్బులులు వచ్చి మనుష్యుల గొంతులు గరచి చంపేను. మేటిమేటి మన్నెరి కాలు మహమ్మదీయులకు బారి గోత్రెలయ్యేదరు సామవేద ఘోషణ మనే సంగీతము బాలయౌవనప్రౌఢులు వీరభోగ వసంతరాయల చరిత్రములు ముందుపాడేరు పువ్వులవాన కురిసేను. ఆనాడు— అమావాస్యనాడు— చంద్రోదయ మయ్యేను. సూర్యనంది ప్రబలమైన అనంతర మా రాత్రి భూమి కదలేను. ఆకాశ మెఱ్ఱనయ్యేను. అభోయను శబ్దం వినబడేను. ఆకాశమున ఘుగుల్ ఘుగుల్‌మని ధ్వనిబుట్టేను. కేశవ నామాలుం అష్టాదశ వర్ణముల వారును కీర్తించేరు.

గ్రామాదులలో, పట్టణములలో, నదులలో నెత్తురు వర్షము కురిసేను. ఆ పట్నాలలో లక్ష్మిదేవి యేడ్చేను. సూర్యనంది ఉద్భవమయ్యేను. సూర్యచంద్రాదులు ప్రకాశమయ్యేరు. మహాయోగి వచ్చుచున్నాడని భూదేవి బలికేను. పంచవేదంబులు పంచముల స్వాధీనంబై పఠనంబుజేసేరు. పంచములు పంచాంగంబు బట్టుక బ్రాహ్మణులవలె బజారులో దిరిగి, పంచాంగంబులు జెప్పేరు. బ్రాహ్మణులు చెప్పిన ప్రశ్నల కన్నను పంచములుజెప్పినవే నిజమయ్యేను. బ్రాహ్మణులు పరజాతిసేవయే జేసి జీవించు చుండేరు. విప్రుల పూర్వార్జిత భూములన్నియు పలాయనములై పోయేను. అంతట అంతర్గతంబైన వర్షంబు కురిసేను. ఈశ్వరనామ సంవత్సరము మొదలుకొని విక్రమనామ సంవత్సరము వరకు నేడుగ్రామంబులకు నొక గ్రామంబగును. ఏడు దొడ్లకు ఒక దొడ్డి అయ్యేను. ఇట్లే అనేక ప్రళయాంతరముల చేత ప్రజలు చచ్చేదరు. ఇదియునుం గాక కప్ప కోడికూత కూసేను. అందున కొందరు నష్టమయ్యేదరు. ఈశాన్య మూలగా విష గాలి బుట్టి అందున కొందరు నష్టమయ్యేదరు. దుండికొండ మూలను సుడిగాలి పుట్టి అందున కొందరు నష్టమయ్యేదరు. నా మఠమునకు ఈశాన్య భాగమున నాగర్తి మూలగాభూమి యందు పంచాననంవారింట ఒక చిన్నదాని గర్భంబు బ్రద్ద లుగా పగిలి ఒక చిన్నవాడు ఉత్పత్తియగును. ఆకాలమందు అపరిమితమైన వుత్పాతములుగా వుఱుములు, మెఱుపులు పుట్టును. ఇందున కొందరు నష్టమయ్యేదరు. ఆ చిన్నవాడు ధేశముమీదికి వచ్చి నేని భగవంతుడను, నన్ను బూజించు

కొనిన మీకు ముక్తి గలుగునని చెప్పెను. భక్తులైనవారు నమ్మకుండేరు. ఉత్తరాదిన ఒక ఖుజ్జీమాను తొఱ్ఱలోనుండి ఒక మహాత్ముడు నెత్తిన కొమ్ములతో పుట్టే సమయంబున చెట్టు చీలికలుగా పగిలి బైటికివచ్చును. అతను దేశము మీదికి వచ్చి నేనే భగవంతుడను, నన్ను నమ్మి పూజించు కొనుడనిచెప్పెను. భక్తులైనవారు నమ్మకుందురు. పడమటి దేశమునుండు ఒక చింత మాను తొఱ్ఱలోగుండా దిగంబర రూపంబుగా భూమి మీదికి ఒక మహానీయుడు వచ్చేను. దక్షిణ దేశంబునకు ధీరుండనని బల్కేను. నెల్లూరు సీమంతా నీటిమయమగును. ఈ ప్రకారంబుగా నలుదిక్కుల నలుగురు పుత్పత్తియై వచ్చేరు. నా మఠము మీద ఆరెదొండతీగ బుట్టును. ఒక రాత్రి ఏడు ఘడియలకు నా తీగె మఠమంతా అల్లుకొని మనుష్యులు లోపలకు వెళ్ళుటకు వీలులేకుండా వుండేను. మక్కామసీదులో ఒక వరాహంబు పుట్టి మహమ్మదీయు లందరకు వైరంబు బుట్టును. ఆ వైరము చేత ఒక్కొక్క యింటిలోనికి దూరేటి, వీరిలో వీరికి అన్యోన్య కలహాలచేత చంపెదమని వచ్చేరు. ఆ వచ్చిన వారికి చిక్కనట్లుగానేయుండి చిక్కకుండా బెజవాడకృష్ణవరకు తీసుకొని వచ్చేను. అక్కడ అదృశ్యమై లక్షోప లక్షల జనాన్ని హతము జేసేను. నూరుపుట్ల నల్లులు రాలేను. తిరుపతి వేంకటేశ్వరుని సముఖమున ఒకవిష్ణు భక్తుడు పుట్టి భూమి మీదకు వచ్చి శివాయనే వాక్యముఎనిమిదిఘడియలులేకుండా జేసేను. అది విష్ణువు లోక రక్షకుండై యుండగా ఎక్కడి

శిశువు? ఎక్కడి బ్రహ్మ ? అని విష్ణుభక్తుడనెను. అంతట విష్ణుభక్తులకు, శివభక్తులకు జరిగెడి తర్కవాద మేమనిన శ్రీవిష్ణు పాదోదక మని విష్ణుభక్తులకును, శ్రీ శంభుపాదోదక మని శివభక్తులకును ఇట్లు తర్కవాదము జరిగెను. ఈ తర్కవాదముచేత శ్రీశైలపర్వతానికిపోదురు. నాభక్తులైన పాంచాననమువారు యిన్ని దినంబులనుండి బ్రహ్మంగారి భక్తితో నుండి ఈ దినము చెదిరేకంటే బ్రహ్మంగారి మఠములో సమాధివద్ద సాహసముచేత వచ్చినదే మేలని భక్తులు ఆలోచించు చుండగా అమవాస్య రోజున చంద్రోదయమయ్యెను. చంద్రోదయము చూస్తూ వుండగానే అనేక విరక్తులు గలిగెను. వీరసాహసులైనవారు వీరకాసెలు గట్టి నా మఠము దగ్గరకొచ్చేరు. మఠములో ఒక రాత్రి ఏడు ఘడియలకు ఆరె దొండతీగె చుట్టుకొని ఏడు దినములు పూజ లేకుండా ఉండేను. ఇదిచూచి నాభక్తులైనవారు సాహసముచేత నాతీగెనంతా ఖండించి బయలుచేసి వీరసాహసము చేత మఠములోనికి పోయి లక్ష పదకొండువేల అయ్యలు గండకత్తెరలు మెడకువేసుకొని హరహరాయని మృతిబొందేరు. అప్పుడు పర్వతంమీద జరిగే తర్కవాద మేమంటే విష్ణుపాదోదక మని విష్ణుభక్తులును, శ్రీ శంభుపాదోదక మని శివభక్తులును, జరుపుతూ ఉండగా ఈతర్కవాద రోదనలకు పెద్దలయిన ఋషులచటికి వచ్చి యిరువురితర్కములను విని ఆ ఋషీశ్వరులు "ఓ భక్తులారా ! ఈ విధముగా ఘీర్ఘ

తర్కవాదములు జేసుకొనిన ప్రయోజనములేదు. కావున మేము ఒక న్యాయము జెప్పెదము. మీరు విష్ణుభక్తులు, వారు శివభక్తులు. మీ వుదకమైతే మీరు తీసుకొని వెళ్ళండి. వారి వుదకమైతే వారికివ్వండి" ఇట్లు చెప్పిన ఋషుల వాక్యములకుసంతోషించిరి. అంతట విష్ణుభక్తునకు శరీరమునిండా నామములుబెట్టి, పాతాళగంగలో గూర్చుండబెట్టేరు. ఆ వుదకము విష్ణుభక్తులకు వశముగాకపోయేను. అంత నా శివ భక్తులు ఈ ఉదకము తీసుకొనుటకు మీకు నలవికాలేదు. కావున మేము తీసుకొనెదము రమ్మనమనిన. విష్ణుభక్తులు బహులజ్జపడి పాతాళగంగలో నుంచిన విష్ణుభక్తుని లేవదీసి, అప్పుడు శివభక్తునకు శరీరమునిండా విభూతిపూచి, పాతాళ గంగలో గూర్చుండబెట్టేరు. అంతట నీటియందు కళకళ మనే ధ్వనితో గూడి, ఓం ఓం అనే శబ్దము పుట్టేను. అంత సప్తసముద్రములు, నదీనదములు వుప్పొంగి, వాగువంకలు చదరమై అండపిండ బ్రహ్మాండములలో వుండే పిపీలికాది జీవరాసులలోను వుండే జలమున్నూ, భూమియందు సప్త సముద్రంబులు, నదీనదంబులలో వుండే జలమున్నూ, మానవుల శరీరంలోవుండే రక్తమాంసాదులతో సహా ఒక్క జాములో ఇంకిపొయ్యేను. అప్పటికి భక్తులైనవారు వత్తులై నిలచేరు. అప్పుడు ముప్పదిరెండు వాయిద్యంబులు వినంబడేను. సూర్యచంద్రాదులు దిశలు దప్పేరు. భూమి కుమ్మరి సానవలె గిరగిరదిరిగేను. ధరణీతలంబు తల్లక్రిందులయ్యేను. అప్పుడు సమాధిని పటపటా పగలుగొట్టుకొని శ్రీ వీరభోగ

వసంతరాయలు రక్తవసంతము లాడుచు వచ్చేను. ఇదియు నుంగాక మరియొక చిత్రము బుట్టును. సీమనుంచి లక్ష్మీదేవి వచ్చేను. లక్ష్మి వచ్చిన పిదప జనులందరు వైభవముగా నుండగలరు. రామదాసు రాజ్యం జూచును. కావేరి మేర దప్పి వచ్చును. ఘనమైన పట్టణము లన్నియు బోవును. దొమ్మరివారలు దొరలగుదురు. దొడ్డవారలందరు చెడుదురు. అదిగాక భక్తులగువారు భూమిపై నాధర్మములు వెదజల్లుదురు నానామంబును అంగడి బెట్టుకొని అమ్ముదురు. వుల్లిగడ్డకు నొక్క గురుపు వచ్చును. నా కాలజ్ఞాన శ్రవణంబును నిత్య మెవరు జేయుచు పూజించుచుందురో వారి కిహపర సౌఖ్యం బులు చేకూరును. నేను వచ్చునంతలో నెన్నియో వికృతం బులు బుట్టును ఇదియే నీకు నిదానముగాన అన్నాజయ్యా! నీవు కేవల బ్రహ్మావతారుండవు. నేనా మహా విష్ణుండను. శంకరుడు ఆనంద భైరవయోగియై రాజయోగంబులో నున్నాడు. నేను కొద్ది వత్సరంబులలో ఈ వీరప్ప యను నామంబు చాలించి శ్రీ వీరబ్రహ్మేంద్రావతారంబునకు బోవ నున్నాడను గాన నీకు దెల్పిన యీ భవిష్యత్తును మరువక సదాచార సంపన్నుడవై, సద్భక్త పోషణుండవై, యిచ్చ టనే (~నగా నీ మఠంబుననే) ఈ అచ్చమ్మగారురు నీవు నుండుడు నీకు నొక మహామంత్రోపదేశంబు జేసెద అది యెద్దియన, 'ఓం నమోనారాయణాయ'యను నీ యష్టాక్షరీ మహామంత్రంబును సదా జపించుచుండును. షడక్షరియును, అష్టాక్షరియును కలిపిన మహామంత్రద్వయంబగును. గాన

నీ మంత్రద్వయంబును కలిపి ఒకేసారి జపించు చుండిన కేవల మోక్షదాయకంబు. "ఓం నమశ్శివాయ" యను షడక్షరియు, "ఓం నమోనారాయణాయ" యను అష్టాక్షరియు కలిపి, (అనగా) "ఓం నమశ్శివాయ, ఓం నమోనారాయణాయ" అను నీ మహామంత్రంబునుసదా జపించుచుసద్గతిని జెందుము. అంత నన్నాబయ్యగారు నిలువంబడి, కరములు ముకుళించుకొని 'శ్రీ మదఖిలాండకోటి బ్రహ్మాండనాయకా! శ్రీ లక్ష్మీహృదయ సరోవరవిహార రాజహంసమా! అనంతావతారా! అప్రమేయా! అఖిలపాప సంహారకా! తమరు నాకు బోధించిన ఈ కాలజ్ఞానంబు భవిష్యత్తని గదా సెలవిచ్చిరి. తమరు కృతయుగ, త్రేతాయుగ, ద్వాపర యుగంబులలో నీ స్వరూపంబెట్టిదో తమరు చేసిన విషయంబులను దెల్పు'మని వేడగా 'నాయనా! నీ విచ్చటనేయుండువాడవు గదా ! పిదప దెలియునట్లు, నా యనంతావతార మహిమంబులు బోధించెదను. అదిగో! అచ్చమ్మగారువచ్చుచున్నారు. ఇక కూర్చుండు' మని చెప్పునంతలో అచ్చమ్మగారు అంధుడైన, తన కుమారుండయిన బ్రహ్మానందరెడ్డిని వెంటబెట్టుకొని, తాను కట్టించిన లోమఠంబు కడ కూర్చునియున్న వీరప్పయాచార్య స్వాములవారి కడకు వచ్చెను. అంత స్వాములవారు 'అమ్మా! యీ బిడ్డ డెవడు? నీ విదివరలో నాతో జెప్పిన బిడ్డం డీయనయేనా? అటులయిన యీయన పుట్టంధుడా ? లేక మధ్యవచ్చిన అంధత్వమా?' అని యడుగగా నంత అచ్చమ్మగారు స్వాములవారితో నిట్లులనియెను.

గరిమరెడ్డి అచ్చమ్మగారి కొమారుండైన బ్రహ్మానందరెడ్డి యంధత్వమును
శ్రీ స్వాములవారు పోగొట్టుట.

'స్వామి! యీతండే నాకొమారుడు. మిగుల సుగుణవంతుడు, సుజ్ఞాని. ఈయనకు చిన్నతనంబున నేత్రంబులు బాగుగానే యుండెను. మధ్యన నెందులకోగాని చూపు కనిపించకుండెను. నేత్రంబులు చూతుమన్న మంచివారి నేత్రంబులవలె నున్నవేగాని చూపు మాత్రము గాన్పించదు. ఇయ్యది అతనిదురదృష్టం'బని చెప్పగానంత స్వాములవారు బ్రహ్మానందరెడ్డినిజేగందీసికొని 'బిడ్డా! ఇటు గూర్చుండుము. నీవు తరించెడి దినంబులుసన్నంబయ్యెయేనాకడకరుదెంచితి' వని చెప్పి తన హస్తంబును బ్రహ్మానందరెడ్డి శిరంబుపై నుంచి, భ్రూమధ్యంబున తన బొటనవ్రేలితోనొక్కి 'బిడ్డా! నీవు పదినిమిషంబులు నేత్రంబులను మూసికొని పిమ్మట తెరువు' మనెను. అంత దాయన నేత్రంబులు దెరచువరకే మసకగా గాన్పించ దొడంగెను. అంత బ్రహ్మానందరెడ్డి యానందమునికు మేరలేకకూర్చుండినవాడు కూర్చుండినట్లే స్వామి పాదంబులపైబడి 'స్వామీ! శ్రీ దేశిక స్వామీ! మహాపాపుండనైన నా యంధత్వంబును బాప నరుదెంచిన శ్రీమన్నారాయణుండవు గాని మరి మానవుండవు గావు. తండ్రీ! నాశిరంబుపై తమ హస్తముంచినంత మాత్రముననే యీ ప్రపంచంబును జూచుటకై నాకు కొద్దిగా చూపువచ్చెనే దేవా! నా జీవితమంతయు తమ పాదసేవ జేసిన నిక నెంతటి సుకృతంబు లభించునోకదా! గురుసార్వభౌమా!

తమ పాదరేణువునైన నన్ను కృతార్థునిజేసి సద్గతిని త్రోవ జూపు'మని వినయవిధేయుండై వేడుకొనగా కరుణాలవాలుండైన శ్రీ స్వాములవారు కరుణించి 'బిడ్డా! నీకేమియు సందియంబు వలదు. ఇంత కొలది దినంబుల లోపలనే నీ నేత్రంబులు యెప్పటివలె యధావిధిగా గాన్పించును. నీ వేమియు చింత వలదు. నన్ను నమ్మి పూజించినవారు ఎప్పటికిని చెడరు. నన్ను నమ్మక నా విషయమై బోధించువారిని గాని, నన్ను గురించి వ్రాయువారిని గాని హేళన చేయు వారలెట్టి కష్టంబు లనుభవించి తుదకు దుర్గతి పాలగుదురు. నాయనా! బ్రహ్మానందరెడ్డి నీ పూర్వజన్మ వృత్తాంతంబు దెల్పెద వినుము. నీవుపూర్వంబున పతివ్రత యయిన నీ యిల్లాలి నేత్రంబులు నీటగలిపితివి. ఆమె తన నేత్రబాధను సహించలేక నీటిలోబడియీగెను. ఆమహాపాతకంబుచే నీ జన్మంబున నీకు నేత్రంబులు గాన్పించకుండెను. నీ జన్మమున్నంత వరకు నీ యంధత్వంబు నీకుతప్పునదికాదు. కాని నీవు పూర్వంబునజేసిన సాధుసేవలను, దేశికానుగ్రహమును బొందియుండుటచే తిరిగి తొల్లింటిసుకృతమునిన్నునాకడకు తీసికొని వచ్చినదిగాన బిడ్డా నీకు పంచాక్షరీ మహామంత్రోపదేశముచేసెద. చిత్తశుద్ధిగలవాడవై వినుము. 'నమశ్శివాయ' యని అతని దక్షిణ కర్ణపుటంబున జెప్పెను, నాయనా! ఈ మంత్రమునుసదాజపించుచున్న యెడల నీకు అంధత్వము సంపూర్ణముగా బోయి ఆయురారోగ్యండవై యుందువు. బిడ్డా! బ్రహ్మనందరెడ్డి! నీవును, నీ తల్లియైన అచ్చమ్మ

గారును, అన్నాజయ్యయను నీ మహానీయుండునుమఠంబున నుండుడు మీరు ముగ్గురును త్రిమూర్తులెట్లు లోకంబులను పాలించుచుండిరో అట్లే యీ మఠంబున మీరుండి యిచ్చటికి వచ్చు భక్తాదులకు నా దివ్యమంత్రోపదేశము చేయుచు సదా నన్ను మరువక పూజించుచు, సర్వజనాదరణీయులై యుండి యీమఠంబున నామారుగా నొకలింగంబును ప్రతిష్ఠజేయించి యిచ్చటనే మీరు మువ్వురును శివజీవైక్యసిద్ధిని బొందుడు. నేనిక కొలదిదినంబులు మాత్రమేయిచటనుందును. ఇంకను నొక కొద్దికార్యంబు జరుగవలసి యున్నది. నాపని పూర్తి యైన వెంటనే యీనామంబు చాలించి 'శ్రీ వీరబ్రహ్మేంద్ర నాముండనై' రాజయోగినై యుండెదనని చెప్పగా నంత బ్రహ్మానందరెడ్డి 'స్వామీ నాకొక చిన్న సంశయంబు గలిగి నది. అదియెద్దనిన తమరీ వీరప్పయాచారియను నామంబును చాలించెదననియు, వీరబ్రహ్మేంద్రనామంబు దాల్చెదననియు జెప్పుచుంటిరే! ఈ శరీరము చాలించిన పిమ్మట నవీన నామంబు దాల్చెదరా? లేక ఊరకనే నామంబును మార్చెదరా తెలియజెప్పు'డని వేడుకొనగానంత స్వాములవారు 'నాయనా! నా యవతారమే త్రినామంబులచే బిలువంబడును. అది యెట్లన్న నా బాల్యంబున పదునాల్గు వత్సరంబుల వరకు వీరంభొట్లయ్య యనియు నటనుండి వీరప్పయాచారియనియు నటుపిమ్మట వీరబ్రహ్మం బనియు నీ మూడు నామంబులచే పిలువంబడుచు యోడుస్థలంబులలో నీ మూడునామంబులతో నుందును. నన్ను నెరింగిన వారలీపదునాల్గు భువనంబులలో

లేరు. నేను మాత్రము వారందరి నెరుంగుదు'నని చెప్పగా అంత నా ముప్పురును తమరిచ్చిన ఆనతియే ఆనందదాయక మనిచెప్పి, యీ మఠంబునందే యుందుమని వాగ్దానంబుజేసి అచ్చటనే స్వాములవారి పాదసేవ జేయుచునుండిరి.

• అంధత్వంబు పోయిన బ్రహ్మానందరెడ్డి బనగానపల్లెలో స్వాములవారి మహిమంబులు చెప్పుట, అప్పురవాసులనేకులు స్వాములవారి భక్తులగుట •

శ్రీ అచ్చమ్మగారి కొమారుండైన బ్రహ్మానందరెడ్డి శ్రీ స్వాములవారిని బూజించి నిలువంబడి 'స్వామీ ! తమ దివ్యానుగ్రహముచే నాకున్న దుఃఖంబును ఖోద్రోలి సంతోషచిత్తునిగా జేసితిరి. గ్రామములో గల నా బాల్యస్నేహితులను బంధువులను గ్రామమంతయు జూసివచ్చె'నని యడుగగా నంత స్వాములవారు 'బిడ్డా! బజారునకు నీ వేగిన ప్రజలందరూనాశ్చర్యముగానీచుట్టుజేరిచూచుచుందురు. అప్పుడు ప్రజాదృష్టి నీపై బారును. ఆ ప్రజాదృష్టిచే నల్లని రాయియైనను బ్రద్దలుగా పలుగును. మనుష్య మాత్రుండవైన నీవా దృష్టిని భరింపజాలవు. అయినను నేనుండ నీకే యిక్కట్లునుసంభవించవుగాని, పూజాపీఠంబు వద్దనున్న విభూదిని ధరించిమాత్రమునీవేగుచుండుము. ఇది మాత్రము మరువకు' మని చెప్పగా, శ్రీ స్వాములవారి యాజ్ఞానుసారముగానే విభూదినిధరించుకొని, స్వాములవారి సెలవుగైకొని, మఠము నుండి బయలుదేరి, ఆ బనగానపల్లెనవాబు దేవిడీ ముందుగా చిరునగవుతో పోవుచున్నతరి. ఆ నవాబు సేవకులుకొందరు

బ్రహ్మానందరెడ్డి నెరింగినవారగుటచే, నాబ్రహ్మానందరెడ్డిని జూచి ఆశ్చర్యమానసులై ఆయనను సమీపించి, అయ్యా నీవు అంధుడవుగదా!—నీ అంధత్వంబు ఎట్లుపోయినది? ఎవరిచే వైద్యంబును జేయించితివని వారలందరు నడుగగా, నంత బ్రహ్మానందరెడ్డి చిరునగవుతో మిత్రులారా ! నేను ఏ వైద్యంబునుజేయించలేదు. నాపూర్వపుణ్య ఫలవిశేషంబున నా పరమేశ్వరుండే ఒక మనిషి రూపంబుగా వచ్చి మా అమ్మగారు కట్టించిన "లోమఠంబు" సందుండగా నామునిపుంగవుని కడకు నన్ను మా యమ్మ దోడ్కొని పోయెను. అంత నా మహాభాగేయుడెవరి బాలుండని మాయమ్మ నడుగగా, అంత నా తల్లి స్వామీ ! నా బిడ్డడే! ఈతండు జన్మించిన దాది నేత్రంబులు బాగుగనే యున్నవి. మధ్య ఎందులకో చూపు కనపడకుండా నున్నదని చెప్పగా, నా పాలిటి పరమేశ్వరుండైన యా మునిసత్తముండు నాపై నెనరు గలిగినవాడై బిడ్డా! రారమ్మని దగ్గర గూర్చుండబెట్టుకొని కన్నులుమూయుమని, వారి హస్తంబు నా శిరంబుపై నుంచి నంతనే, కొంతసేపటికి కొంచెము మసకగా నున్నట్లు కనబడెను. అంత నాసంతోషంబునకు మేరలేక, స్వాములవారి పాదంబులపైబడి తండ్రీ! తమ పాదధూళి సోకినంత మాత్రంబుననే నా నేత్రంబులు గాన్పించ దొడగెను. తవ కృపకుపాత్రుండనైతినేని ఇకనెంత సుఖంబుండునో యని మొరబెట్టుకొనుచు, వారి పాదంబులను వదలనైతిని అంత నమ్మహాత్ముడు నాయందు పుత్రవాత్సల్యముంచి నాకు తన

దివ్యమంత్రోపదేశ మిచ్చి, సన్నిలోకంబు జూడజేసెనని చెప్పెను. ఈయన చెప్పిన విషయంబు లన్నియు నౌకర్లు చక్కగావిని, వారి సంతోషంబునకు మేరలేక నవాబువద్దకు వెళ్ళి, బ్రహ్మానందరెడ్డిచెప్పిన విషయంబులన్నియు జెప్పగా నవాబుసంతోషించి. మన బనగానపల్లెలో నంత మహామహి మాస్పదులైన మహాభాగేయులున్నారా?అటులైన మీరలేగి, ఆ తపసిని నాకడకు దోడ్కొని రమ్మని చెప్పగా, వెంటనే నౌకరు శ్రీ వీరప్పయాచార్య స్వాములవారి వద్దకేగి, సలాములుచేసి, స్వామీ ! మిమ్ముల నెందులకో మా నవాబు సాహెబుగారు రమ్మనుచున్నారు. దయయుంచి దయచేయుడని చెప్పగా, నంత స్వాములవారు బిడ్డలారా ! నేను రేపు ఉదయమే యెనిమిది గంటలకు వచ్చెదనని చెప్పితినని, మీ నవాబుతో జెప్పుడనగా, అంత నౌకరువెళ్ళి రేపు ఉదయమున నేవచ్చెదనని చెప్పిరని చెప్పగా, నవాబు నౌకర్లతో యిట్లు లనియెను. రేపు ఉదయమున నొక పూలపాలకి తెప్పించి, అందు వారిని గూర్చుండబెట్టుకొనిరండు. స్వాములవారిని అగౌరవముగా పాదచారియై రమ్మని నందుల కేమైన ఆగ్రహముతో మాట్లాడిరా ? లేక తిన్నగామాట్లాడిరా? చెప్పుడని యడుగగా, నంత నౌకరు సాహెబ్ జీ మేము వెళ్ళి మీరు రమ్మనిరని చెప్పగా ఏదియో ముక్కువద్ద అరచేయి బెట్టుకొని, ముక్కులోనుండి వచ్చెడి శ్వాసను పూరించి చూచి తలయూపి, రేపటి దినము వస్తానని చెప్పిరేగాని ఏమియు కోపముతో మాట్లాడలేదని చెప్పగా నంత నవాబు ...

తప్పక ఉదయమె దోడ్కొని రండని చెప్పి తన రంగమ హాలు లోనికి పోయెను.

బనగానపల్లె నవాబు శ్రీవీరప్పయ్య స్వాములవారి మహిమంబులు గను
గొనుటకై విందునకుగాను తానేర్పరచిన మాంసభక్ష్యాదులను
స్వాములవారు పుష్పంబులుగా మార్చుట.

తెల్లవారగనే నౌకరు ఒక పూలపాలకిని దెప్పించి, స్వాములవారి కడకు గొంపోయి, అందు స్వాముల వారిని గూర్చుండబెట్టుకొని, మంగళవాద్యంబులతో నా గ్రామము నాలుగు బజారులలో నూరేగింపుజేసి నవాబు సముఖంబునకు దీసికొనిపోగా, వెంటనే నవాబు సింహాసనంబు డిగ్గి తన రంగమహాలు నందు బంగారు పీఠంబుపై నాసీనునిగా జేసి యర్ఘ్యపాద్యాది విధులం బూజించి చేతులు జోడించుకొని మహాత్మా! తమ రాకచే నా వంశంబంతయు పావనంబయ్యె. తమరు శివజీవభేద రహితులనియు, జాతిమత భేదరహితు లనియు, కేవల పరమేశ్వరావతారు లనియు విని యుంటిని ఇదియునుగాక తమముఖంబే దెల్పుచున్నది. గాన తమ పాద దాసుండనైన ఈ బీద బిడ్డని యింట ఒకపూట నేను జేయు విందారగించి నామనోసంకల్పసిద్ధుని జేసి నన్ను కృతార్థునిగా జేయుడని ప్రార్థింపగా నందులకు-స్వాముల వా రానందించి బిడ్డా! నీయాప్సితమెట్లో అట్లే కానిమ్మని సెలవొసంగగా నంత నవాబు స్వాములవారి మహిమంబు లెరుంగుటకై వెంటనే మాంసభక్ష్యాదులను తయారుచేయించి ఒక బంగరు పళ్ళెర మందుంచి యా పళ్ళెరంబుపై పట్టువస్త్రంబు గప్పి

స్వాములవారి ముందరబెట్టెను. అంత దివ్యజ్ఞానంబున తెలిసి కొని చిరునగవుతో పళ్ళెరముపైన గప్పియుండిన పట్టు వస్త్రము నెత్తువరకా మాంస భక్ష్యాదు లన్నియు మారి 'సువర్ణచ్ఛాయ గల్గిన పుష్పంబు' లయ్యెను. స్వాములవారు చూపించిన మహామహిమంబునకు సంతోషస్వాంతుడై తా నొనరించిన యపరాధంబునకు స్వాములవారు ఆగ్రహంబు చెంది యెద్దియైన శాపం బొసంగెదరేమోయని భయంబుజెంది మహాత్మా ! దీనబంధూ! ఆర్తత్రాణపరాయణా !ఆశ్రితపారి జాతా! ఆర్తుండనై నే విన్నవించు విజ్ఞాపనం బాలింపుము. స్వామీ! తమ మహిమంబు తెరుంగుటకై యిట్లు పచారము చేసినాడనే గాని వేరొండు తలంపుగాదు. తండ్రీ ! తమ మనంబున విసుమంతయేని కోపంబును బూనకుండని స్వాములవారి పాదంబులను పట్టుకొని యెంతకును విడువడ య్యెను. అంత స్వాములవారు సంతోషస్వాంతుడై బిడ్డా! లెమ్ము. నీ విసుమంతయేని నాకు ద్రోహంబు చేయలేదు. నన్ను నమ్మి పూజించినవారికి కొంగు బంగారమై ముంజేతి కంకణంబురీతిగా నుందును. నన్ను నమ్మనివారికి అరచేతి లోని వ్రణంబురీతిగా నుందును. ఇక నీ మనంబు నందుగల సంశయంబులు వీడుమనిచెప్పగా, నంత నవాబు లేచి ముకు ళిత కరకమలుండై, నిలువంబడి స్వామీ! నన్ను మీబిడ్డ రీతిని జూచి నాకు సద్గతికై త్రోవ జూపుడని వేడుకొనగా, నారాత్రి నవాబునకును బ్రహ్మజ్ఞానోపదేశంబొసంగి, కొన్ని దేవరహస్యంబులు తెల్పి. కొన్ని రాజనీతులను బోధించగా,

నవాబున కుండెడి సంతోషంబునకు మేరలేక, స్వామి! నేనిక వైరాగ్యమానసుండనై తిని గాన తాము వ్రాయుచున్న 'కాల జ్ఞానంబును" బోధించి, పావనునిగా జేయుమని ప్రార్థించగా, బిడ్డా ! నీ విక శ్రద్ధతో వినుము. నేనిపుడు బోధించబోవు కాలజ్ఞాన శ్రవణంబుచే భవబంధంబు లన్నియు బోవును.

బనగానపల్లె నవాబు పురజనులందరిని బిలిపించి సభచేసి
శ్రీ స్వాములవారిచే కాలజ్ఞానంబును వినుట :—

ఓ మహాజనులారా! ఈ కాలజ్ఞాన శ్రవణంబుచే సకల సౌభాగ్యంబులు చేకూరును గాన సావధానచిత్తులై వినుడు. నే నీ కలియుగంబునకు, దుష్టశిక్షణ శిష్టపరిపాలనంబునకై యీ కలియుగము5000సం॥ మీదట వచ్చెదను. వీరభోగ వసంతావతారుండనై యీ వసుధయందు నేను వచ్చువరకు ననేకోత్పాతంబులుబుట్టును. అవి యెవ్వియనిన, యీతచెట్టు ఒకటిపుట్టి అది రాత్రిళ్ళు పరుండి ఉదయంబున నిలుచుండి యుండును. ఇటులయెనిమిదియేండ్లుండిశ్రావణ శు॥ ౧౩లకు నా చెట్టు పడిపోవును. అది మొదలు దేశక్షామము కలుగును. ఇంకొకచిత్రంబుజెప్పెదవినుండు. కలియుగం 5007 సంవత్సరముసరియైన ధాతృనామ సంవత్సర మార్గశిర మాసము మొదలుకొని, ఈశ్వరనామ సంవత్సర మాఘ మాసము లోపల గోలకొండ, కొండవీడు, వినుకొండ, తాడిపత్రి గుత్తి, బళ్ళారి, నెల్లూరు, మునిమడుగు, యీతముక్కల, గుంటూరు, మంగళగిరి, బెజవాడ, కంభం, కర్నూలు,

మార్కాపురం, తంజాపూరు, పుష్పగిరి, కంచి, మైసూరు, చెన్నపట్నం ఈ తావులలో దొరకకు చిట్టెడు బియ్యము అమ్మును. ఇదియునుంగాక అతికాలిమంత నెత్తి కెక్కును. జనులు ఆర్భటించి యరచి చత్తురు. అష్టాదశ వర్గములవారు మేక కసురును తిందురు. వర్ణాశ్రమ ధర్మములు పాడై పోవును. ఆచారము మచ్చునకైన నుండదు. అనాచార మెక్కువగును. వావివరసలు వల్లకాటిలో చేరును: ఒకరి పరిశ్రమ మరియొకరి పాలయిపోవును. ప్రపంచంబున పతి భక్తి పాడయిపోవును. భార్యాభర్తలకు వైరంబు బుట్టును. అందరును మోహాతిశయు లగుదురు. కామక్రోధంబులు హెచ్చును. న్యాయ మడంగి పోవును. అన్యాయంబు వృద్ధి బొందుచుండును. ఇదియే మీకునిదాదము. ఇంకనైన ప్రజలు గర్విష్ఠులుగాక నా మాటలు నిస్సారంబుగా త్రోసివేయక మౌఢ్యంబు వదలి జ్ఞానంబును దెన్నుకొనెడి మార్గంబుల సరయుపలెను. ఇదియునుంగాకనింకొక చిత్రంబు మీగ్రామంబున జరుగనున్నది.. అది యేమంటే, నా భక్తురాలైన గరిమరెడ్డి అచ్చమ్మగారి వంశమునిర్వంశమైపోవును. ఆమె వంశమున నొక్కరైన నిల్వరు. ఆమెకుండు గోవులమంద లన్నియు నశించును. ఆమెయింట నేనుగోవులను గాయుచు వ్రాసిన కాలజ్ఞానంబు లన్నియు నామె యింట నే నొక పాతర యందుంచితిని. ఆ పాతరపై నొక చింతచెట్టు మొలచును. నే నీ కలియుగంబున వీరభోగవసంతరాయుండనై వచ్చుటకు ముందు నా చింతచెట్టునకు చేమంతి పూవులు

పూచును. ఈ గ్రామ మధ్యనయున్న 'జుర్రేజు' పొంగి యీ గ్రామ మంతయు (అనగా బనగానపల్లె యంతయు)మూడు భాగంబులు నష్టమైపోవును. తదాది నవాబు పాలన అంత బాగాయుండదు. రానురాను నవాబునకు రాబడి తగ్గును. ఈ సూర్య చంద్రు లుండు నంత వరకును అచ్చమ్మ గారిచే గట్టింపబడిన లోమఠంబుననుండు లింగాకారమునకు పూజలు జరుగుచుండును. ఇంకను అనేకోత్పాతంబులు బుట్టుచున్నవి. కాన యింతటితో యీసభ నాపివేసెద. మహాశయులారా! మీరందరు సదానన్నుధ్యానించుచుండుడు. సద్గతిని జెందెద రనిచెప్పగా నంత సభాసదు లందరును జైజై శబ్దంబులతో నా సభనుండి మహానందంబుతో వారివారి గృహంబుల కేగిరి. ఆ రాత్రి నవాబునకును కొన్ని దేవరహస్యంబులను దెల్పగా నవాబుయొక్క సంతోషంబునకు మేరలేక స్వామీ! నా జాగీరులోని కొన్ని గ్రామంబుల నొసంగెద గైకొనుడని ప్రార్థించగా నంత స్వాములవారు చిరునగవుతో బిడ్డా! నీ వొసంగెడి గ్రామంబులు నా కేందులకు? నేను కావలెనన్న నిటువంటి వనేకంబులుతీసికొనగలను. అయినను నీ యీప్సితంబును నేనెందులకు కాదనవలెను. నాభక్తురాలయిన గరిమ రెడ్డి అచ్చమ్మ కట్టించిన లోమఠంబుననున్న ఈశ్వరునకు గాను నిత్యనై వేద్యదీపారాధనలకై కొంతభూమి యొసంగిన నీయశస్సు ఆచంద్రతారార్కముగనిలుచునని చెప్పగానంత నవాబు సరే! అట్లే యిచ్చితిననిచెప్పి, అప్పటికప్పుడే బన గానపల్లెకు రెండుమైళ్ళదూరములోనున్న మాగాణి భూమిని

ఎబడి యకరంబులు స్వామివారి మఠంబునకు నిత్య నైవేద్య సేవారాధనకై ఒసంగబడినమాన్యంబనివ్రాసి, తన మొహరు వేసి, వారి స్వాధీనంబుజేసెను. ఇప్పటికిని బనగానపల్లెలో నున్న మఠంబున జరుగు ప్రతిసంవత్సర ఆరాధనకొరకై కొంత ద్రవ్యము నిసహాయము చేయుచున్నారు. అంత స్వాములవారు నవాబు వద్దనుండి బయలుదేరి మఠంబునకు జేరి అచ్చటనే నివాసంబుగా నుండెను వేలవేలుగావచ్చు చున్న భక్తాదులకు వారివారి మనోసంశయంబులను దీర్చుచు నచటనేచాలాకాలముండిరి. (123 సంవత్సరంబులు ఈ వీర స్వామీవతారంబున నుండునటుల కాలజ్ఞాన మందున్నది.)

—o—

## చతుర్థ ప్రకరణము

### పరమేశ్వరుండు శ్రీ వీరబ్రహ్మేంద్రావతారుండై కందిమల్లయ్య పల్లెకు జేరుట.

### కొలేరమ్మతో బ్రహ్మంగారు నిప్పును దెప్పించుట -

శ్రీ మన్మహీమండల భరతఖండంబున కడప జిల్లా-బద్వేలు తాలూకా కందిమల్లయ్య పల్లెయందు "పోతులూరి వీరన్న" యను నామంబుతో చూచువారలకెల్ల వెర్రివాని వలె కన్పించుచు వడ్రంగి వృత్తినే యాధారముగా జేసికొని ఆ గ్రామవాసు లొసంగెడి పనిముట్లు జేసి యిచ్చుచు



౭. సాంగాను గ్రామ పెద్దల యెదుట పోతురమ్మను [illegible] ఖండించుట.

నుండెను. తా నెప్పుడు చూచినను పని చేసినట్లుగానా గ్రామ వాసులెవరును నెరుఁగరు ఆ పనిముట్లు నెప్పుడు చేసెదరో యని యనేకులు చూడ నుద్దేశించి ఎక్కువగా పనిముట్లను జేయుట కిచ్చి యాయన వద్దనే గూర్చుండెడివారు. ఎప్పుడు చూచినను నేవియో ప్రసంగముల జెప్పుచు కాలమునుగడుపు చుండెను. కాని పనిని మాత్రం చేసినట్లు గాన్పించదు. తెల్ల వారుదయముననే యెవరెవరి పనిముట్లనువారికిచ్చుచుండెను. కాని యాయన మహామహిమంబులను మాత్రం మా గ్రామ వాసు లెరుంగక "వెఱ్ఱివీరన్న"యని పిలుచు చుండెడివారు. ఆ గ్రామవాసు లందరును గ్రామ దేవతయైన పోలేరమ్మకు జాతరచేయ కుతూహలము గలవారలై శుభముహూర్తంబును నిశ్చయించిరి. కంది మల్లారెడ్డి యను గ్రామ పెద్ద తానే యన్ని ఖర్చులను భరించి జాతర చేయించెను. తెల్లవారి జాతరకైన డబ్బులు వసూలుచేయుటకై గ్రామ పెద్ద లంద రును బయలుదేరి ప్రతి యింటికిని వెళ్ళి సొమ్మును వసూలు చేయుచు శ్రీ వీరబ్రహ్మంగారింటి కా పురవాసులందరును వచ్చిరి. "వీరన్నా ! అమ్మవారి జాతరకైన ఖర్చులకు నీ వంతు ఇవ్వవలసిన డబ్బు ఇవ్వ"మని వచ్చిన పెద్దలలో నొకరు అడిగిరి. అందుల కా వీరబ్రహ్మంగారు ఏమియు మాట్లాడక కొంచె మూరకుండి "నాయనలారా ! నేనునూ డబ్బు ఇవ్వవలయునా? నేను చాలాబీదవాడనుగదా ! నన్ను మాత్రము వదలివేయగూడదా?" యని స్వాములవారనగానే, వసూలుకై వచ్చిన పుర పెద్దలలో ఒకరు "నీ వెఱ్ఱివేషంబు

లన్నియు మాని యందరెంతెంత యిచ్చిరో నీవంతుడబ్బు కూడా ఇవ్వక తప్ప"దని కోపంబుతో మాట్లాడగా, నంత స్వాములవారు మారు మాట్లాడక "నాయనలారా! వంతు యివ్వవలసిన డబ్బును మీ యిష్టాను సారంబుగ నిచ్చెదను గాని, అమ్మవారిని నిల్పినపురంబుకడ కేగుదము ర"మ్మని, వారందరును కలిసి దేవతను నిల్పిన పురంబు వద్దకు వెళ్ళి రచ్చబండపై గూర్చుండిరి. శ్రీ స్వాములవారు పొగ చుట్టను చుట్టుకొని చేతబట్టుకొని, అమ్మవారిని నిల్పిన పురం బువంక జూచి 'అమ్మా! పోలేరి! నిప్పును తేవే' యని స్వాములవారనగానే యంత నమ్మవా రదృశ్యరూపముతో నిప్పులుంచిన పైరాల మూకుడును తీసికొనివచ్చి స్వామి వారి చేతికిచ్చి, యచ్చటనే యదృశ్యంబుగా నిలువంబడి యుండెను స్వాములవారు ఆ నిప్పుతో చుట్టను గాల్చుకొని 'తల్లీ! తిరిగి నీనిప్పును తీసికొని వెళ్ళు'మని స్వాముల వార నగానే తిరిగి అమ్మవారు దానిని దీసికొని వెళ్ళి యథాస్థాన మందుండెను. ఆ వచ్చిన పురజనులందరును నాశ్చర్యంబు పొంది కరములు జోడించుకొని ఒకేసారి స్వాములవారి పాదంబులపైబడి శిరస్సాష్టాంగదండప్రణామంబు లాచరించి "స్వామీ! నీ మహిమంబు దెలియక వెఱ్ఱిబత్తుండవనుకొని అపరాధము చేసి నారము గాన మహాత్మా! మే మిదివరకు జేసిన తప్పులన్నిటి నొప్పులుగా భావించే, మీ బిడ్డలమైన మమ్ములను గాపాడి, మా కందరకును బ్రహ్మజ్ఞానోప దేశ మిచ్చి మమ్ములను ధన్యులను జేయు"దని యందరనేకపర్యా

యము వేడుకొనగా నంత స్వాములవారు కరుణించి "బిడ్డ లారా ! నన్ను మీరెరుంగక, అజ్ఞానాంధకారంబులో మునిగి తాపత్రయంబులకు బద్ధులై, యరిషడ్వర్గంబులకు లోనై యున్నవారలుగాన మీకు మహిమంబులు తెలియవు. నన్నె రుంగుటకు నందరికిని సాధ్యంబుగా"దని స్వాములవారు చెప్పగా నచ్చటనున్న పురజనులందరు వినయ విధేయులై పునః పునః ప్రణామంబు లాచరించుచు "స్వామీ ! మీరు భక్తిజ్ఞాన వైరాగ్యంబులను బోధించి, మమ్ములను ధన్యులను జేయు"దని వేడుకొనగా నంత స్వాములవారు కరుణించి "బిడ్డలారా! మీ స్థితి ఎలాగున్నదనిన 'అనేక పదార్థంబుల యందు దిరుగుచుండిన గరిటె యా పదార్థముల రుచి నెట్లె రుంగదో' అట్లే మీ పరిస్థితులను జూడ నాగరిటె మాదిరిగా నున్న"దని స్వాములవారు సెలవియ్యగా, నా పురజనులలో నొకరు లేచి స్వాములవారికి నమస్కరించి తండ్రీ భక్తి యనగానేమి ? దానియట్లుండవలెను? అయ్యది విశదముగా దెల్పుదని వేడుకొనగా స్వాములవారిట్లనిర. ఈ భక్తియే మహాగొప్ప వస్తువు. దీనికి సమంబైనదియు దీనివలె పవి త్రంబైనదియు ముల్లోకములలో మరి లేదు. ఈ భక్తి జగ దీశ్వరునియందధికమైన ప్రీతి గల్గినవారికి మాత్రము గల్గును. తదితరులకు సిద్ధింపదు. వేలకొలది మనుజులలో ఒక్కగా నొకడు మోక్షము సిద్ధించుటకై ప్రయత్నించును. అట్లుప్రయ త్నించు వారి యందనేకులలో ఒకరు మాత్రమే భక్తితో నుండును. అతిభక్తిగలవారియందనేకులలో నొకడుమాత్రం

పరమాత్మ నెరింగి ముక్తుండగును. భక్తియను నొకదానిచే మాత్రము శాశ్వతానంద మోక్షము పొందవచ్చునే గాని మరి యొక దానిచే మాత్రము కాదని గీతాభిప్రాయము.

గీ॥ యెన్ని యెన్ని పూజ లెన్ని చేసిన నేమి
భక్తిలేని పూజ ఫలము లేదు
భక్తిగల పూజ బహుళ కారణమయా
విశ్వదాభిరామ వినురవేమ!

శ్లో॥ సత్యాదిత్రియుగే బోధా, వైరాగ్యౌ ముక్తిసాధకౌ,
కలౌతు కేవలాభక్తి, ర్బ్రహ్మసాయుజ్యకారిణీ॥
తా॥ కృతయుగ, త్రేతాయుగ, ద్వాపరయుగములలో

వైరాగ్య బోధోపరతులు ముక్తికి సాధనములు. కలియుగ మందు 'కేవల భక్తి' మాత్రము బ్రహ్మసాయుధ్యకారియై యున్నది.

శ్లో॥ యత్ఫలం నాస్తి తపసా
స యోగే న్న సమాధినా
తత్ఫలంతు భవేత్సమ్య
క్కలౌ కేశవకీర్తనాత్॥

తా॥ ఏ యొక్క మోక్షపదము తపసుచేగాని, యో సమాధిచేగాని సాధించుటకు కష్టమైయుండునో, ఆ ముక్తి యను పదము కలిగి యుగమునందు 'శ్రీ భగవన్నామోచ్చా రణ'చే సులభముగా చేకూరును. (అని పన్యాస సంగ్రహము నందు జెప్పబడియున్నది) ఆదిలునుంగాక, భక్తిజ్ఞానంబుల

తారతమ్యంబు దెల్పెదవినుడు. భక్తిజ్ఞానంబుల మార్గంబులు వేరువేరుగా దోచినను, గమ్యస్థానంబు మాత్ర ముభయుల కొకటై యుండును. ఎట్లనగా నీటితో ముఖముకడుగుకొను నపుడొకడుకుడిచేతితోను, ఇంకొక డెడమచేతిలోను కడుగు కొనినను యిద్ద రా ముఖంబునే కడుగుకొనినట్లు భక్తిచేగాని జ్ఞానంబుచేగాని ఈశ్వరునే ధ్యానించిన "జీవత్వంబు నశించి బ్రహ్మస్వరూపులగుదురు" అయ్యది యెట్లనగా తుమ్మెదను భజించి క్రిమిత్వంబు నశించి కీటకము భ్రమరమగు నట్లును, అలాగే భక్తుడు జీవేశ్వర భేదముగా ధ్యానించినను పర్యవ సాన కాలమందు పరమాత్మయందు ఐక్యమైపోవుచున్నాడు. కాన భక్తిమార్గమందు మీ మీ మనంబులు మార్చి ముక్తిని బొందు'డని బోధించగా కం మల్లయ్యపురం పౌరజనంబుల సంతోషంబునకు మేరలేక, శ్రీ స్వాముల వారిని గృహంబు దనుక సాగనంపి శ్రీ స్వాములవారి కరుణా కటాక్షమును వడసి ధన్యులైరి.

### పెదకొమెర్లయను గ్రామంబునకు శ్రీ గోవిందమాంబను శ్రీ స్వాములవారు వివాహం బాడుటకై యరుదెంచుట

ఇట్లు ౦ందిమల్లయపల్లెయందు కొంత గాలంబునుండిన పిదప రాజయోగమున నుండిన మేలని స్వాములవారు మనం బునందెంచి యచ్చటనుండి బయలుదేరి కొన్ని గ్రామములు తిరిగి "పెదకొమెర్ల"యను నొక గ్రామము చేరిరి. అందు శివకోటయ్యయను నొక విశ్వబ్రాహ్మణుడుండెను. ఆయన

సదా కమ్మరపు పనిచేసి జీవనము చేయుచుండెను. ఈయః సదాచార సంపన్నుడై కేవల భగవధ్యాన నిష్ఠుడై విశాజిల్లు చుండెను. ఈయనకు సంతానము లేనందునననేక దైవారాధనలు చేయుచు ననేక దానధర్మంబులు చేయుచు తాను "ఈశ్వర" ఉపాసనము చేయుచు నుండెను. ఒకానొక దినంబున ఈశ్వరీదేవిని ప్రార్థించి తల్లీ! నీ వయిన నూకు బుత్రికగా జన్మించకూడదా? అట్లు నీవు మా గర్భంబున జన్మించకుండిన, నీ యెదుటనే జీవములను బాయువాడను. ఇది నిశ్చయమని మూడు దినంబు లన్నాహారంబులు మాని ఏకదీక్షతో దేవిని పూజించుచు, కఠినవ్రతుండై దేవికి ఎదురుగా అట్లే కూర్చుండెను. మూడవనాటి రాత్రి కూర్చొని పూజించుచున్న కోటయ్యగారికి, భ్రమ కలిగినట్లుండి నేత్రములను మూసికొని తన్మయుడై యుండగా నా దేవి 'బిడ్డా! శివకోటయాచారీ! నీవేల యిట్లు కఠిన వ్రతమును బూని నీ ప్రాణములను బాసెదవు? నీ యూప్సితానుసారముగా నేను నీకు బుత్రికనై నిక్కముగా జన్మించెదను. ఇంక నీ కఠిన వ్రతంబును మాను'మని చెప్పిపోయెను. అంతట శివకోటయ్యగారికి జ్ఞప్తి గలిగి, లేచి దేవికి నమస్కారముచేసి, స్నాన సంధ్యాద్యనుష్ఠానంబులు దీర్చుకొని భోజనము చేయుచు, భార్యతో కాంతా! మన మారాధించెడి ఈశ్వరియే నీ గర్భంబునబుట్టెదనని చెప్పి యదృశ్యమాయెనని చెప్పగా నంత నామెకుండెడి మహదానందమునకు మేరలేక స్వామీ! నిక్కమేనా? ఎగతాళిగా నన్ను పరిహాసము చేయుచునా రా?

యనిన, నంత శివకోటయ్యగారు కాంతా ! నిక్కముగా నద్దేవి చెప్పినది. దేవి సాక్షిగా నిక్కమని చెప్పగా నామె సంతోషించెను. పిమ్మట నామె గర్భవతియైన నవమాసంబులు జరిగిన పిమ్మట నొక కుమార్తెను ప్రసవించెను. అంత నామెకు గోవిందమ్మయని నామకరణంబు జేసిరి. ఆ గోవిందమ్మగారు పసితనంబునుండియే అతిథి అభ్యాగతుల నాదరించుచు, సర్వకాల సర్వావస్థలయందును సర్వేశ్వరుని ధ్యానించుచు పెద్దలనిన బహు భక్తి ప్రపత్తితో బూజించుచుండెను. ఈమెకు పదిరెండు సంవత్సరంబులు రాగానే తల్లిదండ్రులు వివాహంబును జేయవలెనని ప్రయత్నించుచుండిరేగాని, గోవిందమ్మగారు తల్లిదండ్రులు మెచ్చితెచ్చిన వారిని కనులెత్తియైన చూడకుండుటచే, నా వచ్చిన వారలందరును విఫల మనోరథులై పోవుచుండిరి. అంత నామె తల్లిదండ్రు లిరువురును గోవిందమ్మను జేరదీసికొని, తండ్రి తొడపై గూర్చుండ బెట్టుకుని తల్లీ! నీ కొరకై ఎన్ని సంబంధములు దెచ్చినను వారిని ఒల్లకుంటివి. తుదకు బీదవారిని గూడ చూడక, విద్యాపారంగతుల నెందరినో తీసికొని వచ్చినను వారిని గడ్డిపోచకన్న హీనముగా జూచుచుంటివి. నీ మనో నిశ్చయం బేమని యడుగగా, నంత గోవిందమాంబ తల్లిదండ్రులారా! నా మనోనిశ్చయంబును దెల్పెదవినుండు. అది యెద్దియనిన శ్రీమన్నారాయణాంశ సంభూతుండగు సర్వజ్ఞుండే నాకు భర్తగావలెనని, సదా ఆ పరమేశ్వరునే పొరించుచుంటిని. కాన విషయానందంబున నోలలాలెడి

పామరజనంబును నే నొల్లను. కేవల బ్రహ్మానందంబున నోలలాడు చుండెడు ఏ మహామహుండు గలడో, రాత్రిం బగళ్ళు నా కన్నులయెదుట సన్యాసి రూపంబున బొడగట్టు మండిన యా పుణ్యమూర్తిని దక్క నితరులను నేను వరింపను. ఇదియే నా మనోనిశ్చయము. తుదకు నా ప్రాణంబులనైన విడుతునుగాని పరమ పావనుండైన యా భగవత్ స్వరూపునిదక్క నితరులను నేను వివాహంబాడనని గట్టిగా బలుక తల్లి దండ్రులిట్లులనిరి. తల్లీ! ధనధాన్యములుగలవానినైనను లేక సర్వవిద్యాపారంగతుడగు వానినైననుగోరుము తినుటకు దిండియు గట్టుటకు గుడ్డయు లేని యొకసన్యాసిని బెండ్లియాడెదనని పట్టినపట్టును విడువకవల్కుట న్యాయమా? సాటివారిలో చులకదనంబుకాదా! నీయీడుజోడువారందఱు నిన్ను నెగతాళి చేయరా ? నీవు సన్యాసి వానిని బెండ్లాడిన నిన్ను జూచుటకు మా మనంబులు సహించునా ?పిన్నతనంబునుండియు నిన్ను నతిగారాబంబున బెంచిచిట్టచివరకు నిన్ను సన్యాసివాని కిచ్చి వివాహంబు జేయుదుమా ? తల్లీ ! మా మాటలు వినుము. ఈ కోర్కెను వీడుము. ఇతరులలో నెవ్వరినైనను గోరుము. మా మనంబులకు సంతాపంబును గల్గింపకుము. పిన్నదానివైన నీకు లోకజ్ఞానంబు తెలియదు. ఇంతను నీకు దోచకున్నను నీ యిచ్చవచ్చిన నీ యీడు జోడు వాండ్ల నడుగుము. వారందరును నీవలె సన్యాసులను గోరి వివాహంబులాడిరేమో? కొంచెము కనులెత్తి ప్రపంచ

మును జూడుము. లేకున్న నీ మనంబున నీవే యాలోచించు కొనుమని చెప్పుచున్న తల్లిదండ్రులను జూచి తల్లిదండ్రు లారా! మీ రెంత నన్ను బాధించుచుండిననుగాని ప్రాపంచిక సంబంధమైన ధనధాన్యములు గలవానిని గాని వాచాజ్ఞానం బైన విద్యల నభ్యసించిన వానిని గాని వివాహంబాడ నా మనంబొప్పదు. నేను వరించిన యా నవమోహనాంగుడు నా దివ్యజ్ఞాని ఆ పురాణ పురుషోత్తముడు. ఆ భక్తుల పాలిటి పెన్నిధానమైన నా మనోహరుండిపుడు మన గ్రామంబునం గల ఆలయములో నొక సన్యాసి రూపంబున నున్నవాడు.మీ రేగి యాయనను దోడ్కొనివచ్చి నన్ను ఆయన కొసంగి కన్యాదానముచేసి వివాహం బొనర్చిన కడుధన్యులయ్యెదరు.

నా మాట విశ్వసింపుము. నన్ను కేవలము జ్ఞానశూన్యు రాలినిగా నెంచకుడు. నిన్న సాయంసమయమున మనవాకిట ముందు కూర్చొని యుండగా నా సన్యాసి రూపుండైన యా నవమోహనాంగుడు మన యింటి యెదుట నున్న తిన్నెపై కొంచెముసేపు కూర్చుండి నా యందే యా మహనీయుడు దృక్కునిల్పి చూచి చూచి యేగినాడు. అప్పటి నుండియు నా మనంబంతయు ఆయనయందే లగ్నంబై రాత్రియంతయు నిదురలేక యుంటినని చెప్పి గదిలోనికేగి పరుండి పరమే శ్వరా! పరబ్రహ్మావతారా! సన్యాసిరూపుడుగా నిన్న సాయంత్రము గాన్పించిన కరుణాకరునే నాకు భర్తగా జేయు మని ప్రార్థించుచూ నిదురించెను. అంత తల్లిదండ్రులు ఆ సన్యాసి వాడేమయిన మన అమ్మాయిపై మత్తు చల్లి ఏగి

నాడేమో యని పలువిధముల ననుకొనుచుండగా నిరుగు పొరుగున నుండు కొందరు స్త్రీలు వచ్చి ఇదేమి వింతమ్మా? ఇంత చిన్నతనంబుననే మీ మాటలు మీరి మాట్లాడుచున్నది. గ్రహపీడ యేమయిన తటస్థించెనేమో ? సోదియైన నడుగు డని చెప్పి ఏదియో కొంతసేపు మాట్లాడి వారి వారి గృహ ముల కేగిరి.

మృతుండైన రెడ్డి స్వాములవారి మహిమంబుచే బ్రతుకుట—ఒక భక్తుడు మానవునకు ధ్యానము శ్రేష్ఠమా ? బ్రహ్మజ్ఞానము శ్రేష్ఠమా ? యని ప్రశ్నించుట.

శ్రీ పరమేశ్వరావతారియైన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని శివకోటయ్యగారు సామాన్య మానవుండని తలంచి నిరాదరణ భావమును జూపుచు తన పుత్రికయైన గోవిందమ్మగారు చెప్పెడి విషయంబు లన్నియు కల్లయని తలంచి శ్రీ స్వాములవారి మాటయనిన శివకోటయ్యగారి చెవులకు ములుకులవలె నాటుచుండెను. ఇట్లుండగా నా పెద కొమెర్ల గ్రామంబున నొక రెడ్డి యారు మాసంబుల నుండి జబ్బుపడి చనిపోగా బంధుమిత్రాదులందరా రెడ్డికి దహనాది క్రియలు చేయుటకై యొక 'పాడెను' తయారు చేయించి యందుపై నా రెడ్డిని పరుండబెట్టి శ్మశానవాటికకుస్వాముల వారున్న దేవాలయము ముందుగా గొనిపోవు చుండుట స్వాములవారు చూచి వారివద్దకేగి అయ్యలారా ! ఇదియేల వింత? ఇట్టి విపరీతము ఈ భూమియం దెందైనా గలదా ? బ్రతికియుండిన మానవుని పాడెపై పరుండబెట్టి శ్మశానవాటి

కకు గొంపోవు వెఱ్ఱులెందైన గలరా? యని స్వాములవారు చిరునగవుతో జెప్పగా వారందరకును నాశ్చర్యముగాదోచి? అయ్యా! బ్రతికిన వానిని మే మిట్లేల మోసికొనిపోదుము రు ఇట్లు చేసిన మా కేమయిన లాభము గల్గునా? యీతం డారు మాసములనుండి జబ్బుచేతకృశించిచనిపోయినాడని మే మంద రము దుఃఖాబ్ధి మునిగియుండగా మాతో నిట్లేల పరిహాస వాక్యములు పల్కెదరని వారందరనగా నంతస్వాములవారు నాయనలారా! నే జెప్పునది యదార్థముగాని యనృతము గాదు. నిజం నిలకడమీద మీకే తెలియునని వారితో జెప్పు చుండగా నా గ్రామవాసు లందరు గుంపుగూడి యిదేమి ఎంత? చచ్చిన వాడేల బ్రతుకునని వారందరనుకొను చుండగా స్వాములవారందరిలో నిలువంబడి బిడ్డలారా! నే జెప్పెడువాక్యంబులవలన మీకేమయిన కష్టముగానున్నదా? నేను నిజంబు చెప్పుచున్నను మీకింత యాలోచనలెందుకు? తినబోవుచు రుచులడగనేల? అరగంటలోనా నిజానిజంబులు మీకే దెలియును. అప్పుడెవరెట్లనుకొందురో యట్లు యను కొండని వారందరితో కలసివెళ్ళి 'దింపుడు కల్లంవద్ద' నా శవంబును దింపగా స్వాములవారు మందస్మిత ముఖారవింద ములో నాయనలారా! త్రాటిచేకట్టబడిన కట్లనువిప్పుడు. నా యదార్థ వాక్యంబు లప్పుడంచిరకును బోధపడునని చెప్పగా వారి లో కుశాగ్రబుద్ధియైన యొక రీయన యింతగా జెప్పు చుండగా మనమేల యూరకుండవలెనని యా శవంబునకు కట్టిన త్రాళ్ళను విప్పగా నంత నా స్వాములవారు తనదివ్య

అమృత హస్తంబుచే శిరము మొదలు పాదములవరకు తుడిచిన వెంటనే నిద్రనుండి మేల్కాంచిన వాని భంగిగూర్చొని నన్నేల యిట్లు శవాకారముగా జేసి తెచ్చితిరని తన బంధుమిత్రాదులతో ననగా నంత నచటనున్న ప్రజాసమూహంబంతకు నమితోత్సాహముగా దోచి స్వాములవారి ననేకవిధములుగా వారందరు ప్రార్థించగా కరుణాలవాలుండగు స్వాములవారు తనవద్దనున్న సభూతిని వానినొసటబెట్టి బిడ్డలారా ! ఈతండికను కొన్ని వత్సరంబు లీ భూమియందుండి పుత్రవంతుడై యుండవలసిన యోగంబున్నది. ఆలస్యంబు చేయక నిక మీ వానిని మీగృహమునకు దోడ్కొని పొండని చెప్పి స్వాములవారు నటనుండి బయలుదేరి శివాలయంబుజేరి యుండగా నా గ్రామ వాసులందరు గుంపులు, గుంపులుగా వచ్చి స్వాములవారిచే అనేక అద్వైత విషయంబులను వినుచు స్వాములవారి కృపకు పాత్రులైరి. వారిలో స్వాములవారున్న శివాలయ పూజారియైన బ్రహ్మయ్య యను పూజారి స్వాములవారి వద్ద కూర్చుండి వినయవిధేయుడై స్వామీ! మానవునకు ధ్యానమే శ్రేష్ఠమైనదా? లేక బ్రహ్మజ్ఞానము శ్రేష్ఠమైనదా యనిప్రశ్నించెను. అంతట స్వాములవారు బిడ్డా! వినుము. నన్నెవ్వరు నెరుంగజాలరు. నన్నెరింగినవారలే నాకుప్రియులు. తనదు ప్రాణమువలె అన్యులను జూచి తపమే మేలయిన లాభంబునిచ్చు నిక్షేపంబుగా నుండును. సమభావంబు గలవాడయిన అతి శీఘ్రముగా నన్నంతర్ముఖంబున నిర్గుణునిగా నున్నా, బరా

జ్మాఖమందు సగుణునిగానున్నా దర్శించును. ఊసముగల చక్షువునకు రూపముగాను, జ్ఞానచక్షువునకు అరూపముగాను అగుపడి అఖండానందమును గలుగజేయువాడనునేనే. జ్ఞాన చక్షువులేని అజ్ఞానులయ్యేను. ప్రియముతో నన్ను ధ్యానింతు రేని తోడనే వారికి నేను ప్రసన్నమై అఖండ సామ్రాజ్యము నిత్తురు. నన్ను నమ్మినవారి పాలిట దూరముగా నుండక అతి సామీప్యంబున నుందును. భక్తిమార్గ మందుండు వారిని బిడ్డలను కాపాడు తల్లివలె ప్రియముతో రక్షింతును. వైరా గ్యంబగు యోగమార్గ మందుండు వారిని పలు తెరంగులలు శోధించి స్నేహభావముగా జూతును. జ్ఞానమార్గముననుండు వారిని నాకు సములని భావింతును భక్తిమార్గములో నుండు వారు బిడ్డలుగా నుండియును, వైరాగ్యము మొదలగు హఠ యోగంబులో నుండువారు ఏ జాతివారైనను జ్ఞానమార్గమున నుండువారు వయోవృద్ధులయ్యును బిడ్డలకున్ను, వృద్ధుల కున్ను, అహమను భావము తగ్గియుండును. వైరాగ్యముతో హఠయోగమును సాధించువారికి "తా"ననునది అధికంబుగా నుండును. దానివలననే వారు నావలన మిగుల శోధింపబడు దురు. భక్తులు నన్నే నమ్మి అన్నింటికి సచ్చిదానంద స్వరూపుడే తోడని అహంభావమును బొందక సతతము నా పారాయణముచే దినములు గడుపుదురు జ్ఞానులు ప్రారబ్ధా ధీనమైన యీ తనువునకు సుఖమువచ్చినను దుఃఖము గలిగి నను సంతోషమున్ను సంకటమున్ను పొందక అన్నియు నున్నరీతినే ముగియునని ఘానమందున గమనముంచియెట్టి

దానికిని అహంభావమును బొందక నిరహంకారవస్తువులఁ
బయమై యుందురు. భక్తులకు ముఖ్యమైనది ప్రియమేన
సిద్ధులకు ముఖ్యంబైనది వైరాగ్యంబేను, ముక్తులకుముఖ్య
మైనది మౌనంబేను. ప్రియము లేని భక్తియును, వైరా
గ్యంబు లేని యోగంబును, శాంతములేని జ్ఞానంబును నిష్ఫ
లంబని చెప్పబడును. యెల్ల ధర్మంబులును నాశనము
చేయుట, నే నను నహంకారమున్ను, నాది యనుమమకార
మున్ను అశుభంబేను. కనుక కర్మ భక్తిజ్ఞానమును మూడిం
టిలో మానవునకు దేనిపై నిచ్ఛయో దానినే భక్తులగువారు
తృథముగా నమ్మవలెను. కాన బిడ్డలారా! మారుతంబు
కన్నను మిగుల వేగంబుగా పరుగిడెడు మనంబును పరుగిడ
నియ్యక చూచుచుండుడు. పిమ్మట ఇంకను ననేక విషయం
బులు బోధించెదను ఈ రోజున జరిగిన మహత్తు కన్నను
రేపటి దినంబున జరిగెడి మహత్తు మహాచిత్ర విచిత్రంబుగా
నుండును. ఆ చిత్రంబును మీరందరు చూచెదరని చెప్పిరి.
అంతట వారందరు స్వాములవారివద్ద సెలవు గైకొని వారి
వారి గృహంబుల కేగిరి.

• సంజీవుడై యున్న తుంటరిని మృతుండై నాడని స్వాములవారు చెప్పగా మృతుండై యుండుట—తిరిగి స్వాములవా రా తుంటరిని బ్రతికించుట.

పెదకొమ్మర్ల గ్రామవాసు లందరు గుంపులు గుంపు
లుగా గూడి మరణించినవాడు తిరిగి బ్రతుకుట ఇదివరకెన్న
డును కని విని యెరుంగము. ఇయ్యది చూడగా బహుచిత్రం

ముగా నున్నది. ఆయన కేవల పరబ్రహ్మయే ఈ రూపం
బున నరుదెంచి రెడ్డిని బ్రతికించినాడుగాని సర్వసామాన్య
మానవుండే యమున నిట్టి మహత్తుండదని యా గ్రామవాసు
లంద రొకరితో నొక రనుకొనుచుండగా నా గ్రామవాసు
లలో కొందరు తుంటరు లిది యంతయు చూడ నేదియో
తాంత్రికముగా గన్పట్టుచున్నది. లేకున్నమృతుండైనవాడు
తిరిగేలా బ్రతుకును ? ఇట్లుగాదు మనలో నొకరిని చచ్చిన
వానిరీతిగా పాడెపై బరుండ బెట్టుకొని స్వాముల వారున్న
శివాలయము ముందుగా దీసికొని వెళ్ళుచున్న నప్పుడేమి
చెప్పునో చూతుమని తుంటరులంద రాలోచించుకొని పాడె
నొకదానిని కట్టి తుంటరులలో నొకరిని పాడెపై పరుండబెట్టి
గుడ్డను కప్పి త్రాడుచే కట్టిఎత్తుకొని వారందరు గుంపులుగా
కలసి శివాలయము ముందుగా వెళ్ళుచుండగా స్వాముల
వారందరిని జూచి పూజారి బ్రహ్మయ్యను బిలిచి చూచితివా
నాయనా ! ఈ తుంటరులకు చెడు కాలంబు సమీపించి నేను
తాంత్రికుడనని వారు తలంచి బ్రతికిన వానిని ఇట్లు పాడెపై
పరుండబెట్టి చచ్చిపోయినవాడని కపట దుఃఖముతో వచ్చు
చున్నారలో చూడుము, "వినాశకాలే విపరీత బుద్ధిః" అను
నట్లు వాండ్ల చెడుదినంబులు సమీపించినవని చెప్పుచుండ
నంతలో తుంటరులంద రా పాడెను మోసికొనుచు వచ్చు
చుండిరి. అంత స్వాములవారు తుంటరులవద్ద కేగినాయన
లారా! ఎవరీయన ? ఏ కారణంబుచే మరణించినాడని తుంట
రుల నడుగగా వారలందరు కపట దుఃఖముతో అయ్యా !

ఈతండు పదునైదు దినంబులనుండి జ్వరపీడితుడై రాత్రి ఎనిమిది గంటలకు మృతుండయ్యె నని చెప్పగా నంత స్వాములవారు 'పాప మీతండు చనిపోయినాడు కాబోలు ? స్వయం కృతాపరాధుని మన్నించువారెవ్వరు ? నిదురించు వానిని బిలిచిన పలుకును గాని, మెళుకువతో నున్నవాడు పిలిచినను పలుకడుగదా ! ఇవ్విషయంబు సర్వమానవులెరింగియే యుండ తాంత్రికుండనైన నాకేమి తెలియు'నని చెప్పి పూజారి బ్రహ్మయ్య వగైరాలతో శివాలయములోని కేగెను. అంతట వెలుపలకు తీసికొనిపోయి కట్లు విప్పిచూడగా శ్రీ స్వాములవారి వచనానుసారంబుగా పాడెపై పరుండినవాడు మరణించి యుండుట తుంటరులందరు చూచి వారందరును వికలిత మానసులై దుఃఖాంబుధిలో మునిగియుండ వారిలో కుశాగ్ర బుద్ధియగు నొకడు 'అరే' అన్నలారా! నే నొక్కయుపాయంబు చెప్పెద. అట్లుచేసిన మన మందరము ధన్యుల మయ్యెదము. లేకున్న మరణించినది ఒక్కవాడే కాదు మనమందరమును' అని వారితో నిట్లుచెప్పెను.'అన్నలారా ! శివాలయమందున మౌనీంద్ర రూపంబున నున్న ఆయన మానవుండని తలంచితిరి గాని అదివట్టిమాట. కేవల పరమశివుండే ఈ రూపంబున గర్వాంధుల గర్వంబడంచి పావనులనుజేయ నరుదెంచిన పురాణపురుషుండు గాన శవంబును దీసికొని మన మందర మొక్కసారిగా వెళ్ళి స్వాముల వారి పాదంబులపై బడినగాని లాభంబు లేద'ని చెప్పగా వారంద రొక్కసారిగా బయలుదేరిశవంబును దీసికొని వెళ్ళి

పెదకొమెర్ల గ్రామవాసులకు కాలజ్ఞానంబును బోధించుట
(1897 సంవత్సరంబున ముద్రించిన కాలజ్ఞానములోనివిషయంబులున్ను
తాళపత్రంబులనున్న కాలజ్ఞానంబులోని విషయంబులున్ను
కొన్ని పొందుపరచబడినది)

నాయనలారా! నే నిప్పుడు బోధించబోవు "కాల జ్ఞానంబును" నిత్యము చదువుకొనుచు పూజింపుచు, సదా నన్ను ధ్యానించువారి కిహపర సౌఖ్యంబు లొదవుగాన శ్రద్ధాళురై వినుడని యిట్లు బోధించెను.

శ్లో॥ ప్రభవ ప్రార్థివ మధ్యే బహుప్రళయనిశ్చయం।
అనంతరేఆనందమధ్యే... రక్తపాతౌరణరంగభూమే।
బీభత్సా ప్రపంచస్థితిః॥

బిడ్డలారా! కలియుగము 5000 మీద పుణ్యభూమి యైన ఈ ఖండమందు (ఇంక యితర ఖండముల స్థితి చెప్పనదేమున్నది) ధర్మ మడుగంటును. అధర్మంబంతట తల యెత్తును. భారతీయులకు పరధర్మమే స్వధర్మమౌను. స్వధర్మమే పరధర్మమౌను. అన్యాయంబే న్యాయంబౌను. న్యాయంబే అన్యాయంబౌను. నిజముకల్లయగును. కల్ల నిజం బగును. ఇహ సౌఖ్యములైన పారమార్థిక వైదిక విద్యలెల్ల నీటి కన్నను తేలికగును. మీసాలమీద తేనియవలె ఈ సౌఖ్యముల చవిచూపు లౌకిక విద్యలు మిక్కిలి యెక్కు యగును. జాతి నీతులు, కులగోత్రంబులు, వావివరుస (
పూజ్యములే యని. 'పోతు-పెంటి' ఈ రెండేమాజాతి

మేము మాతంగ కుల గోత్ర పవిత్రులమని, పశుపతి కుల ప్రవర్తకులమని, బ్రహ్మబంధువులమని మా విస్సన్న చెప్పినదే మాకు వేదమని, రుద్ర ఘళయాళము వంటి మంత్రముతే మాకు స్వాధ్యాయ యోగములని, వేదశాస్త్రములు విప్రుల స్వార్థమునకై కల్పింపబడినవని, వర్ణాశ్రమాచారాములు వట్టిగాథలని, భక్తిజ్ఞాన వైరాగ్యములు పనికిమాలిన పామరులైన సోమరులకు పౌరుష వీర్యములేని పిరికి పందలకు పట్టుకొమ్మని వింత వింత వాదములుబయలుపరచు విపరీత జ్ఞానులు పుట్టి 'తాచెడిన కోతివనమెల్ల చెరచు' నన్నట్లు తాము పరలోకమునెల్ల పాడుజేయుదురు. భక్తులు భగవంతుడెక్కడనున్నాడని దిక్కులు చూచుచుందురు. ఆలుమగలు, అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు, చుట్టపక్కములు, గురుశిష్యులు, రాజులు, ప్రజలు ఒకరినొకరు మోసగించి మానప్రాణంబులుదీయుదురు. కాలప్రకృతి ధర్మంబులు తలక్రిందై నడవగలవు. వేళకు వానలు కురియువు, పైరుపచ్చలు పెరుగవు. పాడిపంటలు తరుగును. దేశమునం దంతట తెగుళ్ళు, దిగుళ్ళు రేయింబవలు చెలరేగును. పాపిష్ఠులు పొడమ్యేరు. 'ప్రభవ పార్థివమధ్యే బహుప్రళయ నిశ్చయం' బిడ్డలారా! కలియుగము అయిదు వేలమీద వచ్చెడి ప్రభవ పార్థివనామ సంవత్సరము మొదలుకొని ప్రపంచమంతయు బహుప్రళయములతోనుండును. ప్రజానష్టంబును, పశునష్టంబునుసస్యనష్టంబును విషగాలివల్లను, అగ్నిపర్వతమువల్లను, గాలివానవలనను, ప్రళయాకారంబులైనయుద్ధంబువల్లను కొండలు పగు

లుటచేతను, ప్రాణంబులేని బండ్లవల్లను, నదులు సముద్రం బులు పొంగుటచేతను ప్రతిగ్రామమందును, ప్రతి పట్టణంబు నందును ప్రజలలో అన్యోన్యవైరంబులు గలిగి ఒకరినొకరు కొట్టుకొని రచ్చకొట్టాలకు చేరేరు. రచ్చ కొట్టాలకు ప్రజలే రాజులయ్యేదరు. జాతివైషమ్యంబులు హెచ్చుగ చెలరేగేను. ప్రపంచంబున పట్నాలు విస్తారంబయ్యేను. కలి 4081 సం॥ మొదలుకొని పదహారు ఆనందలకు నేను చెప్పిన భవిష్యత్తు జరగబోతూ ఉన్నది. కాశీ దేశమందు ఘనముఖులైన భక్తు లుండెదరు. పడమటిదేశము స్త్రీల బలముతో నుండును. ఉత్తరదేశము కత్తులచే ఆటలాడుచుండును. దక్షిణదేశము తారుమారై తగవులాటలచేత కొట్టుకచచ్చేరు. వేదవిద్యలు విప్రులు చదువక చండాలురై చెడిపోయేరు. సోమయాజులు జీవహత్యలు చేసికొనేరు. ప్రయాగతీర్థమందు భక్తులు నిల చేరు. శ్మశాన భూములయందు భక్తులు జనించేరు. పల్లెలు పట్నాలగును. తల్లిదండ్రులు ధర్మాధర్మములు తప్పి స్త్రీలను విక్రయింతురు. ప్రభవ సంవత్సరము నుండి వీర భోగవసంతుండనైన నా కీర్తి విస్తారమయ్యేను. జితేంద్రియు లంతా ఆయుధ బాణంబులచే చచ్చేరు. దారుణంబైన వైరంబులచేత రాజులందరు ప్రాణంబులు గోల్పోవుదురు. సుతుడు అవమానించెడి తండ్రిన్ని, పతిని అవమానించు భార్య, తండ్రికొడుకు, భార్యలు భర్తలొకరినొకరు మెచ్చక వారి వారి యిష్టప్రకారము నడుచుచుందురు. దేవ పితృ క్రియలు నడవక వేదార్థ ఉపదేశంబు లుడిగింతురు. మోహ

తమము హెచ్చేను. లోకంబంతయు జనబూయిష్టంబగును. శ్రుతి ధర్మాలు శూద్రులుచెప్పగా విప్రులు నింటూ అతినింది తులై చరింతురు. దేవతాస్థలంబులు. విప్రులయిండ్లు, ఆశ్రమ భూములున్నూ చెడి పాడయ్యేను. దేవాలయంబులలో నీచ జాతివారు చేరి పూజించేరు. "రాజానుమతే ధర్మః" అను న్యాయంబునకు మారుగ "ప్రజానుమతే రాజః" అను న్యాయంబు సత్యంబయ్యేని. రాజులు ప్రజలకు భయపడేరు. పాషండదర్శనము బహుళమయ్యేని. కలిని జపతప స్వాధ్యా యంబులు విడచేరు. శూద్రులు జపకీలితులు కాగలరు. పులులు మొదలగు దుష్టమృగము లాకులలములై అడవి యంతయు శూన్యమై భూములరాచకములై ధర్మనిర్మూలమై ద్రవిడభిల తురుష్క బర్బర పుళిందాది దేశంబులలో వ్యాధి గ్రస్తులై నశించేరు. జనులు యుగాంత్యమందు క్షత్రియ జాతుల శూద్ర చరిత్రమున శౌర్యముతేజస్సు సిరిస్నేహము లేక చెదరి సంచరింతురు రసగంధ ద్రవ్యంబుల పసచెడేను. సస్యములు అల్పఫలంబు నిచ్చును. పశువుల పాడి తగ్గును. చెట్లయందు కుసుమఫలంబులు కొంచెమౌను. సాధుజనులు దుర్గతులనున్న రోగంబులచే అల్పకాలంబున చచ్చుచు పాపాత్ములు మిక్కిలి ఆయుష్యమును రోగము లేక సిరిని బొందుదురు. ఎందు చూచిన అరికపంట బహుళమయ్యేను. గొడ్డపాడి హెచ్చేను. పితృదైవతా కార్యములలో పీరే భోక్తలై యుందురు. రాణా స్త్రీలు రచ్చ కొట్టంబులలో ధాజరికంబులుచేసేరు. ఆకాశంబున రక్తపీత వర్ణంబులుగా

లోకమంతటా కాన్పించును. అందువలన కొందరునశించేర ఆకాశమున కొండంత నక్షత్రంబు బుట్టేను. ఆ చుక పేరే మనగా 'యుగము మార్పుచుక్క'. దానినే అనంత నామములుపెట్టి పిలువబోయెదరు. ఆ చుక్క పుట్టినప్పటి నుండి దానిని అనేక నరులు చూచి నశించెదరు. ఇట్టి కాల మున దుష్ట శిక్షణ శిష్టపోషణార్థమై వీరభోగ వసంతావ తారుండనై వచ్చుటకు ముందు కమ్మన్న పనులెల్లా యొక ఘడియలో నగును. మనో యోగంబుచేత మాటలుతెలిసేను. ఎఱ్ఱచీమ ఏనుగు రూపంబున గాన్పించేను. మనుష్యులతో మాయాశక్తి మాట్లాడేను. పంది కడుపున ఏనుగు బుట్టేను. కోడి మనిషికూత కూసేను. మేకకు అయిదు తలల మేక పోతు బుట్టేను. కావేరీ తీరమందు కలహములు పుట్టి ఏడు పుట్ట నల్లులు ఒక్క ముహూర్తమందు రాలేను. మష్టు ఆరని బిడ్డలు మాట్లాడుదురు. ఆవు కడుపులో దూడ అంత ర్గతంగా జనులకు కనపడేను. మేకపోతు ఆవు అరపు అర చేను. అందున కొందరు నష్టమయ్యేరు. మంచిబెల్లం చేద వును. వేప చెట్టున అమృతం పుట్టును. అమావాస్యనాడు పిడుగులుపడి నక్షత్రాలు రాలును. కొండలయందు విపరీత మైన కేకలు పుట్టును. ఆరు నెలల బాలుడు పాడేను. ఆవుకు అయిదు శిరస్సులు, రెండు యోనులుగా పుట్టును ఒకయోని మానవయోనిగాను, ఒకటి ఆవు యోనిగా నుండును. గోవు కడుపున మనిషి పుట్టును. వాడు మానవునితో మహా తర్క వాదము లాడేను. ఇత్తడి బంగారముగా అమ్మేను. అది

నరులకు ఎంత సుగుణం బయ్యేనో అట్లే ఎక్కడి కక్కడనే దినదినానికి నాశనం. మీ సుఖం మీకేతెలుస్తుంది. నాగుమల్లె యతి విచిత్రముగానశించేను. నాగుమల్లెరీతిగా నరులందరును నాశనంబయ్యేదరు. ఇంకా వెతలుముందు జరుగును. ఇందలి పరమార్థంబును తెలసికొనలేక మాయచేత నున్నారు. ఉన్న ప్పటికిని నా మహిమతెరింగిన నా భక్తులు జాగ్రత్తగనే నన్ను పూజించుచుందురు వారిని బిడ్డను తల్లి పోషించు చందంబుగా పోషించుచుందును. సూర్యుని మహిమలు జనులకు కనబడేను. అదే నా రాక మీకు నిదర్శనము. సూర్యుడు పచ్చనిరూపముగాను, మనిషిరూపముగాను గానం బడేను. భావనామసంవత్సర శ్రావణ బ॥ ౧ లు నాటికి నదీ నదంబులుపొంగి పట్నాలు పల్లెలుపాడయిపొయ్యేను. బహు ధాన్య నామ సంవత్సరంలో నిరువదియైదు పట్నాలు రక్త పాతమై పాడై పోవును. ఓంకారము భూమిలో పలికేను. పల్నాటిసీమలో బ్రాహ్మణుని యింట కాకరచెట్టుకు చింత కాయలుకాసేను. బనగానపల్లెలో గల కాలజ్ఞానముల పాతర పైని మొలచిన చింతచెట్టుకు జాజిపూలుపూసేను. కనకదుర్గ కొండలో కలకలములు బుట్టి పగిలేను. కొంతకాలమునకు దుర్గాంబ నిలుచుటకు వీలుండక కందిమల్లయపల్లె చేరేను. ఏడుపుట్ల నల్లులు ఒక్క ముహూర్తములో కృష్ణ వద్ద రాలేను. సూర్యుడు వణకేను. నా రాకకై నా భక్తులు యెదురు చూచుచుండేరు. పాపాఘ్ని మఠము మహోన్నత

దశకు వచ్చేను. కుంభకోణము గుడి కూలి కుంభుని రూపు మాసేను. పోతులూరి వారి భక్తులు జ్యోతి స్వరూపులై వచ్చేరు. ఆయిదేండ్ల బాలుడు భవిష్యత్తు చెప్పేను. కాశీ దేశమందు ఘనమైన చుక్కలు పంచవన్నెలుగా ప్రజల మయ్యేను. జగన్నాయకులు జడలు పెంచుకుని చంద్రగిరిచేర వచ్చేను. అదే మీకు నిదర్శనం. విశ్వకర్మ విస్తరించియుండి వింతవింతలు జరిపేను. పుణ్యభూమియైన యీ భరతఖండం బుననేగాక ఇతరఖండములలోకూడ, కందపద్యం॥ "దిక్కుల గోలయుగల్గును. అక్కులలో దిగులుజెంద నద్భుతముగయే దిక్కులజూచిన రక్కసి చిక్కులవలపాటు నొందు సిడినుడు వులచే॥ ఉ॥ అంటనిజాతు లగ్రమగు నాది కులంబులు హాని జెందు, యింటింటిన రోదనంబులగు, యిళ్ళకు యిళ్ళు నశించుచుండు॥ కుంటిలిడున్ పతివ్రతలు కూయును పక్షులు రాత్రివేళలో, మింటిన రక్తమున్ గలుగు మిత్ర విరోధము ముఖ్యమౌ గదా॥ కం॥ దక్షిణ ముఖమైన విధరి తక్షక వంశ జుడు నిలచి ధరలోనరులన్॥ రక్షింపబోడు యింకను రక్షణ భూపాలుపంపు ధరనరుల సుమీ॥" మరియు నీ కలియుగం బున సత్యమున్న పక్షపాతమున్న నిర్మలమైన జ్ఞానులను వంచనచేయు ద్రోహులను శ్రుతులకు అర్థంబు భేదించిచెప్పు టయు యుగమహాత్యం వలన శూద్రసేవారతులై వర్తించు టయు ధర్మరహితులను సన్యాయకారులు క్రోధమాత్సర్య లోభమోహాది దుర్గుణ విశిష్టులు వర్ణాశ్రమాచార రహితులను దురాచారులు నిర్దయులు నిష్కారణ వైరులు దయాసత్య

శౌచాదిహీనులునసృతవాదులుమాయోపాయులు, ధనహీనులు దోషైకదృక్కులునై పాపచరితులగు రాజులు సేవించి జననీ జనక సుత సోదర బంధు దాయా సుహృజ్జనులను బరిత్య జించి సురతా పేక్షులయి కులంబును జెరుపు చుండెదురు. మరియు జామాడంబరంబులం బ్రజాక్షయంబగు. దుష్ప్రతి గ్రహ విహారులై యజ్ఞాది కర్మంబుల ధనార్థపరులంచేయుచు హీనులై చరించెదరు. విక్రమనామ సంవత్సరములో ప్రపం చము అంతయు భీభత్సంబై ధనవంతులు దరిద్రులౌదురు. గుంట మిట్ట సమానంబగును ఇన్నియేల? "బెండ్లు మును గును, గుండ్లు తేలును" ఇట్టి మహోత్పాత కారణంబుచే17 పాళ్ళ జనులు నశింతురు. మద్భక్తులైన వారికే విధంబైన భయంబులేదు.నాచే దెల్పంబడినద్వాదశాక్షరి12000నిష్ఠతో ధ్యానించిన వారికి తప్పక నేను ప్రసన్నుండనై బహురీతిని కాపాడి యిహపర సౌఖ్యం బొసంగెద. ఇదియునుం గాక నొక దృష్టాంతముజెప్పెద వినండి. రక్తాక్షినామ సంవత్సర మార్గ శిర శుద్ధ సప్తమి దినంబున చెన్నపట్టణంలో నొక బ్రాహ్మణుని గృహమందు యేడు సంవత్సరముల వయసు గల బాలిక నొక మగశిశువు జన్మించును. ఆ శిశువునకు నాలుగు హస్తములును మూడు కాళ్ళును శిరంబున కొమ్ము లుండును. ఆ బాలుండిరువది రెండు దినంబులు జీవించి యిరవది మూడవ దినంబున "శ్రీవీరభోగవసంతరాయలుగారు జన్మించును. రాజ్యంబులోనికి ముప్పది రెండు బిరుందంబుల తోను కొల్లాపురిని వెంటబెట్టుకొని దుర్మార్గులను హతము

చేయుటకు వచ్చుచున్నాడనిచెప్పి మరణించును. ఇదే మీకు గురుతు. కర్నూలుకు ఉత్తరమునగల శివాలయంబున వేప చెట్టు పుట్టును. దానికి ప్రార్థివ సం॥ కార్తీక శు॥లు లగాయతు ముప్పదిరెండు దినంబులు మహోత్సవములుజరుగును. ముప్పది మూడవ దినంబున అనేకములగు చెడువాసనలు పుట్టి ఆ వాసనల వలన అచ్చటి జనులకుబొబ్బలుపుట్టి మరణింతురు. ఇట్లే అనేక మహోత్పాతముల వలన నశించేరు. నిశ్చలమైన మనస్సుతో యోచనచేసి చూడండి. ఉండినంత లోనే మీ కేమీ భయం గలగదు. భయము గల్గిన వెనుక బ్రహ్మమును గనలేరు. నిశ్చలమైన మనస్సుతో నిజమును మీలోనే చూడండి. పలుగురాళ్ళు మెత్తని దూదివలెనగును. (పరమార్థము) ఇంకను కలియుగంబున నితరులువచ్చి తనకు సేవ చేయవలెనను తలంపుతోను, అహంకారంబున కొందరు గూణవిద్య లభ్యసించుటచేత పూర్వజ్ఞానంబు గుర్తెరుంగలేక అనేక అధర్మంబులు బయలుదేరి మాయ యను ద్రవ్యంబును గురించి న్యాయమును దెలిసి కొనలేక అన్యాయంబుగ చెడిపోదురు. (కాలజ్ఞానము ఆశ్వాసము) సువర్ణముఖియందు పదకొండు మందిభక్తులు బుట్టుదురు. బంగాళా దేశమందు జనులు జలమందు జీర్ణమైపోయేరు. విప్రులవల్ల ఆచారా లడుగంటును. రాజరాజులు బలహీనులై పొదిగియుండేరు. నా భక్తులైనవారికి యెప్పటి కప్పుడే నిదర్శనం కనబడుచుండును. జితేంద్రియుల నెత్తురు భూమీమీద యే

తీరున బారునో ఆ తీరున భూభారం బడగేను. దుర్మార్గుల నెత్తురుచేత భూమి తడచేను. భూమి అంతారక్తమయ్యేను. సీమలోని చోరులుపోయి గర్భస్త్రీలకు గర్భస్రావాలుతీసేరు. క్షత్రియ కులము నాశనమయ్యేను. ధాతనామ సంవత్సరంబున ధారుణియందు క్షోభంబు జనించును ఇతర దేశీయు లెడతెగని యిడుమలలో నుందురు. బహుప్రళయంబులచేత పొడయ్యేరు. రాజ్యంబులు అరిష్టంబుచే వుండును. ఇంటికి యజమాని లేకుండును. స్త్రీ బాల వృద్ధు అతి కష్టంబుల పాలయ్యేరు. రచ్చకొట్టంబులో రాణాస్త్రీలు రాజరికంబు జేసేరు. సత్యము. ఆనందనాయ వత్సరంబులోగా కారణార్థంబులు కొన్నింటిని చెప్పెద వినుడు మూడు మాసముల బాలుడు మరమతో పెద్దల కెదురుజెప్పును. చిన్నవాంద్ర యూహకు పెద్దవాంద్ర యూహ సరిపడకుండును. మనుష్యుడు నక్క అరపు అరుచును నక్క పంది అరపు అరచును. పంది నాయనా యని యరచును. యెనుము యముని కేకబెట్టును. మింట శబ్దంబు గలుగును. ధూర్జటి వ్యయనామ సంవత్సర ద్విగుణి కాలాంతర విచిత్రమాస సమాన, భాసుర భానువార నిదిక్షిత ప్రకాశ ప్రళయ నక్షత్ర దక్షిణ కాలాన పక్షద్వయానకు ప్రవేశమయ్యేను ముఖమందు పుండ్లు పుట్టేను. అరచేతిలో పుండ్లు పుట్టును పిక్కలు వాచి నడవకుండా నిలిచిపోయేరు. ఇంక అనేకానేకములయిన వ్యాధులవల్లను, గాలివల్లను, పిడుగులవల్లను, అగ్నివర్షము చేతను, విషగాలిచేతను, కొండశిఖరంబులు బ్రద్దలగుటచేతను, విష

జ్వరంబుల వల్లను దుష్టులందరు రాలిపోయేరు. ఇంకను దెల్పవలెనన్న భవిష్యత్తు లనేకంబు లున్నవి గాని పిదప దెల్పెదను. ఇక మీమీ గృహంబుల కేగుడని స్వాములవారు చెప్పగా నచ్చటి కరుదెంచిన వారందరనేక విధంబుల స్వాములవారిని బ్రార్థించి వారివారి గృహంబులకేగిరి. అంత నాగ్రామవాసులనేకులుస్వాములవారిపాదదాసులై యున్నను శ్రీ గోవిందమాంబగారి జనకుండైన శివకోటయాచారిగారు ఈయన కృత్రిమ వేషధారి యనియు, తాంత్రికంబులునేర్చిన మాంత్రికుడనియు దలంచి స్వాములవారి విషయమై తనతో జెప్పవచ్చుచుండిన వారందరితో జెప్పుచుండెను. అంత బ్రజలందరిని శివకోటయ్యగారెంత నిరుత్సాహులుగా జేయు చున్నా నాయన మాటలు వినక స్వాములవారి పాదసేవ జేయుచు వారిచే అనేకంబులైన కాలజ్ఞానాద్వైత విషయంబు లనేకంబులువినుచుండిరి. కానిశివకోటయాచారిగారికిమాత్రం స్వాముల వారనిన విషతుల్యంబుగా నుండెను. అంత స్వాముల వారి ట్లాలోచించుకొనెను. గోవిందమాంబ తల్లి దండ్రులకు స్వప్నంబున గాన్పించి తగు విషయంబులు చెప్పకున్న వారిరువురును కుమార్తెపైనిగల ప్రేమ వదలరని తలంచి యారాత్రి రెండవ జామున శివకోటయ్యగారి స్వప్నం బున నొక సాధురూపంబున గాన్పించి నీ కొమరితను ఆలయ మందున్న నా యవతారమూర్తి కిచ్చి వివాహం బొనరింప వైతివేని నీ కొమరిత ప్రాణత్యాగం బొనరించు కొనుట సత్యమని అదృశ్యుం డాయెను,

* శ్రీ స్వాములవారు గోవిందమాంబ తల్లికి స్వప్నంబున సోదెలసాని రూపంబున వచ్చి సోదె చెప్పిపోవుట •

(అంతర బాహ్యార్థములు)

శ్రీ స్వాములవారు వెంటనే మూడవ జామున నొక యెరుకలసాని రూపంబు ధరింప సాహసించి కదులుచున్న దంతంబులను శిరంబు వణుకుబుట్టుచున్న ముసలియై చినిగిన పాతవస్త్రంబును మొలకుచుట్టి మోచేతుల పర్యంతము మూయ బడియున్న రవికెదొడిగి దంతపు సొమ్ములుపెట్టి గురుగింజ దండలు మెడనిండారుగా వేసి శంకుటుంగరములు వ్రేళ్ళలో నమరించి మాయచే నొకచిన్న బాలునిస్మరించి పైకొంగుతో వీపునజేర్చి కట్టుకొని నవధాన్యములు నిండింపబడిన యొక బుట్టను శిరంబునబెట్టి మైనంబు మెత్తి గవ్వలు గరసించి యున్న కొల్లాపురిని గంపపై పెట్టుకొని ఒక పేముపుల్లను చేబట్టి నడుము నిల్వలేని గూని తనంబున వంగుచు లేచుచు దనలోతానే నవ్వుకొనుచు తన మహాత్వంబును లోకులకు జూపించుచు మయబ్రహ్మయగు నాదివిష్ణువైన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారు యెరుకలసాని రూపంబున నా శివాలయంబు బజారునకు వచ్చుచు 'యెఱుక! యెఱుకో' యని యెలుంగెత్తి పలుకుచున్నంత నప్పుర స్త్రీలందరు దానింజూచి ఓ ముసలి యెరుకలసానీ రమ్ము రమ్మని గద్దెనడుగుచు న్నంత కొందరు స్త్రీలు సోదులసానినింజూచి' యో యెఱుక లమ్మా మా మనంబునంగల కొరతలన్నియు నిజంబుగా జెప్పితివేని కడుపార నే బిడ్డకు నన్నంబు బెట్టి వస్త్రంబు

లిచ్చెదము. నీ యెఱుక చెప్పుము చూతమనగా నాయెరుకల సాని పురస్త్రీలను జూచి అమ్మలారా! వినుండు. నా యెరుక యెట్టిదంటిరేని పృథ్వివ్యాపస్తేజో వాయు రాకాశంబు లనం దగు పంచమహాభూతంబులను బుట్టించి బ్రహ్మాండ భాండం బుల నెల్లనిండి నిజకుండలినంటి సర్వభూతసముదాయముల యొక్క జాగరత్స్వప్న సుషుప్తులకు గారణసాక్షియై యా పరంజ్యోతితో గలసి తనంతట తా నెల్గుచు నానందించు చుండునట్టి నా యెరుకే సకల ప్రపంచంబుల బుట్టించుచు మహావిజ్ఞానులకు నానందకరంబై సకలంబునకు నాధారంబై మంగళకరంబై యొప్పుచున్నది. నా యెరుక నన్నెరింగిన వారికిగాక యన్యులకు దెలియరాదు. కాన మీతో నాయెరుక చెప్పగూడదనిన నా మూఢ స్త్రీలా యర్థంబు దెలియంజాలక దాని పల్కుల కాశ్చర్యంబునొంది పరుగున గోవిందమాంబ తల్లియొద్దకు బోయి అమ్మా! మన పురంబున కెవ్వతో యొక్క సోదెలసాని వచ్చియున్నది. దానిని బిలువనంపి మన గోవిందమ్మకు భర్తయెవ్వరో యడిగి తెలిసికొందమన నామె యట్లేయని వెంటనే యా యెరుకలసాని యొద్దకేగి నిన్ను మా బంధువులు రమ్మనుచున్నారలు రమ్మనగా. నా మాయ సోదెలసాని వారింగాంచి అమ్మలారా! సోదెలుచెప్పి నా బిడ్డకు నాకు నన్నంపెట్టించు కొందమనుకొంటిని.నాబిడ్డ డాకలికి సోలి యేడ్చుచుండెనని బిడ్డను హస్తంబులు బట్టి లాలించి యేడ్వకు యేడ్వకు మని బుజ్జగించుచున్న యెరు

కల సానింజూచి యా స్త్రీ లిట్లనిరి. ఓ యెరుకలసానీ ! వినుము. నీ బిడ్డకు నీకును నన్నంబు బెట్టింతుము. ఇందులకై చింతింపక మా వెంటరమ్మనిన మూల్గి నవ్వి యిట్లనియె. ఓ యమ్మలారా ! మీరు ధనవంతులవలె గాన్పించు చున్నారలు. మీవంటి వారలు నా బోసి నోరును, దెల్లని వెంట్రుకలను, దొప్ప చెవులును, పెద్దదగు కడుపును, గూని వంగియున్న నడుమును, దంతపుసొమ్ములును, బండి గురిగింజదండలును, శంకుటుంగరంబు గని నవ్వి హాస్యంబు గావింతురు గనుక తమవంటి వారి ఇంటికడకు రాసిగ్గగుచున్నది. ఏదియో నా వంటి పేదవారికి యెరుక చెప్పుకొని జీవించుచున్నదానను. మీరలు పొండని చెప్పగా నా స్త్రీ లిట్లనిరి. నీవేల సిగ్గుపడె దవు? మా వారి యుల్లంబుననున్న కోర్కెనిజంబుగాచెప్పితి వేని నీకు ఎక్కువగా కట్నంబు లిప్పించెదము. మా మాట నమ్ముమని ఎరుకలసానిని సమ్మతిపరచి తమ వెంటబెట్టుకొని గోవిందమ్మగారి ఇంటికా ఎరుకలసాని దోడ్కొనిపోయిరి. అంత గోవిందమ్మగారితల్లివచ్చి యాఎరుకలసానిని మర్యాద చేసికూర్చుండబెట్టిన నాఎరుకలసాని చిరునగవుతో అమ్మా! నీవు మహాభాగ్య సంపన్నురాలవు. నేన కడు బీదదానను. నాకును నా బిడ్డకును ముందు అన్నంబు బెట్టి తృప్తిపరచి యావల సోదె యడుగుమనగా నామె వెంటనే భోజనంబును బెట్టగా నా మాయ యెరుకులసానియు దాని బిడ్డడును భోజ నముచేసి లేవగా వెంటనే యామె తాంబూలము లొసంగగా నా మాయ యెరుకలమ్మ ఆ యాకులను నములుచుండగా

గోవిందమ్మగారి తల్లి యిట్లనియె. 'ఓ యెరుకలసానీ ' మీ దేశం బెయ్యది ? ఆ దేశంబు నుండి మీ రెందరరుదెం ? మీరందరును ఎచ్చటో నున్నవారలు? అదియునుంగాక మా యూరు మీ రెందులకై వచ్చితిరి? నీ విభుండెవ్వాడు '' నీ కెందరు సంతానంబు ? నీ మగడు నీ మది ప్రేమచే నున్న వాడుగాదా ? నీపేరెయ్యది ? తెలియబల్కు' మన్ననామ మ యెరుకలసాని నవ్వుచు నామెతో నిట్లులనియెను. 'అమ్మా ! మా వంటి సోదులు చెప్పువారికొక్క దేశంబనిగాని యొ క చోటనిగాని స్థిరంబుగా నుండునే ? మే మా యా దేశంబుల కరుదెంచి అచ్చటచ్చట గుడిసెలు గావించుకొని యా చుట్టు పట్ల నున్న గ్రామంబులన్నియుందిరిగి వారివారికి గద్దెలు చెప్పి యేగుచుందుము. మీ యూరి ప్రాంతమునకు నేనొక్కదాననే యరుదెంచి సోదులు చెప్పుచున్న నన్ను మీవారు తోడ్కొని వచ్చిరి. ఇదియునుంగాక నా విభుండెవ్వడు ? పేరేమి యని యడిగితివి. చెప్పెద చక్కగా వినుము. నా విభుండు గుణ శూన్యుండు. ఎందులకును ఒనికిరాని నిర్వాణుండు,వాని గురు గుణరహితుండని చెప్పుదురు. అట్టివానికి నా కర్మవశంబున నే బట్టుపడి నా బలాత్కారంబున వాని నాపైని వేసి ని ముగ్గురు మొగబిడ్డలు, ఆర్గురు యాడుబిడ్డలం గంటిని. నా పేరు బహురూపవతి యని పెద్దలు వాడుదురు. మా వె సత మెప్పటికిని నుండుచోటు చెప్పెద వినుము. ఏడు సము ద్రంబుల కావల ముప్పది రెండు మెట్లచే నొప్పి పదియ గు ఘూలలం గలిగి రెండు రెక్కల చేత పైకెగ బ్రాకుచుం 

కొండమీద, నారు కొండలు గలిగియుండును. దానిపై నొక కొండ వేయి శిఖరంబులచే నొప్పి చూడ రమణీయంబై మూడు నదులచే విలసిల్లి నాలుగు త్రోవలమరి, దాని మధ్య స్థానంబున వెలుగుచుండు. అందు మావారును నేనుంగూడి వసియించి యుందుము. జీవన నిమిత్తంబై యెల్ల యెడల వ్యాపించి యెరుక చెప్పి జీవించుచుంటిమి. అది యట్లుండ నిమ్మ. నీకుంగల కొరత లడుగ నిశ్చయించితివేని మూడు సోలల మంచి బియ్యమును దెప్పించు'మనగా నామె వెంటనే బియ్యమును దెచ్చి చేటలో బోయగా నా మాయ యెరుకల సాని సంతోషించి యా బియ్యమును మూడుకుప్పలుగా బోసి నడికుప్పయందు లక్ష్యముంచి, మూడుమార్లు మ్రొక్కి కృష్ణ, కావేరీ, తుంగభద్రాది పుణ్య నదీ తీర్థంబులను, బదిరి కాశ్రమ, కంచి, శ్రీరంగము, కుంభకోణం, కాశీ, రామే శ్వరం, గయా ప్రయాగాది పావనస్థలంబులను, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాది దేవతలను, పరాశక్తి, యిచ్ఛాశక్తి, కాళీ, మహాకాళికాది యాదిశక్తులను దలంచి మ్రొక్కి గోవిం దమ్మగారి తల్లితో నిట్లులనియెను— 'ఓ యమ్మా! నేను ప్రార్థింపగనే సకల దేవసమూహంబులును వచ్చి ఈ బుట్ట యందున్న వారలుగావున దక్షిణ తాంబూలములు సమర్పించి నీ కోర్కెల నడుగు' మనిన నాయమ్మ యవ్విధంబునచే దక్షిణ తాంబూలము లొసంగి యిట్లులనియెను. ఓ సోదెల సానీ! నా మనంబునంగల కొరత నిజంబుగా జెప్పితివేని నీవు కోరిన కట్నంబు నిచ్చెద'నని చెప్పగా నా మాయ యెరుకటసాని నవ్వుచు తనయెదుట కూర్చుండ బెట్టుకొని

తన చేతనున్న బెత్తంబు కొన వలన నామె చేయిజూపించి చూచి విఘ్నేశా! వీరభద్రా! కంచి వరదరాజా! కాళహస్తి శరభ లింగమా! కాశీవిశ్వనాథా! కావేటిరంగా! మళయాళ భగవతీ! మధుర మీనాక్షి! కంచికామాక్షి! కనకదుర్గాంబా కొల్హాపురిలక్ష్మి! పార్వతీ! భారతీ! సావిత్రీ! గాయత్రి మీరలందరును జనుదెంచి నా వాక్కున నిల్చి వాగ్వైభవం బొనరింపరే'యని ప్రార్థించి గోవిందమ్మగారి తల్లితో నిట్లు లనియె. 'ఓయవ్వా! ఇటు నటు జూడక నొక ప సుతోడ నాదిక్కే చూచుచుండుము. నీ దేవర తోడుగా నాదిక్కు నీ దిక్కు చూడమని మది దిట్టపరచి మరియు నా సోదెలసాని యిట్టులనియె. అవ్వా! నీ మనంబున తలంచిన తలంపు మేలుగాకయనియిచ్చోటు కరుదెంచిన దేవతలు బలుకుచున్నా వారలు. నీ మనంబునం గల కోరిక యేమంటివేని వివరింతు వినవేదుండీ! శిశువంటే బొజ్జ జూపుదు. సోదరులంటే భుజంబు జూపుదు. ఇట్లా సోదరుల కడగలె దిట్లా శిశువునకై యడిగితివేయవ్వా! ఆ శిశువు యాడశిశువో మగశిశువోయని దలంచుచున్నావు వినవేయమ్మా! ఆడశిశువైన చెవిజూపుదు మగశిశువైన గడ్డంజూపుదు. ఇట్లా మగశిశువు గాదేయవ్వా! అట్లా యాడశిశువు నిమిత్తమైదలంచితివేదుండీ! యా తలంపు పూర్తిగా చెప్పెను వినవేయమ్మా! అదియేమంటివేనిఆవ్వో! యవ్వ! నీ కుమార్తెకొక్క చింత బొడమియున్న దాచింత యెట్టిద[illegible] అవ్వో, అవ్వ! నిక్కంబుగా జెప్పెదనే మా యమ్మా! నిన్న రోజు సాయంసమయంబున నీ బిడ్డ వాకిట

గూర్చునియుండగా నామెకు నెదురుగా నొక్క పురుషుండు గూర్చుండెను గాదే యవ్వా ! వానిం జూచినప్పటినుండియు నిద్రాహారంబులు మానియుండెను గాదే యమ్మా ! ఆ పురుషుండెట్లుగా ఏ రూపంబుగా నున్నాడోయని యడుగవే మా యమ్మా! ఆతండు మానవుండుగాదేదుండీ! ఆ భగవానుడే సన్యాసిరూపముగా వచ్చెనుగాదే తల్లీ! అట్లే చనుదెంచిన వాడు యిప్పుడెచ్చట నున్నాడో ? వాని దేశమేమో యని యడుగవే మాయమ్మ ! అదో మూలంటే యెరుగవే మా తల్లీ! అల్లదే ఈశాన్య మూలయందున్న నొక గ్రామంబున మహా మహిమాస్పదుండై యున్నాడుగాదేదుండీ! అతండు జూచుటకు సన్యాసిరూపంబున నుండునేతల్లీ ! వాడు శ్రీమదఖిలాంతకోటి బ్రహ్మాండ నాయకుండేనేదుండీ! వాడు మానవుండు గాదే యవ్వా ! వాడు నీ పుత్రికను వరించి యున్నవాడు. నీ పుత్రిక యాతనిని వరించియున్నదిగాదేదుండమ్మా కావున నీ చిట్టిని నాతని కిచ్చిన సుఖించునుగాదేతల్లీ!అటుల నివ్వకుండిన నీబిడ్డ ప్రాణత్యాగంబునకు బూనుట సత్యము నిక్కమని దేవుళ్ళు జెప్పుతున్నారుగాదె మాయమ్మా!' యని మాయయెరుకలసాని చెప్పగా నామె యిట్లనియెను. 'ఓసోదెలమ్మా! నీవు జెప్పేది మాటలను జూడ బరమాశ్చర్యముగా నున్నవి. అది యేమంటివేని, మానవమానినులను భగవత్స్వరూపుండు పెండ్లి యాడునని లోకంబులో లేని మాటగాక సత్యంబగునా' యనిన దా యెరుకలసాని యిట్లులనియెను. 'ఓయవ్వా! నా మాటఅబద్ధంబంటివేని యా సద్న్యాసి రూపుం

డైన సర్వేశ్వరుని నీ మగండె పిలుచుకవచ్చి నీ బిడ్డనిచ్చి వివాహంబు జేసునేకొమ్మా! నేను జెప్పినట్లే జరిగిననాకు బహుమానం బిమ్ము. లేకున్న నేమియు నియ్యవద్దే దుండమ్మా! నీబిడ్డ పెండ్లికి నేనేవస్తాను లేపే మాయమ్మా' ఇదియునుంగాక నే జెప్పిన వన్నియుసత్యమో యసత్యమో నీ బిడ్డనే యడుగవే మాయమ్మా! నేను పొట్టకూటికై యసత్యంబాడితినని దలంచుట తప్పుగాదు. తమకుగాదు, ముసుకుగాదు, ఆటోటుగాదు, కైలాసముగాదు నాపలుకులు. నాగద్దె బుట్టతోడు, నా చంకబిడ్డనితోడు, నా దేవరతోడు, నాతోడు నిజంబని నమ్మ'మనిన గోవిందమాంబతల్లి యిట్లు లనియె. 'ఓ యెరుకలసానీ! నా బిడ్డను నీ విషయంబుల న్నియు నడిగెదను. నీవు చెప్పినట్లే చెప్పిన కట్నంబు నీ కిచ్చెదను. వారము రోజులలో రమ్మని' చెప్పగా నంత మాయ యెరుకలసాని సరే మీ యిష్టము. దయయుంచుమని బుట్టను నెత్తిన బెట్టుకొని, బిడ్డను చంకన ఎత్తుకొని, బైటకు వచ్చి అదృశ్యంబై పోయినటుల నామెకు స్వప్నంబాయెను.

గోవిందమ్మగారు తన తల్లికి సన్యాసి రూపంబున వచ్చిన శ్రీ స్వాముల వారు భగవత్స్వరూపుండని చెప్పి తల్లిదండ్రులను యిష్టపరచుట.

శ్రీ స్వాములవారు యెరుకలసాని రూపంబున వచ్చి సోదెచెప్పి యేగినపిమ్మట తల్లిదండ్రులు గోవిందమ్మకడకు నరుదెంచి, శయ్యపై పరుండి దుఃఖించుచున్న బిడ్డవద్దకు నేగి కూర్చుండి, అమ్మా! గోవిందమ్మా! మాకు లేక లేక మా యీశ్వరీదేవి కృపాకటాక్షంబున కల్గిన నీవు ఇట్లేల

దుఃఖంబుచేనున్న దానవు? నీవు దుఃఖించుచున్న మేము చూడగలమా ! నీకుంగల చింత యిది యని వచింపుము. అక్కార్యంబునే మేము చేతుము. నిన్న మాతో వాదించినది మొదలు నిద్రాహారంబులను మాని కంటనీరుపెట్టుచు దుఃఖించుచుంటివే! తల్లి! యని వారిరువురును ఇరుప్రక్కల గూర్చుండి బుజ్జగించుచుండగా, గోవిందమ్మగా రిట్లనియెను. తల్లిదండ్రులారా, నాకేమి చింతగలదు? నా కొక్కటే చింత దక్క మరి యొండుచింత లేదు. నిన్న సాయంత్రమున యింటి యెదుటనున్న మా యిసుక దిన్నెపై గూర్చుండి నన్ను చూచి చూచి యేగిన సన్యాసి రూపుండైన యాసర్వేశ్వరుండే నాకు భర్తయగునో కాదో యను చింత దక్క మరి యొండు లేదని చెప్పగా, నామె తల్లిదండ్రులు అమ్మా! నీ వలన మేము లోకంబున నపవాదు ననుభవింప వలెనను సంశయంబు బాధించుచున్నది. ఆ సన్యాసి వానిని దక్క మరియెవరినైనను గోరుము. వెంటనే వివాహము జేసెద మనగా, నంత గోవిందమాంబ ఓ జననీ జనకులారా! నా వలన మీ కేమియు నపఖ్యాతి జనింపదు. నిన్నటి దినంబున నాకు సాక్షాత్కరించిన పురుషుండు మానవుండుగాడు, ఆ మహనీయుండు మయ బ్రహ్మయగు శ్రీ వైకుంఠవాసుడైన శ్రీమన్నారాయణుండు, పరంధాముడు, పురుషోత్తముండు, ముకుందుడు, స్వయం ప్రకాశుండు, శాశ్వతుండు, సంపూర్ణుండు, త్రిభువనరక్షకుండని తలంచుడు. ఇదియునుంగాక మన గ్రామములో చనిపోయిన రెడ్డిని బ్రతికించె. తిరిగి తుంటరులు చేసిన దానికి వారు ప్రతిఫల మనుభవించిరి. ఇవ్విష

యంబు మన కన్నుల యెదుట జరిగినదేకదా! తల్లిదండ్రు లారా! ఏ యుగంబునైన చచ్చిన వానిని బ్రతికించుటయు, బ్రతికిన వానిని చచ్చునట్లు చేయుటయు. తిరిగి వానిని బ్రతి కించూటయు వినియుంటిరా? లేక మీరు కనియుంటిరా? తానీ మహత్తులు చూపించుటెందుల కనిన తానట్టి వాడనని మీర తెఱింగి నన్నా మహనీయుని కొసంగెదరని యిట్లొనర్చిరి. మున్ను దశావతారంబులం దాల్చిన జగదేకవీరుండు, మయ బ్రహ్మయగు నమ్మహావిష్ణువే కలియుకంబున మానవ రూపం బున నిప్పటి కిట్టు సన్యాసి వేషధారియై, యిక్కలికాల మూఢులకుండు అజ్ఞానంబునుంబాపి సుజ్ఞానులుగాజేయుటకై అవతరించిన యవతారుండుగాని మానవుండుగాడు,నామాట లాలింపుడు, నాకై మీర లనేక వ్రతంబులుచేసి, తుదకు ఆ ఈశ్వరీదేవి కరుణచే నన్ను బడసినందులకుగాను నన్నా సన్యాసిరూపుండైన సర్వేశ్వరున కిచ్చి వివాహంబుచేయుడని తల్లిదండ్రుల గడ్డంబులను బట్టుకొని దుఃఖించుచుబ్రతిమాలు చున్న బిడ్డయొక్క దుఃఖంబును తల్లి జూడజాలక భర్తయైన శివకోటయ్యగారితో నిట్లనియె ;— నాథా! మన బిడ్డ చెప్పిన వన్నియు నిక్కంబులే. ఎట్లంటివేని నిన్నరాత్రి నా స్వప్నం బున నొక యెరుకలసాని మనబిడ్డెన్ని చెప్పెనో యన్ని విష యంబులనుగాక నింకొక విశేషంబునుం జెప్పినది. అదియెద్ది యనిన నా సన్యాసరూపునకే మనఅమ్మాయినియివ్వకు అమ్మాయి తుదకు ప్రాణత్యాగంబునైనను జేసికొనునని యాయనకే యిచ్చిన ముందు మహాజగద్విఖ్యాతి మనబి

గలుగు ననియు గూడ జెప్పినది గాన, వెంటనే నీవేగి మన గ్రామంబున సన్యాసిరూపుండైన యాయనను మన యింటికి నీ పూట భోజనంబునకై పిల్వుడు. పిదపజరిగెడివిషయంబుల నాలోచింతమని భార్య చెప్పగానే యంత శివకోటయ్యగారు సరే! నీ కిష్టమైన నాకు నిష్టమే యని వెంటనే బయలుదేరి యా శివాలయము కడకు బోయి యట నిష్ఠాగరిష్ఠుండై కూర్చుండియున్న స్వాములవారి వద్దకుపోయి యాయన నిష్ఠయందుండుటచే పలుకరించుటకు వీలులేక స్వాములవారి ప్రక్కన గూర్చుండెను. అంత స్వాములవారు నిష్ఠనుండి లేచిన పిమ్మట శివకోటయ్యగారు స్వామీ! తమరిదేకులంబు ? తమ నామధేయం బెయ్యది ? తమ నివాస గ్రామముఏదియో సెలవొసంగెదరా ? యని యడుగగా నంత స్వాములవారు అయ్యా! మేము దేవబ్రాహ్మణులమైన విశ్వబ్రాహ్మణు లము. నాపేరు వీరప్రహ్మంబందురు. నా నివాస గ్రామము కనిమల్లాయపల్లె. నేను సంచారము చేయుచునిట్లు వచ్చితి ననిన శివకోటయ్యగా రిట్లనిరి. అయ్యా! మేమును విశ్వ బ్రాహ్మణులము. మా యింట నీ రోజున తమరు నా సహ పంక్తి గూర్చుండి భోజనము చేయుట కిచ్చగింతురా? అనిన నంత స్వాములవారు తమ సహపంక్తిని భోజనము చేయు టకు నాకే సందియంబు లేదుగాని నావద్ద నీ రోజునకు సరి పోవునంత రాగి సంకటిముద్ద యున్నది. ముద్దలనే తమ సహపంక్తిలో బెట్టుకొని భోజనము చేసెదననగా శివకోటయ్య గారును ప్రత్యుత్తరము చెప్పుటకు నోరాడక, కొంచె

మాలోచించి, "స్వామీ! తమ యిష్టానుసారంబుగా అట్లే భోజనముచేసెదరుగాన మాయింటికి దయచేయు'డనిచెప్పగా నంత స్వాములవారును శివకోటయ్యగారు నిరువురును కలిసి గోవిందమ్మగారి యింటికి వచ్చిరి.

—ం స్వాములవారి వద్దనున్న "రాగిపంకటి ముద్దను" పంచభక్ష్య పరమన్నముగా మార్చి శివకోటయ్యగారికి తన మహత్తును జూపుట– గోవిందమ్మగారిని స్వాములవారి కొసంగి వివాహంబు చేయుట ం—

శ్రీ స్వాములవారితో శివకోటయ్యగారు కొన్ని విషయంబులను మాట్లాడగా, తన కెవ్వరును లేని ఒంటివాడనని యును, నందికొండ పాపఘ్ని మఠాధ్యక్షులైన యనమదల వీరభోజయాచార్యులకును ఆయనధర్మపత్ని వీరపాపమాంబకును దత్తపుత్రుండననియును, కందిమల్లయపల్లె తననివాస గ్రామ మనియును తెలిసికొని, ముందెట్లుండినను భోజనము నకు లెండని స్వాములవారి నడుగగా నంత స్వాములవారు నావద్ద నన్నమున్నదని యిదివరకే చెప్పితినిగదా! మీరు భోంచేయుడని చెప్పగా, నంత శివకోటయ్యగారు 'నాయనా! మీ యిచ్ఛవచ్చినట్లే కానిండు. స్నానంబుచేయుడు. సహపంక్తికి దయచేయుడని వేడగా బ్రహ్మంగారు లేచి స్నానసంధ్యాద్యనుష్ఠానంబు లాచరించి శివకోటయ్యగారి సహపంక్తిని కూర్చుండిరి. అంతగోవిందమ్మ తల్లిగారు ముందు శివకోటయ్యగారికి వడ్డించి, బ్రహ్మంగారికి వడ్డనచేయరాగా, నంత బ్రహ్మంగారు 'అమ్మా! నేను తెచ్చుకొనిన సంకటి

ముద్దనే పడ్డించు'మని ఖండితముగా జెప్పగా అంత నామె మనంబునకు కష్టంబుగా నుండినను స్వాములవారు దెచ్చిన "రాగిసంకటి మూటను" తెచ్చి విప్పసరికి సమిత సుగంధ పరిమళ సహితంబైన పంచభక్ష్యపరమాన్నంబులై యప్పుడు వండిన యన్నంబుకన్నను మిక్కుటంబైన వేడిగా నుండుట జూచి భార్యాభర్తలిరువురును వెరగంది, 'స్వామీ! తమను నేమియు యెరుంగని పిచ్చివాడని తలంచితిమిగాని సర్వ పరిపూర్ణులై ప్రకాశించుచున్న సర్వేశ్వరుండవని యెరుంగక, మా బిడ్డ మా కెన్ని నీతులను తెల్పినను నిర్లక్ష్యంబుగా జూచి మిమ్ములను దూలనాడితిమి. మీ మనంబున కోపంబూనికుం'డని భార్యాభర్త లిరువురు వేడుకొని "స్వామీ! తమ అమృత హస్తంబుచే పరమపావనంబైన యీ ప్రసాదము దయచేయు'డని వేడగా నంత స్వాములవారు అట్లే యని యిరువురకును ప్రసాదం బివ్వవారలు నేత్రంబుల కద్దుకొని పుచ్చుకొనిరి. అంత గోవిందమ్మగారిని స్వాములవారి వద్దకు తీసుకొనివచ్చి 'తల్లీ! యీమహనీయునకు నమస్కారముజేసి తీర్థప్రసాదంబును గైకొను'మని చెప్పగా గోవిందమ్మగారు సిగ్గుతో శిరంబును వంచి నమస్కారంబును జేయగా నంత స్వాములవారు 'శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు, సుపుత్ర పుత్రికా ప్రాప్తిరస్తు' యని దీవించి తీర్థప్రసాదంబుల నివ్వగా గోవిందమ్మగారు కన్నుల కద్దుకొని పుచ్చుకొని సిగ్గుతో తలవంచుకొని చిరునగవుతో నిలువంబడియుండగా, నంత స్వాములవారు 'దేవీ! నీవును ప్రపంచ

స్త్రీలవలె సిగ్గుతో నుండ దగునా ? నీవు కేవల ఈశ్వరాంశ సంభూతురాల వయ్యును నిట్లుండదగునా?'యని యందరును భోజనంబును జేసిరి. ఆ రాత్రి శివకోటయ్యగారికి కొన్ని దేవరహస్యంబులను దెల్పి తన భక్తులనుగా జేసికొనియెను. పిమ్మట శివకోటయ్యగారు శుభలగ్నంబును విచారించి, శ్రీ స్వాములవారికి గోవిందమ్మగారినిచ్చి కన్యాదానంబును జేసెను. అంత శివకోటయ్యగారు కుమార్తెను తన తొడపై గూర్చుండబెట్టుకొని 'తల్లీ! నీవలన లోకరక్షకుండైన యీ మహాపూజ్యుండు నాకల్లుండయ్యెను. అందునంజేసి నావంశ మంతయు పావనంబయ్యె'నని యామెను నెక్కుడుగా గౌర వించెను. పిమ్మట కొన్ని దినంబు లత్తవారింటి యందే భార్యాభర్త లిరువురును నుండి పిమ్మట నత్తమామల యాజ్ఞనుగైకొని యటనుండిబయలుదేరి కందిమల్లయ్యపల్లెకు చేరిరి. అంత భక్తాదులును వారును సుఖులై యుండిరి.

– శ్రీ స్వాములవారును గోవిందమ్మగారును మహాక్షేత్రంబుల దర్శింపబోవుట–

శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాములవారు శిష్యజన సమేతం ఖుగా కందిమల్లయ్య పల్లెయందుండి, యచ్చట కరుదెంచెడి భక్తాదులమనోసంశయంబులను దీర్చుచుండెను. ఇట్లుకొన్ని దినంబులు జరిగిన పిమ్మట తన భార్యయైన గోవిందమ్మను జూచి'కాంతా! నేను మహాక్షేత్రంబులకేగి యందుండుమూర్తు లను దర్శించినగాని నామనంబున స్వస్థతజెంద'దనిచెప్పగా

గోవిందమ్మగారు సంతోషస్వాంతయై 'నాథా! అట్లయిననేమను వచ్చెద ఇకముందుసంతానము గల్గిన నేనెక్కడి కరువెంచు టకును వీలుండదు. నాయందు పరిపూర్ణ కృపాకటాక్షముంచి నన్నును నీ వెంట దోడ్కొనిపొమ్మని వినయవిధేయతలతో వేడుకొనగా, నంత స్వాములవారు 'ప్రేయసీ! నా బహిః ప్రాణంబువైన నిన్నువిడనాడి యొంటరిగానేగువాడనుగాను కాన ఈ శుద్ధ పంచమి గురువారం ఉదయమే బయలుదేరు టకు ముహూర్తంబు బాగుగానున్నది. కావున నీవు ప్రయా ణమునకును తగు వస్తుసామాగ్రిని తయారుచేసుకొనుమని' చెప్పి తానును ప్రయాణ ప్రయత్నంబులుజేసి, భార్యాభర్త లిరువురును బయలుదేరి మహారణ్యంబులు చూచుచు, అందుండు ఋషిశ్రేష్ఠులను దర్శించుచు, అచ్చటచ్చటం గల యాశ్రమంబుల యందుండుచు నా యాశ్రమ వాసులైన మౌనీంద్రులతో సంభాషించుచు, నచ్చటచ్చటగల మహా పర్వతంబు లెక్కుచు, దిగుచు మేదియో యొక ఋష్యాశ్ర మంబున విశ్రాంతికై కొంతతడవాగుచు. కాశీగయప్రయాగ సింహాచలం బాదిగా గల వుత్తర యాత్రలు చేసి తిరిగి కాళ హస్తి, కంచి,కుంభకోణము, రామేశ్వరము మొదలుగాగల దక్షిణ యాత్రలన్నియు సేవించుకొని యటనుండి బయలు దేరి చిదంబరం, చియాళి, శ్రీరంగము, తిరుపతి మొదలైన మహాక్షేత్రంబులను జూచుకొని, బయలుదేరి గుంతకల్లుచేరి యటనుండి హంపి, విరూపాక్షుని సేవించుకొని, యటనుండి

బయలుదేరి పండరి చేరి యచ్చటనున్న పండరినాథుని సేవించుకొని, ఎట్టకేలకు శ్రీశైలంబు చేరిరి. అచ్చటనున్న పాతాళగంగయందు స్నానం బాచరించి యటనుండి లింగాల ఘట్టున కేగి యట స్నానం బాచరించి యటనుండి కొంత జలంబును తీసికొని శ్రీమల్లికార్జునస్వామికి నభిషేకంబుచేసి యా స్వామికి నమస్కరించి, యచట కొంత విశ్రాంతికై యా శైలగుహాలలో భార్యాభర్త లిరువురును దూరుచు, అచ్చటనున్న ఋషిపుంగవులతో గలసి మాట్లాడుచు, కొంత కాలం బా శ్రీశైలమందుననే వసియించి పిమ్మట కొంత కాలంబునకు నటనుండి బయలుదేరి బనగానపల్లెచేంయచ్చట నున్న తోమఠంబును, భక్తాదులను నవాబునుచూచియట నుండి బైలుదేరి ఓంకారక్షేత్రంబుచేరి యచట ఓంకారేశ్వరుని సేవించుకొని తిరిగి మహానంది చేరియట కొలనుయందు స్నానం బాచరించి మహానందీశ్వరుని సేవించుకొని యట నుండి బయలుదేరి అహోబిలంబుచేరి యటనున్న సప్తప్రాకారంబుల మధ్యభాగంబున నున్న శ్రీ నృసింహమూర్తిని సేవించుకొని, గిద్దలూరుచేరి యటనున్న పాతాళ నాగేశ్వర స్వామిని దర్శించుకొని, యట్లే కందిమల్లయపల్లెకు కొంత కాలంబునకు జేరిరి. ఇట్లుండ కొందరు భక్తులు ఈ మహనీయునకు నొక మఠంబును కట్టించిన బాగుండునని తలంచి భక్తులందరా వీరబ్రహ్మేంద్రస్వాములవారికి ఒక మఠంబును కట్టించి వారిని ఆ మఠంబున నుంచిరి.

— శ్రీ స్వాములవారికి పుత్ర పుత్రికా సంతానంబు గలుగుట, వారికి వివాహంబు చేయుట —

శ్రీ స్వాములవారు మఠంబున నుండి, వచ్చుచుండెడి భక్తాదుల మనోభీష్టంబులను దీర్చుచువారల నతిగౌరవంబుగా జూచుచు భక్తుల పాలిటి పెన్నిధానమో యనునట్లా వీర బ్రహ్మేంద్రస్వామి జగద్విఖ్యాతిని గాంచి రజితగిరిని బోలు నా మఠంబునందు కేవల పరమశివమూర్తియా యనునట్లు స్వాములవా రుండిరి. పిమ్మట కొంత కాలంబునకు గోవింద మాంబకు గర్భచిహ్నములేర్పడి సిద్ధలింగయ్య యను నొక సుపుత్రుండు గల్గెను అటులనే గోవిందయ్య, శివరామయ్య, పోతులూరయ్య, ఓంకారయ్య అను పుత్ర పంచకంబును, శ్రీ వీరనారాయణమ్మయను పుత్రికారత్నంబుగల్గిరి. పిమ్మట జ్యేష్ఠకుమారుండైనసిద్ధలింగయ్యను గోవిందమ్మగారి తండ్రి యైన శివకోటయ్యగారికి పెంపుడిచ్చి తక్కిన వారికి వివాహా దులను జేయనిశ్చయించి, "కొలమలపేట"లో గిరెమ్మయను నామెను ద్వితీయ పుత్రుడగు గోవిందాచార్యుల గారికి, "యత్నల్యమఠం"బను గ్రామంబున పాపమ్మయను నామెను తృతీయ పుత్రుండైన శివరామయ్య గారికిని, కొలమలపేట యందే పార్వతమ్మయను నామెను శ్రీ పోతులూరయా చార్యులవారికిని, మరియొకచోట నొక యువతీ లలామను ఓంకార స్వాములవారికిని మాట్లాడి శుభ ముహూర్తములు నిశ్చయించుకొని, వివాహాదులను జేసిరి. పిమ్మట పడమర దేశ వాస్తవ్యుడైన సకల విద్యా పారంగతుడైన యొకవిశ్వ

బ్రాహ్మణుని కుమారునికి శ్రీ వీరనారాయణమ్మను యిచ్చి పరిణయంబుచేసిరి. అచ్చట కరుదెంచు వేలకొలది జనులలో యెందరో స్వాములవారి శిష్యులై వారివలన బ్రహ్మోపదేశ మును బొందుచుండిరి. మరియు శ్రీ స్వాములవారిని దర్శిం చుటకు వచ్చినవా రందరును కేవలము పరమశివావతారుండని యును, హరిహర రూపంబున అవతరించిన అపరావతారుం డనియును నమ్మి సదా సేవించుచుండిరి.

— సిద్దయ్యగారి జననము, శ్రీ సిద్దయ్యగారు బ్రహ్మంగారి వద్దకు వచ్చుట, మఠంబునందు తపంబాచరించుచున్న స్వాములవారు భక్తులను వర్ణించుట —

కందిమల్లయపల్లెకు ఎనిమిదిమైళ్ళ దూరంబునం గల "ముడుమాల"యను గ్రామంబున దూదేకుల వంశీయులైన పీరుసాహెబు, భార్య ఆదంబి యను దంపతులకుపుత్రసంతా నంబులేమిచే యనేకఉపవాసంబులును,మహమ్మదీయాచారం బున భగవంతుని పేర జండాలను యెత్తించుచూ మిఠాయిలను భగవంతుని చదివించుచు సకల సద్గుణ సంపన్నుడైన యొక సుపుత్రుని దయచేయమని సర్వదా సర్వేశ్వరునిసర్వ కాల సర్వావస్థల యందును ప్రార్థించుచు, నా గ్రామంబున కరుదెంచెడు వలీలుపైగంబరులు పకీరులు మొదలగు వారం దరికి నతిభక్తితో క్షీర శర్కరాదు లొసంగుచు వారిచే దీవన లందుచు నుండిరి. ఇట్లుండ పరమేశ్వరానుగ్రహంబున నొక సుపుత్రుండుగల్గెను. ఆయనకు"సిద్దయ్య"యను నామకరణం బును జేసిరి. ఈయన పుట్టినప్పటినుండియు తల్లిదండ్రుల సంతోషంబునకు మేరలేకుండెను.

శ్రీ సిద్ధయ్యగారు దినదిన ప్రవర్ధమాన రాకా శశాంకుని భంగి పెరుగుచుండెను. ఆ మహాభాగేయుని ఏడవవత్సరంబున పాఠశాలకు బంపిరి. ఆ పాఠశాలయందుండునందఱి బాలురకన్నను శాంతశమదమాది గుణంబులు గల్గి సర్వదా సర్వేశ్వరధ్యానియై అందరి బాలురకన్నను విద్యయందధిక జ్ఞానుండై యుండి తల్లిదండ్రాదులకు జీవహింస, అసత్యము. చోరత్వము, పరస్త్రీ గమనము, ఇరుగు, పొరుగు వారిని ప్రేమించకుండుట, గోమాంసభక్షణ మాదిగాగల దుష్కార్యంబులు చేయకూడదని బోధించుచుండెను అంత సిద్ధయ్యగారిపల్కులకు తల్లిదండ్రులేగాక చూచెడి వారందరాయనను గౌరవించుచుండిరి అప్పటికి సిద్ధయ్యగారు పదిరెండు వత్సరముల ప్రాయము గలవాడయెను. తాను జన్మించి నప్పటి నుండియు పుట్టు బ్రహ్మజ్ఞాని యగుటచే తన చిన్నతనంబు నుండియే ఆర్యులనిన తన అణువంచి నమస్కరించిపూజించు చుండు స్వభావముగలవాడు చూచువారంవరకును రెండవ ప్రహ్లాదుడా! యనునట్లు తాను తోడి బాలురకు బోధించినను తానుమాట్లాడుచుండినను కేవల శాంతశమదమాదిగుణంబులు గలవాడై భక్తిప్రపత్తులతో మాట్లాడుచుండెడివాడు. ఆ సిద్ధయ్యగారు పదునాల్గు వత్సరంబులురాగానే తాను మహ్మదీయుడైనను నిర్మల మానసుండగుటచే సాంఖ్య, తారక, ఆమనస్కంబులను బోధించి సద్గతికి త్రోవను జూపెడి దేశిక శిరోరత్నంబెప్పుడు లభించునాయని యాలోచిందుకొను సమయమున నా గ్రామంబునంగల సాధులలందరా వీరబ్రహ్మేంద్ర

స్వాములవారి సచ్చారిత్రము చెప్పకొనుట తాను విని కేవల వైరాగ్య మానసుండై తల్లిదండ్రాదులను వదలి అవారిగా కందిమల్లయ పల్లెజే స్వాములవారి మఠం సింహద్వారమునకు నమస్కరించి లోనికేగి చూడగా నిందుండు భక్తులాచరించెడి తపంబునుజూచి తన మనంబు మారి తన్మయుండై యుండి కొంత సేపటికి ధైర్యంబవలంబించి నా తపం బాచరించెడి భక్తాదులకును, స్వాములవారినియిట్లునివర్ణింపసాగెను ఆహా! యేమి ఈ మఠంబులోనం బ్రవేశించినంతనే నాదక్షిణ నేత్రం బదురుచున్నది. శ్రీస్వాములవారి దర్శనం బైనంత మాత్రంబుననే నా శరీరం బంతయు బులకాంకురంబును జెందుచున్నది. ముందేమి కానున్నదో తెలియదు. ఈ మఠంబును జూడగా రెండవకైలాసమా యనునట్లున్నది. శ్రీ స్వాములవారిని జూడ అపరశివునివలె నున్నారు. తక్కిన భక్తాదులందరిని చూడ దేవగణమో యని తోచుచున్నది. ఇచ్చట నింకను అనేక తపోధనులైన మహాత్ములు సిద్ధాసన సింహాసన, భద్రాసన, గోముఖాసన, స్వస్తికాసన, ప్రముఖాసనాదిగా గల రేచక పూరక కుంభక ప్రాణాయామంబులు చేయువారును ఆధార స్వాధిష్ఠాన మణిపూరక అనాహత విశుద్ధ ఆగ్నేయ చక్రంబుల యందున్న పంచాశద్వర్ణంబుల యందున్న పంచాశద్వర్ణంబుల నిరీక్షించుచు తదీయాధిష్ఠాన దేవతలును జపవిధానంబుగా నర్చించుచునాడీశోధనంబుజేసి క్రమ క్రమంగా షడాధారంబుల ఛేదించి సుషుమ్న నాడీ మార్గంబున నూర్ధ్వముఖంబుగా సహస్రార కమలాంతర సుధాబిందుపానానుభవంబునసొక్కుచుండువారునుహృదయ

కమల కర్ణికా మధ్యంబున నంగుష్ఠ మాత్రుండై ప్రకాశించు చున్న పరమాత్ముని ధ్యానించి తదనుభవంబున నానందించు వారును సాంఖ్యతారక అమనస్క యోగాభ్యాస పరవశులై యంతర్లక్ష్య, మధ్యలక్ష్య, బాహ్యలక్ష్యావలోకనంబుజేయు వారును శ్రోత, నేత్ర నాసాపుట నిరోధనంబుజేసి యాత్మ ప్రత్యయ ప్రకారంబు గాంచుచు దశవిధ నాదంబులాలకించు వారును అంతర్లక్ష్యంబునుండి అరకంటి చూపున స్వరూప ధ్యానము జేయువారును, కన్నులమూసి శిరంబును వంచి యూర్ధ్వజ్ఞప్తి గళా మాత్రంబున నిల్చువారును, ఇదమిద్ధ మనుట మరచి యెరుక మాత్రమే శేషించి కేవలాత్మాను భవంబు జేయువారును, స్థూలజిహ్వాగ్రంబును తదుపరిసూక్ష్మ జిహ్వాగ్రంబు దాటునట్లుగా జొనుపుచు తదేకనిష్ఠలచేలంబికా యోగాభ్యాసంబు చేయువారును. నివ్విధంబునధ్యానషణ్ముఖి శాంభవి రాధాయంత్ర ఖేచరీముద్రా ధ్యానపరులై యోగాను ష్ఠానపరులైనవారును, యేకపాదస్థులైయధోమంతలవర్తియైన శ్రీమన్నారాయణుని వర్ణించువారును, పంచాగ్ని మధ్యము నందుండి మహా ఘోరతపం బాచరించువారును, రామతార కంబును, నారాయణాష్టాక్షరంబును శుద్ధ ప్రణవ మంత్రంబు లాదిగాగల యేడుకోట్ల మహామంత్రంబుల అంగన్యాస, కరన్యాస పూర్వకంబుగా ఏకాగ్రచిత్తంబున దపంబు చేయు వారును, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామిని ధ్యానించుచు షోడ శోపచారంబులచే పూజలు సల్పువారును, దన్నామ మంత్రం బులను జపించువారులు, వ్యాఘ్రాజినకృష్ణాజిన వల్కలాంబ

రులై వాతాంబువర్ణ కందమూల ఫలాశనులై వర్తించుచు నిట్లనేక విధంబుల కర్మ, భక్తి, జ్ఞాన, వైరాగ్య, జప, తప, హోమాది సకల సత్కర్మనిష్ఠులైయున్న తపోధనుల మధ్యంబున ప్రణవ సింహాసనాసీనుండై నక్షత్ర మధ్యంబున వెలుంగు చంద్రుని చందంబున బాల సూర్య కాంతులతో శోభిల్లెడి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాములవారిని సిద్దయ్యగారు చూచి తన్మయత్వంబును జెంది దేహమును మరచి కొంత సేపటికి జ్ఞప్తిగలిగినంత సిద్దయ్యగారు శ్రీ స్వాము వారి పాదంబులపైబడి శిరస్సాష్టాంగదండప్రణామంబు లాచరించి నిలువంబడి శ్రీమద్రాజాధిరాజ రాజపరమేశ్వర శ్రీ మద్విరాడ్విశ్వకర్మ కులోద్భవ బ్రహ్మాండపురవాస పరిపూర్ణయాచార్య ప్రకృతాంబగర్భ శుక్తి ముక్తాఫల అవతార మూల ద్వాదశమధ్య వేదాంత జ్వాలబింబాయమాన నానబింబకళాతీత సందర్శన ఉత్తరభాంఎవీ అమనస్క యోగనిష్ఠాగరిష్ఠ అఖండమండలాకార సచ్చిదానంద మహాప్రణవ పంచాక్షరీ అవిరళ పరంజ్యోతి ప్రణవస్వరూపులయిన స్వామీ! సద్గురు ప్రభో! సకలపాప విధ్వంసకా! సచ్చిదానందరూపా! సద్గురు స్వామీ! సకల భువనాధారా! సర్వేశ్వరా! సద్గురు సార్వభౌమా! సకల భూతాంతవ్యాపకా!సద్గురు చంద్రమా! నన్ను తమ పాదరేణువుగాజూచి శిష్యునిగా జేసుకొనుమని ప్రార్థింపనంత స్వాములవారు శీఘ్రమేవానంద ప్రాప్తిరస్తు అని దీవించగా సిద్దయ్యగారు శ్రీస్వాములవారి పాదంబుల కడనే కూర్చుండి స్వాములవారి పాదసేవ చేయుచుండెను.

గోవింద పోతులూరయాచార్యు లిరువురును సిద్దయ్యగారిని దూషించుట, స్వాములవారు కుమారులకు నీతిని గరపుట.—

మహమ్మదీయ వంశీకుండైన సిద్దయ్యగారు స్వాముల వారికడ భక్తుడుగా నున్నాడని గోవింద, పోతులూరయాచార్యులకు దెలిసి కోపోద్దీపిత మానసులై తండ్రి కడ కరుదెంచి నమస్కరించి 'జనకా! మాకు నొక సందియము గల్గినది. అది యెద్దియన మహమ్మదీయ వంశీకుడైన సిద్ధండను వాడు మీ కరుణకు పాత్రుడు కావలెనని వచ్చినాడట వానిని తమ కడనుండి వెడలగొట్టుడు. లేకున్న వానినుండిమనకును మన భక్తాదులకు అపకీర్తి గలుగు'ననగా నంత స్వాములవారు 'బిడ్డలారా! ఇదియా మీకు గలిగిన కోపంబునకు గారణంబు. శాంతింపుడు— శాంతింపుడు త్వరపడకం'డని తండ్రి చెప్పగా వారిరువురును వినక సిద్దయ్యగారినితక్కువవర్ణము వాడనియును చిన్నతనంబుననే నీకీ అద్వైతం బెందులకనియును, నీవెంతయత్నించినను నీకా పరశివయోగంబు సిద్ధించదనియును, మావంటి వారికడ నీ వంటివాడు చేరుట చెడ్డ తలంపనియును, హరిహరాదుల కగోచరంబైన నా పరబ్రహ్మము ప్రాప్తించదనియు నిట్లనేక విధంబులుగా వారిరువురును కోపోద్రేకులై పల్క, సిద్దయ్యగారు చేతులుజోడించికొని 'స్వాములారా! నావంటిదీనునిపైనియూ మీకుకోపము! నన్నును మీ సోదరులలో నొకనిగా జూచి నన్ను రక్షించు'డని పాదములపై బడబోవగావారిరువురునుసిద్దయ్యగారినావ

లకు నెట్టివెచిరి. అంత సిద్దయ్యగారు 'నాయనలారా ! నేన మహాత్మునియు తనయును తక్కువ వర్ణము వాడననిగదా తమరు నన్నింతగా చూచుట ? క్రూరుండునునిర్ధయుండును దురాచారుండును హీనకులుండును జంతువధచేయువాడును జాటసారులను పాపం బనక తలలుప్రక్కలుచేయు"వాల్మీకి" ఒక్క మౌని బోధచే జన్మ తరింపచేసుకొనలేదా?' అని వినయ విధేయుండై వేడుకొనగా వారిరువురును ఒకరై 'వర్ణవివక్షతయైన జూడక మాకు నీవు నీతులు చెప్పునంతటి వాడవా? చాలుచాలు ! నీ ప్రసంగమును గట్టిపెట్టి మఠంబు నుండి వెడలు' మనగా సిద్దయ్యగారు 'స్వాములారా! నేనొక చిన్న విషయంబును చెప్పెద. నాయందు పరిపూర్ణానుగ్రహ ముంచి యిటు వినుడు, శాంతి వహింపు'డని యిట్లు చెప్ప నారంభించెను "నాయనలారా! సత్యంబును గ్రహింపజాలని సకలశాస్త్ర పారంగతులు కొందరు కులవిమర్శన చేయుదురే గాని అది సరిగాదు ఎట్టులనిన శ్లో॥ నజాతి రాత్మనో జాతి వ్యవహార ప్రకల్పితాః॥ అని నిరాలంబోపనిషత్తురీతిగా ప్రతి మానవుండును నిశ్చలాంతః కరణంబుచే పరికించి చూడగా ఆత్మకు జాతిభేదంబులు లేవు. ప్రపంచమున నలరారు ప్రాణులయొక్క గుణమువల్లను వారివారి ప్రవర్తనల వల నను బ్రాహ్మణాది జాతి భేదంబులున్నూ శైవ వైష్ణవాది మత భేదములున్నూ కల్పించిరి. ఈ జాతులలోని ప్రజాతి అగ్రజాతియనియు కపటవేషధారులై నొక్కి వక్కాణించి నరులను అజ్ఞానగాఢాంధకారంబున బ్రవేశపెట్టిమోక్షమార్గం

బునకు దూరులుగా జేయుచున్నారలు. కాన నన్ను తక్కువ జాతివాడని వచించుట తమవంటి సుగుణులకు సరియగునా? తమ రన్ని విషయంబులలో సర్వసములైన మీ వంటి గురు స్వాములు ఇట్లనభావ్యమా?'యని వేడగా వారిరువురి కోపం బునకు మేరలేక 'ఒరే! వాచాలా! నీ వెంత వాగివను నీ విట నుండి వెడలి మఠం బావలనుండి మాట్లాడు'మని తిట్టుచు కొట్టపోగిరి. అంత వెంటనే సిద్దయ్యగారు శ్రీస్వాములవారి పాదంబులపైబడి 'తండ్రీ! నీ పాదసేవ తప్ప నీ ప్రపంచం బున నాకేమియు వలదు సర్వంబును వీడి నీకు సేవజేసి తరించుటకై వచ్చిన నన్ను నా సోదరులైన గోవింద పోతు లూరయాచార్యు లిరువురును కొట్టపోగిరి. తమరైన నాపై కృపయుంచి వారిరువురకును నీతులు చెప్పరాదా?' యని దుఃఖించుచు వేడుకొనగా స్వాములవారు సిద్దయ్యగారియందు గల ప్రేమచే కుమారులను చూచి "బిడ్డలారా! మీరేల వానితో నిట్లు కలహించెదరు? ముందు వాని వృత్తాంతంబును వాని నివాసంబును గనుంగొనిన తదుపరిగదా వీని విషయంబు తెరుంగుట" యని చెప్పి సిద్ధయ్యగారిని చూచి "బాలకా! నీ యూరెద్ది? నీ తల్లిదండ్రులెవరు? నీ వృత్తాంతంబును దెల్పు మనగా సిద్దయ్యగారు "తండ్రి పీరుసాహెబు. తల్లి అదంబి. నేను దూదేకుల వర్ణమువాడను. దారాపుత్రధనాది సంపద లశాశ్వతంబని తలంచి సంసారాంభోరాశిని మునుంగజాలక జననీజనకులపై ప్రేమను త్యజించి, భవదీయ దివ్యచరణ కమలసేవనుజేసి కృతార్థుడను గాదలంచివచ్చినాడను.నన్ను

రక్షించు భారంబు నీయదే"యని స్వాములవారి పాదంబులను పట్టినబట్టు విడువక అట్లే యుండెను. అంత స్వాములవారు కుమారులను జూచి "బిడ్డలారా! శాంతి వహించి కూర్చుండి వినుడు. ఈ శరీరంబు వాత పైత్య శ్లేష్మాదు లనంబడు పలు రోగంబులచే పీడింపబడును కావున నిదియొక బలబుద్బుద సమానంబు. ఇట్టి తుచ్ఛ శరీరంబుపై నాశ వహించి జీవుడు సర్వమును తనదే యని వెఱ్ఱి భ్రాంతిని దగులుపడి ధనదార పుత్రేషణ లనంబడు నీషణత్రయంబులకు జిక్కి శ్రీగురుపద ధ్యాన మెరుంగక చిన్మయకారుని నెరుంగజాలక తన్మయా వస్థలచే గుంది వర్తించుచు కాలమెల్ల నిరుపయోగంబు చేసి సంచరించుచు తుదకు యముని బాధల కోర్వజాలక నరక కూపంబునంబడి పరితపించుచు జన్మరాహిత్యం బెరుంగక నానాయోనుల బుట్టుచు గిట్టుచుందురు. ఇదియునుంగాక నీవు నేను అను భేదంబును సర్వంబెరింగిన మనవంటి వారలు విడువవలయును. కులమును బాటింప సరికాదు. ఏ కులం బైననేమి? అందరు మూత్రపురీషసంకల రజస్సంభూతులే గాన మీరలు కులాతిశయంబును బూనక యీ సిద్దని మీతో సమానముగా గౌరవింపుడు."

ముడుమాలలో సిద్దయ్యగారు కాన్పించినందున తల్లిదండ్రులు దుఃఖించుట కందిమల్లయపల్లెలో బ్రహ్మంగారివద్ద నున్నాడని తెలిసి సిద్దయ్య వద్దకు పీరుసాహెబు వెళ్ళుట.

శ్రీ సిద్దయ్యగారు ముడుమాలలో గనపడకుండుటచే

బిడ్డపైనిగల భ్రాంతిచే తల్లిదండ్రు లిరువురును దుఃఖించుచు
నాగ్రామంబునంగల బావులను, చెరువులను, ప్రతి గృహం
బును మూడుదినంబులు వెదకివెదకి వేసారి బిడ్డపైని యాశ
వదలి యిల్లుచేరిరి. తల్లియైన ఆదంబి పుత్రవియోగందుఃఖంబు
నకు సహించలేక నేలపైబడి పొరలి పొరలి దుఃఖించుచు
పెద్దపెట్టున యెలుఁగెత్తి యేడ్చుచు 'అయ్యో! కుమారా!
సర్వజ్ఞుండైన సర్వేశ్వరుని సకలవిధంబుల సన్నుతిజేసినకల
సద్గుణ సంపన్నుడైన కుమారుని నొసంగుమని వేడ నప్పర
మేశ్వరుండు దయాళుండై నిన్నొసంగెనే కుమారా! నీవు
జన్మించినప్పటినుండియు నీముద్దుమాటలచేత ప్రొద్దుబుచ్చు
కొనుచుంటిమే బిడ్డా! పైగంబరులు కొందరు నీ చిన్నతనం
బున నిన్ను వీక్షించి జగత్ప్రఖ్యాతినిగాంచెడుసిద్ధుండవగుదు
వని వచించిరే? తండ్రీ! వారి నుడువులన్నియు నే సముద్రం
బున సమసె? నిన్ను పాఠశాల కనిపిన నీతోటి బాలురందరి
కన్నను నెక్కుడుగా విద్యాబుద్ధుల యందారితేరనీకు సమా
నులు లేరని నీకు విద్యనుజెప్పెడి అయ్యవారుసహా అచ్చెరు
వందు చుండిరే! తోటిబాలురు నాటపాటల కేగిన నీవుశ్రేష్ఠ
దనివల నీతులుగరపుచుందువే? తోటిబాలురు ఏదియో యన
లాని మాటలాడిన నీవు వారలకు నెట్టియో హితోపదేశం
బులుచేసి వారిని నీవలె భక్తిపరులనుగాఁజేయుచుంటివే? కన్న
తండ్రీ! నిన్నా పరమేశ్వరుండు ఏ బావియందుననో ఏ
చెరువునందు ననో సమసిపోవుమని వ్రాసినాడు గాబోలు.
లేకున్న నీ చిన్నతనంబుననే యింత విపరీతజ్ఞానం బుదయ

మగునా? ఏది యెటులున్నను ముందు కొంపముంచి నా గర్భంబునకు చిచ్చుపెట్టి పరలోకంబునకేగితివా? నాముద్దుల పడ్డీ! నీ వగపడకున్న మాజీ వంబులు నిలుచునా? తండ్రీ! నిన్ను పదునాలుగు వత్సరంబులు పెంచి పరమేశ్వరునిపాలు జేసితిమా? యుక్తవయస్కుఁడవగు నీవు వృద్ధదశలోనున్న మమ్ముల గూర్చుండబెట్టి ఈ సంసార రథంబును నడుపుదు వనుకొంటిమే? తండ్రీ! నిన్ను చిన్నతనంబునుండి పెంచి పెద్దవానిగ జేసిన మమ్ములను విడనాడి యెందుంటివోగదా? కుమారా! ఇప్పటికి మూడు దినంబులనుండి యగపడకున్న మూడు యుగంబులాయెనే? కన్నతండ్రీ! నీవు లేని దుఃఖం బును మా జీవిత పర్యంతము నెట్లు భరింతుము? నీపై గల యాశలన్నియు నడుగంటి పోయెనే? కుమారా, నిన్ను నవ మాసంబులుమోసి కని పెంచిన ఈ దుఃఖంబు నెవరు వారిం తురు? తండ్రీ! నీపైగల యాశలన్నియు "బూడిదెలో బోసిన పన్నీరుచందమాయనే! ముద్దుబిడ్డా!" యనీ భూమిపైపడి పొరలి పొరలి యేడ్చుచున్న భార్యకడకు పీరుసాహెబు వచ్చి కాంతా! యేడ్వకుము. మన సిద్దయ్య కందిమల్లయ్య పల్లెలోగల వీరబ్రహ్మంగారివద్ద గూర్చుండి వారికి శుశ్రూ షలు చేయుచున్నాడని మన గ్రామములోగల సాధువులు చెప్పిరి. రాత్రి వారును బ్రహ్మంగారివద్దనేయుండి యుద యమే బయలుదేరి వచ్చినారట! నేనేగి పుత్రునకు వారిచే బుద్ధులు చెప్పించి మనవరప్రసాదియైన సిద్దయ్యను దోడ్కొని వచ్చెదనని భార్యతో జెప్పగా దుఃఖించుచున్న నామెకుకొంత

ధైర్యంబుగలిగి 'నాథా! పిన్నవాడైన మనబిడ్డకిబ్రహ్మంగారి విషయమెట్లు తెలిసెనో ఆశ్చర్యంబుగా నున్నది. నాథా! మన సిద్దయ్య ఎవరి వెంటనైనా బోయెనో? లేక తన తై తానేగెనో? యెటులనుకొటకును వీలులేకున్నది. (శ్రీ సిద్దయ్యగారి చరిత్రను చూడుడు) ఈమూడుదినంబులనుండి నన్నువిడిచి యెచట ఎట్లుండెనోకదా? నాథా! నీవు సత్వరంబున కందిమల్లయపల్లెకేగి మన సిద్దయ్యను దోడ్కొని రమ్ము. నా స్థితి యంతయు బ్రహ్మంగారితో చెప్పుము. పొమ్ము ఆలసింపకు'మనగా వెంటనే పీరుసాహెబు ముడుమాలనుండి బయలుదేరి కందిమల్లయపల్లెజేరి మఠంబులోనికేగి చూడగా బ్రహ్మంగారి పాదములకడ గూర్చుండి, స్వాములవారి పాదంబులొత్తుచున్న సిద్దయ్యను తండ్రిచూచి తన సంతోషంబునకు మేరలేక పుత్రుని కౌగలించుకొని, 'అబ్బా! నాయనా! కంటికి కనిపించితివా? తండ్రీ! నేటికి మూడు దినంబులనుండి వెదకుచుంటిమే! నాయనా! తుదకొక సాధువువలన నీ విచటనుంటివని విని యిటకరుదెంచినాడను నీతల్లి నీపైబెంగపెట్టుకొని ఈ మూడు దినంబులనుండియు నిద్రాహారంబులు మాని దుఃఖితయై యున్నది. ఇంటి కేగుదము రమ్ము. నిన్ను విడనాడి ఒక నిమిషంబయినను నిల్వగలమా'యని పీరుసాహెబు చెప్పగా సిద్దయ్యగారు 'నాయనా నేను తరిగి గృహంబున కరుదెంచు తలంపుతో నిచ్చటికి రాలేదు'. పీరు :- అయ్యో బిడ్డా! ఇంటికిరాక ఇక్కడనుండి యేమిచేయదలంచుచుంటివి? సిద్ధ:- తండ్రీ! నేనీ వీరబ్రహ్మ గురుస్వాములవద్ద విద్య నేర్చుకొనదలచి వచ్చితిని. పీరు :-

కుమారా ! మన గ్రామములోని పండితులవద్ద విద్య నేర్చు కొనగూడదా? సిద్దా :- తండ్రీ! విద్యయన నేమని తలంచు చుంటివో? సకల జనులు నభ్యసించు విద్యకాదు. నే నిప్పు డభ్యసించునది బ్రహ్మవిద్యం పీరు :- బిడ్డా! బ్రహ్మవిద్య యనగా నేమిటి? సిద్ద.- తండ్రీ! అటులైన స్థిరచిత్తుండ వై వినుము. చతుర్వేదా తీతంబయినదియు, త్రిమూర్త్యా తీతం బైనదియు, దివ్యజ్ఞాన సంపన్నులకు వెలుగువంటిదియు, అజ్ఞానాంధకార కూపంబున మునుంగు మూఢులకు అంధ కారంబు వంటిదియు నగునది యెద్ది కలదో అద్దానిని చూపు నదియే బ్రహ్మవిద్య యనబడును.

సిద్దయ్యగారు గృహంబునకు రానని తండ్రియైన పీరుసాహెబ్‌తో చెప్పుట.

ఇటుల మారుపల్కు పుత్రుని తండ్రిచూచి 'బిడ్డా ! పదునైదు వత్సరంబు లైనను సరిగాలేని నీ కీ చిన్నతనంబు ననే ఈ యయ్యవార్ల సేవ యెందులకు ? అయినను మనది మహమ్మదీయమతముగదా! నీ కీ హిందూమతం బెందులకు? మనకు అల్లాయనెడు పెద్ద దేవుడుండగా నీ కీ హిందూమతం బెందులకు? మహమ్మదీయులు నిన్నుజూచి పరిహాసింపరా ? ఇట్లు నీ వున్న నిన్ను వూరక విడుతురా ? ఇదియునుంగాక మనకు మక్కామసీదు లనేకములుండ హిందువులుండెడి ఈ మతంబు మన కెందులకు? తల్లి దండ్రి గురువు దైవంబని యార్యు లనుచుండిరే. బిడ్డా! వృద్ధులమైన మమ్మిరువురను పోషించి మాచే దీవనలంది మమ్ములను కడతేర్చిన పిమ్మట గదా నీకు నొక గురువు కావలసినది? తల్లి దండ్రులమైయున మమ్ములనుపోషింపక విడనాడి నీవు గురూపదేశంబయినంత

మాత్రముననే నీకు మోక్షము సిద్ధించునా? నీవు మమ్ములను పోషింతు నను తలంపుతో మే మెన్నియో కష్టంబులు పడి పోషించి, పెంచి పెద్దవానిగా జేసిన మమ్ములను విడనాడి ఇట్లుండ నీకు న్యాయమా'యన్నతండ్రిని సిద్దయ్యగారుచూచి 'తండ్రీ!నీవు నన్నిప్పుడడిగిన వాటికన్నింటికిని సమాధానం బును జెప్పెద చక్కగావినుము. నాకీ చిన్నతనంబుననేగురు సేవ యెందులకనిన మనయందున్న సర్వేంద్రియ విలక్షణం బయిన 'జీవు'నకు చిన్న పెద్దతనంబులులేవు. నీ మతమని, నా మతమని, పర మతమని, నీ దేవుడని, నాదేవుడని, పర దేవుడని యిన్ని దైవంబులుండిరా? అన్నియును చూడ దేవు డంచరి కొక్కడేగదా! ఆభరణంబులు వేరైనను బంగారం బొక్కటేగదా! అట్లే యెవరి కే వస్తువునందు అభిమతంబు గలదో అద్దానినే మతంబందురు ఇదియునుంగాక నే నిదివర కెందరి గర్భంబుల బుట్టితినో? వారందరును తల్లిదండ్రులయి నారా? వారందరిని నేనుకడతేర్చితినా? వారునన్నుకడతేర్చి తిరా? నీకు పరమార్థంబన నెట్టిదో తెలియక అవివేకంబున బల్కుచుండుట ఆర్యాభిప్రాయంబునకుసరిగా'దని సిద్దయ్య గారు చెప్పగా, తండ్రియైన పీరుసాహెబు 'బిడ్డా! ఉపదేశ మిచ్చెదనని గారడి చేయువాని చందమున వారి మాయలలో నుండునట్లు చేయుదురు. కాన వారి మాయలలో జిక్కక యుంటి కేగుదము రమ్మ'నగా సిద్దయ్యగారు 'తండ్రీ! గురూపదేశం బనగా గారడియని పల్కుచుండిరి. తన్ను తా నెరింగిన నిజగురుని జేరిన తనకున్న అజ్ఞానం బను గారడి యనెడి మాయను తీసివేయును. మీరు కేవలము పిచ్చి

మానవులు. మీకు జ్ఞానం బన నెట్టిదో, అజ్ఞానము బననెట్టిదో యెరుంగని నిరక్షరకుక్షులు కనుకనే గురూపదేశంబన్న మిన్ను విరిగి నెత్తిపై బడుననుకొని భయముతో చెడిపోవు చున్నారలు. ఇదియునుంగాక నీవును మాయయె. నేనును మాయయే. అవి యివి యన నేల? ఈ కాన్పించెడు సర్వ ప్రపంచంబంతయు గారడియనుమాయయేగాననిట్టి మాయను త్యజింపజేసి మాయకు అతీతంబైన ఏ మహత్తేజంబు కలదో అది మాయకాదు. కాని యీ సర్వంబును మాయయే. మన మందర మా ప్రకృతి యను మాయకు లోనై అహం కార మమకారంబుల చేతనే గదా పుట్టితిమి? కలిమాయకు లోబడి విషయేంద్రియంబులకు జిక్కి భగవంతుని మరచి యుండు మానవులకు మోక్షము మెట్లు లభించును?నాయనా! నీవు పెద్దవాడవు. నేను పిన్నవాడను. ఈ విషయంబులను నీ మనంబున నీవే బాగుగానాలోచించిన నీకే తేటతెల్లంబుగా తెలియు'నని సిద్దయ్యగారు చెప్పగానంత తండ్రియైన పీరు సాహెబు 'కుమారా! నీకు వివాహంబుజేసి సతీపతు లిరువు రును సుఖముగా సంసారంబును జేయుచుండిన మా కన్నుల పండువుగా జూచుకొందమని మన వంశీయులలో నొక యువతిలలామను మాట్లాడి యున్నారము. గాన నింటికేగు దము రమ్మ'నగా సిద్దయ్యగారు 'జనకా! నీవు మాట్లాడెడి విషయంబులన్నియు మహదానందమున నుండెడివాని తెరం గున బాషింపక అవివేకులవలె భాషించుచుంటివి తండ్రీ ! నీ వెంత పిచ్చివాడవయ్యా! నేనుసంసారంబునే వదలి కేవల విరాగి నై శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాములవారిని సేవింపవచ్చిన

నాకు వివాహమా? ఆహా! ఎట్టి మాటలాడితివి? సంసారంబు వలనను భార్యయందు గలుగు మోహంబువలనను సుఖంబు వ్నదని మీ తలంపు గాబోలు! ఇటు వినుము జనకా! వివాహము, ధనము, సుఖము నివి యన్నియు నిహసంబంధమైన సౌఖ్యంబుల నిచ్చునవియే గాని బరలోకసౌఖ్యంబు లొసంగునవిగావు. ఇదియునుంగాక సంసారాంబుధి మునుంగుమూఢులను జూచిన నాకే బహువిచారము సిగ్గుగానున్నది.

సిద్దయ్యగారు తండ్రికి విరక్తిమార్గంబును బోధించుట, శ్రీ స్వాముల వారికి సిద్దయ్య నొప్పగించి పీరుసాహెబ్ ఇంటికేగుట

'తండ్రీ! మోహంబును త్యజించినవాడే ధన్యుడు. దానివలన జ్ఞానమలవడును. ఆ జ్ఞానంబువలన సంసారపరాఙ్ముఖత కలుగును. అట్టిది కల్గనేని తపశ్చరణంబునకు బుద్ధి ప్రవేశించును. దానివలన పరమేశ్వరానుగ్రహము బడయవచ్చును. కావున నేను చేయదలంచిన కార్యంబుఅభేద్యంబై నది మహాకష్టంబై నది. కావున నాపై మీరు విచారపడక మీ రిరువురును సదా భగవన్నిష్టయం దుండుచు కడతేరుడు. నన్ను దీవించి గృహంబున కేగుడు ఇదియె నా మనోనిశ్చయం'బనగా తండ్రి కుమారుని కౌగలించుకొని యేడ్చుచు కుమారా! నీ కి చిన్న తనంబుననే యింత విపరీతజ్ఞానం బుదయమైనది. "వినాశకాలే విపరీతబుద్ధిః"యనున ట్లింత విపరీతంబయిన 'అద్వైతజ్ఞాన సూర్యోదయంబై నది' నిన్నా పరమేశ్వరు డెటుల జేయనున్నాడో అటులనే జరుగునుగాని నానవ్వుండుతలంచిన కోరికలన్నియు కడతేరునా? నాయనా!

నిన్ను కంటిమిగాని నీవ్రాతను గంటిమా-'యనిదీనాననుగ్రై పల్కుచున్న తండ్రితో సిద్దయ్యగారు 'జనకా! నీవనినమాట వాస్తవమే కాని యొక విషయంబును మాత్రము చెప్పెద వినుము. సంసార మను నెండలో తరింపబడెడి మానవు లకు మోక్షంబనెడి వృక్షంబు యొక్క నీడ తప్ప మరెంధును సుఖంబుగలుగదు. కాని బాల్యయౌవన కౌమార వార్ధక్యాదుల యందును మనుజులకు గలిచెడి తాపత్రయంబు లకు ఔషధంబేది యనిన మరియొక విషయమునగాని సుఖ మువగాని యతిశయము తోపకుండునట్టి మహాసుఖరూపంబై, దుఃఖసంబంధము లేశమైనను లేనిదే నిత్యమై, శుద్ధమై, బద్ధ మైయుండు భగవంతుని జేరుటయే యని నామనోనిశ్చయము కాన వివేకి యగు మనుజుడు హేయగుణ రహితుండై సకల సద్గుణవంతుడగు భగవంతుని జేరుటకు ఒక సద్గురువు నాశ్ర యించవలెను. అట్లు ఆశ్రయించి యున్న నన్ను నింటికి రమ్మని పిలుచుట న్యాయంబుగాదు. ఎట్లనిన మత్స్యంబులు జలంబులను వీడి జీవింపనేరని యట్లు సదురువులని వదలి జీవింపనేరని వారికి ప్రపంచ తత్త్వము దెల్పి బ్రహ్మజ్ఞానో పదేశము జేయుచుండెను. ఈ మహామహుని విడిచి నేను జీవింపజాలను. ఇక గృహంబున లేగు'మని సిద్దయ్యగారు చెప్పగా నంత తండ్రియైన పీరుసాహెబు దుఃఖంబునకు మేరలేక భోరున పెద్దపెట్టున నెలుంగెత్తి యేడ్చుచుసిద్దయ్య గారిని కౌగలించుకొని 'బిడ్డా! మా గర్భవాసంబున బుట్టిన కారణంబుచే మాగర్భంబులు దగ్ధంబగుచున్నవి. నిన్నువిడచి

గోవ కాళ్ళాడకున్నవి. నీమీదప్రేమని నీతల్లి దుఃఖంబునకు మేరలేకున్నదని బ్రతిమలాడు చున్నను నీకు మాపై ప్రేమ లేక యిట్లు భాషించుట భావ్యముగాదు. కావున గృహంబున కేగుదము రమ్మ'నగానంత సిద్దయ్యగారు 'తండ్రీ! నీ వెన్ని చెప్పినను ఎన్ని శ్రమలను బెట్టినను, కొట్టినను, తిట్టినను కుదకు నీ హస్తంబులచే నా కంఠంబుత్తరించినను సరేగాని ఈ జగద్గురు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి పాదంబుల నాశ్రయించిన నా మనంబిక మారదు. శ్రీ సద్గురుని కరుణా కటాక్షవీక్షణంబుల కన్న మిన్నయైన దీ జగంబున రెండవది లేదు గాన నిక నాపై యాశను వదలి గృహంబున కేగుము. నీకిదే అనేక వందనశతంబులు, నాతల్లికిని అనేకవందనశతం బులను చెప్పుము, సుజ్ఞానమార్జించి సచ్చిదానంద పరబ్రహ్మ పదవి గాంచనున్ననన్నుదీవించిగృహంబునకేగుము. ఇదియే తుదిసారి సమాధాన'మనిన పీరుసాహెబు సిద్దయ్యగారిపైన నాశవదలి శ్రీవీరబ్రహ్మంగారివద్దకు వచ్చి 'వీరబ్రహ్మగురు సర్వా! సలాములు. ఈతడు మీ వలన పరతత్త్వోపదేశంబును గ్రహింప మీసన్నిధికిజేరినాడు ఈతడు మాపుత్రుండుకాడు. మీ పుత్రునిగానెంచి సద్బుద్ధులు గరపుము ఈతండు తమ భక్తుండగుటంజేసి జ్ఞానియైనాడు. వానికి జన్మసాఫల్య మగు గతుల తా మనుగ్రహింపవలెన'ని ప్రార్థించి సిద్దయ్యగారిని కౌగలించుకొని 'కుమారా! అయ్యవారియందు భక్తిశ్రద్ధలు వహించి సద్బుద్ధి బడయుము ఇవియే అనేక దీవనలు' అని చెప్పి గోవిందమ్మగారికడకేగి సలాముచేసి ఆగి'అమ్మా! నా

కుమారుడు అయ్యవారివద్ద నున్నాడు. చిన్నతనంబున నేది యైన తెలిసి తెలియక చేసిన వాడొనర్చెడి తప్పులన్నియు ఒప్పుగా భావింప ప్రార్థించుచున్నాడనని చెప్పి యటనుండి సిద్దయ్యగారి స్నేహితులవద్ద కరుదెంచి నాయనలారా ! మా సిద్దయ్యను మీతో సమానముగా జూచుకొనుడు. తక్కువ వర్ణమువాడని అగౌరవముగా జూడకుడు అని చెప్పి తానింటి కేగుటకుకాళ్లాడక తిరిగి సిద్దయ్యగారి వద్దకువచ్చి కుమారా! నేనిక నేగుచున్నాడను. పిరంపరినీ నీవు నెక్కుడుగా గౌర వించుము. గురుపు[illegible] నొద్దికగానుండి మంచివాడవను మాట మాత్రము [illegible]నుమనగా నంత సిద్దయ్యగారు తండ్రీ! నన్ను [illegible] మీరు విచారపడవలదు. నేను ఈ స్వాములవారి [illegible]టాక్షంబున కేవల కీర్తివంతుడనై యుందును. గాని నీకేమియు నపకీర్తిని దేను, నమ్ముమని చెప్పగా నంత సిద్దయ్యగారిని దీవించియటనుండి బయలుదేరి సిద్దయ్యగారిని తిరిగి తిరిగి చూచుచుసింహద్వారంబునుదాటి వెలుపల కరుదెంచి ఆ గ్రామంబున తన్నెరిగిన రెడ్డిగారింటి కేగి రెడ్డిగారూ! నా పిల్లవాడు అయ్యవార్ల వద్దనున్నాడు. మీకు తీరిక సమయంబులలో స్వామి దర్శనంబునకై యేగి నపుడు మా సిద్దయ్యనుగూడ చూచి వచ్చుచుండుడని చెప్పి అదే దారిగా ముడుమాలచేరి జరిగిన విషయంబులన్నియు భార్యయైన ఆదంబితో చెప్పి వారికి తీరినప్పుడెల్ల వచ్చి సిద్దయ్యగారిని చూచి పోవుచుండిరి.

—ం శ్రీ స్వాములవారు సిద్ధయ్యకు గురుసేవకు తగవని చెప్పుట ం—

పీరుసాహెబు తన సముఖంనుండి వెడలి ముడుమాల జేరినపిమ్మట శ్రీస్వాములవారిని సిద్ధయ్యగారనేక విధంబుల స్తోత్రంబుజేసి నిలువంబడిస్వామీ! సద్గురుస్వామీ! నాయందు పరిపూర్ణకటాక్షముంచి నాకా పరశివయోగము దెల్పి నన్ను ధన్యునిగా జేయుడని ప్రార్థించగా, నంత స్వాములవారు ఓయీ! సిద్ధా! నీ తల్లిదండ్రులు నీవు జాతిభ్రష్టుండవైనావని విని ఏడ్చుచు నిచ్చటికి వచ్చి తిరిగి ఇంటికి రావలెనని పలు విధంబుల మీతండ్రి నిన్ను బ్రతిమాలినను పోకుంటివి నీవు నీ చిన్నతనంబుననే తల్లిదండ్రుల యాజ్ఞను మీరి వారివెంట నీ వింటికి బోకుండుట మర్యాదగాదు. కాన నీవు ఇంటికినేగి నీ తల్లిదండ్రుల యాజ్ఞప్రకారము ప్రవర్తించుచు వారియిష్టంబైన యొక యువతీలలామను బెండ్లియాడి భార్యాసమేతంబుగా సుఖంబుగ సంసారంబు నీదుకొనుచుండుము నీ మూలంబున మా కపవాద మేల సంఘటించెదవని చెప్పి సిద్ధయ్యగారి మనంబు నిలకడ బరీక్షించగా నంత సిద్ధయ్యగారు అంజలిబద్ధుండై 'ఆర్యా! సద్గురువర్యా! నా జన్మ సుకృత ఫలశేషంబుననసర్వసంగ పరిత్యాగినై సంసారాంబుధిని మునుంగక యీది గట్టునజేరిన నాకు బన్మతరించు మార్గము వగపరుప వలయునని ప్రార్థించి దేవరవారి పాదపద్మములాశ్రయించిన నన్ను మరల సంసారంబున మునుంగుమని చెప్పుట మీకు భావ్యమా? మీ పాదములకడనాప్రాణమైనను విడుతునుగాని మరి ఇంటికిమాత్రం నేను బోవువాడనుగాను

తండ్రీ! నిక్కముగా ముమ్మాటికి బోవువాడనుగాను. తమరు నాపై పరిపూర్ణానుగ్రహము బ్రసాదించి నాకు పరశివ యోగ మనెడి విజ్ఞాన సంపద కటాక్షింపచిలెనని ప్రార్థించగా నంత బ్రహ్మంగారు సిద్దయ్యగారిని జూచి బిడ్డా! నీ వచిగినది అతి రహస్యంబును అభేద్యంబును సాధింప సాధ్యంబుగాని దెద్ది గలదో అద్దానిని నీ వంటి పసివానికి దెల్పుటయు దానిని నీ వంటివాడు గ్రహించి సాధించుటయు కష్టసాధ్యము గాన నీవు తిరిగి గృహంబునకు జేరుమనగా సిద్దయ్యగారు స్వామీ! ఈ ప్రపంచంబున హరిహర రూపంబున అవతారం బెత్తిన ఆదిమూర్తివని అందజేరితిని. సర్వస్వములైన తమరే యిట్లనిన నాకు దిక్కెవరు స్వామీ! యని వేడుకొనగా నంత స్వాములవారు ఓయీ సిద్దా! ఈ లోకంబున మానవులు పదమూడు గుణంబులను వదలజాలక మాయా తపంబున మగ్నులగుచు మాయను దాటజాలక మాయంబయి పోవుచు న్నారలు అట్టి మాయను పసివాడవైన నీవు దాటుటేల?నా పరశివయోగంబును గ్రహించుటేల? ఆ పరశివ యోగాను భవంబయిన ఆ పరబ్రహ్మలీల సచరాచరంబులందు నిండి నిబిడీకృతంబయిన యే అచల ప్రపూర్ణంబును పరబయలు గలదో ఆ పరబయలైన వెల్గును నీవు చూడజాలవు. చూచిన భరింపజాలవు. భరించినను అనుభవంబును జేసి అందైక్యం బును బొందజాలవు కావున నీ పసితనపు చేష్టలుడిగిత్వరగా నిల్లుచేరుము. నన్ను బ్రయాస పెట్టకుము. ఇదియునుంగాక నిప్పుడీ ప్రపంచంబునుబాలించు ।పశువులుమహాము,దీయులు

ువా మహమ్మదీయుండవు. నీవు మహమ్మదీయ మతంబును ిదలి హిందూమతంబున జేరిన మహమ్మదీయ ప్రభువులతో మాట వచ్చును. నీ నుంచి ఈ మతంబునకు హానివచ్చును. హిందూమతం బన్న మహమ్మదీయులకు విషతుల్యంబుగా వుండును. ఈమహమ్మదీయ ప్రభువులు వచ్చిపిదపనెన్నియో ఆలయంబులు మతంబులు విగ్రహంబులువిచ్ఛిన్నంబులైనవి. కేనెందులకై నిన్ను వలదని చెప్పుచుంటినో,గోవింద పోతు లూరయాచార్యు లిరువురును నిన్ను వలదని వెడ-గొట్ట ప్రయత్నించిరో ఇప్పటికైన తెలిసినదా? నేను భేదంబాతుం కను. నాకు సిద్దైననేమి? మరియెవ్వరైననేమి? నాకందరును ప్రియులే. అప్రియు లెవ్వరును లేరు. మహమ్మదీయ ప్రభు త్వము వారెవ్వరయినను మమ్ములను కష్టపెట్టెదరేమో యను సంశయముచేత నేనును నా కుమారులును నీ కింతగా జెప్ప వలసి వచ్చినదిగాని వేరొండు తలంపుగాదని స్వాములవారు చెప్పగా నంత సిద్దయ్యగారికినేమియుందోచకముకుళిత కర కమలుండై స్వామీ! నా జన్మంబాది నీ పదసేవకై ప్రయ త్నించుచుండగా నా పూర్వపుణ్య ఫల విశేషంబున నేటికి నీ పదకమలసేవ ప్రాప్తించెను. కరుణించి నాకీ పరశివయోగం దెలియ సదుపదేశ మిమ్ము. నన్ను నీ పాదదాసునిగా జేసి కొనుము. నీ పాదధూళి నా శిరంబున నెప్పుడు సోకెనో అప్పుడే నాకు పూర్వజన్మజ్ఞాత గలిగినది. నా సేవకు నీ వంగీకరించవైతివేని నా ప్రాణంబులు తమ పాదంబులకడ విడవవలయునే గాని తిరిగి గృహమున కేగువాడను గానని

యేడ్చుచు వినయవిధేయుండై ప్రార్థించగా నంత స్వాములు
వారు బిడ్డా! నేజెప్పినవన్నియు నీకు నప్రియములుగా దోచ
చున్నవి. గగన సదృశ్యంబైన యా పరమాత్మ నెఱుంగుట
హరిహరాదులకే నలవికాదయ్యెను. అట్టి పరమాత్మస్వరూప
మైన పరబ్రహ్మమును పలుకష్టంబులకు లోనై మర్కటంబనే
మనస్సును గట్టిగా పరుగిడకుండునట్లుచేసి నా మనోమార
తములను ఏకాగ్రమున జేర్చినవారి కేమయిన ప్రాప్తించు
నేమో కాని నీవంటి పసివాని కెట్లులభించును ? నిద్రాహారం
బులను వదలి యింద్రియాదు లన్నింటిని నణచిపెట్టి మూడు
గుణములను మూలదాచి తాపత్రయముల దగ్ధము జేసి పర
ధన పరసతులపైని భ్రాంతివదలి కోరిక యను కాష్ఠమును
జ్ఞాన మను నగ్నియందు వైచి సదా సద్గురు ధ్యానామృత
పానులైనట్టి పరమభక్తులకేమయినసిద్ధించునేమోగాని నీకు
సిద్ధించుట మాత్రము కష్టసాధ్యంబని చెప్పగానంత సిద్ధయ్య
గారికి నింకను శ్రీ గురుస్వాములకు నాపైని కరుణ రాదా
యెనే యని మనంబున దలంచి పెద్ద పెట్టున నేడ్చుచు
స్వాములవారి పాదములను బట్టుచు నేమియు నెరుంగనిపిచ్చి
వానివలె తనలో తానింక నీ శరీరముపైని నాశ వదలిన
మేలని విసుగుగా గొణుగుకొనుచు ఎట్టకేలకు తిరిగి ధైర్యం
బవలంబించి తండ్రీ! పండు వెన్నెలనుబోలు నా పరబ్రహ్మము
కొరకయ్యే గదా ఋష్యాదులందరు అరణ్యముల కేగి తపం
బాచరించుట, రాజాధిరాజు లందరు సదా నీ పంచ గాచి
యుండుట, జనకాదులు సదానిన్ను స్మరించితరింపగలుగుట

నే నంతటివాడను కాకున్న స్వామీ! నావంటి గుణహీనుని అజ్ఞానుని సుజ్ఞానునిగా జేయవలెనన్న తమకిది యొకకష్టం బైన కార్యంబుకాదు. తండ్రీ! తమ పాదసేవకై వచ్చిన యిందరిలో నే నొక్కండను వెగటైతినా? సర్వసములైన తమరే యిట్లన్న నన్ను జేరందీసి వెరువకు మని యోదార్చి పరమపావనంబైన యీ పయఇయలు నెరింగించువా రెవరని దుఃఖించుచు స్వాములవారి పాదంబులను పట్టినపట్టు వదలక అట్లేయుండగా నంతస్వాములవారికి సిద్దయ్యగారిపైని ప్రేమ గలిగి బిడ్డా! వెరువకుము దుఃఖించకుమని చెప్పి సిద్దయ్య గారిని స్థిరచిత్తునిగా జేసినను ఇంకను సిదయ్యగారికి మనం బున సంశయంబు గల్గియే యుండెను.

—• స్వాములవారు సిద్దయ్యగారికి బ్రహ్మోపదేశము జేయుట •—

శ్రీస్వాములవారి మనంబున ఆహా! యేమి! ఈతని భక్తి ిాపారము. లోకంబున నెందరో భక్తులుండిరి గాని, యింత నిర్మల మానసుండు ఇంత శాంతస్వభావుండు ఇంత గురుభక్తియందాసక్తిగలవాడునాకన్నులకు గానరాడయ్యెను భక్తు అనేకులు నా పాద సరసీరుహంబులను బూజించి నా కృపకు పాత్రులైరిగాని ఇంత శాంతశమదమాది గుణుండు గానరాడయ్యెనని మనంబునందెంచి జాలిం గలిగి సిదయ్య గారిని చేరందీసికొని సిదయ్యగారి ముంగురులను దువ్వుచు సిద్ధా! నీవు భయంబు జెందకుము. దుఃఖించకుము. సుఖ

దుఃఖంబులను రెంటిని నొకటిగా చూడుము. బిడ్డా! పద్మాస
నంబున గూర్చుండు మని చెప్పి హస్తమస్తక సంయోగం
బును జేసి ముఖంబునం దుండు పూర్వపుస్రాలును దుడిచి
నవీనస్రాలు వ్రాసి జిహ్వపై ప్రణవాక్షరంబును వ్రాసి వెన్ను
చరచి బిడ్డా! నీ విక భయంబును వీడుము మాంసపిండం
బయిన నీ శరీరము మంత్ర పిండంబుగా జేసెదనని సిదయ్య
గారి చెవిలో 'ఓం, హ్రీం, క్లీం, శ్రీం నమశ్శివాయ శ్రీవీర
బ్రహ్మేంద్ర స్వామినే నమః' అను బీజసంపుటిగల "పంచా
క్షరీ మహామంత్రమును" బోధించి స్థిరచిత్తునిగా జేసి బిడ్డా!
నేను చెప్పునవి చక్కగావినుడు. నేను జూపింపబోవు లక్ష్య
ములను చక్కగాజూచుచు నికబ్రహ్మానందుడవై యుండుము
సిద్దా! నీవు కించజ్ఞత్వాది గుణంబులుంగల జీవుండవుగావు.
సర్వజ్ఞత్వాది గుణంబులుగ సర్వేశ్వరుండవుగాన నిక నీవు
జూపించబోవు లక్ష్యమును చక్కగా జూడుమని అంతర్ల
క్ష్యమును జూపెను. బిడ్డా! లక్ష్యంబును జూచునపుడు నీ
మనోమారుతముల రెంటినేకంబున నిల్పి సదా పరంజ్యోతి
స్వరూపంబయిన ఆ పరమకళను దర్శించుచుతన్మయుండవై
యుండి బ్రహ్మానందామృతపానంబుజేయుము. నీకు దోచ
కున్న నన్నడుగుచుండుము నీ కేమియు భయంబు వలదని
చెప్పి కొంత సేపటికి స్వాములవారు పూజకు వేళయైనది
గాక నిక లెమ్మని లేవదీసిరి ఇరువురును భోజనంబునకై
గృహంబులోని కేగిరి.

—సిద్దయ్యగారు నిజశిష్యుం డెట్లుండుననియు, నిజగురుం డెట్టివాడనియు స్వాములవారిని ప్రశ్నించుట—

స్వామీ! సద్గురుచంద్రమా! సకల సద్గుణవంతులైన సద్గురువులను సేవించు శిష్యుం డెట్లుండుననియడుగగా, నంత స్వాములవారు బిడ్డా! అధోముఖముగానుండు బుద్ధిని ఊర్ధ్వ ముఖంబునకు ద్రిప్పి నే జెప్పబోవునవి చక్కగా విను చుండుము. శ్రీ గురుసేవా పరతంత్రుండైన శిష్యుం డెట్లుం డుననిన విశ్వాసంబు, గురుభక్తియు, శాంతము మొదలగు కళ్యాణ గుణయుక్తుండయి పాపభీ... ...లవాడై సర్వకర్మ ములన నాచారార్పణముగాచేసి ...పేక్షను గోరక విషయ వర్తనములందు బరాఙ్ముఖుండ... ...డుస్వాములే సాక్ష త్పరబ్రహ్మంబని యెంచి మాయా ...సారిబునందు విరక్తి గలిగి శ్రీ గురుపుంగవు లెచ్చట గలరో యని వారివిఖ్యాతులం దలంచుచు దర్శనాపేక్షుడయి తదీయ గురుస్వామి ధ్యానము సర్వకాల సర్వావస్థలయందు జరుపువా డెవ్వడో అట్టివాడే నిజశిష్యుం డనంబరగు. ఇట్టి పతధర్మం బవలంబించి మోక్ష సక్తుడైన వా డజ్ఞానంబను సంసారమునునశింపజేసి, అహం కార మమకారములు విడిచి, దేహాభిమానంబువదలి, స్వప్న రూపజ్ఞానంబవలంబించి ఐశ్వర్యభోగాపేక్ష మానియర్థకామా దిరాగ ద్వేషాదులను త్యజించి పరతంత్ర ప్రకాశమునుగలిగి అద్వైతంబవలంబించి యనంతరంబున సాత్వికపదగ్రహణుం డై తదుపరి గురుసేవకు బాత్రుండుగావలయు. ఇట్టిశిష్యుండు శ్రీగురుసేవార్హుండై యుండు నని చెప్పగా నంత సిద్ధయ్య

గారు స్వామీ! శిష్యుండట్టి గుణములు గలవాడైన శ్రీ నిజ గురుం డెట్లు లుండునని యడుగగా శ్రీ స్వాములవా రిట్లుల బోధించిరి.

బిడ్డా! న్యాయమార్గ ప్రవర్తకుండును, ధర్మార్థంబు లెరింగి వర్తించువాడను, బుణ్యకర్మలయం దాసక్తి గలవాడును, అహంకార మమకారములు వీడి డంబదర్పాదిగుణములణచి ప్రారబ్ధసంచితకర్మము వలన గలిగిన సంసార సాగరంబును గడప తీవ్రశక్తి గలవాడను, మానావమానంబులకును నిందాస్తుతులకును తగ్గక హెచ్చక ప్రవర్తించువాడును, భూతదయాళుత్వమును బరోపకార బుద్ధి యొప్పి పెద్దభావన లందే మెలంగువాడును శ్రీ గురుండన చెల్లును. కాని అందరకు శ్రీగురునామము చెల్లదని చెప్పగానంత సిద్ధయ్యగారు చిరునగవుతో తిరిగి నిట్లు ప్రశ్నించెను. స్వామీ! సద్గురు చంద్రమా! లోకమునందుగల మానవాళిలో కొందరు జ్ఞానులును కొందరు ఏ మెరుంగని అజ్ఞాలుందురు. వారందరును బ్రహ్మవిచారము చేయవచ్చునా? యని అడుగగా నంత స్వాములవారు బిడ్డా! బ్రహ్మచారి గృహస్థు, వాన ప్రస్త యతి, స్త్రీ, శూద్రుడు వీరిలో నెవ్వరైనను మనోపరిపక్వంబైన యెడల బ్రహ్మవిచారము చేయవచ్చునని రమణ గీత యందును మరియు సంసార దుఃఖ నివృత్తికొర కందరున్న బ్రహ్మజ్ఞానమునకు అధికారులే అనగా బాలుడు,యౌవనుడు వృద్ధుడు, వ్యాధిగ్రస్తుడు, స్త్రీ, శూద్రుడు వీరందరును సమా

నాధికారులని యెరుంగవలెను. ఇదియునుంగాక అజ్ఞానియైన వాడు నేనతికృశుడను, బహు దుఃఖబద్ధుడను, కరచరణములు లేక యశక్తుడనై ఏమియు చేయుటకు సాధ్యముగాని వాడను నేను శూద్రుడను, వైశ్యుడను, క్షత్రియుడను, బ్రాహ్మణుడను, స్త్రీని అని అనాత్మయైన దేహమందాత్మబుద్ధితో గూడి మృగప్రాయులై స్వస్వరూపమైన తన స్థితినిం దెలియక బద్ధులగుచున్నారలు. అజ్ఞానంబను కృష్ణ సర్పంబుచే కాటొందినవారికి బ్రహ్మజ్ఞానామృతంబను ఔషధంబు వినా షట్ఛాస్త్రంబులచేతను పంచవేదముల చేతను అనేక విధములైన మంత్రంబులచేతను సాధ్యము గానటువంటి బ్రహ్మజ్ఞానమును బోధింతుననగా, నంత సిద్దయ్యగారు స్వామీ! నేను బ్రహ్మజ్ఞానము తమచే వినిన జన్మ పావనంబగును యని గదా తమ పాదములకడ చేరినది తండ్రీ! నిన్నటి దినమున జన్మ పావనమును గురించి బోధించితిరే తిరిగి మరి యొకసారి బోధింపుడనిన స్వాములవారు చిరునగవుతో యిట్లని చెప్పిరి.

శ్లో॥ భోగేరోగభయం కులేచ్యుతిభయంవిత్తేనృపాలాద్భయం మానేదైన్యభయం బలేరిపుభయం, రూపేజరాయుర్భయం, సర్వంవస్తుభయాన్వితంభువినృణాంవైరాగ్యమేహ్యభయం॥

తా॥ భోగేచ్ఛ గలిగిన రోగభయమున్ను, జాతి హీనమును, ధనమునకు రాజులవల్లను, చోరుల వల్లను, మానవంతునకు దుర్మార్గులవల్లను, బలవంతునికి శత్రువులవల్లను. రూపవంతునకు అంగలోపాల వలను, శాస్త్రమునకు వాదము వలను,

శరీరమునకు మృత్యువువలను నెటు జూచినను నొకదాని వలన నొక దానికి భయము గల్గుచున్నది. కాని ధృఢవైరాగ్యమువలన నీ ప్రపంచము నస్థిరంబని దెలిసి నిరాశ జెందుటయే "జన్మపావనము" గాన బిడ్డా! మోహామోహ వ్యూహ గాఢాంధకార నిబద్ధంబగు ఈ ప్రపంచంబను మహారణ్యంలో మన్మధుండనియెడు కిరాతకుడు కర్మప్రకృతులను స్నేహితులను గూడుకొని సంసారంబను మెట్టనుండెడి అవివేకియైన జీవుండు హరిణ మను బట్టదలంచి యీషణత్రయంబులను నుచ్చులనొడ్డి సత్వరజస్తమంబులను వలలను బొందుపరచి తాపత్రయములనెడి ఏడుగుంటలు త్రవ్వి పంచేంద్రియములనెడి క్రౄరులుపాతి అరిషడ్వర్గములను శునకములను నుసికొల్పి కాంతా సంగమంబనియెడు వేటమృగమును దాల్చి మమకారమను ధనుస్సున అహంకారంబను బాణమునుదొడగియెదుట నిల్చిన మోహపాశములగట్టి యముండను రాజునకు కానుకగా బెట్టందలంచినాడుగాన అవివేకు లీ మర్మంబెరుంగ జాలక ఎండ మావులవలె గన్పట్టెడు దారాపుత్రుల యందు కూరిమి గలిగి మానవు లతి దుఃఖ మగ్ను లగుచుండుట లోకవిధితముగా నున్న యది. స్వప్నతుల్యులగు పుత్రమిత్ర కళత్రాది బంధువర్గములు నీరాగారంబునంగలసెడు పాంథుంవలె కొద్దిదినములు మాత్రము కూడి మానవులకు భ్రాంతిని గలుగజేయుచుండును. వీరి మాయో వ్యూహములలో జిక్కి భ్రాంతి పడిన మూఢులు కడతేరుట కడు దుర్లభంబు. నిజం బెరింగిన జ్ఞాని సంసార నివర్తియై యుండియు నిమిత్తమాత్ర

ముగా వర్తించుచు తన లక్ష్యంబును శాశ్వతంబైన బ్రహ్మ యందుంచి సుఖదుఃఖములు ఖేదమోదంబులు శరీర సంబంధ మనియు కర్మవశాత్తు సంప్రాప్తమైన నీ శరీరము నైర్లక్ష్య మనియు ఎరింగి అందు లేశమైన నభిమాన ముంచక జ్ఞాని యైనవాడు వర్తించు చుండువా డనిన సిద్ధయ్య బద్ధుండై స్వామీ! నాకు అతి తేలికయయిన మార్గంబునుజూపి సాంఖ్య తారక అమనస్కంబుల బోధించి నన్ను కృతార్థునిగాజేయు డని ప్రార్థించగా నందులకు ముందుగాతారకంబును బోధింప సాగెను.

—౦ శ్రీ స్వాములవారు సిద్ధయ్యకు తారకోపదేశంబు చేయుట.
సిద్దయ్యగారికి పంచ ముద్రలను జూచు విధంబులను తెల్పుట.౦—

సిద్ధా! నీకు ప్రణవపంచాక్షరీ మంత్రంబునుమంత్రార్థ మున్నూ మంత్రప్రభావమున్నూ యిదివరకే తెలిపితినిగదా. ఇప్పుడు నే తెల్పబోవు తారకయోగంబు శ్రవణమనన సన్నిధి ధ్యానములం జేయుము. ఈ దేహమందుండు జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ, అంతరింద్రియ, పంచతన్మాత్రప్రాణాది పంచ వాయువులను స్థూలసూక్ష్మ కారణ శరీరంబులును కామక్రో ధాది దుర్గుణంబులున్ను గెలుచుటకుతారకసాంఖ్యఅమనస్క యోగంబులు ధరించు ముక్తులు ముఖ్యముగా ముందీ యోగం బభ్యసింపవలెను. అందు తారకయోగులు అభ్యాసులు కనుక నే చెప్పంబోవు పంచముద్రల నెరుంగుము. బిడ్డా! నీ వడిగిన తారకమునకు ఖేచరి, భూచరి, మధ్యమ, షణ్ముఖ, శాంభవి

యను పంచముద్రల నెరింగి అభ్యాసవశంబున ఓంకార మందలి చిటి, చిణీ, ఘంటు, శంఖు, తాళ, వేణు, భేరి మృదంగ మేఘనాదంబులను విని జ్ఞానమునో బుద్ధిచిత్తనహం కారంబులను సమిష్టి, వ్యష్టి. భేదముగల ఈశ్వర జీవ చైత న్యంబుల విచారించితే ప్రణవ లక్ష్యార్థంబైన పరబ్రహ్మంబు తాననెడి స్థితి లభించును. కాన నిక పంచముద్రల జూచు విధంబు దెల్పెద చక్కగా వినుము.1) ఖేచరియనగా కనులు దెరచియైనను మూసియైనను భ్రూమధ్యంబున దృష్టి నిల్పి చూచుట 2) భూచరి యనగా నేత్రములు గదలింపక నాసి కాగ్రమున దృష్టిని నిల్పిచూచుట 3) మధ్యమ లక్ష్యమనగా నాసికా మధ్యమందు దృష్టి నిల్పి నంతర్లక్ష్యంబున మనం బును నిల్పిచూచుట 4) షణ్ముఖియనగా నేత్ర రంధ్రములు రెండు, శ్రోత్రరంధ్రములు రెండు, నాసారంధ్రములు రెండు నీ యారు రంధ్రములు మూసి భ్రూమధ్యమందు దృష్టిని నిల్పి చూచుట. 5) శాంభవి యనగా నంతర్లక్ష్యమున మనసునిల్పి బాహ్య దృష్టిగల్గి మనోమారుతంబుల వికారంబు లుడిగించుట శాంభవీముద్ర యనంబడును. బిడ్డా! ఈ యైదు ముద్రలను ముందుగానభ్యసించి పిమ్మట శాంభవీముద్రలను స్థిరపరచవలెను అరకన్నులతో నైనను నిండు కన్నులు మూసియైనను తనలో వెలుంగుచుండెడి పరతత్వ స్వరూపం బును యెరుంగందగు. సూర్య చంద్ర నక్షత్రంబుల యందు "విమలబిందువును" నైక్యంబు గావించి లక్ష్యత్రయంబులచే నొప్పుటయే తారకయోగం బనంబడును. ఆ లక్ష్యంబు లెవ్వి

యనిన, బాహ్య మధ్య అంతర్లక్ష్యంబులను నొప్పుచుండు. సిద్ధా! నీవు మండలత్రయంబుల యందలి ముప్పది యెనిమిది కళల నెరుంగుటకు సాధనములైన అంతర్లక్ష్యముగల ఖేచరి షణ్ముఖ శాంభవీ నీ మూడు ముద్రలను బహిర్లక్ష్యముగల మధ్యమ ముద్రను నీ పంచముద్రలను చక్కగా నెరింగితివి. గాన నీవు పద్మాసనంబున గూర్చుండి సాధనంబు జేసి సాధకాంతరమున తారకయోగంబును జేసికొని పరబ్రహ్మ స్వరూపంబు నెరింగి ధన్యుడవుగమ్ము. ఇంకను లక్ష్యత్రయంబుల విమర్శన నింకొకసారి యెరింగించెద రేపు ఉదయమున మన మందరమును ఉత్తరాది సంచారమునకై యేగవలెను. నీవు సిద్ధముగా నుండుము ముందు మనం చేయు సంచారములో ఒక భక్తుండీ లక్ష్యత్రయములను గురించిప్రశ్నించును అప్పుడు చెప్పెదనని పూజకై స్వాములవారు వెళ్ళిరి.

### శ్రీ స్వాములవారు శిష్యజన సమేతులై ఉత్తరాది గ్రామంబులలో సంచారంబు చేయుటకై బయలుదేరుట—హైదరాబాదులో నున్న నొక విశ్వ బ్రాహ్మణునకు తారకయోగం బగు లక్ష్యత్రయంబును బోధించుట

స్వాములవారు హైదరాబాదునకు నేగ నిచ్ఛగలవారై శ్రీ గురుపీఠంబు తీసికొని తెల్లవారుజామున బయలుదేరి మల్లెపల్లి, పోరుమామిళ్ళ, కలసపాడు, గిద్దలూరు, కంభం, దొనకొండ, మార్కాపురం, నర్సరావుపేట, గుంటూరు, మంగళగిరి వగైరా గ్రామంబులలో నుండుచు భక్తులచే యర్ఘ్య పాద్యాది విధుల పూజింపబడుచు, వారొసంగెడి

కల్పంబులనుగైకొని భక్తుల మనోసంశయంబులను దీర్చుచు బెజవాడకు జేరి అందుండు కృష్ణానదియందు స్నానముచేసి గిరిపైని వెలసియున్న శ్రీ దుర్గాదేవిని దర్శించి యాదేవికి ధూపదీప నైవేద్య తాంబూలాదు లొసంగి అట నైదుదినంబులుండి పయనమై బయలుదేరి ఏలూరు, రాజమండ్రీ, వలంగల్ వగైరా గ్రామాదులలో తిరుగుచు నచ్చటగల భక్తులు ప్రశ్నించెడి అతి రహస్యంబులైన ప్రశ్నంబులకు జవాబిచ్చుచు వారలొనరించెడు సపర్యలకు నానందించుచు తన వెంట వచ్చుచుండెడి భక్తబృందముల సంశయంబులను దీర్చుచు సికింద్రాబాదును జేరిరి. అచ్చట నవాబు దేవిడి వద్దకేగి అందుండెడి చిత్రములను జూచి సంతోషించి ఆ పుర వైభవంబునకు బ్రహ్మానందుడై యట నా దినంబుండిరి. తెల్లవారగనే బయలుదేరి హైదరాబాదు జేరి ముందుగా తన నౌకరును హైదరాబాదు నందుగల విశ్వబ్రాహ్మణులకు స్వాములవారు మీ గ్రామంబున కరుదెంచినారని శ్రీముఖంబులు పంపగా నంత నాగ్రామవాసులైన విశ్వబ్రాహ్మణుల సంతోషంబునకు మేరలేక వారంద రొకచోట జేరి యొక పూలపల్లకిని దెప్పించి మేళతాళంబులతో శ్రీ స్వాములవారి వద్దకేగి సన్మానపత్రము లా స్వాములవారి కొసంగి వారిని పూజించి పల్లకియందా స్వాములవారిని గూర్చుండ బెట్టుకొని యా గ్రామము నాలుగు బజారులలో నుత్సవము చేసి మా గ్రామమునగల షట్శాస్త్ర పారంగతుడైన నౌర విశ్వబ్రాహ్మణుని యింట స్వాములవారిని విడిదియుంచిరి శ్రీ

స్వాములవారికి కావలసిన వస్తుసామాగ్రి నంతయు దెచ్చి, యిచ్చి శ్రీ స్వాములవారిచే తీర్థ ప్రసాదములు స్వీకరించి, ఆ రాత్రి భోజనానంతరంబు షట్శాస్త్ర పారంగతుడైన నా విశ్వబ్రాహ్మణ పండితుడు శ్రీ స్వాములవారి పాదంబులకడ కూర్చుండి, స్వామీ! నాకొక సంశయంబు గలదు. అద్దాని నెందరినో యడిగితిని. కాని వారందరు వాచాజ్ఞానులగుట చేతను, ననుభవజ్ఞానులు గాకుండుటచేతను నా ప్రశ్నంబును సమర్థింప జాలరైరి. తమరు కేవల పరశివావతారులని నా మనంబునకుదోచి నా మనోనిశ్చయంబు తమచేగాని దీరదని దోచెనుగాన, నాయందు పరిపూర్ణ కృపాకటాక్షముంచి నా మనోనిశ్చయంబును దీర్చి నన్ను కృతార్థునిగా జేయుమని ప్రార్థింపగా స్వాములవారు చిరునగవుతో బిడ్డా! నీ సందేహంబు నేనెరుంగుదును. శ్రద్ధతో వినుము నీవడుగదలచినది 'లక్ష్యత్రయంబు' వివరమేకదా! అద్దాని నే బోధించెద వినుమనగా నంత నా పండితున కుండెడి మహదానందంబునకు మేరలేక తండ్రీ! నేను దెలుపం ముందే నా సందియంబును దెల్పితిరిగాన సంతోష స్వాంతుడనయితి నన స్వాములవారు బిడ్డా! వినుము తారక యోగులు అభ్యాసులుగాన వారాచరించెడి యోగంబులకు "లక్ష్యత్రయంబు" అవసరంబు వాని నెట్టుల జూడవలెనో దెల్పెద వినుము. తన పాదంబులకడ గూర్చుండి పాదంబు లొత్తుచుండిన సిద్దయ్యగారిని జూచి సిద్దా! ఇదిగో లక్ష్యత్ర యంబుల వివరంబును చెపబోవు చున్నానను గాన శ్రద్ధగా వినుమని

చెప్పి ప్రశ్నించిన పండితుని వైపునకు తిరిగి నాయనా! బాహ్య మధ్య అంతర్లక్ష్యంబుల నొప్పుచుండు. అందు మొదటిదియైన "బాహ్యలక్ష్యం" బెట్లంటివేని వినుము. బయటి ముక్కుకొనయందు మనోమారుతంబులను కూడికజేసి దృష్టిని కదలనీయక నిల్పియున్న నందు నాలుగంగుళముల మీద నైల్యంబును నారంగుళంబులమీద ధూమ్రంబును యెనిమిది యంగుళంబులమీద రక్తిమమును పండ్రెండు అంగుళంబుల మీద పీత ప్రభయునగు. నీ యెదును పంచ భూతవర్ణంబులై తనకెదుట దోచినపుడు నా అపాంగ దృష్టుల వెనుకకు బార్చి తలమీదికెత్తుచు నిశ్చలబుద్ధిగలవాడై వీక్షింప నందు జంద్ర ప్రకాశంబు దెలియంబడు. మరియును చెవులు, ముక్కులు, నేత్రంబులు నీయారురంధ్రంబులను చేతివ్రేళ్ళ చేత మూసి చిత్తంబందు లీనంబుజేసినందున ప్రణవ నాదంబువినంబడు. మరియును దహరప్రకాశంబును నవరత్న ప్రభలు గానంబడు చుండును ఇవ్విధంబున నాత్మప్రత్యయ ప్రకాశంబైన బహిర్లక్ష్యంబగు. ఇంక మధ్యలక్ష్యం బెట్లంటివేని వినుము.

—• మధ్య లక్ష్యము •—

కంటిపాపల రెంటిని గదలనివ్వక మనంబును భ్రూమధ్య స్థానంబు జొనుపజేసి తన్మధ్యంబున నుండు నతి సూక్ష్మతరంబయిన బిలంబులో ప్రవేశించి యట వీక్షింపగా మెఱుపులును నక్షత్రంబులును సూర్యచంద్రుల ప్రకాశంబును పంచభూత వర్ణంబులును వాయువుతోడ మిళితంబై పరిపరి విధంబుల నంతకంతకు దోపింపజేయుచుండు. ఇదియును

గాక నిరవధికంబగు నాకాశంబును గాఢాంధకారంబైన మహాకాశంబును గాలాగ్ని సదృశంబైన బరాకాశంబును నధిక ప్రకాశంబైన తత్త్వాకాశంబును కోటి రవిప్రభా భాసంబైన సూర్యాకాశంబులను పంచమహాకాశంబులు గాన్పించును ఈ పంచకాశంబులు వీక్షించుచు తన్మయుండయి నిరంకాశాకాశ సదృశుండగును.

— అంతర్లక్ష్యము —

ఇక అంతర్లక్ష్య విధంబెట్లుంటివేని వినుము ప చెప్పంబడిన యగ్ని చంద్రసూర్యుల వ్యాపకంబై పంచభూత వర్ణమిళితమై నాపోజ్యోతి రసంబునకు నాశ్రయంబై తోచు చుండును. ఇట్టి చిహ్నంబులు నేత్రమధ్యంబున బలమాక్షర హైరణ్య సచ్చిదానంద మృతులకు సాక్షి స్వరూపమై బాహ్యాంతరంబుల యందు జూచుచుండు అమృతాంకు రంబులు రెండును స్ఫటిక నైల్యంబుల వర్ణంబులై వాయువు స్థానమందుండి జీవతారకంబను పేరబరగుచుండును ఇవ్విధంబున తారకయోగాఖ్యానంబు ననిశంబును జేయుచుండిన మనంబును వాయువును అంతరంగమందుచలింపక నిల్చిదాని వలన ననుభవ విఖ్యాతంబగు అంతరాత్మ, పరమాత్మ యం దైక్యము జెందుచుండుసని యా పండితునకు స్వాములవారు బోధించగా నా పండితులకు గలిగిన యానందంబునకు మేర లేక బ్రహ్మానందంబునుంజెంది నంతఅందరును నిద్రించిరి. తెల్లవారగానే స్వాములవారిచే మహానివేదనంబు చేయించిఆ హైదరాబాదు నందుగల యాపన్మంది భక్తాదులకు స్వాముల వారి తీర్థప్రసాదంబులను గైకొని వెళ్ళుమని దెలియజేయగా

నంత హైదరాబాదు పురవాసులందరు వేనవేలుగా స్వాముల వారి పీఠంబుకడకు వచ్చిరి. ఆవచ్చిన స్త్రీ పురుషులలో ననే కులు నా పీఠంబుకడకు రాగానే భూతాది గ్రహంబులున్న వారందరు స్మృహదప్పి పడిపోవుచుండిరి. అట్లు జ్ఞాతదప్పి పడిపోయినవారలు లెక్కకు మిక్కుటంబుగనుండిరి. అంతా మితిలేని గోలసాగెను. ఆ వెంటనే స్వాముల వారా పీఠము నుండి లేచి తన వెండి బెత్తంబును ఆనింపగనేవారందరును స్మృహకలిగి సంతోష స్వాంతులై స్వాములవారిని చేరి తీర్థ ప్రసాదంబులను స్వీకరించి గృహంబులకేగిరి. అప్పటి నుండియు స్వాములవారి మహిమలు హైదరాబాదునందుండు వారందరు నమితముగా చెప్పుకొనుచు నతిభక్తి ప్రపత్తులతో నుండిరి. నంత స్వాములవారు మహిమాతి శయంబులు షట్చాస్త్ర పారంగతుడయిన ఆ విశ్వబ్రాహ్మణునిచే నవాబు ఎరింగి శ్రీస్వాములవారిని బిలువనంపి వారి మహిమంబులను జాడవలెనని తలంచి నంత నౌకరులను బిలిచి మీరలు ఒక మేనాను స్వాములవారి వద్దకు గొనిపోయి ఆ మేనాయందు నా స్వాములవారిని గూర్చుండ బెట్టుకొనినాకడకు దోడ్కొని రండిని చెప్పగా వెంటనే యానౌకరులు స్వాములవారివద్దకు మేనాని గొంపోయిరి.

హైదరాబాదు నవాబు స్వాములవారిని బిలువనంపుటకు —నవాబు తెచ్చిన మంచినీటిచే స్వాములవారి పీఠంబుకడ దీపంబు వెలుగునట్లు చేయుట

శ్రీ స్వాములవారు పీఠంబుకడ పద్మాసనా సీనులయి యుండి భక్తాదులకు బోధచేయు సమయంబున నవాబువద్ద



శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి యొద్ద నవాబు
నీటితో జ్యోతిని వెలిగించి స్వాముల
వారి శిష్యకోటిలో చేరుట.

నుండి నౌకరదుదెంచి సలాములుచేసి, స్వామీ! మిమ్ములను మా నవాబుగా రెందులకో పిలుచుచుండిరి. దయచేయుడని చెప్పగా నంత స్వాములవారు పీఠంబుకడనుండి లేచి స్నాన సంధ్యాద్యనుష్ఠానంబుల దీర్చుకొనిభోజనంబుచేసి కొంచెము విశ్రాంతితై నిద్రించి కొంతసేపటికిలేచి నంత నవాబుపంపిన మేనాలో కూర్చుండి నవాబు దేవిడీకడ కరుదెంచిరి. నంతటు ముందుగా నవాబుకడకు నౌకర్లు ఏగి సాహెబ్‌కు సలాంలని చెప్పి స్వాములవారిని దోడ్కొని వచ్చితి మనగా నంత నవాబు వెంటనే సింహాసనంబు డిగ్గి స్వాములవారి కెదురుగా వచ్చి సలాముచేసి స్వామీ ! ఈ యుచితాసనంబున వేంచే యుడని వేడనంత స్వాములవారు చిరునగవుతోనాసీనులైరి. నంత నవాబు వినయ విధేయుండై నిలువంబడి తండ్రీ! తమ వంటి మహాత్ములరాకచే మా వంశమంతయు పావనంబయ్యె. తమరు మహిమాస్పదులని వినుచుంటిని. తమబోటి మహా మహుల ఆశీర్వాదముచేగదా మావంటి వారలు ధన్యులగుటు యని వినయ విధేయుండై వేడగాబిడ్డా! సర్వంబును బ్రహ్మ స్వరూపమే గాని వేరుగాదని ప్రతివారును భావించిన జీవుం డీ సమస్తములోని వాడగుటచే నట్టి జీవుండును బ్రహ్మమే యగుచున్నాడు. అది యెలాగన్న యమృతమును ద్రావిన పిమ్మట నాతండమృతమయుండేగాని వట్టివాడు కాజాలడు. అమృతపానము చేసిన పిమ్మట అమృత స్వరూపంకుండెట్లు కాకుండునో యట్లేసర్వమును బ్రహ్మమని తలంచు వారలు

ంహ్మస్వరూపులు గాకుండనుండరు కావున నీవు సర్వస
ుండవు గావున నీ పీ రాజ్యంబును బాలించు చుంటివని
్వాములవారు చెప్పగానంత నవాబు స్వామీ! నాకొక కోరిక
అదు. నా కోరికను దీర్చి నాకు సంతోషంబును కూర్చుమని
ౌడుకొనగా నంత స్వాములవారు బిడ్డా! నీ కోరిన దెద్దియో
ంతో నీవు చెప్పపనిలేదు. ఈ విషయంబును నీ వూహించు
కు ముందుగనే నే గ్రహించితిని. కాన నీ విప్పుడే సింహాస
ంబు డిగ్గి నీ యిచ్చవచ్చిన బావిలోని నీరును ఒక చెంబు
ండా తీసికొని నా వెంటనే యరుదెంచి పీఠంబువద్ద నున్న
యిష్టంబైన ప్రమిదలో బోయుము లేకున్నచో నూతన
పమిద దెప్పించి పీఠమ్మకడనుంచి యా ప్రమిదయందు వేసి
ౌలిగించుము. నిరభ్యంతరంబుగా వెల్గునని చెప్పగా నవాబు
కు నాశ్చర్యంబు గలిగి, నా మనంబునం దలంచినట్లుగానే
్వాములవారు నేనుచెప్పకముందే నాసంకల్పంబును దెల్పిరి.
ఈ మహాభాగేయుడు భవిష్యత్తెరింగిన భగవంతుడని నా
ునంబునకు దోచుచున్నది. అయిన నీ పుణ్యాపురుషుండు
ప్పినట్టుగానే చేసి చూచెదనని నీటిని దెప్పించి స్వాముల
ారున్న పీఠంబుకడ కరుదెంచి పీఠంబునకు. సలాములుచేసి
ాను దెచ్చిన క్రొత్తప్రమిదలో తాను దెచ్చిన నీరునుబోసి
ానే దూదిని తెప్పించి వత్తినిజేసి యా వత్తిని మంచినీరు
ోసిన ప్రమిదయందు వేసి వెలిగించగా నచటనున్న యన్ని
పంబులకన్నను "నీటిచే వెలిగించుచున్న దీపమే"యెక్కువ

కాంతిగలదై వెలుగుట నవాబు చూచి అపరిమిత సంతోష స్వాంతుండై అంతట్టి స్వాములవారిని స్వామి పాదసేవ చేయుచున్న సిద్దయ్య గారిని ఈ యిరువురును నెక్కుడుగా సన్మానించి ఆ రాత్రి స్వాములవారికి యూరేగింపు చేయించి వారిని తన దేవిడికి గొంపోయి వారికి భోజనాది వసతులను జేయించి స్వాములవారిచే తీర్థప్రసాదంబులను బుచ్చుకొని ముకుళిత కరకమలుండై మహాత్మా! తమరు భవిష్యత్తెరిగిన భగవత్స్వరూపుండ వని వినియున్నాను. నా నిజంబు నే జెప్పక పూర్వమే నా మనంబునంగల కోర్కెను దెల్పితిరి. సామాన్య మానవులెట్లు గ్రహింపగలరు. గాన నా రాజ్యక్షే మంబులు తెల్పుమని వేడగానంత స్వాములవారునవాబునకు కాలజ్ఞానం బిట్లు దెలిపెను.

——౦ నవాబునకు స్వాములవారు కాలజ్ఞానమును బోధించుట ౦——

బిడ్డలారా! పాపభూయిష్ఠంబైన యీ ప్రపంచమునకు దుష్టశిక్షణ శిష్ట పరిపాలనంబునకై శ్రీ వీరభోగవసంతావ తారుండనై నేను వచ్చుటకు ముందుగా కొన్ని యుత్పాతం బులు పుట్టును. అవి యెవ్వియనిన, కాశీయవతల గండకీ నది యందు సాలగ్రామములు నృత్యమాడేను. ప్రజలతో మాట్లా డేను. లక్ష్మిదేవి నావెంటనేవచ్చేను. మహాలక్ష్మమ్మ ఇతరులను విలపింపజేసేను. ప్రయాగతీర్థమందుభక్తులునిలిచేరు.సరస్వతీ దేవిని అంగడిపెట్టుక అమ్మేరు. ముందు కొంత కాలమునకు ముస్సీనది పొంగి ఈపట్నమంతయు నష్టపెట్టేను. పిమ్మట నీ వంశీయు లిరువురు నీ పట్నంబును తిరిగి పునరుద్ధరణచేసి



బ్రహ్మంగారు హైదరాబాదు నవాబుకు కాలజ్ఞానము బోధిం[illegible].

అభివృద్ధికి దెత్తురు. నీ రాజ్యమున నుండి యరణ్యంబులన్నియు ఫలవంతములగును. శ్మశాన భూములయందు భక్తులుండెదరు. పల్లెలు పట్నాలగును. చంద్రమతీదేవి కళలు దొలగేను. కొల్లాపూరి వాకిటముందర నిలచేను. చిరుకుత్తి పన్నెండామడ పట్నమయ్యేను. వినుకొండకు పడమర భాగమందు ఎనిమిది పుట్ల వరహాలుతీసి కోమట్లకిచ్చేరు ఉప్పుమాగులూరులో వుత్పాతములు పుట్టేను. వసనైన నరులంత నిలచేరు. అద్దంకి నాంచారమ్మ నరులతో మాట్లాడేను దేవ రహస్యాలు దెలిపేను. ఇదియునుంగాక కావేరి కొల్లడం వుప్పొంగేను. అమృతం సముద్రంలోవుప్పొంగేను. అదియే నా రాకకు మీకు నిదానము. శ్రీ రంగనాయకులవద్ద మేలయిన వాక్యములు వినబడేను. స్త్రీలు పర పురుషులతో గూడి ఆభరణములు, వస్త్రములు తెమ్మనమనేరు ఇదే మీకు గుర్తు. తన్ను తానైనటువంటి జ్ఞానము తెలిసికొనియున్న రాజయోగులకు నా దర్శనమయ్యేను. తతిమ్మాదుష్టులురాక్షస గుణములుగలిగి దూతలవలె అక్రమముగామాట్లాడేరు. సువర్ణ ముఖియందు పదిమంది మహాత్ములు బుట్టేరు. అప్పుడు నాయుడుపేటలోనున్న ధనమంతాతొలగిపొయ్యేను. ముందు ముందు బంగారం ముత్యమంతయైనాదొరకకుండేను. తూర్పు దేశమంతా నవనాగరికతగలిగి తిరిగి ధనహీనులై దరిద్రులై పోయేరు ఇత్తడి బంగారమంత ధర గలిగియుండేను. కొండవీటి సీమయందు గుణవంతులుండేరు. బంగాళాదేశము ప్రబలమై ప్రజలందరును జలమునందున జీర్ణమైపోయేరు.

ఇరవై అయిదుగురు అక్కాచెల్లెండ్రు ఏకముఖులై దుర్గా కళ్యాణము చేయవచ్చును. కొంకణ దేశములో గోవుల వలన మోక్షానికి అధికారులయ్యేరు. మళయాళ పశ్చిమ మహా రాష్ట్రి కర్ణాటకదేశం నా నాలుగు దేశాలలో నా స్వరూపం తెలిగినవారు సాయుజ్యమును బొందుదురు. కులగోత్రంబులు వదలి వివాహము జేసేరు. జాతి భేద వర్ణాశ్రమంబులు లేకుండా నడిచేరు. ఇట్లే అనేక విపరీతములు నా రాకకు ముందు జరిగేను. కాన నీవు సదా నన్నే మరువక స్మరింపు చుండుము. నీ జీవితపర్యంతము నీకు సుఖంబుగా నుండును. నీ వంశజులుకూడా సుఖంబుగా నుందురని చెప్పి కొన్ని దేవ రహస్యంబులు బోధించి ఇక నా పీఠంబుకడకు నేగెద నని స్వాములవారు చెప్పగా నంత నవాబు శ్రీ స్వాములవారిని, సిద్దయ్యగారిని, ఎక్కువగా గౌరవించి కొన్ని బిరుదులొసంగి ధన కనక వస్తువులొసంగి ఆరాత్రి శ్రీ స్వాములవారికృపకు పాత్రుండాయెను. అంత నవాబు నాశీర్వదించియచ్చటనుండి బయలుదేరి పీఠంబుకడ కరుదెంచిరి. అంత నా షట్శాస్త్ర పారంగతుడైన యావిశ్వబ్రాహ్మణుడు శ్రీ స్వాములవారు సిద్దయ్యగార్ల సత్ప్రేమతో గౌరవించి ఆయనయు నా రాత్రి శ్రీస్వాములవారి కృపకు పాత్రుడాయెను. అంత తెల్లవార గనే ప్రయాణమగుదమని యా పండితునితో జెప్పి ప్రయాణ సన్నాహులై సిద్ధపడిరి. ఆరాత్రిఅచ్చటనేనిద్రించిరి. పిమ్మట తెల్లవారగానే శిష్యజన సహితుండై హైదరాబాదు నుండి బయలుదేరి ఇదివరలో స్వాములవారు మకాంచేసిన గ్రామా

దులను తప్పించి నూతన గ్రామంబులలో మకాములం జేయుచు బెజవాడకు చేరిరి. యా బెజవాడయందుగల కృష్ణా నది యందు స్నానం బాచరించి తన యిష్టదైవంబగు శ్రీ దుర్గాంబాదేవిని దర్శించుకొని యా మహాదేవికి ధూప దీప నైవేద్య తాంబూలంబు లొసంగి ఆ దేవిగుడి యందే అయిదు దినంబులుండి యటనుండి బయలుదేరిరి

## షష్ఠమ ప్రకరణము

శ్రీ స్వాములవారు దక్షిణ దేశంబున సంచారము చేయ బయలుదేరుట.

శ్రీ స్వాములవారిని, సిద్దయ్యగారిని నవాబుఅనేకవిధంబులుగా గౌరవించినందుకు తక్కిన భక్తాదులందరికీ సిద్దయ్యగారియందు ఈర్ష్యగలిగి సిద్దయ్యమనయందరికన్న నెక్కుడు భక్తి ప్రపత్తియందునగాని, శ్రీగురుసేవయందునగాని, యోగముల నభ్యసించుట యందునగాని యెక్కుడు గాకున్నను ఎట్లైనను ప్రతివారును స్వాములవారిని, సిద్దయ్యగారిని గౌరవించుచు మనలను దలంచెడి వారొక్కరును గానబడకుండిరి. సిద్దయ్యగారి కన్నను మనము గౌరవనీయులుగా నుండెడి సదుపాయంబు చూడకున్న నిక మన మెందులకును బనికి రాని వారవుగుద మని వారిలో వారనుకొనుచుండుట శ్రీ స్వాములవారు చక్కగ విని తలయూపి 'ఓహో! ఇదియా సిద్దనిపైన వీరందరికుండినయీర్ష్యాభావము? ఒకసారి సిద్దని యొక్క భక్తి ప్రపత్తి వీరందరికిని జూపిసగాని వీరందరకు నుండెడి గర్వంబు లడగ''వని మదిలో దలంచివారలనేమియు

మందలించక వినిమాత్ర మూరకుండేను. ఆ భక్తాదులందర కును సిద్దయ్యగారిపై నెంత యీర్ష్యయుండినను వారలందరు నేమియు చేయజాలరైరి. అంత బెజవాడ నుండి బయలుదేరి తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, కాళహస్తి వగయిరా గ్రామాదుల యందు దిరుగుచు నచ్చటచ్చట గల భక్తులను పవిత్రులనుగా జేయుచు, తిరుపతికి చేరిరి. అచ్చట గల పుణ్యతీర్థంబులలో స్నానంబులు జేయుచు అచ్చటచ్చట గల గోపుర ప్రాకారంబులను దిలకించుచు నందుండెడు మూర్తులను సేవించుచు నా తిరుపతియందు ఎగువదిగువలను గూడ నైదు దినంబులుండిరి. తెల్లవారగనే యటనుండి బయలుదేరి కడపకురావలెనను కుతూహలముతో బయలుదేరి ఆ యరణ్య భూములన్నియు దిలకించుచు మధ్య మధ్య మకాములు చేయుచు వచ్చుచుండిరి

శ్రీ స్వాములవారు వచ్చుచుండెడి మార్గమధ్యంబున తన మహిమచే లుకలుక లాడుచుండెడి పురుగులతో నిండియున్న ఒక శునకంబు నుండునట్లు చేయుట – సిద్దయ్యగారు భుజించుట–శిష్యజన గర్వభంగము.

శ్రీ స్వాములవారు ఆ మకామునుండిబయలుదేరి శిష్య జన గర్వాపహారము చేయుటకు మనంబున నిశ్చయించి శ్రీ స్వాములవారు తన మహిమచే వారరుదెంచుచుండిన మార్గ మధ్యంబున చనిపోయిన శునకముండునట్లు చేసెను. ఆ శునక శరీరమంతయు జీర్ణించి పురుగులతోలుకలుకలాడుతూ నమిత దుర్గంధ యుతమైయుండెను. ఆ దుర్వాసన వీరంద

రకును ఒక మైలు దూరంబుండగనె నాసికా రంధ్రములు బ్రద్దలగునా యనునట్లు ఆభక్తులందరకు నా దుర్వాసనవచ్చు చుండెను. చెడువాసనకు సహింపలేక ముక్కులుమూసుకొను వారును, అమిత అసహ్యపడువారును ఈచెడువాసన ఎచ్చటి నుండి వచ్చుచున్నదని యసహ్యపడుచునట్లే వచ్చుచుండిరి. శ్రీ సిద్దయ్యగారు సుఖదుఃఖ శీతోష్ణములు సమంబుగా జూచు వారలు గాన ఆయనకేవిధంబైన దుర్గంధముగా గనుపించక శ్రీస్వాములవారెలా వచ్చుచుండిరో అలాగే వచ్చుచుండిరి. వీరందరును రాను రాను చచ్చిపడియున్న శునక సమీపంబు నకు రాగా స్వాములవారు తనతోవచ్చిన శిష్యబృందమందరి నచ్చటనే నిలువుండమని నాజ్ఞాపించెను. అంతనాశిష్యులంద రును నిలువంబడిరి. పిమ్మట శ్రీసిద్దయ్యగారిని తక్కతక్కిన శిష్యులందరిని జూచి బిడ్డలారా! మీ రందరును మనోనిశ్చ యముగలవారమనిన్ని పెద్దకులమువారమనిన్ని కేవల గురు సేవాదీక్షాపర తంత్రులమనిన్ని మీలో మీ రనుకొనుచుండగా నేను వినియుంటిని. మీ రందరును సిద్దని చులకనగా జూచు చుండిరి. మీరందరును సంశయమను త్రాటినిగోసివేసి మీ ధనమాన ప్రాణంబులు గురునకు కానుకగా నొసంగియుంటి రేని మీరు నిజముగా గురుసేవా దీక్షాపరతంత్రులైతిరేని మీర లందరు చనిపోయిన ఈశునకంబును భక్షింపుడు. సంశయిం పకుడని స్వాములవారు సెలవియ్యగా నంత నా శిష్యబృంద మందరి మొగంబులు వెలవెలబారి వారివారి మనసులలో నిట్లని తలచు చుండిరి. ఈ దుర్గంధమునకే సహింపజాలక

ఎప్పుడీ శునకంబునుదాటి యావలకు బోదుమా యని మా మనంబులు పరితపించుచుండగా శ్రీస్వాములవా రిప్పుడీ శున కంబును బక్షింపుడని యానతిచ్చిరి. మనము స్వాములవారి యాజ్ఞను మీరుదమా. గురువాజ్ఞను మీరిన వారమగుదము. భక్షించెదమాయనిన దుర్గంధ యుతమైన యీ శునకమును జూచుటకైనా మనంబొప్పకయున్నది. "ముందుకు బోయిన గొయ్యి వెనుకకు బోయిన నుయ్యి" అనెడు సామ్యంబుగా మన స్థితియంతయు నిట్లుండెను నేడు మన మనోనిశ్చయం బును పరిశీలించుటకై స్వాములవారి ట్లానతిచ్చిరి. నేటికి గురువాజ్ఞను మీరిన గురుద్రోహుల మైతిమని ఒకరితో నొకరు జెప్పుకొనుచు పరిపరి విధంబుల నాలోచించు కొనుచు పిచ్చి వారివలె స్వాములవారికి తిరుగు జవాబేమియుం జెప్పుటకు నోరాడక నిర్విణ్ణులై యూరక నిలువంబడియుండిరి స్వాముల వారు బిడ్డలారా! మీ బుద్ధులకేమి తోచెను? తిరిగి మీరే మియు జవాబును చెప్పక యూరకుంటి రేమని అడుగగా స్వాములవారికి తిరుగు చెప్పుటకు నొకరికయినా నోరాడక మొగంబులు చిన్న బుచ్చుకొని కూర్చొని యుండిరి అంత సిద్ధయ్యగారు లేచి శ్రీ గురుసార్వభౌమా! యీ మీ పాద రేణువుతనుమన ధనంబులు తమకుకానుకగా నొసంగిన యీ మీ పాదసేవకుడు, తమరు అగ్నిలో దుముకుమన్నను దుము కుటకు సంసిద్ధముగా నున్న యీ మీ బిడ్డకు తమరు నా సోదరుల కొసంగిన ఆజ్ఞను నేరవేర్చుటకు సంసిద్ధముగా నున్నాడు. తమ పరిపూర్ణ కృపాకటాక్ష వీక్షణంబులు నాపై

జొనిపిన నీ శునక భక్షణమననెంత ? నాకా శునకభక్షణకై సెలవొసంగుడని ప్రార్థించగా నంతస్వాములవారు నాయనా! నీ సామర్థ్యంబును నే నెరుంగనిదిగాదు. కావున అమృత తుల్యంబుగా భక్షింపుమని సిద్దయ్యగారి వీపుపై తన హస్త ముతోదువ్వెను పిమ్మట సిద్దయ్యగారు స్వాములవారికి శిర స్సాష్టాంగ దండప్రణామంబు లాచరించిదుర్గంధ యుతమైన యా శునకముకడ గూర్చుండి "లుకలుకలాడు పురుగులను" దోసిలితోదోసెడుతీసికొని "యేతత్సర్వంబు శ్రీవీరబ్రహ్మేం ద్రార్పణ"మని పుచ్చుకొనసాగెను. సిద్దయ్యగారుతన మనం బున యేహ్యమనిగాని దుర్గంధ యుతమైనదనిగాని తలంచక అమృత తుల్యంబుగా నొక్క నిముషంబులోనాశునకము నం తయు బుచ్చుకొనెను. అంత తక్కిన భక్తబృంద మందరును మొగంబులు చిన్నబుచ్చుకొని "నిలువంబాతిసకొయ్యబొమ్మల వలె" నిర్విణ్ణులై నిలువంబడి యుండిరి. అంత సిద్దయ్యగారు తృణప్రాయంబుగా నావగింజంతయైనను విడువక భక్షించి తిరిగి స్వాములవారి పాదంబులకు నమస్కారంబును జేయు నపుడు స్వాములవారు సిద్దయ్యగారి శిరంబుపై తన హస్త ముంచి 'చిత్తశుద్ధోభవ' యని దీవించి తక్కిన భక్త బృంద మును జూచి యేమోయీ బిడ్డలారా ! ఇప్పుడైనా మీ మనం బులలోగల సందియంబులు దీరెనా? ఇంకనుదీరలేదా? సిద్దం డనిన మీ రేమని తలంచు చుంటిరో ? గురుసేవా దీక్షా ప్రసిద్ధుడు. ఈతని భక్తి అపారము. నన్ను నమ్మి సేవించు భక్తబృందంబున కందరకు "శిరోరత్నము" వంటివాడు.



సిద్ధయ్య గారు స్వాముల వారి
ఆజ్ఞ ప్రకారము శునక
మాంసంబును భక్షించుట

యీతండు కేవలం మనోనిశ్చలుండు శ్రీజగద్గురు కరుణగల వాడు. బిడ్డలారా! సిద్ధు[illegible]మందుగల భక్తి ప్రపత్తులు మనో నిశ్చయమును తేటతెల్ల[illegible]య్యెనుగదా? యని స్వాముల వారు చెప్పగానే అ[illegible] [illegible]క్తులందరు స్వాములవారి మహి మలున్నూ, సిద్దయ[illegible] [illegible]ృఢజ్ఞానమున్నూ, భక్తి ప్రప త్తిన్నీ పెక్కు విధ[illegible] [illegible]యాడి యచ్చటనుండి అంద రును బయలుదేరి కొం[illegible] దూరము వచ్చిన పిదప నా త్రోవ యందున్న నొక గొప్ప వృక్షపునీడ నందరును విశ్రాంతికై గూర్చుండి యుండగా సిద్దయ్యగారు స్వాములవారి పాదం బులకడ గూర్చుండి స్వామీ! నాకు సాంఖ్య సూత్రంబును బోధింపుడని వేడగా నాయనా సిద్దా! ఇచ్చట నొక ఘూము లోపల నొక యద్భుతము జరుగనున్నది. గాన నిప్పుడా సాంఖ్యంబును బోధించుటకు సమయంబుగాదు. మనము మర ప్రవేశమైన పిదప బోధించెదను. అందరును విశ్రమింపుడని జెప్పగా యరందరును నిద్రించిరి గాని స్వాములవారును సిద్దయ్యగారును మాత్ర మేదియో కొన్ని విషయంబులను మాట్లాడుకొనుచు అట్లే కూర్చుండి యుండిరి.

పతివ్రతయైన నొక బ్రాహ్మణ స్త్రీ కుష్టువ్యాధి గ్రస్తుడైన తనభర్తను
తొడపై పరుండబెట్టుకొని దుఃఖించుట— బ్రాహ్మణుని కుష్టు
వ్యాధిని స్వాములవారు తన మహిమచే పోగొట్టుట.

శ్రీ స్వాములవారు కూర్చుండియున్న వటవృక్షము క్రింద కుష్టువ్యాధి గ్రస్తుడైన యొకబ్రాహ్మణుడు తనభార్య తొడపై పరుండి హా పరమేశ్వరా! దీనబంధో! ఆర్తత్రాణ

పరాయణా! ఆర్తుడనయి నే విన్నవించుకొను దీనాలాపంబు లాలకించి నన్ను త్వరలో నీ యందైక్యమగునటుల చేయ రాదా! ఓ కర్మదేవతా! నీవు ప్రవేశించిన హరిహరాదులేదు అట్టిట్టులగుదురు. నేనన నెంత? పిచ్చుకపై బ్రహ్మాస్త్రంబు వేయు చందమున నావంటి పరపర దౌర్భాగ్యుడినేనా నీవు కష్టపెట్టుట? తల్లీ!కర్మదేవతా! ఇంతటనయినను నన్నువదలి వెళ్ళరాదా? నీ వెంత దొడ్డదానివమ్మా! తల్లీ నీ కిదే పది వేల వందనంబులు. నన్ను ఇంకను కష్టపెట్టకు. ఇంద ఫ-ంప జాలనని కర్మదేవతను దలంచి దుఃఖించుచు భార్యను జూచి కాంతా! చీము, నెత్తురు చిమ్ముచున్నను, నీగలు, దోమలు ముసురుచున్నను నన్ను యేహ్యంబుగా జూడక నీ వీపున గట్టుకొని సర్వక్షేత్రంబులుసర్వతీర్థంబులు, సేవించి నీవెంత శ్రమించినను నేను పూర్వజన్మంబున జేసిన మహాఘోర పాపంబుచే నీ జన్మంబున నా కీ యవస్థ సంఘటిల్లినది. ప్రేయసీ! ఈ మహాఘోరారణ్యంబున నన్ను నీ వీపుననే గట్టుకొని దిరుగుచుంటివి గదా! నన్ను గురించియేగదా నీవు బడరాని యిడుములను బడుచునెన్నెన్నియో శ్రమలను పడు చుంటివి. అయ్యో! కాంతా! అతి సుకుమారివైన నీకు వేళకు దినుటకు అన్నంబును,ద్రాగుటకునీరును, కట్టుటకు సరియైన వస్త్రంబైనలేదే? ప్రాణపతీ! నీ కష్టంబులను నేను జూడజాల నా ప్రాణంబులైనను బోయిన బాగుండుననిమూర్ఛపోవగా అంత నా పతివ్రత కేమియు దోచక భోరున పెద్దపెట్టున నేడ్చుచు నీగలు, దోమలు, చీమలు క్రమ్ముకొని దుర్గంధ

యుతమై చీము నెత్తురు కారుచు తనతొడపై పరుండియున్న భర్త కన్నుల నీరును తన పైట చెంగుతో తుడిచి నాథా! నాథా! కన్నులు తెరువుము. మీరేల నాకై విసుగునంది దుఃఖించెదరు? నాథా! నాకెన్ని కష్టంబులు నావహించినను మీరు సుఖంబుగా నుండిన గదా నాకు శ్రేయస్కరము. మీరు లేకున్న నా జన్మంబు వ్యర్థంబుగదా? అయ్యో! జీవితేశా! ఆయాసంబుగా నేత్రంబులను మూయుదురే? భోజనకాల మతిక్రమించుటచే క్షుత్పిపాసలచేశోషనుజెందితిరా? అయ్యో! అయ్యో! నేనేమి చేయుదును? నోరెండి పోవుచున్నదే! దగ్గరజలంబైనను లేదే? దయామయా! దయయుంచి త్వరలో నరుదెంచి నా జీవితేశుని కష్టంబును దీర్చుము. ఓ గరుడ గంధర్వయక్ష సిద్ధులారా! నానవమోహనాంగుని రక్షింపుడు. యో బ్రహ్మ విష్ణు మహేశ్వర యింద్ర సూర్యులారా! మీ రయిన కటాక్షింపుడు. అయ్యో! ఒక్కరైనను నా మొరాల కించు వారులేరే? నేనేమి చేయుదును? దీనరక్షకా! తండ్రీ! మన్నాథుని కష్టంబును వారించు వారెవ్వరును లేరైరిగదా! నాకు నోరెండి జిహ్వలాగుచున్నది. పరమేశ్వరా! మమ్ముల నుద్ధరింప నీవు దక్క మరి యెవ్వరునులేరని మూర్ఛపోయి పరుండగా నీ ఇరువురి రోదనధ్వనిని స్వాములవా రాలించి బిడ్డా సిద్దా! మన సామీప్యంబున నెచ్చటనో స్త్రీ పురుషు లిరువురి రోదనధ్వని వినబడుచున్నది. యాధ్వని మనమిచట కరుదెంచినది మొదలుగా వినబడుచున్నది. కాని ఇప్పుడేమి యును వినబడుటలేదే? కారణంబేమైయుండునో తెలిసినదా

యని యడుగగా నంత సిద్దయ్యగారు స్వామీ! మన మిచటి
కరుదెంచగానే యొక్క ఝాములోపల నొక యద్భుతంబు
జరుగనున్నదని తమరే సెలవొసంగితిరే తండ్రీ! నీ పెరుం
గని విషయంబు లీ ప్రపంచంబున నెవ్వియున్నవని చెప్పగా
నంత స్వాములవారు బిడ్డా! పరుండియున్నవారలనులేపుము.
మనమందరమును గలిసి ఆ రోదన ధ్వని యెచ్చటనో కను
గొందుమని చెప్పగా సిద్దయ్యగారు వారందరిని లేపుకొని
స్వాములవారును వారందరు కలసి మూర్ఛబోయి పరుండి
యున్న కుష్టుబ్రాహ్మణుని వద్దకేగి అమ్మా! మహాపతివ్రతా
శిరోరత్నమా! ఏల యిట్లు ప్రలాపించి మూర్ఛ వోయెదవు?
లెమ్మని యనగా యా యమ్మ కన్నులుదెరచి తన తొడపై
పరుండియున్న తన భర్తను తిన్నగా లేవదీసిపరుండబెట్టి
లేచి స్వాములవారికి నమస్కారములుచేసి స్వామీ! మమ్ము
లను రక్షింపసాక్షాత్కరించిన దేవల పరబ్రహ్మవతారుండవని
తోచుచున్నది. మా యవస్థ యంతయు తమతో మనవి
చేయుటకు మేమిరువురము క్షుత్పిపాసలచే దస్సియుండుటచే
జెప్పజాలకుంటిమని నిట్టూర్పుతో నేలపైబడి కూలబడగా
స్వాములవారు వెంటనే తనచేతనున్న ఫలంబు నామె కిచ్చి
తల్లీ! ముందీఫలమునుభక్షించి ఆవల వృత్తాంతమును దెల్పు
మని ఫలంబీయగా నాయమ్మ ఫలంబు పుచ్చుకొని స్వామీ!
ఈ లోకంబున భర్తను దృప్తిపరచిగదా యావల యువతులు
భక్షింతురు. మద్భర్త యీ కుష్టువ్యాధిచే గల్గు బాధయుగాక
క్షుత్పిపాసలచే దస్సి పరుండియున్న మద్భర్తను విడచి



బ్రహ్మంగారు వారిని రక్షించుట



కుష్ఠు వ్యాధితో బాధపడు దంపతులు విలపించుట.

ముందుగా నేనెట్లు భుజింతును? తమరు ఆర్తత్రాణపరాయణు లైతిరేని మత్భర్తను రక్షించి పిదప నన్ను రక్షణచేయుడని వేడి మూర్ఛపోగా నంత స్వాములవారు దయాళులై కుష్ఠు బ్రాహ్మణునివద్ద గూర్చుండి యాయన మొగంబుపై నుండి పాదంబుల వరకును స్వాములవారి అమృత హస్తంబుచే దుడుచువరకా బ్రాహ్మణుని కుష్ఠువ్యాధి యంతయు బోయి అమితబలము గలవాడై దిగ్గున లేచి కూర్చుండి తనశరీరము బరికించి చూచుకొన యా బ్రాహ్మణుని కున్న సంతోషంబు నకు మేరలేక బ్రహ్మానందుడై మూర్ఛపోయి పడియుండిన భార్యను దిలకించి కాంతా! కాంతా! లే లెమ్ము. మనపూర్వ జన్మ ఫల సుకృతంబుచే నైదుగురిలో నెవరో ఒకరు మాన వుడై వచ్చెను చూచుటకునతియేహ్యంబుగానుండి దుర్గంధ యుతమైన నా శరీరము సుగంధ వాసనచే నమిత బలము గలిగి పునశ్శరీరంబైనది వీరిని దర్శించి పూజించిన కడు ధన్యుల మయ్యేదము ఇక మూర్ఛనుండి లెమ్మనగా నంత నా పతివ్రత తన భర్తను దిలకించి పెన్నిధింగన్న పేదవాని చందంబున సంతోషస్వాంతయైన తన భర్తను శ్రీస్వాము లవారి పాదంబులపై బడుమని చెప్పి యామెయు శిరస్సా ష్టాంగ దండప్రణామంబు లాచరించగా వారిరువురను "ఆయు రారోగ్యైశ్వర్యాభివృద్ధిరస్తు శీఘ్రమేవ సుపుత్రా ప్రాప్తి రస్తు శీఘ్రమేవ సర్వవిద్యాప్రాప్తిరస్తు" అని దీవించి బిడ్డ లారా! లెండు. మీ గ్రామంబెయ్యది? మీ కులంబెయ్యది ? యెన్నిదినంబులనుండి వ్యాధియున్నదనియడుగగానంతవారి

రువురును లేచిస్వామీ! మాది పుష్పగిరి అగ్రహారము మేము బ్రాహ్మణులము. ఈ మహామహుండైన మద్భర్తకీ వ్యాధి సంభవించిపదిసంవత్సరంబులైనది. అప్పటినుండియు నీయనను వీపునంగట్టుకొని తీర్థయాత్రలెన్నియోతిరిగితిని. ఎన్నెన్నియో వైద్యంబులు జేయించితిని. దేశదేశంబులుం తిరిగితిమిగాని యీ వ్యాధి కుదరదయ్యెను. తుదకు మా పాలిటి పెన్నిధానంబుపై యరుదెంచి మమ్ములనుకృతార్థులనుజేసితిరని అతివినయవిధేయురాలయి వేడుకొనగా నంత స్వాములవారు చిరునగవుతో తల్లీ! పతివ్రతయను సార్థకనామమునీకే చెల్లినది. అమ్మా! ఇక మీవూరికేగుడని చెప్పగా నంత నా పతివ్రత తండ్రీ! భక్తవత్సలా! మే మురువురమును మీ పాతసేవజేయుచు తమ పాదంబులకడనే యుందుము. మా ప్రార్థన నంగీకరించి తమివెంటనే గొనిపొండని వేడుకొనగా స్వాములవారు తల్లీ! నీకు పుత్రపుత్రికా సంతానప్రాప్తియు నీ భర్త మీగ్రామంబునంగల బ్రాహ్మణులందరికన్నను విద్యయందు నెక్కువ ప్రవీణుడై యుండవలసిన యోగంబున్నదిగాన నిక నాలస్యంబున క్షేమముగ నింటికేగుడనిచెప్ప వారిరువురకును స్వాములవారిని వదలి గృహంబునకు బోవగాళ్లు రాక తిరిగి తిరిగి చూచుచు బోవువారినితిరిగిస్వాములవారు పిలిచి అమ్మా! నీవు సంశయించుచునే నీ గృహంబునకు నేగుచుంటివి. మేము కొలది దినంబులలో మీగ్రామము మీదుగా వెళ్ళవలసిన పని యొకటి యున్నది. అప్పుడు

మీ గృహంబున కరుదెంతుము. నేను మీ గ్రామంబున కరు దెంచిన యప్పుడు నొక గొప్ప యుత్పాతంబు పుట్టనున్నది. కాని మీ కేమియు హాని కలుగదని చెప్పగా నా పతివ్రత తండ్రీ! మాకు పరతత్వోపదేశంబుచేసి పవిత్రులను జేయు మని ప్రార్థించగా తల్లీ! నీకి సందియ ముండుటచేతనే తిరిగి చూచుచు వెళ్ళుచుంటివని గ్రహించిపిలచితిని. రండని చెప్పి వారిరువురునకు ఓం, హ్రీం, క్లీం, శ్రీం, నమశ్శివాయ, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామినేనమః అని మహామంత్రోపదేశంబు చేసి బిడ్డలారా! ఈ మహామంత్రమును సదా జపించుచున్న సకలైశ్వర్యవంతులై పుత్రపుత్రికా సంతానులై యుందురు. గాన సదా జపించుచున్న మరువక సద్గతిని జెందుదురని స్వాములవారు చెప్పగా నంత భార్యాభర్త లిరువురి సంతో షంబునకు మేరలేక స్వాములవారికి పునఃపునః ప్రణామంబు లాచరించి స్వాములవారి యాజ్ఞను గైకొని యిరువురును పుష్పగిరి అగ్రహారము చేరిరి. అంత నా భక్తాదు లందరు స్వాముల వారిపై నెక్కుడు ప్రేమచే బహు భయభక్తి ప్రపత్తి గలిగినవారలై యుండిరి

శ్రీ స్వాములవారు కందిమల్లయ్యపల్లె జేరుట, సిద్ధయ్యగారు మరణించిన వారికి జన్మమున్నదా? లేదాయని ప్రశ్నించుట, పీరుసాహెబ్ తన కుమారుని మత భ్రష్టునిగ జేసినాడని కడప నవాబువద్ద ఫిర్యాదుచేయుట. నవాబు వద్దనుండి సమనులు తెచ్చిన జమానుకన్నను ముందుగా కడపకు సిద్ధయ్యగారు జేరుట, కడపలో నున్న మహమ్మదీయులను సిద్ధయ్యగారు హిందువులుగా మార్చుట.

కుష్టు బ్రాహ్మణుడు తన గ్రామంబునకు నేగగానే అటునుండి స్వాములవారు భక్తజన సహితముగా బయలుదేరి కందిమల్లయ్యపల్లెకు పన్నెండు మైళ్ళ దూరంబున నున్న 'అల్లాటపల్లె'చేరి శ్రీవీరభద్రస్వామి ఆలయంబులో దిగియట భోజనాదివసతుల నేర్పరచుకొని స్వాములవారు అటునుండి తుంగభద్రానదీ స్నానం బాచరించి తన యిష్టదైవంబగు శ్రీ వీరభద్రస్వామి కడకరుదెంచి సహస్రనామావళితో పూజలు చేసి ధూపదీప నైవేద్య తాంబూలంబు లర్పించి కర్పూర హారతి నిచ్చి యా రాత్రి యాస్వామివద్దనే యుండిరి. అంత నుదయంబున బయలుదేరి కందిమల్లయ్యపల్లెకు జేరిరి. ఒకానొక దినంబున శ్రీ స్వాములవారిని సిద్ధయ్యగారు చూచి స్వామీ మరణించిన మానవునకు జన్మమున్నదా? లేదా? అని సృష్టిని ప్రశ్నించగా నంత స్వాములవారు బిడ్డా! సిద్దా! యంతయు దొలుత బీజాంకురములోనే యున్నది. తరువాత జన్మించి మాయచే గప్పబడుటచేత పూర్వజ్ఞానంబు మరచి బాల్యావస్థలం దవివి వర్తింపుచు దేహమే నేనను వెఱ్ఱి భ్రమలో జిక్కి కాలం బంతయు వ్యర్థంబుగా బోగొట్టుకొనుచు యనేక మారులు పుట్టుచు చచ్చుచు గర్భ నరకాద్య

వస్థలు సొరె సొరె ననుభవించుచు ననేక జన్మంబు లెత్తు చుండును. కావున జన్మరాహిత్యంబందినవారికిదక్క తక్కిన వారందరకును జన్మంబులున్న వను మాటసత్యంబనిచెప్పగా నంత సిద్దయ్యగారు తండ్రీ! జన్మరాహిత్య పదంబన నెట్టిదో సెలవిండని వేడగా నంత స్వాములవారు సిద్ధా! జన్మ రాహిత్యపదం బిట్టిది యని తెల్పుటకు వీలుండదు. ఆ విష యంబును తదుపరి శోధించెదముగాని ప్రస్తుతమువేగినగింజకు నేలాగున బీజోత్పత్తిలేదో అలాగుననే జన్మరాహిత్యపదం బందినవారికి వేరు జన్మంబు లేదనియు, వేయించిన గింజ వలెగా నది లేని మానవులకు అనగా జన్మరాహిత్య పదవి లేనివారికి మాత్రము అనేక జన్మంబు లున్నవని నమ్ముము. ఇదిసత్యంబనిస్వాములవారు చెప్పుచుండిన సమయంబున కడప నవాబువద్దనుండి యొకజాబునుదీసుకొని స్వాములవారి వద్దకు జవానువచ్చెను. ఆజాబునందింట్లుండెను.శ్రీమత్కంది మల్లయపల్లె మఠసంస్థానాధ్యక్షులైన శ్రీ విరాట్పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారికి కడప నవాబు సలాములు. తమరు ముడుమాల కాపురస్థుడైన దూదేకుల పీరుసాహెబు కొమారుని మహమ్మదీయ మతంబునుండి జాతి భ్రష్టునిగా జేసి హిందూమతమందు ప్రవేశంబు చేయించినారట. ఈ జాబును జూచిన వెంటనే బయలుదేరి నావద్దకు బుద్ధున కరు దెంచి సిద్దయ్య విషయమై మీ మీద తేబడిన పిర్యాదును గురించి మిమ్ముల నడిగెడు ప్రశ్నంబులకు తగు సమాధా నము చెప్పిగాని లేక ముడుమాలకు నీవేగి పీరుసాహెబ్‌తో

ముండవలెను. ఈ రెండువిషయంబులకు తగు సమాధానము చెప్పక నుందువేని నీవును నీ భక్తులును మతంబును గిరం బునుగూడ యుండదని నమ్మవలెను. ఇట్లు కడప నవాబు— అని జాబులో వ్రాసియుండెను, ఈ జాబును స్వాములవారు చూచుకొని నవ్వుచు బిడ్డా! సిద్ధా! చూచితివా. మీ తండ్రియైన పీరుసాహెబు నవాబు వద్దకుపోయి, నిన్నా నేను జాతి భ్రష్టు నిగా జేసినానని ఫిర్యాదును జేసినాడట. అందులకు తగు సమాధాన మొసంగి పొమ్మని జాబులో వ్రాసి పంపినాడు. నాయనా! ఇట్టి కష్టంబులు గల్గుననియెగదా! నీవు మావద్దవల దని, నేనును నా కుమారులును నిన్నన్ని విధంబుల ప్రయా సలు బెట్టినను నీవు వినకనిచటనే యుంటివి. మీ తండ్రి ఏమి చేసినాడో చూడుమని చెప్పగా నంతసిద్దయ్యగారు ముకుళిత కరకమలుండై నిలువంబడి తండ్రీ, తమకీవిషయంబున సంది యంబేల? నేనే స్వయముగా నా కడపనవాబువద్దకేగి తమకు మారుగా తగు సమాధానం చెప్పివచ్చెద. తమ కృప యున్నంతవరకు నాకే యిక్కట్టు గలుగదని చెప్పగా స్వాములవారు బిడ్డా, నీ ధైర్యసాహసాది గుణంబులు నే నెరుంగనివి గావు. త్వరగా నీవేగి దిగ్విజయంబును గాంచి రమ్మని ఆశీర్వాదము చేయగా నంత సిద్దయ్యగారు స్వాముల వారికి నమస్కారంచేసి తండ్రీ నేనేగి వచ్చెదనని సెలవు దీసికొని కడప గ్రామంబున కేగుటకై నవాబు పంపిన జమా నును వెంటబెట్టుకొనే బయలుదేరెను. శ్రీ సిద్దయ్యగారును జమానును కలిసివెళ్ళుచు సిద్దయ్యగారితో నా నౌకరిట్లనెను.

అయ్యా ! మన మహమ్మదీయ మతంబును వదలి హిందూ మతం బెందులకై యవలంబించితివని యడుగగా నంత సిద్ధయ్యగారు మనంబున నా గురుమూర్తి దివ్యానుగ్రహ మున్న మీ గ్రామమందలి మహమ్మదీయులందరిని హిందువులుగా మార్చెదనుతే యని తలంచి, నాయనా!నీకెందులకు గాని ముందుగా నడువుమని చెప్పి వెనుకనున్న సిద్ధయ్యగా రదృశ్యుం డాయెనా యనునట్లు వచ్చిన నౌకరు తన్నను ముందుగా కడపకు జేరెను. ఆ కడపయందు మహమ్మదీయులే కాన్పించుచుండిరి. తానా మహమ్మదీయులుండు బజారున నొక చెట్టుక్రింద గూర్చుండెను. ప్రతి మహమ్మదీయుడును సిద్ధయ్యగారివద్దకు వచ్చి కూర్చుండి అద్వైతవిచారణ చేయసాగెను. వచ్చినవారికి తగు సమాధానంబులు చెప్పుచు వారి మనంబును మార్చి తనవలె హిందువులుగ జేసి వైచుచుండెను. ఆ కడప గ్రామంబులో రెండు దినంబులకే మహమ్మదీయు లందరును సిద్ధయ్యగారి వలెనే మొగంబున విభూతియు, మెడలో రుద్రాక్షమాలలును, కట్టుటకు కాషాయాంబరములు ధరించి దిరుగుచుండగా నా మహమ్మదీయ మత గురువగు "ఖాజీ" వీరందరిని చూచి సహింపజాలక కోపంబుతో సిద్ధయ్యగారి వద్దకువచ్చి నీవు మాగ్రామంబులో నుండువాడవా? లేక వెళ్ళువాడవా? అని యడుగగాసిద్ధయ్యగారు, అయ్యా! మా గురువుగారి నెందులకో రమ్మనమని మీ నవాబు సమను పంపగా మా గురువుగారి మారుగా నేను వచ్చితిని. నేను వచ్చిన పనియైన వెంటనే వెళ్ళువాడనుగాని

యిక్కడ నుండువాడను గానని చెప్పగా అంత మతగురువు ఓహో ! నీవేనా కందిమల్లయ్యపల్లెనుండి వచ్చినది? సరే ! యిచటనేయుండుము. మావాడును నీవును కలసివస్తూ మార్గ మధ్యమందు ముందుగా వెళ్ళమనిచెప్పి వెనుకనున్నవాడవు మా వాడికి కనిపించకుండా పారిపోయి యిచ్చటికి చేరి మా వారందరును నీవలె నుండునట్లుగా జేసితివి. మా వాడిని నమ్మించి దొంగగా పారిపోయిన నీవు చిక్కినావులే ! సరే, యిక్కడనే యుండు మని చెప్పి నవాబు నొద్దకు బోయి సాహెబ్! సలాం. నిన్నటిదినంబున మధ్యదారిలో తప్పించు కొనిపోయిన దొంగ చిక్కినాడు. వాడు మతభ్రష్టుండయినది గాక మన సాహెబులను చాలమందిని తనవలెనేనుండునట్లు చేసినాడు. తమరు వెంటనే యా దొంగసన్యాసినిపిలువనంపి వానికితగుబుద్ధిచెప్పకున్ననిక మన మహమ్మదీయమతంబు శూన్యమై యుండుక్క. ఆ దొంగసన్యాసినిపిలువనంపి వానికి తగు శిక్ష విధింపుడు. లేకున్న కొలది దినంబులలోనే మన వర్ణమువారి నందరను హిందువులుగా మార్చుట సత్యం బని చెప్పగా వెంటనే సిద్ధయ్యగారిని దోడ్కొనిరమ్మని నవాబొక నౌకరును బంపెను. ఆ నౌకరు వెంటనే సిద్ధయ్యవద్దకు బోయి అయ్యా ! తమర నెందులకో మానవాబుగారు పిలుచు చున్నారు, వేగమే దయచేయుడని జెప్పగా సిదయంగా రా నౌకరు వెంటనే బయలుదేరి వెళ్ళెను.


—శ్రీ సిద్దయ్యగారికిని నవాబునకును అద్వైత ప్రసంగములు
జరుగుట—శ్రీ సిద్దయ్యగారు చేయు సలామునకు బలమైన
కల్లిరాయి గుండు బద్దలగుట—

శ్రీ సిద్దయ్యగారు నవాబుకడ కరుదెంచి, సలాము చేయకయే నిలువబడుంట నవాబు చూచి మనంబున యీర్ష్య గలవాడై వీడు నాకు సలాము చేయకయే రుద్రాక్షమాలను త్రిప్పుకొనుచు నేదియో తలంచుచున్నాడేయని తలంచి నీవు కులమునకు మహమ్మదీయుడవా? లేక హిందూవర్ణము వాడవా? నీవు చూడచాలడాంబికునివలెగాన్పించుచున్నావు. నీ కీ వేషంబేమిటి? యని నవాబడుగగా నంత సిద్దయ్య గారు నాయనా! నేను వేసినది వేషముగాదు. వేష మన నేమిటో చెప్పెద వినుము. ఈ ప్రపంచమునంగల ఎనుబది నాల్గులక్షల జీవరాసులున్నా జన్మం బెత్తుటయే వేషం బన బడును. వేషధారియైన అనగా జన్మమెత్తిన పిమ్మట వివాహంబాడి భార్యాబిడ్డలతో నుండెడు యీ నరక కూపం బైన యీ సంసార సాగరమే ఒక నాట్యశాల. ఈ నాట్య శాలలో భార్యాబిడ్డ లనెడు పాత్రలతో నుండి పంకంబుతో సమానంబగు నీసంసారంబును నీదుచే నాటకంబాడుట. కావున మనము తల్లిగర్భమునుండి యూపిరంబైన పిమ్మట వేయు వేషంబులన్నియు నాకు వేషంబులు గాని నిజంబైన వేషం బులు గావు. మనము జన్మాదు లెత్తుచు చచ్చుచు నుండు నవియే నిజమైన వేషములు. మదీయ హృదయ సరోవర నివాసియైన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి యాజ్ఞ యిది యని చెప్పగా నవాబు సిద్దయ్యగారు త్యాగులని,మహామహి

మాస్పదులని యెరుంగక యేమయ్యా! నీవు చూడ చాలా పెంకెతనముగా మాటలాడుచునాయెదుటనిలువంబడినామాట కెదురాడుచున్నావు. నే ననేకులనుజూచినాడను గాని నీవంటి అగౌరవనీయుని చూడలేదనిన సిదయ్య గారందులకునవాబు సాహెబ్‌గారూ! నాలో నన్ను పెంకెవాండ్లారుగురనిదివరకే అస్మదీయదేశికేంద్రులైన జగద్గురు శ్రీవిరాట్పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వాములవారికి కానుకగా నర్పించినాడను. మా గురుస్వాముల నెందులకో రావలసినదిగా జవాబును వ్రాసి నారటు. వారి తరపున నేనరుదెంచినాడను—సెలవిండని చెప్పగా నంత నవాబు ముందు వీని వృత్తాంతం బెరింగి పిమ్మట వీనికి తగు శిక్ష విధించినగాని వీనిగర్వంబడగ దని తలంచి యిట్లనెను

నవాబు-నీపేరేమి!సిద్దయ్య—నాపెరుసిద్దయ్యయందురు నవాబు-నీవు యేవర్ణమువాడవు? సిద్ధ-నాదిదూదేకులవర్ణము, నవాబు-అటులైననీతంద్రియైనపీరుసాహెబునువిడిచిబ్రహ్మం గారి వద్ద చేరి తమభ్రష్టుడైనావట నిజమేనా? సిద్ధ— నవాబు గారూ, మన తమమని వారి మతమని వీరిమతమని యెన్ని మతములున్నను దేవుడొక్కడేగదా. మతంబు లెన్నయినను బీజంబునొక్కటేగదా! తనువులెన్నయినను ఆత్మఒక్కటే గదా. యని తలంచి జన్మవిముక్తికై పరమేశ్వరునిగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారినీ దలంచి కొలుచుచున్నాడను నవాబు అందులకనియా నీ కీ గర్వము? నాకు సలాముచేయ కనే యెంతటివాడయినను నా యెదుట నిలువంబడడు. నీవు

గాకు సలామును చేయని కారణంబేమి? సిద్ధ... అయ్యా! ౖదియా మీ కుండిన కోపంబునకు కారణంబు? అటులైన ౨ెప్పెదవినుండు. నేనుచేయు సలామును నాగురుస్వాములు వక్క మరియొకరు భరింపజాలరు. నవాబు-ఆ! ఏమి! నీవంత దేవతా మనిషివా? నీ గురువంత భగవత్ స్వరూపుడా? నీవు నేయు సలామును మేము భరింపజాలమా ? అబ్బా! యిది మెక్కడివింత? సిద్ధా- అయ్యా! నేను చేయెత్తి సలామంటి లేని నీవును నీ సింహాసనంబును ఒకేసారి భస్మంబగుదువు. ిక్కంబుగా భస్మంబగుదురు. అంత నవాబునకుండు కోపం బునకు మేరలేక "తా చెడిన కోతి వనమెల్ల జెరచు"నను సామ్యంబుగా నీవు కులముచెడి హిందూ వర్ణంబులో గలిపి నదిగాక మమ్ములను మోసపుచ్చ దలంచి యిటుల డాంబిక ముగా మాట్లాడుచుంటివా? నీ పమితప్రసంగివై మాట్లాడు చున్నావు. నిన్నేమిచేసినను బాపముండదు. నీ వెంట వచ్చు చున్న మా నౌకరును మోసపుచ్చి ఎటులనో దొంగవాని లాగున బారిపోయి తిరిగి ఈ గ్రామంబునకు జేరితివి. నీవు కనబడకుండా బారిపోయినందుల కిప్పుడు నీకేమి కఠిన శిక విధించినను విధింపవచ్చును. నీవొక డాంబికవేషధారివై మా వాండ్లను కొందరిని నీలాగున నుండునట్లుచేసినావట. నిక్క ముగా నీవు శిక్షార్హుడవేయని కోపోద్దీపిత మానసుండై పలు కగా నంత సిద్ధయ్యగారు నవాబెన్ని పరుష వాక్యంబులు పలుకుచున్నను శాంతి వహించి నవాబుగారూ మీరు నాకు శిక్ష విధించుటయు, నేనను భవించుటయు రెండు నిక్కంబులే




నవాబు దర్గాగులో శ్రీ సిద్ధయ్యగారు ఎడమ చేతితో సలాము చేయగా
ఒక నల్లని పెద్ద గుండు రాయి బ్రద్దలగుట

కాని యితనుండి యెవ్వరినైనను వారివారి మనంబునుతెలిసి కోరనే మాట్లాడిన నీవెప్పుడో చెడిపోదువు. ఇంతముందయిన జాగ్రత్తగా మాట్లాడుమనగా నవాబు, సిద్దయ్యగారు పల్కెడి పలుకులన్నియు విషతుల్యంబుగా భావించి మితిమీరిన కోపముతో సిద్దయ్యగారిని ఏమి చేయుటకు దోచక నీవు మహా మహిమగల వానివలె మాట్లాడుచుంటివి. నీ వేమి మహత్తును చూపించెదవోతెల్పుమనగానంఽ సిద్దయ్య గారు చిరునగవుతో నవాబుగారూ! అటులైన బలమైన నొక గొప్ప రాతిగుంట ను తెప్పించుడు. పిమ్మట జరిగెడి వృత్తాంతమంతయు జూడు దని చెప్పగా నవాబు వెంటనే ఒక గొప్ప బలమైన నల్లని బండను తెప్పించి తన నగరముందు పెద్దమైదానమందుంచెను. ఈ చిత్రంబును జూచుటకై యనేకమంది ప్రజలు వచ్చిరి. వెంటనే సిద్దయ్యగారు లేచి పరివార సహితుండవై రమ్మని చెప్పి ఆ బండకడ కరుదెంచి నిలువంబడి శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వాములవారిని ధ్యానించి, జై! శ్రీవీరబ్రహ్మేంద్రావతారా! శ్రీ వీరభోగవసంతావతారా! జై! యని ప్రార్థించుచు సిద్దయ్యగారు తన వామహస్తంబు నెత్తి యా బండకు సలాము చేయగా 'పెట పెట' మను ధ్వనులచే చిన్న చిన్న ముక్కలాయెను అంత నవాబునకును, జూడ నరుదెంచిన మహాజనంబునకు నేమియుతోచక నిలువబాతిన కొయ్య బొమ్మలవలె నిర్విణ్ణులై అట్లే నిలువంబడి యుండిరి. అంత సిద్ధయ్యగారు అయ్యా! ఇందులకే నే చేయు సలాము అస్మదీయ గురుసార్వభౌములగు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల

వారుదక్కనింకెవరునుభరింపజాలరనిచెప్పినది ఇంతటనైనా తెలిసినదా! నా తండ్రి కరినుండై ఫిర్యాదును జేసినంత మాత్రంబుననే నా గురుస్వాములను, నన్ను నింత నగౌరవ ముగా జూడవచ్చునా? యని యడుగగా నంత నవాబు ఖిన్నుండై ఈ మహనీయునకు నేను జేసిన అగౌరవ తిర స్కార భాషణంబులకు మనంబునం దేమయిన నలుకబూని శాపం బొసంగునేమో యని గడగడలాడుచు, అవును నేనే త్వరపడి యెన్నియో దుర్భాషలాడినను నీ శాంతమూర్తి విసు మంతయైన నాగ్రహంబు జెందక కేవల మౌనిరూపుండై యట్లే నిలువబడియుండెను. ఔరా! యోగమహిమ? నే నిది వరకేమిటోయని తలంచుచుంటిని గాని యింత మహామహి మంబు నే నెప్పుడూ కని విని యెరుంగనైతిని. ఏ పుట్టలో నే పామున్నదో? ఎవరెరుంగుదురని మనంబున దృఢపరచుకొని సిద్ధయ్యగారి కడకరుదెంచి సాష్టాంగ దండ ప్రణామంబు లాచరించి స్వామీ! తమ మహిమంబులు తెలియక ననేక దుర్భాషలాడినాను. నా తప్పులన్నియు ఒప్పులుగా భావించి తమ బిడ్డలరీతిని కాపాడుమని వేడగా సిద్ధయ్యగారికి జాలి గలిగి నాయనా! నవాబుగారూ! నీ వేమియు నా కపరాధం బులు చేయలేదు. నీవు చేసిన వన్నియు నాకు అమృత తుల్యములే! నీ వాడిన దుర్భాషలన్నియు నాకు మహా మంత్రములేకాని విషతుల్యంబగు వాక్యంబులుకావు నాయనా! దూషణ భూషణ తిరస్కారంబులన్నియు నీ శరీరంబునకే గాని ఆత్మకు నంటజాలవు. ప్రతి మానవుడును మానాభి మానంబులను, లజ్జాభి ప్రాయంబులును, సుఖదుఃఖంబు,

శీతోష్ణములును, దుర్గంధ ఏహ్యంబులును, సమానంబులని తెంచువారి కీ జగంబున నే యుత్కృష్టులునుం గలరు.ఇట్లు సమభావంబుగా నున్న మహనీయునకు మర్కటంబువలె నాడుచుండెడి మనంబు వారి స్వాధీనమైయుండును. మనం బెప్పుడు స్వాధీనంబయ్యెనో యప్పుడే నీ సర్వ ప్రపంచంబు వాని స్వాధీనమై సర్వజనవశీకృతుండై మహా మహిమాన్వితుండై విరాజిల్లుచుండును. నేను నీ వంటివాడనే. కాని ఈ సామర్థ్యంబు అస్మదీయ దేశికేంద్రులైన శ్రీ జగద్గురు విరాట్పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి దివ్యానుగ్రహమే గాని అల్పుండనైన నేను జేసిన దేమియులేదు. అయ్యా! పెరుగును తరచనిదే వెన్నబయల్పడునా? సాధువులైన మా వంటివారలు బరీక్షింపనిదే నీకెట్లు వారి మహిమంబులు దెలియునని చెప్పినంతనవాబుముకుళితకరములుండై నిలువంబడి స్వామీ!అస్మదీయ అంతరంగ మహలున కేగుదమురమ్మని సిద్దయ్యగారిని దోడ్కొనిపోయి, తన రంగమహలునందుండు నొక బంగరు పీఠంబుపై గూర్చుండబెట్టి, అర్ఘ్యపాద్యాది విధులం బూజించి, స్వామీ! తమరు నాయందు పరిపూర్ణానుగ్రహ ముంచి, తమ దివ్యానుగ్రహం బొసంగి నన్ను మోక్షాసక్తునిగా జేయుడని వేడగా, నంత సిద్దయ్యగారు, నవాబుగారూ! నే నొకరిని తరింపజేయు నంతటి యధికారంబునాకు నా గురుస్వాము లొసంగి యుండలేదు' వారి యాజ్ఞను మీరి మీ కోర్కె తీర్చినను నీవును, నేనును గురుద్రోహులమై చెడిపోదుము. కాన నీకే నిక్కంబుగా నా కోర్కెయున్న

స్వాములవారినే తోడ్కొనివచ్చి నీ కోర్కె దీర్చెదనని చెప్పగా స్వామీ! అతులైన నీ రాజ్యభారంబును భరించు టకు బహు ప్రయాసగానున్నది. గాన నీ రాజ్యభారంబు వీడి తమ వెంటనే వచ్చెద. నన్నును గురుస్వాములవారి వద్దకు గొంపోవుము. నాకు "మోక్షభిక్ష" యొసంగు నటుల నా పుణ్యమూర్తికి జెప్పుమనగా నంత సిద్దయ్యగారు అయ్యా! నీవంటి వారలీ రాజ్యభారంబును వహించి యుండుటచే మా వంటి వారలకు గతులు గల్గుచున్నవి నీ వేమియు నిప్పుడు నా వెంట రాకుము. కొలది దినంబులలో నా మహామహిమా స్పదులగు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారిని దోడ్కొని వచ్చి నీ యీప్సితంబును తీర్చెదనని కొన్ని విషయంబు లా నవాబునకు దెల్పి యచట నైదు దినంబులుండి నవాబుచే ననేక బహుమతులను గైకొని తనవలె మారి యుండిన కొందరు మహమ్మదీయుల నా సిద్దయ్యగారు వెంటబెట్టుకొని బయలుదేరి కందిమల్లయపల్లెకు జేరిరి.

## సప్తమ ప్రకరణము

### శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారు సిద్దయ్యగారికి సాంఖ్య యోగంబును బోధించుట

శ్రీస్వాములవారు నిర్గుణ సమాధినుండి మేల్కాంచిన పిమ్మట శ్రీ సిద్దయ్యగారు స్వాములవారి పాదంబులకడ గూర్చుండి పాదంబులొత్తుచుస్వామీ! సద్గురు చంద్రమా!

ఈ ప్రపంచంబంతయు నెట్లుగల్గెనో తెల్పుమని ప్రార్థింపగా అంత స్వాములవారు సిద్దయ్యగారిని జూచి వు నాయన జ్ఞాన పుత్రుండవని నమ్మితినిగాన నేను నీకు జెప్పెద వు సాంఖ్య బోధయేమనగా ముందు విశ్వసృష్టియు పంచభూత పమర్శన మనియు పంచీకరణంబనియు దేహతత్త్వ విచారణ యనియు జెప్పబడును. కాన నీవు త్రికరణ శుద్ధిగలవాడవై వినుము. ఈ కనిపించుచున్న ప్రపంచ మంతయు నెక్కడ పుట్టెనో చెప్పెద వినుము. సృష్టికంటెను పూర్వమందు నాశము లేన ట్టియు, వికారము లేనట్టియు. కాలత్రయంబులందున బాధింప బడనట్టియు, సృష్టికి అభిముఖమైనట్టియు, నిత్యనిర్మల నిర్వి కార నిరామయ నిర్గుణ సర్వాత్మక సత్య స్వరూపమైనట్టిది సృష్టికంటెను పూర్వమందు ఒకటియున్నది. రెండవదిలేనిది, అదియే బ్రహ్మమని చెప్పంబడును. దానియందు అదిలేని ద్వైత నిరాకారమైన దైవసృష్టిని జేయుటకు సామర్థ్యము గలదై ప్రధానమను పేరుగల ప్రకృతి యను నొకటి గలదు ఆ ప్రకృతియందు పైన జెప్పంబడిననిర్వి కారధర్మములు గలిగి నట్టి బ్రహ్మముగలిసి ఈశ్వరుండనియు లేక అవ్యాకృతుం డనియు పేరుగలిగెను. ఆ ఈశ్వరునియందుహిరణ్యగర్భుడు లేక సృష్టికర్త యనువాడు పుట్టెను. ఆ హిరణ్యగర్భుని యందు విరాట్టు లేక వైశ్వానరుండును గల్గెను.

శ్లో॥ బ్రాహ్మణోరవ్యక్తాన్ అవ్యక్తాన్ మహతః॥ మహతోయ మహంకారోపంచతన్మాత్రాణి పంచతన్మాత్రేభ్యో పంచమహా

భూతాని పంచమహాభూతేభ్యోఖిలంజగత్॥ తా॥ విరాట్టు నందు మహత్తు నా మహత్తునందు అహంకారము, నా యహంకారమునందు పైని జెప్పంబడిన ప్రకృతి సత్వరజో తమోగుణంబులు గలిగి విభాగంబును గలదాయెను. ఆ ప్రకృతియొక్క సత్వగుణమందు జ్ఞానేంద్రియములు, రజో గుణమువలన కర్మేంద్రియముల తమోగుణంబువలన వాటి విషయంబులు, ఆ జ్ఞానేంద్రియముల వలన అధి దేవతలతో కూడిన పంచ మహాభూతంబులు బుట్టెను. అనగా 1)శబ్దము వలన సదాశివుం డధిదేవతగా గల్గిన యాకాశం బుట్టెను. 2) స్పర్శము వలన నీశ్వరుండు అధి దేవతగా గల్గిన వాయువు పుట్టెను. 3) రూపము వలన రుద్రు డధిదేవతగా గల్గిన అగ్ని పుట్టెను. 4) రసము వలన విష్ణు డధినేతగా గల్గిన జలంబు బుట్టెను. 5) గ్రంధమువలన బ్రహ్మఅధిదేవ తగా గలిగిన భూమిపుట్టెను. పైని జెప్పబడిన పరమేశ్వరుడు ఈ విధంబుగా సూక్ష్మసృష్టిని బుట్టించి, స్థూలసృష్టికై తిరిగి సంకల్పించెను. పైన జెప్పంబడిన పంచ మహాభూతములను ఒక్కొక్కభూతమును తక్కిన భూతములతో గలసినప్పుడు 'పంచీకరణ' మాయెను. అనగా ఆకాశమును రెండు భాగ ములు చేసి అందులో ఒక భాగము సమిష్టి భాగముగాను జేయవలయును. ఈ విధంబుననే ప్రతి భూతమును విడదీసి పంచినయెడల యిరవదియైదు తత్వంబులగును. ఈ యిరువది యైదుతత్వంబు లెవ్వియనగా 1) జ్ఞాన, మనో, బుద్ధి, చిత్త, యహంకారంబులను అంతరేంద్రియములైదును (2) సమాన

వ్యాన, ఉదాన, ప్రాణ, అపానంబులను పంచప్రాణంబులను (3) శ్రోతము, త్వక్కు, చక్షువు, జిహ్వ, ఘ్రాణములనెడి జ్ఞానేంద్రియములైదును 4) వాక్కు, పాణి,పాదము,గుదము గుహ్యములనెడు కర్మేంద్రియంబులైదును, (5) శబ్దము స్పర్శము, రూపము, రసము. గంధములనియెడి పంచతన్మాత్రలును నీ యిరువదియైదు తత్వంబులచే నీస్థూలంబాయెను. ఈ స్థూలశరీరుండైన జీవుండు అతని పేరు విశ్వుడు. కాన నీ యిరువదియైదు తత్వంబులకు అధి దేవతలను జెప్పెద వినుము. జ్ఞాన మనో బుద్ధి చిత్త అహంకారంబు లనెడి ఆకార పంచకంబును క్షేత్రపాలకుడు చంద్రుడు. బ్రహ్మ విష్ణు రుద్రుడును అధి దేవతలైరి. 2) సమాన, వ్యాన, ఉదాన, ప్రాణ, అపానంబు లను వాయు పంచకంబునకు విజయుడు జయుడు విశ్వయోని విసస్పృష్టుడు విశ్వకర్తలును అధి దేవతలైరి. (3) శ్రోత్రముత్వక్కుచక్షుజిహ్వఘ్రాణంబు లనియెడి అగ్ని పంచకంబునకు అష్టదిక్కులు, వాయువు, సూర్యుడు,వరుణుడు,అశ్వనీదేవతలు అధిదేవతలైరి 4) శబ్ద స్పర్శ రూప రస గంధములను జలపంచకమునకు ఆదిశక్తి యిచ్ఛాశక్తి క్రియాశక్తి జ్ఞానశక్తి పరాశక్తియును అధి దేవతలైరి 5) వాక్కుపాణి పాదము గుదము గుహ్యంబు లనియెడి పృథ్వీపంచకంబునకు అగ్ని దేవేంద్రుడు విష్ణువు బ్రహ్మ మృత్యువు అధిదేవతలయిరి. దేహత్రయముల వివరము-ఈ యిరువదియైదు తత్త్వంబులచే గూడినదే "స్థూల దేహ" మనంబడును. జ్ఞానేంద్రియంబులైదును, కరేతం

ద్రియంబులు ఐదును, పంచప్రాణంబులు నైదును, మనో బుద్ధులు రెండును కలిపి పదిహేడు తత్వంబులచే గూడినదే "సూక్ష్మదేహ"మనంబడును.దీనినే "లింగదేహ" మనియును జెప్పుదురు. స్థూల సూక్ష్మదేహములు రెండున్నూ కార్య రూపములుగా నున్నవి. పొగ వచ్చుటచేతను నగ్నిని జూడ కున్నను కారణమగు నగ్ని యున్నందుననే దానికార్యరూప మగు పొగ వచ్చుచున్నదని నిశ్చయించవచ్చును. అదియే అజ్ఞానస్వరూపమగు 'కారణశరీరము.' నేనుఅజ్ఞానిని అనుట వలన అజ్ఞానము ప్రత్యక్షముగానున్నది. అజ్ఞానమే కారణ శరీర మనంబడెను. ఆ యజ్ఞానంబుననే స్థూల శరీరంబులు గల్గుచున్నవి. ఎట్లనిన శ్లో॥ అజ్ఞానాదవివేకః। అవివేకా రభి మానః। అభిమానాద్రాగాదయః। రాగాదయః కర్మాణి, కర్మాణిశరీరపరిగ్రహాని॥తా॥అజ్ఞానమువలన అవివేకమున్ను అవివేకంబువలన నేనునాదిఅనుఅభిమానమున్నూ, అభిమా నము వలన కామక్రోధాదులున్నూ, కామక్రోధాదుల వలన అనేక కర్మలచేయుచు కర్మవశమున నీజీవాత్మ జనన మరణ ములను బొందుచు మరల పూర్వకర్మవశమున బుట్టుచు చచ్చుచు నిట్లనేక జన్మంబు లెత్తుచు దుఃఖించుచుండును. అజ్ఞానంబను కారణదేహము నశించకున్న ముక్తిలేదు. శ్లో॥ తదావిద్వాన్ బ్రహ్మజ్ఞానాగ్ని నా కర్మబంధం నిర్దహ్యైతా॥ బ్రహ్మజ్ఞానాగ్ని వలన అజ్ఞానమున్నూ సకల కర్మలున్నూ నశించి జీవుండు ముక్తినిబొందును. అజ్ఞానంబను కారణ దేహము నశించెడిఈరూపంబును ప్రతిమానవుండునుగ్రహిం


చవలెను. లేకున్న ముక్తి లేదని స్వాములవారు బోధించగానంత సిద్ధయ్యగారు స్వామీ! దేవరవారి కృపాకటాక్షంబుచే తారక సూత్రం బెరింగిచిరి. తిరిగి యిప్పుడు సాంఖ్యసూత్రం బెరిగించితిరి కాని యీసాంఖ్యసూత్రం బింతియేనా? లేకనింక నేమయినా తత్త్వంబులుగలవా? యని యడుగగా నంత స్వాములవారు బిడ్డా! నీమనోపరిపక్వంబునుజూడ సంతసంబయ్యెను. వినుము. శ్లో॥ పంచైతాని, దశేంద్రియాణి,విషయాః, ప్రాణా వ్యషట్ చక్రయా, రాగాష్టాకరుథా చతుష్షడూర్మిభిః సప్తాని తద్ధాతవః నాడీ, మండల, మీషణత్రయ, గుణావస్థాశ్చ తాపత్రయం। కోశా, పంచ తనుశ్చ షన్నతికం తత్త్వాని జీవాత్మనా॥ తా। ఇవియే తొంబదియారు తత్వములు. పంచ భూతంబులు 5 న్నూ, జ్ఞానేంద్రియంబులు 5న్నూ. కర్మేంద్రియంబులు 5 న్నూ, విషయంబులు 10 న్నీ, ప్రాణాది వాయువులు 10 న్నీ, చక్రములు 6 న్ను, రాగములు 8న్నీ అంతఃకరణములు 4న్ను, షడూర్మిలు 3న్ను, ఈషణములు 3 న్ను, గుణములు 3 న్ను, అవస్థలు 3 న్ను, తాపత్రయములు 3 న్ను, కోశములు 5 న్ను వెరశి 96 తత్త్వములు. ఈతత్త్వములతోగూడిననీశరీరమేనేననెడువాడు "జీవుండని" యెరుంగుము. ఇంకను నీ ఘటప్రమాణంబునుం జెప్పెద.

ఘటవిమర్శన.- ఈఘటము 96 అంగుళములప్రమాణంబు గలది. 7 జానల పొడవున్ను, 4 జానల వలయమును 23 కోట్ల రోమద్వారంబులున్ను, 30 మూరలప్రేగులున్ను

92సంధులున్నూ, 70ఎముకలును, 8ఫలములగుండెయున్ను, 40ఫలములరక్తమున్నూ, 360 ఫలంబుల మాంసమున్ను సోలెడు పైత్యమున్ను, అరసోలెడు శ్లేష్మమున్ను, సోలెడు శుక్లంబును నిన్నింటితో గూడినదే యీస్థూలశరీరము. ఇదే "అనాత్మ"ను, అసజ్జడ దుఃఖస్వరూపమయిన యీ దేహాము తానను అజ్ఞానమే జీవాత్మ. ఇట్టి దేహముకన్నను విలక్షణ మైన "ఆత్మే"తానని యెరుగుట"జీవన్ముక్తి"యనిస్వాముల వారు బోధించగా, సిద్దయ్యగారు బ్రహ్మానందంబున సోల లాడి పరవశుడై, స్వామీ! సద్గురుప్రభూ! మలమూత్రాదు లచే నిండిన నీ యేహ్యంబైన శరీరంబున దేవత లున్నారని మొదటి దినంబు బోధించితిరే! వారు యే ఏస్థానంబులలో నుందురని యడుగగ, నంత స్వాములవారు బిడ్డా! వినుము. ఈ దేహంబున ఆధార స్వాధిష్ఠాన మణిపూరక అనాహత విశుద్ధ ఆజ్ఞేయంబులను నారుచక్రంబులు గలవు. ఒక్కొక్క చక్రంబునంగల దళంబులున్నూ, బీజంబులున్నూ, లింగము లున్నూ, అధిదేవతలున్నూ, వర్ణములున్నూ, స్థానంబు లున్నూ, శక్తులున్నూ, హంసలున్నూ తెల్పెద జాగరూకు డవై వినుము.

—॥ శ్రీ స్వాములవారు షట్చక్రంబుల యందుండెడి అధిదేవతలనుదెల్పు చుండ గోడచాటు నుండి "మాదిగ కక్కయ్యగారు" విను చుండుట, నవచక్ర షట్చక్రంబుల భేదంబును దెల్పుట॥—

బిడ్డా! సిద్దా! చిదానంద మైనట్టియు, సర్వమును




షట్చక్ర నిరూపణ

వశ్యము చేసుకొనునట్టియు, బ్రహ్మాత్మానుభవ రూపమైనట్టి భక్తి భావం బంతయువినుము. నేనుజూపించబోవునది స్వచ్ఛమైన మనస్సుచేత జూడుము. లోకమందు సూర్యకిరణములు మేధ్యామేధ్య వస్తువులయందు ప్రసరించినను వాని పవిత్రాపవిత్రములు సూర్యుని నెటుల నంటవో అటువలెనే ఘటమందు ప్రతిబింబించిన సూర్యకిరణంబులను, ఘటమందుండు రంధ్రములుజలమునందుండు కల్మషములను నెటులనంటవో ఆ విధంబుననే పరమాత్మకు స్థూలదేహంబున దుర్గంధాదులును సూక్ష్మమందున కామక్రోధాలును కారణమందు అజ్ఞానమును నెప్పుడును నంటవు. శ్రీ గురుసేవను జేసి శాస్త్రంబులను విచారించిన వారికి సూక్ష్మదృష్టిచేత నీ దేహమందే పరమాత్మ కనిపించును ఆ క్రమమును నిప్పుడు చెప్పెద వినుము. పంచవింశతి తత్త్వంబులచేతను, దశనాడుల చేతను, సప్తధాతువుల చేతను కప్పబడియున్న నీ దేహములోపల ఏడు కమలంబులు గలవు షట్చక్ర నిరూపణము—వీనిలో మొదటిది మూలాధారము. గుదస్థానమునందు నాలుగు రేకులు గల్గి పచ్చనైన వర్ణము గలదై వ, శ, ష, స అను నాలుగు దళములతో గూడుకొని 'వ' కారంబు గలదై పృథ్వీనిలయంబై ఘ్రాణకారణంబై భూమివలెనే నాలుగు కోణంబులుగలిగియుండును ఆధారలింగము యిచ్ఛాశక్తితోనుండును. 1 ఘ 40 వి। ఘ। కాలంలో600 పరమహంస జపము జరుగును. ఈచక్రమునకు వినాయకుడు అధిదేవత. 2. స్వాధిష్ఠాన చక్రము. ఆధార చక్రంబునకు

రెండు అంగుళములపైననాలుగు రేకులు గలదై మూడుకోణ ములుగల్గి 'మ' కారంతో గూడుకొని తెల్లని రంగుతో జల స్థానంబై జిహ్వాకారంబై—బ,భ,మ,య,ర,ల-యనుదళంబులు గలదై పక్షియాకృతిగా నుండును. గురులింగం క్రియాశక్తి యా చక్రంబున బ్రహ్మదేవునకు 46 ఘ॥ 40 వి. ఘ॥కాల ములో 6000 పరమహంసలు జపము జరుగును. 3) మణి పూరచక్రము. స్వాధిష్ఠానచక్రమునకుపైన మూడు అంగు ళములమీద నాభియందు నాడులను చుట్టుకొని మణికాంతివలె ప్రకాశించుచు నీలివర్ణముగలదై 'శ' కారయుతమై డ,ఢ,ణ, త, థ, ద, ధ, న, ప, ఫ యను పదిదళంబులు గలదయితేజో నివాసంబై నేత్రకారణంబై పీఠకాకృతి గలిగి యుండును. దీనికి విష్ణువు అధిష్ఠాన దేవత. శివలింగ జ్ఞానశక్తి, అగ్ని ముద్ర నాదోద్భవస్థానము 6 ఘ॥ 40 వి॥ ఘ॥ కాలములో 600 పరమహంసలు జపముజరుగును. 4)అనాహతచక్రము మణిపూరక చక్రమునకు పది యంగుళముల పైన హృదయ స్థానమందు పండ్రెండు దళంబులు గలిగి సువర్ణ చ్ఛాయతో 'న' కారము గలదై సమస్త వాక్యములకు స్థానమయి క,ఖ, గ, ఘ, ఙ, చ, ఛ, జ, ఝ, ఞ, ట, ఠ-యను రేకులుగలదై వాయువునకు స్థానమై త్వగింద్రియ కారణంబై లింగాకృతి గలిగి యుండును. దీనికిరుద్రుడుఅధిష్ఠానదేవత, చరలింగము బీజశక్తి వాయుముద్రనాదప్రకాశినిస్థానం. 16 ఘ॥ 40 వి॥ ఘ॥లలో 6000 పరమహంసలజపము జరుగును. 5)విశుద్ధ చక్రము అనాహత చక్రంబునకు పన్నెండంగుళములపైన

తెల్లనికాంతి గలదై అ,ఆ,ఇ,ఈ,ఉ,ఊ. ఋ,ౠ,ఌ,ౡ, ఎ, ఐ, ఓ, ఔ, అం, అః యను పదియారు దళంబులు గల ఎయ చేపనంటి యాకృతి గలిగి 'య' కారంబు గలదయి గగనసదనంబయి శ్రోత్రస్థానంబయి కంఠస్థానమందుండును. దీనికి జీవుండు అధిష్ఠాన దేవత. సరస్వతి స్థానం, ప్రసాద లింగం, ఆదిశక్తి, ఆకాశముద్ర, జ్యోతివర్ణము. 2 ఘ॥ 40 వి॥ఘ॥లో 1000 జపముజరుగును. 6) ఆగ్నేయగ్రమము. విశుద్ధ చక్రము మొదలు పన్నెండు అంగుళముల పైన భ్రూమధ్యస్థానమందు 'హిం, క్షం' అను రెండు దళంబులు గలదయి అంతఃకరణ భవనంబయి అగ్నివలెనే ప్రకాశించు చుండును. దీనికి యీశ్వరుడు అధిష్ఠాన దేవత సర్వసృష్టి స్థానము, మహాలింగం. పరాశక్తి, సువర్ణం, ప్రకాశముద్ర 2 ఘ॥ 46 వి॥ ఘ॥లో 1000 పరమహంసల జపము జరుగును. 7) సహస్రారము విశుద్ధ చక్రంబునకు పైన బ్రహ్మరంధ్ర మందుండును ఆ సహస్రారమందు తేజోమయరూప మైన సహస్రదళములతో గూడుకొని ఓమ్ అను ప్రణవము వర్ణకంబయి దేదీప్యమానముగ బుద్ధికి నిలయస్థలంబయి మాయచేత గప్పంబడి సమస్తజగత్తునకు గారణమై యథార్థముగ విచారించి౦చో సృష్టి లేనిదయి సచ్చిదానందరూపము గలదయి యున్నది. దీనికి అధిష్ఠాన దేవత శ్రీ గురుమూర్తి ఓంకార లింగం, జ్యోతిర్మయి స్థానం, సర్వాకర్షణ ప్రణవస్థానం, విమలజ్ఞానముద్ర, 2 ఘ॥ 46 వి॥ ఘ॥, లలో 1000 పరమహంసలపపము జరుగును. ఈ ఏడు చక్రం

బులం దెలిసికొనిన సాక్షి తానై యున్నది. ఈ చక్రంబు లందు దిరుగు వాయువు "ప్రాణము"ఐని జెప్పంబడును. ఆ వాయువే స్థాన భేదముచేత పది విధంబులై ప్రకాశించు చున్నది. అవి యెవ్వనిన :— ప్రాణవాయువు, అపాన వాయువు, వ్యానవాయువు,ఉదానవాయువు,సమానవాయువు లను నైదు ప్రాణవాయువులున్ను, నాగవాయువు, కూర్మ వాయువు, కృకరవాయువు, దేవదత్తవాయువు, ధనుంజయ వాయువులను నుపవాయువులైదును వెరసి పది వాయువులు గాంధార మొదలైన నాడులు పది వాయువులందును దిరుగు చుండును. ప్రాణవాయువుకుడియెడమయందునుఇడాపింగళు లను నాడులయందుదిరుగుచు క్రిందికిమీదికి నడచుచుండును. ఇడాపింగళులు ఆధారము మొదలుకొని ఆగ్నేయ చక్రము వరకుండును. మధ్యమందున్నసుషుమ్ననాడి ఆగ్నేయమును దాటి బ్రహ్మరంధ్ర పర్యంతము వ్యాపించి రహస్యమైనదై దేహమధ్యమందు ప్రధానమైయుండును. ఈ నాడులయందు దిరుగుచున్న జీవుడు ప్రాణవాయువువలన ఆగ్నేయ చక్ర మందు బుట్టిన'స' కారమున్ను, మూలాధారమందు అపాన వాయువు వలన బుట్టిన 'హ' కారమున్ను కలసి "హంస" అనియు, "సోహం"బనియు ఊర్ధ్వ అధోకుండలుల యందు వ్యాపించుచున్న ఆత్మమంత్రమును ఆధారాది షట్చక్రము లకు నధిష్ఠాన దేవతలైన గణపతి, బ్రహ్మ, విష్ణు, రుద్రుడు జీవుడు, ఈశ్వరుడు వీనినిగూర్చి ఈ ఉదయము మొదలు కొని మరునాటి యుదయము వరకు జపము చేసి అర్పణ

జేయుచున్నాడు. అందు గణపతికి 700లున్నూ, బ్రహ్మకు 6000 లున్ను, విష్ణువునకు 6000లున్నూ, రుద్రునకు 6000 లున్ను, జీవునకు 1000న్ని, ఈశ్వరునకు 1000న్ని ఈ విధముగ సగుణముగ జీవుడు అర్పణము చేయుచున్నాడు. సహస్రారమందు తేజోమయ రూపమై 1000 హంసలను శ్రీ గురుపరమాత్మునకు నర్పణ చేయుచున్నాడు. ఇట్లు సగుణ నిర్గుణ రూపములైన హంసలు, 21,600, ఇట్టి అతి రహస్యమును జీవుడు కనుంగొనలేక శ్రీ గురుసేవచేయుచు కాశీ, గయ, ప్రయాగ మొదలైనతీర్థయాత్రలకు బోవ ప్రయత్నించుచు సాలోక్యాది ముక్తులను గోరుచువాని విషయమై కాలమంతయు వ్యర్థముగ గడుపుచుండెను. ఇందువలన ఆడుచున్న బంతివలెనే క్రిందికి మీదికి దిరుగుచు సుఖ దుఃఖములకు లోనై యుండును. ఆ సహస్రారమే శబ్దరూపమైన వాక్కు, అదే పరంజ్యోతి, అదే యూర్ధ్వకుండలి' అదే అమృతమునకు స్థానము అదే సమస్తసృష్టికి కారణము. అది మెరుపువలెనే కొంచెము కాలములో గనుపడి అప్పుడే కప్పబడును. ఆ సహస్రార మందే అవ్యక్తాది సమస్తసృష్టి యున్నది. ఈ కనుపడుసమస్తమునుచిద్విలాసమైయుండును. నపుడు ఈ కలుపడు సమస్తమును చిద్విలాసమై యుండును. అప్పుడు యీజీవునకు నేదోషంబును నంటదు. అట్టిమార్గము దెలియక అథో కుండలియందు బడి దారాపుత్రాదులు తనను రక్షించెదరని వలలో బడిన పిట్టవలెనే యీ దేహమందున్న అమృత పానమును జేయలేక యీ దేహమే నే ననుకొని

కొట్టుకొను చుండును. దీనిలో జీవుడు తనకంటె వేరైన వస్తువు కలదని తన నేర్పుకొలది కర్మభక్తులను జేయుచు కర్మకాండలలో మునిగియుండును అంట్లకుండను గంగలో ముంచినను ఎట్లు పవిత్రంబుగాదో అటువలెనో యీదేహమును ఎన్నిసార్లు గంగలో ముంచినను, బాహ్యదృష్టిచేత నెన్ని కర్మలు చేసినను మోక్షమురాదు. మరియుకొన్ని ముక్తులను "జీవన్ముక్తి" కంటెనుత్కృగావైనవి లోకాంతరమును బొంది నవి యనిచెప్పగా సిద్ధయ్యగారు తానిదివరకువిననివి కననివి గూడా బోధించినందులకు సిద్ధయ్యగారి సంతోషమునకు మేరలేక స్వామీ! గురుచంద్రమా! తా మిపుడు సప్తకము లము లీ దేహమందున్న వని గదా సెలవిచ్చితిరి. మొన్నొ కనాడు తమరే నవచక్రంబు లున్నవని మా సోదరులకు బోధించుచుండగా వినియుంటిని. మిగిలిన రెండు చక్రములు నే యే స్థలంబున నుండునో దెల్పుమని వేడగానంత స్వాము లవారు సంతోషాంతరంగుడై బిడ్డా! వినుము. నవచక్రంబు లనియు, సప్తచక్రంబు లనియు సహస్రారంబున శిఖా శూన్య పశ్చిమచక్రములున్నవని దెలియును. నవచక్రంబు లనగా ఆధార, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధ, ఆగ్నేయ, సహస్రార ఆకారంబులని జెప్పంబడును. సప్త చక్రములను నడుపు తాల్వ్యాకాశ చక్రంబులు విశుద్ధ, సహ స్రార చక్రంబులలో అంతరా గంబులు. షట్ చక్రములను నడుపు సహస్రార చక్రము అధిష్ఠానముగా దీసికొని చెప్పం బడును. ఇంతేగాని శ్రుతి విరుద్ధముగా జెప్పి యుండలేదు.

ప్రకృతము సప్తచక్రములందు ఆత్మనిరూపణ చేయబడెను. కాని నీ షట్ చక్రంబుల యందుండు అధి దేవతలను జూడ వలెనన్న అంతర్లక్ష్యంబున జూచిన గానంబడును.

—షట్చక్రములయందు అధిదేవతలను జూచు తలంపున మాదిగ కక్కయ్యగారు తన భార్య గర్భచ్ఛేదనంబు జేసి జూచి అందు దేవతే గాన రానందున దుఃఖించుట—

శ్రీ స్వాములవారు సిద్ధయ్యగారికి షట్చక్ర నిరూపణ జేసి చెప్పుచుండుట మాదిగ కక్కయ్యగారు గోడచాటున నుండి చక్కగావిని దేవుండన నెక్కడోయుండిన వాడను గొంటినిగాని నేడీ మహాత్ముని అమృత తుల్యంబైన వాక్యంబలు వినిన నీ శరీరంబున పంచకళలు, పంచశక్తులు, పంచాగ్నులు మొదలుగాగల 96 తత్వంబులేకాక వీని కన్నింటికిని అధిదేవత లున్నారని తెలియుచున్నది. కాన నీ తక్షణం బేగి మదీయ భార్యగర్భంబును గోసి పంచమూర్తిలాదిగాగల దేవతలను దర్శించి ముక్తినిజెందెదనని మూఢభక్తి గలవాడై గృహంబునకేగువర కాయనభార్య నిద్రించుచుండగా నిదియే మంచి సమయంబనియెంచి నొకఖడ్గంబు చేబూని కంఠంబును గోసి పిమ్మట గర్భంబును గోసి జూడగనే దేవతలుగాని, ఏ కళలుగాని, ఏశక్తులుగాని, ఏయగ్నులుగానిగాన్పించకుండుటచే కడుంగడు దుఃఖితాత్ముడయి నేమియుదోచక నిర్విణ్ణుండయి యచ్చో కూలంబడెను. పిమ్మట కొంతసేపటికి స్వప్రహ వల్గి కన్నును విప్పిజూచి అకటకటా! త్రిమూర్తిలాదిగాగల దేవుల కొరకు దయావిహీనుండనై నతి కఠిన హృదయుండ

నయి జాలియును మాట లేశమాత్రంబైన లేక నిష్కారణ ముగా నా మాయా గురువుల మాటలువిని నా యాలి కడుపు గోసి వారిద్దరి పొట్టనుబెట్టి చేతులు కడుగుకొంటినే! ఇప్పు డేమి చేయగలను? మించినపనికై యోచించుట వెఱ్ఱితనంబని కొంచెము ధైర్యం బవలంబించి 'అయ్యో! దైవమా! బ్రహ్మం గారు మహనీయులని యెంచి ఆయన పల్కిన పల్కు లన్నియు బూటకంబులు గావని దలంచి బంగారువంటి నా భార్యను జేతులార జంపుకొంటినే. అయ్యయ్యో! యెంత మోసపోతిని? యీ మాయాగురువుల మాయామాటలు విని అన్యాయంబుగా నానవమోహనాంగిని నాముద్దులమోహనాం గిని మోసంబు వాటిల్లుననియైనా దలంచక చంపుకొంటినేపర మేశ్వరా! పరమపావనా! పరమకృపాళో! భక్తవత్సలా! పరుల కొంపలను బాడుజేయ ప్రయత్నించుచుండి మేము గురువుల మని గుణరహితుల మని గుస గుస లాడుచుండిన యీ మాయా గురువుల మాటలు యెందులకై వింటిని? వింటినిపో. నా కీ దుర్మార్గపు బుద్ధియేలబుట్టె? బుట్టినచో నిదురించుచున్న నాభార్యను జంప ప్రయత్నించుటేల? ప్రయ త్నించియు నూరుకొనక చేజేతుల నా భార్యను జంపుకొను టేల? లోకంబున నాకన్న కఠినుండెవ్వడైన నుండునా? పరమ పావనా! సర్వభూత దయాళుండవైన యో సర్వేశ్వరా! ఇక నే జేయునదేమియులేదు. చేయదగిన కార్యంబంతయుజేసితి. స్త్రీ హత్యా మహాపాపంబును ఒడిగట్టుకొనిన మహాపాపుండ నైతిని. ఐననుశ్వరపతి బ్రహ్మంగారెని మూకనేల? ఏ పుట్టిలో

యే పాయున్నదో యెవ్వరెరుగుదురు ? అనను వారివద్దకే బోయి వారిరువురు నేమి చేయుచున్నారోచూతమని ధైర్యం బవలంబించి వారికడ్డకరుదెంచిఎప్పటియట్లే గోడచాటుననే యుండి వినుచు స్వాములవారు జెప్పుచుండెడి ప్రతి పదము నకు కక్కయ్యగారు వ్యతిరేకంబుగా మాట్లాడ నిశ్చయుండై యుండెను.

శ్రీ స్వాములవారు సిద్దయ్యగారికి జెప్పెడు మాటలన్నింటికిని కక్కయ్యగారు వ్యతిరేకాభిప్రాయంబుగా మాట్లాడుట.

శ్రీ స్వాములవారు సిద్దయ్యగారినిజూచి బిడ్డా! సిద్దా! నేను బోధించిన షట్చక్ర నిర్ణయంబు బాగుగా దెలిసినదా? దెలియకున్న మరియొకసారి బోధించెదననగా, నంతసిద్దయ్య గారుస్వామీ! దయయుంచిమరియొకసారి సెలవిండు. బాగుగా మనంబునకు బట్టలేదని సిద్దయ్యగారుజెప్పగానంత స్వాముల వారు సిద్దా! వినుము. ఆధారచక్రంబుననాలుగు దళములతో వినాయకుడుండును. కక్కయ్య—ఇది కేవల మన్నృతము బ్రహ్మం—స్వాధిష్ఠాన చక్రమందు నారుదళంబులతో బ్రహ్మ దేవుడుండును. కక్క—ఇది అంతకంటె ముందు అబద్ధము. బ్రహ్మం-మణిపూరక చక్రంబున పది దళంబులమధ్య విష్ణు మూర్తి వెలుగుచుండును. కక్కయ్య-ఇది అంతకంటె శుద్ధ శూన్యము. బ్రహ్మం-అనాహత చక్రంబున పండ్రెండుదళం బులమధ్య రుద్రుడుండును. కక్కయ్య—ఇది సర్వాబద్ధము. బ్రహ్మం-విశుద్ధచక్రంబున పదియారు దళంబులమధ్య జీవు డుండును. కక్కయ్య-ఇది వట్టి బొల్లుమాట. బ్రహ్మం— ఆగ్నేయచక్రంబున రెండుదళంబులమధ్య స్వయంప్రకాశుం



బ్రహ్మంగారు కక్కయ్య భార్యను బ్రతికించుట.

డైన పరమాత్మ యుండును. కక్కయ్య- ఇది అసతే పట్టి పట్టి బొల్లుమాట. బ్రహ్మం- పహస్రార చక్రంబున కోటి భానులకన్న మిన్నయైన కాంతి గలిగిన శ్రీ గురుమూర్తి యుండును. కక్క- ఇయ్యది సర్వాబద్ధము. బ్రహ్మ-విను చుంటివా సిద్దా ! ఈ షట్చక్రాధీశులైన దేవులనుజూచి నతి భక్తిచే పూజించి తరించుము.కక్క- అయ్యో, యెంత బూటకపుమాటలు? అక్కడ వుండినగదా చూచుట? పూజించుట? తరించుట ? అని కక్కయ్యగారు వ్యతిరేకంబులు బలుకుచుండగా స్వాములవారు " కక్కయ్య రనుచున్న ప్రతి వాక్యంబును వినుచునేయుండి వీ డెవడో నే జెప్పువాని కన్నింటికిని వ్యతిరేకంబుగా బలుకుచున్నాడు. కారణంబేమై యుండునని దలంచి ఓరీ ! నీ వెవండవురా? గోడచాటున యుండి నే జెప్పిన వానికన్నింటికిని వ్యతిరేకంబుగా బలుకుచున్నావు. నీ వృత్తాంతంబును, ఇట్లువ్యతిరేకంబుగా మాట్లాడుటకు కారణంబును దెల్పుమనగా, గోడచాటున యున్న కక్కయ్యగారు స్వాములవారి ముందర నిలువంబడి నమస్కారముజేసి 'స్వామీ ! నా వృత్తాంతమేమని వచింతును ? తమరు సిద్దయ్యగారికి బోధించుచున్నమాటలునమ్మిచెడినాడనని యేడ్వగా స్వాములవారు కక్కయ్యనుజూచి నాయనా, నేచమిజెప్పితిని? నీవెట్లునామాటలనునమ్మి చెడిపోతివో దెల్పుమనగా కక్కయ్యగారు స్వామీ మీరు కేవల పరమాత్మ స్వరూపులని మీరు జెప్పినవన్నియు నిజంబనినమ్మినాభార్య గర్భచ్ఛేదనంబు జేసి నీ పొట్టనబెట్టి చేతులు కడుగు కొంటి

ననగా స్వాములవారందులకు నాయనా! నీ భార్యనునా పొట్టన
బెట్టుటకు కారణమేమో త్వరగా జెప్పుమనగా నంత కక్క-
య్యగారు దుఃఖించుచుస్వామీ! తమరు జెప్పినవన్నియు వట్టి
మాటలగుటచేతను, నేను నిదర్శనము జూచుటచేతను దెలిసి
నదనగా నంత స్వాములవారు నాయనా! నీవెట్లు నిదర్శనము
జూచితివి? నీ చేతులనిండా రక్తం బేమిటని యడుగగా కక్క-
య్యగారు తండ్రీ! నాభార్య గర్భమును గోసిచూడగా మీరు
చెప్పిన షట్ చక్రాధిపతులైన దేవతలు గాన్పించకుండుట
చేతను తమరు సిద్ధయ్యగారికి బోధించినవన్నియు నసత్యం
బులయిన వనగా నంతస్వాములవారు కక్కయ్యగారి మూఢ
భక్తికి మెచ్చి ఔరా! భక్తుడన నీతండే భక్తుడు. ఇంత
నీతని నిజంబుగా తరింపజేయక తప్పదని తలంచి నాయనా!
నీ వెప్పుడు నీ భార్య పొట్టగోసి జూచితివో త్వరగా దెల్పు
మనిన కక్కయ్యగారు స్వామీ! నా గృహంబుననే గర్భ
చ్ఛేదనంబును జేసి జూసితి. మీ రనుకొనేటి మాయ మాట
లను విని ఇట్లొనరించితిని గాని లేకున్న కేవలపశుప్రాయుం
డనైన నాకు ఎట్లు దెలియును? స్వామీ! సర్వమెఱింగిన
శ్రీ గురుండవని నమ్మి కఠిన హృదయుండనైన నే నిట్లొన
రించితినని జెప్పగా నంత స్వాములవారు కక్కడా! నిజ
ముగా నా దేవతలను దర్శించుకొనునట్టి దృఢమనంబున్న
లెమ్ము. గృహంబున కేగుదమురమ్ము. నీ ఊప్పితోను సార
ముగనే సర్వదేవతలను మీ యిరువురి నేత్రములకు జూపిం
చెదనని చెప్పి కక్కయ్యగారి గృహంబునకు సిద్దయ్యగారిని
దోడ్కొని ముగ్గురును త్రిమూర్తులవలె నేగిరి.

శ్రీ స్వాములవారు, సిద్దయ్యగారును కక్కయ్యగారి గృహంబునకేగుట షట్చక్రాధిపతులైన దేవతలను సిద్దయ్యగారికి కక్కయ్యగారికి దర్శనంబు జేయించుట, కక్కయ్యగారి భార్యను బ్రతికించుట *

శ్రీ స్వాములవారు కక్కయ్యగారి గృహంబున నొక చిన్న పీఠముపై గూర్చుండి బిడ్డలారా! నేను జెప్పునవి, జూపునవి అతి రహస్యములైనవి బ్రహ్మేంద్రాదులకైన నా అభేద్యంబైన యీ పరమ రహస్యంబును మీరు దృఢమనస్కులై వినుడు కనుడు. కపాలంబు మొదలు గుదము మధ్య వరకుండు వెన్నెముకనే ముక్తికాంతను పీఠయనియు మేరువనియు, బ్రహ్మదండి యనియు జెప్పబడును. 1) వెన్నెముకనంటి బంగారువన్నెచే మూలాధారంబు నుండును. 2) తెల్లని రంగుచే జలమునకు స్థానమైస్వాధిష్ఠాన ముండును. 3) ఎఱ్ఱనిరంగు నగ్నికి స్థానమైపూరకంబుండును. 4) ఆకు పచ్చనిరంగుచే వాయువునకుస్థానంబైయనాహతంబుండును. 5) నీలవర్ణంబుచే నాకాశంబునకు స్థానంబై విశుద్ధంబుండును 6) మాణిక్య కాంతులచే నంతఃకరణంబునకు స్థానంబై యాజ్ఞేయంబుండును. ఇక షట్చక్రంబుల యందుండెడి అధి దేవతలను జూపించెద ఇక నీ భార్యను ఎక్కడ బంపితివో నక్కడ కేగుదము రమ్మని ముగ్గురును గలసి రక్తంబుతో నమ్ముకొనియున్న నామెవద్దకుబోయినామెవద్ద గూర్చుండిరి. అంత స్వాములవారు బిడ్డలారా! మీరిరువురును ధైర్యవంతు లయి అతి నిర్మల మనంబుతో జూడుడు. 1) ఇదిగో నిదియే మూలాధారచక్రము. ఇచ్చట నాలుగు దళంబులమధ్యనున్న

శ్రీవినాయకుని చూడుడు. 2) ఇదిగో స్వాధిష్ఠానచక్రంబున నారుదళంబుల మధ్య బ్రహ్మదేవుండు వెలుంగుచున్నాడు చూడుడు. 3) అదిగో మణిపూరక చక్రము. దీనిలో పదిదళముల మధ్య విష్ణుమూర్తి వెలుంగుచున్నాడు చూడుడు. 4) అదిగో అనాహత చక్రము. దీనియందు పన్నెండుదళంబులమధ్య రుద్రుడు వెలుంగుచున్నాడుచూడుడు. 5)ఇదిగో విశుద్ధ చక్రము దీనియందు పదియారు దళంబుల మధ్య జీవుండు వెలుంగుచున్నాడు చూడుడు. 6) ఇదిగో! నిదియే ఆగ్నేయచక్రము. దీనిలో రెండు దళంబులమధ్య పరమాత్మని వెలుంగుచున్నాడు చూడుడు 7) ఇదిగో! ఇదియే సహస్రారచక్రము. దీనియందు వేయి దళంబులమధ్య కోటి సూర్యప్రకాశకుండై శ్రీ గురుమూర్తి వెలుంగు చున్నాడు చూడుడని నేడు చక్రాధిపతులను చూపించగా సిద్దయ్య, కక్కయ్యగారలు సంతోషంబునకు మేరలేక బ్రహ్మానందాంబుధిని మునింగి తన్మయంబున నున్మీలిత నేత్రులయి తిర్గి మేల్కాంచి స్వామీ! సద్గురు శేఖరా! మీ పరిపూర్ణ కృపా కటాక్షంబున నేడుగదా మాజన్మబుతరించె! నేటికి గదా శ్రీ సద్గురు మూర్తిని దర్శింప గల్గినారమని శ్రీ స్వాములవారి పాదపద్మంబులను కన్నులకద్దుకొని శిరస్సాష్టాంగ దండ ప్రణామంబు లాచరించి నిరువురును నిలువంబడి యుండగా స్వాములవారు బిడ్డలారా! మీ శనిపదీర నాయా మూర్తులను శ్రీగురుస్వామిని దర్శించి తిరిగదా? మీరుకడుంగడు ధన్యు లగుటచేతనే యతి రహస్యంబయిన ఈ పావనమూర్తులను

జూడగలిగితి రనగా నంత కక్కయ్యగారు తండ్రీ! తమ మహనీయుల దర్శనంబు జేయించి మా ఇరువురను పవిత్రులనుగా జేసితిరిగాని నా చేజేతుల జేసిన స్త్రీ హత్య నాకెట్లు బాయునని దీనాననుడై వేడగా, నంత స్వాములవారు చిరునగవుతో నాయనా! నీ కేమియు నా స్త్రీహత్య బాధింపదు లే. తిరుగ నీ భార్యను పునర్జీవితగా జేసెద కక్కయ్యా! నీ వేమియు భీతిని జెందకుము. నీ భక్తి అపారము. ఇంత మనోత్యాగి వయిన నీ కే యిక్కట్లు నీభార్యను పునర్జీవితగా జేసెదనని చనిపోయి పడియున్న కక్కయ్యగారి భార్యపై జలంబును ప్రోక్షించి విభూతిని అభిమంత్రించి నామెపై చల్లగా యప్పటియట్లేచనిపోయియుండెను. అంతకక్కయ్యగారు స్వాములవారి పాదంబులపై బడి దుఃఖించుచు స్వామీ! ఎప్పటియట్లే చనిపోయియే యున్నదనగా నంత స్వాములవారు కక్కయ్యగారి పై వస్త్రంబును దీసికొని చనిపోయి పరుండియున్న నామెపై గప్పి వారు ముగురును నామె వద్దనుండి నీవలకు వచ్చి కొంచెము నిలువంబడియుండగా కొంత సేపటికి కక్కయ్యగారి భార్య అబ్బా! యెంత గాఢనిద్రను బోతినని గూర్చుండి కన్నులు తెరచి ముందుపైపు జూడ త్రిమూర్తులవలె నిలువంబడియున్న నా ముగ్గురను నామె జూచి నమస్కారముజేసి స్వాములవారితో తండ్రీ? తమ రేమి? నీచులమయిన మా గృహంబునకు రావడమేమి? తమ పాదధూళి మాకు సోకినంత మా జన్మంబులున్నా. మా వంశ

మంతయు పావనంబయినవని పెక్కువిధంబుల ప్రార్థించగా నంత స్వాములవారు చిరునగవుతో తల్లీ! నీవు నీచజాతియం దుద్భవించినను మిగుల గుణశాలివి, మహాసాధ్వివి. మహా పుణ్యవతి వగుటచేతనే నీవు తిరిగి పునర్జన్మంబునకు రాగలిగి తివి. అమ్మా! ఇంక మే మరుగుచున్నారమని చెప్పి నామెను దీవించి యటనుండి బయలుదేరి వచ్చుచు కక్కయ్య గారితో స్వాములవారు నాయనా! కక్కయ్యా! నీవును నాకు పరమ భక్తుండవు ఇక మీదటనుండి మా సాన్నిధ్యమున కరుదెం చుచు నీకు గల సందియంబులను దీర్చుకొనుచుండుము. ఇక నీ గృహంబున కేగుమని చెప్పగా కక్కయ్యగారు స్వాముల వారికి నమస్కారంబుజేసి సెలవుగైకొని గృహంబునకుజేరి భార్యాభర్తలిరువురును సుఖులై యుండిరి. అంత స్వాముల వారును సిద్దయ్యగారును కలసి గృహంబునకు జేరిరి.

## అష్టమ ప్రకరణము

శ్రీ స్వాములవారు శిష్యజన సమేతుండై గ్రామాదులలో
సంచారంబు జేయుట—ఒక విశ్వబ్రాహ్మణుని దాహంబు
నిమ్మని స్వాములవా రడుగగా తాను కరుగుచున్న
లోహమును దాహంబుగా నిచ్చుట, స్వాములవారు
మనాయాసంబుగా త్రాగుట.

శ్రీ స్వాములవారు నంద్యాలవగైరా గ్రామాదులలో సంచారముజేయ నిశ్చయించుకొని శిష్యసమేతుండై బయలు దేరి వెళ్ళుచుండగా మార్గమధ్యమందున్న "దిగువమెట్ట"

యను గ్రామమున మజలీగా దిగుదమనుకొని నాగ్రామంబున జేరిరి. అచట నొకచోటదిగి భోజనప్రయత్నంబులు తక్కిన వారలు జేయుచుండగా నంతలో స్వాములవారికిదాహంబగు టచే నా గ్రామ విశ్వబ్రాహ్మణుని దాహ మిమ్మనగా తాను లోహమును కరిగించుచు నింటి లోపల దాహం బిచ్చెడి వా రెవ్వరును లేరు. ఆ బావికడ కేగి త్రాగుడని జెప్పగా నంత సిద్దయ్యగారు అయ్యా! ఈ గ్రామమున విశ్వబ్రాహ్మ ణుని యిల్లు నీ దొక్కటేగదా! మీ కులమువారు యితరుల నీరును త్రాగరుగదా! అట్టి విషయంబులను నీ వెరింగియు యచ్చటనో బావి యున్నది. యచ్చట కేగి త్రాగు మనుట మాత్రము నీకు ధర్మమా? దాహం బిచ్చునంతలో ఎంతపని చేసెదవు? ముందు స్వాములవారికి దాహం బొసంగి ఏ పని నైనను జేసుకొనుమని సిద్దయ్యగారు జెప్పగా నంత నావిశ్వ బ్రాహ్మణునకున్న కోపంబునకు మేరలేక ఎక్కడెక్కడి దిక్కులేనివారందరకునుకూడుబెట్టులేక నీళ్ళివ్వలేకప్రాణంబు విసుగుచున్నది. ఈ గ్రామంబున నాఒక్కనియిల్లే తగులబడి యుండుటచేత నాకు బహుకష్టముగా నున్నదని స్వాముల వారిని జూచి తాను లోహమును కరుగు మూసను కొలిమిలో నుండి పట్టుకర్రతో పట్టుకొని అయ్యా!తమరు మహనీయుని వలె దోచుచున్నారు. మీరు భేదరహితులుగదా! ఈ సర్వం బును బ్రహ్మస్వరూపంబని చెప్పుచుందురే! అట్టియెడ మీరు దీనిని త్రావి దాహశాంతిని జేసుకొనుడనిపరిహాసముగా బలు కుచు నా మూసను పట్టుకారుతో పట్టుకొనివచ్చి స్వాముల

వారి చేతికివ్వగా నా మూసను తాను చేతితో బట్టుకొని ఔరా! ఏమీ వీని యహంకారము? లోకంబున దాహమిమ్మని యడి గిన కరుగుచున్న లోహమును దాహముగా గొమ్మనియిచ్చు వారు గలరా? అయినను యితని ఇష్టానుసారంబుగానే త్రాగె దనని నా మూసను యెత్తిపట్టి సునాయాసంబుగా మంచినీరు త్రాగు చందంబుగా త్రాగినను దాహంబింకను దీరలేదు. ఇంకేమైన దాహశాంతిని జేసెడికరుగుచున్నలోహంబులున్న నిమ్మని యడుగగా, అంత నావిశ్వబ్రాహ్మణునకు గుండెలు బద్దలై గడగడ వణకుచు భయంబుగల్గి ముకుళితకరకమ లుండై నిలువంబడి మాట్లాడుటకు నోటివెంట మాటరాక శరీరమంతయు చెమటలుగల్గిమెల్లగాఅయ్యో! స్వామీ!తమకు నేనెంతయో నపచారంబుజేసితిని కేవల మూఢుండనై 'త్రాగె దరా'యని పరిహాసంబుగా బల్కినవెంటనే నీటితో సమానం బుగా నీకరిగెడి లోహంబును త్రాగితిరే మహాప్రభూ! తండ్రీ! నేను మహాపాపిని కడులోభిని. కనుక నే నిట్టి యపచారం బును జేసినాడను. లేకున్న నిటులేల జేయువాడను? తమరు నాయందు పరిపూర్ణ కృపాకటాక్షముంచి పాపుని మన్నింప వేడెదనని స్వాములవారి పాదంబులపైబడి పట్టిన పట్టును వదలకుండెను. అంత స్వాములవారు బిడ్డా! నాకేమియు నీ వపకృతి జేయలేదు. నన్నెరింగినవాడే నా కిష్టుడు. నీ వేమియును భీతిని జెందకుమని జెప్పగా నంతవిశ్వబ్రాహ్మ ణుడు భయంబును వీడి నాయనా! తమరునాయింట నీ రోజు



నుండి నీ బీదవా డొసంగెడి భిక్షను గై కొని తమ హస్తముచే తీర్థప్రసాదంబు లొసంగి నన్ను కృతార్థునిగా జేయుడని పెక్కు విధంబుల ప్రార్థించగా నంత స్వాములవారు నట్లే యని తన శిష్యులంపిరి నా విశ్వబ్రాహ్మణుని యింటికి సిద్దయ్యగారిచే పిలిపించుకొని ఆయన యింటిముందే వంట తయారు జేయించి భోజనాదు లొనరించిన అనంతరము నా విశ్వబ్రాహ్మణునకు కొన్ని నీతులు గరిపి భోజనాదులుజేసి పరుండిరి. పిదప తెల్లవారగనే బయలుదేరి మహానందికిజేరి యచ్చట నున్న నా కొలను యందు స్నానం బాచరించి మహానందీశ్వరుని సేవించుకొని ఆ రాత్రి యచటనుండి తెల్ల వారగనే లేచి నంద్యాలకు జేరిరి.

* నంద్యాల గ్రామవాసులైన విశ్వబ్రాహ్మణులు
శ్రీ స్వాములవారిని అగౌరవముగా జూచుట *

నంద్యాలవాసులైన పాంచాననమువారు అనగా విశ్వ బ్రాహ్మణులలో ఒక తెగవారుండిరి. వారు ధనమదాంధత్వం బున విర్రవీగుచు కన్నుల గానక కడుమత్తులై పిన్నపెద్దలని యైనను దలంచక అరిషడ్వర్గంబులనే వారిమూల దైవంబుగా నెంచి వారి వద్దకు వచ్చుచుండెడి యార్యులందరను బరిహా సము జేయుచు పాపులై యున్న పాంచాననము వారివద్దకు శ్రీస్వాములవారు వచ్చిరి. ఆవచ్చిన స్వాములవారికి కాలము నకు భోజనాది వసతుల నేర్పరుపక ధనమదాంధుడు కూటికి లేని బీదవానిని జూచిన తెరంగునజూచి స్వాములవారితో సరి యైన సంభాషణంబులాడక ఘీరంకరుసు డాంబిక వేషధారులై

పొట్టకూటికై వచ్చిన వీరితో మాట్లాడిన నేమిప్రయోజనం బని స్వాములవారిని తృణప్రాయంబుగా జూచి నా విశ్వ బ్రాహ్మణ సంఘము వారెవరును వచ్చి మాట్లాడరైరి. ఆ గ్రామంబులోగల బుద్ధిమంతులు కొందరువచ్చి స్వాముల వారిని దర్శించుకొని భోజనాది వసతుల నేర్పరచి స్వాముల వారిచే తీర్థప్రసాదంబులు స్వీకరించుచుండిరి. ఆవిశ్వబ్రాహ్మ ణులు స్వాములవారికి భోజనాది వసతు లేర్పరచిగాని, దర్శ నమునకుగాని ఒకరైనను రారైరి. అంత స్వాములవారు నా పాంచాననమువారి యుదేశ్యంబెరింగి తానే స్వయముగ నా పాంచాననమువారి యిండ్లకేగి వారలందరిని ఒక చోట గూర్చి నాయనలారా! మీ కందరకును నేనేమి యపరాధం బును జేసితిని? నా దర్శనంబునకు మీరురాకున్నను నాపొట్ట కొరకై నేనే మీకడ కరుదెంచితిని గదా! మీ దర్శనంబును జేసుకొనునంతటి పూజ్యుడను గానా? మా వంటి బీదవారిపై తమవంటి ధనవంతు లాగ్రహంబును జెందవచ్చునా? పిచ్చు కపై బ్రహ్మాస్త్రంబు ప్రయోగించిన నేమి లాభముండును? అట్లే తమవంటి మహదైశ్వర్యసంపన్నులు యెందును గోర గాని మావంటి వారిపై మీమీ కోపంబులు జూపించిన మేము నిర్వహించుకొనగలమా? అని బలకగా నంత యా విశ్వ బ్రాహ్మణులందరు చిరునగవుతో నొకరి మొగంబు నొకరు జూచుకొనుచు అయ్యా! "ఉదరనిమిత్తం బహుకృతవేషం" బను నార్యోక్తిగా మీ ఉదర నిమిత్తమైగదా యిట్లువచ్చుట. తమరు కులవృత్తిని మాని యాచనవృత్తియే సుఖంబని

దలంచి మీ రిటు వచ్చుట మాకే సిగ్గుగా నున్నది. మా వలె స్వకుల వృత్తిచే జీవనంబు జేయుచు మావలె కడు ధనవం తులై యుండగూడదా? అని నిర్మోహమాటముగా బల్కి నంత స్వాములవారు బిడ్డలారా! మేము బహు బీదవారము. తినుటకు తిండి లేక కట్టుటకు గుడ్డలేక నిర్భాగ్యదామోదరు లమై యిట్లు డాంబిక వేషధారులమై జీవనంబు జేయుచున్నా రము. తమవంటి ధనికుల కే కొరత లేదుగదా! నాయన లారా! మే మందరము బహు క్షుద్బాధచే నున్నారము. మా క్షుత్తును దీర్చెడి పుణ్యు లింతవర కెవరును గాన్పింపరైరి. మీరలా కడుధనవంతులు, కడుసాహసలు. అతిధార్మికులు, బుద్ధికుశలులు. మా క్షుత్తును దీర్చ మీరుదక్క మరెవరును లేరని నాకు దోచుచున్నది నే నెన్నియో దేశంబులు దిరిగి తిని. కాని యింత ధనవంతులు లేరని స్వాములవారు వారిని నెక్కుడుగా బొగడసాగేను. అంత పాంచాననము వారిలో నొకరు లేచి అయ్యా! మీరలు కడుక్షుద్బాధచే నున్నారమని గదా చెప్పుచుంటిరి. మీరెంత అన్నంబును భుజింతురో ఆన తిచ్చిన వెంటనే అంత భోజనమునకు తగు ప్రయత్నము జేసెదమని పరిహాసముగా బలకగా నంత స్వాములవారు బిడ్డలారా! మీరు ఎంత అన్నంబును వడ్డించెదరో అంత అన్నంబును తినునంతటి యాకలిబాధచేనున్నారము. మాకు సరిపోయినంత భోజనము పెట్టించి మా యాకలి దీర్చిన ధర్మాత్ము లింతవరకు గాన్పించ లేదనగా నంతపాంచాననము వారందరు ముసిముసి నగవులతో స్వాములవారినిపరిహాసము

చేయదలంచి మీరు ఒక పుట్టిబియ్యపు అన్నమును భుజింప గలరా? యట్లే భోంచేయుదు మని గట్టిగా జెప్పిన నిప్పుడే వంట జేయించెదమని జెప్పగా నంత స్వాములవారు బిడ్డ లారా! ఒక పుట్టి బియ్యపు అన్నమేకాదు, మీకెంత శక్తి గలదో అంత వంటను తయారు జేయింపుడు. నిరాఘాటం బుగా భోంచేసెదము లెండు వెంటనే వంటకమును తయారు జేయింపు డని జెప్పగా నా పాంచాననమువారు ఒక పుట్టి బియ్యమును దెప్పించి వంటనుజేయించి వెంటనే స్వాముల వారి వద్దకు బోయి స్వామీ ! వంట తయారైనది. మీరు బహు ఆకలిచే నున్నారని జెప్పితిరే! ఇంక ఆలస్యంబును జేయక త్వరగా దయచేసి భోంచేయుడని పరిహాసంబుగాబలు కగా నంత స్వాములవారు శిష్యజన సహితముగా పుట్టెడు బియ్యపు అన్నరాశి వద్దకుబోయి గూర్చుండిసిద్దయ్యగారితో నిట్లనిరి.

శ్రీ స్వాములవారు పాంచాననమువారు వడ్డించిన పుట్టెడు బియ్యపు అన్నమును సిద్దయ్యగారిచే తినిపించుట పాంచాననమువారి గర్వభంగము.

నాయనా! సిద్దా! నీవు నీరాశినంతయు నొక్క తృటి కాలంబులో భోంచేయగలవా ? అన నంత సిద్దయ్యగారు తండ్రీ! నీ కృపాకటాక్షంబున్న నీ భోజనరాశి సరిపోవునా? బనను తమయాజ్ఞ యయినచో ఒక్క నిమిషకాలంబులో అవలీలగా భోంచేసెదననగా స్వాములవారు సిద్దయ్యగారిని భోజనరాశి యొద్దకు గొనిపోయి నాయనా! ఇక భోంచేయుము

మని యాజ్ఞ నివ్వగా నంత సిద్ధయ్యగారు స్వాములవారికి శిరస్సాష్టాంగ దండప్రణామంబు లాచరించి భోజన రాశివద్ద గూర్చుండి స్వామీ! సెలవొసంగితిరా! అన నంత స్వాములవారు భోజనరాశివద్ద గూర్చుండియున్న సిద్ధయ్యగారి శిరంబుపై హస్తముంచి నొక పిడికెడు యన్నంబును భోజన రాశిలోనుండి తీసి బిడ్డా! యింత కానిమ్ము. ఆలసించెద వెందులకని యానతివ్వగా నంత సిద్ధయ్యగారు నా పుష్టి బియ్యపు అన్నమును ఒక్కత్రుటి కాలంలో భోంచేసి హా! హా! యనుచు నోరుదెరచి కన్నులు జ్యోతులవలె నెఱ్ఱజేసి నిలువంబడగా నంత పాంచాననమువారి గుండెలు బ్రద్దలై దిక్కుదోచక మనం స్వాములవారి మహామహిమంబు లెరుంగక మనకున్న ధనమదాంధత్వమున కన్నులు గానక పరిహాసం జేసితిమి. శ్రీ స్వాములవారికి మనము జేసిన యపరాధంబునకు నెన్ని సత్కార్యంబులు జేసినను తీరదు. ఇంక మనమిప్పు డేమిచేయుద మనుకొనుచుండగా వారిలో బుద్ధిశాలియైనఒకరునిట్లనిరి. మనము జేయున దెద్దియులేదు. మన మందరము నొకేసారి స్వాములవారి పాదంబులపైబడి మొరపెట్టుకున్న గాని నిక మన బ్రతుకు తెరువులేదని వెంటనే వారందరు శ్రీ స్వాములవారి పాదంబులపైబడిరక్షింపుము రక్షింపుమని యట్లే యుండిరి. అంత దయాశాలియగు స్వాములవారికి జాలి కలిగి బిడ్డలారా! ఇక లెండని యాజ్ఞాపించి సిద్ధని కింకను భోజనంబు జాలలేదట! ఇతండు క్షుద్బాధ కోర్వజాలక కన్ను లెఱ్ఱజేసినన్నును మిమ్ములను

మ్రింగునట్లుగా హా హా యనుచు పెద్దపెట్టున నెట్లు అరచు చున్నాడో జూడుడు. తిరిగి ఇప్పుడు మీరేమి భోజనంబును జేయించెదరో? వెంటనేతయారు జేయించుడు. ఇందులకేమి మాట్లాడక నతిఖీదవారివలె నూరకున్నారెందులకనగా నంత పాంచాననమువారు గురుసార్వభౌమా! గురుచంద్రమా! మీ బిడ్డలమైన మేమందరము తమ కొనర్చినవన్నియు యపరాధంబులే గాని వేరొండుగాదు. ఇప్పట్లు మమ్మెట్లు రక్షించెదరో తండ్రీ! మమ్ములను పాలముంచినను, నీటముంచినను నీయదే భారంబు కృపానిధీ! కరుణించి గాపాడుమని దుఃఖించుచు కడు దీనావనులై వేడుకొనగా నంత స్వాములవారు తన చేతిలో నుంచుకొనిన అన్నపుముద్దను నోరుదెరచుకొని కన్నులెర్రజేసి మహా యనుచున్న సిద్దయ్యగారి నోటిలో వేయగా యా ముద్దను సిద్దయ్యగారు మ్రింగగానే శాంతిగల్గి యధావిధిగా నుండెను. శ్రీ సిద్దయ్యగారికి శాంతి గల్గిన పిమ్మట పాంచాననమువారందరును స్వామివారి మహిమంబులను గొనియాడుచు స్వామీ! మమ్ములను తమ బిడ్డలవలె జూడుడు. ఈ సంసారవారధి నెట్లు దాటుదుమో దెలియకున్నది. దయయుంచి మాకుతత్వోపదేశం బొనరించి ధన్యులను జేయుడని ప్రార్థించగా స్వాములవారందులకు సమ్మతించి వారందరికి బ్రహ్మోపదేశంబొసంగెను. తెల్లవారుదయమునసే ఆ పాంచాననము వారందరిని రావించి వారికి నిట్లు బోధించెను.

– స్వాములవారు పాంచాననమువారికి తత్వోపదేశంబు చేయుట –

బిడ్డలారా! మీలో మేధావంతుడైన నొకరు నావద్ద గూర్చుండుడు. వానిని నేనడిగెడు ప్రశ్నంబులున్ను వాడిచ్చెడి జవాబును మీరందరును వినుచుండు డనగా పాంచాననము వారిలో నొకరువచ్చి స్వాములవారి పాదంబులకడ గూర్చుండగా నిట్లు ప్రశ్నించెను. (ప్రశ్న) బిడ్డా! నీపైని యుండిన వస్త్రంబు యెవరిది? (జవాబు) ఇదినాది. (ప్రశ్న) అయితే నాయనా నీవు వేరు వస్త్రంబు వేరై యుండ లేదా? (జ) అవును రెండుగానే యున్నవి. (ప్ర) అయితే. నీ శరీరంబు వేరై యుండలేదా? (జ) అవును. (ప్ర) అయితే కరచరణములు మొదలైన కర్మేంద్రియంబులు, జ్ఞానేంద్రియంబులు ఎవరివి? (జ) నావి (ప్ర) అయితే అవియన్నియు నీవని యెట్లు దెలియును? (జ) మనసుచేత తెలిసికొనెదను. (ప్ర) అయితే నీ మనసు చంచలమైనదనిన్ని, మందమైనదనిన్ని దెలిసికొంటి వను సంగతి నీకెట్లు తెలియును? (జ) మనసు మొదలయిన యింద్రియంబుల కన్నిటికిని అధిపతియైన బుద్ధి యొకటి యుండు కారణంబున మనస్సుచే దేహాదిమొదలగు ప్రపంచ మంతయు దెలిసికొనుచున్నాను. (ప్ర) అట్లైతే సరే. బుద్ధియొక్క శక్తిచే దెలిసికొంటినని నీవెట్లెరింగితివి? (జ) దానిపైన ఆత్మయైన నే నుండుటచే తెలిసికొంటిని (ప్ర) అయితే నీవే యాత్మయను సంగతి ఎట్లుదెలియును? (జ) దానిపై వేరొకటి లేకుండుటచే ఆత్మ స్వయంప్రకాశమైనది. గనుక దెలియుచున్నది. (ప్ర) అయితే ఇదివరకు నాది నీది యని రెండు వస్తువులు గనపరచుచు నిప్పుడా నీ వొకరి

మాత్రమై దానికి కారణం మరేమియు లేదనియును, అది స్వయంప్రకాశమని జెప్పుచున్నావే "అదే నీయొక్క నిజ స్వరూపమా" (ప్ర) అవును తండ్రీ! నేను స్వసాక్షి! స్వయంప్రకాశమనుటకు సందియంబులేదు. (ప్ర)బిడ్డా! పిపీలికాది బ్రహ్మపర్యంతముగల ఆత్మపరమాత్మయని దృఢమైనదిగదా. ఇప్పుడు బోధించినది శ్రీ శంకరాచార్య స్వాముల వారు తన శిష్యులకు బోధించిరి. కాన మీరందరును "జగన్మిథ్య బ్రహ్మం సత్యం" అను నార్యోక్తిని మరువక సదా ఆత్మానుసంధానులై యుండుడని బోధించిరి. వారి మంకు గుణంబులన్నియు మన్నచేయించి వారందరకును బ్రహ్మజ్ఞానోపదేశమిచ్చిన పిదప స్వామీ! మాకు కాలజ్ఞానంబును బోధించుడు. ఇదియునుంగాక బ్రాహ్మణులు చతుర్వేదంబులనియును బ్రహ్మకు నాలుగు ముఖంబు లనియును బోధించు చుండిరి. తమరు 'విరాట్ విశ్వకర్మ' సృష్టి విషయంబును బోధించుటలో బ్రహ్మకు నయిదు ముఖంబులని జెప్పియుండిరి. స్వయంభూ విరాడిశ్వబ్రహ్మకు ఎన్ని ముఖంబులో ఏముఖంబున ఎవరు జన్మించిరో విశ్వకర్మసృష్టి జెప్పుమని వేడగా సృష్టి క్రమము జెప్పసాగెను.

నంద్యాల పాంచాననము వారికి పంచముఖ సామ్రాట్టయిన విశ్వకర్మ సృష్టిన్ని, నా యైదు ముఖంబులయందు నుదయించిన వారికి నామంబున్ను, ఒక్కొక్కరి గోత్రమున్ను, శాఖ, ప్రవర లున్ను— నుద్భవించిన శక్తుల నామములున్ను స్వాములవారు దెల్పుట.

శ్లో॥ శివాత్మేతిమమనుః పూర్వం హర్యంశమయ దక్షితే

బ్రహ్మాంశయత్వష్టానము, ఉత్తరం దేవశిల్పయోః ఊర్ధ్వ సూర్యాంశ విశ్వజ్ఞ ప్రంచముఖం త్రినేత్రకం॥ అని యీ శ్లోకంబును జదువగానే నా పాంచాననము వారిలో నొకరు స్వామీ పంచముఖం త్రినేత్రకంబని జెప్పితిరిగదా? ఆ పంచ ముఖంబు లెవరికి? వారి తండ్రి యెవ్వరు? తెలియనటుల దెల్పుమని వేడగా నంత స్వాములవారు శ్లో॥ నభూమిన జలంచైవనతేజోనచవాయవః। నచంబ్రహ్మానచం విష్ణు నచం రుద్రాశ్చతారకః సర్వశూన్య విరాలంబో స్వయంభో విశ్వ కర్మణః। తా॥ అనగా పృథ్వి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, బ్రహ్మ, విష్ణు, రుద్రుడు, ఇంద్రుడు, సూర్యుడు నక్షత్రములు, చంద్రుడు మొదలైనవి ఒక్కటీ లేక సర్వ శూన్యమైయున్న కాలమందు బట్టబయలనే జ్యోతి అంతర్మ ధ్యమందు కోటి సూర్యుల కాంతిగా వెలుగుచున్న బట్టబయ లులో 'ఓమ్' అనే ప్రణవములోనుండి దశవిధ నాదములు బుట్టి ఆ నాదములు పది కలసి జ్యోతిర్మయాకారంగా ప్రకా శించుచు నుండబడినదే 'స్వయంభూ విరాడ్విశ్వబ్రహ్మ' రూపమైయుండును. ఆ రూపమందు 'పంచముఖ సామ్రాట్టు యిన విశ్వకర్మ' ఒక్కడే నిలుచును. అట్లు నిలిచిన పరమే శ్వరునియొక్క స్వరూపధ్యాన మేమనగా శ్లో॥ సద్యోజాతం వామదేవం, అఘోరం తత్పురుషంస్తథా ఈశాన్యముఖ సంజాతా పంచైతే విశ్వకర్మణః। శ్లో॥ అయోమనుంచ బుగ్జాతం వామయాథార్యజుస్థథా। తామ్రమత్వష్టా రజస్సామో

శిలాశిల్పి త్యథర్వణః॥ రౌప్యంపిశ్వం ప్రణవంచ పంచ బ్రహ్మావిధీయతే। తా॥ సద్యోజాత ముఖమందు ..) మను బ్రహ్మ ఋగ్వేదముబుట్టెను... 'మనుఋగ్వేదకం చైవ' నీ బ్రహ్మయొక్కగోత్రము, సానగ, అశ్వలాయన సూత్రం, ఋశ్శాఖ,సద్యోజాతప్రవర, స్ఫటికవర్ణము, వెండిదండకోల, వెండి జంధ్యము, త్రికోణహోమగుండము, కాలమేఘవాహనము, ఏకాక్షరి మంత్ర జపము శివస్య మనుబ్రహ్మణః॥ 2) 'వామ యోధార్యజు స్తథా' వామదేవ ముఖమందు మయ బ్రహ్మయజుర్వేదము బుట్టెను. "యజుర్వేదో మయ స్తదా" నీ మయబ్రహ్మగోత్రము సనాతన, ఆపస్థంబసూత్రం, యజుశ్శాఖ, వాసుదేవ ప్రవర, నీలవర్ణం, నాల్గుమూలల హోమ గుండం, వెదురుదండకోల, పద్మజంధ్యము, ఉతాలమేఖవాహనంబును చతురక్షరీ మంత్రజపము హరి మయబ్రహ్మ॥ 3) "తామ్ర త్వష్టా రజస్సామో" అఘోరముఖ మందు త్వష్టబ్రహ్మసామవేదము బుట్టెను నీత్వష్ట బ్రహ్మగోత్రం అభోనస ద్రాహ్యాయనసూత్రం, సామశాఖ అఘోరప్రవర, తామ్రవర్ణము, వర్తులాకారహోమగుండం, రాసిదండకోల, రాగిజంధ్యం, మహానీలమేఘవాహనము, అయిదువర్ణములు గల మంత్రజపము త్వష్టానాం బ్రహ్మణేనమః॥ 4) "శిలా శిల్పి ర్యథర్వణః" తత్పురుషముఖమందు శిల్ప బ్రహ్మఅథర్వణవేదము బుట్టెను. ఈ శిల్ప బ్రహ్మగోత్రము ప్రత్నస, ఆహ్వాయన సూత్రం, అధర్వణశాఖ, తత్పురుష ప్రవర, ధూమ్రవర్ణం, అయిదు మూలల హోమగుండం, బెత్తపు

దండకోల, శూలిజంధ్యం, కుంభమేఖవాహనం. ఆరువర్ణము లుగల మంత్రజపం మహేంద్రోశిల్పబ్రహ్మా॥ 5) “రావ్యం విశ్వజ్ఞం ప్రణవం” పంచ బ్రహ్మవిధీయతే, ఈశాన్యముఖ మందు విశ్వజ్ఞబ్రహ్మ ప్రణవ వేదములు బుట్టెను. నీ విశ్వజ్ఞ బ్రహ్మగోత్రం సుపర్ణస, కాత్యాయనసూత్రం, ప్రణవశాఖ, ఈశాన్యప్రవర, హేమవర్ణము, ఎనిమిది మూలల హోమ గుండం, బంగారుదండకోల, బంగారు జంధ్యం,వాయుమేఘ వాహనం, ఎనిమిది వర్ణములుగల మంత్రజపం విశ్వజ్ఞ రవి బ్రహ్మణః॥ ఈ పంచముఖ స్వామియైన విశ్వకర్మకు మను, మయ, త్వష్ట, శిల్పి విశ్వజ్ఞ, బ్రహ్మలుద్భవించిరి. ఈ పంచబ్రహ్మలవలన ఆదిశక్తి, పరాశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తులు గల్గెను. ఈ పంచశక్తుల వలన ప్రపంచ నిర్మాణ మాయెను ఈ ప్రపంచ నిర్మాణమునకు తగినట్లు సృష్టిస్థితిలయ తిరోధాన అనుగ్రహము లనియెడి పంచకృత్యాలు నెరవేర్చబడుచున్నవి బిడ్డలారా! నిక పంచ కృత్యములతో సృష్టి యెట్లు గలిగెనో బోధించెద వినుడు.

పంచకృత్యములతో సృష్టి యెట్లు గల్గినది స్వాములవారు
దెల్పుట— నీ పంచకృత్యములకు పారాయణము, ఔపాసనము,
హోమగుండములను బోధించుట.

బిడ్డలారా! భూసార భూతస్వభావముచేత దేవతలు, మనుష్యులు,పశులు,కీటకములు, మృగములు, భ్రమరములు, స్థావరము లందుగల జీవములకు సప్తధాతువులు గలిగి, వాటి యందు స్త్రీ పురుషజాతులు వేరై జీవాత్మలుప్రతి ఫలించుట.

వట బీజ కారణంబులుగా యుద్భవించి వచ్చిన సృష్టి పృథ్వీ కృతమైనదే బ్రహ్మాం. ఈ బ్రహ్మమే మనువాచార్యులు. నీయనకు ఇనుమును సృష్టించుటయును, ఋగ్వేద పారాయణమును, ఔపాసనమును, త్రికోణ హోమగుండమును సృష్టించివిజయించినసృష్టి, సంహారకర్త యనెడు రుద్రసృషి యని జెప్పంబడును. ఇందు వేదవాక్యము 'అయోమనుంచ ఋగ్జాతం'బను వేదవాక్యం ననుసరించిరుద్రరూపమైన కత్తి చేతను సమస్త వర్ణాశ్రమంబులున్నూ సృష్టి పరిపాలనంబగు నట్లు గర్భమునందుద్భవించిన శిశువుయొక్క నాభినాళము తల్లి వేరు పిల్లవేరుగా ఖండించిన వెనుక ధర్మార్థ ఐశ్వర్య కామమోక్షంబులనెడి పంచవిధ ఫల పురుషార్థస్థితులువెలుంగ నట్లుగా కారు మొన, కదురుమొన, ఘంటంమొన,కత్తిమొన, త్రాసుమొన నీ ఐదింటివలన లోకరక్షణ మగుచున్నది. ఇయ్యదిరుద్రకృత్యమని ఋగ్వేదమందు జెప్పంబడియున్నది. ఈ రుద్రుండే మనువాచార్యులు.2) ఇక రెండవదియైన స్థితి కృత్యంబును బోధించెదను వినుడు. నీ స్థితి కృత్యంబును జలాంశమైనది. పృథ్వీకృత్యమును అధికరించ నివ్వక అంతటా తానే వ్యాపించి పృథివిచేత నుద్భవించిన జీవాత్మ లకు కామంబును విస్తరించి కాపాడుట స్థితికృత మనిన్ని, దానికే "అపోవై విష్ణుం" బనియునుఆ విష్ణువేమయాచార్యుల నిన్ని దారుసృష్టియును, యజుర్వేద పారాయణమును, చతు ష్కోణ హోమగుండమును సృష్టించి విజయించినస్థిర, కర్త యనెడి విష్ణుసృష్టియని జెప్పంబడును. ఇందుకు వేదవాక్యం

'వామయోదార్యజుస్తదా' అనెడి వేద ప్రమాణముగా సకల జీవాత్మలున్నూ ప్రాణసంరక్షణ కొరకు దైవానుకూలమైన సర్వవిధ గృహారామ క్షేత్ర సస్యధాన్యాది సామగ్రిలను యేర్పరచి లోక రక్షణ జేయునది విష్ణుకృత్యమనియజుర్వేద మందు జెప్పబడియున్నది. ఈ విష్ణువే మయాచార్యులు. ఈ మయబ్రహ్మయే స్థితికృత్యమునకు కర్త. 3) సంహార కృత్యంబును దెల్పెద వినుడు. మూడవదియైన సంహారకృత్యము తేజోమయాంశమైనది. నీ తేజోంశము జలాంశ కృత్యము నధికరించ నియ్యక అణచి పృథ్వీకృత్యము చేత నుద్భవించిన జీవాత్మలను గలసి విజృంభించినపుడు వాత పైత్య శ్లేష్మంబులను పలు రోగంబులును బోకుండ జేయుటయే సంహారకృత్యము. ఇయ్యది తేజస్సుగనుక ఈశ్వరుండనియును, ఆ యీశ్వరుండెత్వష్టాచార్యులనియును తామస సృష్టియనియును, సామవేద పారాయణమనియును ఔపాసనమును, వర్తులాకార హోమగుండమును సృష్టించి విజయించిన సంహారసృష్టి కర్తయనెడు ఈశ్వరసృష్టియని జెప్పంబడును. ఇందుకు వేదవాక్యము 'త్వామత్వష్టారజస్వామా' అనునట్లు సకల జీవాత్మలున్నూ ప్రాణరక్షణకొరకు దైవానుకూలమైన లోహములను కరిగించి రూపేర్పరచి షణ్మతస్థాపనాది విగ్రహములనున్న యాగశాలలకుగాను, కలశాదులను వంటశాలలయందు పాత్రాదియుపకరణములున్ను, బ్రహ్మోద్యోగమని యజుర్వేదమందు జెప్పియున్నది. ఈ బ్రహ్మమేత్వష్టాచార్యులు. నీ బ్రహ్మయే సంహార కృత్యమునకు కర్త.

4) నాల్గవదియైన తిరోధాన కృత్యమును వినుడు. ఈ తిరోధాన మనునది వాయు అంశము. ఎచ్చటతానై విహరించి తేజోంశమును అధికరించ నియ్యక లోకమునుగాని పృథ్వి చేత నుద్భవించిన జీవాత్మయొక్క స్పర్శవేదులకలసి విజృంభించునపుడు సత్వగుణ ప్రాధానమైన అంతఃకరణంబులణచి యుండుట తిరోధాన కృత్యమనిన్ని దానికే మహేంద్రుని కృత్యమనిన్ని ఆ మహేంద్రుడే శిల్పాచార్యులనిన్ని జౌపాసనమును షడ్కోణ హోమగుండమును సృష్టించి విజయించిన తిరోధాన కర్తయనెడు మహేంద్ర సృష్టియని జెప్పంబడును. యిందుకు వేదవాక్యము శిలాశిల్పి యధర్వణః అను ప్రమానంబును సకలమైన జీవాత్మలున్ను ప్రాణరక్షనకొరకు దైవానుకూలమైన అరువదియారు శిల్పములున్నూ, షణ్మత స్థాపనమున్ను గోపుర స్థూపాది మొదలైన త్రయంత్రిశత్కోటి దేవతాప్రతిష్టాది నిర్మితోద్ధారణమున్నూ, వేద, మంత్ర, ఆగమ, బీజ, ఆవాహన, జప, ఆహుతి, అనుష్టానము మొదలుగాగల అష్టాదశక్రియలును, షోడశ కళాన్యాసములను నిర్మించి మోక్షార్థమైన జ్ఞాన నియమిత నిష్ఠాగరిష్ఠ అష్టాంగ యోగసమాధికి క్రియాసాంప్రా యద్వైత బ్రహ్మస్వరూపంబైన విరాడ్బ్రహ్మముల దెలియుటకు హేతువుగానున్న దేవతలకు సప్తతియాచార్యులై యుండిన సమస్తమైన మంత్ర అంశమువలన సర్వాధార దేవతలును అష్టాదశ వర్ణములును మోక్షము బొందుటకు ఆధారమేర్పరచినవారేశిల్పాచార్యులు. యీయన సృష్టియే దేవేంద్రుని సృష్టియని యజు

ర్వేదమందు జెప్పబడియున్నది. యీ మహేంద్రుడే శిల్పాచార్యులు. యీ బ్రహ్మమే తిరోధాన కృత్యంబునకు కర్త.
**5)** బిడ్డలారా! ఇక నైదవకృత్యంబైన అనుగ్రహ కృత్యంబును జెప్పెదవినుడు. ఈ అనుగ్రహ కృత్యంబును ఆకాశ అంశముచేత విరాడ్విశ్వ బ్రహ్మజ్యోతి రూపకమైన బట్టబయలు నుదయమై వాయు అంశమును నధికరింప నివ్వేకతమకు లోబరచుకొని ఆ వాయువుయొక్క అంశము విజృంభించినప్పుడు అతీతపు భావంబుగల శుద్ధాత్మల ప్రకాశము బయలుపడి విశ్వబ్రహ్మయొక్క ప్రావీణ్యంబునపాలనలోని ఘృతమువలె బరగి ముక్తినిచ్చును. ఆకాశము యొక్క స్వాభికానుగ్రహమును సదాశివుండనియును, ఆసదాశివుండె విశ్వజ్ఞాచార్యులనియును, సువర్ణ సృష్టి యనియును ప్రనవ వేదపారాయణ మనియును, ఔపాసనమును, అష్టకోణ హోమగుండమును సృషించి విజయించిన అనుగ్రిహ కర్త యనెడి సూర్యసృషియని జెప్పంబడును. ఇందుకు వేద వాక్యము "రౌప్యంవిశ్వజ్ఞ ప్రిణవం పంచబ్రహ్మవిధేయతే" అను ప్రిమాణంబుగా సమస్తమైన జీవాత్మలున్నుప్రాణరక్షణకై దైవానుకూలమైన సర్వవిధ త్రయంత్రింశత్కోటి దేవ రాక్షసమనుష్యవర్గ సమస్తవర్ణముల ధర్మములున్ను ప్రికాశము నొందించి స్వర్ణ రజిత రత్నాభరణాదుల సృష్టించి, అష్టవిధ వర్ణములలో స్త్రీ పురుషాదులకు అష్టవిధ వివాహమున్ను దానికి వలయు మాంగల్యముద్రిక ధరించేటట్లుగాను నియమించి కాలచక్రజ్యోతిషాదులనునిర్మించగా అష్టా

దశ వర్ణములలో దుర్మార్గ స్త్రీ వలన మాంగల్య నిషిద్ధులై జన్మించిన అనులోమ ప్రతిలోములు, అంతరాలుడు, కర్ణుడు, కుండకుడు, గోళకుడు మొదలైన వర్గములను కుల పవిత్రులను జేసి పంచవిధ పురుషార్థములు పొందునట్లుగా అనుగ్రహము జేయుట సూర్యసృష్టి యని యజుర్వేదమందు జెప్పి యున్నది. యీ సూర్యుడే విశ్వజ్ఞాచార్యులు. యీ ...హమునకు కర్త. యీ అయిదు విధ అనుష్ఠించుట చేతనే లోకము జరుగు ఋగ్వేదము, యజుర్వేదం, సామవేదం, ప్రణవవేదం, మూలస్తంభము, షట్ శాస్త్ర, సిద్ధాంతం, ఇతిహాసములు, వజ్రసూచిక ... కళదియారు శిల్పములు, ముప్పదిమూడు, వాస్తులు, విశ్వకర్మం, విశ్వేశం, విశ్వసారం, వృత్తం, దావటం, నళం, మయం, హనుర్మాన్, భానుం, కర్మాపభ్యం, సృష్టము, మానసారము, వస్తువిద్యా పద్ధతి, పారాశర్యం, అపెట్టికం, సయిద్ధకం, వాస్తుబోధకం, విత్తారం, ఇంద్రం, వజ్రం, సోమం, విశ్వం, చాశిధం, మగధ్రం, విశాలము, ఛిద్రం, కాపిలం, కాయూవం, నామసంహితం, నాస్తికం, విశ్వబోధం, ఆదిసారము, బహుశృతం, మానభేదము యిత్యాది గ్రంథముల యందు జెప్పియున్నది. యీ అయిదు సృష్టులకు మించి లోకము లేదనిన్ని నివియే పంచ కర్తవ్య అవతార స్వరూపంబులనియు యజుర్వేదమందు జెప్పి యున్నది. అది యెట్లు లనిన, 1) ఆదిశక్తి మనుబ్రహ్మ

స్వరూపాభ్యాం ఉమామహేశ్వరాభ్యాన్నమః 2) పరాశక్తి మయబ్రహ్మ స్వరూపాభ్యాం లక్ష్మీనారాయణాభ్యాన్నమః 3) ఇచ్ఛాశక్తిత్వష్టబ్రహ్మస్వరూపాభ్యాం వాణీహిరణ్య గర్భరూపాభ్యాన్నమః 4) క్రియాశక్తిశిల్ప బ్రహ్మస్వరూపాభ్యాం శచీపురందరాభ్యాన్నమః 5) జ్ఞానశక్తి విశ్వజ్ఞ బ్రహ్మస్వరూపాభ్యాం సౌజ్ఞాభాస్కరాభ్యాన్నమః అను వేద ప్రమాణంబుగా 1) మనుబ్రహ్మయొక్క సృష్టియే ఉమా మహేశ్వరుండైన రుద్రకృత్యమనిన్ని. 2) మయబ్రహ్మ యొక్కసృష్టియే లక్ష్మీనారాయణుండైన విష్ణుకృత్యమనియు 3) త్వష్టబ్రహ్మయొక్క సృష్టియే సరస్వతి ప్రజాపతియైన శచీపురందరుడైన దేవేంద్రుని కృత్యమనిన్ని, 4) విశ్వజ్ఞ బ్రహ్మసృష్టియే సౌజ్ఞాభాస్కరుండయిన సూర్యుని కృత్య మనియు జెప్పియున్నది. విరాడ్విశ్వకర్మణేనమః పరాడ్వి శ్వకర్మణే నమః స్వారాడ్విశ్వ కర్మణేనమః విరాడ్విశ్వ బ్రహ్మస్వరూపంబనియు పరబ్రహ్మమే విశ్వబ్రహ్మంబనియు స్వారాడ్విశ్వరూపంబనియునున్నది బ్రహ్మమన్నది బ్రహ్మ కర్మ మన్నది వేదమాదిగాగల వాక్యములచేత వెలుంగు చున్నదని లోకంలో శాక్తేయనులుయీపంచముఖునిగురించి పంచాక్షరీ మొదలయిన మంత్రములను మానస మందు బూజించెదరు. కాబట్టి యీపంచబ్రహ్మలు చతుర్దశ భువనం బులకు సంరక్షణ కరలని జెప్పగా తిరిగి పాంచాననమువారు

స్వామీ! పంచాంగ మనగానేమిటి! అయ్యది మొదట నెవరు సృష్టించిరో దెల్పుమని వేడగా నంత స్వాములవారు బిడ్డ లారా! వినుండు. పంచాంగమనగా తిథివార నక్షత్ర యోగ కరణములను నీయైదు అంగంబులచే గూడినదానినేపంచాంగ మందురు. ఇందుకు వేదప్రమాణము ఏమనగా శ్లో॥ తిథి రూపము మను ప్రోక్త వారస్య మయ సంభవా। నక్షత్రం త్వష్టరూపంచ శిల్పయోగంచదైవతః। విశ్వజ్ఞం కరణంచైవ పంచాంగో అధిదేవతా. తా॥ తిథులను మనుబ్రహ్మయు వారములను మయబ్రహ్మయు, నక్షత్రములను త్వష్ట బ్రహ్మయు, యోగంబును శిల్పబ్రహ్మయు, కరణములను విశ్వజ్ఞ బ్రహ్మయు, నీ పంచబ్రహ్మలు కూడి పంచ అంగ ములను ప్రమాణంబుగా జేసి పంచాంగమును సృష్టించిరి. ఈ పంచాంగంబునకు నీ పంచబ్రహ్మలును, అధిదేవతలైరని స్వాములవారు జెప్పగా అంత పాంచాననము వారి సంతో షంబునకు మేరలేక స్వామీ! సచ్చిదానందరూపా! సద్గురు సార్వభౌమా! సర్వలోక పావనా! సర్వపాప సంహారకా ! సద్గురుస్వామీ! యని యనేక విధంబుల స్తుతిజేసి పునఃపునః ప్రణామంబు లాచరించి వారందరును శక్త్యానుసారముగా కట్నంబులు సమర్పించగా స్వాములవారు వారందరకు హితోపదేశంబు జేసి వారలను శాంతస్వరూపులుగా జేసివారి వలన వందనపూజ లందుకొని పాంచాననము వారందరను తరింపజేసిరి.

# నవమ ప్రకరణము

శ్రీ స్వాములవారు నంద్యాలనుండి బయలుదేరి అహోబిలంబు జేరుట—
అటనుండి బయలుదేరి వచ్చు మార్గమధ్యమునున్న ఒక బ్రహ్మరాక్షసి
నీచమడంచుట.

శ్రీ స్వాములవారు శిష్యజన సహితంబుగా నంద్యాల నుండి బయలుదేరి ఆయా గ్రామాదులలో దిరుగుచు నచ్చటి భక్తాదులకు అద్వైతంబును బోధించుచు అరణ్యంబుననుండు వింత లనేకంబులు చూచుచు వాని రహస్యంబులను భక్తులకు బోధించుచు మధ్య మధ్య నయ్యరణ్యమున మకాములు జేయుచు అహోబిలంబును జేరిరి. ఆ క్షేత్రంబునకు చిన వోబుల మని పెదవోబుల మనియు పిలుచు వాడుకగూడా గలదు. ఆ క్షేత్రంబున నతిచిత్ర విచిత్రములైన శిల్పము జేసిన సప్తప్రాకారంబుల మధ్యగల ఆలయంబున శ్రీ లక్ష్మీ నరసింహస్వామి గలదు. ఆ దేవాలయంబును జూచినవారికే ఆ వైభవంబు దెలియునుగాని చూడని వారికి నిందు వ్రాసినను వట్టిదిగా దోచును. యీ క్షేత్రము కేవల మహారణ్య మధ్య ప్రదేశంబున గలదు. ఆ ఆలయ ప్రాకారాదులు "ప్రతాపరుద్రుడు" నిర్మాణము చేయించినట్టుల నచ్చట గల శాసనాదులయందు వ్రాయబడియున్నది. [illegible]చ్చట ప్రతిమాఘ శుద్ధ తదియ లగాయతు బహుళ [illegible] యల వరకును మహా వైభవముగా నృసింహస్వామికి [illegible] జరుగును. యీ దేవాలయంబునకు ప్రక్కన సుమారు ఒక మైలు దూరములో


ఒక కొండ గలదు. ఆ కొండపైని గూడా నృసింహస్వామి గలడు. అచ్చట శ్రీ నృసింహావతార చరిత్ర యంతయు నున్నది క్రిందనున్న స్వామిని చిన వోబులేశ్వరుడనియు, కొండపైనియున్న స్వామిని పెదవోబులేశ్వరుడనియు బిలు తురు. అచట నొక చలువరాయి గలదు. ఆరాతివద్దకుబోయి 'నారాయణ!' యని చేతులు జోడించుకొని చప్పట్లు కొట్టిన వర్షబిందువులు రాలునట్లుగా చుక్కలు చుక్కలు బడును. శ్రీ స్వాములవారు చిన వోబులేశ్వరుని దర్శించుకొని యా రాత్రి యచట నుండి తెల్లవారి ఉదయంబుననే నందరు బయలుదేరి గిరిపై నున్న పెద్ద వోబులేశుని సేవించుకొని యచ్చటకు రెండుమైళ్ళ యెత్తుననున్న కొండపై నెక్కి అచ్చట ప్రహ్లాదుని శిక్షించిన ఉక్కుస్థంభమును కన్నులార జూచి హిరణ్యాక్షుని వధించిన చోట రక్త వర్ణముగా నున్న నీటి కొలనుయందు స్నానముఆచరించి తిరిగి నాకొండను దిగుచు నచ్చటచ్చట గల ఘోర మృగంబులను జూచుచు శాఖోప శాఖలుగానున్న వటవృక్షంబుల నీడనవిశ్రాంతికై కొంతవడి నిలుచుచు కొండనుదిగి తిరిగి చినవోబులేశ్వరుని నందరు సేవించుకొని యా రాత్రి నటనుండిరి. ఆ మహా క్షేత్రమునుండి తెల్లవారి ఉదయంబుననే బయలుదేరి వారరు దెంచెడి మహారణ్యంబున నున్న మార్గ మధ్యంబున నొక మహావటవృక్షము క్రింద భోజనాదులకై దిగిరి. ఆ వృక్షం బుపై నెన్నియో సంవత్సరంబులనుండి యొక బ్రహ్మరాక్షసి యుండి యా త్రోవన వచ్చుచుండెడి బాటసారులను భంగ

పరచుచు పీలుగానున్న వారిని వధబెట్టి బాధజేయుచుండెను ఇట్లెందరినో వధచేయుచున్నందున నా మార్గమున నెవ్వరును బోవుట మానిరి. ఎవ్వరు బోవకుండెడి దారినేవచ్చి బ్రహ్మరాక్షసి నివాసం బగు నా వటవృక్షము క్రిందనే నందరును దిగిరి. వారు వంట యత్నంబు జేసుకొనిన పిదప భోజనాదులు చేయుటకు విస్తళ్ళు .లేకుండుటచే నంత స్వాముల వారు నాయనా ! నీ వీ చెట్టుపై కెక్కి కొన్ని యాకులను క్రిందవేయమనిఒకనికిచెప్పి యచటనున్న బావివద్దకుస్నాన ముకై నేగిరి. అంత నా భక్తుడు చెట్టుపైకి నెక్కువరకా చెట్టుపైనున్న బ్రహ్మరాక్షసి భూమి ఆకాశంబులకు సరిపోవు నంత పొడవు పెరిగి, కన్నులెర్రజేసిభక్తునవైపునకుజూడగా నా భక్తుడు భయంబున విభ్రాంతి జెంది నేలపైబడి స్పృహ దప్పి యుండెను. అంత అచ్చటనున్న భక్తులందరును చెట్టుపైకి నొక్కొక్కరు నెక్కుచు స్పృహదప్పి పడిపోవుచుండిరి. అంతట సిద్దయ్యగారికి చిత్రంబుగా దోచి స్నానంబును చేసి నిష్టయందున్న స్వాములవారి కడకేగి వారు నిష్టనుండి లేచు వరకు గూర్చుండి స్వాములవారు నిష్టనుండి లేవగానే సిద్దయ్యగారు స్వామీ ! ఒక్క చిత్రంబు జరిగినది. అది యెద్దియనిన, తమరు ఆకులను గోయమని ఒకరితో జెప్పి వెళ్ళితిరి. అంత నాభక్తుడు చెట్టునెక్కిక్రింద పడిపోయెను, అట్లే నందరు ఒకొక్కరు ఎక్కగానే క్రిందపడి స్పృహ తప్పియుండిరి. ఇట్లు ఒక్కరుగాక నందరును పడిపోవుటకు కారణమేమని యడుగగా నంత స్వాములవారు చిరునగవుతో

బిడ్డా! సిద్దా! యీ పడియుండిన భక్తులందరును శ్రీ గురు నామోచ్చారణ మాత్రమే జేతురు గాని స్థిరబుద్ధిచే జేయు వారలు గాకుండుటచే సద్గతి వారికి తటస్థించినది. దీనికి కారణంబు దెల్పెద వినుము. యీ చెట్టుపైని ఒక బ్రహ్మరాక్షసి యున్నది. దాని రూపమును జూడలేక కన్నులు తిరిగిక్రింద పడిరి. దానికి నేటితో గర్వంబంతయు నణగిపోవుసమయంబు గల్గియే ఎవ్వరును రాని యీ త్రోవను మన మరుదెంచితిమి. ఇదిగో!నీచేత యీ బెత్తంబును బట్టుకొని చెట్టుపైకెక్కుము. అంత రాక్షసి స్త్రీ రూపంబున గడగడలాడుచు నీ చెంతకు వచ్చి నిన్ను మాయజేసి నీ బెత్తమును క్రిందవదలి వేయుమని జెప్పుచు నెన్నియో మాయలు జేయుచుండును. భయంబును జెందక చెట్టుపైని గల కొమ్మపై నీవు దిట్టవుగా గూర్చుండుము. ఆ వెంటనే దాని నడినెత్తిపైని వెంట్రుకలను బట్టుకొని క్రిందకి తిన్నగా దానిని లాక్కొనివచ్చుచు, బెత్తమును మాత్రం వదలవద్దని జెప్పగా నంత సిద్ధయ్యగారు స్వామీ! ఆ వెధవకొరకై చెట్టుపై నెందుల కెక్కవలెను? తమ దివ్య నామామృతమును గ్రోలుచు నిచ్చట గూర్చునియున్న రాక్షసి మనకడకు పరుగెత్తుకొనుచురాదా? యని జెప్పగా నంత స్వాములవారు నాయనా! యెందులకోయి అంత కష్టము. నేను జెప్పినటుల జేయుము. పిమ్మట జరిగెడి వృత్తాంత మంతయు జూడుమని జెప్పగా నంత సిద్దయ్యగారు స్వాములవారికి నమస్కారముజేసి స్వాములవా రొసంగిని బెత్తంబును చేబూని శ్రీగురుధ్యానుండై చెట్టు

పైనున్న కొమ్మపై నెక్కి గూర్చుండగానే గడగడలాడుచు ఒక సౌందర్యరూపంబును దాల్చి సిద్దయ్యగారికడ కరుదెంచి నెన్నియో మాయలు జేసెను. గాని దానిమాయలు సిద్దయ్య గారివద్ద సాగనందున నా రాక్షసిశిరంబువంచి సిద్దయ్యగారికి నమస్కారము జేయునపుడు నా రాక్షసి నడినెత్తిపైనివెంట్రు కలను సిద్దయ్యగారు పట్టుకొని మెల్ల మెల్లగా క్రిందికిదిగి నా రాక్షసిని స్వాములవారికి అప్పగించెను. అంత స్వాముల వారు తన బెత్తంబుచే నారాక్షసి శిరంబుపై మూడుదెబ్బలు కొట్టి విభూతిని అభిమంత్రించి పైన చల్లినంతనే నా రాక్షసి బలమంతయు తగ్గి. కాళ్ళువిరిగిన పక్షి చందమాయెను. అంత నా స్వాములవారు ఓసీ! రాక్షసీ! నీ వీ మార్గమధ్యంబున నీ వృక్షంబుపైనుండి నిటు వచ్చుచుండెడి బాటసారులను ఘోరకష్టంబులు పెట్టి బాధించుటచే మానవులంతా జడిసి నీ మార్గంబున వచ్చుట మానిరి. ఇప్పటి నుండియు పసిబిడ్డ ఒంటరిగా వచ్చినను, పశువులు వచ్చినను వారి జోలికేగనని నా పాదంబులు బట్టుకొని ప్రమాణంబు జేయుమనగా నంత నా బ్రహ్మరాక్షసి స్వామీ! నే-నీ చెట్టుపై నెన్నియో వత్స రంబుల నుండియు నుంటినిగాని నేనెవ్వరికినిచిక్కినదానను కాను. యీ మహారణ్యంబును పాలించుటకు నేనే యొక రాజుగా నున్నాను. నేటికి నాశక్తినంతయు మీచేతిలోనున్న విభూతి నా శరీరంబుపై బడినంతనే నేనెందులకు బనికిరాని దాననైతిని, సరే! ఇంక నేనేమి చేయుగలదానను? మీరెన్ని ప్రమాణంబులు జేయుమన్నను జేయుదానను గాని తమరు

కేవల భగవత్స్వరూపులవలె గాన్పించుచున్న వారలు లేకున్న సామాన్య మానవులకు నా పీచమడంచ శక్యంబు గాదు గాన ఓ దేవా! నాకీ దౌర్భాగ్యపు దశ వదల్చి కేవల మోక్షప్రాప్తి గలుగునట్టి పరమ రహస్యంబును బోధించి కడతేర్చుమని వేడుకొనగా నంత స్వాములవారు ఓసీ! రక్కసీ! నీ శరీర బలంబుడుగుటచేత నీకు వైరాగ్యంబు గావలసివచ్చె. లేకున్న రాజ్యపరిపాలన గావలసివచ్చుగదా! నీ వింతవరకు రాజఠీవితో నీ చెట్టుపైనుండి యీ మహారణ్యంబును బాలించితివి. ఇంక ఇప్పుడన్నచోనింత నిర్జీవునితో సమముగా నుండునట్లు జేసెదను. ఇదివరలో నీ చెట్టుపైని నున్నప్పు డెంత సుఖంబుగా నుండెనో నీకే తెలియునని జెప్పగా నంత రాక్షసి రక్షింపుమని స్వాములవారి పాదంబులపై బడగా శ్రీస్వాములవారు ఓసీ! రక్కసీ! నీవు కొన్ని వత్సరంబులుహీనంబుగా నుండక తప్పదు. ముందు కొన్ని యేండ్లకు ఈశ్వరమ్మయను నొక వీరమాత యీమార్గంబున తాను శిష్యసంచారంబునకై వచ్చును అప్పటికి నీబలంబంతయు పూర్తిగాతగ్గియుండును. ఆమెయీచెట్టుక్రిందనే దిగి భోజనాదివసతుల నేర్పరచుకొనును. అప్పుడు మహాదేవియైన ఈశ్వరమ్మగారిని వేడుకొనిననామె యేనీజన్మరాహిత్యంబున జేయునుగాని నేనిప్పుడునిన్నేమియు జేయుటకు వీలుండదు నీవు హీనదశను కొన్నివత్సరంబు లనుభవింపవలసినయోగం బున్నది. ఆమెవచ్చువరకునుఖుతిపాసాదులు లేకుండునట్లు



బ్రహ్మరాక్షసి ఆకులు కోరియు శిష్యులను భయపెట్టుట.



[illegible]గారు బ్రహ్మరాక్షసిని శపించుట

జేసెద. ఇదియే నీకు నేను జేయు మహోపకారంబని జెప్పి రాక్ష సిని నోరు తెరువమని స్వాములవారు విభూతి అభిమంత్రించి రక్కసి నోటిలో వేయగా నోరుపోయెను. తిరిగి నా విభూతిని కరపాదంబులపైచల్లగా కరపాదంబులబలమంతయు పూర్తిగా తగ్గెను. ఇచ్చిపుచ్చుకొనుటకు కరంబులును, నడచుటకు పాదంబులును, తినుటకు మాట్లాడుటకు నోరును లేనిదై యెందులకు బనికిరానిదాయెను. అంత నా రక్కసి జూచు చుండగనే స్పృహదప్ప నేలపై బడియున్న భక్తులకడకు శ్రీ స్వాములవారేగి తనచెంతనున్న బెత్తంబును పడియున్న వా రందరిపై నానించగనే వారందరు యథావిధిగా లేచికూర్చుం డిరి. ఈ జరిగిన వృత్తాంతమంతయు భక్తులతో దెల్పి రక్క సినిజూచి, ఓసీ! రక్కసీ! నీవీ వటవృక్షమువద్దనే నా మహాదేవి యరుదెంచు వరకును కొండ శిలువవలె పరుండియుండుము. ఇక్కమే మేగెదమని జెప్పి నటనుండి బయలుదేరి కడప గ్రామంబు జేరి తమ రాకను నవాబున కెరింగించెను.

శ్రీ స్వాములవారు కడప గ్రామంబు జేరుట, కడప నవాబు స్వాముల వారిని తన మహలునకు దోడ్కొనిపోవుట, నవాబు మనంబువంగల కోరికెను స్వాములవారు జెప్పుట

శ్రీ స్వాములవారు అరుదెంచి రని నౌకరులు వచ్చి జెప్పిన తోడనే తన పరివారముతో బయలుదేరి స్వాముల వారి వద్ద కేగి వారికి శిరస్సాష్టాంగ ప్రణామంబు లాచరించి తిరిగి సిద్దయ్యగారికి గూడ నమస్కారం బొనరించి స్వాముల వారిని నౌక పూలపల్లకి యందున గూర్చుండ బెట్టుకొని

భేరీమృదంగాది వాయిద్యంబులతో కడపగ్రామంబున నూరే గింపుజేసి తనరంగమహాలునకు దోడ్కొనిపోయి ఒక బంగరు పీఠంబున గూర్చుండబెట్టి యర్ఘ్యపాద్యాది విధులంబూజించి కరములు జోడించుకొని వినయవిధేయుండై స్వామీ! తమరు మద్గృహంబున కరుదెంచుటచే నా వంశమంతయు పావనం బయ్యె నే నెంతయు ధన్యుండనైతిని. మహాత్మా! తమరీ మహాలునందుననే యుండుడు. ఇచ్చటనే తమకు భోజనాది వసతులను జేయించెదనని జెప్పి తన మహాలులోని కేగెను. అంతసిద్దయ్యగారుస్వాములవారి పాదంబులు వొత్తుచుతండ్రీ! నా తండ్రియైన పీరుసాహేబు నేను కులభ్రష్టుండనైతినని ఫిర్యాదు జేసినది యీ నవాబువద్దనే యని జెప్పి, తనకును నవాబునకును జరిగిన విషయంబు లన్నియునుజెప్పునంతలో నవాబు భోజనాదివసతుల నేర్పరచి వారందరును శయనించు టకు వీలయిన ననేక వసతుల నేర్పరచి వంటను తయారు జేయించి స్వాములవారి కడకు నవాబు వచ్చి స్వామీ! భోజనంబునకు అకాలంబైనది. ముందు భోజనంబు జేసి పిమ్మట విశ్రమించుడని జెప్పి తాము ను భోజనంబునకై నేగెను. పిమ్మట శిష్యజనసహితంబుగా స్నానసంధ్యాద్యను ష్ఠానంబులు దీర్చుకొని యందరును భోజనంబుజేసిపరుండిరి. నవాబును భోజనంబు చేసిన పిమ్మట కొంచెము పరుండిఇట్లు ఆలోచింపదొడంగెను. ఇదివరకే సిద్దయ్యగారు శ్రీస్వాముల వారి మహామహిమాస్పదులని చెప్పియుండిరి. ఇప్పుడు వీరి మహిమంబులను నేనెట్లుపరీక్షింతునని నదేఆలోచనలోయుం

డగా నవాబు మనంబున నొకటి దోచెను. అదియేమన్న నా వద్ద నేనెక్కడి చూడి గుఱ్ఱమున్నది. దానికేశిశువు జన్మించు నని బహిరంగముగా సభ జేయించి యచ్చట శ్రీ స్వాముల వారిని ప్రశ్నించెద. అందులకు స్వాముల వారేమి ఆజ్ఞ నొసంగెదరో యని మనంబున యనుకొని దిరిగి నవాబిట్లు ఆలోచింపదొడంగెను స్వాములవారు గుఱ్ఱమునకు మగదో ఆడదో శిశువు జన్మించుననిగదా జెప్పెదరు. తిరిగి యా గుఱ్ఱంబు నే రెండు మాసంబులకోగాని యీనదు. అదియీని నప్పుడుగదా వారు చెప్పిన నిజానిజంబులు దెలియును! నేను జేయు ఆలోచన సరికాదు. స్వాములవారు ఫలానా శిశువు జన్మించునని జెప్పినప్పుడే తన గర్భమందున్న శిశువును జూపెదరా యని అడిగెదను. అప్పుడేమి యాజ్ఞ నొసంగె దరో యని మనంబున నాలోచించుచు నిద్రించెను. అంత నవాబు వెంటనే మేల్కాంచి శ్రీస్వాములవారికడ కరుదెంచి నమస్కారం బొనరించి వారిచే దీవనలంది నటుగూర్చుండి స్వామీ! రేపు సాయంత్రము నా కచేరీకి ముందుండు మైదా నమందు జరిగెడు సభకు తమరు దయచేయ ప్రార్థించు చున్నాడనని జెప్పగా నంతస్వాములవారు బిడ్డా! నీవు నావద్ద నుండి వెళ్ళినలగాయితునీవు పరుండి నాలోచించుకొనుచున్న విషయంబు నాకుదెలియును సరే, పిమ్మట నీకే తెలియునులే యని నాయనా! నీ వెచ్చటకు రమ్మనిన నచ్చటకేనరుదెంచి నీకు నే కోర్కెకలదో యా కోర్కెలన్నియు దీర్చెద నని జెప్పగా నంతనవాబుమనంబున నాశ్చర్యముదోచి స్వాముల

వారిశిష్యుండైన సిద్దయ్యగారే ఇదివరకో నాకథ నంతమహి మంబులు జూపగా నీ స్వాములవారు నా మనంబునం గల కోరిక నెరుంగుట ఒక్కలెక్కయా! యెవరెవరిఅభిప్రాయంబు లా స్వాములవారికి తెలియును. కేవల భగవత్స్వరూపులుగాక యున్న నా మనంబునగల విషయంబు లెట్లు దెలియును ? యీయన సామాన్యమానవుండనిదలంచరాదు కేవలవైకుంఠ వాసుండే యీ నరరూపంబున నవతరించియీకలికాలమూఢు లను మోక్షదాయకులుగా చేయుటకై అవతరించిన అపరావ తారియని తలంచి స్వాములవారిచే సెలవుగైకొనియటనుండి బయలుదేరి తనకచేరికివెళ్ళియట సర్వజనులకును శ్రీస్వాము లవారి రాక నెరింగించుటకై కరపత్రంబుయం దీ విధంబుగా వ్రాసి నచ్చుసు వేయించి సర్వజనులకు పంచి పెట్టించెను. కరపత్రంబుం దుందిట్లు వ్రాసియుండెను. 'శ్రీ మద్వేదాంత సార సచ్చి దానందాద్వితీయాంరోక్ష స్వయం ప్రకాశులు నాదబిందు కళాతీతులను ఆద్యంతరహితులను అఖిలలోక పావనులును శ్రీమత్కందిమల్లయపల్లె మఠాధినాథులను శ్రీ సిద్దేంద్రస్వాములవారి ' కుసార్వభౌములను మహామహిమా న్వితులునగు శ్రీ జగద్గురు విరాట్పోతులూరివీరబ్రహ్మేంద్ర స్వాములవారు మన పూర్వపుణ్యవశంబున మనపట్టణంబునకు విచ్చేసినారలుగాన శ్రీస్వాములవారిని దర్శించుకొన నభిలాష గలవారందరును నా కచేరి ముందుండు మైదాన ములో శ్రీ స్వాములవారికై నిర్మింపబడినచిత్రవిచిత్రమహల్ కడకు విచ్చేసి యీ దివ్యమంగళ విగ్రహుని దర్శించుకొని

శ్రీవారు జెప్పెడు సర్వవిషయంబులను, జూపెడి మహామహి మంబులను నేత్రానందముగా చూచి పిమ్మట శ్రీ స్వాముల వారికి జరుగు నుత్సవాదులను జూచి నన్ను కృతార్థునిగా జేయ నీదాసునివిజ్ఞాపన. ఇట్లు సర్వజనశ్రేయోభిలాషి కడప నవాబు' అని కరపత్రములయందు వ్రాయించి పంపించెను. మరునాటి యుదయంబునకే కడప గ్రామమంతయు పచ్చని తోరణంబులతో శృంగారింపబడెను. పగలు పన్నెండు గంట లగుసరికి గ్రామమం దెచ్చట చూచినను శ్రీ స్వాములవారిని జూడవచ్చిన జనసమూహంబుతో బజారులన్నియు క్రిక్కిరిసి యుండెను. ఆ గ్రామమం దెచ్చట చూచినను మంగళవాయి ద్యంబులతోడను, శ్రీస్వాములవారికి జై జైయను శబ్దంబుల తోడను భగవద్భజనల తోడను రెండవవైకుంఠమో యను నట్లుగా నా కడప గ్రామం బుండెను. సాయంత్రము మూడు గంటలగుసరికి పూలపల్లకి నొకటి తెప్పించి శ్రీ స్వాముల వారిని గూర్చుండిజేసి శ్రీ సిద్దయ్యగారిని శ్రీవారి పాదంబుల కడ నుండునట్లుజేసి భేరిమృదంగాది వాయిద్యంబులతో నా కడప గ్రామంబులో నూరేగింపు జేయించి స్వాముల వారికై నిర్మింపబడిన చిత్రవిచిత్ర మహలునందు బంగరు పీఠంబుపై నాసీనునిగా జేసిరి. పిమ్మట నవాబు నా మహా జనంబుననిశ్శబ్దంగానుండునట్లుజేసిరి. అంత శ్రీ స్వాముల వారికిని సిద్దయ్య గారికిని నవాబు శిరస్సాష్టాంగ దండ ప్రణామంబు లాచరించి ముకుళించి కరకమలుండై — నిలువ

బడి దేవాదిదేవా! మహానుభావా! కేవల జ్ఞానశూన్యులైన మానవాళిని నుద్ధరింప నీ యుర్వియం దవతరించితిరని ననేక విధంబుల స్తోత్రంబులను జేసిన పిమ్మట సిద్దయ్యగారు లేచి శ్రీ స్వాములవారికి నమస్కారంబును చేసి చేతులు జోడించుకొని శ్రీ మదఖండ సచ్చిదానంద స్వరూపా! శ్రీ గురు సార్వభౌమా! మాయా మయంబైన యీ ప్రపంచంబున తమవంటి మహామహులుండుట చేతనే మా వంటి వారలు సద్గతి జెందుటకు త్రోవగల్గినది. ది॥ 'ధరణిలోపల నారారు తత్వములకు, నవల యున్న తత్వంబునెవ్వడెరుగు? శివుడు గుణరూపమున వచ్చి జెప్పకున్న,నన్యతరభోగి శ్రీసదానంద యోగి' అనునార్యోక్తిగా పంచవింశతితత్వాతీతంబైన మహతత్త్వంబు నెరింగించుటకై అవతారంబెత్తిన అమరావతారుండవు. స్వామీ! మీ మహిమంబులు దెలియక బుద్బుదప్రాయంబులైన పాంచభౌతిక కాయమే శాశ్వతంబని నమ్మి మాయకులోనై నగ్ని యందుంబడి చచ్చెడిశలభంబుమాడ్కి బుట్టుచు గిట్టుచు నధోగతి పాలగుచున్నారలు. మహాత్మా! మహాతేజో ప్రకాశభాస్కరా! శ్రీ వీరబ్రహ్మేంద్రదేవా! శ్రీ వీరభోగవసంతావతారా! యని పలువిధంబుల ప్రార్థించి నమస్కారంబుజేసి నిలువండగా అంత స్వాములవారు సిద్ధయ్యగారిని, నవాబును గూర్చుండుమని ఆజ్ఞయొసంగెను.

శ్రీస్వాములవారిని నవాబు తనవద్దనున్న మాడి గుఱ్ఱమునకు యే శిశువు జన్మించునని ప్రశ్నించుట-ఫలానారూపంబునంగల శిశువుగలుగునని చెప్పి గుఱ్ఱము గర్భంబులోని శిశువును స్వాములవారు సభయందు జూపుట

శ్రీస్వాములవారు ఆసభయందున్న వారందరికినికొన్ని అద్వైత విషయంబులను బోధించిన పిమ్మట నవాబు లేచి ముకుళితకరకమలుండై నిలువంబడి స్వామీ! యీ దీనుని విజ్ఞాపనంబును తమ శృతి కంధరంబుల కానందంబగు నటుల విని మదీయ మనోసంశయంబును దీర్చి నన్ను కృతార్థునిగా జేయుదు రని నమ్మికతో మనవి చేయుచున్నాడను యీ దాసుని ప్రార్థన యేమంటిరేని నావద్ద నొక చూడిగుఱ్ఱంబు గలదు. నా గుఱ్ఱంబునకు ఆడశిశువో లేక మగ శిశువో జన్మించునది నాజ్ఞానోసంగుడని దీనుడై వేడుకొనగా, నంత స్వాములవారు చిరునగవుతో బిడ్డా! ఆ గుఱ్ఱంబును నీ సభ లోనికి రప్పింపుము పిదప జెప్పెద ననగా నవాబు వెంటనే గుఱ్ఱంబును దెప్పించి స్వాములవారి ముందర నిలువంబెట్టిరి.

అంత స్వాములవా రానందంబున గుఱ్ఱంబునుగాంచి మృదుమధుర వాక్కులతో నిట్లు సెలవొసంగిరి. బిడ్డా ! దీని గర్భంబున నాల్గుకాళ్ళు తెల్పు, నొసటచుక్క, పువ్వుతోక కల్గిన మగశిశువు గల్గును. కాన నా మాట నిక్కువం బని దలంచుము నీ మనంబున నన్యథా దలంపకు మని జెప్పగా నవాబు మనంబున నిక్కువం బెట్లు దెలయు నని దలంచి మహాత్మా! జగద్గురూ' ఎప్పటికో రెండుమాసములకు గదా నీ గుఱ్ఱంబు యీనునది-అప్పటిదనుక-బుద్ధ్భవ ప్రాయ

మైన యీ మాయకాయంబునిలుచునని నమ్ముటకు వీలుం డదు గాదా ! జగన్నాటక సూత్రధారుండవైన యో పర మాత్మ స్వరూపా ! నీ యల్పుని మనోసంశయం బెట్లు దీరు నని వేడగా స్వాములవా రిట్లనిరి. నాయనా! నా మాటలు నిక్కంబని నమ్మిన మానవులు ఎప్పటికి చెడరు వారు నిహపరంబుల యందును సదా పూజ్యులయ్యే యుండురు. మానవ జన్మంబెత్తిన ప్రతి మానవుండును కష్టసుఖంబులకు బాధ్యుడై యుండును. అందు భగవత్పూజచేయు పుణ్యులకు కష్టంబు లధికంబుగా సంభవించుచుండును. అట్టి కష్టంబు లను సుఖంబులుగా దలంచి నన్ను సేవించుచుండిన వారలకు జన్మంబు లుండవు. నా విషయమై వ్రాయ నే భక్తుడైనను నుల్లంఘించువారలకు నిహమందు కష్టమును,పరమందు నర కంబు తప్పక గలుగునని జెప్పిసభలోనిలువంబెట్టినగుఱ్ఱము వద్దకు స్వాములవారు బోయి నిట్లనిరి——బిడ్డా! నవాబూ! నీవు వెంటనే నాలుగు వైపులను నాలుగు కర్రలను పాతించి చుట్టును నొక తెర కట్టించి తెరలోపల గుఱ్ఱంబును గట్టివే యించుము. నీకు దానిగర్భమందున్న శిశువునునీసభయందు నందరకును కనుపించునటుల జూపించెదనని జెప్పగా నంత నవాబు, స్వామీ! సద్గురు ప్రభూ! జగత్పూజ్యుండవైనయో జగద్గురువా! తమ దర్శన ప్రాప్తిచే గల్గినపుణ్యంబునకు,యీ నోరులేని నిండు చూడి గుఱ్ఱపు ప్రాణంబు దీయుటకు గల్గిన మహాపాతకంబునకు సరిపోయినదే. మహాత్మా! దీనబంధో ! అపరాధినై నే నొనర్చిన యపరాధంబును సైరించి యీ



బ్రహ్మంగారు కడప నవాబునకు గుఱ్ఱము గర్భములోని శిశువును చూపుట.

దీనుని విన్నపం బాలించి నాకు నా శిశువును జూపకున్నను సరే సకల చరాచరాంతర్వ్యాపకా ! సద్గురుచంద్రమా ! నా గుఱ్ఱపు ప్రాణంబును మాత్రముదీయకుము' అని అనేకవిధం బుల నవాబు వేడుకొనగా నంత స్వాములవారు నాయనా! నీ కెందులకోయి సందియము? నీవు మా మహిమను నెరింగియు నేమియు నెరుంగని పిచ్చివానివలె మాట్లాడెద వేల? నీ గుఱ్ఱంబును తిరిగి సజీవినిగా జేసి నీకు నొప్పగించె దనుతే యని తెరలోనికి గుఱ్ఱంబును దీసికొనిపోయి నైదు నిమిషంబులలో స్వాములవారు జెప్పిన గుర్తులుగల మగ శిశువును నా సభవారందరకును, నవాబునకును జూపగా అచ్చటనున్న జనులందరును నాశ్చర్యంబు నొందినిర్విణ్ణులై నిలువబాతిన కొయ్య బొమ్మలవలె నట్లేజూచుచు కూర్చొని యుండిరి. అంత నవాబు లేచి తండ్రీ ! నా యందు దయ గల్గిన వారలయినచో నీ చనిపోయినగుఱ్ఱంబును బ్రతికింపుడు. లేనిచో దానినట్లే యుంచుడని వేడగా అంత స్వాములవారు బిడ్డా! నీ వేమియు భయంబును జెందకుము. నీ గుఱ్ఱమును మరల నీ కొసంగెదను గాని నీ మనంబున గలవిచారంబును విడువుమని స్వాములవారు తన వెండిబెత్తంబు చేబూని గుఱ్ఱపు శిశువును నెత్తుకొని తెరలోపలికేగి వెండి బెత్తం బుచే నొక దెబ్బ కొట్టి బిడ్డా! లెమ్మనగానే నా గుఱ్ఱము కిలకిల సకిలించుచు వచ్చి సభలో నిలువంబడియెను. అంత సభాస్థలి మనంబు అపరిమిత పారావారమైన సంతోషంబున మునింగి శ్రీ స్వాముల వారి మహిమంబులు వర్ణించు

కా శేషాహికైనను తరంబు గాదని నందరునుస్వాములవా మహిమంబులను గొనియాడుచు వారి వారి గృహంబు కేగిరి. పిమ్మట స్వాములవారిని మంగళ వాద్యంబులతో నవాబున్న మహాలునకు గొనిపోయిరి. ఆ రాత్రి భోజనా నంతరము నవాబు స్వాములవారి కడ కరుదెంచి స్వామీ ! యీ దాసునివద్ద తమరు సదా నుండిన సంతోష దాయక ముగా నుండును. తమరు రేపు ఉదయమే వెళ్ళెదమని నింద నుక సెలవొసంగితిరి. తిరిగి తమ దర్శనము ఎప్పుడొసంగెద రన వేడగా నంత స్వాములవారు బిడ్డా! నీమనంబు నింకను గాలిలోని దీపంబురీతిగానున్నది. నీవు నెప్పుడు నన్ను దలం చినను నచ్చటనే గాన్పించు చుందును. నీవు మనోనిశ్చ యంబుగలవాడై సదా నన్ను ధ్యానించుచు కడతేరు మని జెప్పి నాయనా ! నీకు ఇంకను కొన్ని విషయంబులను బోధించవలసి యున్నది. నా నివాసంబునకు అరుదెంచి కొన్ని దినంబు లుండిన నీ మనోనిశ్చయంబులన్నియు దీరు నని జెప్పగా నంత నవాబు స్వామీ ! ఈ రాత్రికి నాకు భవిష్యత్తును బోధింపుడని వేడగా స్వాములవారు నాయనా ! అట్లే వినిపించెదనని జెప్పనారంభించెను.

• శ్రీ స్వాములవారు కడప నవాబునకు కాలజ్ఞానోపదేశంబు జేయుట *

శ్రీ స్వాములవారు నవాబును దగ్గర గూర్చుండబెట్టు కొని బిడ్డా! నీవు నా దివ్యమంత్రోపదేశమును. నీమనంబున దిట్టపరచుకొని అంతరంగ భక్తి గలిగి నే జెప్పబోవు కాల జ్ఞానంబును చక్కగా వినుము, ఆచండాలాంత మెవరైనను



బ్రహ్మంగారు కడప నవాబుకు కాలజ్ఞానము బోధించుట

నా దివ్యమంత్రమును మదిమైలయనుననుమానంబులేకమనం బునుజంపి బుద్ధిని స్థిరపరచిఅంతఃకరణంబునునడవిపాలుజేసి చిత్తంబునునుగ్గునుగ్గుగాదలంచివైరాగ్యంబనుమంటలోగాల్చి యటుపిమ్మట నెరుకను మరువక నంకుశంబుననప్పుడప్పుడు బొడుచుచు నహోరాత్రంబులు జిహ్వాగ్రంబునందు మానక పఠించుచున్న వారలకునుమీకుసుదర్శన మిచ్చెదను.యోగిని శక్తులవలన రాబోవుప్రళయాంకురంబులునన్నునమ్మినవారికి నంటజాలవు. కావున నీవు శ్రద్ధాళుండవై నీకు బోధించిన ఓం, హ్రీం, క్లీం, శ్రీం, శివాయ, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి నేనమః అను ఈ మహామంత్రమును సదా జపించుచున్న, సకలమైన పీడలు తొలగి యఖండైశ్వర్యవంతులై యుండి, వీరి ధర్మంబులను జూడగలరు. నేను శ్రీ వీరభోజుండనై నే నీ ప్రపంచంబున కరుదెంచులోపల ననేకఉత్పాతాంబులు గల్గును. కలియుగము 5000 అగుసరికి దుష్టనిగ్రహ శిష్ట పాలనంబునకై వచ్చెదను. దుష్టుల నాశనంబునకై కొన్ని ప్రళయాంతకంబులు గల్పింతును. ఉప్పుకొండూరులో నూరి చెరువులకింద నుత్పాదంబులు బుట్టేను. ఉత్తమ వైశ్యులు తుదకు నష్టమయ్యెదరు. జలప్రవాహంబున పదునాలుగు పట్నంబులు పాడగును నారాకకు అదే మీకు నిదర్శనము. ముండ్లపాడు వద్ద మునులు చేరుకొని ముందర దోపిళ్ళకు పోయేరు. నాలుగు వర్ణములవారు న్యాయంబు దప్పి నడ తురు. దేశమంత మసిపాత మాడ కమ్ముదురు. 5972వ సంవత్సరం ధాతనామ సంవత్సర మాఘ శుద్ధ బుధవారము

రోజున పట్టపగలే పదునెనిమిది పట్నంబులు కొల్లలవోవును. గుణవంతులు కొందరు రాచపాలెం తచ్చుబంతవద్ద ఆశముం డల గొంతులు గోతురు కోటదూపాటియందు కొచ్చెర్ల కోటలో కోడి మూడు మాటలాడెను ఇచ్చిన సొమ్ములు దిగమ్రింగి యెగనాడి బాసలకు తయారగుదురు ప్రమాణం బులు జేయుదురు ముండమోపులంతా ముత్తయిదువ లగు దురు. వారలు యాగంటికి జేరుదురు. కోమటి కులంబు నందు మేలయిన భక్తులు 25 గోత్రములవారు నిలుతురు. ఉత్తర భూమియందు ఉత్తమ భేరికోమటి మహాత్మురాలై నిలిచేను ప్రపంచమంతయు గగ్గోలు పెట్టేను. ప్రపంచ మంతలో కేవల శాంతిమూర్తియై సర్వ వర్ణములవారిచే సన్మానములు పొందేను. మధుర మినాక్షమ్మ మనుజులతో మాటలాడెను, గుణము గలవారందరు బనగాన పల్లెకు జేరుదురు. నవాబు పదవి కొంత కాలంబు మాత్రము నీ రాజ్యంబు బాలించును. పిమ్మట నన్యుల స్వాధీన మందుం డును. కారంపూడిలో ఘనమైన బాలలు కందిమల్లయ్య పల్లెకు జేరెను గుణము లేనివారంతా కూలిపోయేరు. అద్దంకి నాంచారమ్మ ముందుగా మాట్లాడేను. అందున కొందరు నష్టమయ్యేరు గోలుకొండ పట్నం నోలలాడుచు బాల లిరువురు పట్నంబు నేలేరు. మహానంది మరుగున మహిమలు బుట్టేను. నేను వచ్చునప్పటికి ఒక చిత్రము బుట్టేను. దాని నెరిగి నడిచినవారిని రక్షించెదను. నాలుగు నిలువుల ఆజానుబాహులువచ్చిమేమే వీరభోగవసంతరాయల

మని చెప్పుదురు, నాభక్తులెంతమాత్రమునునమ్మరు. మూఢు లైనవారలునమ్ముదురు. మరియొక చిత్రంబుబుట్టును. వీపున వింజామరలు అరికాలున తామరపద్మమువారువత్తురు. వారిని నేననిభ్రమింపకుడు. నాభక్తులైనవారలునమ్మకుండేరు.నారా కకు గుర్తుయేమంటిరేని నేనువచ్చుసరికి కందిమల్లయపల్లెలో నవరత్నముల మంటపముగల్గి పన్నెండామడ పట్టణమగును. రెండవకైలాసమో యనునట్లుండును. పట్టపగలు ఆకాశము నుండిపిడుగులుపడి నిప్పులవానకురియును అందునకొందరు నష్టంబగుదురు శ్రీశైలపర్వతంబుపైని జ్ఞానంబు తొలగును. ఎర్రచీమ యేనుంగు రూపంబునకానంబడును. అదేనారాకకు మీకుగురుతు మనుజులతో మాయశక్తి మాట్లాడును. పంది కడుపున నేనుంగుబుట్టును. కోడి మనిషివలె కూతకూయును. అయిదు తలలుగల మేకపోతు మేకకు బుట్టును. బనగాన పల్లెలో కాలజ్ఞాన పొతరపైని చింతచెట్టుకు జాజి పూవులు బూ.యును. కావేరీ తీరమున కలహములుబుట్టి గాజు పూస దీయుదురు. ఏడుపుట్లనల్లులు ఏక ముహూర్తమందు రాలేను. సూర్యుడు గడగడ వణకును. నీరభోగ వసంతరాయలు వచ్చుటకు ముందీవిపరీతంబులుజరుగును.జొన్నవాడ కామా క్షమ్మ యిందులకు విచారణ కర్తయై విచారించును. అదే మీకు గుర్తు. కుంభకోణము గుడి కూలిన పిమ్మట కుంభుని రూపము బోవును. కంచికి పడమర గాండ్లవానియింట కామ ధేనువు బుట్టును. కంభం చెరువులోబంగారముతీయించి కంది

మల్లయ్యపల్లెకు దెత్తురు. ముత్యాల రంగడు రత్నములు తీయించి రాజయోగులకు పంచియిచ్చేను. కంచి కామాక్షమ్మ కన్నులవెంట నీరు జల జల రాలేను. అందున కొందరు చత్తురు. పోతులూరి హరిభక్తులు జ్యోతి స్వరూపులై వత్తురు. అయిదేండ్ల బాలుడు అల్లాటపల్లెజేరేను. కాళహస్తీశ్వరుడు కళలన్నియు బోగొట్టుకొని కందిమల్లయ పల్లెకు జేరేను. రామానుజ మతమువారు నియమము దెలియక పోతకులై పోయేరు. నా భక్తులైనవారు దరిద్రులై యుండేరు. బాలురు మాటలాడేరు. ఆవు కడుపులోనున్న దూడ అంతర్హితముగా కనబడేను. పల్నాటి సీమలో ధనము గల్గినవారు మదముచే గూలుదురు. నాలుగు వర్ణములవారు న్యాయంబు దప్పి నడ తురు. బందరు పట్నములో భాగ్యముదీయుదురు. గోనంగి కులము గొప్పయైయుండును గొడ్డుబోతుముండలకు బిడ్డలు పుట్టుదురు. లింగాలపురమున బంగారు ప్రతిమ ప్రబలచే నభి వృద్ధి యగును. కుంభం చెరువుపద్ద కోడి మనిషివలె మాట్లా డును. రాజాధిరాజులు రాజ్యములను వదలి భ్రష్టులైపోదురు. ఇదియె నా రాకకు నిదర్శనము. నేను జెప్పిన వన్నియు యదార్థముగా తప్పక జరుగును. కాదనిన వారలు రౌరవాది నరకంబు లనుభవింతురు. ఇది సత్యంబని చెప్పగా నంత నవాబు లేచి ముకుళిత కరకమలుండై నిలువంబడి స్వామీ! శ్రీ వీరబ్రహ్మేంద్ర గురుసార్వభౌమా! తమరి దివ్యాను గ్రహంబుచే నీ పోతకుని జన్మంబుతరించినది. కృతార్థుండ నైతినని యనేక విధంబుల కొనియాడి స్వాములవారిచే సెలవు గైకొని అంతట నందరు నిద్రించిరి.

**శ్రీ స్వాములవారు కడపనుండి బయలుదేరి అల్లాటపల్లెజేరి వీరభ స్వామిని సేవించుట. అల్లాటపల్లెనుండి బయలుదేరి వచ్చుమార్గంబున తొమ్మండుగురు దొంగలు స్వాములవారిపై దొమ్మిగా వచ్చుట**

శ్రీ స్వాములవారు తెల్లవారుదయంబుననే కడపనుండి బయలుదేరి ప్రొద్దుటూరు చేరి యచ్చట నా దినంబంతయు నుండి యచ్చటి భక్తాదులచే తగు మర్యాదలు పొంది యట నుండి బయలుదేరి అల్లాటపల్లెచేరి శ్రీ స్వాములవారి యిష్ట దైవంబగు వీరభద్రాలయంబులో దిగి బసచేసిరి. పిమ్మట స్వాములవారు ఆగ్రామంబునకు ప్రక్కనున్న కుందునదిలో స్నానం బాచరించి శ్రీ వీరభద్రస్వామివద్ద జేరి ధూపదీప నైవేద్యతాంబూలాదు లొసంగి అష్టోత్తర శత నామావళితో పూజచేసి యా రాత్రి యటనుండి తెల్లవారుదయంబుననే బయలుదేరి పుష్పగిరి వగైరా గ్రామాదులను గూడ చూచుకొనివెళ్ళుదమని తలంచి స్వాములవారొకబండిలో గూర్చుండి యుండ సిద్దయ్యగారు, తక్కిన శిష్యాదులును బండి వెంట కాలినడకతో వచ్చుచుండిరి. మార్గమధ్య మందున్న యరణ్యంబులో తొమ్మండుగురు దొంగలు కాపురంబుగా నుండి యా మార్గంబున వచ్చు ప్రయాణికులను తలలు వక్కలుజేసి తారుమారు చేయుచు వారివద్దనున్న ధనకనకాదులను దోచుకొనుచుండిరి. ఆ మార్గంబున నెవ్వరునడచుటమానిరి. అట్టి భయంకరమయిన నా మార్గంబుననే స్వాములవారు వచ్చుచుండిరి. అంత నెవ్వడో యొక బాటసారి మార్గమందున్న

తొమ్మండుగురు దొంగలను తప్పించుకొని వచ్చుచుండగా స్వాములవారిబండి ఎదురాయెను. ఆస్వాములవారి నా వచ్చుచుండిన బాటసారి చూచి అయ్యలారా! మీరేల ఈ త్రోవన వెళ్ళెదరు? ఈమార్గమధ్యంబున తొమ్మండుగురు దొంగలు ఉన్నారని చెప్పగా స్వాములవారు నాయనా! నీకెందులకు? నీ దారిన నీవు వెళ్ళుము. నాలో నున్న పదముగ్గురు దొంగలనే మ్రింగి నీళ్ళు త్రాగిన నన్నా తొమ్మండుగు రేమిచేయగలరని చెప్పగా నాబాటసారి వెళ్ళిపోయెను. అంత సిద్దయ్యగారు స్వాములవారిని జూచి స్వామీ! రాత్రి మనముండిన ఆలయంబునం గల శ్రీ వీరభద్ర స్వాములవారి మహిమ లేమని యడుగుచుండగా నా యరణ్య మార్గమధ్యమందున్న తొమ్మండుగురు దొంగలు లాటీ కర్రలను బట్టుకొని యమభటులవలె బండికి ముందర నిలువంబడి బండివానిని బండి నాపుమనగా నంత బండివాడు దొంగలతో నిట్లనియెను. అయ్యలారా! నన్ను మాత్రము గొట్టబోకుడు నావద్ద నేమియు లేదు. పొట్టకూటికై వచ్చిన నన్ను కొట్టిన నేమియు లాభముండదు. అదుగో! బండిలో బ్రహ్మాండనాయకుండున్నాడు. ఆయనయే కోట్లకొలదిగా జ్ఞానంబనుధనంబు నార్జించినమేటి అజ్ఞాన ధనంబంతయు అజ్ఞానంబను గుడ్డలోమూటగట్టి ఎనిమిది కోణంబులుగల నొక యినుప డబ్బాలో మధ్యభాగమునందుగల యొక చిన్న అరయందుంచి అష్ట కోణాకృతి గలిగిన యా పెట్టెను నతి యేహ్యంబైన శరీరం బను కొయ్య పెట్టెలోనుంచి ఆ పెట్టెనున్నజ్ఞానధనంబును ఎవ్వ

రికిని సాధ్యంబు గాకుండునట్లుగా మీవంటి చోరులను పది ముగ్గురు దొంగలనుకాపలాయుంచి యింటిముందర యీషణ త్రయంబు అను మూడు శునకంబులను గట్టివేసి తా నెప్పు డును దినమునకు21,600సారులు యింటిలోనికి వెలుపలికి దిరుగుచు నజ్ఞానులైన మీవంటివారలకునగపడకుండా సుజ్ఞా నులైన సత్యవంతులకు నగపడుచు వారికి ఫలయు నంత జ్ఞానం, ధనం బొసంగుచుండిన నజ్ఞానాంధ తిమిరార్కుం డడుగో చూడుడు. చూచుటకు పిచ్చివానివలెనున్నాసచ్చిదా నంద స్వరూపుడు. ఆ మహామహుని మీరాశ్రయించిన మీ కుండిన దుర్గుణంబు లనెడు చినిగిపోయిన వస్త్రంబులను దీసి వేసి తన వద్దనున్న సద్గుణంబులను పట్టువస్త్రంబులిచ్చి మీకు సుఖజీవనంబునకై జ్ఞానధనం బొసంగును. అప్పుడు మీ కుండిన కొరత లనియెడి దారిద్ర్యంబునశింపజేసి పరమార్థం బను అఖిలైశ్వర్యంబు లొసంగి, తిరిగి యెప్పటికిని దారి ద్ర్యంబు లేకుండునటుల చేయును. అనగా పుట్టుట చచ్చుట లేకుండ చేయునని బండివా డా దొంగలతో జెప్పగా నా దొంగలు, ఒరే నీ మెట్ట వేదాంతంబంతయు గట్టివేయుము. ముందు నీవు బండిలోనుండి క్రిందకు దిగుమని చెప్పి బండి వెనుక భాగముననున్న స్వాములవారి కడకరుదెంచువర కా శిష్యసమూహం బంతయు నెవరి దారి వారు చూచుకొనిరి. బండిలో స్వాములవారును, వారిప్రక్కన క్రిందనిలవంబడిన సిద్ధయ్యగారు మాత్రమే యుండిరి. తక్కిన వారందరు 'ప్రాణంబులున్న బలుసుకూరైన తిని బ్రతుకవచ్చు'నని యెవరిదారిన వారు పోయిరి.

అంత బండిలోపల గూర్చుండియున్నస్వాములవారిని కొట్టినగాని ధనంబు చేతికి దొరకదనుకొని ఆ తొమ్మండుగు రొకేసారి లాఠీకర్ర లెత్తువరకు ఆ దొంగల మనంబు మారి ఎత్తిన చేతులు ఎత్తినట్లే యుండెను. వారి చేతులు క్రిందకి రావాయెను. అంత దొంగలు అట్లే నిలువంబడిరి గాని నోటి వెంట మాటలును, కొట్టుటకు చేతులునురాక గోడపై చిత్రించిన బొమ్మలవలె నిర్విణ్ణులై అట్లే యుండిరి. పారిపోయిన శిష్యులందరును నా యరణ్యంబున చెట్లచాటునను, గుట్టల చాటునను, పొదలచాటునను దాగుండిస్వాములవారినిదొంగ లేమి చేసెదరో యని బండివైపునకే చూచుచు దొంగలను జూచి భయంబు జెందుచునుండిరి గాని స్వాములవారి వద్ద కెవ్వరును వచ్చినవారును లేరైరి.

తొమ్మండుగురు దొంగల గర్వాపహరణము దొంగల తలలెప్పుడును పైకెత్తకుండ భూమినే చూచుచుందురుగాక యని స్వాములవారు

శ్రీ స్వాములవారు సిద్ధయ్యగారిని చూచి నాయనా! సిద్దా! ఈ తొమ్మండుగురిని నావద్దకు లాక్కొని రమ్మనగా వెంటనే సిద్ధయ్యగారు దొంగల నొకరొకరిని తీసికొనివచ్చి స్వాములవారి వద్ద నిలువంబెట్టగా యేమోయి బిడ్డలారా! నన్ను కొట్టుటకై వచ్చి ఎత్తిన చేతులను ఎత్తినట్లు ఉంచి నోటితోనైనా మాట్లాడరైరి, మీ మాటలను నేను వినతగు నంతటివాడను గానా? నన్ను కొట్టివేసి మీకు కావలసిన ధన కనకంబులన్నియు తీసికొని పొండి. అవియన్నియు నీ

బడియందే యున్నవి ఇక నాలపింపకుడు. పాపము! మీ భార్యాబిడ్డలు మీకై యెదురు చూచుచుందురు. మాకును. మీకును భోజనంబున కకాలమగుచున్నది మీ కరుదెంచిన పని నెరవేర్చుకొని వెళ్ళుడని యెంతచెప్పినను మాట్లాడుట కైనను నోరురాని యాదొంగలు నత్తే చేతులను యెత్తుకొని అలాగే ఉండిరి, ఇక్కడ జరుగుచున్న విషయంబులన్నియు పొదలచాటునుండి చూచుచున్న భక్తులు మనమెంతో మంద మతులమై స్వాములవారిని విడనాడి మన ప్రాణరక్షణ చేసి కొందమని తలంచితిమిగాని స్వాములవారు మహామహిమా స్పదులని యెరింగియు నిట్లు కేవల జ్ఞానశూన్యులమై వారిరు వురను విడిచి పారిపోతిమి. కనుకనే స్వాములవారు సిద్ధయ్య గారికిని, మనకునుయేనుగకును, జోమకునుపోల్చియిదివరకే చెప్పి మన యందరి గర్వంబడించినారలు.ఏమయినను సరియే నని యంద రా స్వాములవారి కడకరుదెంచి బండిని చాటు చేసుకొనినిలువంబడియుండిరి. అంత స్వాములవారు బండిని దిగి దొంగలకడ నిలువంబడి తన హస్తములతో నా దొంగల చేతులను క్రిందకిదించెను. పిమ్మటవారల నోరులను దెరువు డని విభూతిని వారందరి నోళ్ళలో వేయగా నందరు చేతులు ముకుళించుకొని మాట్లాడ సాగిరి కాని వారలు తలలు మాత్రము వంచుకొనియెయుండిరి. వారలెంత ప్రయత్నించి నను తలలు యెత్తుదమన్నను గోత్రాలమాదిరిగా శిరంబులు వంగి యుండుటచేస్వాములవారి ముఖంబునైనను జూచుటకు ప్రాప్తంబులేదయ్యెను. ఆదొంగలందరును చేతులుజోడించు


కొని స్వామీ! మే మనేక దినములనుండియు నీమార్గంబున వచ్చుచుండెడి సాధువు లనిగాని చూడక నిటువచ్చుచుండెడి బాటసారుల కందరకును మే మొనర్చిన ఘోరకృత్యంబు లకు గాను మా కీ ప్రాయశ్చిత్తము గావలసినదే! తండ్రీ! పాపులమైన మా శిరంబులు యెప్పటిలాగున నుండునట్లు చేయమని వారందరు ప్రార్థించగా నంత స్వాములవారు చిరు నగవుతో బిడ్డలారా! మీ శిరంబు లిట్లు మీ ప్రాణ పర్యం తము నుండక తప్పదు. మీ పూర్వపుణ్య విశేషంబున మీ హస్తంబులును, నోరు మీ స్వాధీనములైనవి. గాన నిక మీ రేగుడని చెప్పగా నంత దొంగలంద రొక్కపెట్టున బోరున నేడ్చుచుతండ్రీ! నిన్నుజూడ యా వైకుంఠ వాసుం డైన శ్రీ మన్నారాయణునివలె నున్నాడవు. మే మెందరినో చూచితిమిగాని యిట్టి మహా మహిమాస్పదులు గనిపించ రైరని వేడుకొనగా నంత స్వాములవారు బిడ్డలారా! మీకును నాకును భోజనంబున కకాలంబగుచున్నది. గాన మీ గృహం బుల కిక నేగుడు. ఇక మీ ప్రాణ పర్యంతము మీ శిరంబు లట్టులే యుండుట సత్యము. ఇక మారవని గట్టిగా జెప్పి వారలకు ననేక నీతులు బోధించి యటనుండి బయలుదేరిరి.

## దశమ ప్రకరణము

శ్రీ స్వాములవారు పుష్పగిరి అగ్రహారము చేరుట—బండిలో గూర్చుండి నడి వీధిన వెళ్ళకూడదని అగ్రహారికులు ఆటంగపరుచుట.

శ్రీ స్వాములవారు బండిలో గూర్చుండి కాలినడకనే

బండి వెంట వచ్చుచున్న సిద్దయ్యగారు వింజామరంబులు వీచుచుండగా శ్రీస్వాములవారు భక్తాదులకు సాంఖ్యతారక అమనస్క భావ్యంబులను బోధించుచుండగా వారందరును వినుచుండిరి. ఆ వచ్చుచున్న భక్తాదులలో కొందరు వేదాధ్యయనము చేయువారును, స్వాములవారి ముప్పది రెండు బిరుదులను ముప్పది యిద్దరు పట్టుకొని బండిముందు భాగంబున బండిలో గూర్చుండి కేవల శ్రీశంకరుడరుదెంచుచున్నారలా యనునట్లు ఆ పుష్పగిరి అగ్రహారపు నడివీధిని వెళ్ళుచుండగా నా గ్రామ వైదిక బ్రాహ్మణు లందరొకచోట గుంపుగా గూర్చుండి ఆ వచ్చుచుండిన వారిలో సిద్దయ్యగారిని జూచి మీరెవరు? ఆయన యెవరని యడుగగా నందులకు సిద్దయ్యగారు నేనువర్ణమున దూదేకులవాడను. నాపేరు సిద్ధుడందురు. బండిలోనున్న ఈ మహామహుండు అస్మదీయ దేశికేంద్రులైన శ్రీ జగద్గురు విరాట్పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారనగానే యా గ్రామవైదిక బ్రాహ్మణులకు కోపంబువచ్చి ఓరీ భ్రష్టా! నీవు దూదేకుల విభూతిమేనినిండాపూసికొని రుద్రాక్షమాలలు వైవాడమెడ నిండాధరించుకొని నీవును ఒక సత్‌బ్రాహ్మణునివలెచేతికొక జపమాలనుబట్టి త్రిప్పుచు ఒకవిశ్వబ్రాహ్మణుని వెంటబెట్టుకొని మీరిరువురును మమ్ములను పరిహాసముజేయదలచి వేద పారాయణము చేయుచు మా గ్రామనడివీధిలోనుండి రెండవ శంకరుండని తలంచి యాతనికిసురటీలు వేయవచ్చుచుండిరి,



పుష్పగిరి అగ్రహారికులు బ్రహ్మంగారిని అడ్డగించుట.

"బ్రాహ్మణోస్యముఖమాసీత్! బాహూ రాజన్యః కృతః॥ ఊరూ తదస్యయద్వైశ్యః। పద్భ్యాగ్ంశూద్రో అజాయత" అనెడి శ్రుతి ప్రమాణంబుగా బ్రహ్మముఖంసంజనితవంశజుల మైన మాకు వేదపారాయణము జేయుటకు అర్హతగలదుగాని మీకేమి యధికారంబు గలదు? మాకు తగు సమాధానంబును జెప్పకుండిన మిమ్ముల నందరను నొక్కయడుగైనను దాట నివ్వము. ఇంకను మీరు మాచే అవమానంబును గూడా పొందగలరని చెప్పి శ్రీ స్వాములవారి సమూహమును ఆ బ్రాహ్మణులందరు చుట్టుముట్టి నిల్వగా నంత సిద్దయ్యగారు ఓ నామబ్రాహ్మణులారా! వినుండు.

శ్రీ స్వాములవారికి, పుష్పగిరి అగ్రహారీకులకు వర్ణవిషయక వివాదంబు జరుగుట.

శ్లో॥ బ్రాహ్మణ క్షత్రియో వైశ్యో శూద్రో చండాల ఏవచ। దృఢాభ్యాసే కరో నిత్యం। పునర్జన్మ న విద్యతే॥

తా॥ బ్రాహ్మణాది చండాలాంత మెవ్వరైనను భగవన్నిష్ఠ, దృఢాభ్యాసము సతతము జేసినట్లైన జన్మరాహిత్యం బగు నని శ్రుతులు చెప్పుచున్నవి కాన నాలుగువర్ణముల వారికి భగవదుపాసనకున్నూ, వేదపారాయణము జేయుటకున్నూ, అధికారము గలదని సిద్దయ్యగారుచెప్పగా నా బ్రాహ్మణులు అమిత కోపోద్దీపిత మానసులై వారిరువురను చుట్టుముట్టి కూర్చుండి ఓ విశ్వబ్రాహ్మణ గురువరా! "బ్రాహ్మణోస్య ముఖమాసీత్" అను వేదప్రమాణంబులు బ్రహ్మముఖ సంజ నిత వంశజులమైన మాకు వేదపారాయణముచేయుట కర్హత

గలదు. కాని నాలుగువర్ణంబులవారికెట్టి యధికారంబుగలవో తగు సమాధానం జెప్పకుండిన నిక నీ మర్యాద దక్కదని చెప్పగా నంత మౌనంబుగా గూర్చుండియున్న స్వాముల వారు కన్నులు విప్పి నాయనలారా! మీరందరును శాంత స్వభావులైయుండి మీ రేవిషయమును నడిగెదరో యడుగుడు. మీ మనస్సంశయములు తీర్చెదము అని బోధించిరి. "బ్రాహ్మణోస్య ముఖమాసీత్" అనెడు శ్రుతికి పిమ్మట జెప్పెద. ముందు మీరు అగ్రకులజులనిన్నీ, సిద్ధుడు తక్కువ కులజుడనిగదా మీరలు వాని నడిగితిరి. ఆ వర్ణవిషయంబు ముందు చెప్పి పిమ్మట ఆచండాలాంతం వేదమును పారాయణ మొనరించుటకునర్హులని సిద్ధాంతపరచెదను. బిడ్డలారా! వృత్తి భేదములచేత నెక్కువ తక్కువలేగాని సర్వులును పృథ్వీతత్వంబులో గూడిన అన్నరసంబున మదంబుచే సతీపతులు గూడి రతి సల్పగా ననురాగంబును మించి నెలకాగా శుక్ల శోణితములతో గూడిన కులమేగాని ఘనమైన కులంబు లేదు. సర్వజాతులను యోని ప్రజాపతులచే పుట్టిన కులమే గాని మరియొకటి అకస్మాత్తుగా పుట్టిన కులము లేనేలేదు .. నాయనలారా! బ్రాహ్మణులే యెక్కువయనుకొనిన నెక్కువ యెట్టులైనది? అన్నికులములలో యెక్కువైన కుల మేద నగా 'అజ్ఞానమే శూద్రత్వము, సుజ్ఞానమే బ్రహ్మమంత్రదు' అని యున్నది గనుక యెక్కువ కులం బేదనగా జెప్పెద వినుండు. మాదిగవానిని అడిగేవాడు దక్కలవాడు, దక్కల వానిని అడిగేవాడు మూగలవాడు. మూగలవాడుఅడిగేవాడు

చపలమూగలవాడు, చపలమూగలవానినడిగేవాడు కులస్థుడు. కులస్థు నడిగేవాడు కులహీనుడు, కులహీను నడిగేవాడు మైలపుసొక్కన్న, మైలపుసొక్కన్న నడిగేవాడు సొప్పకంటి వాడు, సొప్పకంటివాని నడిగేవాడు సింహవిష్ణు, సింహవిష్ణుని అడిగేవాడు చపలచోరకుడు, చపలచోరకునిచెల్లెలు ఊర్వశి. ఊర్వశిని బొందినవాడు బ్రహ్మ, బ్రహ్మకు పుట్టినవాడు వశిష్ఠుడు (ముముక్షుజనకల్ప). ఆ వశిష్ఠుడు కృతయుగంబున హరిశ్చంద్రునకు గురుడు కాలేదా ? త్రేతాయుగంబున శ్రీ రామునకు కుల గురుండు కాలేదా?... ఇక నా వశిష్ఠుని సంగతి దెల్పెదవినుండు. వశిష్ఠునిభార్య ఛండాలి, ఛండాలి కొమారుడు శక్తి, శక్తిభార్యచపలాత్మ. చపలాత్మ కొమారుడు పరాశరుడు, పరాశుని భార్య కైవర్తి, కైవర్తి కొమారుడు వ్యాసుడు, వ్యాసుని కొమారులు ధృతరాష్ట్రి పాండవులు, ఇదియునుగాక శ్రీశుకులుస్వల్పజాతియందు జన్మించి శ్రేష్ఠత్వంబు వహించి శ్రీహరిమంత్ర అష్టాక్షరీ వైభవంబు వలన దురిత హరులైరని సర్వజన విదితమే కదా ! సర్వ గ్రంథముల యందున్నది మీ రెరుంగుదురు గదా ! అట్టి భక్తిజ్ఞానంబు గలహాడే బ్రాహ్మణుండుగాని యల్ప గుణంబులు గల తక్కిన వారందరికి బ్రాహ్మణత్వం బెట్లు సిద్ధించును ? ఇవియునుగాక నిక నాలుగు వర్ణంబువలన నేమిటో చెప్పెద. "బ్రాహ్మణోతస్య ముఖమాసీత్"యను ధాని తీర్థంబు చెప్పెద వినుండు,

శ్రీ స్వాములవారు చాతుర్వర్ణములు లేవని ఖండించుట —.

నాయనలారా ! బ్రహ్మ ముఖమందు పుట్టిన వారలే బ్రాహ్మణులనిన యెడల బ్రాహ్మణులకు నాదిపురుషుండగు బ్రహ్మ విష్ణుమూర్తి నాభికమలమునందు బుట్టినటుల సర్వ శాస్త్రంబులు జెప్పుచున్నవి. దీనిని జేసి బ్రహ్మకు బ్రాహ్మణత్వము లేకపోవుచున్నది. మీకు నాదిపురుషుండగు బ్రహ్మకే బ్రాహ్మణత్వము లేనప్పుడు మీకు నెక్కడనుండి బ్రాహ్మణత్వమువచ్చినది? ఇదియునుంగాక బ్రహ్మముఖమందుబుట్టిన బ్రాహ్మణులెవ్వరీ ప్రపంచమున లేరు. ఇంకను విష్ణుమూర్తి పాదములయందు బుట్టిన గంగ సర్వ దేవతాభి షేకంబులకు మూలమై సర్వజగత్తును పావనమొనరించుచు జగత్పూజ్యంబైన గంగకి మీనుండి శూద్రత్వము సంభవించుచున్నది. ఇదియునుంగాక భాగవతం తృతీయస్కంధములో సీ॥ అరవిందసంభవు నంగుష్టమున దక్షుడూరువులవలన నారదుండు॥ అని చెప్పియున్నది కనుక దక్షప్రజాపతికి కూడా మీనుండి శూద్రత్వము గల్గుచున్నది. ఇక 'బాహూరాజన్యః కృతః' అని గదా మీరు చెప్పినది. అనగా క్షత్రియులు భుజముల నుండి పుట్టినవారని యెంచినసూర్యవంశమనియును చంద్రవంశ మనియును రెండు విధములుగా నున్నది. సూర్యవంశమున కాదియగు సూర్యుండు కశ్యపబ్రహ్మకు బుట్టినటుల శ్రుతులు జెప్పుచున్నవి. చంద్రుడు అత్రిమహామునికి బుట్టినటుల సర్వ శాస్త్రములు ఘోషించుచున్నవి. కాని క్షత్రియులు బ్రహ్మభుజములయందు బుట్టినటుల గానంబడకుండు

టచే వీరిరువురును గూడా క్షత్రియులు గారనే జెప్పవలసి యున్నది. నీకు నిజార్థంబేమనగా "విశ్వంనారాయణం దేవం" అనగా భగవంతుడు ఆది విరాట్టు కనుక. నీ ప్రపంచమే ఆయనను శరీరం బాయెను. శరీరమునకు ముఖము ప్రధాన మగుటచే ఉత్తమమనియును, భుజము మధ్యమము అని యును, తొడలు అధమము అనియును, పాదములు అధ మాధమంబనియును జెప్పబడును. అందువలన నీశ్వర సృష్టి యైన మానవులకు శాంతశమదమాది సద్గుణంబులు గలిగి బ్రహ్మనిష్ఠగలవారు ఉత్తములనియు, అందు కనిష్ఠ వివేకులు మధ్యములనియును, అందు కొంతవివేకులు అధములనియు, కేవల శూన్యవివేకులు అధమాధములనియు జెప్పబడును. ఇవియే బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రు లనంబడు చాతు ర్వర్ణంబులు- ఈశ్వరునకు నాలుగుఅవయవంబులుగా నిర్మిం పజేయుటయేగాని ముఖ బాహు ఊరు పాదముల యందు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు బుట్టిరని యెప్పటికి నర్థము చేయగూడదు. ఇదియునుం గాక నింకొక ఇతిహా సంబు కలదు. బ్రాహ్మణ శూద్రులనగా జ్ఞాన, అజ్ఞానంబు లని యెరుంగుడు. ఇందుకు ప్రమాణం బేమనగా క౦॥ అజ్ఞా నమె శూద్రత్వము, సుజ్ఞానమె బ్రహ్మమనెడి శ్రుతులను వినరా, అజ్ఞాన ముడిగి వాల్మీకి సుజ్ఞానపు బ్రహ్మమందె చూడరవేమా! ఆ వె. పాపవర్తనుండు బ్రాహ్మణుడయ్యును నిజం శూద్రుల కంటె నీచతముడు! సత్య ధర్మశాలి శూద్రు డయ్యును, నతడు ద్విజుండు యనిరిమునులు॥ అని భారతం బున శాంతిపర్వమందు కూడా చెప్పంబడియున్నది. కాన

శూద్రత్వంబునకు సత్య, శౌచ, శాంత, శమదమాది ధర్మ ములచే గూడిన భక్తిచేతను శూద్రత్వంబునకు నివృత్తి గలి బ్రాహ్మణత్వంబు గల్గునని గూడా శ్రీకృష్ణపరమాత్మ అ నునకు బోధించెను. కాన ద్విజులారా! నిక బ్రాహ్మ శూద్రుల కేమి భేదము గలదో యాలోచింపుడు.

శ్రీ స్వాములవారు అన్ని జాతులవారికిన్ని వేదాధ్యయనమున కధికారంబు గలదని దృష్టాంతముచే నిరూపించుట

ఓ ద్విజులారా! ఇక వేదాధ్యయనముల కధికారంబు సర్వవర్ణముల వారికిన్నీ గలదనుటకు దృష్టాంతంబు జెప్పెద వినుండు. శ్లో॥ ద్విజనత్ క్షత్రియస్యోక్తః। ప్రాణాయామో మహామునే! విరక్తానాం ప్రబుద్ధానాం వైశ్యానాంచ తథైవచ। శూద్రాణాంచ తథాస్త్రీణాం ప్రాణసంయమనంమునే॥ తా॥ బ్రాహ్మణుల కెంత యధికారంబు గలదని యోగశాస్త్రమందు గలదో యంత అధికారము క్షత్రియులకున్ను, ప్రబుద్ధులును, విరక్తులు నగు వైశ్యులకున్నూ, శూద్రులకున్నూ, స్త్రీల కున్ను గలదని(యోగసారము)మరియు శ్రీశివుండు పార్వతీ దేవికి వర్ణారోహణావరోహణములు గుణము వలన గలుగు నని మహాభారతము, శాంతిపర్వము నూట నలభై మూడవ అధ్యాయ మందున్నది. శ్లో॥ జ్ఞాన, విజ్ఞాన సంపన్నా సంస్కృతో వేదపారంగః। విప్రోభవతి ధర్మాత్మ క్షత్రియః స్వేనకర్మణాః తా॥ మానవ జన్మమందు జన్మించినవారు ఎవరైనను సరే, జ్ఞాన విజ్ఞాన సంపన్నుడై వేదపారంగతు డైనవాడు బ్రాహ్మణుం డని జెప్పంబడును. పైన నుదహ

రించిన గుణంబులతో గూడినవాడై ధర్మాంతర్మండయినక్షత్రి యుండై నను బ్రాహ్మణుం డనంబడును. శ్లో॥ ఏతైః కర్మ ఫలైర్దేవి న్యూనజాతి కులోద్భవా। శూద్రో ప్యాగమ సంపన్నో ద్విజోభవతి సంస్కృతా॥ తా॥ పార్వతీ; పైన చెప్పిన పుణ్యకర్మలే బ్రాహ్మణత్వంబునకు గారణంబులు గాని వేరువిధంబుల జాతి పుట్టుటలేదు. పరిశుద్ధ హృదయము గలవాడై జ్ఞాన సంపన్నుడయినచో శూద్రుడు గూడా బ్రాహ్మణుం డనంబడును. శ్లో॥ నశిఖాపపనం కృతా బహిః సూత్రం త్యజేద్బుధః। యదబ్రహ్మత "సూత్ర" మితిధార యేత్॥ తా॥ శిఖాయనగా శరీరముపైని వెంట్రుకలు త్యజిం చుటయే విశేషము గాదు. శరీర త్రయంబునకు నంత్యమై మాయామయమైన బ్రహ్మమందు జనంబును త్యజింపజేయు టమే. శిఖాపపనం అనగా మనంబును బ్రహ్మమందు లయంబు జేయుటయే. సూత్ర అనగా సర్వ భూతాంతర్యామి యైన భగవంతునియందు నీ సర్వమును గుచ్చబడి యుండు టచేత సూత్రం బను నామంబు గల్గెను. ఏలాగనిన, ఒక దారమందు అనేక పూసలు గుచ్చబడి యుండినట్లుగా, శ్లో॥ యేన సర్వమిదం ప్రోక్తం సూత్రేమణిగణా ఇవ॥ అని గీత యందు జెప్పబడియున్నది. కాన నిట్టి పరబ్రహ్మంబను సూత్రంబును మనంబున నెవరు ధరింతురో వారే వేదాధ్య యనమున కధికారులు అని స్వాములవారు చెప్పగా నా బ్రాహ్మణులు స్వాములవారుచెప్పెడి విషయంబు లన్నియు విషతుల్యంబుగా భావించి అయ్యా ! మీరు చెప్పెడి శ్రుతి స్మృతు లన్నియు మే మెరుంగనివిగావు. అంత మాత్రంబు

నకే మా మనంబులు మారుసని తలంచి చెప్పుచుంటిరేమో? అది అంతయుకల్లయని స్వాములవారిని పరిహాసము చేయ సాగగా స్వాముల వారిట్లు చెప్పసాగిరి. ఓ విప్రులారా! నేను జెప్పునవన్నియు చక్కగా వినుండు. మీరు నన్ను నడిగెడి విషయ మొక్క వర్ణ వివక్షతయే గదా? అద్దాని విషయమై యింకను చెప్పెద వినుండు.. శ్రీ శంకరాచార్యులవారుకూడా మీరు దలంచినట్లు నాచిలో జాతి మత భేదముండినట్లునుఅట్లు భేదముగూడదని శ్రీ పరమశివుడు శ్రీ కాశీక్షేత్రమందు చండాల వేషధారియై శ్రీ శంకరాచార్యుల వారితో వాదించి యభేద ముపదేశించినట్లు "మనీషాపంచకము"చేదెలియవచ్చు చున్నది. శ్లో॥ సత్యాచార స్యగమనేకదా చిన్ముక్తిదాయకం, కాశీక్షేత్రం ప్రతిసహా గౌర్యమారేతు శంకర॥ తా॥ ఈ లోక మందు పరమ దయాశాలియైన పరమశివుడు దుఃఖము లని యెడు జంతువుల కాలయమైన సంసార మనెడి సాగరమందు మునింగిన జీవకోట్ల నుద్ధరించుటకు గోరుచుండెడివాడై చండాల వేషధారియై యొకానొకప్పుడు శ్రీకాశీ పట్టణమును కూర్చిపోవుచుండెడి శ్రీ శంకరాచార్యుల సమీపంబునకు చండాల వేషధారియైన పరమశివుడురాగానాపరమశివమూర్తి నావలకు దొలగిపొమ్మని శ్రీ శంకరాచార్యులవారు పలుకగా వారితో కృత చండాలుండైన యీశ్వరుం డిట్లు చెప్పెను. శ్లో॥ అన్నమయా, దన్నమయా మాథవా చైతన్య మేవ చైతన్యాత్। యతివర దూరీకర్తుం వాంఛసి కిం బ్రూహిగచ్ఛ గచ్ఛేతి॥ తా॥ ఓ యతివర్యుడా! నే నడిగెడి ప్రశ్నంబుల

కుత్తరువు జెప్పుము. అన్నరసమైన శరీరము నుండి అన్న వికారమైన శరీరమును దూరముగా దొలగించుటకు గోరు చున్నావా ? లేక చైతన్య రూపమైన ప్రత్యగాత్మను వేరే దూరముగా తొలగించుటకు గోరుచున్నావా ? చెప్పుము. (అనగా) అన్నమయ శరీర మశుద్ధమైనచో నీ శరీరము గూడా అన్న మయమైనది. కనుక నదిన్నీ యశుద్ధమే. లేక చైతన్య స్వరూపమైన ఆత్మను తొలగుటకై చెప్పినచో, ఆత్మసర్వవ్యాప్తి గనుక ఆత్మచైతన్యములేని స్థల మెచ్చట గలదు? అని సమరసమును బోధించి చండాల వేషధారియైన పరమ శివమూర్తి అంతర్ధానుం డయ్యెను ఇదియును గాక శ్లో॥ చండాలదేహే పశ్వాదిస్థావరే బ్రహ్మవిగ్రహే। అన్యేషు తారతమ్యేన, స్థితేషునత థామ్యహం॥ తా॥ నేను చండాల శరీరమందును పశువులు మొదలుగాగలస్థావరములయందును తృణమునుండి బ్రహ్మపర్యంతము గల సమస్త వస్తువుల యందును సమముగా నున్నాను అని— వరాహోపనిషత్తు మరియు మహాభారతములో వనపర్వమం దిట్లున్నది. శ్లో॥ నయోనిర్నాపి సంస్కారో, నశ్రుతం నచ సంతతిః। కారణాని ద్విజత్వస్య, వృత్తామేవతు కారణం॥ తా॥ బ్రాహ్మణత్వంబునకు గారణము బ్రాహ్మణ స్త్రీ యందు జన్మించుట కాదు. వేదాధ్యయనముగాదు. బ్రాహ్మణ సంతతికాదు. మరి యేమంటిరేని సత్యధర్మాది వృత్తియే యనియున్నది. శ్లో॥ జ్ఞానయజ్ఞోపేతు గైవా బ్రాహ్మణొవాత్యజోపిస। సంసార సాగరం తీర్త్వాముక్తి పారహిగచ్ఛతి. తా॥ చండాలుడుగాని

బ్రాహ్మణుండుగాని జ్ఞానంబను తెప్పచె జననమరణ దుఃఖ రూపమగు ఘోరసంసార సాగరమునుతరించి ముక్తియనెడు పరమార్థమును బొందును. శ్లో॥ బ్రహ్మభేదేన జ్ఞానాత్తి సముక్తిం నైవపద్యతే సమానం సర్వజంతూనాం బ్రహ్మ సూత్రేణ కథ్యతే॥ తా॥ ఎవడు పరమాత్మను భేద బుద్ధితో జూచునో వాడు మోక్షమును పొందజాలడు. బ్రహ్మము సర్వ జీవులయందును సమానంగానున్న దనియును బ్రహ్మసూత్రం బుచే బాదరాయణ మునీంద్రుడు దెల్పెను. శ్లో॥ అంత్యమతి ద్విజాతిశ్చ ఏక యేవసహోదరః॥ ఏకయోని ప్రసూతాత్వాత్, ఏక శాఖేన జాయతే॥ తా॥ అంత్యజాతి యందుజాతమైనను సరే! లేక నగ్రజాతియందు జాతమైనను సరే, వీ రిద్దరును సహోదరులే. ఏల యనగా, అందరును ఏకమగు బ్రహ్మ యోగంనుండి జాతమైన కారణంబు చేతనున్ను యేకమైన యీశ్వరుని యందుండి జాతమైన కారణముచేతను సహోద రులే. ఏక యోని యనగా యేమంటిరేని? శ్లో॥ మమయోని ర్మహత్ బ్రహ్మ తస్మిన్ గర్భంతథామ్యహం॥ అని గీతా ప్రమాణము శ్లో॥ హింసానృత ప్రియా క్షుద్రా సర్వకర్మోప జీవనః। కృష్ణాః శౌచ పరిభ్రష్టా, స్తేర్వజాః శూద్రతాంగతా॥ తా॥ మనసా కర్మణావాచా ప్రాణహింసకులై అసత్యభాషణ ప్రియులయిన నీచదేవత ఉపాసకులయి వ్యవస్థ నన్ని పనులను జేసి జీవించువారై తమోగుణము గలవారై శౌచా చారాదులు లేని వారలు బ్రాహ్మణులలోగూడ గలరు. అట్లు బ్రాహ్మణులలో క్షత్రియుడు, బ్రాహ్మణులలో వైశ్యుడు,

బ్రాహ్మణులలో శూద్రుడును గలరు. ఇట్లే నాలుగు వర్ణం ముల వారిలోను పై నుదహరించిన గుణముల ననుసరించి వర్ణములు గలవే గాని మరి యే విధంబుచేతను లేదనియర్థము. ఈ యర్థముననే శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతయందు 18వ అధ్యాయంబున ప్రతిపాదించెను. శ్లో॥ బ్రాహ్మణ క్షత్రియ వైశ్యాం శూద్రాణాంచ పరంతప కర్మాణి ప్రవిభక్తాని, స్వభావప్రభవైర్గుణైః॥ తా॥ ఒక్కొక్క జీవి పరిపక్వము నను సరించి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను నాలుగు వర్ణములవారిని వారి వారి సత్య దాన తపో యోగాది గుణం బులను బట్టి విభాగించెను. దీనిని గీతయందు 18 అ॥లోని 42, 43, 44 శ్లో॥లందు కనందగును. ఇది శ్రీ భగవద్వా క్యము. ఇంకను నీ గీతయం దిట్లుండెను. శ్లో॥ మాంహి పార్థవ్య పాశ్రిత్యతేయే పిస్యుః పాపయోనయః స్త్రియో వైశ్యస్య సూద్రేస్తే పియాంతి పరాంగతిం॥ తా॥ ఓ అర్జునా। అంత్యజాతి యందు జన్మించిన వారైనను సరే, అట్టివారును, స్త్రీలను, వైశ్యులను, శూద్రులను మొదలు గాగల వారంద రీ గీతా పారాయణము జేసి దీనియందుజెప్ప బడిన ప్రకార మనుష్టించినచో నిస్సంశయముగా మోక్షము జెందుదురని శ్రీకృష్ణ భగవానులు 9వ అధ్యాయమున గీత యందే యుపదేశించిరి. కాన నో విప్రులారా! కేవల శ్రీ మ న్నారాయణుని వచనమే యిట్లుండగా మీరంద రేల సంశ యించెదరని స్వాములవారు చెప్పుచుండగా నా బ్రాహ్మణు కొందరు నవ్వెడివారును, కొందరీతని మాటలు కేమను

వారును, కొందరీ మెట్టు వేదాంతంబున కేమని యంద రొకే సారి చప్పట్లుకొట్టి గోల సేయసాగిరి. అంత శాంతగుణమే స్వభావముగాగల శ్రీ స్వాములవారా యల్లరిని జూచి బిడ్డలారా! గోల సేయకుడు, ఇంకను మీ సంశయంబు దీరకున్నచో నింకను జెప్పెద వినుండు. శ్లో॥ న చర్మణోన రక్తస్య మాంసస్యనచ నాస్థినా। న జాతి రాత్మనో జాతిర్వ్యవహార ప్రకల్పితా॥ తా॥ సర్వభూతస్థమగు నాత్మకు జాతి భేదము లేదు. మరియు చర్మమునకును అస్థికిని వేరులేదు. జాతి యనునది వ్యవహార కల్పితమే గాని మరి యేమియు గాదని తేజోబిందూపనిషత్తునం దున్నది. శ్లో॥న శూద్రా భగవద్భక్తాః విప్రాభాగవతాః స్మృతా, సర్వవర్ణేషు తే శూద్రా యేహ్యభక్తా జనార్ధనే॥ తా॥ శూద్ర యోనియందు జన్మించినవారైనను భగవద్భక్తులు శూద్రులుకారు. మరి ఎవ రంటిరేని, భాగవతోత్తములగు విప్రోత్తములని వేద సమ్మతము. పరమాత్మయందు భక్తి లేనివారే వర్ణమందు జన్మించిన వారైనను వారే శూద్రులని శ్రుతి సమ్మతము. మరియు భారతమందు అన్యజాతియం దుండి మోక్షము పొందినవారిని గూడా చెప్పెద వినుము. శ్లో॥ జైగీషవ్యో యథావిప్రో యథాచైవా సితాదయః। క్షత్రియా జనకాద్యాస్తు.తులాదారాదయోవిశః। ధర్మవ్యాధా దయాస్సప్త సూద్రాచైలవకాదయః మైత్రేయ సులభాశార్గి శాండిలి చ తపస్వినీ, ఏతే చాన్యేచ బహవో నీచ యోనిగతా అపి। జ్ఞాన నిష్ఠాంపరాం ప్రాతః॥ తా॥ జైగీష వ్యుండను బ్రాహ్మణుండును, అట్లే యసితాదు

లును, జనకాదులు మొదలగు క్షత్రియులను, తులాధారులును। వైశ్యులను. ధర్మవ్యాధుడు మొదలగు శూద్రాదులును, స్త్రీలలో మైత్రేయి, సులభ, శార్గి, శాండిలి, తపస్విని మొదలగు నాడువారును నీలాగున అంత్యజాతియం దుద్భవించిన ననేకులు పరమైన జ్ఞాననిష్టను బొంది ముక్తులైరి. మరియు మనుస్మృతియందు జెప్పినవారిని గూడ జెప్పెద వినుండు.

శ్లో॥ ఋష్యశృంగో మృగాజాతః కౌశికో గాధినందనః। జంబుకో జంబుకోత్పత్తిః గౌతమో గాత సంభవః। వాల్మీకోత్పత్తిః అగస్త్య వల్మీకో కుంభసంభవః వ్యాసో లుబ్ధక సంభూతో, వశిష్టో ఊర్వశిసుత, నారదో రజకీపుత్రో కౌండిన్యో ముండకీసుతా.। సాంఖ్యాన స్వర సంభూతో శౌనకాది మహర్షయః॥ తా॥ మహర్షుల కాలమందు గుణముల ననుసరించి జాతి కలదనుట కిదే దృష్టాంతము ఎట్లనిన, ఋష్యశృంగ మహాఋషి లేడియందును, విశ్వామిత్ర మహాముని క్షత్రియ కులమందును, జంబుకముని నక్కయందును, గౌతమ మహాముని కుందేటియందును, వాల్మీకి మహాముని పుట్టయందును, అగస్త్య మహాముని ఖాండమందును, బాదరాయణ తపోనిధి (శ్రీ వేదవ్యాసుండును) చంబడ స్త్రీయందును, సాంఖ్యముని ఛండాల స్త్రీ యందును, గార్గేయ మహాముని గాడిదయందును, శౌనకాది మహాశ్రేష్ఠులు కుక్కయందును అవతరించిరని మనుస్మృతియందే గలదుగదా! వీరందరును పరమ తపోనిధులే గదా! ఇటు వేదశ్రుతులు

ఘోషించు చుండగా, జాతిభేదము దేహసంబంధమైనదై యెట్లుండునో మీరతే యాలోచింపుడు. ఇదియుంగాక ప్రపంచంబున సద్బ్రాహ్మణులనియును, కర్మబ్రాహ్మణులనియును వేషబ్రాహ్మణులనియును మూడు విధములుగా గనంబడుచున్నది. 1) వేషబ్రాహ్మణునిగా రాత్రియందు నాట్యకాలంబున వేషమును ధరియించి బ్రాహ్మణ చిహ్నము గనుపరచి తెల్లవారుదయంబున నెప్పటివలె సూద్రుండై యుండు వేషధారిని బోలినవాడే వేషబ్రాహ్మణుండనబడును. 2) కర్మబ్రాహ్మణులనగా ఇంద్రజాలమైన నీ జగత్తున కర్మములు చేసికొనుచు బ్రాహ్మణ చిహ్నములుగనపరచి జ్ఞానంబయిన సహజావసయందు బ్రాహ్మణ్యంబు లేక జన్మాదు లెత్తుకొనుచు తాము చేసినది స్మరణకు దెచ్చుకొనలేక యితరులు చేయు భక్తి ప్రవృత్తులు చూచి సహించలేక, మీకు వేదాధ్యయనమున కాధికారము లేదు. మీరు భగవన్నిష్ఠ చేసితిరేని పాప మనుభవించెదరు. మేము వేదాధ్యయనము జేయుకాలములో సూదర్శచండాలురు విననేకూడదు. అథవా వింటిరేని రౌరవాది నరకంబు లనుభవించెదరని భయపడుచు పరబ్రహ్మను నమ్మి మోక్షేచ్ఛచే పూడించువారి మోక్ష ప్రియత్నంబులను విఘ్నంబు చేయుచు దేహవర్ణాభి మానులై యెదుటివారల ననేకంబులుగా నిందించుచు తమ తప్పును తామెరుగక యితరుల తప్పులకై వెదకులాడుచుండువారలే కర్మబ్రాహ్మణు లనంబడును. 3) ఇక సద్బ్రాహ్మణులనగా నెవరంటిరేని బ్రహ్మమును మననమును చేయువారనియు

అజప గాయత్రినే సూత్రముగా ధరించి యెవడు స్వయం ప్రకాశులై యుందురో వారే సద్బ్రాహ్మణులని బ్రహ్మోప నిషత్తులో జెప్పంబడియున్నది. ఎట్లంటిరేని, శ్లో॥ జన్మనా జాయతే శూద్రః కర్మణా జాయతేద్విజః వేదపారంతు విప్ర సారీత్। బ్రహ్మజ్ఞానంతు బ్రాహ్మణః॥ తా॥ ఎవరైనను జననమందే శూద్రుడుగా నుండును. ఆత్మ సంస్కారాది కర్మంబులచేద్విజుడగును వేదాధ్యయనంబుచేవిప్రుండగును. బ్రహ్మజ్ఞానము గలుగునపుడు బ్రాహ్మణుం డగుచున్నాడు. పూర్వజన్మ ఫలవిశేషమునుబట్టి క్రమక్రమంబున బ్రహ్మం బెరింగినవారలే సద్బ్రాహ్మణులనియును యున్నది కాన కులము ప్రధానముగాదు సర్వకాల సర్వావస్థలయందు నే జాతివారైనను పరబ్రహ్మంబునందు మనంబున నిల్పి ఈ తపంబువలన సూతునకు బ్రహ్మ తన పీఠంబునిచ్చి శుకశౌన కాదిమునులు సర్వధర్మంబులును శ్రవణంబు చేసిరి. ఇక బ్రాహ్మణులనెడి నామంబెట్లు గల్గినదనిన, విష్ణు నుపాసించు వారికి వైష్ణవులనియును, శివు నుపాసించు వారికి శైవులని యును, గణపతి నుపాసించువారికి గాణాపాత్యులనియును, శక్తి నుపాసించువారికి శాక్తేయులనియును యెటువలె నామంబులు గల్గునో అటువలెనే భక్తిచేత పరబ్రహ్మమును సంపాదించువారికి సద్బ్రాహ్మణులనినామంబు గల్గెను కాన ఆత్మయైన సచ్చిదానంద పరబ్రహ్మమే నిత్యము బ్రాహ్మణ శూద్రాది వర్ణంబులే నిత్యంబులుకావున సర్వజనులకును వేద

పారాయణము జేయుటకు మంత్రాధి కారంబును గలదు. ఎల్ల మానవులకును భగవదుపాసనచే మోక్షంబుగలదని స్వాములవారు చెప్పగా నా బ్రాహ్మణులలో సత్వగుణుండైన యొక బ్రాహ్మణుడు లేచి అయ్యా! "యదార్థవాదీ జగద్విరోధీ" యను నార్యోక్తిగా తమరు సెలవొసంగిన వన్నియు యదార్థంబులైనను నిక్కాలంబున నాటకంబున కున్నంత రుచి యదార్థమునకు నుండదు. అట్టి స్థితిలో మీ రెంత యదార్థములు చెప్పినను వారి బుర్రల కెక్కవు. కాన తమ దారిని తామేగుడని చెప్పగా తక్కిన బ్రహ్మణులంద రా యదార్థ బ్రాహ్మణుని కొట్టి తిట్టసాగిరి. అంత స్వాములవారు "చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః" అను భగవద్వాక్యానుసారము. మరియొక విధంబుగ జూచిన, భగవంతుడు జ్ఞానస్వరూపుడు గదా! అప్పుడు తన యంశమైన జీవులుకూడా తన స్వరూపముతే ఎట్లనిన, చక్కరచే చేయబడిన మిఠాయి బొమ్మయొక్క ఏ భాగంబు చూచినను చక్కెర మయమేగాని మరేమియు నుండదు. అయినను ఒక చిన్న యితిహాసము జెప్పెద. పద్యం॥ కస్త్రీ వరుడు జేరి కదియంగ జేరిన, ఉచ్చయందు పిండముద్భవించె। హెచ్చుకులజు డెవడు, హీనకులజుడెవడురా విశ్వదాభిరామ వినుర వేమా! అను నార్యోక్తిగా నిందల యదార్థంబులు మీలోమీకే బోధపడగలవు. నే నెన్ని శ్రుతి స్మృతులను. ప్రమాణంబులు చూపించినను మీ మనంబుల కెక్కకున్నది నేను


యెంత బోధించినను నాబోధనంతయు బూడిదలో పోసిన పన్నీరు చందంబు జేసి పరిహాసమాడుచుంటిరి. గాన మాకు భోజనంబునకు అకాలంబగుచున్నది. మమ్ములను మీరాటంక పరచక పోనివ్వండని స్వాములవారడుగగా నా బ్రాహ్మణు లందరు స్వాములవారి బండిచుట్టును నిలుచుండి వారిని ఒక యడుగైన దాటనివ్వక సందరును గోల చేయసాగిరి.

### శ్రీ స్వాములవారి మహిమచే పుష్పగిరి అగ్రహార మంతయు తగలబడు చుండునటుల నా బ్రాహ్మణు లందరికిని గాన్పించుట, ఎప్పటియట్లా గృహంబు లుండునటుల స్వాములవారు చేయుట

శ్రీ స్వాములవారు నా బ్రాహ్మణు లందరు చేయు సల్లరికి నాశ్చర్యంబుదోచి ఓ వెర్రినామ బ్రాహ్మణులారా! మీర లడిగిన ప్రశ్నంబులకు శ్రుతిస్మృతులలోనే నెంతవిస్ప ష్టంగా నిజమైన మార్గంబును జూపుచున్నను, మీ మనంబులు మారకున్నవి. ఓ విప్రులారా ' మీకిదియే తుదిసారి బోధ. చక్కగా వినుండు. శ్లో॥ చతుర్వేద ధర్మాత్ విప్ర సూక్ష్మ బ్రహ్మన విద్యతే॥ యనునట్లుగా మీరెంత చతుర్వేదములు సొంతముగా చదివి ఘనపాటిగా వల్లెవేసినప్పటికిన్ని మేము ఘనాంత స్వాధ్యాయపరుల మని పెద్ద పెద్ద పేర్లు పెట్టుకొని నప్పటికిన్ని సూక్ష్మమైన పరబ్రహ్మమును దెలుసుకొనలేక మేమే వేదముమ చదువవలెనను నహంభావంబుచే విప్రవి గుట మీకు మంచికై పుట్టిన బుద్ధికాదు. 'వినాశకాలే విపరీత

బుద్ధిః' యనునటుల మీ కేదియో చెడు దినములు ప్రాప్తమై యిట్లు ముమ్మారక మాటలతో కాలవ్యాపనము జేయుచు మేము వెళ్ళు ప్రయాణంబున కాటంక పరచుచున్నారలు. మిమ్ములను జూడగా కేవల జ్ఞానశూన్యులవలె గాన్పించు చున్నారలు. మీరందరును అజ్ఞానమే మూలధనంబని యెంచి యన్యాయంబుగా మీరు చెడునదిగాక, ప్రపంచంబున నంద రను అధోగతిపాలు జేయుచున్నారలని స్వాములవారు చెప్పగా నంత నా బ్రాహ్మణులు మీవంటి బూటకపు గురువు లుగా మేమును బూటకపు మాటలు చెప్పుకొనుచు మీ కన్న డాంబికులమై వర్తించుచున్నారము తేయని బ్రాహ్మణులనగా నంత స్వాములవారు బ్రాహ్మణులతో వాదించి విసుగుజెంది మౌనంతో గూర్చుండి కొంతసేపటికి కన్నులు విప్పి పుష్ప గిరి అగ్రహారపు ఉత్తరపు బజారున నున్న గృహంబులపై స్వాములవారు 'దృష్టి'నిల్పి చూడగా తక్షణమే నా బజారున నున్న యిండ్లన్నియు గాలుచుండినట్లు లా పురజను లందరికి స్పష్టంబుగా గాన్పించెను. అంత బ్రాహ్మణులందరు భయం బును జెంది చేతులు ముకుళించుకొని స్వామీ ! మీ మహి మంబులు దెలియక మిమ్ముల ననేక విధంబుల మీ మనంబు నకు విసుగు జనించునటుల జేసినారము. గాన ఆర్యా ! శ్రీ జగద్గురువర్యా! మా తప్పు లన్నియు ఒప్పులుగా భావించి మీబిడ్డలరీతినిగాపాడి మమ్ములకృతార్థులన జేయుడు. మేము అజ్ఞానాంధ కారమున కన్నులుగానక నరకకూపంబునం బడి

పొరలుటకుగాను మీవంటి మహాభాగ్యేయులను దూరితిమి. స్వామి మీరు త్రిగుణాతీతులు! సచ్చిదానంద స్వరూపులు! నాదబిందు కళాతీతులు! మిమ్ములను జూడగా కేవల భగవత్స్వరూపులుగా గాన్పట్టుచున్నారలు. మాకోటిషుందమతుల నుద్ధరించుటకై అవతారం బెత్తిన యుపరావ తారుండ వని వారంద రొక్క పెట్టున స్వాములవారి పాదంబులపైబడి శిరస్సాష్టాంగ దండప్రణామంబులాచరించి తండ్రీ! ఇప్పట్టున యీ తమ పాదరేణువుల నెట్టుద్ధరించెదరో ? మమ్ములను నిశ్చయముంచినను, పాలముంచినను నీడియే భారంబనివారంప రొకే విధంబుగా వేడుకొన నంత స్వాములవారు కరుణించి బిడ్డలారా! మీ రెందులకు భయంబు జెందెదరు? 'అందిన జుట్టు, అందకున్న కాళ్ళు బట్టుదు' రను సామ్యంబు మీకు సరిపోయినది. మీకు నే యిక్కట్లునుజరగవు నన్ను ఏ వర్ణములవారయిన, ఎంత దుర్మార్గులయినను త్రికరణ శుద్ధిగా మనంబున నిల్పి పూజింతురో వారి కిహపర సౌఖ్యంబులు గల్గును. సాధనం అందరికిదొరకదు. దొరికినంత దక్కించుకొనుట నతిదుర్లభంబు. నన్ను నమ్మనివా రధోగతి పాల గుదురు. కావున బ్రాహ్మణులారా! మీ మనంబునందు గల చింత యనెడుబలతను ద్రుంచుటకు ధైర్యంబను పాశంబును బూనుడని 'తగులబడు చుండినటుల'కనిపించుచున్న బజారు వైపునకు తిరిగి కన్నులెత్తి చూచువరకే పొగ లెగయుచు మండుచున్న గృహంబు లన్నియు యథావిధిగా నుండెను.



పుష్పగిరి అగ్రహారీకులు బ్రహ్మంగారికి
బ్రహ్మరథం పట్టుట

అంత నా బ్రాహ్మణులందరు నాశ్చర్యంబు జెంది అమందా నంద కందళిత హృదయారవిందులయి వెంటనే బ్రహ్మరథం బున స్వాములవారిని గూర్చుండబెట్టుకొని భేరీమృదంగాది వాద్యంబులతో పుష్పగిరి అగ్రహారపు నాలుగు బజారులూరే గింపుచేసి నాల్గు దినంబు లా స్వాముల వారిని నిల్పుకొని, అంత బ్రాహ్మణులలో నొకరు స్వాములవారి కడ కరుదెంచి స్వామీ! తమరు భవిష్యత్తు లెరింగిన పుణ్యపురుషులని విని యుంటిమి మాకందరకా కాలజ్ఞాన మహిమంబును దెల్పు వని వేడుకొనగా నంత స్వాములవారు నాయనా! మీ రంద రును కలిసి రాత్రి యరుదెంచిన, అట్లే మీ యిష్టానుసారం బుగా వినిపించెదను.

పుష్పగిరి బ్రాహ్మణులకు స్వాములవారు కాలజ్ఞానంబును బోధించుట.

శ్రీ స్వాములవారి వద్దకు బ్రాహ్మణులందరు కలసి సాయం సమయంబుకాగానే పసిబిడ్డలాదిగా నందరును నరు దెంచిరి. పిమ్మట స్వాములవారువారందరను గూర్చుండుడని సెలవియ్యగా నందరును నిశ్శబ్దముగా గూర్చుండిరి. అంత స్వాములవారు కాలజ్ఞానంబును జదువనారంభించెను.నాయన లారా! మీరంద రేకమనంబున నుండుడు. బిడ్డలారా! నేను కలియుగంబునకు దుష్టశిక్షణ శిష్టపాలన చేయుటకు శ్రీ వీరభోగ వసంతావతారుండనై కలియుగము 5000 సం॥లు మీదట వచ్చెదను. ఆ దినమున దేవతలచేతను, మునుల చేతను వరంబులు తీసికొని వచ్చే కాలంబున మా రాకడ దెలియగలందులకు మార్గశిర మాసంబున దక్షిణ భాగంబున

ఉత్పాతమైన ధూమకేతువనే నక్షత్రం బుదయించెను. మీరు చూడగలరు. ఇదియునుంగాక నొకచిత్రము గల్గును. క్రోధి నామ సంవత్సర మార్గశిర శుద్ధపంచమీ సోమవారం బున పునర్వసు నక్షత్ర కర్కాటక లగ్నంబున శ్రీ వీరభోగ వసంతావతారుండనయి వచ్చు సమయంబున దక్షిణమున ఉత్పాతమైన నక్షత్రము బుట్టును. అదియు మీ రందరును జూడగలరు. ఇదియునుగాక నాలుగు వర్ణములవారును సురాపానముచేత భ్రష్టులయిపోయేరు. వేదములు అంత్యజాతుల పాలయ్యేను. బ్రాహ్మణులుకలియుగం 5000 సం॥లు వరకు పూజనీయులై యుందురు అక్కడనుండి దేవబ్రాహ్మణులైన మా వంశీకులు కొంత వృద్ధిలోనకి వత్తురు నేను వచ్చునకికి దేవబ్రాహ్మణులు పౌరోహిత పంచాంగములతో కర్మకాండలు, వగయిరాలు జేయించు చుందురు. బ్రాహ్మణులకు పీటలు, మాలలకు మంచాలమరేను విప్రులు కులహీనులయి పంచలు గాచేరు విప్రులు విధవలకు వివాహాదులు చేసేరు. బ్రాహ్మణులలు పిలిచెడివారు లేకుండా నుండేరు. విప్రులు స్వవృత్తిని మాని పరులకు బానిసవృత్తి జేయుచుండేరు. చాతుర్వర్ణముల వారి తలలుమారేను. బాపనులు పరవిద్యలై పండెదు ఘాములమ్మేరు. నేను వచ్చునరికి వారికి తినుటకు తిండియు, కట్టుటకు గుడ్డయు లేకుండేను. బ్రాహ్మణులకును దేవబ్రాహ్మణులకును నెప్పుడు వైరంబుగానుండేను వీరి ఇండ్లలో యింటికిద్దరు వెధవలుండేరు. బాపల ప్రభుత్వాలు

పండుకొనేను. నీచుల స్నేహాలు నిలిచియుండేను. నామాట లన్నియు నిలకడమీద దెలిసేను. మీనరాశియందు సూర్యుడు ప్రత్యక్షమయ్యే కాలమందున వీరభోగవసంతావతారుండనై నాలుగు మూరల ఖడ్గము బట్టుకొని శ్రీశైలపర్వతము మీదికి వచ్చి యచ్చటి ధనమంతయు పుణ్యాత్ములైన వారికి పంచియిచ్చేను. సత్యము. ఇదియునుంగాక నేనెట్లు వచ్చెదనన్న కేదారి వనంబున నిరాహారినై తపస్సుజేసి శ్రీరాములవారిచే మూడు వరంబులుదీసికొని అచటనుండి విక్రమనామ సంవత్సరచైత్ర శుద్ధ దశమి బుధవారం ఇంద్రకీలాద్రి పర్వతమునకుబోయి, అచ్చటనున్న మహామునులున్నూ మహర్షులదర్శనము జేసుకొని, కార్తవీర్యార్జుననితోను, దత్తాత్రేయులవారితోనుకొన్ని విద్యలునేర్చుకొని, శ్రీశైలమల్లిఖార్జునుని సేవించి, ఆదిదత్తాత్రేయులవారినిదర్శించి, మహానంది ప్రవేశించి, అచ్చటరెండు నెలలుండి, యచ్చటనుండి శ్రావణ శుద్ధ పౌర్ణమినాటికి వీర నారాయణపురంబుజేరి, అచ్చట ఒకపక్షంతము నిలిచి, పిదప వచ్చెద. నేను వచ్చులోపల ధనమదాంధులు అజ్ఞానులయి అడుగంటిపోవుదురు. నావాక్యంబనిన నమ్మకున్నవారు ధనికులయి పల్లెలు పట్నంబులలో లక్ష్మీభోగములు గలిగి జనులు మడించి యుందురు. సముద్రములలోనున్న జీవరాసులునశించేను. పర్వతము మీద జనులు నిశానీలు యెత్తి బంగారు వుండే గనులు కనుగొని కొండబగలకొట్టేరు. కొండలయందు మరుగులుచూచి వాసముచేసేరు. ఇంటిలో చిచ్చుబెట్టి చెరకు

గానుగ గుండములలో దుమికేరు. కాశీ దేశములో కలహాలు జరిగేను. చిటివేలు తాలూకాలో ఘనముఖులు రాజ్యాలనేలేరు. జుర్రేటియొద్దున సృష్టిగలిగిన యోగులు బుట్టుదురు. యాగం టీశ్వరుడు భక్తులకు మోక్షము ఇచ్చేను. నేను వచ్చేసరికి విధవల పెండ్లిండ్లు జంకులేకుండా చేయుచుందురు. అవి యును మామూలయి ఉండును. నెలనెలకు భోగాలు గలి గుండేను. వావివరుసలు లేకుండా నరులకు విరహములు పుట్టును. పార్వతీ అవతారములు మేరదప్పి రొక్కములకు అమ్ముకొనేరు. కులగోత్రములు జాతి నీతులు లేకుండ పెండ్లిండ్లు జరిగేను. రెట్టాల చెరువు క్రింద నుత్పాదములు పుట్టేను. వినాయకుడు వలవలా యేడ్చేను. మేలు కొచ్చెర్ల కోటలో చెళ్ళపిళ్ళరాయుడు జనులతో మాట్లాడేను. కృష్ణ దేవరాయలు వచ్చినపుడు. విష్ణు అవతారము వచ్చినపుడు కలియుగంలో నా స్వరూపము జూపేను అరణ్యంబుతోను భూమియందును ధన మమితముగా నుండేను. రాములవారి అవతారము నేను భూమిలో యెత్తి ఋష్యాదుల తావులకు బోయి సెలవుదీసికొని యున్న సంగతి తెలియజేస్తూవున్నాను. కాన మీరు మనస్సుగలిగి మీరంతాఏకబుద్ధితో వినండి నేను భూమిమీద దుష్టాదుష్టంబులు బుట్టించబోతూవున్నాను. అవి యేమంటిరేని పాతాళగంగలో నీరు యింకిపోయేను. భూత లంబున మంటలెగయును. నాలుగు సముద్రములమధ్యనున్న ధనమంతా శ్రీశైల పర్వతం చేరేను. నూటయిరవై తిరు

పతులు పాడయ్యేను. అదే నా రాకకు నిదానము.అదియు నుంగాక భూమి అలాయిడాగా కనబడును గండికోటలో ముండలబారంతా ముటముతో కర్నూలు చేరేను. వాల లాడుచు గోలకొండ క్రింద బాలలు పట్నాలు యేలేరు. మహానంది మరుగున మహిమలు పుట్టేను. భూమిలో దుష్టు లంతా నశించేరు. పంప దేశంవారు ప్రబలమైవుండేరు. నా రాకకుముందు ననేక చిత్రములు గల్గేను. శృంగేరి పుష్పగిరి పీరములు పాంచాననమువారి పాలయ్యేను. ఉత్తరదేశంకత్తు లచే తెగేను. కనకంతోలగేను. తూర్పుదేశము ధూళియై పోయేను. విత్తంబులేక విలవిలలాడేరు ఆకాశవాణి అన్న పూర్ణాదేవి పోదిలనిమ్మవ్వ శ్రీశైల భ్రమరాంబ ఈ నలుగురు కనకదుర్గాంబకు మంగళహారతులు పాడేరు. శ్రీగిరిపట్నము సిరి గలిగుండేను. శీలవంతులు ఆదియందే అణగిపోయేరు. కాశీదేశమందు ఘనముఖులు కళకళలాడుచు నిలచేరు. పడ మరదేశం ప్రబలమై యుండేను. ఇలయందు స్త్రీ పురుషుల స్థితిలయాదులచే బాధలుపడేరు. కాశీదేశమునుండి వెనుక ముఖములవారు వచ్చేరు. శిలా నదియందు ఆచారములు వచ్చేను. బ్రహ్మకపాలంలో రామచిలుక రాజ్యమేలేను. హరిద్వారమందున మర్రిచెట్టుమీద మహిమలు బుట్టేను.హరి ద్వారములో వాకిలి మూసియుండేను. అహోబిళమందు కక్కుస్తంభమునకు కొమ్మలుబుట్టి జాజిపువ్వులు పూసేను ఇదే నా రాకకు మీకు నిదానము. నా రాకకై ప్రతివారును ఎదురు జూచుచు సదా నన్ను నేమరక నమ్మిన వారికి నిహ

పరంబుల యందును సుఖంబు గల్గును. ఇంకను యీ భూమి యందు అనేక అద్భుతములు రాబోచున్నవి. కనుక నేను భూమిమీద దుష్టాదుష్టులను పుట్టించవల మవుచున్నది. ఇంకను కాలంలేదు. నేను కొలది దినంబులలో ప్రపంచంబును వదలి తపంబున నుండవలసియున్నది. కాన సదా నన్ను మరువక నమ్మియుండును. మీకు ఒక మహా మంత్రోప దేశమును జేయుచున్నాడను. అది యెద్దియనిన 'ఓం, హ్రీం, క్లీం, శ్రీం, శివాయ శ్రీవీరబ్రహ్మేంద్రస్వామినేనమః' యను ఈ మంత్ర రాజంబును జపించుచు సదా స్తోత్రముజేయుచుండిన సఖులయ్యెదరు. నాయనలారా! ఇక మీ కందరకు ప్రొద్దు పోవుచున్నది. ఇక నేగుడు. మే మందరమును ఉదయంబు ననే బయలుదేరి కందిమల్లయపల్లెకునేగెదమనిస్వాములవారు చెప్పగా నా బ్రాహ్మణుల కుండెడి సంతోషంబునకు మేర లేక అంద లేక పర్యాయమే శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారికి జై ! శ్రీ వీరభోగవసంతావతారునకు జై! అని కేకలు వేయుచు శ్రీ స్వాములవారికి పునః పునః ప్రణామంబు లాచరించి స్వాములవారిచే సెలవుగైకొని వారి వారి గృహం బుల కేగి సుఖంబుగా నుండిరి.

శ్రీ స్వాములవారు కందిమల్లయపల్లెకు ప్రయాణులై వచ్చుచు నొక వటవృక్షంబు నీడను విశ్రాంతికై కూర్చుండ, దృక్కాత్మ నిర్ణయంబును సిద్దయ్యగారికి బోధించుట

శ్రీ స్వాములవారు పుష్పగిరినుండిబయలుదేరివచ్చుచు మార్గమధ్యంబున వారందరును విశ్రాంతికై నొక వటవృక్షంబు నీడను గూర్చుండియుండగా శ్రీసిద్దయ్యగారు స్వాములవారి

పాదంబుల నొత్తుచు స్వామీ! 'దృశ్యాత్మ' నిర్ణయంబును బోధించుమని వేడగా నంత స్వాములవారు సిద్ధా! సిద్ధా! వినుము. జ్ఞానేంద్రియములు 5, కర్మేంద్రియులు 5, ప్రాణాదులు 5, శబ్దాదులు 5, కరణములు 4, ఇవి యన్నియు గూడిన 24 తత్వంబులనంబడును ధవళ, శ్యామల, రక్త, పీత వర్ణంబుల మధ్య ప్రకాశించునదియే 'ప్రకృతి' అదియే క్షరము అదియే క్షేత్రం. అదియే శిఖము. అదియే ఆపోజ్యోతి అదియే అంతర్లక్ష్యం. అదియే నీవారశూకము. అదియే గగనసముద్రం. అదియే నీలతోయధ మధ్యస్థంబైన విద్యుల్లేఖ. అదియే మేరు శిఖరం అదియే శివునిస్థానము. అదియే నిత్యవైకుంఠము. అదియే నిత్యకైలాసం. అదియే సర్వసాక్షియైన సచ్చిదానంద స్వరూపం మరియు మునుపు చెప్పిన దవళ. శ్యామల, రక్త, పీతవర్ణంబులలో మొదటి రక్త వర్ణంబే స్థూలదేహము. శ్వేతవర్ణంబే సూక్ష్మదేహము. శ్యామలవర్ణమే కారణశరీరం, వీటి నడుమ ప్రకాశించు పీతవర్ణమే మహాకారణదేహము. ఇన్నిటి మధ్యను కైవల్యంబును తనువు ప్రకాశించుచుండునని శ్రుతిస్మృతేతిహాసములు ఘోషించుచున్నవి. ఈ తనువుల ప్రమాణం బెట్లనిన అంగుళార్థము గుంద్రనయియుండునదియే స్థూలదేహం. అంగుళ ప్రమాణంపై మండునదియే కారణదేహము ఇన్నిటి నుండి యిన్నిటిని ప్రకాశింపజేయుచు ననువయి యఖండమై యుండునదియే ఆత్మ. అదియే సచ్చిదానంద స్వరూపమైన చైతన్యము. ఈ చెప్పినవన్నియు నేత్రంబుననే యున్నవని

బోధించి పిమ్మట తాను బోధించిన దంతయు జూపించెదనని యొక దర్పణంబు దెప్పించి యందు ఈ ద్వైతాద్వైతనిర్ణయ మంతయు జూపించి సిద్ధయ్యగారి చిత్తమును స్థిరపరచెను.

స్వాములవారు భాగవతోత్తమ ధర్మంబులు సిద్ధయ్యగారికి బోధించుట

శ్రీస్వాములవారింకను భాగవతోత్తమ ధర్మంబులను చెప్పెద వినుమని యిట్లు అనియెను. బిడ్డా! తమ్ము దా మెరుంగని విషయాసక్తులైన మూఢజనుల పొంతలం బోవక కేవల సద్గురుభక్తిగల్గి సద్గురువులను ప్రతిదినంబును బూజించుటయు సాత్వికంబును భూతదయయుహరికథామృత పానంబును బ్రహ్మచర్య వ్రతంబును దుర్విషయంబులు మనంబున జేర్చకుండుటయు సాధుసాంగత్యంబును వినయసంపత్తియుశుచిత్వంబును, తపంబును, క్షమయు మౌనవ్రతంబును వేదశాస్త్ర అధ్యయనమును,తదర్థానుష్ఠానంబును, వేదశాస్త్ర అధ్యయనమును, తదర్థానుష్ఠానంబును, అహింసయు. సుఖదుఃఖ ద్వంద్వ సహిష్ణుతయు, ఈశ్వరుని సర్వగతునిగా భావించుటయు ముముక్షుత్వంబును జన సంగ వర్జనంబును, వల్కలాది ధారణయు యదృచ్ఛాలాభ సంతుష్టియు, వేదాంత శాస్త్ర జిజ్ఞాసయు, దేవతానిందావర్జనంబును,గరుణత్రయ శిక్షణంబును, సత్యవాక్యతయు, శమదమాది గుణవిశిష్టతత్వంబును గృహారామకళత్ర పుత్రక్షేత్ర విత్తాదుల గురుసమర్పణ చేయుటయు ఇతర దుర్జన వర్జనంబులను మొదలుగాగల ధర్మంబులయందే మనంబు నిల్పి ముందు మహాని

యుండవు గమ్ము. చిరంజీవివి గమ్ము. అని దీవించి యట నుండి బయలుదేరి సాయం సమయ మగుసరికి కందిమల్లయ పల్లె చేరిరి.

శ్రీ స్వాములవారు కందిమల్లయ్యపల్లె చేరుట, పశ్చిమ దేశీయులైన పాంచాననమువారికి కాలజ్ఞానోపదేశంబు చేయుట.

శ్రీస్వాములవారు శిష్యజనసహితంబుగా సుఖాశీనులై కూర్చుండి యుండగా పశ్చిమ దేశీయులు కొందరు విశ్వ బ్రాహ్మణులు శిరస్సాష్టాంగ దండ ప్రణామంబుల నాచరించి శ్రీస్వాములవారిపాదసేవచేయుచున్న సిద్దయ్యగారి ప్రక్కన గూర్చుండి స్వామీ! తమరు సంచారమునకై మా గ్రామ మరుదెంచినపుడు మేము కాలజ్ఞానంబును బోధింపు మని ప్రార్థించగా మమ్ములను తమకడ కరుదెంచినన్తేయనిచెప్పి వెళ్ళితిరిగాన తమరు మా యందు పరిపూర్ణాను గ్రహముంచి మాకు కాలజ్ఞానమును బోధించి మమ్ములనీయజ్ఞానాంధకార కూపంబునుండి కాలజ్ఞానామృతం బను వెలుగొసంగి దరి జేర్చుడని వేడుకొనగా నంత స్వాములవారు నాయనలారా! కాలజ్ఞాన శ్రవణంబు చేయవలెనని మీ కెంత కోర్కెగా నున్నదో యట్లే వినిపించెదనని చదువ నారంభించిరి. బిడ్డ లారా! వినుండు. శ్లో॥ నందా నందానయోర్మధ్యే వీరభోజ వసంతః॥ అను శ్రుతివాక్యంబుచే ఖేరీ (శ్రీముఖ) నామ సంవత్సరమున శ్రీవీరభోగ వసంతరాయుడనై తరలివచ్చి దుష్టనిగ్రహము సృష్టి పరిపాలన వలన సుప్రసిద్ధులైన వారిని పరిపాలించెదను. శ్లో॥ వ్యాసప్రోక్తం మయాదత్త విప్రాన్

సర్వత్ర పూజయే॥ కలౌ పంచ సహస్రాణి జాయతే విప్ర సంకరః॥ నేను 5000 సం॥ల మీదట వచ్చుసరికి విప్రులు సంకర వర్తులను మలగియుండి పూజ్యతయందు తక్కువ గల వారలై వుందురు. అష్టాదశ వర్ణములవారున్నూ, పర బ్రహ్మ వంశజులును దేవబ్రాహ్మణులయిన యీ వర్ణము వారిని గొప్పచేయక అపూజ్యులుగా నుంచినందున మహాయో గులు, సిద్ధులు, మునులున్న స్థలమందున వీరభోగవసంత రాయుడు నమ నామంబున నచ్చట బెరిగి నేను వచ్చుసరికి మన్నెరాజులు మారిపోయి పాపపు జను లభివృద్ధిగా నుండి ద్రవ్యకాంక్షచే నన్ను మరచి మహాక్రూర బుద్ధి గలవారయి తుదకు నశించి యుందురు. అప్పటి మావారైన దేవబ్రాహ్మ ణులు పాలకీలు, అంబారీలు యెక్కి ఆనంద దాయకముగా సర్వజనులచే పూర్వాచారంబు రీతిగా పూజింపబడుచుందురు. ఇదియునుంగాక కృష్ణవేణి ఉప్పొంగి కనకదుర్గమ్మ ముక్కు పోగు అంటుకొనును. జాతిభేద వర్ణాశ్రమాదులు లేకుండుట విప్రులవలన నన్నివర్ణములవారి ఆచారంబులు అడుగంటి పోవును. రాజాధిరాజులు అడుగంటి యొదిగి ఉందురు. శూద్రులు కేళీ విలాసముగా నుందురు. వారి విషయములలో మహాలక్ష్మమ్మ నృత్యాలు దొక్కుచు వచ్చు మాయ కోతుల నాడించేను. ఈతముక్కల మన్నారువద్ద రామలింగస్వామికి కళలు దొలగేను. జ్వాలమ్మ జనులతో వాదమాడేను. అపుడు కేవల వర్ణసంకర మగును. ఇదియునుంగాక మహానందికి ఉత్తర భాగమందు అనేకమంది మునులుత్పత్తియై భూమి

మీదికి వచ్చి మాయలు చూపేరు. తెల్లనిగుడ్డ దేశంలో తేలికగా నుండేను. తెల్లకాకులూరిపోలిమేర్ల మీదయేర్పేను. అందున కొందరు హతమయ్యేదరు. నా భక్తులైన వారికి నప్పుడే దర్శన మిచ్చేదరు. జితేంద్రియులు కానివారల నెత్తురు భూమి మీద ఏ తీరున బారునో అదేతీరున భూభారము అణగిపోయేను. దుర్మార్గుల రక్తం వలన భూమి తడిసేను. భూమి అంతా రక్త మయమయ్యేను. వినాయక నంది సోమనంది మధ్య గుడారులు వేసికొని పాలెగాండ్రు అయిదు దినంబు లుందురు. కందసూరివారు పర్వతాలకు పోయేరు. చీమ లుండు బెజ్జములలోనికి చోరులు దూరేను. స్త్రీలందరు చెడు తలంపుతో నుండేరు. అందుచే చోరులు గానకుండేరు. అహోబిలంబు మేరగాను మహానంది పర్వతము విడచేను. కందనూరు పర్యంతం కాలీలు దహించుకు పోయేరు. గడక్, లక్ష్మీపురం, కాయచూరు, చంద్రగిరి, అలివేణి, అరవ రాజ్యము, వెలిగోడు, మొరస రాజ్యము, అన్నెనగరం, పున్నాళి, ఓరుగల్లు, బరిగె, గోలుకొండ మొదలగు దేశంబులు ముందుగా వృద్ధి జెందేను. అహోబిలము మూరకానరం, నాదబ్రహ్మంవల్ల బుట్టిన వాక్యాలు తప్పేది లేదు. ప్రభవ నామసంవత్సరం రామధర్మజుల కీర్తి విస్తారమయ్యేను. నా మరమందు నేడుసారులు దొంగలు పడేరు. క్షత్రియులు అంతరించేరు. చల నేంద్రియులు ఆయుధంబుచేతను, బాణంబులచేతను నిర్మూలమై పొయ్యేరు. ఉత్తర దేశంబున భేరికోమటి "గాంధి" అనెడి

మహాత్ముడు వచ్చి ప్రపంచమందు అన్ని వర్ణముల వారిచే పూజనీయుడై కొన్ని ధర్మములను స్థాపించెను కందనూరు నీట గలసిపోయెను. మహమ్మదీయులు, భోయలు, అంత్య జాతులు యుద్ధ కాలంబులో హతులయ్యేరు. ఏలూరులో మహాతోరణాలుపడి ప్రజలు నశించేరు. భక్తులు కానివారలు బాణవర్షముచేత పొడయిపోయేరు. నా భక్తులయిన వారలు నిలచేరు. మనసార నన్ను నమ్మి స్మరణము జేయువారలు నదులను నిలువుమంటేనిలుచును బిడ్డలారా' సంహారజ్ఞానంబు నింతటితో నాపెదను. కొన్ని ధర్మంబులను చెప్పెదవినుండు తాము భోజనము చేయకముందు ఒకరికి అన్నము పెట్టుట ఉత్తమ ధర్మం. తాము భోజనంచేసి ఒకరికి అన్నంపెట్టుట మధ్యమ ధర్మం. తాము ఒకరికి అన్నం పెట్టుచుఫలకాంక్షచే పెట్టుట అధమ ధర్మం. చాలకుండా అన్నం పెట్టుట అధ మాధ్యమ ధర్మం. కాన దానంబు లన్నిటిలో అన్నదానమే శ్రేష్ఠం. గనుక నీ ధర్మంబులను మనంబునందుంచి చేసిన ధర్మం శ్రేయస్కరమై యుండును. మీర లందరు సదా నన్ను మరువక ద్వాదశాక్షరిని మరువక భజించుచు అన్న దానమునే చేయుచు సత్వగుణులై యుండుడు. నేనునునింత కొలది కాలమే భూగర్భంబున నుండి పిమ్మట సమాధి యందుండి తపంబు జేసి దుష్టనిగ్రహ, శిష్టపాలన కైరావల సిన పని యున్నది. ఇంక కొలదికాలముననే సమాధి నిష్ఠా గరిష్ఠత్వంబున నుండెదనని విశ్వబ్రాహ్మణులకు స్వాముల వారు చెప్పగా అంత నా విశ్వబ్రాహ్మణులు స్వాములవారికి

శిరస్సాష్టాంగ దండప్రణామంబు లాచరించి స్వామీ! తమరు తపస్సునకు గూర్చుండుటకుముందే మాకు తెలియజేయుడని దీనాసులయి వేడుకొనగా నంత స్వాములవారు వారికి మరి కొన్ని రహస్యంబులను దెల్పి నాయనలారా! ఇట్లే మీ కందరకును దెలియజేసెదననిచెప్పిరి. అందరునుశివపూజకై లేచి వెళ్ళిరి.

శ్రీ స్వాములవారి మఠంబునకు పదుగురు దొంగలు కన్నంబు వేయుట, ఆ దొంగలకు నేత్రంబులు నగపడకుండుట, తిరిగి స్వాములవారిచే దొంగలకు చూపు వచ్చుట

శ్రీ స్వాములవారు పీఠంబుపై కొన్ని సువర్ణ రజిత వస్తువులను తాను జేసి వచ్చిన సంచారముతో చేయించి పీఠంబున నున్న విగ్రహంబులకు నలంకారంబు చేయుట కొందరు దుర్మార్గులుచూచి సహింపజాలక ఎట్లయినను మఠం బునకు కన్నంబువేసి సువర్ణ రజితమయంబైన పీఠంబునం గల వస్తువులన్నియు దోచుక వెళ్ళవలె నను దురుద్దేశ్యంబు గలిగి యెన్నియో దినంబులనుండి యాలోచించుకొనుచు స్వాములవారు గ్రామంబున లేకుండినసమయంబున కన్నంబు వేయవలె నని చూచుచుండిరి. కానినంద్యాలసంచారానంతర మిక సంచారం వలదని మాని యుండిరి వీరిక సంచారము నకు వెళ్ళరను విషయ మా దొంగలకు దెలిసి యందరు నొక చోట జేరి వారిలో వారిట్లనుకొనుచుండిరి. అన్నలారా! మన మిక నెన్నిదినంబులుండినను స్వాములవారిక సంచారం బున కేగరట? ఇట్లెన్ని దినంబులూగకున్నను ఘన మనో

ష్టంబులు దీరవు. మన మంఠమును నీ రోజున నొకచోటనే యున్నాము. ఇదియునుంగాక యీ దినమే అమావాస్య కూడా తటస్థించినది. ఈ రాత్రి తప్పితే యింతరము నొక చోట గూడము. ఇక వెన్నెల దినంబులువచ్చిన నిక నెప్ప టికోగాని చీకటిదినంబులు రావు. కాన తప్పక ఈ రాత్రికే కన్నంబు వేయవలెనని దుర్మార్గులయిన పదుగురు దొంగలు ఆలోచించుకొని నిశ్చయించుకొనిరి. ఈపదుగురిలోస్వాముల వారి భక్తుడొక డుండెను. శ్రీ స్వాములవారు సాయం సమ యంబు కాగానే స్నానంబు జేసికొని మఠంబులోని కేగి పూజ చేసి, నిష్ఠయందుండి లేచువరకు రాత్రి 12 గంట లాయెను అంత స్వాములవారు మఠంబునకు తాళంబువేసి గృహంబులోనికి వచ్చి బిడ్డలారా! మన మఠంబున నొక చిత్రంబు జరుగనున్నది ఉదయమే మీకంతయు రమను తెలియు గలదని చెప్పి భక్త జన సహితంబుగా భోజనాదులు జేసి యెవ రెవరి స్థలంబులలో వారు పరుండిరి. అప్పటికే రాత్రి షుమారు ఒంటిగంట ఆయెను. అంతట నందరు నిద్రించిరి. దుర్మార్గులైన చోరులలోనొకడు మఠంబునసుండి పీఠమ్మునకు నిద్రించెదరా యని కనిపెట్టి చూచుచుండెను వీరందరు నిద్రించుట దొంగభక్తుడు కనిపెట్టి తిన్నగా నచ్చటనుండి బయలుదేరి యీవలకు వచ్చి తక్కిన తొమ్మండుగురు దొంగల వద్దకేగి యిదే సమయంబని చెప్పగా నంత నా పది మంది దొంగలు కన్నంబువేయుట కుపకరించు నాయుధంబు లను తీసికొని కన్నంబువేసి మఠంబులోనప్రవేశించి పీఠంబు వదకేగి చూడగా పీఠంబు వదనువద్ద అఖండంబు వెలుంగు

చుండుటచే మఠంబులోపల నంతయు వెలుతురుగానుండెను. అంత నా దుర్మార్గపు చోరులందరు సంతోషించి, మఠంబు లోపల కొందరును ధనంబు కడ కొందరునుండిరి. పీఠంబు కడ నున్నవారలు మన యిష్టంబు వచ్చిన వన్నియు దీసుక వెళ్ళవచ్చునని సంతోషస్వాంతులయి, పీఠంబుపై విగ్రహాదు లకు నలంకరించిన బంగారు వస్తువులను, శఠగోపురం ఉద్ధరిణె, వెండి సామానులున్ను దీసికొని యన్ని యొక మూటగట్టి కన్నంబువద్ద కాపలుండిన వారలును బిలిచి దీసిన వస్తువు లివియని చూపించి నిర్భయులయి నా వస్తువుల మూటను తీసికొని యందరును గలసి మఠంబులో నుండి తిరిగి బైటకువచ్చు నుద్దేశ్యముతో నా పదుగురు చోరులు పీఠంబువద్దనుండి తిరిగి బైలుదేరువరకే ఆ పదుగురి నేత్రం బులు' కనిపించక అంధులయిపోయిరి. అంత వారి కేమియు దోచక వారిలో వారు దుఃఖించుచు నట్లేయుండిరి వస్తువుల, మూటలు నెత్తిపై బెట్టుకొనిన వానికి శిరస్సంతయు నతిభారం బుగా నుండుటచే నా మూటను నచ్చటనే బడవైచెను అంద రికిని నేత్రంబులు మాత్రమే గానరాకుండెను కాని దొంగ లకు యజమానియై మూటను నెత్తిన బెట్టుకొన్న వానికి నేత్రంబులు గానరాకుండుటయేగాక, శిరస్సుపైబండ పెట్టినట్లు గాను, శిరస్సంతయు బ్రద్దలగుచున్నదా ? యనునట్లు నతి ఘోరమైన శిరోవేదన గల్గి యట్లే దుఃఖించుచు వారందరి వద్దనే గూర్చుండెను అంత తెల తెల వారుచుండగనే స్వాములవారు లేచి స్నాన సంధ్యాద్యను ష్ఠానంబులు దీర్చు

కొని గ్రామంబులోని పెద్ద మనుష్యులను, సమీపమందున్న పిన్న పెద్దలను పిలిపించివారంతరిని వెంటబెట్టుకొని మఠంబు తాళము తీసి చూడగా అంధులై దిక్కుతెలియకపడియున్న పదుగురుదొంగలుండిరి. అంత స్వాములవారు నాయనలారా! చూడుడు. వీరలు దొంగతనము చేయుటకు నీ మఠంబే కాన్పించినది గాబోలు' 'వినాశకాలే విపరీతబుద్ధి' యనునట్లు వారల కీ యిక్కట్లుప్రాప్తముండియే యిట్లుచేసిరి. వారలకు మంచి దినంబులున్న యిట్టి దుర్బుద్ధి పుట్టనేపుట్టదు. వారలు చేసిన దానికై యా గురుమూర్తి వారల కిట్లు గర్వాపహరణము చేసినాడని వచ్చిన పెద్దమనుష్యులతో చెప్పగా వారందరు నా దొంగలను చుట్టుముట్టి కొట్టుటకై ప్రయత్నించిరి. అంత సర్వభూతదయాళుండు, శాంతగుణమే ప్రధానంగా కల్గిన సద్గురుండునైన శ్రీస్వాములవారికి దొంగలపై ప్రేమ గల్గి అయ్యలారా ! మీరేల వారిని కొట్టుటకై ప్రయత్నించుచుండిరి? వారి ఖర్మ మంచిదిగాకనే వారల కీ దుర్బుద్ధి పుట్టినది. అయినను వారివద్దకేగి వారిస్థితిగతులుగనుగొనిన పిదప గదా, వారలకు ఎట్టి దండననైనను విధించుటనిచెప్పగా, ఆ చూడవచ్చినవారిలో మిక్కిలి బలిష్ఠులైన పదిమందిగలిసి యా దొంగలను చుట్టుముట్టి ఒక్కొక్కరు ఒక్కొక్కరిని గట్టిగా పట్టుకొనిరి. అంత నా దొంగలు పెద్దపెట్టున నేడ్చుచు అంధులమైన మమ్మెల గట్టిగా పట్టుకొనియెదరు ? మాకు నేత్రములు గానరాకుండుటచే మేమెందులకును పనికిమాలిన పరమనీచుల మైతిమని దొంగలనగా నంత స్వాములవారా పదుగురు దొంగలను మీరు పదిమందీ పట్టుకొని బయటకు

తీసుకురండని చెప్పి పెద్దమనుష్యులును, తానును బైటకు వచ్చిరి. ఆ దొంగలను దీసికొనివచ్చి స్వాములవారి ముందర గూర్చుండబెట్టి జరిగిన విషయంబులన్నియు చక్కగా చెప్పుడని పెద్ద మనుష్యులడుగగా నా దొంగలు తామాలోచించిన విషయములు చేసిన ఘోరపాప కార్యంబంతయు సవిస్తారంబుగా చెప్పిరి. పిమ్మట నా పదుగురును దయాశాలియైన స్వాములవారి పాదములపైబడి తండ్రీ! నిన్ను సామాన్య మానవుండనియు నందరి యిండ్లలో నుండెడి విగ్రహములే యనియు ననుకొంటిమిగాని యిట్టి మహామహిమాస్పదమైన పీఠమనియు, నమరు కేవల కైలాసవాసులనియు నెరుంగ మైతిమి. స్వామీ! సచ్చిదానంద స్వరూపా! సకల సద్గుణ కలాపా! మీరు హరిహరరూపంబున నవతరించి మాకోటి అజ్ఞానుల గర్వమణచి సుజ్ఞానులను జేయ అవతరించిన అపరావతారుండవని యెరుంగక నిట్లపచారంబులు చేసినారము. గాన నిప్పట్టున ఎట్టుల చేసినను జేయుండని స్వాములవారి పాదంబులను పట్టిసపట్టు విడువకైరి. అంత నా చూడవచ్చిన మహాజనంబంతయుదూషించసాగిరి. స్వాములవారు దొంగల నందరను దూషించుట సహింపజాలక జాలిగలిగి నాయనలారా! నా వెంటనే రండని పీఠంబుకడకు గొంపోయి యా మహాజనులందరనుజూచుచుండగనే పీఠంబుపద్దనున్న విభూతిని తెసి దొంగల నేత్రంబులపైబూసి వారందరకును తీర్థంబునిచ్చి కొంచెము సేపే కనులుమూసికొని పిదప తెరువుమని చెప్పగా వారలట్లే కొంచెము సేపటికి నేత్రంబులు తెర

వగానే వారి నేత్రంబులు యథావిధిగా గాన్పించుచుండెను. కాని నెత్తిపై మూటలు బెట్టుకొనిన వాని శిరోవేదన యట్లే యుండగా నంత నా దొంగల నాయకుఁడు స్వామీ! మాకు నేత్రంబుల నిచ్చితిరి. స్వాములవారి వస్త్రవుల మూటను నా శిరంబుపై బెట్టుకొనిన పాతకంబు చేత నా శిరస్సుపైన ఒక పెద్దబండ పెట్టినట్లుగా బరువుగానుండి అతి బాధగానున్నది కాన తండ్రీ! నన్ను కటాక్షించి కడతేర్చుడని దుఃఖితుడై వేడుకొనగా నంత పరమ దయాశాలియైన స్వాములవారు నేత్రంబులపై వేసిన విభూదియే తిరిగి శిరంబుపై చల్లగా శిరోభారం బంతయు బోయి యథావిధిగా నుండెను. అంత స్వాములవారు వారల నైదు దినంబులుంచుకొని వారలకు బ్రహ్మజ్ఞానమును బోధించి కొన్ని నీతులు నేర్పి వారి చెడు గుణంబులన్నియు చెండివేసిరి. అంత వచ్చిన మహాజను లందరు స్వాములవారి మహామహిమంబులను కొనియాడుచు వారి వారి గృహంబులకేగిరి. శ్రీ స్వాములవారిచే సెలవు గైకొని దొంగలును వారివారి గృహంబుల కేగిరి.

## ఏకాదశ ప్రకరణము

శ్రీ స్వాములవారు గోవిందయాచార్యులకు సంసారారణ్య స్వరూపం బిట్టిదని బోధించుట

శ్రీ మదఖిలాండకోటి బ్రహ్మాండనాయకుండైన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి సమాధి నిష్ఠయం దుండ దలంచి తన కుమారులను, భార్యయయిన గోవిందమ్మగారి

తన కడకు రావించి బిడ్డలారా! కూర్చుండుడు కాంతా ! నీ
విటు గూర్చుండుము. నామనంబునకొకటిదోచుచున్నది. అది
యెద్దియన, మాయామేయంబై ననీమాయాప్రపంచంబున నుం
డుటకు నాకిష్టములేకున్నది. నేనిక కొంది దినంబులు మాత్ర
మే యీ లోకంబున నుండువాడను. కాంతా! మన జ్యేష్ఠ
కుమారుండైన గోవిందయాచార్యులకు నామారుగా వానికి
పట్టాభిషేకంబు చేయవలెనని నా మనంబునకు దోచుచున్నది
నీ యిష్టంబు దెల్పుమని గోవిందమ్మగారి నడుగగా అంత
గోవిందమ్మగారు కంట నీరు విడుచుచు నాదా! తమ బహిః
ప్రాణంబయిన నన్ను విడనాడి తమరు సమాధియందుండిన
నిక నీ ప్రపంచంబున నుండి నేనేమి చేయవలసి యున్నది?
సర్వాధారుండవయిన నీవు లేని నా కీ జన్మమేల ? నేనును
సమాధియందు నిష్ఠన నుంచు నట్లు నాజ్ఞ నొసంగు దని
వేడుకొనగా, నంత స్వాములవారు కాంతా ! నే నప్పుడే
సమాధినిష్ఠా గరిష్ఠ తత్వంబున నుంటినా ? అప్పటి విషయ
మాలోచింతముగాని ప్రస్తుతము కొన్ని ధర్మంబులు గోవిం
దయ్యకు జెప్పి, పట్టాబిషేకంబుచేసి, ఇంతను కొన్ని ధర్మం
బులు స్థాపించియటుపిమ్మట నిష్ఠయందుండెదనని యామెతో
జెప్పి, కుమారా ! గోవిందయాచార్యా! నీకు నా మారుగా
పట్టాభిషేకంబు చేయ నిచ్ఛ జనించినది. నీ కుండు
సందియం బేమన నంత గోవిందయాచార్యులుగారు ముకుళిత
కరకమలుండై నిలువంబడి తండ్రీ! యింతదనుగ నెప్పుడు
జూచినను 'సిద్దడో! సిద్దడో!' యని రాత్రిం బవళ్ళును కలువ

రించుచు అద్వైత కాలజ్ఞానోపదేశంబులను దేవరహస్యంబు లన్నియును నాతనికే బోధించి మీయంత వానిగా చేసి కొంటిరి. మమ్ములను పరులనుజూచు విధంబున కన్నెత్తియైన జూడకుంటిరి. నే నీ మహాసముద్రంబును బోలు నిమ్మహా మఠంబునకు పీఠాధిపత్యంబును వహించి నీ మారుగా నే నుండిన శ్రీరాముడు నరణ్యావాసంబున కేగుచు భరతునకు పట్టాభిషేకం బొనరించిన నెంతశోభాయమానంబుగానుండెనో అట్లే నే నీ పీఠాధిపతినై యున్న నంత రమణీయంబుగా నుండును. ఎట్లన్న, తనురుండగనే తమకడకరుదెంచెడి మానవులకు దృష్టాంతా ద్రాష్టాంతములతో నెన్నియో విధంబుల బోధించుచున్నను గ్రహింపజాలని వెర్రిమానవులు నే నెట్లు నుద్ధరించు వాడను? నాకేమియు దోచుటలేదు. ఆకార్యభారంబును నా శిరంబుపై బెట్టకుడు. నే నీ సంసారంబును మహారణ్యంబు దాటజాలకుండిన, మహామహిమాస్పదంబైన ఈ పీఠాధిపత్యంబు నాకు వలదు తండ్రీ! నాకు భయం బగుచున్నది. ఇంకెవరికేనియొసంగుడని దీనాననుడై వేడుకొనగా నంత స్వాములవారు చిరునగవుతో నాయనా! గోవిందాచార్యా! యినుమునకు పరుసవేది సోకినంత మాత్రంబుననే హేమంబగునుగాని తిరిగి యినుము కానేరదు అటే నా గర్భంబునం బుట్టిన నీకును గొరతలుండునా? నాయనా? నీ సామర్థ్యంబు నే నెరుంగనిదికాదు. నీకుండు కొరతలన్నియు చే నెరుంగనివి కావు. ముందు నీకు "సంసారం బను మహారణ్య స్వరూపం" బెట్టిదో బోధించి పిదప "హంసస్వరూపం

బును" బోధించెదను. స్థిరచిత్తుండవై వినుము. నాయనా గోవిందయాచార్యా! మూలప్రకృతియను యాలవాలంబునకు సుఖంబులనెడి ఫలంబులను త్రిగుణంబులనియెడి మూలంబును ధర్మార్థ కామమోక్షంబులనియెడి రసంబును పంచేంద్రియంబులనెడి యూడలును, షడూర్ములనియెడి స్వభావంబును సప్తధాతువు లనియెడి పొరలును, అష్టప్రకృతులనియెడి విటపంబులును, నవరంధ్రము లనియెడి కోటరంబులును, దశవిధ ప్రాణంబు లనియెడి పత్రంబులును, శబ్దాది విషయంబు లనియెడు పల్లసంబులును, రాగద్వేషంబులను శాఖలుగను నానావిధ కర్మంబులు పుష్పంబులుగను, జీవేశ్వరులుగా గలిగి మందిరారామక్షేత్ర పుత్రమిత్ర కళత్రబంధు మధ్యస్థద్వేష్య జనంబులు తీక్ష్ణ దుష్కంటకంబులుగను తరులతాగుల్మ సంకీర్ణంబును గామాది చోర దుస్సంచారంబునుజరాపిశాచసమన్వితంబును, మృత్యుసింహ భయగ్రస్తంబును, దైన్యసంకట పర్వతంబును, దురితరాక్షస ఘోరంబును, తృష్ణాఖికర కాకోదర సమాంకురంబును, ఘోర వ్యాఘ్రభయంకరంబును దుఃఖ దావానల సమావృతంబును, స్వర్గనరక దుర్మార్గతిరోహితాపవర్గ సన్మార్గంబునైన మహాదుఃఖారణ్యమునంగాడు పడి పుణ్యాపాప విధేయుండై జీవుండంతట తిరిగి,చీకాకుపడి యెచ్చోటను విశ్రాంతిగానక విసిగి ముందరగాంచి అనంతంబనియు, వెనుక చూచి ననాది అనియు గలయం గనుంగొని యసాధ్యంబనియును దెలిసి మహాగాధ దుఃఖభయ శోక వ్యాకుల చిత్తుండును, దాపత్రయాదిత్య ప్రదీప్తానాల సంతప్తుండునై యుండునని బోధింపగా నంత తండ్రితో గోవిందా

చార్యులు తండ్రీ ! ఇట్లు నెట్లుచుం దోచక దిరుగుచుండెడి మానవులకు బంధమోక్షంబులుఎట్లో బోధింపుమనిన స్వాములవారు బిడ్డా! అంతట పూర్వాకృతవిశేషంబుననితాంతాటచార్యుల నాశ్రయించి ప్రసక్చందన వనితాధనధాన్యపశుసుతాశన శయ్యాచికేతనోద్యాన ప్రముఖ విషసంపాదన సాధనంబులైన కృషి వాణిజ్యసేయాచార్యాది లౌకికకర్మంబులు పరిహరించి సర్వాది నక్యాంత పరలోక విషయ సుఖసాధనంబులైన నిత్యనైమిత్తికాది కర్మంబులు ఫలకాంక్షచేత చేయక పరమేశ్వరార్పణంబువలన పరిశుద్ధ హృదయుండై యమనియమాది వింశతిగుణంబులు ఎప్పుడు సంగ్రహించునో యప్పుడు ఆత్మ బ్రహ్మైక సాక్షాత్కారవిచారిధికారి యగునని చెప్పగా నంత గోవిందయాచార్యులు తండ్రితో నిట్లుల నియెను.

శ్రీ స్వాములవారు గోవిందయాచార్యులకు "హంసస్వరూపంబును"
(అనగా స్వరపరీక్షను) బోధించుట.

శ్రీ స్వాములవారిని గోవిందయాచార్యులు తండ్రీ ! హంస స్వరూపంబైన సర్వశాస్త్రంబునుబోధింపుమని వేడగా నంత స్వాములవారు బిడ్డా! వినుము. సిద్దా ! నే నీయనకు బోధించుచున్న వన్నియు వినుచుంటివిగదా! నీకుదోచకున్న విషయంబును మరలనడుగుచుండుమని చెప్పి స్వాములవారు గోవిందయ్యవైపునకు తిరిగికుమారా! ఈ శరీరంబను బ్రహ్మగుడిలో హంసాకారమనే 'జీవహంస' నిట్టాడు కొయ్యతోక మున 'ఘటసర్ప'ంబను నామముచేత గుదస్థానమందు చంద

బెట్టుకొనిన నడివీపు వెన్నెముకలోని సన్నిరంధ్రములం
తంతు మాదిరిగా నడుచుచు సహస్రారమున వేయి రేకుల
కమలమందు వేయి ఫణంబులు గావించుకొని పద్మకనక
కుహరాంతమందు కుండలిని వ్యాపించుకొని అజప ద్వారా
పన్నెండు అంగుళములు బైటికి రేచించుకొని తిరిగి ఎనిమిది
అంగుళములు లోనికి పూరించుకొని రేచక పూరకములు
రెండును చేరిన ఒక ప్రాణ మనంబడును. అట్టి ప్రాణములు
రాత్రింబవలు చేరిన 21,600 ప్రాణములాయెను. ఆప్రాణము
లను అధరం మొదలుకొని సహస్రారం వరకుండు అధిదైవ
ముల కర్పణచేయుచు ఊర్ధ్వకుండలిని వ్యాపించుకొని అధో
ముఖములుగా అజపద్వారా రెండక్షరములచేత రాత్రింబవలు
నీవుమరచిన నదిమరువక ఎరుకమరపులకు అతీతమైన జపం
చేయుచు గాయత్రి యనే నామముతో కుడిముక్కుచే వస్తే
సూర్యుడనిన్ని, ఎడమ ముక్కునవస్తే చంద్రుడనిన్ని ఈ
రెండును గలసినచోటు త్రికూటమనియు, ఇడానాడి చంద్రు
డనియు, పింగళినాడి సూర్యుడనియు, త్రికూటంన నిల్పుట
కుంభకమనియును, యిడానాడి గంగ, పింగళినాడియ్యమున,
కుంభకనాడి సరస్వతి, ఇడానాడి కైలాసగిరి, పింగళినాడి
మంధరగిరి, కుంభకనాడి మహామేరువు. రేచకం యెరుపు,
పూరకము తెలుపు, కుంభకం నలుపు. ఈ ప్రకారంబున
పరమహంస అధిష్ఠాన స్వరూపంబై యీ దేహపర్యంతం
వ్యాపించుకొని ఒక్కముఖంబున అజపద్వారా బయలుదేరుచు
లోనికిపోవుచుండునని దెలియుము హంసయనగానాదబిందు

కళాతీతమై సచ్చిదానంద స్వరూపంబై ప్రకాశించు పరమా త్ముడు "హ" కార మనంబడును. దేహేంద్రియాది దృశ్య రూపిణియైన ప్రకృతి "స" కారం బనంబడును. ఈ ప్రకృతి పురుషులు గలియుటచే హకార సకార మధ్యమున్న "బిందువు" గనుక 'హంస' యనంబడును.

శ్రీస్వాములవారు సర్వోదయ ఫలమున్ను సంవత్సరాది ఫలమున్ను మాస ఫలమున్ను వారఫలమున్ను సర్వప్రమాణంబని నిరూపణచేసి బోధించుట

కుమారా! గోవిందయాచార్యా! ముందు సర్వోద యంబును తదుపరి సంవత్సరాది ఫలమున్ను పిమ్మట వార ఫలమున్ను జెప్పెద శ్రద్ధాళుండవై వినుము సోమవారము, బుధవారము, శుక్రవారము నీ మూడు వారములున్ను చంద్ర నాడి వారములని చెప్పంబడును. ఆదివారం, మంగళవారం, గురువారం, శనివారము నీ నాలుగు వారములున్ను సూర్య నాడి వారములని చెప్పంబడును. పక్షాంతరమందున శుక్ల పక్షంబున వచ్చెడి గురువారము చంద్రనాడి యనియు, కృష్ణ పక్షమందు వచ్చెడు గురువారం సూర్యనాడియనియు జెప్పం బడును. సూర్యుని వారములయందు ప్రాతః కాలమందు సూర్యనాడి ప్రవహించుచుండిన, జయమును, లాభమును, శుభ మును గలుగును. విపరీతంబుగ ప్రవహించుచుండెనేని విప రీత ఫలంబును గల్గును. చంద్రుని వారములందు ప్రాతఃకాల మందు సూర్యనాడి యుంటనేని రిక్తమనియు, చంద్రనాడియే యుండిన యెడల పూర్ణ శుభంబు గల్గుననియు, సూర్యనాడి వారమున ప్రాతఃకాలమందు చంద్రనాడినడిచిన రిక్తమనియు

సూర్యనాడియే నడచిన పూర్ణశుభంబనియు, చంద్ర సూర్య నాడుల పూర్ణమందు నేకార్యమునారంభించిననుసిద్ధియగును. మరియును సమస్త శుభకార్యంబులును చంద్రనాడి పూర్ణ మందు సుతత్వంబున నారంభించినచక్కగాఫలించుననియు, శీఘ్రకార్యంబులు, క్రూర కార్యంబులు సూర్యనాడి పూర్ణ మందు నారంభించిన ఫలించుననియుజెప్పంబడును. మరియు శుక్ల పక్షమందు చంద్రుని వారాలలో నా చంద్రనాడి నడ చిన విశేషఫలంబనియు, కృష్ణపక్షమున సూర్యవారముల యందుసూర్యనాడినడచిన విశేషఫలంబనియు జెప్పంబడును. మరియు చంద్ర సూర్యులకు ప్రత్యేకంబు పంచఘటికా ప్రమాణంబై దివసంబున కరువది ఘడియలకు సమాప్తం బగు నటుల సూర్యుడు నారు పర్యాయములున్నూ, చంద్రు డారు పర్యాయములున్నూ తిరుగుచుండెదరు. తన్మధ్యమున పంచతత్వంబులు ఉదయాది క్రమంబుగా మొదట నాకాశ తత్వంబును రెండవదివాయుతత్వమును, తదుపరి నగ్నితత్వం బును, ఆ వెనుక జలతత్వంబును, కడపట భూత తత్వం బును, సూర్య చంద్రనాడులతో క్రమముగా సంచరించుచుం డును. తన్నాడీఘటిక పంచకంబును సంపూర్ణం బగునటుల ఘడియన్నర పృధ్వీతత్వంబును, ఘడియంబాతిక నుదక తత్వంబును, ఘడియ నగ్నితత్వంబును, ముప్పాతిక ఘడియ వాయుతత్వమును, అరఘడియ ఆకాశతత్వంబును రేయిం బగ లీ చొప్పున సంచరించుచుండును. ఈ నియమంబును శుద్ధచిత్తులయిన తత్వవేత్తలకుగాని యితరులకు వ్యత్య స్తముగా ప్రవర్తించుచుండును—బిడ్డా! ఇకసంవత్సరఫలం

చెప్పెద చక్కగా గ్రహింపుము. ఉగాది అనగా సంవత్స రాది. అమావాస్య రాత్రికి సూర్యనాడిఆడవలయును. చైత్ర శుద్ధ పాడ్యమి ఉదయం చంద్రనాడి, సాయంత్రము సూర్య నాడి, విదియరోజు ఉదయంచంద్రనాడిసాయంత్రము సూర్య నాడియు. ఈ ప్రకారము చంద్రుడు ఒక్కొక్క దినమునకు నాలుగేసి నెలలు బలము గలుగును. ఆసంవత్సరంసుఖముగా నుండును. పాడ్యమి రోజున చంద్రుడునడవకపోయినతనకు భయము కలుగును. చవితిరోజునవారస్వరం నడువకపోయిన ప్రాణమిత్రులతో సముతైన చుట్టాలకు నమిత భయము పుట్టును. పగలు గలుగును. పంచమి రోజున వారస్వరము నడువకపోయిన రాజులతో విరోధించి భయంబు గలవాడై యుండును. షష్టిరోజునవారస్వరము నడువకపోయిన మహా రోగపీడితుండగును. దేశమును విడుచును. సప్తమి రోజున వారస్వరము నడుపకపోయిన పుత్రహాని గల్గును. అష్టమి రోజున వారస్వరము నడువకపోయిన తప్పక తనకు ప్రాణ హాని గల్గును. సూర్యుని వారమందు చంద్రుడు నడిచితే తూర్పుదిక్కుగాని, దక్షిణదిక్కుగాని యెడమకాలుముందరికి మూడడుగులు నడిచితే నాదోషము పరిహారంబగును.సుఖంబు గల్గును. చంద్రుని వారములయందు సూర్యుండు నడిచితే, పడమరగాని, ఉత్తరముగాని కుడికాలు ముందరికి మూడడు గులు నడిచితే నా దోషము పరిహారంబౌను. చంద్రబలము గల్గును. ఇక ఉగాదినాడుతత్వములు చూచుకొను విధంబును

చెప్పెద వినుము. ఉదయంబున జూడగా తేజోతత్వంబు కను పించిన ఆ సంవత్సరం వర్షం తక్కువగా కురియును.వాయు తత్వంబు కనుపించిన నా సంవత్సరంబు రోగాలు గల్గును. ఆకాశతత్వంబు కనుపించిన రోగాలు లేని ఉపద్రవంబులు గల్గును. పృధ్వీతత్వంబు కనుపించిన నా వత్సరం తానును ప్రజలును అష్టయిశ్వర్య సంపన్నులై యుందురు. జల తత్వంబు గనుపించిన తానున్ను, ప్రజలున్ను సుఖంబుగా నుందురు—ఇక నెలలకు సర్వమును జూచు క్రమంబును చెప్పెద వినుము! అమావాస్య పాడ్యమి విదియ తదియ యీ దినంబులయందు చంద్రుడుంటే వచ్చే అమావాస్య వరకును జయప్రదంగా నుండును. ఆ దినములలో సూర్యుడుంటే సూర్యుని దిక్కు మూడడుగులు ముందరికి నడచిన దోషము పరిహార మగును. సూర్యుడు బలము నిచ్చును. కాన నీవు శ్రద్ధతో సర్వంబును జూచుకొనుచుండుమని స్వాములవారు చెప్పగా తన పాదంబులకడ సేవచేయుచున్న సిద్ధయ్యగారు స్వామీ! సద్గురుచంద్రమా! తమరు నా సోదరునకు బోధిం చిన వన్నియు గ్రహించితిని. యీ సర్వంబునే చూచుకొని యిన్ని దినంబుల కి జీవి పోవునని చెప్పుచుండురే నామరణ సూచన లక్షణంబులను బోధింపు మనగా స్వాములవా రిట్లు బోధించిరి.

స్వాములవారు సిద్ధయ్యగారికి మరణసూచిక లక్షణంబులను బోధించుట

నాయనా! సిద్దా! సంవత్సర మాస పక్షములు మొదటి దినముల ప్రాతఃకాలమందు శ్వాసను విచారణ చేసి మరణ

కాలము దెలియవలెను. అదెట్లనిన సంవత్సర మాస పక్షాది దినముల ప్రాతఃకాలమందు వారస్వరంబులుండిన జయ లాభంబులు గల్గును. లేక విపరీతంబుగనడచుచుండిన విప రీత ఫలంబని తెలిసేది. ఇక మరణసూచక లక్షణంబుల జెప్పెద వినుము... సంవత్సరాది దినంబున వారస్వరంబు లేకున్న మూడు సంవత్సరంబులకు మరణమనియు, రెండు దినంబులు లేకున్న రెండు సంవత్సరములకుమరణమనియు, మూడు దినంబులు లేకున్న ఒక సంవత్సరమునకు మరణం బనియును, మరియును యే నాడివైనను ఒక రాత్రి పగలు నడువకయుండిన మూడు సంవత్సరంబు లాయుష్యంబని యును పదిహేను దినంబులుసూర్యనాడి దిరుగకుండి రెండు సంవత్సరంబులు నాయుష్యంబనియును, మూడు రాత్రులు ప్రాణవాయువు ఏకనాసాపుటమందు ప్రవహించుచున్న ఒక సంవత్సరం బాయుష్యంబనియును, బహుకాలము రాత్రి చంద్రుడున్ను, పగలు సూర్యుడున్ను ప్రవహించుచున్ననారు మాసంబులకు మరణించుననియు జెప్పిన స్వాములవారితో గోవిందయాచార్యు లిట్లనిరి.

శ్రీ స్వాములవారు ఛాయాపురుష లక్షణంబులను గోవిందయాచార్యులకు బోధించుట, సంకల్పాది వర్జనక్రమంబును బోధించుట.

తండ్రీ! తమరు కొన్ని దినంబులక్రిందట నొక భక్తు నకు ఛాయాపురుష లక్షణంబులు గురించి బోధించితిరి. తిరిగి నాకా "ఛాయాపురుష లక్షణంబు"లను బోధించుమని వేడగా నంత స్వాములవారు బిడ్డా! దీపముండగనే వెదుకి లాడుదని యిదివరకే చెప్పుచున్నాను వినక చివరకి మీకి

అద్వైత రహస్యంబులన్నియు గావలసి వచ్చినవా ? యని యిట్లు చెప్పనారంభించెను. బిడ్డా! మనుష్యుని యొక్క ఛాయ. కంఠ మందు గ్రుక్కనిల్పి నిష్కళంకమైన యాకాశంబును జూడగా ఛాయపురుషుండు గానంబడును. ఆ పురుషుండు కృశుడై కన్పించునట్టులైన ధనహాని గల్గును. పీతవర్ణంబుగా నుండెనని లాభ ప్రథంబగును. స్థూలంబుగా నుండెనేని ధనంబు గల్గును. నీలంబుగా నుండెనేని మరణంబు గల్గును. ఎరేపు వర్ణముగా నుండెనేని భూమికిరాజగును.పీతవర్ణంబుగా నుండెనేని ఆయుర్వృద్ధి గలుగును. ఛాయాపురుషుడు శిరంబు లేనట్లుగా గనిపించెనేని నారుమాసములకు మరణించును. ఆ పురుషుని మధ్య రంధ్రముగా తెరవగా గనిపించెనేని భూమికి కరువు వచ్చును. తేజస్సుగా నుండెనేనిధరణియందు సుభిక్షముమ నుండును. భుజహీనముగా గనుపించెనేని తనయులు చత్తురు. లింగహీనంబుగా కనుపించెనేనిభార్యమరణించును. మరియు నీ ఛాయాపురుషుని విడువక దిన దినాభ్యాసపూర్వకముగా జూచుచుండిన మిక్కిలి సన్నిహితమైన పిదప త్రికాలజ్ఞానమును జెప్పుసంతతి వారలగుదురని స్వాముల వారు చెప్పగా గోవిందయాచార్యులు తండ్రీ ! మీరిన్ని బోధించుచున్నను నా మనంబు "గాలిలోని దీపంబురీతిగా" నున్నదే గాని స్థిరంబుగా నిలువదయ్యెను. నాకు సంకల్పాది వర్జన క్రమంబును బోధింపుమని వేడగా స్వాముల వారిట్లు బోధించిరి. బిడ్డా ! వినుము. సంకల్పాది వర్జనంబున కామంబును కామ వర్జనంబున క్రోధంబును నర్థానర్థ సమయంబున లోభంబును అద్వైతాను సంధానంబునభయంబును

ఆత్మానాత్మ వివేకంబును, శోకమోహంబులును, సాత్విక సేవనంబు వలన దంభంబును మౌనంబున యోగాంతరాయంబును, శరీరావాంఛ లేమి హింసయు, హితాచరణంబున భూతంబైన దుఃఖంబును, సమాధి బలంబున దైహిక వ్యథయును, స్వాతికాహారలబున నిద్రయు, ప్రాణాయామాదికంబున మన్మథ వ్యథయును, సత్వగుణంబున రజస్తమంబులును శ్రీ గురుభజన కుశలుండై శీలంబున జయింప వలయును. ఈ సంకల్పాదులు వర్జించినందున కామాదులు వర్జితంబులగునని తెలిసి తత్క్రమము బాచరించిన అనాయాసంబుగా సర్వతత్వ సాక్షాత్కారంబగునని బోధించి యందరును శివపూజకై గృహములోని కేగిరి.

శ్రీస్వాములవారు తా నవతరించిన ననంతావాతార మహిమంబులను సిద్దయ్యగారికి బోధించుట. (కాలజ్ఞానము–సప్తమకాండ)

శ్రీ స్వాములవారి భోజనానంతరము సిద్దయ్యగారు స్వాములవారి పాదములకడ గూర్చుండి పాదము లొత్తుచు స్వామీ! తమ రిదివరకు కృతయుగ, త్రేతాయుగ, ద్వాపర యుగములలో దశావతారుండనై యుంటినని కాలజ్ఞానమున వ్రాసియుంటిరి గదా ! ఎచ్చటెచ్చట నెన్ని యుగములుండి మీ రేమెునర్చితిరో సెలవొసంగుడని వేడుకొనగా నంత స్వాములవారు బిడ్డా! భక్తుండనిన నీకే చెల్లినది, తదితరులకు చెల్లనేరదు. నీవిపుడు కోరిన దేవరహస్యంబైన విషయమును దెల్పుమని కోరితివి. అయ్యది అభేద్యంబయినది. అయినను నీవు నాకు ప్రాణసమానుండవు గానసీకు జెప్పెద

నే నింకెవరికి చెప్పవాడను ? కాన శ్రద్ధతో వినుము... 1) ముందు నేను బ్రహ్మలోకమునుండి భైరవుండనే నామము చేత అనేక బ్రహ్మకల్పాలు రాజ్యపరిపాలనంబు జేసితిని. అంత రజతాద్రికిబోయి ఏబదిమూడుబ్రహ్మకల్పాలు రాజ్య పరిపాలనజేసి కైలాసమునకుబోయి రెండువందల నలభై మూడు బ్రహ్మకల్పాలు రాజ్యపరిపాలనముజేసి వైకుంఠము నకుబోయి మూడు యోజనముల పొడవున కూర్మసింహాస నము గావించి 33 బ్రహ్మకల్పాలు రాజ్యపాలనముజేసి, మాధవస్వామిసేవ 290 బ్రహ్మకల్పాలు చేయగా మాధవ స్వామి పంచవిధములైన ముక్తి యిచ్చెను. ఆ మీదట మాధవస్వామి 10దివ్యవర్షములుండి 1550 మార్లు భూమి ప్రదక్షిణముజేసి సిద్ధాంత శిరోమణులైన ఆనందాశ్రితులు యాశ్రమమువద్ద సర్వవిద్యలు సాంగంబుగా నభ్యసించి మూడుయేండ్లుఅయిన పిమ్మటఅనేక యోగశాస్త్రవిద్యలును, 12009 గ్రంథములు పరిశీలించి అందుండు మర్మం లన్నియు గ్రహించి కాల అకాలమృత్యువులను జయించి నా యోగముచేత దివ్యశరీరమెత్తి3333బ్రహ్మకల్పాలువుంటివి. ఆ మీదట ఆ యవతారముల విశదం దెల్పెద వినుము ! మొదటి యవతారంబెత్తి ఆనందాశ్రితులకు శిష్యుండనయి 99662 బ్రహ్మకల్పాలు వుంటిని. 2) ఆ మీదట రెండవ యవతారంబెత్తి ఆనందాశ్రితులకు శిష్యుండనై 795బ్రహ్మ కల్పాలు వుంటిని. 3) మూడవ యవతారమున యానందా శ్రితులకు శిష్యుడనై 1,09,00,000ఒకకోటి తొమ్మిదిలక్షల

బ్రహ్మకల్పాలు వుంటిని. 4) నాలుగవ యవతారముల యానందాశ్రితులకు శిష్యుడనై 100,00,317 ఒక కోటి పదమూడుపందల పదియేడు బ్రహ్మకల్పాలుంటిని. 5) ఐదవ యవతారంబున నానందాశ్రితులకు శిష్యుడనై 4,14, 55,000 నాలుగుకోట్లు నూట నలుబది అయిదువేల బ్రహ్మకల్పాలు వుంటిని. 6) అటుమీద ఆరవ యవతారంబున ఆనందాశ్రితులకు శిష్యుండనై ఆరువందల బ్రహ్మకల్పాలుంటిని. 7) ఆ మీదట ఏడవయవతారంబయిన ఆనందాశ్రితులకు శిష్యుండనయిన 27,62,03,400 ఇరువదియేడుకోట్లు అరువదిరెండులక్షల మూడువేల నాలుగువందల బ్రహ్మకల్పాలుంటిని. 8) ఆ మీదట ఎనిమిదవ యవతారమున ఆనందాశ్రితులకు శిష్యుండనై 22,60,000 ఇరువది రెండు లక్షల అరువదివేలు బ్రహ్మకల్పాలుంటిని. 9) ఆమీదట తొమ్మిదవ యవతారమందున ఆనందాశ్రితులకు శిష్యుండనై యజ్ఞేంద్రునికి కొమరుండనయి 70,39,36.000 డెబ్బది కోట్లు ముప్పది తొమ్మిది లక్షల ముప్పదియారు వేల బ్రహ్మకల్పాలుంటిని 10) ఆ మీదట పదవయవతారమందు ఆనందాశ్రితులకు శిష్యుడనై కనిగిరి వాసుడనై 70,00,365 డెబ్బదిలక్షల మూడుపందల అరువదిఅైదు బ్రహ్మకల్పాలు వుంటిని. 11) ఆ మీదట బనగానపల్లెలో వీరప్పయాచార్యుడనయి 125వత్సరములు తపస్సు చేసి కలియుగము 3800 యేండ్లకు సరియైన వికారనామ సంవత్సర ఆషాఢ శుద్ధ త్రయోదశీలు తదారభ్య ఏకవింశతి వికార నామ సంవత్సరములోగా వీరవసంతరాయలు పేర నంది

కొండయందు ప్రఖ్యాత మయ్యేను. యీలోగా హరిహర రాయలచరిత్రము మొదలురామదేవరాయల చరిత్రము అంత మయ్యేను. వీరి అనంతరము మహమ్మదీయు లీప్రపంచము నకు ప్రభువులయ్యేరని స్వాములవారుచెప్పగానంత సిద్దయ్య గారు చేతులు ముకుళించుకొని స్వామీ ! తమరు కేవల భగ వత్ స్వరూపులని తెలిసినను,అనంతావతారుండ వని దెలియ వైతివని పట్టరాని సంతసముచే దేహము పులకాంకురములు పొడమిన భక్తిచే మరల మరల వినుతించుచు బ్రహ్మానంద ముస కరుణాసాగరా! నీకు కేలుమోడ్పు. దీనబాంధవా ! ధరణీధరా! పురుషోత్తమా ! పాపనాశకరా! పాపసంహారా! పుణ్యచరిత్రా! భక్తమందారా! నీ వొక్కండ వయ్యును నీటి కుండలయందు సూర్యుడు బహురూపుండవై గాన్పించినటుల భూతలంబుల యందును బహురూపుండవై గాన్పించుచున్నా డవు గాలిచే తూలెడి దూదివలెనీప్రేరణచేనిదియెల్లను జలిం చుచున్నది. తండ్రీ! నీవు చిదాత్మకుండవుగాన మరి యొకరి సహాయంబు గోరుట నీకువలదు. అట్టి కోరిక నీకేమి వలదు సుమా! నామా రూపాత్మకంబగు నీ జగత్తు నీప్రభచే ప్రకా శించుచున్నది. నీ మాయచేమోహితుండగువాడు నీ తత్వం బెరుంగడు. ఆహా ! నీ వొక్కండవు సర్వమయుండవు. రూపివి, అపురూపుడవు, సూక్ష్మడవు, స్థూలుడవు. అద్భు తంబైన ధర్మంబులు పెక్కులు నీయందు బ్రవర్తములై యున్నయని యని యనేకవిధంబుల స్తోత్రముచేసి నిలువం బడియున్న సిద్దయ్యగారితో స్వాముల వారిట్లనిరి. బిడ్డా !

ఎవడు ధర్మవిధిని సర్వకామంబువదలి ఆత్మావలోకనంబుచే తృప్తుంతఁడునో యాత 'డాత్మస్థితప్రజ్ఞుం' డనంబడును. మరియు కూర్మము సకలమైన యవయవంబుల నెల్ల లోపలికి ముడుచుకొనును. ఆ ప్రకార మింద్రియ మనంబులనునింద్రి యార్థమువలన మరలించునాతడాత్మస్థిత ప్రజ్ఞుండనంబడును మరియు నిఖిల విషయాలందును నపేక్షలేనివాడయి శుభం బునొంది సంతోషించక అశుభంబుగా నొందిదుఃఖించక ఏ మహాత్ముడు మానసేంద్రియములను తన యాజ్ఞచే నిలుపు కొని పనులు జేయించునో యాత డాత్మస్థిత ప్రజ్ఞుండనం బడును. కావున నీవును సమభావుండై యన్నింటిని సమం బుగా జూచును నాత్మస్థిత ప్రజ్ఞుండవు గమ్మని బోధించి దీవించి పిదప నిరువురును నిద్రించిరి.

శ్రీ స్వాములవారికి దెలియకుండగనేగోవిందమ్మగారు పోలేరమ్మకుపొంగిలి జేయ ప్రయత్నించుట, ఆ దేవి సంకల్పము గ్రహించి పోలేరమ్మను తన గృహంబునకు బాలిక రూపంబున రప్పించుట,అమ్మవారు చేసిన పదార్థములను భక్షింపుమని చెప్పుట, గోవిందమ్మగారు ఎప్పుడు దలంచినను నప్పుడే దర్శనం బొసంగి యీమె సంకల్పమును నెరవేర్చుమని పోలేరమ్మకో చెప్పుట.

శ్రీ పరంజ్యోతి స్వరూపిణియయిన గోవిందమ్మగారు గ్రామమున స్ఫోటకంబులు వగైరా జాడ్యంబు లుండుటచేత బాగుండునని తలంచి అందరా గ్రామదేవతయైనపోలేరమ్మకు పొంగళులు చేయవలెనని యొక దినంబున నిశ్చయించుకొని యెవరెవరి శక్త్యానుసారముగా వారు పొంగళులుజేసిరి. ఆ

విషయము గోవిందమాంబకు దెలిసి పసిబిడ్డలున్న యింట పోలేరమ్మకు "చద్ది" బెట్టిన మంచిదని తలంచి ఆదివారము రోజున నిల్లునంతయు నలికి ముగ్గులుదీర్చి స్నానంబాచరించి యంత రాత్రి వండియుంచిన చద్దియన్నములో పెరుగుకలిపి మూడు చిన్న రాళ్ళను దెచ్చి పసుపును బూసి కుంకుమ బొట్టునుబెట్టి ఇంటిలో "చల్లగుంజ" వద్ద నామూడు రాళ్ళను బెట్టి యొక విస్తరియందా చద్దినిబెట్టి నిప్పునుదెచ్చి సాంబ్రాణితో పొగవేయు సమయంబులో శ్రీస్వాముల రా వంట యింటిలోనికి వచ్చిరి. అంత నా స్వాములవారు రాకముందే దగ్గరనున్న చేటను నా మూడు రాళ్ళపైనున్న చద్దిపైన బోర్లి చెను. అంత నా స్వాములవారు అమ్మవారివద్ద కరు దెంచి నిలువంబడి చిరునగవుతో గోవిందా! ఈరోజుననేదియో సంకల్పంబున ఎనిమిది గంటల ప్రొద్దెక్కకముందే నిత్యకృత్యంబులన్నియు దీర్చుకొని ఏదియో చేయబోవుచున్నావే యని బోర్లించిన చేటను ఎత్తెను. అంత గోవిందమ్మగారు గడగడ వణకుచు స్వాములవారికి తెలియకుండా నే నిట్లు చేయుచున్నందుకు నాగ్రహంబు చెందెదరను తలంపుతో బయటికి వచ్చెను. అంతలో స్వాములవారు బయటికివచ్చిన గోవిందమాంబను గోవిందా! గోవిందా! యని పిలువగానే ఆమె చేయుపని మంచిదైనను పతియాజ్ఞ లేనిదే ఈ కార్యంబును జేయుచుంటినే యను భయంతో ముకుళితకరకమలయై గడగడ వణకుచు వచ్చి నిలువంబడగా నంత స్వాములవారు నీ వెందులకై ఈ మూడు రాళ్ళను, నీ చద్ది యన్నంబును

బెట్టుచున్నావు. నీవు పెట్టెడి ఈ చద్దియన్నంబును నీరాళ్ళే మయినా భోంచేయునా ? యని యడుగగా, యధార్థంబును జెప్పకున్న బహుదోషంబని యద్దేవి యెంచి స్వామీ! మన గ్రామంబున స్ఫోటకంబులు వగైరా జాడ్యంబులుండుటచేత గ్రామస్థులందరును పోలేరమ్మకు చల్దులు పెట్టుచుండిరి. ఆ చల్లని తల్లికి చల్దులనిన ప్రేమయని తలంచి యిట్లు తమ యాజ్ఞలేనిదేచేసితిననిచెప్పగా నంత స్వాములవారు పకపక నవ్వుచు గోవిందా! నీ వెంత పిచ్చిదానవు? రాతిని పూజించి నైవేద్యం బిడిన ఆ రాయి భోంచేయునా ? అది సరికాదు. నీవు నాపూజాసమయంబగుసరికి భక్ష్యాదులతో సహనైవేద్యమును జేయుము. ఆ పోతేరనే మన యింటికివచ్చిభోజనము చేయునట్లు జేసెదనని చెప్పగా నంత గోవిందమాంబ సంతోషంబునకు మేరలేక స్వామీ ! అట్లే వంటకంబులన్నియు తయారు చేసెదనని స్వాములవారితో జెప్పగా వారును వారి పనికై యెచ్చటికోయేగిరి. అంత గోవిందమ్మగారు యిరుగు పొరుగు వారందరితో నీరోజున పోలేరమ్మ వచ్చి భోజనము జేసి పోవుననిచెప్పగా వారంద రాశ్చర్యంబునొంది ఒకరితో నొకరీలాగెకందిమల్లయ్యపల్లెతోగలసి దగ్గర గ్రామాదులలో నున్న గ్రామస్థులును, నితర గ్రామస్థులును స్వాములవారింటికి గుంపులు గుంపులుగావచ్చి చుట్టుముట్టినిలచుండిరి.అంత స్వాములవారు గుంపులుగానున్నవారందరినిగృహంబులోనికి రండని వారందరిని గూర్చుండుడని చెప్పి బిడ్డలారా! మీరం

దరు పోలేరమ్మకు చల్దులు పెట్టితిరిగదా. ఆ మహాదేవి భోంచేసి పోలేదా ? యని యడుగగా నంత వారందరును నేమియు మారు మాట్లాడుటకు నోరాడక యూరకుండిరి. అప్పటికే పదిగంటల ప్రొద్దెక్కినది. గోవిందమాంబగారు నా దేవిని దర్శించుకొందమను తలంపుతో పనులన్నియు నతి త్వరితముగనే చేయుచుండెను...అంతలో కర్నూలు నవాబు గూడా నా దినంబుననే స్వాములవారి దర్శనార్థియై వచ్చెను. నవాబు రాక స్వాములవా రెరింగి వారిని తనగృహంబునకు దోడ్కొనివచ్చి తగుమర్యాద లొనరించి వారిని గూర్చుండు డని చెప్పగా నంత నవాబు స్వామీ! ఈ మహాజనంబు తమ గృహంబున కరుదెంచుటకు కారణం బేమియని యడుగగా స్వాములవారు బిడ్డా! వినుమని పోలేరమ్మ విషయమై జరిగిన వృత్తాంతమంతయు దెల్పగా నా నవాబునకుండెడి సంతోషం బునకు మేరలేక తండ్రీ! ఈ దినంబు నాకు సుదినంబు గను కనే యిట్టి మహామహిమంబును చూచుటకు ప్రాప్తంబు గల్గి నది. నేనిటకు రాకుండిన ప్రాప్తంబుండునా యని సంతోష స్వాంతుడై యుండెను. అంతలో గోవిందమాంబ స్వాముల వారికడ కరుదెంచి స్వామీ! వంట తయారైనది శివపూజకు లెండని చెప్పగా నంత స్వాములవారు లేచి నవాబును, కొందరు పెద్దమనుష్యులను లోనికి బిలిచి లేచి స్నానంబాచ రించి నిష్ఠయందు గూర్చుండి కొంతసేపటికి కూర్చుండుడని చెప్పి గోవిందా! ఇక వడ్డన చేయుము. మాకందరకు గాక దేవదేవియైన పోలేరి మహాదేవికి ఒక ఇస్తరియందున నీవు

చేసిన సకల పదార్థములను ముందు వడ్డించిపిదప మా కంద
రకు వడ్డన చేయుమని చెప్పగా నంత గోవిందమ్మగారు శ్రీ
స్వాములవారి యాజ్ఞానుసారముగా ముందు దేవికి వడ్డనచేసి
వెంటనే స్వాములవారికిని పిదప గోవిందయ్య, పోతులూ
రయ్య, ఓంకారయ్య, గిరిరాజయ్య, వీరనారాయణమ్మ,
సిద్ధయ్య, నవాబు వీరందరకును వరుసగా వడ్డించెను. అప్ప
టికి స్వాములవారి గృహంబుకడనున్న జనంబునకు మేరలే
కుండెను, అంత సందరుమ నిశ్శబ్దముగానుండుడని యుజ్ఞా
పించి మహాదేవియైన "పోలేరిదేవిని" మనంబున దలంచి నం
తనే యుక్తవయస్సు గలిగిన బాలికామణి రూపంబు ధరించి
వచ్చి స్వాములవారికడ నిలువంబడగా తల్లీ! మీయమ్మయైన
గోవింద యేమేమో చేసినదట భోంచేయుమని చెప్పగా
నంత పోలేరమ్మ నాయనా! అట్లే భోజనముచేసెదననినమ్మ
తించి వారందరు చూచుచుండగనేభోజనములు చేసిరి. అంత
నద్దేవి తండ్రీ! నేనిక నేగుడకు సెలవొసంగెదరా యనియడు
గగా స్వాములవారు తల్లీ! నేను కొలది దినములలో సమాధి
నిష్ఠాగరిష్ఠత్వంబున గూర్చుండిన కొన్ని దినములకు నా
రెండవకుమారుండయిన పోతులూరి యాచార్యులకు నీవొక
ఉపకారము చేయువలసి యున్నది కనుక మీ తల్లియైన
గోవింద నిన్నెప్పుడు దలంచునో అప్పుడువచ్చి ఆమె యేమి
చెప్పునో అట్లే జేయమని చెప్పగా నంత నద్దేవి స్వామీ!
మహాప్రసాదము. అట్లే వచ్చి నాయమ్మ ఎట్లు చెప్పునో
యట్లే యాకార్యమును నెరవేర్చి వెళ్ళెదను'నాకు సెలవిమ్మని

యడుగగా తల్లీ! నమస్కారంబు గైకొనుము. అగు ఏశ్లే
మని స్వాములవారు చెప్పగా నా దేవి దీవించి అందరిలో
నచ్చటనే అంతర్ధానం బయ్యెను. అంత నవాబు లేచిముకుళిత
కరకమలుండై నిలువంబడి స్వామీ! సచ్చిదానంద మూర్తి!
సద్గురుమూర్తీ! ఈ దినము నాకు సుదినము. అద్దేవి దర్శ
నంబుచే నా జన్మంబు తరించె. నాగ్రామంబయిన కర్నూలు
తమరు విచ్చేసి నాకు బోధించిన కాలజ్ఞానంబు నాపాతకంబు
లన్నియు భస్మంబయ్యెను. ఒక సారి నాకడ కరుదెంచిన
నింకను కొన్ని కాలజ్ఞానంబులోని విషయములను బోధించెద
నని సెలవిచ్చితిరిగదా నాపై కృపాకటాక్షముంచి ఈ దాసు
నకు తిరిగి ఇంకొకసారి కాలజ్ఞానంబును బోధింపుమనివేడగా
నంత స్వాములవారు అచ్చటి కరుదెంచిన మహాజనంబును
అట్లే కూర్చుండి నిశ్శబ్దంబుగా నుండుడని చెప్పి కాలజ్ఞాన
మును నా మహాసభ యందున నిట్లు బోధించిరి

కర్నూలు నవాబునకు స్వాములవారు కాలజ్ఞానంబును బోధించుట
(కాలజ్ఞానము ఎనిమిదవ యాశ్వాసము)

బిడ్డలారా! క్రోధినామ సంవత్సర మార్గశిర శుద్ధ
పంచమి సోమవారమున పునర్వసూనక్షత్ర కర్కాటకలగ్నం
బున శ్రీవీరభోగవసంతావతారుండనై నేను వచ్చు సమయం
బున దక్షిణంబున ఉత్పాతమైన ఒక గొప్ప నక్షత్రం ఉద
యించును. యాగంటికొండన వన్నెలక్షల గుర్రాలున్నవి.
కామధేనువులు నిండియున్నవి శ్రీవిరూపాక్షరాయలు గుత్తి

బళ్ళారి పోయేటందుకు గిద్దలూరు మేర చుట్టుకొని రంగాపుర మునకు పోవలెను. వేయిగుఱ్ఱంబులు, పదివేల ఏనుగులును అయిదువేల కాల్బలంబులతోను రంగాపురమునకుపోవలెను. ఆ రంగాపురమునుండి కడపకునుత్పాతాలుగలుగును.రంగా పురమునుండి పులివింద కొండకు వచ్చేను. పులివిందనుండి చనుకొండకు వచ్చి చనుకొండ నుంచి గుత్తివారితో గలిసి ముందు చెరువుదగ్గర వారిని ఘంచి పుణ్యస్త్రీలు గంధము, కస్తూరి పరిమళ ద్రవ్యాలు కావలెనని అయ్యగారు సెలవిచ్చి నారు గనుక వాటిసన్నితిని సిద్ధపరచెదరు. విద్యారణ్య స్వాములవారికి ప్రతిబింబముకయోగి పుట్టి, వీరేశ్వరస్వాముల వారు వీరభోజునకు జంబూద్వీపము స్వాధీనము జేయును. పది పరమూర్ధము సప్తవాయువులు గలసి సప్తరాత్రములు విసరేను. చుండి పర్వతము అలంపూరు మొదలయిన స్థల ములలో ఉత్పాతములు పుట్టేను. ఈ భూమియందు పాతె గాండ్లు రాయపట్నం గట్టుకొని తమలో తాము అన్యోన్యకల హములు బెట్టుకొని చెడి అడవులపాలై భ్రష్టులైపోదురు. నాలుగు దిక్కులును భూమిమీద అమృతతుల్యమై నక్షత్ర ములు కనుపించి రాలేను. జనులకు కనిపించేను! భృగుమహా ఋషికి అరికాలున నేత్రమిస్తిమి. శాపదగ్ధులైనవారికి శాపం బుదహరించి ఉన్నతునిజేసితిమి తక్కినవారు నిశ్వంశమై పోయేరు. నా భక్తులు మాత్రమే నిలచేరు. శ్రీమన్నారాయ ణుని మహిమ నా భక్తాదులకు నిస్తిమి. దేశముమీద దుష్ట జనంబు తెల్ల నెల్లికాయ పీచువలెను, అనావృష్టి దోషంబు

తగిలి ఆసనంబున గండమాల పుండ్లు, నెత్తిన పెదశిపుండ్లు పుట్టి వివిధ వ్యాధిరూపంబుల చేత వేదాంతశూన్యులై పెద్దా ముదపుగింజ చిట్టినట్లు చిట్లుదురు. అమావాస్యరోజున పౌర్ణమిజూచి నాశనము బొందెదరు. కార్తీకంనిజంబని నామహిమ దలంచుచుండేరు. శ్లో॥ మాస మాశ్వీజమేకంతు మాసాంతే కార్తీకం తథా! అమాయాం చంద్రోదయంచ వీరకాలమే మహత్తు॥ అను వేదాంత సూక్ష్మము నా ఉపదేశమూలమున గాని దెలియదు. కార్తీక శుద్ధ ద్వాదశిలు నాటికీ విష్ణుభక్తి యుద్భవమయ్యేముందు కార్యాలు సామవేద ఘోషనాదులకో కనబడుచుండేను. జ్ఞానశూన్యులైనవారు నన్నెరుంగ జాలరు. చందోబద్ధమనేచోట పెయ్యివీర్యానకు బుట్టినవారికి గాని దెలియదు. సూర్యనందియందు ఉద్భవంబయ్యేను. అపుడుపువ్వులవర్షము కురిసేను. తూర్పునశిరస్సు, పడమర తోకగా తోక వెడల్పుగా నిరువదిబారల పొడవున నల్లని ధూమకేతువనే నక్షత్రంబుబుట్టేను. పుట్టిన ముప్పది దినములకు నందరకునుగానంబడేను. ఆమీదటపుణ్యాత్ములందరక్కు సూర్యమండలమందు పురుషరూపముగా గానంబడేను. ఆకాశము ఎర్రనయి ఆవులు మిన్నుజూచియరచేను. ఆకాశమున ఛగుళ్ళు ఛగుళ్ళుమనే ధ్వనిబుట్టేను. సూర్యనందున నయిదు దినములనుండి భూమిమీద ప్రఖ్యాతమయ్యేను. అప్పటికీ వనరైనక్షైజనులంతా నిలచేను. దేశాలు పాలించి జగంబుతేలెదను. కలియుగస్ఫృష్టి 5000యేండ్లు గడిచినమీదట నారాకడకు మీకు దృష్టాంతంబులు కనబడేను. ఈ లోగా వ్రాసిన

ప్రకారము తొందరలో దృశ్యాలు జరుగును. అదే మీకు నిదానమని దెలిసేది. ఈశ్వరమ్మగారిని రంగరాజున కిచ్చి వివాహము జేసేవరకు కందిమల్లయపల్లెలో నవరత్న మంటపంబుతో నుండి పన్నెండామడ పట్నంబగును. నాభక్తులైన వారు యావన్మంది యిక్కడకు వచ్చి కళ్యాణం జూతురు. అదే మీకు నిదానము. ఆ మీదట నూటతొంభై అయిదు సంవత్సరములు ధర్మనందనుడు ధర్మంబు నే రీతి జరిపెనో నారీతినే ధర్మము నడిపిస్తున్నాము ఇది సత్యము. వీరగురు వాక్యము. అని యట్లు కాలజ్ఞానంబును బోధించి బిడ్డా! నేను కొలది దినములు మాత్రమే కలియుగంబుననుండి పిమ్మట సమాధి నిష్ఠాగరిష్టతత్వంబున నుండి కొన్నివందల వత్సరంబులు సమాధిన నుండి తపం బాచరించి పిదప ధర్మసంస్థాపనార్థమై వీరభోగవసంతావ తారుండనయి కలియుగంబునకు వచ్చెదనని చెప్పగా నంతనవాబునకుస్వామివారియందుండు సమయమున నాకు జాబున్రవ్రాసెదరాయెనివేడుకొనగానంత స్వాములవారు బిడ్డా! మీబోటిసుగుణవంతులకు దెలియకుండ గనే నేను సమాధి నిష్టయందుండు నాయని చెప్పగానంత నవాబు సంతోషస్వాంతుడై స్వామీ! తమరు తప్పక లేఖను మాత్రము వ్రాసిపంపుడని పునఃపునః ప్రణామంబులాచరించి స్వాములవారి యాజ్ఞానుసారముగా నారాత్రి యటనుండిఉదయంబుననే బయలుదేరి శ్రీస్వాములవారికి, సిద్దయ్యగారికిని నమస్కారంబులొనర్చి వారిచేదీవనలందియచటనుండిబయలుధేరి నంత నివాసస్థానంబైన కర్నూలుచేరి యచ్చట శ్రీ

స్వాములవారి మహిమల నందరికిని జెప్పి స్వాములవారియం దమిత భక్తిచే నుండి తరించెను.

శ్రీ స్వాములవారు తన జ్యేష్ఠ కుమారుండైనగోవిందయాచార్యులకు తనకు మారుగా పట్టాభిషేకంబుశేయుట' కాలజ్ఞాన సౌజన్య పత్రికయందు పట్టాభిషేక మహోత్సవ శుభలేఖలను భక్తాదులకు బంపుట (శాంతి—ఏడవ అశ్వాసము) శ్రీ సిద్దయ్యగారిని బనగానపల్లెకు పూలకై పంపుట

శ్రీ స్వాములవారు కొన్ని దినంబులు జరిగిన పిమ్మట తాను సమాధినిష్ఠయందుండ నిచ్ఛగలవాడై తనజ్యేష్ఠకుమారుండైన గోవిందయాచార్య స్వాములవారి పట్టాభిషేక మహోత్సవము చేయ నిశ్చయించుకొని తన భక్తాదులందరకు లేఖలు వ్రాయబూని యా వ్రాయు లేఖలయందే "కాలజ్ఞాన సౌజన్య పత్రికలు" గూడ నుంచి ప్రతి భక్తునకున్నూ దేశ దేశంబులకున్నూ బంపెను, ఆ శుభలేఖలయం దిట్లుండెను.... . శ్రీ మత్పరమశివ విశ్వకర్మపాంచాన నోద్భవ సాగన సనాతన అహభూన ప్రత్నస సుపర్ణ సగోత్రోద్భవ మను మయ త్వష్ట శిల్ప విశ్వజ్ఞ పరవంశీకులైన త్రిభువన నిర్మితోద్ధారక అనంతవేదశబ్దశాస్త్రపురాణాగామ పారావార గంభీర్యధీర ధీరోద్ధార షేషిణిహనుమంత బిరుదాంకితుల యిన పెందోట పుర పరాధీశ్వరులయిన శ్రీ మత్కాళికా దేవి మరేశ్వర శ్రీ పాదపద్మరాగాధిత శ్రీమద్వేదాగమ ప్రతిపాదిత శైవవైష్ణవాద్వైత సౌరుషకై యాదిషణ్మంత్ర స్థాపనాచార్య మహ మ్మెరు నిర్మాణకర్తలై విభూతి రుద్రాక్ష మాలికాధరులైన శేషశయన పన్నగాధీశ



శ్రీస్వాములవారి పట్టాభిషేకం

పంచవిధోపాయ యమనియమ ఆసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యానధారణ సమాధ్యష్టాంగ యోగాభ్యాసన ధీరులైన శ్రీ కడపజిల్లా బద్వేలు తాలూకా కందిమల్లయపల్లె మఠాధీశ్వరులైన సాలోక్య, సారూప్య, సామీప్య, సాయుజ్య, స్వాంత్యష్టి విదేహ కైవల్య నిరంతరులైన శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారు గురుపుత్రులైన లోకాచల నవఖండ అంగ వంగ కళింగ కాశ్మీర కాంభోజ సౌవీర సౌరాష్ట్ర విదర్భ విదేహ బర్బర కేకయ సాళ్వ చేది సంధు విత్యాది చప్పన్న దేశాల అయిదారు త్యామ శిలా స్వర్గకృత్యాది అయిదు దాయీల పాంచాననము వారికిన్ని శ్రీ గురుపాద సేవాధురంధరులైన వారందరికిని వ్రాయు శ్రీ ముఖం ఏమనగా ఈ వైశాఖ శుద్ధ సప్తమి గురువారము రోజున అస్మదీయ జ్యేష్ఠ కుమారుండైన గోవిందయాచార్య స్వామికి నామారుగా పట్టాభిషేకంబునుచేసి శ్రీ గురుకార్యంబులన్నియు ఆయనకే యొసంగి.. ఈ వైశాఖ శుద్ధ దశమి ఆదివారము పగలు రెండున్నర గంటలకు నే నీ లోకమును వీడి సమాధి నిష్ఠాగరిష్ఠత్వమున నుండ దలంచినాడను గాన సర్వదేశములవారరుదెండి శ్రీ గోవిందయాచార్య స్వాముల వారి పట్టాభిషేక మహోత్సవమును నేత్రానందముగా జూచి పిదప నా మూడు దినములు నా వద్దనే యుండి పిమ్మట నేను బోధించెడి కాలజ్ఞానాద్వైతాది రహస్యము లన్నియు వీను లార విని తరించెదరుగాక! యని శుభలేఖలయందు వ్రాసి కాలజ్ఞాన సౌజన్య పత్రికలుగూడా నా శుభలేఖల యందు

పొందుపరచి పంపించెను. ఎందుల కనిన శ్రీ స్వాములవారిని దర్శించుకొనుటకు వీలుండక రానివారలకు నీ కాలజ్ఞాన సౌజన్య శ్రీముఖ పత్రికను జూచినిత్యమును జదువుకొనుచు నా మారుగా నా సౌజన్య పత్రికను ధూపదీప నైవేద్యము లొసంగి పూజించుచు తరించెదరుగాక యని ప్రతి శుభలేక యందును కాలజ్ఞాన సౌజన్య పత్రికనుంచి సర్వదేశములకు బంపించెను..."ఆ కాలజ్ఞాన సౌజన్యపత్రిక"యందిట్లుండెను. భూత భవిష్యద్వర్తమానములు నానా దేశములకు వ్రాసినది యేమనగా పదునాలుగు వేల గ్రంథములు లోకములో నా భక్తులయినవారువ్రాసికొనజాలక పోయిన లఘు మార్గముగా వ్రాయించి పంపించినాను. అది యేమంటే ఓయి భక్తాదులారా ! నేను ఈబ్రహ్మేంద్రస్వామియను నామమునుధరించి యిప్పటికి 175 వత్సరము లుంటిని. ఇకనేనుసమాధి నిష్ఠను బొందుదును. తిరిగి నేను వచ్చునంత కీ పాపభూయిష్ఠంబైన కలియుగమున యర్రబోయలనేవారు శ్వేతదీపమునుండి దిగి వచ్చేరు. శాలివాహన శకములోనే ఆ యర్రబోయలు మహమ్మదీయులతో స్నేహించి సకల ధర్మముల చేతను హిందూదేశంలో రాజ్యములు పరిపాలనము జేయువారిలో నేనును నొక లీలావతారుండనయి అయ్యవార్లను మహనీ యుండనయి అనేక శాస్త్రములున్నూ, చాతుర్యమైన పను లున్నూ యుక్తులుగ జేసెదను. హరిహరాదుల గుళ్ళలో పూజలు మధ్యమయ్యేని! గుళ్ళలో శక్తులకు మూర్తివంతాలు గళలు అధికంబై గ్రామాదులలో శక్తులావ్రుటించేను. ధన

ఋదాంధతచేత సాధులను, జ్ఞానులనుదూషణచేయుచుండేరు. భూమి మీద పైరులు పండినట్లుగానే యుండి వర్షములు గురిసినట్లుగానే యుండి పంటలు పండక యుండును. ఒక్కొక్క స్థలంబున సృష్టిగలిగి పైరులు పండుచుండును. పాపాత్ముల గుడ్లల్లో పత్లేరులు పడి ఘోలము పగిలి చచ్చేరు. మేము నందిపర్వతమందు తపస్సు చాలించి ఉత్తరం వింధ్య గిరి పట్నంవచ్చి అక్కడ కొన్ని సంవత్సరములు నివసించే కాలమందు మీకు ఒక దాఖలా చెపుతాను వినండి.బహుధాన నామ సంవత్సరంలో కనకదుర్గ మొదలైన శక్తులు నీపృథ్వి పైకి రావడం యేలాగంటే కర్నాటు దేశమునకు కాళిపంపు, తురక దేశమునకు దుర్గిపంపు, మహానంది దేశంనకు భర తునిపంపు, కందనూరు రాజ్యానికి నాగేంద్రునిపంపు, మొరస రాజ్యానికి చక్రిపంపు, ఉత్తరదేశాలకు అర్కసోమునిపంపు, పశ్చిమ దేశాలకు కంచి కామాక్షమ్మపంపు, మాతంగి అనే శక్తినీలాగున నశింపజేయును. ప్రతివారును గమనింపుడు. నంద సంవత్సరమునకు అక్కడీనుండి శ్రీశైలాద్రికి వచ్చి మల్లిఖార్జుని దర్శనమై వారిచేత ననేకమైన వరములు దీసి కొని తిరిగి శ్రీశైలాద్రియందు తపస్సునకు గూర్చుండే వరకు-మీకు ఒక దాఖలా చెబుతా వినండి. నందన సంవత్స రములో పృథ్వియందు అనేక నక్షత్రాలు రాలేను. భూమి గడగడ వణకేను. అనేక ప్రజలు రాలేరు. శుభకృతునామ సంవత్సరములో కార్తిక మాసమందు దక్షిణ భాగమున అనేక ఉత్పాతాలతో ధూమకేతు వనే నక్షత్రం బుట్టును.

అందువలన ననేకమంది ప్రజలు నశించేరు. సరాభవనామ సంవత్సరములో మల్లిఖార్జున స్వామివద్ద వరములు గైకొని వింధ్యపర్వతాలకుపోయి అక్కడ ఋషుల దర్శనము జేసుకొని నేను సమాధినుంచి విడచి అయోని సంభవముగా విష్ణువంశచేత కలికావతారంబెత్తి ప్రమాదీచ నామ సంవత్సరమునకు ఎనిమిదేండ్ల వాడనై యఱ్ఱబోయిలతో కలిసి వారికి అంతర్యుద్ధులు వేరుగా కల్పించి అక్కడనుంచి 5047వ సంవత్సరమునకు సరియైన పింగళినామ సంవత్సరములో ఘోరమైన పోట్లాటలుఆరంభమై, కాళయుక్తినామ సంవత్సరము వరకు ఉత్తర దేశమందు పోట్లాటలు విపరీతముగా జరిగేను. ఆనందనామ సంవత్సర మార్గశిర బహుళ అష్టమి గురువారం మల్లిఖార్జునుడు భ్రమరాంబతోగూడావింధ్యపర్వతంబునకు చేరెను. మల్లికార్జున వీరభోజయాచార్యులు వీరభోజ వసంతరాయలనే పేర్లతో దుర్మతినామ సంవత్సర కార్తీక శుద్ధ పౌర్ణమీల వరకు పదహారు సంవత్సరంబుల యీడు గలవాడనై దుష్టనిగ్రహమున్ను శ్రేష్ఠులైన భక్తులకు పాలనజేయగలందులకు వచ్చేను. రక్తాక్షినాము సంవత్సరమే బెజవాడకువచ్చి అక్కడ మాతృవంశజులైన పోతులూరివారి కన్యను పెండ్లి చేసికొని పట్టాభిషిక్తుండనయ్యేదను. దుర్మతి నామ సంవత్సర కార్తీక శుద్ధ చతుర్దశీలు మొదలుకొని దుష్టనిగ్రహం ఆరంభమై మహాప్రళయములచేత నుండును. ఆ ప్రళయాలకు రౌద్రినామ సంవత్సర కార్తీక మాసమున పోట్లాటలు ఆరంభమైవుండును. నేను వచ్చుసరికి కలియుగ

ప్రమాణము 4094 అయినది. ఇక్కడినుండిపదహారు ఆనం రలకు మీకు జెప్పిన భవిష్యత్తులు జరుగబోతూ వున్నవి. కాన భక్తులైన వారలు నన్ను సదానమ్మి ఓం హ్రీం, క్లీం, శ్రీం, శివాయ శ్రీవీరబ్రహ్మణేనమః అను బీజ సంపుటియైన యీ మహామంత్రంబును అచండాలాంత మెవరైనను మడి మైల యని మనంబున దలంచకసదా జపించుచుతరించెదరు గాక. ఈ పత్రికను ప్రతివారు వ్రాసుకొని ధూపదీప నైవే ద్యంబు లొసంగి పూజించుచు దానధర్మంబులను జేయుచుం డవలెను. సర్వజనులకు దెలియ గలందులకై వ్రాసి పంపిం చిన కాలజ్ఞాన సౌజన్య పత్రికయని శ్రీముఖంబులు వ్రాసి పంపగా నంత దేశదేశంబుల నుండియు వేలవేలు ప్రజలును కొందరు మహన్మదీయ చక్రవర్తులను వైశాఖ శుద్ధ పంచ మీలకే చేరిరి. కందిమల్లయ పల్లెయంతయు పచ్చని తోరణం బులతోడను వివిధ మంగళ వాద్యంబుల తోడను రెండవ కైలాసమో యనునట్లుండెను. అంత శ్రీ స్వాములవారు వైశాఖ శుద్ధ సప్తమి గురువారం రోజుననే చతుర్వేద పారం గతులైన పండితులచేతను అష్టయోగాభ్యాసులైనఋషిపుంగ వుల చేతను శ్రీ గోవిందయాచార్య స్వాముల వారికి వాస్త్ర యుక్తంబుగా పట్టాభిషేకంబును జేయించి యా రాత్రికి నొక పెద్ద యేనుంగుపైని అంబారీ కట్టించి వివిధ మంగళ వాయి ద్యంబులతోడను తనకుండు ముప్పదిరెండు బిరుదంబుల తోను అంబారిని నమర్చిన యేనుంగుపైని శ్రీ గోవిందయా చార్య స్వాములవారిని గూర్చుండబెట్టి యుత్సవంబుచేసి శ్రీ

స్వాములవారు మఠంబునకు నధ్యక్షునిగా చేసెను....మరు సటి దినంబున గోవిందమాంబను బిలిచి నేనునిష్ఠయందుండు దినంబులు సమీపించెను గాన నీవు నవమిరాత్రికిసిద్ధనుబిలిచి స్వాములవారు రేపు మధ్యాహ్నం రెండున్నర గంటలకు సమాధి నిష్ఠాగరిష్ఠత్వంబున నుండదలచి నిన్ను బనగాన పల్లెకు బంపి సమాధి పూజకై పుష్పంబులను గొని తెమ్మని యానతిచ్చినారు. కాన నీవు ఈరాత్రికే బయలుదేరి బనగాన పల్లెకుపోయి పుష్పంబులను దీసికొని రేపు మధ్యాహ్నము నకు తప్పక రమ్మని చెప్పగా అంత సిద్దయ్యగారు మహా ప్రసాదంబని అమ్మవారివద్ద సెలవు దీసికొని బనగానపల్లెకి పోవ ప్రయాణుండై స్వాములవారి యాజ్ఞను గైకొని యేగ వలెనని తలంచిరాగా స్వాములవారునిద్రించుచుండురని దెలిసి నిద్రాభంగం బొనరించిన మహాపాతకంబని మదినెంచి నిదు రించుచున్న స్వాములవారి పాదంబులను కన్నులకద్దుకొని నమస్కారంబుచేసి నవమి యర్ధరాత్రంబుననే ప్రయాణుండై శ్రీ గురునామోచ్చారణంబు చేయుచు బయలుదేరెను... సిద్దయ్యగారి భావంబెరింగియు తాను సమాధినిష్ఠయందుండు సమయంబున లేకుండునటులజేసినా డెందులకోయని గోవిం దమ్మగారి మనంబున నాలోచించుకొనసాగెను. తుదకిట్లామె తలంచెను. ఎట్లనిన సిద్దని ధృఢభక్తిని జగద్విదతము జేసి యతనిని నిరుపమాన యశం బొనగూర్చుటయేస్వాములవారి ముఖ్యోద్దేశ్యమని. అర్ధరాత్రియే సిద్ధయ్యగారు బనగానపల్లె ప్రయాణుండై బయలుదేరెను.

శ్రీ స్వాములవారు సమాధినిష్ఠాగరిష్ఠత్వంబునుండుట, గోవిందయాచార్య స్వాములవారికి శ్రీ ఈశ్వరమ్మగారి మహిమంబులు చెప్పుట.

స్వాములవారు తానదివరకే నిష్ఠయందుండుటకుగాను లోసమాధిని తయారు జేయించుకొని యందే నిత్యంబును యోగనిద్రను జెందుచుండిరి. శ్రీగోవిందయాచార్యస్వాములవారికి పట్టాభిషేకము చేసినది మొదలా నాల్గు దినంబులును స్వాములవారు తన్మయులయి ఈ లోకంబునువీడి ఎప్పుడు నిష్ఠయం దుండెదనాయని నదే లోకంబు నుండెను. అంత తన భార్యాబిడ్డలను యావన్మంది బంధుమిత్రాదులను దేశదేశంబులనుండి వచ్చిన నవాబులను, భక్తులను, దగ్గరకు బిలుచుకొని కుమారునిజూచి, నాయనా! గోవిందయాచార్య ! నేసి కందిమల్లయ్యపల్లెజేరి వీరబ్రహ్మనామంబును ధరించి యిప్పటికి నూటడెబ్బదియైదు (175) వత్సరంబులయినది. ఇప్పటి వరకు నీ కలికాల మానవుల మనంబులను మార్చి కేవలం పరబ్రహ్మోపాసకులుగా నుండునట్లు చేసితిని. ఇక నీ వెట్లు నీపామరాళి మనంబులను మార్చి మహనీయులగునట్లుగా చేసెదవో ఇక నీ ఇష్టము. నే నీ మధ్యాహ్నము రెండున్నర గంటలకు సమాధినిష్ఠన యుండకతప్పదు. నీ సోదర సోదరీ మణులందర నెట్లు గాపాడుకుందువో యని యనేక నీతులు చెప్పగా నంత గోవింద యాచార్యులుగారు తండ్రీ ! ఏమియు నెరుంగని నాకు నీ కుమారుగా పట్టాభిషేకంబును జేసితిరి సిద్ధనియందు గల ప్రేమ మా యందరి

యందు లేదాయె. తమరు మహామేరువుంబోలు నీ పీఠాధిపత్యంబు నా శిరంబుపై నిడి తమరు సమాధిని ప్రవేశించిన నిక మాకు గతి మేమని దీననానుడై నేడగాసంత స్వాములవారు బిడ్డా! నీకొక పరమార్థంబును నే నిందరిలో నీకు జెప్పెద. అది యెద్దియన నీ గర్భవాసంబున పరమేశ్వరియే జన్మించును. ఆమె వీరమాత కాగలదు. అద్దేవియు భూత భవిష్యద్వర్తమానంబు రుఁగిన పుట్టు బ్రహ్మజ్ఞాని. ఇక్కాలి కాలమూఢుల ననేకములయిన మహిమంబులు నే నెట్లు చూపితినో అట్లే నామెయు నద్భుతంబులయిన మహత్తులు జూపును. ఆమె నోటినుండి వెలువడెడు వాక్కులన్నియు నప్పటికప్పుడే తప్పక జరుగును. తుద కామెయు నేనెట్లు సమాధి నిష్ఠాగరిష్ఠత్వంబుననుంటినో అట్లే ఆమెయుసమాధి యందు ప్రవేశించును. నాకెట్లు మఠంబుండునోఅట్లేనామెకు మఠంబుండును. నా కెట్లు పూజలు జరుగుచుండునో అట్లే నామెకు పూజలు జరుగుచుండును. నీ పూర్వపుణ్య ఫల విశేషంబుగా నా భగవతియే నీకు బుత్రికగా బుట్టుచుండ నీకు నే కొరతలుండవు. నీ కొరతలున్న సర్వజనుల సంశయంబులున్న నా పరమేశ్వరియే దీర్చును. అమ్మహాదేవి ఈశ్వరమ్మయని బిలిపించుకొనును నీ సంశయంబులన్నియు నా తల్లియే దీర్చును గాన నీ మనంబునం గల సందియమ్ములన్నియు వీడుము. ఇక సిద్ధని విషయమంటివా? అతండు కేవల ఈశ్వరాంశ సంభూతుండు! ఈతండు నొక క్షత్రియు నింట బుట్టి గో హత్య జేయుటచే నిటు మహమ్మదీయ వంశ

మున జన్మించ గలిగెను. ఆగోహత్యా పాప పరిహారంబు త్తై ఇట్లు అస్మదీయ పాదసేవకుండై కడతేరెను. ఇదియునుం గాక సిద్ధుడనిన నేమని దలంచుచుంటిరో శ్రీ గురుదీక్ష ప్రసిద్ధుడు. అతని భక్తి అపారము. అతడు లోక వాసన వదలి పరలోకవాసన యెరింగినమేటి! అతనుపూర్వజ్ఞానంబు గల పుణ్యమూర్తి. అతనికి నద్వైత విషయంబుల యందు ఆసక్తిగలదు. గాన ఆకార్యంబు సిద్ధించి సిద్ధుండయ్యెను. కుమారా! భూతప్రేమ గల్గిన వాడవై, నా మారుగా మీ తల్లిని పూజించుచు కడతేరుమని చెప్పి తిరిగి భక్తాదులజూచి భక్తబృందంబులారా! నే నీ మధ్యాహ్నము రెండున్నర గంటలకు సమాధి యందుండబోవు చున్నాను. కాన మీకు నెవ్వియైన సందియంబులున్న నడుగుడని స్వాములవారు దెల్పగా అంత భక్తాదులందరొక్కసారిగా శ్రీవీరబ్రహ్మేం ద్రావతారా! శ్రీ వీరభోగవసంతావతారా! అనంతావతారా! శ్రీ మదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకా! యని ననేక విధంబులుగా స్తోత్రంబులు చేసి, యందరును నిశ్శబ్దంబుగా నిలువంబడి, స్వామీ! తమరు సమాధియందున ప్రవేశింప బోవుచున్నారట. ఇక తమ దర్శనంబును చూడ జాలము గదా! మీ బిడ్డలమైన మా అందరిపైన కరుణించి కష్టమని తలంచక ఒకసారి కాలజ్ఞానంబును బోధించి మమ్మీభవవారధి నుండి విడిపింపుడని వేడగా శాంత స్వరూపుండగు శ్రీ స్వాములవారును చిరునగవుతో, బిడ్డలారా! అట్లేవినిపించెద శాంతస్వభావులయి వినుడు.

శ్రీ స్వాములవారు సమాధియందు ప్రవేశించబోవుచు భక్తాదులకు కాలజ్ఞానము వినిపించుట.

ఓయి బిడ్డలారా! కలియుగమున నిప్పటికి 4694 సంవత్సరంబులాయెను ఇది మొదలు పదహారు ఆనందలకు కలియుగము 5000 ఏండ్లపైన తిరిగి మేమున్ను వీరభోజయాచార్యులున్ను బెజవాడ సమీపమునకు వస్తూ యున్నాము. ఒక ప్రమాణము తెలియజేసెదను. నందికొండ యందు తపస్సు చేయుచున్న యనమదల వీరభోజయాచార్యులుగారు పదమూడు ఆనందల కార్తీక శుద్ధపౌర్ణమిరోజున సమాధిని వదలిబెట్టి వింద్యపర్వతమందు దివ్యమంగళ విగ్రహముగా ప్రకాశించి అక్కడనుండే మహాపురుషులను వెంటదీసుకొని తిరిగి నందికొండకు ప్రవేశించును. ఆ కాలమందు ఒక దాఖలా చెబుతానువినండి. అనేక నక్షత్రాలు రాలును. అనేక ప్రజలు రాలుదురు. యేడు గ్రామంబులకు నొక గ్రామం బగును. అనేక పశువులు రాలును. ధూమకేతువనే నక్షత్రం బుట్టును. సన్న సన్న పాలెగాండ్లు నశించిపోదురు. యత్ర బోయలవల్ల వారికున్న జీవనంబులకు కట్టుబడుదురు. బదరికాశ్రమమందుండే పరమపురుషుల వెంటదీసికొని వారి వారి మంత్రార్థములు కృపచేసి నిజస్వరూపుండయి నందికొండ యందు వీరప్రతాపము చేయింతును. విరోధినామ సంవత్సరములో లింగాలపాటిలో నొక శక్తినిబుట్టించేను. నా శక్తి అంకమ్మ అనే నామముతో లోకమంతా ప్రకాశించి చీకాకు పరచి దక్షిణ భూమి అంతయు దగ్ధంబుచేసి తిరిగి నంది

కొండకు వచ్చేను. ప్రమాదీచనామ సంవత్సరము వరకు ఎనిమిది సంవత్సరంబులు యీడు గలవాడనై వీరభోజయాచార్యుండనై ప్రకాశించేను. పింగళనామ సంవత్సరములో ఉత్తరదేశమందు పోట్లాటలు ఆరంభింతురు. కాలయుక్తినామ సంవత్సరంలో ధూమకేతువనే నక్షత్రము బుట్టి నందికొండ మూలకు వచ్చి అదృశ్యంబై పోవును. అక్కడినుండి అనేక శక్తులార్భటించి ఊరూరా అనేక జనులను నశింపజేయును. ఇక్కడనుండి ఉత్తరదేశమందు వారిలో వారికి అన్యోన్యమైన కలహములుగలిగి నశించిపోదురు. గొప్ప గొప్ప దేవళంబులు పాడయ్యేను. పాంచాననమువారికివారివారివృత్తులు నశించేను. సిద్ధార్ధినామసంవత్సరములో అర్ధంకిసీమయందు భూమి గడగడ వణుకును. పర్వతాలు కూలును. రౌద్రినామ సంవత్సర ఆషాఢ మాసములో మహాధ్వనిచేత నక్షత్రాలు రాలేను. అప్పుడు పర్వత గుహలయందు వుదక పానీయము చేసేము. బంగాళాదేశమందు కాళీ ప్రసన్నమై శక్తిరూపము ధరించి అనేక ప్రజల రక్తమును గుట గుట త్రాగేను. పశ్చిమానకు మాతంగి అనే శక్తి ప్రజల మెడలను విరచి రణోత్సాహంబునకు కేకలు వేసెను. బెజవాడ గోలకొండంత పట్నంబగును. కనకదుర్గ ముఖద్వారమందు తూర్పుదిశన ఏడుపుట్లు నల్లులు రాలేను. ఆ కాలమందునక్షత్రాలురాలేను. సూర్యుడు గడగడ వణకేను. అనేక యుత్పాతాలు బుట్టేను. మేఘమందు బడబానలము సర్పాకారముగా వచ్చి అనేక ధ్వనులచేత నక్షత్రాలు నందికొండయందుండే తటాకములో

నుదక పానము చేసేను. కొండవీటి సీమయందు దుర్గములో మంటలు పుట్టును. మూలరంగమ్మ అనేక శక్తి  వేకలువేసేను.

శ్రీ శైలమందు నందిచెరువులో ఆరెదొండ చెట్టు బుట్టేను. భ్రమరాంబ గుళ్ళో మొసళ్ళు జొరబడి పాడయి పోవును. ఈశాన్యభాగమందు పాతాళగంగకృంగి మల్లికార్జునుడు అదృశ్యమైపోవును. పాతాళగంగలో శాపము చేత పచ్చబండమై పడియున్న చంద్రగుప్త మహారాజునకు కలికావతారపురుషుని పాదమునోకి శాపవిముక్తుడగును. ఆకాశమందు విషపుగాలి పుట్టి ఆ గాలివలన రోగాలు గలిగి నశించేరు. తిరుపతి వేంకటేశ్వరుని గుళ్ళో మొసళ్ళు జొరబడి మూడుదినములుపూజలులేక తలుపులు వేసియుంచేరు. గరుడధ్వజములో ఓంకార నాదములు బుట్టును. తిరువళ్ళూరి వీరరాఘవస్వామికి చెమటలు బుట్టును. మేము వచ్చుకాలమునకు భూమియందు అద్భుతముగా జలము బుట్టును. లోకమంతా తల్లడించేను. అనేకమైన ధూమకేతువులు బుట్టును. మనువు అవతరించేవరకు ధూమకేతువులు ప్రకాశమైయుండి తరువాత అదృశ్యమైపోవును. పాంచాననము వారి సంశమందు నేను జననంబై మల్లికార్జునవీరభోజయాచార్యుండనై మహాలక్ష్మితో రాజ్యము పరిపాలన జేసేను. ప్రమాదినామ సంవత్సరము మొదలు అన్ని దేశములలో క్షామబండారముల అనావృష్టియై సస్యభిన్నములయి ప్రజలు రోగపీడితులయి అనేక దుఃఖముల బొందెదరు. ఆకాశమందు మూడు చుక్కలు బుట్టి మానవులకు కనిపించకుండా అదృశ్యమై


పోవును. పాగచానసమువారు తిరిగి పంచాంగ పౌరోహిత్యా దులు జరిపేరు. ఆనందనామ సంవత్సరములో శ్రీశైలమల్లి ఖార్జునుడు ఉత్తరదిశకు వింధ్యగిరి పర్వతాలకు పోయి నిజ రూపులు జూపినందున [ఆ] రాజ్యమంతా తల్లడించి కాకిశోక మయ్యేను. కాన మద్భక్తులయిన వారలెల్లరకు మూల మంత్రం బొకటి జెప్పెదవినుండు. (మహామంత్రం) అస్య శ్రీస్తోత్రమహామంత్రస్య సిద్ధయోగీశ్వ ఋషిఃపంక్తిచ్ఛందః పరంజ్యోతి స్వరూపిణి ఓంబీజం హ్రీం శక్తి, హ్రూం కీల కం మమధర్మార్థయిశ్వర్యకామ మోక్ష పంచవిధ ఫలపురు షార్థం ప్రసాదసిద్ధ్యర్థే జపే వినియోగః అంగన్యాసమ్॥ ఓం అంగుష్ఠాభ్యాన్నమః హ్రీంతర్జనీ భ్యాన్నమః॥ క్లీం మధ్య మాభ్యాన్నమః।, శివాయ అనామి కాభ్యాన్నమః।। నమః కరతల [క]ల పృష్ఠాభ్యాన్నమః।। హృదయాదిన్యాసమ్ ఓం హృదయాయనమః హ్రీంశిరస్సేస్వాహక్లీం శిఖాయైవౌషట్ శివాయకవచాయహుం, వీరబ్రహ్మణే నేత్రత్రయాయవౌషట్ నమః అస్త్రాయ షట్ భూర్భువ స్సువరోమతి దిగ్బంధః।। ధ్యానమ్।। వీరబ్రహ్మలలితం వీరప్రభావం సురముని సహిత సూర్యఖండాశుధారిం రిపుభయహరం సద్భక్తరక్షాంత్రినేత్రం పరశివ గురురూపం [భద్రకాళి] సమేతం [భస్మం] జ్యోతిస్వరూ పేణ వీరబ్రహ్మ స్వరూపకం షడ్వింశతి తత్వరూపాయ తస్మైశ్రీ గురువేనమః।। లమిత పంచ పూజాంకుర్యాత్ లంపృథ్వితత్వాత్మనే వీరబ్రహ్మసద్గురు పరబ్రహ్మణేనమః గంధం పరికల్పయామిహం ఆకాశతత్వాత్మనే వీరబ్రహ్మ

సద్గురుపరబ్రహ్మణేనమః పుష్పంపరికల్పయామయం వాయు తత్వాత్మనే వీరబ్రహ్మ సద్గురు పరబ్రహ్మణేనమః ధూప మాఘ్రపయామి। రం తేజోతత్వాత్మనే వీరబ్రహ్మ సద్గురు పరబ్రహ్మణేనమః అమృతనైవేద్యం సమర్పయామి సంసర్వతత్వాత్మనే వీరబ్రహ్మ సద్గురు పరబ్రహ్మణేనమః తాంబూలాది సర్వోపచార పూజాం సమర్పయామి।। మనుః।। ఓం, హ్రీం, క్లీం, శ్రీం, శివాయ వీరబ్రహ్మణేనమః।। బిడ్డలారా! ఈ మూలమంత్రము 'ద్వాదశ సహస్రసిద్ధిర్భవతి' అనునట్లుఈచెప్పబడిన మహామంత్రముల యందును మంత్ర పఠిమాణములందును మీరు భక్తి క్రియాజ్ఞానము గలిగి లోకమందును స్త్రీ పురుషాదులెవరు స్మరించెదరో అట్టి సుజ్ఞానులకు దర్శనము ఇస్తూ వున్నాము. ఇదిన్ని గాక ఇంకొక్క ప్రమాణమును దెలియజేసెదను వినండి. అన్ని వర్ణముల భక్తాదులకు దెలిసేటట్లుగా తెలియజేస్తాను. సావధానముగా వినండి. మడిమైలనే భేదము లేకుండా రాత్రింబవళ్ళు మా యొక్క ద్వాదశాక్షరీ మహామంత్రమును పన్నెండు వేలు జపము జేసినట్లాయెనా నేను తప్పక దర్శన మిచ్చెదను. సత్యము. యోగినిశక్తుల వలన వచ్చే ప్రళయము లోకటిన్ని అంటనేరవు మీరుభక్తి క్రియాజ్ఞానం గల్గి సద్భక్తిగానన్ను స్మరిస్తూయున్న వారికి సకలమైనటువంటి ఆపదలు దొలంగిపోవును. అఖండైశ్వర్యవంతులై యుందురు. ఇంకను నీ యుర్వియందకనే యుత్పాతంబులు బుట్టనున్నవి. ఇంకనాకు సమయము మించిపోవుచున్నదని స్వాములవారు జెప్పగా

నంత భక్తాదులందఱు భార్యాబిడ్డలను చేతులుజోడించుకొని స్వామీ! తమరు బోధించిన కాలజ్ఞానమును వినినకొలది మా మనంబు లువ్విళ్ళూరుచున్నవి. ఇంకను నెవ్వియైన రహస్యంబులున్న బోధించుడని వేడగా అంత స్వాములవారు ఓ నా ప్రియమైన భక్తులారా ! నేను చెప్పబోవు రహస్యంబులను చక్కగా వినుండు. భార్యను బిలిచికాంతా! యన జేరందీసి (సీసపద్యం) శ్రీ యనమలకొండ శివరామమూర్తినై జననమందెద భక్తజనము మెచ్చ! ముప్పది వరంబున మోదంబుతో నేను స్వర్ణ యమ్లింగస్వామినగుదు! నవతారమున పరహంస స్వరూపమైన నందికొండను దాగి పొందుగాను, వీరభోజుండనయి వేగప్రకాశించు భక్తుల లేపి నాసక్తితోడ ప్రభువునయి జగములకు నెల్లవిభవమొసంగి కృతయుగము రీతి సర్వపద్ధతులు గరపి రాజ్యమేలుదును. నీవు నిరంతరంబు. మంగళ ప్రదంబుగానే వెలంగు మబల, వీ, హ, కాంతా! నేను సమాధియందు ప్రవేశించుటకు సమయ మగుచున్నది. నీవు సమాధియందు ప్రవేశించువరకును పసుపును కుంకుమ మెట్టియుఖుం గాజులు దీయకుము. నీ విట్లుంటివని దూషించిన దుర్మార్గులు నాశన మొందెదరు. నీవు నేనుండు నప్పుడెట్లు పూజనీయురాలవై యుంటివో పిమ్మటనట్లే పూజనీయురాలవయి యుందువుగాక యని జెప్పి కొమారులను బిలిచి కుమారులారా! నేను సమాధియందు ప్రవేశించుటకు కాలమతిక్రమించుచున్నది. ఇక నే నేమియు జెప్పుటకును సమయంబు జాలదు. కాన మీరందరు శాంతస్వభావులయి పరతత్వోపాసకులయి సర్వదా నన్ను నేమరక ధ్యానింపుగా.

(ఆలోచించి) ఓ కాంతా! ఓ నా బిడ్డలారా! ఇంకొక విష యంబు చెప్పెద వినుండు. అది యెద్దియనిన, నా మఠంబున సూర్యచంద్రులుండు వరకు పూజలు జరుగుచుండును. మన వంశంబునశించును. మన వీరనారాయణమ్మగర్భంబున నుద యించు వారలు నా మఠమునకు ధర్మకర్తలయ్యెదరు. వార యినను వంశంబునకు నొకరుమాత్రమే నిల్చెదరు. ఆ నిల్చి నవా రొక్కరైనను నా యంశయందే జన్మించెదరు. వారు కేవల పరబ్రహ్మాంశ సంభూతులై, కేవల పూజనీయులయి యుందురని స్వాములవారు జెప్పగా నంత కుమారులుతండ్రీ! యింకను నేమయిన రహస్యంబులున్న బోధింపుడని వేడగా స్వాములవారు చిరునగవుతో బిడ్డలారా! నిక నే నేమియు జెప్పునది లేదు. మీ కందరకును పరతత్వంబును బోధించి మిమ్ములను ప్రపంచమును పవిత్రత చేయుటకై గోవిందయా చార్యుల గర్భంబున పంచమహావీరమాత లుద్భవించెదరు. అందులో ముందుగా ఈశ్వరమ్మ యను మహాతల్లి జన్మిం చును. ఇట్లేపార్వతమ్మ,శంకరమ్మ,గోవిందమ్మ, గిరిరాజమ్మ యనెడి వీరమాతలు నైదుగు రుద్భవింతురు. వారిలో పర మేశ్వరావతారియైన ఈశ్వరమ్మ యను మహాతల్లియే మీ కొరత లన్నియు దీర్చును. అద్దేవి విషయంబులు దెల్పవలె నన్న ఇంత సమయంబు లేకున్నది. నేను సమాధియందు ప్రవేశించిన కొంతసేపటికి సిద్దని మూలంబున మీ కొక మహత్తు తెలియనున్నది నా విషయంబు మీ కందరకును

దెలియును. (సిద్ధయ్యగారి నుద్దేశించి) పాప మా సిద్ధని నేనుసమాధిని ప్రవేశించు కాలంబున లేకుండాజేసితినిగదా! అయినను నిట్లగునుగాక! గురుసేవదీక్షా ప్రసిద్ధుడైన సిద్ధని కీర్తి ఆచంద్రతారార్కస్థాయిగా నిలుచుగాక! సిద్ధనివంటి భక్తి ప్రపత్తులు గలిగి సర్వజనులు సిద్ధనివలె భక్తియుతులై తరింతురుగాక! యని దీవింపగా నంత కుమారులు ముకుళిత కరకమలులై సమ్మహాజనంబులు నిలువంబడి తండ్రీ! మీ చేతిబెత్తంబును శిఖాముద్రియుక సింహపాదుకలును యోగ దండంబును నొసంగుడని వేడినంత స్వాములవారుబిడ్డలారా! అవి మీవికావు. పదిరెండు సంవత్సరములనుండి మన పంచ గాచుకొనియున్న "జగత్ప్రసిద్ధుడైన సిద్ధనివిగాని" మీవిగా వని బిడ్డలకుజెప్పి భక్తాదులనుజూచి ఓ నా ప్రియమైన భక్త బృందంబులారా! నేను సమాధి యందున ప్రవేశించుటకు లగ్నంబు మించిపోవుచున్నది. నే నిదే సమాధియందున ప్రవేశించుచున్నాడ నని లోసమాధియందున నొక గొప్ప యఖండము నిండా నూనెను బోసి నొక వత్తివేసి వెలిగించు కొని తనప్రక్కన బెట్టుకొనికలియుగము 4694కు సరియైన క్రీస్తుశకము 1594 సంవత్సరమున సమాధియందున విష్టా గరిష్ఠత్వంబున కూర్చుండెను. ఆ సమయంబున భేరీ మృదం గాది వాద్యంబులతోను, జై! జై! శబ్దంబులతోను సమాధికి తలుపును బిగించిరి. పిమ్మట నా మహాజనులందరును ననేక విధంబులుగా స్వాములవారినివారి మహిమలను గొనియా డుచు వారి వారి నామంబును స్మరించుచు తరించుచుండిరి.



బ్రహ్మవిష్ణు మహేశ్వర స్వరూపుండైన
శ్రీవీరబ్రహ్మేంద్ర స్వాముల వారి
యోగ నిష్ఠ

శ్రీసిద్ధయ్యగారు బనగానపల్లె కేగుచుండగా స్వాములవారు మౌనిరూపంబునను, వృద్ధబ్రాహ్మణ రూపంబునను నరణ్యంబున గానంబడుట.
సిద్ధయ్యగారు అరణ్యంబున ఘోరంబుగా దుఃఖించుట.

శ్రీ సిద్ధయ్యగారు శ్రీగోవిందమాంబ యాజ్ఞనుగైకొని నిదురించుచున్న స్వాములవారి పాదములనుకన్నులకద్దుకొని నమస్కారంబుజేసి, నవమి యర్ధ రాత్రంబుననే బయలుదేరి చందనమందార, చంపకాశోక, వకుళ. కరవీర, పున్నాగ, చూతకదళీ, పనస, ఖర్జూర, ద్రాక్షాదివృక్షలతావితతిచేతను పరిమళించుచున్న పారిజాత,జాజి, సంపెంగ, మల్లె, మొల్ల, తులసి, పుష్పవనంబు లనేకంబుల చేతను శుక సిక నీలకంఠ మరాళాది విహంగ ప్రముఖ శృంగార రవంబులచేతను, గజ గండభేరుండ శార్దూల వరాహాది మృగధ్వనులచేతను నొప్పు చుండిన నమ్మహారణ్యంబునంబడి నడుచుచున్నాడో? లేదో? యని తనకు తా తెలియకనే మనంబంతయు శ్రీస్వాములవారి యందే లీనముచేసి తెరపై నాడుచుండెడి బొమ్మరీతిగా దేహము మరచి నడచుచుండెను. తా నర్ధ రాత్రమున నిరు ప్రక్కల క్రిక్కిరిసియుండిన వృక్షలతాదులచేనిండినసమ్మహా రణ్యంబున భయంబించుకైనను లేక వాయువేగముననాకస మున చేరుచుండెడి పక్షి చందమున పరుగిడుచు బోవు చుం డెను. పాదములనిండ ముండ్లువిరిగినను,పలుగురాళ్ళచేపాద ములకు దెబ్బలుతగిలి రక్తముగారుచున్నను, కంటకావృతం బైన తీగెలు తన శరీరం బంతయు గీచుకొని రక్తము గారు చున్ననుతన కేమియుదెలియక తన్మయమునపరుగిడుచుగురు



సిద్దయ్య గారు ...

ధ్యానపరవశుండై పోవుచుండు సమయంబున అజ్ఞానాంధకార రూపమున మునుంగు మూఢులకు సుజ్ఞానం బను వెలుంగు చూపినవారికి నెంత సంతసముండునో అట్లే గాఢాంధకార బంధురంబై యా యర్ధరాత్రంబున బయలు దేరిన సిద్దయ్య గారికి వెలుంగు నొసంగుటకై నరుదెంచెనో యనునట్లుగా సూర్యోదయం బయ్యెను. అట్టి యరుణోదయంబయిన దని యైనను దెలియక ఎంత నడచినను త్రోవ జరుగకుండెను. ఇట్లనేక కష్టంబులకులోనై కడువేగంబున నడచుచున్నను ఉదయం ఎనిమిది గంటల ప్రొద్దెక్కువరకు కందిమల్లయపల్లె నుండి నచ్చటికి ఎనిమిదిమైళ్ళు మాత్రమే నడచెను. అంత తానేగుచున్న దారిలో జడావల్కధారియై కాషాయాంబరం బులు గట్టుకొని విభూతి మేనినిండా బూసికొని రుద్రాక్ష మాలలు ధరించి యొక తాటియాకుల గ్రంథమును చేబూని మౌనిరూపమున సిద్దయ్యగారి కెదురాయెను. కాని యామౌని పుంగవునితో మాట్లడకనే తానేగుచున్న పనికై యేగుచుం డెను. అంత నాఋషిపుంగవుండు సిద్దయ్యగారిని నీవెవ్వడవని యును ఎచ్చటికి నేకార్యంబునకై యేగుచుంటివనియడుగగా తా నేగు కార్యంబునకు నాటంకంబగునని తలంచి తానే గు చున్న వృత్తాంతమంతయు నొక్క క్షణంబులోజెప్పి పోవోవ అంత నా ఋషీశ్వరుండు సిద్దయ్యా! ఇక్కడకుబనగానపల్లె షుమారు నారామడలకుతక్కువలేదుగదా! నీ వెంత త్వరగా నేగినను నీ దినంబున బనగానపల్లెకు జేరనయినా చేరనేరవు నీవచ్చట కేగిపుష్పంబులు గోసికొని తిరిగి కందిమల్లయపల్లె

నీ రోజున జేరజాలవు. నేనొక యుపాయంబు జెప్పెదనట్లు చేయుము. ఏమనిన నీవు సత్యకాల సర్వావస్థలయందును శ్రీ గురునామంబు నీ హృదయఫలకంబున నిడికొనిసదాధ్యానం బుచేయువాడ వైతివేని, కేవల గురుదీక్షా పరతంత్రుడవైతి వేని, నీ గురువు కేవలపరబ్రహ్మావతారుండయ్యెనేని ఈప్రదే శంబున నెచ్చటనైనను ముండ్లు లేని యాకులు మూడు పిడి కెళ్ళుకోసి జోలెలో వేసుకొనిపోయిన అవియే మీ గురు మూర్తికి గావలసిన పలువిధ పరిమిళయుతంబైన పుష్పం బులు గావా? యనే చెప్పెను. ఆ ఋషిపుంగవుడు చెప్పు చున్న సువిషయంబు లన్నియు సిద్దయ్యగారు విని ఈయన కేవలపరబ్రహ్మస్వరూపుండని తెలిసియుకూడా నెక్కుడుగా నా మునీంద్రునితో మాట్లాడక నాలుగడుగులువేసి వెనుకకు తిరిగిజూచువరకా కపట వేషధారియైన యామౌనీంద్రు డదృ శ్యుండయ్యెను. అంత సిద్దయ్య నలుదిశల పరికించి చూచి ఆశ్చర్యంబునొంది మనంబును స్థిరపరచుకొని యిప్పుడు గని పించి మాట్లాడి అదృశ్యుండైన మౌనీంద్రుడు శ్రీ వీరబ్ర హ్మేంద్రస్వామియేగాని మరియెవరునుగారని దృఢచిత్తుండై యంత తనపైని వుత్తరీయంబును నొక జోలెగాజేసుకొనియా మౌనీంద్రుడు చెప్పినట్లు ముందుగనే ముండ్లులేని యాకులను మూడు పిడికెళ్ళు కోసి జోలెలో వేసికొని జోలెనిండా నా యాకులను వేసికొని మరల వచ్చుచుండెను. అప్పటికి పది గంటల ప్రొద్దెక్కినది. తాను వచ్చుచున్న దారిలో నొక బావి యుండెను. అచ్చోట నా మూటను బెట్టి తాను నిత్య

కృత్యములు తీర్చుకొని పిమ్మట శ్రీ గురునామస్మరణంబు కొంతసేపు జరిపించుకొని ఆ మంత్ర తీర్థంబును బుచ్చుకొని తానుంచిన జోలెవద్దకు రాగా "అతిసుగంధ పరిమళయుక్తంబైన" సువాసన వచ్చుచుండుట సిద్దయ్యగారికి నాశ్చర్యంబుగాతోచి నలుదిశల పరికించి చూచినను నయ్యరణ్యంబున పరిమళంబయిన సువాసన నిచ్చెడి పుష్పంబు లెవ్వియును లేకుండెను. అంత నా జోలెను దీసిగొని విప్పి చూడగా అతి రమణీయంబులయిన పలువిధ పుష్పంబులయి చూచుటకు నా పుష్పంబులు చిత్రవిచిత్రంబులుగా నుండెను. అంత నా సిద్దయ్యగారు పరమానందకందళితహృదయారవిందుడై యా మాటను ఎప్పటి యట్లుగట్టి భగవద్ధ్యానిష్ఠుండయి శ్రీగురు మందిరాభిముఖుండయి వచ్చుచుండెను. కొంతదూరంబిటుల వచ్చుసరికి నొక వృద్ధ బ్రాహ్మణుండెదురాయెను. ఆ వృద్ధ బ్రాహ్మణుంజూచి స్వామీ! మీరెచ్చటనుండి వచ్చుచున్న వారలని సిద్దయ్యగా రడుగగా నంత వృద్ధ బ్రాహ్మణుండు నాయనా ! నేను మల్లేపల్లి గ్రామాదులలో యాచనకయి యేగి రాత్రి సోమిరెడ్డిపల్లెలో పరుంటిని. తెల్లవారగనే లేచి కందిమల్లయ్యపల్లెకు రాగ నచ్చట శ్రీ వీరబ్రహ్మంగారు సమాధినిష్ఠాగరిష్ఠత్వంబున నుండెదరని తెలిసి యచ్చట కరుదెంచిన బ్రాహ్మణులకు అతిథిఅభ్యాగతులకును వారువీరన నేల? అభ్యాగతిని అని వచ్చిన వారికెల్లా సంభావనలు, మోయసలు, వస్త్రములు వగయిరాలతో ఎవరెవరికి ఏవిధిగా సమర్పించవలెనో ఆట్లే అందరకును సమర్పించిరి.అయ్యా! నే నేమని చెప్పుదును ? ఆ వచ్చిన భక్తాదులను కాల

జ్ఞాన అద్వైత రహస్యంబులన్నియు శి_ లు వెదబెట్టి నట్లుగా వెదజల్లి కోరి వారి మనోసంశయంబు లన్నియు దీర్చెను. వీరి ధర్మంబులన్నియు భక్తులకు బోధించెను. బ్రహ్మంగారును, వారిశిష్యులును యానందవార్ధిని మునింగిరి. ఆ మహనీయుడు సమాధియందు గూర్చుండు సమయంబున జరిగిన వైభవం బింతింతయని చెప్పనలవి కాదు. అబ్బా! నేనును యింత వృద్ధుడనై తినిగాని ఇట్టిమహావైభవంబులతో జీవసమాధినొందిన మహాభాగేయుని నే నెందును జూడనైతి నని చెప్పగా నంత సిద్దయ్యగారు స్వామీ! నా పుణ్యమూర్తి నా సకల సద్గుణ సంపన్నుడు! సమాధియందు గూర్చుండిన మాట వాస్తవమేనా? తండ్రీ! నన్ను వీడి సత్యంబుగా సమాధియందుండెనా? అయ్యో! స్వామీ! తమరిపుడుపల్కిన కర్ణకఠోరమైన వాక్కు వినినంతనే నాగుండెలుబ్రద్దలయ్యెనే! నేనిక నేమిచేయుదునని తిర్గి యాకపట వేషధారియైన బ్రాహ్మ ణునితో స్వామీ! నా తండ్రి సమాధియందున బ్రవేశించి నాడని నాతో బరిహాసమునకై ఇట్లుపల్కుచుంటిరా? లేక నా మనోవృథంబును నెరుంగుటకై ఇట్లు పల్కుచుంటిరా? నా కేమీ దెలియుటలేదు. స్వామీ! నిక్కంబుగా నా ప్రాణ తుల్యంబయిన నా గురుస్వామి సమాధినుండెనా? అయ్యో! త్వరగా దెల్పుము. మారుమాట్లాడక అట్లేనిలుచుండెదవేల? త్వరగా సత్యమును దెల్పుమని దీనవదనారవిందుడై యడు గగా నంత నా కపటవేషధారియైన యా వృద్ధబ్రాహ్మణుండు నాయనా! నేనింత వృద్ధుండనయి నీతో పరిహాసమాడుటకై

వచ్చితినా ? గురుండు నిక్కముగా జీవసమాధి యయ్యెను. ఆయన యొసంగిన ఈ భోజనపదార్థంబులను వస్త్రములను ఇవిగాక ఆ పుణ్యపురుష డొసంగిన సంభావన లివిగో చూడుము. ఆబద్ధంబు చెప్పుటకు నా ప్రాణంబుమీద తేమయిన వచ్చునా? లేక నిట్లుచెప్పిన నీవలన నాకు నేమయిన బహుమానము వచ్చునా ? పిచ్చివాడా! నీ గురుభగవానుడు నా గాయత్రి సాక్షిగా సమాధియందుప్రవేశించినాడు.ఆయన యొసంగిన ఈ భోజన పదార్థములతో గృహంబునకేగి వంట చేసికొని భోజనంబు చేయవలెను. నాకు భోజనమునకు అకాలమగుచున్నదని చెప్పి పోవుచుండెను. కాని సిద్ధయ్యగారి యవస్థనంతయు చూచి జాలిగలిగి పోవగాళ్ళాడక తిరిగి యచ్చే నిలువంబడ సిద్ధయ్యగారా వృద్ధ బ్రాహ్మణునిచేనీ వార్త వినినంతనే పంచప్రాణంబులలో నాల్గు ప్రాణంబులను వీడి యొక్క ప్రాణంబుతో మాత్రమా సిద్ధయ్యగారు నిట్టూర్పు విడుచుచు కూలబడెను. హా జగద్గురో! శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామీ! నా తల్లి దండ్రాదులను వదలి నీవే తల్లి దండ్రివని నమ్మి పదిరెండు సంవత్సరంబులు నీ పంచగాచిన ఈ పరమపాతకునకు నీ సుందర ముఖారవిందంబును జూచు ప్రాప్తంబు లేదయ్యెగా? నిరంతరము నీకన్నబిడ్డలకన్ననూ నన్ను నెక్కుడుగా ప్రేమచే సిద్ధా!సిద్ధా!యనిప్రేమలొలుకు నీ మృదువాక్కుచే కలువరించుచుందువే! తండ్రీ! నా కలువరింతలు, నాపైనీకుండు సత్కృపారసము, పరిపూర్ణ కృపా కటాక్ష వీక్షణంబులన్నియు నింతలో నెటుబోయె? నెందు

సమసె? అయ్యో!తండ్రీ! సోదరులయిన గోవింద పోతులూ
రయాచార్యు లిరువురును నన్ను ప్రథమంబున మీ చెంత
జేరుటకు వచ్చినపుడు వారిరువురును నన్ను పెట్టుచుండెడి
బాధలను తమరుచూచి సహింపజాలక వారికి నెన్నో నీతులు
గరపి వారిని నాజోలికి రాకుండునట్లుచేసిన నీ సత్ప్రేమ, తిరిగి
నన్ను నీ పాదసేవకునిగా చేసికొనిన కారుణ్యప్రేమ, నన్ను
నీవెచ్చట కేగినను నచ్చటికి గొనిపోయి నా మనోసంశయం
బులన్నియు దీర్చినవిశ్చయంపు ప్రేమ, నాతండ్రి కరినుండై
కడప నవాబువద్ద నన్ను గురించి తమపైని ఫిర్యాదుచేసినను
శాంతస్వాభావులయి నన్ను నొకమాటయైనను దూరక నాపై
జూపించిన సంపూర్ణ ప్రేమయేమయ్యె? నాపై నీకుండిన
నిరంతర విశ్వాసప్రేమను నీ వెందులదాచితివి? తండ్రీ! నీ
వింత కఠినహృదయుండవని నే నెరింగిన నీ దినంబున నీ
పుష్పంబులకయిరాకుందునే? యెంతపని జేసితిని? అయ్యో!
అయ్యో! యింత అన్యాయంబెదయిన గలదా? నమ్మినవాని
నట్టేటగలుపు ఇంతనిర్దయ సాహసాదులుగలవారెందయినను
గలరా ? ఆర్తుడనయి నీ యందజేరిన నాపై నింత కాఠిన్య
పరిపూర్ణ కృపాకటాక్షమా? తండ్రీ! నామనంబున నెన్నియో
కోర్కెలు బెట్టుకొన యా కోర్కెలన్నియు, నా తలంపు
లన్నియు నెందులకును బనికిరానివయిపోయెనే కృపానిధీ !
తుదకు చెట్టునువదలిన పక్షి చందంబయితినే? జగద్గురూ!
శ్రీజగత్ప్రభూ యని భూమిపైబడి పొరలి పొరలి దుఃఖించు
చున్న యాసిద్దయ్యగారితో నా వృద్ధబ్రాహ్మణుండు ఓరీ !

నీకు పిచ్చిపట్టినదా యేమి? జరిగిన కార్యంబునకు వగచిన ప్రయోజనంబేమున్నది? జరగబోవుపనికై ప్రయత్నింపుము. ఇదియునుంగాక నీ గురుండు నీకు బోధించిన రహస్యంబు లన్నియు మరచితివా? ఇప్పుడైనను నీదుఃఖంబును హరించు కొని జ్ఞప్తికి దెచ్చుకొనుము. నీ విట్లుదుఃఖించుచున్న నిన్ను నూరడించెడి వారెవరయినానిందుగలరాయనిచెప్పి యాకపటు వేషధారియైన నా వృద్ధ బ్రాహ్మణుండదృశ్యుండయ్యెను.

## ద్వాదశ ప్రకరణము

— సిద్ధయ్యగారు కందిమల్లయాపల్లె కేరుట —

అంత సిద్ధయ్యగారు హృదయంబును గట్టిపరచుకొని పొంగిపొంగి వచ్చుచుండెడి దుఃఖంబును నాపుకొని దుఃఖించిన ప్రయోజనంబు లేదని నిశ్చయించుకొని, పుష్పంబుల మూటను నెత్తినబెట్టుకొని శ్రీ గురుధ్యానంబు జేయుచు మెల్లగా శ్రీ స్వాములవారిమఠసింహద్వారంబుకడకుజేరేను. కాని సింహద్వారంబు బంధించి యుండుటచే సిద్ధయ్యగారు మఠంబులోనికేగుటకు వీలుగలగదయ్యెను. అంత సిద్ధయ్యగారు పెద్దపెట్టున యెలుంగెత్తి, ద్వారకవాటంబును దెరువుడని వారిని బిలిచెను. అంత లోపలనుండి ఒక సేవకుడు వచ్చి సిద్ధయ్యా, నాయనగారు సమాధియందున్న నిష్ఠాగరిష్టంబున తపంబుక్షయి గూర్చుండెను నీకిచ్చట నేమియు పనిలేదనియు, తిరిగి నీ గృహంబున కేగుమనియును శ్రీ గోవిందమాంబగారి యాజ్ఞ యయినది కనుక నీవు యిచ్చట నొక క్షణంబయిన నిలువక నేగుమని చెప్పి యెప్పటియట్లే

లోనికేగి కవాటంబును బంధించిరి. అంత సిద్ధయ్యగారి కేమి యుందోచక నచ్చటనే నిలువంబడిదుఃఖించుచు నిర్విణ్ణుండై నిలువబాతిన కొయ్యబొమ్మవలెనచ్చే నిలువంబడి చేతికి దొరికిన పెన్నిధానమును కాలితో దన్నుకొని పిదప దుఃఖించిన వాని చందమాయెనే వీరగురూ! పదిరెండు సంవత్సరముల నుండి నీ పంచగాచియుండ తుదకు నీవు సమాధియగు సమయంబుననుండుటకు ప్రాప్తంబు లేదయ్యెనే? గురుప్రభూ! చివరకు నీవుండిన సమాధియైనను కనులార జూచి నేనిపుడు దెచ్చిన పుష్పాదులచే చేతులార దృప్తిదీర పూజించుటకైన ప్రాప్తంబు లేకపోయెనో? సర్వేశ్వరా! నాయందు నీకుండెడి ప్రేమలన్నియు నెచ్చట సమసిపోయె? ఎవరెన్ని యను కొన్నను లెక్కచేయక సిద్ధా! రమ్మని తమ సుందరపాదార విందంబులకడ గూర్చుండబెట్టుకొని తమ మృదుమధుర వాక్కులచే భేద్యంబయి హరిహరాదుల కగోచరంబయిన అతి రహస్యంబులన్నియు బోధించెడి నా గురుస్వామి నా పెన్నిధానము నా జగద్గురుడు, నా భక్తవత్సలుడు-నా పరంజ్యోతి స్వరూపుడు-నా వీరబ్రహ్మావతారుడు-నా వీరభోజ వసంతావతారుడు సమాధియందుప్రవేశించిన నికనన్నుబిడ్డా రా రమ్మని జేరందీసి శిరంబుపై తన దక్షిణ హస్తముంచి హస్తమస్తక సంయోగంబుజేసి చిత్తశుద్ధోభవా! యని దీవించి ప్రేమించి, కరుణించి నా సంశయంబులన్నియు ద్రుంచి తన ప్రక్కన శ్రీస్వామీ! నీ స్వాంతంబున నింత నిర్ధయబూని కఠినవాని భంగినుండ న్యాయమా? నన్ను ప్రేమించి కర్త

క్షించి సాక్షాత్కరించి, నా విన్నపంబాలించి వైరాగ్యునిగా జేయుట నీకు భారమా? ఆపై కరుణావంతయు లేక నాతల్లి యైన గోవిందమాంబ ద్వారంబును దాటి లోనికి రావలదని నాజ్ఞాపించి ద్వారంబును బంధింపజేసెనే? అయ్యో! నేనెంత దురదృష్టుండను? నా జన్మమెంత వ్యర్థంబుగా బరిణమిం చెను? నన్ను రక్షింప నీ వొక్కండవేగాని మరియెవ్వరున లేరు. నే నిట్లునెంత దుఃఖించుచున్నను నేమియు ప్రయోజ నంబు లేదని మనంబున గట్టిపరచుకొని జ్ఞానశూన్యులవలె నూరక ప్రాణంబులను బోగొట్టుటకంటె నేనే దీక్షబూని పంచప్రాణంబులను బంధించి మనోమారుతంబుల రెంటిని నేకంబుచేసి షడాధారంబులను భేదించుకొని సహస్రారమంద నిల్పి అంతర కుంభకంబుచేసి యా పరబ్రహ్మమందైక్యం బయ్యెదనని మనంబున దృఢపరచుకొని సింహద్వారమునకు ముందు కటిక రాతినేలపై శిరంబును క్రిందికి, పాదంబుల పైకిని బెట్టుకొని ఏకదీక్షచే మనంబు నా వీరబ్రహ్మేంద్ర స్వాములవారి యందే లీనంబుజేసి యతి ఘోరంబుగా తపంబుచేయుచుండెను. తలక్రిందుజేసి యతి ఘోరంబుగా సిద్దయ్య తపస్సు చేయుచున్నాడని గోవిందమాంబతో సేవ కులు దెల్పగా నంత గోవిందమాంబ సిద్దయ్యగారి దృఢ భక్తికినాశ్చర్యంబునొంది ద్వారంబును దీయించి తదేక నిష్ఠచే తపంబుచేయుచున్న సిద్దయ్యగారినిచూచి సిద్దా!సిద్దా! యని బిలిచెను. కానినేకదీక్షచే నుండు కారణంబుచే నామెపిలిచిన పల్కులు వినబడక అట్లే తపంబు జేయుచుండుట జూచి

నాయనా! సిద్దా! ఇంత కఠిన తపంబును జేయ నేల సాహ సించెదవు ? మేన ప్రాణంబులున్న నెన్నియైనను సాధింప వచ్చును గాని ప్రాణంబుపోయిన వెనుకనెవరైనను నేమియు జేయంజాలరు. నీతండ్రియైన వీరబ్రహ్మేంద్ర స్వాములవారి సమాధియైనను నీ కనులారా చూచుకొని, నీవు దెచ్చిన పుష్పంబులచే నీ చేతులారా తృప్తిదీర పూజించుకొని, కొంచెము ప్రసాదమును బుచ్చుకొని వెళ్ళుమని చెప్పగా "వీరబ్రహ్మం"బను వాక్యము సిద్దయ్యగారి కర్ణపుటంబున దూరినంతనే తిరిగి జ్ఞాత గలిగి యాతపంబును చాలించి నిలు వంబడి గోవిందమాంబనుజూచి శిరస్సాష్టాంగ దండప్రణా మంబులాచరించి ముకుళిత కరకమలుండయి దీనవదనముతో తల్లీ! సకల సద్గుణ కల్పవల్లీ! ఈ దీనునిపై యీ మహా పాతకునిపై ఈ నీ బిడ్డని పైని నిప్పటికి దయగల్గెనా యని నేత్రములనుండి నీరుగార్చుచు వినయవిధేయుండయి పలు కగా నంత గోవిందమాంబ కా సిద్దయ్యగారి పైని కృపాకటా క్షంబు గలిగి, కుమారా! దృఢభక్తి ప్రపత్తులుగల నీయందు మీ తండ్రిగారికి పరిపూర్ణ కటాక్షమే యుండెను. కాని నీవు సకాలమునకు రాని కారణంబుచే కొంచె మాలోచించి తాను నిర్ణయించుకొనిన లగ్నము మించిపోవునని తలంచి నిన్ను పలుమారులు దలంచియు గూడా నింక నాలసించిననేమియు లాభము లేదని తలంచి యిప్పుడు సమాధియందు గూర్చుం డెను. ఇంక నీవు ఎంత దుఃఖించినను లాభములేదు. ఇప్ప డయినను మీ గురువుగారి సమాధిని కన్నులారా జూచి నీవు

తెచ్చిన పుష్పంబులచేత పూజించుకొని ప్రసాదమును బుచ్చుకొని నీ గృహంబునకు పొమ్మని చెప్పగా నంత గోవిందమాంబ యాజ్ఞయే శ్రీ స్వాములవారి యాజ్ఞయని తలంచి పూలమూటను నెత్తిన నిడుకొని సింహద్వారమునకు నమస్కారంబుజేసి లోనిమంటప ద్వారమును దాటి సమాధివద్దకేగువరకు కా సిద్ధయ్యగారి గుండెలు బ్రద్దలయి అట్లేసమాధి ముందర నేలపై స్మృతిదప్పి పడిపోయెను.


సిద్ధయ్యగారు సమాధిని జూచి దుఃఖించుట ..

కొంతసేపటికి జ్ఞాతగల్గి కన్నులవెంట నీరు కార్చుచు నతిఘోరంబుగా నెత్తిన బాదుకొనుచు పెద్దపెట్టున యేలుగెత్తి యేడ్చుచు ముకుళిత కరములుండయి తండ్రీ! వీరబ్రహ్మ గురువర్యా! వీరనారాయణా! భక్తవత్సలా! సచ్చరిత్రా! పవిత్రా! పరమపావనా! శ్రీ మదఖిలాండకోటి బ్రహ్మాండనాయకా! భక్తపాలనా! శరణాగతవత్సలా! సర్వేశ్వరా! వీరేశ్వరా! సచ్చిదానంద స్వరూపా! ఓ జగన్నాటక సూత్రధారుండవయిన జగద్గురుపరా! యని పెద్దపెట్టునయేలుగెత్తి యరచుచు నేకదీక్షచే సమాధిచుట్టు ప్రదక్షిణము చేయుచు తండ్రీ! నీ సుందర పాదారవిందములను జూడజాలను గదా? తెనియలొలుకు నీ మృదుమధుర భాషణంబులను నా వీనులారా ఆకర్ణింపజాలనుగదా? దేవా! నీ శతపత్ర నేత్రములను నా చక్షులార జూడజాలనుగదా? కరుణామయా! రాకాశశాంకుని ధిక్కరించెడి నీ సుందరమగు మోము నిక వీక్షింపజాలనుగదా? శ్రీ గురుచంద్రమా! అ ~ ~ ~

నీ యాజానుబాహువులు నేనిక నరయుజాలను గదా? జగ
ద్గురూ! నీవు సింహాసనాశీనుండవై పరశివునివలె గూర్చుండు
నపుడు పాదపద్మములకడ గూర్చుండి నీ పాదసేవ చేయు
భాగ్యం బింకలేదు కదా? అయ్యో! తండ్రీ! నా కోర్కెలు
అడుగంటెనే? నేను నా తల్లిదండ్రులనువదలి ఈ పదిరెండు
సంవత్సరములనుండియు తమకుచేసిన సేవలన్నియుబూడిదె
యందుబోయు పన్నీటిచందమాయెగా? జగత్ప్రభూ! ఇక నా
జీవనంబులు నా శరీరంబున నుండిన ప్రయోజనంబేమి?
స్వామీ! నన్ను చెట్టును వదలిన పక్షినిజేసి సమాధియందు
జేరి చక్కగా గూర్చుంటివా? ఇది నీకు భావ్యమా? కృపాళో
కరుణావంతయు నాపైనిజూపక నింత కఠినుండవయియుండ
న్యాయమా? తండ్రీ! నీ మెడనుండి వాడన పుష్పంబులు నా
కనుల కద్దుకొనెడి భాగ్యంబు నిక లేదుగదా? పరతత్వావ
తారా! నీ సుందర పాదములను పన్నీటిచేకడిగి నా శిరమున
ప్రోక్షించుకొని తమ పాదతీర్థమును తృప్తితీర గ్రోలుచుండే
భాగ్యంబిక లేదుగదా! తండ్రీ! తమ పాదుకలు నా శిరం
బందుంచుకొని మోయుచుండిన నా జన్మము కడతేరు నను
నమ్మికతో నీ సేవజేయుచుంటినే? తండ్రీ, అట్టి నా కోర్కె
లన్నియు అడుగంటజేసి ఆనందవారధియందు మునుంగుచు
బ్రహ్మానందుడవై బాగుగా సమాధిననున్న నన్నేవరేమియు
గనుంగొనజాలరని కలియుగంబును వదలి కళ్యాణ రాముండ
వయి ఘనముగా నిక గూర్చుందువుటే. చూడుము ఈ నీచుని

ప్రజ్ఞ. నీవీ పాతకునకు ప్రత్యక్షంబుగాకున్న నా ప్రాణంబులు నీ సమాధి ముందరనే వెడలునట్లు జేయువాడను. ప్రాణంబును బట్టెడి నేర్పును విడచెను. నేర్పును నీవే చూపించి పుణ్యంబును గట్టుకొని యుంటివిగదా. నీవు నేర్పినఅశక్యకార్య సాధన నీ కొప్పగించి నీయందే నైక్యంబు బొందెదనని ఏక దీక్షచే నొంటిపాదంబుపై నిలువంబడి దృక్కాంతయు నా సమాధియందుంచి—తండ్రీ! నీవు చూడ జగద్వంద్యుండవై దీనబంధుడవయి, భక్తార్తిధ్వాంతిభాస్వంతుండవయి, భక్తానంత ఫలప్రదుండవయి, భక్తానుకూల సంచారుండవయి, భక్తాభక్తి పరాయణుండవయి, భక్తాధీనుండవయి, భక్తిచేతో విహారుండవయి, శుద్ధవిగ్రహుండవయి. తారకమంత్రైకదైవతమవయి సర్వాభీష్టఫలప్రదుండవయి, భోగమోక్ష ప్రదాయకుండవయి, విశ్వశరీరుండవయి,మహేశుండవయి, మహాదేవుండవయి, అనవరతము నిన్ను నమ్మి పూజించువారలకు నిహపర సౌఖ్యంబు లొసంగెడి సర్వేశ్వరుండవే యని దేహమందు పులకాంకురంబును వొడచూప సమాధిచుట్టును తిరిగి శిరస్సాష్టాంగ దండ ప్రణామంబు లాచరించి తిరిగి కొంచెము శాంతించి తండ్రీ! నన్ను గూర్చి సంశయింపకుము సత్వరంబున నీ దర్శనం బొసంగి నా కానందము గూర్చుము స్వామీ! బిలిచిన పలుకవా? రావా కరుణింపవా? గానవా? సర్వవిషయంబులను బోధించుచు నీ కన్న కుమారులకన్న నెక్కుడుగా జూచుచుందువే? సర్వదురితాపహారా! సర్వేశా! సద్గురూ! నాకి దేహంబుతో బనిలేదు నీవు నన్ని పనులను

దీర్చుకొని సమాధి యందుంటివేం? వీరేశ్వరా? నిన్ను నిక జూచు భాగ్యంబు లేనప్పుడు నే నీ పృథివి యందున్న ప్రయోజనం బేమియు లేదని మనంబును మార్చుకొని ఏకాగ్రమందు మనంబు నిల్పుకొని సమాధివద్దనున్న 'గండక త్తెరను' కంఠంబునకు దగిలించుకొనిదియైన ప్రాణంబులను బాసెదనని నా గండక త్తెరను తీసికొని పద్మాసనంబున గూర్చుండి స్థిరచిత్తుడయి మెడకు దగిలించుకొనబోవగా నా క త్తెర రెండుతుంపులై విఱిగెను. ఏమే చిత్రము? నా ప్రాణంబుపయిని యాసవదలి గండక త్తెరచే నయినను మరణింతమనిదలంచిననియునదియు రెండుతుంపులై విరిగిపోయెను తిరిగి ఇంకను కొంచెము శాంతిపహించి నే నేమైన శ్రీ గురు ధ్యానంబును మరచితినా? లేక నా గురుమూ ర్తికి నా ప్రాణ రక్షకుని పరమదయ లేదాయనా? లేకున్న నిట్లేలజరుగును? ఇకనిట్లుగాదు. ఒకసారి రెండవసారిజూచినను స్వామి ప్రసన్నుండు గాడయ్యెను. అయిననుసమాధివద్దనున్న ఈసల్లని బండపై నా శిరంబును మోదుకొని ప్రాణంబులు బాయు వాడనని దలచి దృఢనిశ్చయుడయి తిరిగి తనలో తానిట్లాలోచించెను. ఏమిది? నేవల జ్ఞానశూన్యులవలె ప్రాణంబుబండకు నొప్పగించిన ప్రయోజనం బేమి? ఇది సరికాదు. ఈ మార్గంబు శ్రీ గురుపాదపద్మంబుల సేవయొనర్చనిమూఢులు దలంచెడు తలంపు. నేనుకోరుట సరికాదు. నేనా కేవల విరాగినయి సర్వకాల సర్వావస్థలయందు నా శ్రీ గురునాదుని దివ్యనామామృత పానంబుజేయు నాకా యట్టి మర



శ్రీస్వాముల వారి [illegible]

ణము ఛీ! ఛీ! ఎట్టి చెడుతలంపు జెందితిని? ఇక నేచేయుపని యేమన్న నిప్పటికి నాదివ్యమంగళ విగ్రహుని రెండుపర్యా యములు ప్రార్థించినను నాపై నీ సత్కృపరాదాయె. ఇంక తుదిసారి ప్రార్థనం బొనరించి మనోమారుతంబులను రెంటిని నేకంబుజేసి పంచప్రాణంబులను బంధించి షడాధారములను తిన్నగా భేదించి సహస్రారమందు నాపంచప్రాణంబులజేర్చి అనంతరకుంభకయోగంచే సహస్రారంబులు బద్దలుచేసుకొని పరబ్రహ్మంబైన తనయందే నైక్యంబయ్యెదనని దృఢమన స్కుండయి నిట్లని నాస్వాములవారిని ప్రార్థించెను...తండ్రీ నిదియే నిన్ను స్మరించెడి తుదిసారి ప్రార్థనము. దేవ దేవ! మహాదేవ! నీలగ్రీవ! సదాశివ! భవాతీత! భూతేశ! వీరేశ! నీకు నమస్కారము. సర్వజ్ఞ! సర్వదేవేశ! సర్వాత్మ! సర్వకా రణ! విశ్వేశ్వర! విరూపాక్ష! వీరబ్రహ్మ! నీకు వందనము. కాలసంహార! కలికల్మషనాశన! కామితప్రద! కామారీ! వీర నారాయణా! నీకభివాదము. శంభూ! శశాంకా! శరణా గత వత్సలా! శివా! శంకరా! వీరబ్రహ్మావతారా! నీకిదే మొక్కు నిర్వికల్ప! నిరీశ! నిరుపద్రవ! నిష్కామ! నిర్మలాకార! వీర గురుప్రభూ! నీ కిదే కైవారము. అగాధనాధ! మన్నాథ! దీననాథ! దయానిధే: గౌరీనాథ! జగన్నాథ; జగద్గురో, నీ కిదియే తుదిసారి నమస్కారము. మోక్షప్రద, సురాధ్యక్ష, పుండరీకాక్ష! ...జిత, ఫాలాక్ష, వీరబ్రహ్మేంద్రస్వామీ! నీకు ప్రదక్షిణమని యనేకవిధంబుల స్తోత్రంబు జేసి తాను దెచ్చినపుష్పములతో మనసారనిట్లు పూజించి ఓంసద్గురువీర

బ్రహ్మదేవా, ఓంవిరాట్ పోతులూరివీరబ్రహ్మేంద్రస్వామి ఓం ఓంకారమంత్ర స్వరూపా, ఓం అఖిలాండకోటిబ్రహ్మాండ నాయకా, ఓం సచ్చిదానంద స్వరూపాయ, ఓం శ్రీ వీర నారాయణా యని సమాధి చుట్టును ప్రదక్షిణ జేయుచు తండ్రీ, సమాధియందున్న నీవు కేవల పరబ్రహ్మవతారుండ వయితివేని నేను సర్వకాల సర్వావస్థల యందును నీదివ్య నామామృతంబు పానంబు జేయువాడనయితినేని నిప్పుడొన రింపబోవు ప్రయత్నము నెరవేరును గాక యని తిరిగి మరి యొకసారి సమాధికి తుదిసారి వందనములు జేసి స్థిరచిత్తుం డయి పద్మాసనంబు వేసికొని పంచప్రాణంబులను సహస్రా రంబునకు దెప్పించి సహస్రారంబును భేదించ నుద్దేశించిన వాడయి గూర్చుండిన వెంటనే సమాధినుండి "ఎందులకోయి యింత సాహసము ఆగుము, ఆగు"మని శబ్దంబు సిద్ధయ్య గారికి వినంబడెను. అంత కొంచె మాలోచించి నీ శబ్దంబు నెచ్చటనుండియో స్వామి స్వరంబుగా వినంబడినది. తిరిగి శిరంబు పైకెత్తువరకా సమాధినుండి "వాకిలికి నడ్డంబుగా వేసినమూత బండనుదీయు"మని రెండవసారి వినంబడెను

శ్రీ స్వాములవారు సమాధినుండి బయటకు వచ్చుట, శ్రీ సిద్దయ్యగారు స్వాములవారిని స్తోత్రము చేయుట

రెండవసారి వినంబడిన శబ్దంబు నాగురుస్వామిదేనని సంతోషస్వాంతుడయి బ్రహ్మానందుడయి సిద్దయ్యగారు వెంటనేలేచి సమాధి మూతబండను దీయువరకా శ్రీ సద్గు రుండు శ్రీభక్తవత్సలుండు శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ



స్వాములవారు సమాధినుండి బైటకువచ్చి సిద్ధయ్యగారికి దర్శనంబొసగుట.

నాయకుండు శ్రీవీరబ్రహ్మేంద్రస్వాములవారు పూర్ణిమనాటి రాకాశశాంకుని భంగి షోడశకళలతో శ్రీస్వాములవా రా సమాధినుండి బయటకు వచ్చి నాయనా ? నీ కింతసాహసం బెందులకు? నీధైర్యస్థయిర్యాదులనుగాని, నీభక్తి ప్రపత్తు లను గాని నే నెరుంగనా యని చెప్పగానంత సిద్దయ్య గారు స్వాములవారి పాదంబులపైబడితనివిదీర శిరస్సాష్టాంగదండ ప్రణామంబు లాచరించి యానంద బాష్పంబులు నయనం బుల దొరలగ నిట్లని వినుతించెను. ఓ దేవా, నీవు నిర్వికార నిరామయ నిస్సంగ నిర్భిన్నుండవు. నీయందు నాదియందు మాయువొడమి ఎల్లలోకంబులు గన్పించుచుండుట జేసి నాకు నిన్ను తెలియధ్యంబు గాకుండునట్లుండ మమ్ముద్ధరించు కారణంబున సత్వగుణ యుక్తుండవై నరరూపంబునుండాల్చి అజ్ఞానులను సుజ్ఞానులనుగా జేయుచుందువుగాదే! మహాత్మా! తేజోమయఖండ స్వరూపా! విజ్ఞానులైన ముముక్షువులకు నీ తత్వంబు తేట తెల్లంబు జేయుచు మూర్తి ధ్యాన యుక్తులగు నీ భక్తులకు నీ కళ్యాణ విగ్రహ దర్శనం బిచ్చుచు వారి దుఃఖంబు నాశంబు గావింతువు. తండ్రీ! బద్ధసంసారులై దేహేంద్రియాది సంఘ సన్నాహంబయిన పుత్రమిత్ర కళత్రాది పశుగృహంబులే తమకు సత్యంబని నీ మాయకుజిక్కి యనేక జన్మంబు లార్జించి నీకున్న సుఖంబు బడయునోపరు అట్లగుట వలన మహనీయమూర్తీ! నీ సంక ల్పోద్భవంబు యెడతెరని నీ మాయకుజిక్కించక నీ యందు భక్తికలుగ రక్షించుమో దేవ దేవా యని యనేక విధం బుల బ్రార్థించి అంజలి బద్ధుండయి నిలుపంబడగా అంత

శ్రీ స్వాములవారు నాయనా సిద్దా! నే నిదివరకే పరతత్వో పదేశంబు జేసియుంటిని గదా! ఇంక నీ కుండు సందియం బేమని యడుగగా నంతసిద్దయ్యగారు తండ్రీ! నాకున్న సంశ యంబులన్నియు దీర్చితిరిగాని, పరిపూర్ణ బోధను దెల్పుమని వేడగా నంత స్వాములవారు బిడ్డా! నిశ్చల మనంబున వినుమని యిట్లు బోధించెను.

శ్రీ స్వాములవారు "ఎరుక" యిట్టిదని దెల్పి దాని ప్రభావంబును బోధం చిన పిమ్మట "పరిపూర్ణమును" బోధించుట

శ్లో॥ ఇంద్రజాల మిదం సర్వం యధా మరుమంచికా, అఖండిత మనాకారం వర్తతే కేవలం శివం॥ అని శ్రీకృష్ణ పరమాత్మ ఉద్ధవునకు బోధించిన భావా భావాతీతంబయిన పరిపూర్ణ భావంబును బోధించెద చక్కగా వినుము. నామ రూపంబులుగల నీ ప్రపంచం బంతయు ఇంద్రజాల మను మాయవలన దోచుచుండును ఎట్లులనిన నిర్జన భూమియందు నీరున్నటుల దోచుచుండును. ఈ గాన్పించుచుండిన చరా చర ప్రపంచంబంతయు మాయ మాయయే, భ్రమ. భ్రమ నాశనమే సంకల్ప వర్జితం ఏడు ఏడు పదునాల్గు లోకంబు లున్న మాయ. దేవత్వమానుషత్వంబు మాయ. రూప నా మంబులున్నా మాయ. ప్రకృతి పురుషులు మాయ. క్షేత్ర క్షేత్రజ్ఞులు మాయ. సుఖదుఃఖంబులు మాయ. అనుభవంబని యందురేగాని నదియు మాయయే. ఈ మాయకు మూలము లేదు. ఆకాశంబున గాన్పించెడి మెరుపువలె గానంబడి రెప్ప

పాటులో మటుమాయం బగును. మూలము లేనటువంటి నీ మాయయే యనేక విధంబులుగా గానంబడి కష్టసుఖంబులను బోధించుచుండును. ఇక భావా భావాతీతమే అచల పరిపూర్ణము. సర్వదా సందులేక నిండి నిబిడీకృతంబై నిండిన నీ యచల పరిపూర్ణం బిట్టిది యనియు అది తప్ప మరేమియు లేదనియు మనంబున నిశ్చయించుకొని ఆరూఢజ్ఞానివై యుండుటే పరిపూర్ణమును దర్శించుట. అదియే విశ్రాంతి మార్గము. జనన మరణములకు హేతువులైన బంధమోక్షంబులు విశ్రాంతికి మార్గములు గావు. ఇవియన్నియు ప్రకృతి బంధములైన మాయకల్పితంబులు. బుద్ధిమంతులయినవారలు దీనిని విసర్జింతురని మాయసంబంధమైన "యెరుక" ప్రభావంబును జెప్పగా నంతసిద్ధయ్యగారు మహాత్మా! నాకు జనన మరణ రహితంబయిన అచల పరిపూర్ణభావంబును బోధించి నన్ను జనన మరణ ప్రవాహమునుండి తొలగించుమని వేడగా బిడ్డా! నీవు జాగ్రత్తగా విని యా అచల పరిపూర్ణమును దెలియుమనెను. బిడ్డా! భావాభావములకగోచరంబైనదే అచల బ్రహ్మము. దానినే అచల పరిపూర్ణమందురు. ఈ గాన్పించెడి సచరా చరంబంతయును నిండి నిబిడీకృతంబై ముల్లు గ్రుచ్చు సందులేక నంతా తానై యున్నదే అచలపరిపూర్ణం. షడ్ వికారంబులు లేని దేహరూపనామ క్రియా రహితంబైనది. పుట్టు గిట్టుటలు లేనిది అయ్యది స్త్రీయునుగాదు. పురుషుడును గాదు. నపుంసకము గాదు. ప్రకృతియున్నదని గాని, లేదనిగాని, నది యెవ్వటికిని నెరుంగదు. మహాసముద్రము

వనె నిండియుండు పరిపూర్ణాచల సముద్రమును జూడుమని ద్వాదశాక్షరీ మహామంత్రమును బోధించి ఇయ్యదియే "పరిపూర్ణం"బని సౌంజ్ఞచేసి నిశ్శబ్దంబుగా నూరకుండెను. అంత సూక్ష్మగ్రాహియైన సిద్దయ్యగా రా సౌంజ్ఞను గ్రహించి పరిపూర్ణమును దర్శించి నిశ్చేష్టితుడై నిలచినంజూచి స్వాములవారు బిడ్డా! నీ నిజస్వరూపంబును దర్శించితివి గదా! ఇదియే పరమ పదము. అయ్యదియే అచల పరిపూర్ణము. దీనినే బట్టబయలందురు. ఈ బట్టబయలు కన్న మరేమియు లేదు. దీని చేత ప్రకృతి పురుషులు బుట్టనేలేదు. ప్రకృతి పురుషులు రెండును మాయ. మాయ యనగా భ్రాంతి. భ్రాంతిచేతనే నీ సర్వంబును నోచుటబట్టి ప్రకృతి పురుషులు రెండును లేనివి. యీ లేని మాయాస్వరూపములయిన ప్రకృతిద్వయమే భావాభావంబులును వీటి కతీతంబును నీ రెండింటిని గుర్తెరుగుటం బట్టి ఎరుక యని పేరుగల్గెను. అట్టి యెరుకకు మూలంబేది యనిన మాయయే. మేఘమండలి మెరుపువలెను, సూర్యకిరణంబుల యందలి నీలంబువలెను. యెండమావుల యందలి నీళ్ళవలెను, త్రాటియందలి సర్పంబు వలెను గానంబడిమటు మాయంబై పోవుచుండును. ఈ వట్టి యెరుకయొక్క సంకల్పంబుచే గల్గినవే మోక్షాదిపదవులు,లోకభ్రాంతులు, మంత్రభ్రాంతులు నవియన్నియు హుళక్కి, ఈ ప్రకృతి ద్వయంబయిన యేనుంగులు, గుఱ్ఱంబులు, స్త్రీలు తమకు తామేవచ్చినెల్ల సంభాషణంబులు సల్పి జాగ్రతకురాగానే యెటులమటు మాయంబుగా బోవునో యటువలెనే నామరూపంబుగల నీ

సర్వంబును మటుమాయంబుగా బోవుటకు సందియంబులేదు. నీ కల్ల ఎరుకను నమ్మబోకుము. ఇంద్రజాలము భంగి గానుపించి చివరకు నేమియు లేకపోవును. నీ శరీరమునకు మూలంబులేదు. అతి ఏహ్యంబయి అసత్యంబైన నీ శరీరంబును నమ్మబోకుము. దీనియందలి భ్రమనువిడువుమని షోడశాక్షరిని బోధించి బిడ్డా, లేని యెరుకే చిత్తు, సత్తు, ఆనంద స్వరూపముగాగల సచ్చిదానందము. ఈ యెరుకే నాదబిందు కళలు. నీ యెరుకేనాపోజ్యోతి. యీ లేనియెరుకే నానావిధంబులుగా భ్రమలు పుట్టించుచున్నది. మూలములేని గుత్తైరిగే శరీరము నీవని నమ్మవద్దు. నీ నిజస్వరూపంబైన ద్వాదశాక్షరియే శాశ్వతమైనది, సత్యమైనది. అదియే శ్రీగురువాక్యము. ఇంతకన్నను, వేరొండు మహావాక్యంబు లేదు. నీ గురువాక్యంబును నమ్మకుండిన జననమరణంబులు విడువనేరవని సంపూర్ణబోధను జేయగా నంత సిద్దయ్యగారు స్వాములవారి పాదములపై తన శిరంబు వంచి స్వామీ! తమ దివ్యానుగ్రహంబున్న నాకే కొరతలు గలుగనేరవు. నెన్నికష్టంబులు వాటిల్లినను నేమియు జేయంజాలంలని వేడగానంత స్వాములవారు సిద్దయ్యగారి శిరంబుపై హస్తముంచి "మనో వాంఛా ఫలసిద్ధిరస్తు" అని దీవించెను.

శ్రీ స్వాములవారు దివ్యదృష్టిని సిద్దయ్యగారి కిచ్చుట, విశ్వరూప సందర్శనంబు చేయుట, స్వాములవారిని స్తోత్రము జేయుట.

బిడ్డా! సిద్దా! యీ ప్రకృతి మాయచే గూడియున్నది. నా ప్రకృతిని గ్రహించుటకు బ్రహ్మాదులకైన తరంబుగాదు.

కావున ఇదిగో నీకిప్పుడు "దివ్యదృష్టి" నొసంగినాడ గాన నీ ప్రకృతియనగా నెట్టిదో పరాపరంబయిననాపరబయలనగా నెట్టిదో చూడుము ఇట్టి పరమ పావనంబయిన నాపరబయలు నెరుంగజాలక ఋష్యాదులెల్లరు నన్ను సర్వకాలసర్వావస్థల యందును దలంచుచుందురు. కావున నాయనా! సిద్ధా! ఇదే చూడుమని "దివ్యదృష్టి" నివ్వగా నంతసిద్దయ్యగారు తన్మ యంబును జెంది శరీరంబును మరచి బ్రహ్మానంద వారాశిని మునింగి పరవశుండైనుండు తరి తిరిగి స్వాములవారొసఁగిన "దివ్యదృష్టి"ని తానే తీసుకొనగా నంత సిద్దయ్యగారు తెప్ప తిల్లి లేచి నిలువంబడి ఇట్లు స్తోత్రంబుజేసెను...దేవా! సకల పాపదురిత క్షయకారకమై సకల జీవన రక్షణరక్షమైచరాచర ప్రపంచసృష్టి స్థితిలయ కారణభూతమై అనంతకోటి ప్రభా తేజోధిక్యమై అసంఖ్య చంద్రమండలాధిక్య హిమంబయి సమస్త సాగరాధిక గంభీరమై శతాధిక మేరుపర్వతోన్నతం బయిన సూర్యచంద్ర నక్షత్రగ్రహ సమస్తాకాశ పరివ్యా ప్తంబయి యగోచరంబయిన నీ దివ్యరూపంబును తమ దివ్య కరుణా కటాక్షంబులచే నేనుగనుగొంటి, కృతార్థుండనయితి. నా యఘంబులెల్ల నశించె నా జన్మబంధంబులన్నియు నాశ నంబయ్యె. నా ప్రయత్నంబు ఫలించె. తండ్రీ! నీకివే అనేక శత వందనంబులు, బ్రహ్మేంద్రాది సమస్త దేవతా దుర్లభం బయినట్టియు ఋషీశ్వరుల కగోచరంబయినట్టియు నీ విశ్వ రూపంబును దర్శించితిని. తండ్రీ! నీ రూపసాక్షాత్కారం బిట్టిదని నూహింపజాలనైతిని. అయ్యది నేడు సంపూర్ణంగా దర్శించి కడుంగడు ధన్యుడనైతిని వీరబ్రహ్మసద్గురూయని!


యనేకవిధంబుల స్తోత్రంబుజేసి కృపాసముద్రా! గురుప్రభో ఇక జరుగబోవు "కాలపరివర్తనం" బెట్లు జరుగునో దెల్పు డని వేడగా నంత స్వాములవారు నాయనా! ఇక నీ కలియుగంబున జరుగబోవు విషయంబులు కొన్నింటిని మాత్రమే జెప్పెదను. అవి అతి రహస్యంబులు గావున వినుము. కలియుగము 4999సంవత్సరంబులలో నొకమహాత్ముడనేమహ సీయుండుబుట్టి దేశములోని ప్రజలను స్వాధీనము చేసుకొని కొన్ని రాజకీయంబులైన శ్రమలను బొంది పిదప మహాత్ము డనిపించుకొనును. కొన్ని ధర్మంబులు స్థాపించును. బందరు పట్నము సముద్రపు నీటిన మునుంగును. శ్వేత ముఖులు రాజ్యంబు లేలుదురు. జను లనతి సౌఖ్యంబుగా నుండేరు. ప్రాణంబు లేకనే బండ్లు నడచేను ప్రపంచమంతయు మంచి నీటిచే తెల్లికలు వెలింగేను. పశ్చాటిసీమలోని నరులువచ్చి యాకులు దిని బ్రతుకుదురు. మొగలాయి రాజ్యంబులోని నొక నది పొంగి చేతనూడ్చిన విధంబు జేయును. నెల్లూరి సీమంతా నీటిమయంబై కోట్లకొలది జనులు గూలిపోయేరు. వ్యభిచారవృత్తి నశించి వివాహంబులు జేసేరు. తన్నుదా నెరింగిన నిజ గురువులు దబ్బరలయ్యేరు. దొంగగురువులతి శయించెదరు. ప్రహ్లాదమైన పని కాగలదు.

పనిగల్గిన భక్తులుగలరు. వారికొరకు నేను రావలసిన పని యుండును. నా రాకకు ముందు నా భక్తులు వారి వారి సామర్థ్యములకొలది ధర్మములు స్థాపించి ధర్మపరిపాలనకు రాజ్యంబు చక్కజేసెద, పిమ్మట లోకమంతయు ధర్మసమృద్ధియగును. అపుడు రాయుల సింహాసనమును నలంకరింపజేసి

రాజ్యంబును పాలించెదను. ఇంక ననేక దేవరహస్యంబు లున్నవి. కాని సమయంబు చాలదు. ఇక నీ పని తీరినది ఇంక నీకొక విషయంబును జెప్పవలసియున్నది.

శ్రీ స్వాములవారు సిద్దయ్యగారిని వివాహము చేసుకొనుమని జెప్పుట— పాదుకలు యోగదండము, చేతిబెత్తము, శిఖాముద్రిక నొసంగుట— ఈ నాలుగు వస్తువులను దీసికొని ముదుమాల వేగుమలడగా నిరువురు దొంగలను గోవిందమాంబ పంపించుట, వ్యాఘ్ర రూపంబున స్వాములవారు నా దొంగలను గానంబడుట.

సిద్ధా! నీవు గృహంబున కేగి నీ తల్లిదండ్రుల యిష్ట మెట్టులో అట్లే వారికి బద్ధుండవై మెలంగుచువారిరువురకును యిష్టంబైన కన్యకామణిని బెండ్లాడి రాజయోగివై యుండు మని జెప్పగా నంత సిద్దయ్యగారు తండ్రీ! తమ కృపాకటాక్షంబుచే యీ మాంసపిండమును మంత్రపిండమును జేసితిరి. తిరిగి నన్ను వివాహందాడి సంసార కూపంబునంబడి పరితపింపుమని సెలవిచ్చుచుండిరి. గాని నేనీ కష్టంబులకు లోను గాజాలనని వేడుకొనగా నంతస్వాములవారు సిద్ధా! మంత్ర, లయ, హఠ, రాజయోగంబులను చతుర్విధ యోగంబులలో రాజయోగంబే శ్రేష్ఠంబు. అదియునుంగాక నేనును రాజయోగంబునందుండి రాజయోగిని గాలేదా? జనకాదులు రాజయోగులుగాదా? అట్లే నీవును రాజయోగివై నొక బాలికామణిని పెండ్లాడి పుత్రపౌత్రాభి వృద్ధి గలవాడవై నావలెనే నీవును మెలంగుము. ఇంక నొక్క రహస్యంబు జెప్పెద. అదియొద్ది యనిన నా వంశము నిర్వంశమగును. నీవంశ మభివృద్ధిజెంది పాలు పొంగినట్టుగాపొంగును. కందపద్యము. సంసారమందు



శ్రీస్వాముల వారు సిద్ధయ్య గారికి
పాదుకలు ఇచ్చుట

నుండియు, సంసారము మిథ్యజేసి సర్వముతానై హంసోహ
మందు నిలచిన సంసారే రాజయోగి సత్యము సిద్ధా! అను
న్యాయంబు ననుసరించి రాజయోగివై యుండుము. గర్భం
బునతపోనిష్ఠాగరిష్ఠుండైన "పెదపిరయ్య"యను పుత్రుండు
బుట్టును. నా మాటవిని వివాహంబు జేసుకొనమని జెప్పగా
అంత సిద్ధయ్యగారు తండ్రీ! తమ దివ్యానుగ్రహమున్నంత
వరకును నాకే కొరతలుండవు. తమ యాజ్ఞప్రకారమె రాజ
యోగినై ప్రవర్తించువాడనగానిఆత్మసంశయంబులన్నియు
తమ విశ్వరూప సందర్శనంబుచే శూన్యంబైనవిగాన నీ వను
గుణంచే నొక కోర్కె గల్గినది. నా కోర్కెను మాత్రము
దీర్చుదని వేడుకొనగా నంతస్వాములవారు బిడ్డా! నీ కుండు
కోర్కె నెద్దియో నేనెరుంగుదును.ఇవిగో తీసుకొనుము అని
పాదుకలు, బెత్తము, యోగదండము, శిఖాముద్రికయు నీ
నాల్గు నిచ్చి దేవరహస్యంబైన బీజసంపుటితో నున్న నొక
మహామంత్రంబును జెప్పి, నాయనా! సిద్ధా! 'గీతపర్వం'
ఒకటిగొని రెండు నిశ్చలయుక్తి జేర్చి, మూడు నాల్గింటికడు
వశ్యములుగ జేసి, యైదింటిని గెల్చి నారింట నడిచి, యేడు
విడచి వర్తించువాడు వివేకఘనుడు॥ ఇంక నీమాయామేయం
బయిన నీ మాయా ప్రపంచంబున నెట్లు మెలంగెదవో ఇక
నీ యిష్టము. నేనిపుడు జెప్పంబోవు బెద్దమానవులం జేరక
సదాసచ్చిదానందుండవయి మెలంగుము.సిద్ధా! నీ ప్రపంచం
బున గుణహీనులై యుండి గురువులమనువారును, పెద్దలమని
పెద్దతట్టెడు విభూతిబూసి రుద్రాక్షమాలలు ధరించువారును,

పంచగడ్డంబులను బెంచి మేమును యోగులమని జెప్పితిరుగు వారును, సాధువులమని చెలరేగి గంజాయిని త్రాగనేర్చి వాక్కున మాత్రమే రామకృష్ణాయని వాగువారును, నొక గురువువద్దకారణంబై నాగురువునేదూషించెడివారును, పొట్ట కూటికై ఘనంబునకై కారణాచార్యులమని ఘనతగా జెప్పు కొనువారును, శ్రీగురుసేవయనిన గొణుగుచు తిట్టుచు వారి వారి యిష్టానుసారంబుగా మెలంగువారును, తనగురుమూర్తి యాజ్ఞ లేనిదే తాను పరిపూర్ణుండనని జెప్పి తానుచెడుసది గాక సర్వజనులకు తెలిసిదెలియక కొన్నిడాంబిక పల్కులు బల్కి వారలను మోసంబుజేస శిష్యులనుగా చేసుకొను వారును, నవనీతనకు జడునకును దురాచారునకును డాంబి కునకును, ఇంద్రియ లోలునకును పుత్రదారణరాగాను ద్యత్యంతాసక్తునకును గురుభక్తిలేనివారును.దాసులయందు ద్వేషపడువారును,గురువులమని కాషాయాంబరములు ధరించి ఆహమును అణచుకొనలేక విఱ్ఱవీగువారును తారకముజెప్పె దను. దక్షిణయొసంగు మనువారును, సాంఖ్యంబుజెప్పెదను సారాబుద్ధి తెమ్మనువారును పంచలచా పొసంగిన పరిపూర్ణ మును బోధించెద మరువారును, భార్యాబిడ్డలను బెంచలేక కపటసన్యాసులై దేశాలుబట్టుక ద్రిమ్మరులై దిరుగుచు గురు వుల మనువారును, దుర్గంధయుతంబైనదీశరీరంబని జెప్పుచు తన శరీరంబుపై భ్రాంతిని విడజాలని వెఱ్ఱివారును ఇట్టి మాయవారలనేకు లీ ప్రపంచంబును బాడుచేయుచు తానును చెడుచు తుదకు ఇహపరంబుల రెంటియందును చెడుదురు.

ఇట్టివారల చెంతజేరకుము, వారలను నీవద్దకు రానివ్వకుము జాగ్రత్తగా రాజయోగివై యుండి నే నొసంగిన పాదుకలు వగయిరాలను నీవు సదా పూజింపుచు కొన్ని రోజులీ ప్రపంచం బందుండి సుప్రసిద్ధుడైన సిద్ధుండవనిజగంబున కీర్తిగాంచిన పిమ్మట నావలెనే జీవసమాధిన నుండుమనిజెప్పి తాను ఎప్పటివలెనే సమాధియందు గూర్చుండి తలుపును బిగించుమని సిద్దయ్యగారితో జెప్పగా నంత సిద్దయ్యగారు సనేక విధంబుల స్తోత్రంబు చేసి స్వాములవారి యాజ్ఞ ప్రకారమే సమాధితలుపును బిగించి స్వాములవా రొసంగిన నాల్గువస్తువులను కన్నుల కద్దుకొని ..సమాధి వద్దనుండి బయలుదేరి శ్రీ గోవిందమాంబ, గోవిందయాచార్య, పోతులూరయాచార్యులవద్దకువచ్చి వారిముగ్గురకునునమస్కారంబుగావించి తాను ముడుమాల కేగుటకై వారి ముగ్గుర యాజ్ఞనుగై కొని స్వాములవారొసంగిన వస్తువులను భద్రముగానుంచుకొనిజై వీరబ్రహ్మేంద్రస్వామికి జై! అనంతావతారా! యని మనంబున ననేక విధంబులుగా దలంచుచు స్వగ్రామంబైన ముడుమాల కేగుటకై ప్రయత్నించుచుండెను... అంత గోవింద పోతులూరయాచార్యు లిరువురు బ్రహ్మంగా రొసంగిన నాల్గు వస్తువులనుజూచి సహింపజాలక గాపల్లెయందు దోపిడిచేయుచున్న చినబుచ్చినాయుడు, పెదబుచ్చినాయుడు అనెడి వారిరువురకు సిద్దయ్యగారివద్దనున్న నాల్గు వస్తువులున్ను మాకు దెచ్చి యిచ్చిన మీ రిరువురకును మంచి బహుమతి జేసెదమని జెప్పగావారిరువురును కందిమల్లయపల్లె ప్రక్కనున్న

రెండు కనుమల మధ్యన కూర్చునియుండగా నంత సిద్దయ్య గారు శ్రీగురునామోచ్చరణజేయుచు మఠంబునుండి బయలు దేర నా రెండు కనుమల మధ్యకు వచ్చువరకు యిద్దరు దొంగలుండిరి. వారిరువురి దొంగలను ఏకాగ్రచిత్తుడయి ఏగుచున్న సిద్దయ్యగారు చూడకనే నేగుచుండ నా దొంగ లిరువురును సిద్దయ్యగారి వెనుక భాగంబుగ వచ్చి వారిచేత నున్న రెండు కర్రలెత్తి సిద్దయ్యగారి శిరంబును బ్రద్దలగు నట్లు కొట్టబోవగా —— నంతలో శ్రీ స్వాములవా రొక గొప్ప వ్యాఘ రూపంబున వారిరువురు దొంగలకు గాన్పించగా నా దొంగ లిరువురును నా పెద్దపులిని జూచి భయపడి పరుగెత్తుకొని పోయి ఈ వ్యాఘ్రదర్శన విషయ మంతయు గోవింద పోతులూరయాచార్యులకు నెరిగించిరి.

మంతయు గోవింద పోతులూరయాచార్యులకు నెరింగించిరి

సిద్దయ్యగారు పంచిన శిరం బెత్తువరకు వ్యాఘ్రంబును దొంగలునుగానంబడరైరి. ఈ చరిత్రబంతయు శ్రీ స్వాముల వారి చిత్రమేగాని మరేమియుగాదని మనంబున నిశ్చయించు కొని బయలుదేరి శ్రీ సద్గురుని నామ కీర్తనంబు జేయుచు ముడుమాల జేరెను ..ఈ వచ్చిన సిద్దయ్యగారు తల్లిదండ్రు లిరువురును జూచి సంతోషస్వాంతుడయి నా యిరువురకును నమస్కారంబుజేసి నిలువంబడగా నా తల్లిదండ్రుల సంతో షంబునకు మేరలేక వారిరువురును సిద్దయ్యగారిని కౌగలించు కొని ఆలింగనము జేసి సంతోష సాగరంబున నోలలాడుచు నొక బాలికామణిని బెండ్లిచేసిరి. పిదప నా సతీపతులనురాగ వర్తనులయి యుండిరి. పిమ్మట సిద్దయ్యగారు కుల కాంతచే సంతానంబు బడసి సతీ సుత బంధువర్గంబుతో గూడి



గోవిందమ్మగారు దొంగలను జూచి సద్బోధను పల్కుచుండుట
బ్రహ్మంగారి మహిమవలన పులివచ్చుట దొంగలు పారిపోవుట.

శ్రీవీరబ్రహ్మేంద్ర స్వాములవారొసంగినపాదుకలు, బెత్తము శిఖాముద్రికలయు, యోగదండంబునునొక గదియందుంచుకొని నిత్యనై వేద్య దీపారాధనలొసంగి పూజించుచు శ్రీస్వాముల వారిని వారందరును సదా ధ్యానించుచుండిరి.

## త్ర యో ద శ ప్ర క ర ణ ము


గోవిందమ్మగారు "వనిపెంట విశ్వబ్రాహ్మణు వల్లకాడుగాను, మునిమడుగు విశ్వబ్రాహ్మణులు మురవష్టంబుగాను" అనిశపించుట

శ్రీ స్వాములవారు సమాధియందు ప్రవేశించిన పది యవ మాసంబున శిష్యసంచారంబునకై పోతులూరయాచార్యులుగారు బయలుదేరి వనిపెంట గ్రామంబుజేరివారిరాకను నౌకరుద్వారా నా గ్రామ విశ్వబ్రాహ్మణుల తెలియించిన ధనమదాంధత్వమున కన్నులుగానక విఱ్ఱవీగుచున్న నా విశ్వబ్రాహ్మణులొకచోటజేరి ప్రపంచధర్మంబునువీడి గోవిందమ్మగారు "గాజుపూస, మెట్టియలు, పసుపు, కుంకుమ" నిషేధించక ముత్తయిదువగా నుండినదిగాన నామె ప్రపంచ ధర్మరీత్యా పసుపు, కుంకుమనిషేధించువరకునుమనమువారి తీర్థ ప్రసాదంబులను బుచ్చుకొన కూడదని వారందరు నిశ్చయించుకొని పోతులూరయ స్వాములవారు బంపించిన నౌకరులతో నిట్లనిరి అయ్యా! గోవిందమ్మగారుపసుపు, కుంకుమ నిషేధించి ప్రాపంచ ధర్మరీత్యా వైధవ్యంబు వహించు వరకు మేము వారొసంగినతీర్థ ప్రసాదములు స్వీకరించమని

జెప్పినార మని జెప్పుమని నౌకరులతో జెప్పగ అంత నౌక రులు పోతులూరయాచార్య స్వాములవారి వద్దకేగి వారలు జెప్పిన విషయంబులన్నియు జెప్పగా స్వాములవారు తోక తొక్కిన భుజంగముమాడ్కి కోపోద్దీపిత మానసుండై తిరిగి కొంచెమాలోచించుకొని శాంతించి అటనుండి బయలుదేరి, మునిమడుగు గ్రామంబునకు చేరిరి, నాగ్రామవాసులై నవిశ్వ బ్రాహ్మణు లందరును వనిపెంట వారివలెనే వారును ధన మదాంధత్వంబుచేదులదూగుచుఆర్యులైనవారిని ఆదరించక నిరాదరణగా జూచుచు మాకేమి కొదువ యని అహంకార స్వభావులయియున్న మునిమడుగు విశ్వబ్రాహ్మణుల కడకు పోతులూరయాచార్య స్వాములవారు తన రాకనువెరింగించు మని తన నౌకర్లనుబంపగా వారికడకు నౌకరులేగిస్వాముల వారి రాకను నెరింగించగా నౌకరయినను యా నౌకరుల మాటవినియు వినీ విననట్లుగా నూరకుండిరి. అంతవిశ్వ బ్రాహ్మణులంద రొకచోటజేసి సభజేరి వారిలో వా రిట్లు తీర్మానించుకొనిరి. బ్రహ్మంగారుండినపుడుగోవిందమ్మగారు ముత్తయిదువగా యుండుట సహజధర్మము గాని వారు సమాధియైన పిదప వైధవ్యంబును వహించక ఎప్పటి అట్లే ముత్తయిదువగా నుండుట కులాచార విరుద్ధముగదా? అట్టి స్థితిలో బ్రహ్మంగారు సమాధిలో బ్రతికియుండి కూర్చుండి నను వారింకను మరణించక యుందురా? వారు యిప్పటికి పది నెలలైనను యింకనూ బ్రతికి యున్నారని గోవిందమ్మ గారు దలంచినట్లున్నది. కాబట్టి ఆమెవైధవ్యమునువహించు

వరకును మన మందరము తీర్థ ప్రసాదంబుల బుచ్చు కూడదని తీర్మానించుకొనిరి. వారిలో బుద్ధికుశలుండ ఆర్యానుగ్రహ పాత్రుడున్న బ్రహ్మంగారు సమాధిఅయ్యే కాలంబున నున్నవారును బ్రహ్మంగారు గోవిందమ్మనువైధ వ్యంబువహించక నామె సమాధియందు ప్రవేశించువరకను ముత్తయిదువుగా నుండుమనియు నిన్ను వైధవ్యంబు వహిం పుమన నెవరందురో వారు మల్లకాటి తేగుదునియు చెప్పిన బ్రహ్మంగారి వచనంబులు విన్నవారిలో నొక బుద్ధిశాలి లేచి సరే అన్నలారా! మీరు నేను జెప్పినవన్నియు చక్కగావిని ఆవల వారిని తిరస్కార భావంబున జూడుమని ఇట్లు చెప్ప నారంభించెను. అన్నలారా! మన విశ్వకర్మయే మానవ రూపుడై యిట్టి వీరబ్రహ్మేంద్రస్వామిగా అవతరించి కంది మల్లయపల్లెలో 175 సంవత్సరంబులుండి మనకోటి అజ్ఞాను లను సుజ్ఞానులుగా జేసి తిరిగి తాను భూభారము బాప వీర భోగవసంతావతారుండయి వచ్చుటకుగాను తపంబునకై సమాధియందునున్నవాడు. కానమీరలు అజ్ఞానులై యిటుల బల్కుట భావ్యము కాదు. 'వినాశకాలే విపరీతబుద్ధే' యను న్యాయంబుగా మీకు చెడు దినంబులు సంభవించియే ఇటుల బల్కుచుంటిరి. లేకున్న నా మహామహుండయిన వీర బ్రహ్మేంద్రస్వాముల వారిని నిటుల దూషించుచుంటిరని చెప్పగా తక్కిన వారందరునుపోతులూరయాచార్యస్వామిని మాపద్దకువచ్చిన ఆయననునడుగవలసినవిషయంబులన్నియు నడిగి తదుపరి విషయంబు లాలోచింతమని నొకరుతో

జెప్పగా యానౌకర్లేగి స్వామీ! తమరినే వారివద్దకు రమ్మన మని చెప్పి రనగానే తనకుండు కోపంబు తగ్గించుకొని నౌకర్లతో బయలుదేరి వారి గృహంబులకడ కేగిరి. వీ రేగినను వీరితో మాట్లాడువా రెవరును లేరయిరి. యింకను శాంతిని వహించి నాయనలారా మీ రందరిట్లు మాపై కోపంబున నుండుటకు గారణం బెయ్యది? యని పోతులూరయా చార్యులడుగగా నంత విశ్వబ్రాహ్మణు లిట్లనిరి. ఆచార్యా! అమ్మగారు పసుపు, కుంకుమ నిషేధించి ప్రాపంచరీత్యా నుండక ముత్తయిదువుగా నున్నది. అందుచేతనే మీతో మాట్లాడుటకు మనసు రాకున్నది. శ్రీ అమ్మగారు వైధవ్యంవహించు వరకును మేము తమ చేతి తీర్థప్రసాదంబులు స్వీకరింపమని గట్టిగా జెప్పగా గా మునిమడుగునుండి వెంటనే బయలుదేరి మిట్టమధ్యాహ్నము ఎర్రని ఎండలో కాలరుద్రుని భంగి కోపోద్దీపిత మానసుండయి వచ్చుట నౌక రొకరు జూచి గోవిందమాంబగారి కడకేగి తల్లీ! మన చిన్న స్వాములవా రెండులకో కోపంబున వచ్చు చున్నారని జెప్పగ వెంటనే గోవిందమాంబ సింహద్వారంబు కడకరుదెంచి నిలువంబడ నంతలో పోతులూరయా చార్యులుగారు వచ్చిరి. ఆ వచ్చిన చిన్న స్వాములవారిని నాయనా! పోతులూరూ! ఉదయమే బయలుదేరి వెళ్ళి వెంటనే తిరిగి వచ్చుటకు కారణం బేమని సింహద్వారంబు మధ్యన నిలువంబడి యడుగగా కోపంబున నున్న పోతులూరయాచార్యులుగారు తన ప్రక్కన వ్రేలాడు చున్న ఖడ్గంబును దీసి అమ్మా! నే నడిగెడు మాటలు


నాడు యారయ్య తల్లిని మంగళ సూత్రము తీయుమని
వేడుగా గౌరవించవలెనని తండ్రి ప్రజావళిని చెప్పుట.
నాడు యారయ్య సిద్దయ్య నరకమును చూపుట.
స్నానముల వారి మహిమను సిద్దయ్య తెల్పుట.

మూడున్నవి. వాటికి సమాధానంబులు జెప్పుతున్న నీ ఖడ్గం బుచే నీ కంఠం బుత్తరించెదనని యిట్లు అడిగెను. నేను 'పని పెంట' గ్రామంబునకు ముందుగా నేగి నౌకర్లను విశ్వబ్రాహ్మణ సంఘము వారివద్దకు పంపగా వారలు నిరాకరించి గోవిందమ్మగారు గాజుపూస మంగళ కరమగు వస్తువులను నిషేధించి వైధవ్యంబు వహించు వరకు తీర్థ ప్రసాదములు బుచ్చుకొనమని ఖండితముగా జెప్పిరి. అచ్చటనుండి బయలు దేరి 'మునిమడుగు' గ్రామంబు చేరగావారలునుఇట్లేజెప్పిరి. కాన నాయనగా రిప్పటికి సమాధిని గూర్చుండి పది నెలలు అయినదిగదా! ఆయన జీవించే యున్నవాడనిగదా నీ విట్లే మంగళ ప్రదాయివై యుండుట ? నాయనగారు జీవించి యున్నాడనిన నేను నమ్మజాలను. సమాధిని పగులగొట్టి చూచినగాని నా మనంబునంగల సందియంబులు దీరవనిజెప్ప గానే శ్రీ గోవిందమాంబ కన్నులవెంట నీరుగార్చుచు నమిత రౌద్రావేశంబున నా సింహద్వారంబుమధ్యన కన్నులెఱ్ఱజేసి ఒరే పోతులూరూ! పనిపెంటవాండ్లు వల్లకాడుగాను, మునిమడుగువాండ్లు ముదనష్టముగాను అనిశపించి తిరిగికొంచెము శాంతిని వహించి బిడ్డా! నీవు కేవలము పసివాడవు. మీ నాయనగారి తత్వంబును నీ వెరుంగవు. వినాశకాలం బాసన్నంబై వారికిట్లు బుద్ధి బుట్టినది.

పోతులూరయాచార్యులు సమాధిని పగులగొట్టుట, మలమీదిపల్లెకు జేరి పదిరెండు సంవత్సరముల తపంబాచరించి వచ్చి సమాధిని జేరుమని స్వాములవారు శాపం బొసంగుట.

నాయనా! నా మాట వినుము. సకల సద్గుణసం: న్న

డునుసద్గురుపాదసేవాధురంధరుండును నీకన్నను ఎక్కుడు పెద్దవాడును మీ తండ్రికి ప్రాణతుల్యుండునగు సిద్ధనివద్ద కేగి నాలోచించి పిదపసమాధినిదీయుము. కన్నతండ్రీ! నీ కోపంబును చంపుకొనుము. కేవల నిర్వికార నిరామయుండై నీ తండ్రి తపం బొనరించుచుండ నీవామహాత్ముని సమాధిని బగులగొట్టిన నీతండ్రి నీకేమి శాపంబొసంగునో? తండ్రీ! నే జెప్పుమాటలు రుచింపకున్న సిద్ధనికడకేగి నడుగుమనగా... శ్రీపోతులూరయాచార్యులు గుర్రముపైనెక్కి కందిమల్లయ పల్లె కెనిమిదిమైళ్ళ దూరంబుననున్న ముడుమాల కేగి శ్రీ సిద్ధయ్యగారితో సమాధిని పగులగొట్టి మా నాయనను జూచు నంతవరకును నా మనంబు నిల్వదని గట్టిగాజెప్పగాసిద్ధయ్య గారు శ్రీస్వాములవారి మహామహిమంబు లనేకంబులు జెప్పి ఎన్నియో నీతులు గరపినను వినకదానుపట్టినపట్టునువిడవక సిద్ధయ్యగారిని నిర్లక్ష్యంబుగా జూచి సిద్దా! దూదేకు కొనెడి వాడవైన నీకేమి తెలుసునని నిరాకరించి అటనుండి బయలు దేరి తిర్గి మఠంబునకుజేరి శాంతి వహించిన వానివలె నుండి నందరు నిదురించిన పిదప నర్ధరాత్రంబున నొక గడ్డపారను దీసికొని సమాధిపై బండ లూడవైచి బండ పై కెత్తెను. అందు కేవల పరమశివునివలెతపంబు చేయుచున్న తండ్రికి వెనుక భాగంబున నిలువంబడి! నాయనా నాయనా ! యని పిలచెను. కాని తాను కేవల నిర్వికల్ప సమాధియందుండుచే పలచెను. కాని తాను కేవలనిర్వికల్ప సమాధియందుండుటచే పలుకకదయ్యెను. నాయనగారు జీవించియున్న యెందులకు గాను పలుకడని వెనుకభాగంబుననుండియే వెనుకకుముందు



శ్రీపోతులూరయ్య సమాధిని పగులగొట్టుట.



స్వామివారికి తపో భంగము కలిగించుట.



స్వాములవారు పోతులూరయ్యను శపించుట.

నకు చూపెను. కాని నిష్ఠయందుండి కదలకుండెను. అప్లే గడ్డంబును బట్టుకొనియు, శిరంబును బట్టుకొనియు వెనుకకు ముందుకు తానిచ్చవచ్చినట్లల్లా నూపగా నంతట జ్ఞాతనిగలిగి ఎవడురా సమాధిని బగులగొట్టినది? యని బలుకగా వెనుక భాగంబున నున్న పోతులూరయాచార్యులు గడగడవణకుచు నాయనా! నేను నీ కుమారుండ నయిన పోతులూరయ్యనే యని జెప్పగా నంత స్వాములవారు సరే నా గర్భవాసంబున నుద్భవించిన కారణంబున నిట్లు నిన్ను వదలితిని. అయినను నీవు ఉదయముననే నీ భార్యసమేతంబుగా బయలుదేరి మల మీది పల్లెవద్దనున్న నొక చిన్నక్షపరనతంబుపైనిక్షనొక చింత చెట్టుగలదు. ఆ చెట్టుకు నింతదనుకను పూత పిందెకాయలు లేవు. ఆ చెట్టువద్దనొక కొలనుగలదు, ఆ చెట్టువద్దపదిరెండు సంవత్సరములు తపంబు చేయుము. నీ తపంబు సిద్ధియైనది యెట్లు దెలుసునన్న నా చింతచెట్టుకు ఒకే కాయ కాచి పండును. ఆ పండు నీ చేతిలోనే పడును. అప్పుడు నీ తప స్సిద్ధియైనదని యెఱింగి నా పండును భక్షించి గృహంబున కరుదెంచి పిదప జీవసమాధిని జెందుమని జెప్పి తాను తిరిగి నిష్ఠయందు గూర్చుండి ఎప్పటివలెనే బండను మూయమని జెప్పగా నంత పోతులూరయాచార్యులు సమాధిపై బండను వైచి నీ విషయంబంతయు తల్లితో జెప్పగా అంత గోవింద మాంబ విచారగ్రస్తయై బిడ్డా! పోతులూరూ! మీ తండ్రిని సర్వసామాన్యుడని దలంచి యేమీ యెరుంగని అజ్ఞానులు బలికిన పౌరుషవాక్యంబులకు నీవిట్లు సమాధిని పగుల గొట్ట

వచ్చునా? అయ్యో! బిడ్డా! యెట్టిదుర్ఘటనకార్యంబొనరించితివని కొంతవడి విచారము నొంది శ్రీ స్వాములవారి యాజ్ఞ చొప్పున శ్రీ పోతేరమ్మను దలంచినంతనే నామె బాలికారూపంబున నాక్షణముననే ప్రత్యక్షంబయి అమ్మా! ఎందులకయి నన్ను దలంచితి వన గోవిందమాంబ తల్లీ! బిడ్డడైన పోతులూరు అరణ్యంబునకు తపంబాచరింప బోవుచున్నాడుగాన నీవు నా బిడ్డను ఎట్లు గాపాడెదవో తల్లీ! వాని భారమంతయు నీపైన వైచితిని. వానితపంబు పూర్తియగు వరకు వానిని కాపాడిసురక్షితంబుగా గృహమునకుజేర్చుమని వేడగనంత పోలేరమ్మ అట్లేనని జెప్పి అంతర్ధానంబు నొందెను.

శ్రీ పోతులూరయాచార్యులు మల్లమీదిపల్లెకు తపంబాచరింప బోవుట, తన పోషణకై యున్న పోలేరమ్మను ఒక వేపచెట్టు యందుండునట్లు జెప్పుట.

శ్రీ పోతులూరయాచార్యులు తల్లిగారి యాజ్ఞయు, అన్నగారి యాజ్ఞయు గైకొని భార్య సమేతముగా తపంబునకై బయలుదేరి మలమీది పల్లెవద్దనున్న చింతచెట్టు వద్దకు చేరి నచ్చటనున్న కొలనుయందున స్నానంబాచరించుచు చెట్టుక్రింద కూర్చుండి తపం బాచరించుచుండెను. శ్రీ పోతేరమ్మనిత్యము ఉదయ సాయంకాలములయందును నొకగొల్ల యువతీమణివలె వచ్చి పాలొసంగి బోవుచుండెను. నామహానీయుని తపంబు పూర్తియగుసరికి నొక దినంబున కపటవేషధారిణిగనున్న పోతేరమ్మతో అమ్మా! నీవెవరవు? ఇన్నిదినంబులనుండి నీ వొసంగుచున్న క్షీరంబుల కెంత ఖరీదియ్య



శ్రీ పోతులూరయ్య కొండపై ఏకాంతముగా తపస్సు చేయుచున్నప్పుడు
పోలేరమ్మ గొల్లభామ వలె వచ్చి పాలను ఇచ్చుట

మనెదవో జెప్పుమన్న నంత పోలేరమ్మ స్వామి నేను పోలేరమ్మను. నన్ను మీ నాయనగారి మఠంబులో నుండునటుల స్థాపింప బ్రార్థించెననగా పోతులూరయ్యగారు తల్లి, నీవు నా తండ్రిగారి మఠంబున నుండుటకువీలుండదు. ఎందులకనిన నీకు జాతరలు వగైరాలు జరగవలసి యుండును. నిన్ను వేరొక చోట ప్రత్యేకంబుగా నుండునట్లు చేసెదననిమనసంబు నందలంచి నటనుండిబయలుదేరి రెండుకనుమలమధ్యనుండి క్రింది భాగమునకు దిగివచ్చుచోట నొక వేపచెట్టును చూచి తల్లీ! నీవీ వేపచెట్టు యందైక్యంబగుము. ప్రతివైశాఖశుద్ధ దశమి రోజున నాయనగారికి ఆరాధనము జరుగును.ఏకాదశి దినంబున ఉదయం ఎనిమిది గంటలగుసరికి నీకుపొంగళులు భోజనములు, జాతరలు జరుగును నీవు మా మీది పోలేరమ్మ యనియు, కనుమపోలేరమ్మ యనియు సర్వజనులచే బిలిపించుకొందువు నీవీ వేపచెట్టుయందే ఐక్యము గమ్మని చెప్పగా నద్దేవి నా చెట్టుమందే ఐక్యంబయ్యెను. అప్పటి నుండియు యిప్పటివరకును నా పోలేరమ్మకు ప్రతి వైశాఖ శుద్ధ ఏకాదశి ఉదయం ఎనిమిది గంటల ప్రొద్దుఎక్కువరకు దేవికి పొంగళులు, భోజనములు, మితిదప్పిన జాతరలు జరుదుచునే యున్నవి. శ్రీ గోవిందమ్మగారి శాపానుసారము మునిమడును, వనిపెంట గ్రామంబులోని విశ్వబ్రాహ్మణులు పిలువ పేరులేకుండా వంశక్షయులైరి. నీ రెండు గ్రామంబులోనిప్పటికిని విశ్వబ్రాహ్మణులు వసింపరు. ఒకవేళ ఎవరైన నుండుమని దలంచినను నష్టంబులేగల్గుచుండును. ఆ

గ్రామంబులలో అప్పటినుండి ఇప్పటి వరకును మహమ్మదీయులును, మరాఠీలును కంచరపనిని చేయుచుందురు. వనిపెంట నుండి శ్రీస్వాములవారి మఠంబునకు ఇప్పటివరకును నీ కంచరపని చేయువారందరును నేతిబుంగలు,నూనెబుంగలు శివరాత్రికిని శ్రీ స్వాములవారి యారాధనకు తప్పక తెచ్చుచుందురు.

### శ్రీ సిద్దయ్యగారి మహిమచే సర్పదష్టుండై మృతి బొందిన తిమ్మారెడ్డి తిరిగి బ్రతుకుట.

శ్రీ సిద్దయ్య ముడుమాలజేరి సదాచార గురుధ్యానుండయి యుండెను. సిద్దయ్యగారు సత్వగుణ సంప్రదాయకులనిగాని కేవల ఈశ్వరాంశ సంభూతుండనిగాని భక్తజనాభీష్ట ఫలప్రదుండనిగాని మహామహిమాస్పదుడనిగా ని నాగ్రామవాసులు ఎరుగరైరి. ముడుమాలకి రెండుమైళ్ళ దూరములో నున్న తిమ్మారెడ్డియను నొకనికి రాత్రి కాలంబున సర్పము గరచుటచే నోట రక్తంబును, కఫంబును వెడల గ్రక్కుచు నమితంబుగా ముంపులు వచ్చుచుండెను. మాంత్రికులనేకుల చేత చికిత్సాపరులచేతను ననేకంబుగా వైద్యంబులు చేయించినను, నా తిమ్మారెడ్డికి స్మృతి గలుగక అట్లే ముంపులు వచ్చుచుండెను. పిదప ప్రొద్దుపొడుచు సమయంబునకు ముంపు నెక్కుడై స్వర్గస్థుడయ్యెను. అంత నా రెడ్డి తల్లిదండ్రులును, భార్యాబిడ్డలును నమితముగాదుఃఖించుచుండిరి అంత నా రెడ్డి స్నేహితులు కొందరరుదెంచి ఏమీ! మీకు పిచ్చి పట్టినదాయేమి ? చనిపోయినవాడు మీరిట్లు దుఃఖించుచున్న తిరిగి జీవించునాయేమి? యని యనేక నీతులు గరిపి

వారికి దుఃఖోపశమనంబు చేసి ఆ రెడ్డిని కాటికి గొనిపోయి దహనంబు చేయుటకై కాష్టంబుపై బరుండపెట్టిరి. ఇంతలో సిద్ధయ్యగారు కందిమల్లయపల్లెనుండి ముడుమాల రావలెనను తలంపుతో వలుగురాళ్ళపల్లె సామీప్యంబునకు రాగా నీ రెడ్డి సర్పదష్టుడై చనిపోయెనాడను విషయంబును, రెడ్డిని చూచి యింటికి వచ్చెడి వారలు వచ్చుచుండిన శ్రీ సిద్ధయ్యగారితో చెప్పగా నంత సిద్ధయ్యగారు నాయనా! నా రెడ్డిని దహనము ఎచ్చట చేసెదరో దెల్పెదరా ? యని యడుగగా తిరిగి ఆ తండు అయ్యా! అయ్యదియే నా రెడ్డి కాష్టంబు. కాష్టంబు పైని పరుండబెట్టిరి. గాని యింకను నగ్ని ముట్టింప లేదని చెప్పగా వెంటనే సిద్ధయ్యగారు కాష్టంబుకడకేగి రెడ్డినిచూచి అయ్యా! యీయనను సర్పంబెప్పుడు కాటందినదో జెప్పు మనగా నారెడ్డి తండ్రి నితులు జోడించుకొని స్వామీ! రాత్రి 12 గంటలకు కాటొంది సూర్యోదయ కాలంబునకుమృత్యుం దయ్యెను. మేమును అనేక చికిత్సలు చేయించినారమని జెప్పగా నంత సిద్ధయ్యగారు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిచే 'సూర్యోపాసన' మహామంత్రమును గ్రహించి యుండుటచే అట్లే సూర్యభగవానుని వైపునకు దిరిగి కొంత వడి నమ్మహామంత్రంబును స్మరించి కాష్టంబుపై పరుండి యున్న రెడ్డివైపునకు తిరిగి చూచువరకే నా రెడ్డి కొంచెము కదలెను అట్లే సూర్యభగవానుని రెండు పర్యాయములు స్తోత్రంబుచేసి రెండు పర్యాయంబులు ఆ రెడ్డిని చూచువర కా రెడ్డి లేచి కూర్చుండి నన్నెందులకై నిచటికి దీసికొని

వచ్చితిరి? కాష్ఠంబుపైన నన్నేందులకు నుంచితిరని యడుగ సాగెను. అంత సిద్ధయ్యగారు బిడ్డా! నిన్నేందులకును దీసు కొని రాలేదు. నీవిటు రమ్మని ఆ రెడ్డి చెవిలో మంత్రంబును జెప్పి రెడ్డిని వాని ఇంటికడకు దోడ్కొని వచ్చెను. అంత గ్రామవాసులందరు శ్రీసిద్ధయ్యస్వాముల వారిని కేవల భగ వంతుడే ఈ రూపంబునవచ్చి తిమ్మారెడ్డిని బ్రతికించినాడు. గాని లేకున్న మృతుండయిన వారెట్లుతిరిగి బ్రతుకుననియా గ్రామవాసులంద రనుకొనసాగిరి. ఆ గ్రామవాసులు కొంచ రరుదెంచి నమస్కారంబుచేసి స్వామీ! తమ నివాస గ్రామం బెయ్యది? తమ దివ్యనామం బెయ్యది? ఎచటనుండి యరు దెంచితిరని అడుగగా సిద్ధయ్యగారు అయ్యా! నా నివాస గ్రామము మీ గ్రామ సమీపమునందుగల ముడుమాల. నా పేరు సిద్ధయ్య యందురు. నేను అస్మదీయ దేశిక సార్వభౌ ములగు శ్రీ జగద్గురు విరాట్పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి ప్రియశిష్యుండను. అస్మదీయ గురుమూర్తి దివ్యానుగ్రహంబుచే ఈయన సజీవుండయినాడు గాని నేను చేసిన దేమియులేదు. అంత నా వచ్చిన పురజనులలో గోవిం దయ్య యను బ్రాహ్మణుండు లేచి చేతులు జోడించుకొని స్వామీ! తమరు కేవలం భగవత్ స్వరూపులు, సత్వగుణంబే ప్రధానమని యెంచిన సర్వసములు తమ ముఖంబున కేవల భగవత్కళ లుప్పొంగుచున్నవి తమను వర్ణింప నే నెంతటి వాడనని వినయ విధేయుండై వేడుకొనగా సిద్ధయ్యగారు గోవిందయ్యగారి భక్తిప్రపత్తులనుజూచి ఈయన నిశ్చలమాన

నుందని యెంచి అయ్యా! అట్లే నిలుచుంటివేల. వారందరు కూర్చుండిన నీవును గూర్చుండ వెందులకని సిద్దయ్యగారడు గగా అంత గోవిందయ్యగారు స్వామీ! మీ ముఖంబును జూచినప్పటినుండియు నా మనంబెందులకో మారిపోయినది. తమతో నేనేమి మాట్లాడుచున్నదీ. నాకు తెలియకున్నది. నా దక్షిణ నేత్రం బెందులకో యదురుచున్నది. ముందేమి గానున్నదో యని జెప్పి పాదంబులకు నమస్కారంబు చేయ బోవగా నంత సిద్దయ్య స్వాములవారు బిడ్డా! ఆగుము, ఆగుము. ఇకముందు నీవును నొక మహాత్ముండవు కావలసిన యోగము నీకున్నది. పిదప నాగృహంబున కరుదెంచిన నీకు జరుగనున్న భవిష్యత్తంతయు జెప్పెద. ఇంత జనంబులో బ్రాహ్మణుండవైన నీవు మహమ్మదీయవంశజుండనైన నాకు శరణార్థివైన నీ ప్రపంచమునకు బహు విపరీతంబుగా నుండును. నీ మనంబునంగల కోర్కెను నేను గ్రహించితిని. అస్మదీయ గృహంబున కరుదెంచుమని జెప్పగా గోవిందయ్య గారు తమ చిత్తమెట్లో అట్లే కానివ్వుడని జెప్పి తన మనం బంకయు నా సిద్దయ్యగారి యందేయుంచి అట్లే నిలువంబడి యుండెను. కాని గూర్చుండ దయ్యెను. సిద్దయ్యగారు నాయనా! గోవిందయ్యా! ఎంతవరకట్లు నీవు నిలువంబడి యెదవు? నీవు గృహంబునకేగి భోజనంబుజేసి వెంటనే రమ్ము. పిమ్మట మనమిరువురమును కలిసి ముడుమాలకేగి భవిష్యత్తును విచారింతము. ఇక నేగుమని జెప్పగానే గోవిం దయ్యగారు గృహంబునకేగి భోజనంబునుచేసివచ్చునంతలో

సిద్దయ్యగారును రెడ్డియింటిలో కొంచెం పాలను బుచ్చుకొని నాయనా! తిమ్మారెడ్డి! నీకు నేనొక మహామంత్రోప దేశంబు చేసెద ఇటు రమ్మని రెడ్డిని దగ్గరకు జేరదీసుకొని "ఓం, హ్రీం, క్లీం, శ్రీం నమశ్శివాయ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామినే నమః" యను బీజసంపుటిమైన మహామంత్రోప దేశంబును జేసి బిడ్డా! నీ కెప్పుడు యిచ్ఛగలుగునో అప్పుడు స్మరించు కొనుచుండుము. సద్గతిని జెందెదవని జెప్పి నేను గృహం బున కేగుచున్నాడను. నీ మంత్రంబును తప్పక పఠియించు చుండుమని జెప్పునంతలో గోవిందయ్యగారును భోజనంబు జేసివచ్చి నిలువంబడగా అంత సిద్దయ్యగారు గోవిందయ్య గారిని వెంటబెట్టుకొని ముడుమాల చేరిరి.

బ్రాహ్మణుడగు పలుగురాళ్ళపల్లె గోవిందయ్యగారికి సిద్దయ్యగారు బ్రహ్మోపదేశం బొసంగుట

శ్రీ సిద్దయ్యగారు గోవిందయ్యగారిని తన పూజామం దిరములోనికి గొనిపోయి శ్రీ స్వాములవారి పాదుకలకు పూజను చేయించి గోవిందయ్యగారిని తనవద్ద గూర్చుండ బెట్టుకొని కొన్ని అద్వైతవిషయంబులను బోధించుచున్నను గోవిందయ్యగారు మాత్రము సంశయించుచునే మాట్లాడు చుండెను. అంత సిద్దయ్యగారు నాయనా! నీ వేల సంశయిం చెదవు? నీవు నాతో జెప్పకున్నను నీ సంకల్పంబును నే నెరుంగుదును. ప్రపంచ సంబంధమైన కులమునైనను జూడ వలెను గదా! అట్టియెడ నీ సంకల్పసిద్ధిని నే నెట్లు దీర్చెద ననగా అంత గోవిందయ్యగారు స్వామీ! తమ రెట్లు శ్రీ

స్వాములవారి పాదంబుల నాశ్రయించి కడతేరిరో అట్లే నన్ను తమ పాదదాసునిగా జేసికొని నన్ను పవిత్రునిగా జేయుడు. స్వామీ! నా కుల మెద్దిదైననేమి? నా కందరును సమానులే నందరును ప్రియులే. నాకున్న భవరోగంబును బోద్రోలు నౌషధం బొసంగి భవరహితునిగా చేయుడనివేడు కొనగా సంత సిద్దయ్యగారు బిడ్డా! నీ ఈప్సితమెట్లో అట్లే కానిము. "ఓం, హ్రీం, క్లీం, శ్రీం నమశ్శివాయ శ్రీ వీర నారాయణ" యను బీజసంపుటిమైన పంచాక్షరి, అష్టాక్షరి మంత్రద్వయ సహితంబైన మహామంత్రోపదేశం బొసంగి క్రమేణ సాంఖ్య తారక అమనస్కంబునుబోధించితనయంత వానిగా జేసెను. (బ్రాహ్మణుండైన గోవిందయ్యగారి భక్తి ప్రపత్తులును, వీ రొనర్చిన మహామహిమంబులను సిద్దయ్య గారి చరిత్రయందు జూడందగును) క్రమేణా శ్రీ సిద్దయ్య గారి యశశ్చంద్రికలు ప్రపంచమంతా ప్రకాశించెను. (ఇప్ప టికి పలుగురాళ్ళపల్లెలో గోవిందయ్యగారికి మరంబున నిత్య నైవేద్య దీపారాధనలు జరుగుచున్నవి.)

ముడుమాల గ్రామ కరణముతో సిద్దయ్యగారు మాట్లాడుతున్న సమయం బున అరణ్యమందు గోవునైకై పొంచియున్నపులిని 'దశా' అని అదిలించుట

శ్రీ సిద్దయ్యగారి యశస్సు దినదినంబునకునెక్కుడగు చుండుటచే ముడుమాల గ్రామవాసులంద రనేక విధంబులుగా గొనియాడుచుండుట చూచి గ్రామకరణంబు విని సహించ జాలక దూదేకులవాడేమి? యింతకీర్తి వహించుటేమి? ఎటు లైనను వానిని అవమాన పరచవలెనను సంకల్పంబునుమనం

బున బెట్టుకొని సిద్దయ్యగారి విషయమై పరిహాసముగా నంద రితో జెప్పుచుండెను. ఒక దినమున సిద్దయ్యగారు కరణము గారి ఇంటిముందరగా పలుగురాళ్ళపల్లెకు వెళ్లుచుండగా నా కరణం సిద్దయ్యగారిని బిలిచి సిద్దప్పా! గూర్చుండుము. నీ చిన్నతనంబునుండియు నా కంసాలి గురువువద్ద నేమి నేర్చు కొంటివి? ఆయన సమాధికాలంబున నీకే మొసంగెను? నీకా కంసాలిగురువుకన్న నింకే వర్ణపు గురువు దొరకకపోయెనా? యని యడుగగా అంత సిద్దయ్యగారు స్వామీ! నా గురురాజ చంద్రుడు పాదుకలు బెత్తముశిఖాముద్రిక యోగదండంబును మాత్ర మిచ్చినాడని జెప్పగానాకరణంబూరకుండక సిద్దప్పా నీవు చిన్నతనంబునుండి ఆయన సేవజేసినందులకు తాను తొడిగిన పాత పాదరక్షలు మాత్రమిచ్చినాడా యని పరిహాస ముగా బలుకగా అందులకు సిద్దయ్యగారు తిరిగిజవాబియ్యక తూర్పు ముఖంబుగా తిరిగి మృగములను అదలించినట్లుగా 'దశా'అని భీకరంబుగా అరచియూరకుండెను.అచ్చటనున్న వారంద రాశ్చర్య మానసులైరి. కాని కరణంగారు మాత్ర మమిత కోపోద్దీపిత మానసుండై సిద్ధా! నీవు కుల మర్యాద నయినను జూడక యింత నిర్లక్ష్యముగా మాట్లాడదగునా ? నీవు చిన్నతనము నుండియు బ్రహ్మజ్ఞానము నేర్చుకొంటి వను గర్వంబుచే యుక్తాయుక్తము దెలియక మృగములతో మాట్లాడినట్లుగా మాట్లాడ భావ్యమా ? నీ గురువు ఇట్లు భాషించుమనియేనా నీకు బోధించినదని కరణము బలుకగా

గుణంబులుగల యజ్ఞానినిగాను, యుక్తాయుక్తంబు లెరింగిన వాడనేగాని నేనింత పశుప్రాయుండనుగాను. 'దశా' యని ఎందులకంటి ననిన నిచ్చటికి కొలదిదూరములోనున్నవెలమ వారి కొండలో మేయుచున్న తోలిచూతిగోవును ఒక చిరుత పులి బట్టుకొనబోవగా నా మెకంబును 'దశా'యని అదలించి తినిగానిమిమ్ములను పరిహాసము చేయదలచి ఇతుల బల్క లేదని జెప్పగా అంత నాకరణముగారి కమితాశ్చర్యంబుతోచి సిద్ధప్పా! నిక్కమేనా? నేనిపుడు తలారులను బంపి నీ వర్త మానం బారసి రమ్మని బంపుదునా యని పలుకగా సిద్దయ్య గారు లేచి నాయనా! వెంటనే బంపుడు. ఆలసింపకుడు. నే నిచ్చటనుండగనే నిజానిజంబులుగు ర్తెరుంగవచ్చునని జెప్పగా కరణంగారు వెంటనే తలారులను బిలువనంపి ఓయీ తలారు. లారా! మీరీ క్షణంబున వెలమవారి కొండయందు గోవులను గాయుచున్న గోపాలకులవద్ధకేగి అచ్చట ఏమయిన విపరీత ములు జరిగెనేమో నారసి రండని జెప్పగావెంటనే తలారులు బయలుదేరి కొండకు బోవుచుండగా అప్పటికి సాయంకాలం బగుటచేత నా గోపాలకులు గోవులను దోలుకొని వచ్చుచు తలారుల కెదురైరి. అంత తలారులు గోగాలకులను జూచి అయ్యలారా! కొండయం దేమయిన విపరీతంబు లీ దినం బున జరిగెనాయని యడుగగా అంత క్షతగాత్రమైనగోవును చూపుచు దీనిని పెద్దపులి పట్టినది అపుడు యెవరో సిద్దయ్య వారను మహనీయుడు వచ్చి "దశా" అని అదలించగనే పెద్దపులి పారిపోయినది. గోవు బ్రతికినది. ఆయనకే రాకు

న్నచో నీ గోవును యా పులినోటబెట్టి, నేడ్చుచు ఇంటికి వచ్చువారమే యని చెప్పగా తలారుల కాశ్చర్యంబు దోచి వెంటనే వచ్చి కరణంగారికి జెప్పిరి అంత నా కరణంగారి కేమియును దోచక పిచ్చివానివలెనుండి అయ్యో! దైవమా! నిష్కారణంబుగానిరపరాధియైన శ్రీసిద్దయ్యగారిని దూషించితిని నేనిట్లునిష్కారణంబుగా దూషించినందుల కా సిద్దయ్యగారి మనంబున నేమని దలంచెనో గదా ? ఏ పుట్టలో యే పామున్నదో ఎవరెరుంగుదురు? నేనొనరించిన యపచారంబు నకయి నీ మహనీయుని వద్దకు నేగి క్షమాపణ గోరువరకును నామనంబు కుదురుపడదని దలంచి, తెల్లవారగనే సిద్దయ్యగారివద్దకే నిలువంబడి స్వామీ! సిద్దేంద్రస్వామీ! నీ మహాత్మ్యం బెరుంగక నెన్నియో దూలనాడితిని. నా యందు తమ కృపాకటాక్షముంచి నన్నుపావనునిగాచేయుడనియనేక విధంబుల ప్రార్థించగా నంత సిద్దయ్యగారు బిడ్డా! నీవేమియు నాకపకృతి యొనరింపలేదు.నీవునునిర్గుణానందంబనుభవించు యోగంబుండుటచేతనే నీవు నన్ను బిలిచి పరిహాసమాడితివి. లేకున్న నందరివలె నీవును నూరకుండువాడవు. పెరుగును తరచనిదే వెన్న బయలుపడునా? అట్లే ఆర్యులను తరచనిదే వారివారి మహిమంబు లెట్లు బయలుపడును? నీ మనంబునం గల సందియంబులన్నియు వీడి శాంతచిత్తుండవై యుండుము నీ కేమియు చింత వలదని ధైర్యంబుజెప్పి కరణంగారిమనంబును స్వస్థపరచి కొన్ని అద్వైత విషయంబులను బోధించిన పిదప తన దాసునిగా జేసుకొని ధన్యునిగా జేసెను.

తదాదిశ్రీసిద్దేంద్రస్వాములవా సర్వజనులచే పొగడ

బడుచు వారి కీర్తియంతయు జగద్విఖ్యాతంబయ్యెను పిమ్మట శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి వాక్యాను సారంబుగా సిద్దయ్యగారికి పెదవీరయ్యయను నొక్క సత్కుమారు డుద యించెను. తండ్రివలె తానును తపోనిష్ఠా గరిష్ఠుండై మహా యశంబును గణించెను శ్రీ సిద్దయ్యగారి ప్రభావంబులు. పలుగు రాళ్ళపల్లె గోవిందయ్యగారు సిద్దయ్యగారి యందు చూపిన భక్తి ప్రపత్తి, గోవిందయ్యగారి విషయంబులన్నియు సిద్దయ్యగారిచే వ్రాయబడిన కాలజ్ఞానంబును (శ్రీ సిద్దేశ్వర స్వామి) సిద్దయ్యగారి చరిత్రయందు చక్కగా వ్రాయబడి యున్నవి పిదప ముడుమాలకు ఈశాన్యభాగంబుగా నొక మఠంబును కట్టుకొని అచట తానును కుమారుండయిన పెద వీరయ్యగారు జీవసమాధిని జెందిరి. శ్రీస్వాములవారొసం గిన పాదుకలు, బెత్తము, యోగదండము, శిఖా ముద్రిక యిప్పటికిని నొకగది యందున్నవి. నిత్యనై వేద్య దీపారాధ నలు జరుగుచునేయున్నవి గద్య

ఇయ్యది శ్రీమత్కందిమల్లయ్య పురవరాధీశ్వరులైన శ్రీ మద్విరా ట్పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి వరప్రసాదితుండును, శ్రీగురు జింకా పిచ్చిమాంబ శ్రీ మన్మిరియాల వేంకటరంగాచార్యుల ప్రియ శిష్యుం డును, గంధర్వ కులోద్భవుండును, చేజర్ల గోత్ర పవిత్రుండును, శ్రీమత్ జవంగుల వంశాన్వయుండును, కొండయాఖ్య రత్నమాంబ జ్యేష్ఠ తనూ భవుండును, నగునాగభూషణదాసుచే రచియింపబడిన "కాల జ్ఞాన సహిత" శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి సంపూర్ణ చరిత్రము సంపూర్ణము

ఏతత్సర్వంబును శ్రీ [illegible]

మంగళం మహత్ — సంపూర్ణము.

# కాలజ్ఞానము

5000 (అయిదువేల) ఏండ్లు కలియుగ ప్రమాణము వెళ్ళిపోతే ఆ మీదట కాశీవద్ద గంగ కానరాకుండపొయ్యేను. కంచి కామాక్షమ్మ నెత్తురు గక్కేను. వేపచెట్టుకు అమృతము కారేను గాలివానచేత శ్రీశైలపర్వత దక్షిణాన గుండ్లు దొర్లేను. నెత్తురువాన కురిసేను. బండలు పగిలి ఆకాశాన కాకులవలె, గద్దలవలె ఆడేను. గుడ్లునుండి చీము, నెత్తురు వచ్చేను. మట్టు అరని బిడ్డలు మాట్లాడేను. ఆకాశాన పొగ మంటలు బుట్టేను. ఆరు మతములు ఒక్కటి అయ్యేను. ఆహా అనే ధ్వనులు బలికేను. ఆ కాలమందు అర్ధరాత్రి ఘణాం ఘణాం అని పది ఘంటారావంబులు బుట్టేను. శంఖారావంబులు వినిపించేను ఒకరిసొమ్ము ఒకరు అపహరించేరు. ఒకరి ఆలు మరిఒకరి పాలు అయ్యేను పుణ్యవాదులు ప్రభావము చెప్పుకొనేరు పుణ్యపురుషులు, పుణ్యస్త్రీలు బ్రతికేరు పుణ్యస్థలంబులు చెడేను. దేవస్థలంబులు పాపాత్ములచే నష్టమయ్యేను. నిక్షేపాలు బయలుపడేను. వెంకటాచలములో మ్లేచ్ఛులు ఛండాలులు పూజించేరు. వెంకటేశ్వరుని దోవ పొయ్యేను. ఈ దివ్యస్థలంబులలో ఆరుగురు దుష్టులుబుట్టేను. తిరువళ్ళూరి వీరరాఘవస్వామికి తిరుమేనంచేసేరు అప్పుడు కుంభద్రోణములుగా చెమటలు బుట్టేను. కృష్ణ, గోదావరి మధ్యప్రదేశంబున ఆవులు గుంపులుగూడి పోట్లాడి బహుగా

చచ్చేను. ఒకరిని ఒకరు [illegible] లయ్యేరు శీతోష్ణజ్వరాలు కలిగి నశించేరు కృష్ణనదుమ బంగారు తేరు కనుపించేను. ఆతేరుజూచినవారికి కన్నులుగానకహొయ్యేను. ఒకంకి దుఃఖము. ఒకరికి సంతోషముచేత తమలో తాము నీతులు చెప్పుకొందురు. శ్రీవైష్ణవులు రెండు తెగలై వారిలో వారు భ్రష్టులైహొయ్యేరు. మధుర, తంజావూరు మొదలైన పట్నములు శివభక్తులు ఏలేరు. అశ్వపతి సంస్థానము మంట పము అయ్యేను గజపతి, నరపతి ప్రజలకు వశవర్తియైకొంత కాలము ఉండెదరు కొన్నిరోజులు రాజు లనంబడుచుందురు. కర్ణాటక దేశము మ్లేచ్ఛకాంతల వలన దేవాలయంబులు శిలా విగ్రహంబులు భిన్నమైపోవును. శిలాధారమైన తేరులు ఆక స్మికముగా విరిగిపడుటచే ప్రజలు ముక్కలు ముక్కలుగా తునిగిహొయ్యేరు కొండలమీది నుండి లక్షోపలక్షల గుండ్లు దొర్లేను. ఆయుధములు విరిగిహొయ్యేను భ్రమరాంబ సమ్ముఖమున రెండు తలల బంగారు మొసలి కనుపించేను. తిరిగి భ్రమరాంబలో ఐక్యమయ్యేను చక్రాంకిత సంభవుండైన పరమహంస ఉదయగిరి శిఖరాగ్రమందు అమావాస్యనాడు ఎక్కిన ప్రజలు చంద్రగ్రహణమని భ్రమసేరు. శివవైష్ణవ దేవళములయందు రక్తంబులు బుట్టేను ఆకాశము నుండి రెండు బంగారు హంసలు వచ్చి పురములయందు, వనముల యందు సంచరించుచూ పాపాత్ములైన జనులుచూచి పట్టెద మని పోయి కన్నులు గానక గిరగిర తిరిగి లక్షోప లక్షల ప్రజలు చచ్చేరు. తూర్పునుంచిపడమర దిక్కువరకు ఆకాశ

మందున యోజన ప్రమాణము బెడల్పుగా చంగావి కోకపట్టి నట్లు కనిపించేను. కొండలయందు ఘణాం ఘణాం మని ధ్వని వినబడేను. నానాటికి వింతలు బుట్టేను

ఓ ఆనందభైరవ యోగి ! ఓ బ్రహ్మానందయోగి ! మీరు వీరద్విజులై వీరధర్మముచేత బ్రహ్మానందమును బెంద వలసినది. భక్తులు ధర్మవర్తనులై వుండేరు.

(ఈ కాలజ్ఞానము ప్రథమాశ్వాసము నుండి తీయబడి నది .. ఈ కాలజ్ఞానంబును చదువువారును, వినువారును శ్రీవీరబ్రహ్మేంద్రస్వాములవారి అనుగ్రహామునకు పాత్రులై సదా సకలైశ్వర్యభోగభాగ్యములతో నుందురని శ్రీస్వామి వారి కాలజ్ఞాన ప్రమాణము )

---


జవంగుల నాగభూషణదాసుగారి గ్రంథములు

## మావద్ద లభించు గ్రంథములు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాములవారి సంపూర్ణచరిత్ర | 30–00 |
| 2 | శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాములవారి బొమ్మల మహాత్మ్యములు | 10–00 |
| 3 | శ్రీ ఈశ్వరమ్మవారి సంపూర్ణచరిత్ర | 20–00 |
| 4. | శ్రీ సిద్దయ్యగారి సంపూర్ణచరిత్ర | 15–00 |
| 5 | శ్రీ బ్రహ్మంగారి పూజావిధానం (సహస్రనామములతో) | 3–00 |
| 6 | భూత, భవిష్యత్, వర్తమాన, కాలజ్ఞాన వేదవాక్యములు | 4–00 |
| 7. | కాలజ్ఞాన తత్త్వములు | 4–00 |
| 8. | శ్రీ బ్రహ్మంగారి భక్తిగీతములు | 4–00 |
| 9. | వచన కాలజ్ఞానము | 4–00 |